## జ్ఞానవైరాగ్య ప్రాప్తి:

పీఠానికి ముగ్గురు వ్యక్తులు వచ్చి “ఆకలిగా ఉన్నది. భోజనం పెట్టండి” అని కమలమ్మగారిని అడిగారు.

“లేచి కాళ్ళు కడుక్కోండి” అన్నారు.

“మేము వస్తామని ముందే తెలుసా?”

అవును, అమ్మ చెప్పింది ముందే.

సగం తిన్నాక - “ఇంకా ఉన్నదా?”

“ఆఁ”

ఇంక కొంచెం తిన్నాక “ఇంకా ఉంటుందా?”

“అంతా తిన్నాకనే కాదు! ఎంతమంది తిన్నా కూడా అంతే ఉంటుంది. అన్నం పరబ్రహ్మ స్వరూపం. ఈ విశ్వమంతా చెంది వున్నదీ పరబ్రహ్మమే. ఆ పరబ్రహ్మానికి మూలం బాలాత్రిపురసుందరి. ఆమె కొలువున్న చోటు ఇది. అన్నం - పరబ్రహ్మం. భోక్తలు మీరు పరబ్రహ్మం. అక్షయపాత్ర పరబ్రహ్మమే. అందువలన అయిపోవడం ఏముంటుంది. ఉన్నదేదో ఉంటుంది.” వేదాంత ధోరణిలో పలికారు.

**బ్రహ్మము, పరబ్రహ్మము ఉన్నదిదే. దీన్నే సంకల్పము అంటారు. ఇది చంచలము కనుక దీన్నే ‘మనసు’ అంటారు.**

అనాది, ఆద్యంతములు లేవు. సర్వవ్యాపకమైనది. ఆద్యంతములు లేవు. సృష్టికి ముందు, తరువాత ఎపుడూ ఉంటుంది. దీనికే ఋతము, సత్యము, ఆత్మ అని పేరు. అంటే పరబ్రహ్మములో సంకల్పశక్తితో సృష్టి జరుగుతోంది. సంకల్పశక్తి యొక్క పరిణామ రూపమే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు - సృష్టి, పోషణ, లయలు.

వీటన్నింటినీ సృష్టించినవారు మన దృష్టిలో కర్త ‘బ్రహ్మ’. బ్రహ్మకు మనసే రూపం. కాబట్టి భౌతికరూపం ఉండదు. ఈ సృష్టిలో బ్రహ్మత్వం కంటే ఉన్నతమైనదీ, ఆ ఐశ్వర్యం కంటే గొప్పది, ఆనందం కంటే అధికమైనదీ మరేదీ లేదు. బ్రహ్మకు ఒక ముఖం పరబ్రహ్మం, మరొక ముఖం ప్రకృతి. అంటే అమ్మవారే ‘బ్రహ్మ’ గుండా ప్రకృతిరూపంలో ప్రతిఫలిస్తోందన్నమాట.

అమ్మవారి సంకల్పము చేత సృష్టించబడిన వారు త్రిమూర్తులు. అలాంటప్పుడు కమలమ్మగారినే సాధకురాలిగా తీసుకుంటే అప్పటికే ఆమె ఆధ్యాత్మిక పరిపక్వతను చేరుకున్నది. ఆమే త్రిపురసుందరీ రూపం. కనుక ‘వారు భోజనానికి వస్తారు’ అనే సంకల్పం చేయగానే వీరొచ్చి, భోజనం పెట్టమన్నారు. అందుకే ఆమె జ్ఞానముతో వారి ఆకలిని తీర్చి పంపారు. వారు ‘ఇంకా ఉంటుందా?’ అని అడిగినది పరబ్రహ్మానికి సంబంధించి. ఈమె పరబ్రహ్మానికి మూలం కనుక ఆ పరబ్రహ్మ తత్వమును మనకు అర్థమవటం కోసం చాలా వివరంగా చెప్పారు. వాళ్ళు

'పరబ్రహ్మ తత్వమును' ప్రశ్నించారు గనుక అమ్మమ్మగారు, వారి ముగ్గురిని 'త్రిమూర్తులు' అని శెలవిచ్చారు. వారికి జ్ఞానమనే ఆకలిని కూడా తీర్చారు.

తర్వాత మరొకసారి అమ్మవారు త్రిపురం రూపంలో మల్లెలు రాల్చడం, జల్లులు కురిపించడం లాంటి అల్పవిద్యలకు ప్రలోభ పెట్టడము – ఇదొక పరీక్ష. వాటిని ఈమె (జ్ఞాని) కనుక గ్రహించి, "అల్పవిద్యలకు ప్రలోభ పెట్టవద్దు. ముక్తిమార్గాన్ని ప్రసాదించు. ఈ పీఠము ముక్తిధామం కావాలి కానీ, కామకూటం కాకూడదు" అని ప్రార్థించారు. అది ముక్తిధామం కావాలని ఆమె సంకల్పం కావున జ్ఞానమార్గాన్ని, బోధనలను ఇప్పుడు సాధకులకు అందజేస్తూ ముక్తిమార్గంలోకి ప్రవేశపెడుతున్నారని గ్రహించవచ్చు. అప్పుడు సంకల్పం – ఇప్పుడు ఆచరణ.

ఇంకొకసారి "ప్రాపంచిక దృష్టిలో" పిచ్చిగా కన్పించే చేష్టలన్నీ "ముక్తిసాధనాలే" అని బోధచేశారు.

చరిత్రలో చాలా ఉన్నాయి కదా! ఆమె దొంగను కొట్టవద్దనడం, పార్కులో మరో స్త్రీ పురిటి నొప్పులు పడుతుంటే ఆమె కట్టుకున్న చీర ఇచ్చేయడం, ఆమెకు ఉన్నదో లేదో కూడా చూసుకోకుండా పరులకు ఇచ్చేస్తూ ఉండడం, ఇలాంటివన్నీ (లౌకికంగా) తెలివితక్కువగా, అమాయకంగా కన్పిస్తుంటాయి. కానీ ఇవే అలౌకిక చేష్టలు. మహాత్ములందరూ పిచ్చివాళ్ళలాగే కన్పిస్తుంటారు. అవే ముక్తిసాధనాలు అని ఆవిడ చెప్తున్నారు. సాధనలో మానసిక వికాసం కలిగినపుడు మాత్రమే మనసు అలౌకికంవైపు మళ్ళుతుంది.

ఆమె సాధనలో ఏ స్థితికి వెళ్ళారంటే, ఏ విషయాన్నైనా సరే ఆధ్యాత్మిక లోతుల్లోకి వెళ్ళి, అక్కడ పరమేశ్వరీ తత్వాన్ని గ్రహించి మనకు బోధలు చేయగలిగారు. అందుకే అందరం ఆమె కర్మబద్ధులం. అనుభవింపక తప్పదు. ఆమెను నమ్ముకుంటే 90% తగ్గిస్తుంది. ఆమెను నమ్ముకుంటే *ఎండలో గొడుగు పట్టుకున్నట్లుగా అనుభవించవచ్చు* అని చెప్పారు. రైలింజనులో ఓంకారం వినిపించడం, మరెవరో పిల్లకు గాజులివ్వడం – ఇవన్నీచూస్తే వాళ్ళకి, అంటే ఆ స్థితికి చేరుకున్నాక అంతా అలౌకిక స్పందనే ఉంటుంది. మనకి అర్థంకాకపోతే కాకపోవచ్చు కానీ, ఆ అర్థాలు వేరు.

భౌతిక సంబంధాల అనుబంధం కంటే ఆత్మల అనుబంధం గొప్పది. ఆత్మసంబంధం అంటే ఒక గురుశిష్య సంబంధం లేక తల్లీబిడ్డల సంబంధం. అందుకే అది అంత గొప్పది. భగవంతుడికీ, భక్తుడికీ మధ్య ఉండే సంబంధం 'ఆత్మ'తో ముడిపడి ఉన్నది. అదొక్కటే ఆమెకు తెలుసు. అందుకే అందరిపైనా ఆమెకు అత్యంత ప్రేమ– తల్లిప్రేమ. కన్నతల్లి కూడా పుత్రుడి కోసం చేయలేనిది ఉండవచ్చు. కానీ మాతృమూర్తి (గురువు) చెయ్యలేనిది ఏముంటుంది?

ఇతరుల దోషాలను గుర్తించే ముందు, మన దోషాలను గుర్తించాలని చెప్పారు. షోడశ సంపదలలో ఒకటైన 'క్షమ' లక్షణాన్ని అందరూ అలవర్చుకోవాలనీ, సమాజంలో కూడా దాని అభివృద్ధి కోసం పాటుపడాలనీ చెప్పారు. **క్షమ నేర్చుకుంటే అరిషడ్వర్గాలను జయించగలిగినట్లే.** ఎంత సులభమైన పద్ధతి చెప్పారు! ప్రతి విషయంలోనూ 'ఆధ్యాత్మిక స్పందన' ఈ విధంగా ఉన్నది.

కమలమ్మగారికి 'త్రిపురాంబ' పుట్టేముందు కలలో అమ్మవారు కాళికాంశతో పుట్టబోతున్నట్లుగా కనిపించింది. అలాగే నేను పుట్టబోయే ముందు కూడా తెల్లని గుర్రంపై, తెల్లని వస్త్రములతో, త్రిశూలం పట్టుకుని **రాజరాజేశ్వరి** లోనికి వస్తున్నట్లు కన్పించింది. రాజరాజేశ్వరీ అంశతో పిల్ల పుడుతుందని ముందే చెప్పారుట. (క్రిందటి సంవత్సరం (2002) దసరాల్లో లోకకళ్యాణార్థం 13 రోజులు చేయతలపెట్టిన హోమం మొదలుపెట్టబోయే మరుక్షణమే అమలాపురం నుండి ఒక వేదపండితుని రూపంలో వచ్చి "రాజరాజేశ్వరి" హోమ మహాసంకల్పం చెప్పారు.)

భక్తుల అనుభవాలు, అనుభూతులు, అప్పటివారికి ఎలా జరిగాయో ఈరోజు కొన్నివందల మందికి అదే రీతిలో అలాంటి అనుభవాలే **"నేనున్నా, భయం లేదు"** అని ధైర్యాన్నిస్తూ అనుభవింప చేస్తున్నారు.

**21.11.2002 (గోవా, పనాజి)**

## - స్వానుభవం -

నేను హైదరాబాద్‌లో ఉండే రోజుల్లో మనసుకు, శరీరానికి కూడా విశ్రాంతి లేక అనారోగ్యం పాలయ్యే స్థితికి చేరుకున్నాను. ఉదయం వంట, మధ్యాహ్నం శిష్యులు, సాయంత్రం వాకింగ్, రాత్రి 11 గం.ల వరకూ ఎడతెరిపి లేకుండా ఫోన్లు. ఆదివారం కూడా ఎవరో ఒకరు, ఏదో కారణంతో వస్తుండేవారు. పిల్లలకు, ఆయనకు కూడా చాలా అసౌకర్యంగా ఉండేది. నేనెవరితోనైనా మాట్లాడుతున్నప్పుడు ఒక గదిలో కూర్చుని టి.వి. చూస్తుండేవారు. 24 గం॥లు ఫోన్లో మాట్లాడటం వలన గొంతునొప్పి, ఇన్ఫెక్షన్ తఱచూ వస్తుండేవి. అప్పుడప్పుడు మా ఫ్రెండ్ ఉమారాణి గారింటికి వెళ్ళి 3-4 రోజులు అజ్ఞాతంగా ఎవరితో మాట్లాడకుండా విశ్రాంతి తీసుకుంటూ ఉండేదాన్ని. స్వేచ్ఛ అంటే ఏమిటో తెలీకుండా అయ్యింది పరిస్థితి. ఆ రోజుల్లో "నాకు జీవితంలో ఏకాంతం కావాలనీ, ప్రశాంతమైన జీవితం, గురువుని గురించి ధ్యానించి, ఏదైనా సేవ చేసుకునే అవకాశం నాకు ఎప్పుడు లభిస్తుందో, ఈ ఫోన్లు ఎప్పుడు తగ్గుతాయో" అని ఆలోచిస్తూ ఆ రోజుల్ని తొందరగా ప్రసాదించమని అమ్మవారిని మనస్ఫూర్తిగా కోరాను. హైదరాబాద్ వదిలేలోపు మా అమ్మాయికి వివాహం చేయడం, అబ్బాయిని ఒక ఫ్లాట్‌లో పెట్టడం, మాకు నెల్లూరు ట్రాన్స్‌ఫర్ అవడం జరిగింది.

బాధ్యతలు అంత తొందరగా ముగిసిపోయినా బాగుండేదేమో అన్పించింది. కానీ ఒక్కసారిగా జనసమ్మర్థంలో నుండి ఇద్దరమే అయ్యేటప్పటికి శిష్యులను, బంధువులనూ పిలుస్తూ వారికి జొన్నవాడ, తిరుపతి, కాళహస్తి, పెంచలకోన, ఇంకా అమ్మమ్మగారు తిరిగిన అన్ని ప్రదేశాలు చూపిస్తూ, నిద్రలు చేయిస్తూ ఒక సంవత్సర కాలం గడపగలిగాను. అప్పుడు ఇంటికి ఎవరైనావస్తే వారికి వంటచేయడం, ఇల్లు సర్దుకోవడం, వాకింగ్ చేయడం, టి.వి. చూడటం, చాలా విశ్రాంతిగా ఉండేదాన్ని. అలా కొన్నాళ్ళు జరిగింది.

తరువాత ఆయనకి ప్రమోషన్ వచ్చి, భారతదేశం అంతా తిరిగే ఆడిట్ ఆఫీసర్‌గా (ఎ.జి.ఎమ్)

పోస్టింగ్ వచ్చింది. ఇలా నాలుగేళ్ళు తిరగాల్సి వచ్చింది. బొంబాయి వచ్చి అక్కడి నుండి ఖెడ్ (మహారాష్ట్ర)లో ఒకవారం ప్రోగ్రాం కోసం వచ్చాము. హోటల్ పేరు 'గణపతి కృప', ఎ.సి. రూమ్, 3 పూటలా తినడం, టి.వి. చూడడం, సాయంత్రం వాకింగ్‌కి వెళ్ళడం. బాంబే హైవే చాలా విశాలమైన రోడ్డు. రెండు ప్రక్కల పెద్దపెద్ద చెట్లు, పెద్దపెద్ద కొండల చుట్టూ చాలా చల్లగా, హిల్ రిసార్ట్‌లాగా ఉండేది. ఉదయం, సాయంత్రం కలిపి 2 కి.మీ. నడక, మధ్యలో Vedic Scriptures అనే పుస్తకం చదువుతూ ఉండడం, ఆ వాతావరణాన్ని బాగా ఎంజాయ్ చేశాను.

తర్వాత అక్కడి నుంచి గోవా వచ్చాము. ఒక వారం ఫోండాలో. హోటల్ పేరు మెనినో, అది చాలా పెద్ద హోటల్. చాలా బాగుంది కూడా. సరే, ఇక కాలక్షేపం కష్టం అన్పించి, ఏదైనా చేద్దామని ప్రయత్నించడం మొదలుపెట్టాను. ఒక ఆదివారం దక్షిణ గోవాలో ఉన్న గుళ్ళు అన్నీ ఒక టాక్సీలో వెళ్ళి చూసివచ్చాము. 'మొయిన్ లేక్'లో Pedastal Boat ఎక్కి ఎంజాయ్ చేశాము. రామతీర్థం, మహల్సా, శాంతాదుర్గ, కామాక్షి, గణపతి ఆలయాలు ఎంత బాగున్నాయో! కార్తీకమాసం మొదలైంది. ఆ తీర్థయాత్రలన్నీ నాతో చేయించే సమయం వచ్చిందేమో, అమ్మమ్మగారే ఈ అవకాశం కల్పించారనిపించింది.

అక్కడి నుండి పనాజీ - Goaకి capital cityలో ఒక పెద్ద హోటల్ (నోవా-గోవా)లో దిగాము. అది త్రీస్టార్ హోటల్. ఉదయం 7 గం॥లకు నిద్రలేవడం, 8 గం॥ల వరకు వ్యాయామం చేసి రెడీ అవడం. హోటల్‌లో స్విమ్మింగ్‌పూల్ ప్రక్కనే ఫలహారం. అందులో 5, 6 ఐటమ్స్ - ఫ్రూట్ జ్యూస్, పళ్ళు, ఎన్నో రకాలు తినడం. ప్రక్కనే 'మహాలక్ష్మి' ఆలయం. అక్కడ నియమం చేయడం, మధ్యాహ్నం అమ్మమ్మగారికి సంబంధించినవి ఏవో రాయడం, సాయంత్రం వాకింగ్, ఆదివారాలు బీచ్‌లో ఎంజాయ్ చేయడం ఈ విధంగా గడుస్తోంది. మళ్ళీ వచ్చేవారం కొల్లూరు, ఉడిపి, ధర్మస్థలి, శృంగేరి, గోకర్ణం, కర్ణాటక తీర్థయాత్రలు.

అమ్మమ్మగారు బాంబేలో ఉండి మరాఠీ నేర్చుకున్నారు. **అక్కడినుంచే ఎవ్వరి బాధలనైనా వినే స్థితి మొదలైందని చరిత్రలో ఉంది.** తీర్థస్నానాలు, క్షేత్రదర్శనాలు పుణ్యమని చెప్పారు.

నేను కూడా ఇప్పుడు మహారాష్ట్ర రావడం ఈ విధంగా జరిగిందనిపిస్తోంది. లేకపోతే నేను ఇక్కడ 'మహాబలేశ్వరం' చూద్దామని వెళ్తే, అమ్మమ్మగారి శిష్యులు నన్ను అక్కడ చూసి, పూనాలో వాళ్ళింటికి తీసుకెళ్ళారు. వాళ్ళుకూడా నియమాలు చేస్తుంటారు. అక్కడ వాళ్ళతో కొన్నాళ్ళు గడిపాను. వాళ్ళ కోడలి స్నేహితురాలట ఎవరో మరాఠీ ఆమె నావద్దకు వచ్చి తన కష్టం మరాఠీలో చెప్పుకుని బాధపడితే నేను హిందీలోను, ఇంగ్లీషులోనూ కలిపి నియమాలు ఇచ్చాను. వాళ్ళ కోడలు అనువాదం చేసి ఆమెకు చెప్పింది. ఇది కూడా ఆమె చరిత్రలో సారూప్యమే అనిపిస్తోంది నాకు.

ఇన్ని తీర్థయాత్రలు ఈ కార్తీకమాసంలో చేయించడమేమిటి? ఇక్కడ కూర్చుని నేను హాయిగా

మనసుకి రాయాలనిపించింది రాసేస్తున్నాను. నేను కోరాను కదా! బహుశా ఇది దాని ఫలితమే అనుకుంటాను. ఎంతో విశ్రాంతిగా, మనస్సుకి ఆహ్లాదంగా ఉండి, అంతరాంతరాల్లోంచి విషయాలు బయటకు వెలువడుతున్నాయి.

జీవితంలో మళ్ళీ 1986 తర్వాత, 2002లో నాకు నా గురించి నియమాలు చేసుకునే అవకాశం ఇచ్చారు అమ్మమ్మగారు. ఇప్పుడు నేను చేస్తున్నది - అమ్మమ్మగారు, తాతగారు సన్యాసాశ్రమంలో ఏకాంతం కోరుకుని, వారు రాజమండ్రిలోనూ, ఈమె పీఠంలోనూ ధ్యానం చేసుకుంటూ గడిపారు. నాకు కూడా ఎందుకో - ఇంక నేను ఏకాంతంగా చేసుకునే సాధన మొదలైందా అనిపించింది. అందుకేనేమో "ఈ లౌకిక విషయాలపట్ల, బంధుత్వాలపట్ల, సంబంధాలపట్ల ఉన్న ఈ కొద్ది ఆకర్షణ నుండి నన్ను అలౌకిక ఆకర్షణ వైపు మళ్ళించు" అని ధ్యానం చేయడం ప్రారంభించగలిగాను. ఇదేనేమో కోరిక ఫలించే రోజు ఆసన్నమవడమంటే.

ప్రస్తుతం ఇప్పుడు నాకు లభిస్తున్న ఇటువంటి అవకాశాన్ని గురువుగారి పట్ల నాకున్న ప్రేమను సాహిత్య సేవ రూపంలో చేసుకోవాలని (వెంకటరత్నంగారి పారంపర్యం నాకు వచ్చి ఉంటే) ఇలా సద్వినియోగం చేసుకోవాలనే ఆకాంక్ష మొదలైంది.

**21.04.2003, బొంబాయి**

## - చరిత్రలో అనుభవములు -

**భక్తుల అనుభవములకు వివరణ:**

పరబ్రహ్మము - దీనికి కర్తలేదు. నాశనరహితమైనది. రూపం, శబ్దం, రుచి, వాసనలు లేవు. వృద్ధి, క్షయములు లేవు. సర్వవ్యాపకమైన నామరూపములు లేని ఒక పదార్థము. దీనిని పండితులు వ్యవహారం కోసం ఋతమని, సత్యమని, ఆత్మ అని, పరబ్రహ్మమనీ సంజ్ఞలు కల్పించారు.

ఈ పరబ్రహ్మంలో 'కదలిక' ఏర్పడితే దానినే పండితులు 'సంకల్పం' అని పిలుస్తారు. ఆ సంకల్పశక్తే మనస్సు అని చెప్తారు. ఈ మనస్సును సాధనతో నిర్మలత్వము, నిశ్చలత్వము, నిర్మోహత్వము సాధించగలిగితే తిరిగి అదే పరబ్రహ్మముగా పరిణామము చెందుతుంది. **మనస్సు యొక్క పరిణామరూపాలే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు.**

అంటే బ్రహ్మములో నుండి పుట్టి, మళ్ళీ అందులోనే చేరటానికి ఈ 'మనోసాధన' ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. ఉదాహరణకు అమ్మమ్మగారు పరబ్రహ్మ స్వరూపము. ఆమె చేసిన సత్సంకల్పములు సాధనతో ఆ మనస్సు తిరిగి పరబ్రహ్మముగా మారినది. ఈ మధ్యలో ఆమె నిర్మలమైన మనస్సులో అమ్మవారు ఐక్యమవుతానని చెప్పడం చరిత్రలో ఉదాహరణగా తీసుకుంటే సాధకురాలు సాధనతో చిత్తశుద్ధిని కలిగి ఉండటము వలనే మళ్ళీ ఆమె పరబ్రహ్మ స్వరూపంలో కలవడం జరిగింది. అంటే ఇక్కడ అమ్మమ్మగారిని మనం ఒక సాధకురాలిగా

“నిర్మలమైన మనస్సు”గా తీసుకుంటే... అది సత్సంకల్పములను మాత్రమే గ్రహించగలుగు తుందని మనం అర్థం చేసుకోవచ్చు. సత్సంకల్పము అనగా “స్వార్థము లేని పరుల సేవ” (అది ఏదైనా సరే). ఈ సంకల్పశక్తి... అటువంటి సంకల్పశక్తిని మాత్రమే గ్రహించగల్గుతుందని చెప్పటానికి ఆమె చరిత్రలోని ఒక అనుభవాన్ని ఇక్కడ ఉదాహరణగా చెప్తున్నాను.

అదేమిటంటే, మహంకాళి ఆదినారాయణమూర్తిగారి తల్లి సువర్ణాంబగారు “ఇంట్లో రెండు ఉద్ధరిణులు ఉన్నాయి కదా, ఒకటి పూజపిన్నిగారికి ఇద్దాము” అని మనస్సులో ఒక సత్సంకల్పము గావించారు (ఇది స్వార్థంలేని పరోపకారము, దైవసేవగా అనుకుని). మరునాడు ఉదయమే పిన్నిగారు ఇంట్లో అడుగుపెడుతూనే “ఏమే స్వర్ణం, వెండి ఉద్ధరిణి ఇస్తానన్నావు కదా, ఏది?” అని అడిగారు.

“మనస్సులో ఉన్నది ఆమెకెలా తెలిసింది?” అని ఆశ్చర్యపోయి ఆమెకు దాన్ని సమర్పించారు.

ఎందుకంటే ఆ మనస్సు వాటిని ఎక్కడ, ఎవరు చేసినా గ్రహించగలిగే పరబ్రహ్మ స్వరూపం కాబట్టి. దాని స్వభావం సత్సంకల్పములు చేయడం, గ్రహించడం రెండూ కాబట్టే ఇక్కడ ఆమె ఇస్తాననగానే ఆమె వెంటనే దాన్ని గ్రహించగలిగింది. ఆ శక్తి అటువంటిదని మనం అర్థం చేసుకోవాలి.

మనస్సులో ఉన్నది ఆమెకెలా తెల్సింది? అంటే ఇలా చెయ్యగానే అలా రిసీవ్ చేసుకుందన్నమాట. ఒక సంకల్పమునే ఆమె అలా నెరవేరిస్తే మనము మనసును సత్సంకల్పముతో కనుక సాధన చేసి నిర్మలం చేసుకోగలిగితే ఆమె దాన్ని కూడా అంత తొందరగానూ లయం చేసుకోగలరని మనము అర్థం చేసుకుని, సాధన మరింత తొందరగా, దీక్షతో చేయాల్సి ఉంటుందని తెలుసుకోవాలి.

**22.04.2003**

కమలమ్మగారిని కొంతమంది బాధా నివారణోపాయాలను అడుగుతుండేవారు. అప్పుడామె **“నాకేమీ తెలియదు. అమ్మవారికి నమస్కరించుకోండి. కలలో ఎలా చెప్తే అలా చేయండి”** అనేవారు.

మరి ఆకెళ్ళ చిట్టెమ్మగారి విషయంలో, ఆమె రాగానే, బాధలో ఉన్నప్పటి సంగతులు, ఆమె చేస్తున్న పూజ, వాటి ఫలితాలు అన్నీ అడగకపోయినా చెప్పి బొట్టుపెట్టి దీవించారు. ఇలా ఎందుకు? కొందరికి కలలో, కొందరికి ఇలలో అనుగ్రహించటం, మరికొందరిని “ఆ తల్లే మీలో ఉండి ఇలా పలికిస్తున్నది” అంటే కిలకిలా నవ్వి కౌగిలించుకునేవారు.

ఈ పైన ఉన్న విషయాలను పరిశీలిస్తే భక్తులెవరైనా సరే తన వద్దకు వస్తే, వారివారి పాపపుణ్య కర్మలననుసరించి, వారిని ఏదోవిధంగా దగ్గరకు తీసుకున్నారని తెలుస్తున్నది. అందుచేతనే, వారిని ఆమెవద్ద నుండి దూరం చేసుకోవడం లేదు.

మొదటి కేసులో వారు భక్తులు లేక శిష్యులు కాకపోయినా పరోక్షపద్ధతిలో (కలలో) అనుగ్రహించైనా దగ్గరకు తీసుకున్నారు. "కర్మ అనుభవించక తప్పుతుందా?" అని చెప్తూనే, వాళ్ళకు విషయాన్ని అర్థంగావిస్తూ, చెయ్యవలసినవి కల రూపంలో వారికి విశదపరుస్తూ దగ్గరకు తీసుకున్నారని అర్థమవుతోంది. (వాళ్ళకింకా అనుభవించవలసిన సమయం ఉంది)

రెండో కేసులో అంటే చిట్టెమ్మగారి విషయంలో, ఆమె పూర్వసాధనను గ్రహించి, ముందే శిష్యురాలిగా అనుగ్రహించడం వలన ఈమె 'గతాన్ని' పూర్తిగా విశదీకరించి అనుగ్రహించారు. మరి ఇప్పుడీమె కూడా కర్మను అనుభవించి, గురువు కోసం వెదికే సమయం కనుక వెంటనే అది గ్రహించి, శిష్యురాలిగా గ్రహించి, అన్ని రకాలుగా అనుగ్రహించారు. (ఆ కర్మ అనుభవించాక ఈమె వద్దకు వచ్చారు)

మూడో కేసులో, ఒకామె "ఆమె మీలో ఉండి పలికిస్తున్నారు" అనగానే కిలకిలా నవ్వి కౌగిలించుకున్నారు. ఇక్కడ ఆమె ఆ రెండు పరిస్థితులు దాటి కొంచెం ముందుకు వెళ్ళి గ్రహించడం వలన ఆ విషయాన్ని అంగీకరిస్తూ అలా తెలిపారు.

ఈ విధంగా గురువులు, శిష్యుల యోగములననుసరించి అనేక విధాలుగా వారిని దూరం చేయకుండా, దగ్గర పరిధిలోనే ఉంచుకుని అనుగ్రహిస్తారని అర్థమవుతోంది. **ఏ స్థితిలోనైనా సరే మనం గురువు వద్దకు చేరడమే ఒక యోగం.** వారిని కలిస్తే వాళ్ళు మనలను చేతులు పట్టుకుని నడిపిస్తూ, సాధనలోకి దించి, విషయాన్ని అర్థంచేసుకునేలా అనుగ్రహిస్తారు.

ఇంకపోతే పుల్లాబ్జాక్షిగారి విషయంలో ఆమెను వాళ్ళమ్మగారు ఒకసారి కమలమ్మగారి దగ్గరకు వెళ్తే పరిస్థితులు చక్కబడతాయేమోనని సూచించారట. ఈమె వెళ్దాము అని మనస్సులోనే నిర్ధారించుకోగానే కలలో "మా ఇంట్లో పీఠం ఉన్నది. వచ్చి తీర్థప్రసాదాలు తీసుకో" అని అనుగ్రహించారు. మనసులోకి ఆమె వద్దకు వెళ్ళాలనే సంకల్పం వస్తే చాలు. ఆ 'మనసు' ఆమెదే కదా! వెంటనే అనుగ్రహం దొరుకుతుంది. ఆ కలలో కూడా "నా పేరు కమలమ్మ. మద్రాసు వెళ్తున్నాను. వచ్చాక పీఠానికి వద్దువుగాని" అని చెప్పి, రెండు రోజుల తర్వాత "ఈరోజే మద్రాసు నుండి వచ్చాను" అని ఎవరికో చెప్తుండగా ఈమె వచ్చి చూస్తే ఆమే కలలో కనబడ్డ ముత్తైదువ కమలమ్మ. ఈ విషయం కమలమ్మగారికి చెప్తే "నాకేం తెలియదు. అంతా అమ్మ దయ" అన్నారు.

బాలాత్రిపురసుందరీ కమలమ్మగారిగా అవతరించడం వలన కలలో కనబడ్డా ఈమె రూపంలోనే కనబడ్డారు. కలలో ఏమీ తెలియని వాళ్ళకి కమలమ్మ రూపం కనిపింప చేసి, కొంతమంది సాధకులను ఆమె వద్దకు వెళ్ళకపోయినా సరే, కలలో ఆమె ప్రత్యక్షంగా వెళ్ళి పీఠానికి ఆహ్వానించారు. అంటే సాధకుడి సాధనను ఇక్కడ మనం అర్థం చేసుకోవాలి. గతంలో అమ్మవారి ఉపాసన చేసిన వాళ్ళై ఉంటారు వారు. అందువల్ల ఆమే స్వయంగా రప్పించుకోవడం జరిగింది. ఇక్కడ, మనకు-కమ్మలమ్మగారికి-బాలాత్రిపుర సుందరికీ తేడాలేదని స్పష్టంగా

తెలుస్తోంది. గురువు అవసరం ఉంది కనుక గురుస్వరూపంలో ఉన్న ఆమే దర్శనమిచ్చి అనుగ్రహించడం జరిగింది.

**23.04.2003**

చెఱుకూరి సీతాలక్ష్మి విషయంలో అమ్మమ్మగారు “లక్ష్మి చాలా అదృష్టవంతురాలు. నేను నిన్ను పిలవలేదు. అమ్మవారే నా రూపంలో కన్పించి భోజనానికి పిలిచింది” అని నిర్ధారణ చేశారు. ఇంతకు ముందు అనుభవాలలో ఆమె రూపంతో కలలో కన్పించేవారు. కానీ ఇప్పుడు ప్రత్యక్షంగా కూడా అమ్మవారే తన రూపంలో కన్పించినట్లుగా ఆమే స్వయంగా చెప్పి భోజనం పెట్టారు. ఇదికూడా ఒక ప్రత్యక్ష దర్శనం ఇచ్చి పీఠానికి రప్పించిన సన్నివేశం. ఇక్కడ అమ్మవారు ఎలా ఉంటారో మనకు తెలీదు. కానీ ప్రత్యక్షం లేక పరోక్షం లేక కల, ఏదైనా సరే, కమలమ్మగారి భౌతిక రూపం మాత్రమే దర్శనమిస్తోంది. **త్రిపురసుందరీ అవతారమే కమలమ్మ గారు** అనటానికి ఇదొక నిదర్శనం. మీకు ఆమె కలలో కన్పించి చెప్తుందన్న వారికి కమలమ్మగారికి భౌతిక రూపమే కనిపించింది.

ప్రత్యక్షంగా కమలమ్మగారే నిలబడి పిలిచినట్లుగా లక్ష్మికి కనబడి, వారి అమ్మగారిని రప్పించుకుని ప్రసాదం పెట్టి పంపారు. ఎలా పిలిచినా ఆమె రూపం ఇదేనన్నమాట.

బండారు అమ్మాజీ విషయంలో, అనారోగ్యంగా ఉన్న పిల్లవాడి మంచం వద్ద కూర్చుని త్రిపురసుందరినీ, కమలమ్మగారిని ప్రార్థిస్తుండగా, తెల్లవారుఝామున పిన్నిగారి గొంతు వినిపించింది “రక్షణలోకి తీసుకున్నాను. ఇంకేం ఫర్వాలేదు” అని. గొంతుతో కూడా పిన్నిగారే అని నిర్ధారణ చేశారు. మీరు రాజరాజేశ్వరీ అన్నా, బాలాత్రిపురసుందరీ అన్నా వేడుకున్న భక్తులు ఆమె కమలమ్మగారి రూపంలోనే ప్రత్యక్ష, పరోక్షములుగా దర్శనమిచ్చారు. ఇది ఇక్కడ మనం గ్రహించవలసిన ముఖ్యవిషయం.

ఆమె జీవించి ఉన్నప్పుడు పోతుకూచి లక్ష్మీనారాయణ ఢిల్లీలో రైల్లోంచి దిగినపుడు పడిపోయిన విషయం, ఇక్కడ ఉన్న అతని అమ్మగారితో అదే సమయంలో చెప్పారు. అంటే ఆమె జరుగుతున్న విషయాలను కూడా దివ్యదృష్టితో చూడగలిగి, రక్షిస్తున్నారనటానికి ఇదొక నిదర్శనం. వారి తల్లి కమలమ్మగారి శిష్యురాలు కావడం వలన, ఆమె కుటుంబసభ్యుల బాగోగులు అంతా వెనకవుండి కాపాడారనటానికి ఇదొక నిదర్శనం. అలాగే ఆమె తర్వాత జరగబోయే విషయాలు (భవిష్యత్) కూడా ఆమె ముందుగానే ఎలా జరుగుతాయో చెప్పారు.

కుప్పావారి విషయంలో వారి పిల్లలకు 2 రూపులు (బంగారు నాణెములు) ఇస్తానని, మెడలో కట్టుకుంటే అనారోగ్యం తగ్గడం, పెళ్ళి జరగడం వంటివి వారి పిల్లలకు జరుగుతాయని చెప్పారట. ఆమె తదనంతరం, వారికి, ఆ రూపులు గురించి ఎవరిని అడగాలో తెలియలేదుట. ఈవిడ ఇంతకుముందు ఎప్పుడో చెప్పినట్లుగా కుంకుమ పోసిన జాడీలలో, వాళ్ళింట్లోనే, ఆ పిల్లలకే రూపులు దొరకడం అనేది విచారిస్తే మనకు ఆమె ఎంత ప్రత్యక్షమో, ఆమె వాక్కు

కూడా అంత ప్రత్యక్షమని అర్థమౌతుంది. ***"నేను నీడలా ఉండి కాపాడతాను"*** అంటే అర్థం ఇదే.

ఇంక రాయప్రోలు కమలమ్మగారి పిల్ల పెండ్లి విషయానికి వస్తే, కమలమ్మగారు ఆమె భర్తను ఆ సంబంధానికి ఒప్పించి పెండ్లి జరిపించాలి. అందుకోసం ఆమే వాళ్ళింటికి వెళ్ళి, అక్కడ మాణిక్యాంబపైన ఉన్న 'తన' స్వరూపమును చూసి "నువ్వెందుకు ఇలా వచ్చావు? కావాలంటే కలలో కనపడు. ఇలా అయితే ప్రజలు భయపడతారు" అన్నారు. కలలో అయితే కమలమ్మగారి గురు స్వరూపంలో కనబడితే భయభ్రాంతులు కారు. అందుకనే ఆమె ఎక్కువగా తన భౌతికరూప దర్శనమే శిష్యులకు ఇచ్చారు.

ఇక్కడ మరి ప్రత్యక్షరూపంలో ఆమె భర్తకు కనిపించి రెండు రోజుల్లో ఉత్తరం వస్తుంది. పిల్ల సుఖపడుతుందని చెప్పి (ఆయనకు నమ్మకం కలిగేవిధంగా) తిరిగి ఆమె భౌతిక రూపంలో అక్కడకు వెళ్ళి ఆ రూపాన్ని ఉపసంహరించుకున్నారు. శిష్యులకు ఏది, ఎప్పుడు, ఎలా అవసరమో అలా నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. ఉత్తరం రాగానే వారికి నమ్మకం కలగడం, ఆ పెళ్ళి జరగడం అన్నీ సవ్యంగా పూర్తిచేశారన్నమాట.

శిష్ట్లా సీతమ్మగారి విషయంలో, ఒక ముత్తైదువ కలలో కనబడి "27 శుక్రవారాలు ఉపవాసం ఉండి పూజ చేసుకో. త్రిపురసుందరీ అంశతో ఆడపిల్ల పుడుతుంద"ని చెప్పారు. ఆడపిల్ల పుట్టింది, కానీ పేరు పెట్టలేదు. ఆ పిల్ల పాలు త్రాగకపోతే భయపడి పిన్నిగారిని ఆశ్రయించారు. అప్పుడామె పూజ చేసుకుంటున్నారు. ఆమెను చూడటంతోనే "నాపేరు పెట్టకుండా ఏదో పేరుపెట్టావు కదూ! నా పేరే పెట్టాలి. వెళ్ళు" అన్నారు. అలానే చేశారు. ఇక్కడ కమలమ్మగారు స్వయంగా **నేనే బాలాత్రిపురసుందరిని** అని మనందరికీ అర్థమయ్యేలా మరొకసారి స్పష్టంగా ఋజువు చేశారు. కమ్మలమ్మగారి పేరు కదా పెట్టాలి? వాళ్ళు నా పేరు అంటే మరి బాలాత్రిపురసుందరీ అనే పెట్టాలి అని చెప్పారంటే ఇక్కడ మన ఇద్దరూ ఒకటే అని స్పష్టం చేసుకోవాలి. 'మాయ' ఎంత విచిత్రమైనది. నేనే అని చెప్పినా మనం దాసోహం అయ్యేలా చేయకుండా ఆ మాయలో కప్పబడిపోతాము. అదే మాయ.

**24.04.2003**

శిష్ట్లా సీతమ్మగారు గొంతుపోయి పాడలేనన్నప్పుడు అమ్మమ్మగారు "నువ్వు పాడగలవు. పాడు" అని తీర్థం ఇవ్వగానే గొంతు యథాస్థానానికి వచ్చి పాడగలిగారు. అంటే ఆమె వాక్కు ఎంతటి సత్యమో, తీర్థంకూడా అంతే ముఖ్యమని చెప్పటానికి చాలా ఉదాహరణలు ఉన్నాయి. కుంకుమ, తీర్థం ద్వారా అనారోగ్యాలను సరిచేస్తుండేవారని ఇక్కడ మనకు అర్థమౌతోంది. **ఆ కుంకుమనే (కోట్ల సహస్రనామాలు చేసినది) తీర్థంగా వాడటం, అదే ఔషధంలా పనిచేయడం** ఈరోజుకి కూడా అనుభవం అవడం అందరికీ తెలిసిన విషయమే. అందుకే తీర్థమునకు, ఆమె వాక్కుకు కూడా ఒకే శక్తి ఉందని మనకు తెలుస్తోంది. వాక్కు 'సంకల్పం' ద్వారా ప్రవహిస్తుంటే, 'తీర్థం' అంతర్ముఖంగా పనిచేసే 'శక్తి' అని చెప్పవచ్చును.

అలాగే కానుకొలను కమలమ్మగారి ఇంటిపక్క ఇండ్లు కాలిపోయినప్పుడు కూడా అమ్మమ్మగారు ఇంటికప్పుపైన కుంకుమ నీళ్ళు చల్లి, పెరుగన్నం పెట్టమన్నారు. అగ్నిని ఆర్పటానికి ఆ కుంకుమ నీళ్ళు ఆయుధంగా ఉపయోగపడ్డాయి. పెరుగన్నం అగ్నికి నైవేద్యం పెట్టడం ద్వారా ఆ ప్రమాదాన్ని అరికట్టారు.

ఒకసారి నాంచారు సుబ్బలక్ష్మి "నాకు అమ్మవారిని మానవాకృతిలో చూపించరా?" అని అడిగింది. 'మాయ'చేత అంతకుముందు మనకు ఎన్నో అనుభవాలు. అమ్మమ్మగారిలో ఉన్న ఆమె 'త్రిపుర సుందరీ' అని గ్రహించలేము. అందువలన అమ్మవారు ఎలా ఉంటుందో చూడాలనే ఆశతో ఈ ప్రశ్న అడిగింది. 'ఆమే' తన శిష్యురాలికి అర్థమయ్యేలా ప్రయత్నం చేయవచ్చు కదా! ఆ 'మాయ' తెర తీసివేయచ్చు కదా! సమయం వచ్చి అనుభవపూర్వకంగా తెలుసుకునేంత వరకూ వాళ్ళు వేచిచూస్తూనే ఉంటారనటానికి ఇదొక నిదర్శనం.

శిష్యురాలి కోరిక తీర్చడం గురుధర్మం కాబట్టి, దేవతలు అమృతం తాగడం వలన వయస్సు 30 సం॥లు దాటదు కాబట్టి, 16 ఏళ్ళ (షోడశి) బాలిక రూపంలో దర్శనం చేయించారు. అది ఆమె 'నిజ స్వరూపం'. కమలమ్మగారి భౌతికరూపం, అవతార రూపం అని ఇక్కడ మనం అర్థంచేసుకోవాలి. మానవాకృతి అని అడగడం వలన ఆ రూపంలో దర్శనమిచ్చారు అమ్మమ్మగారు. అందుకే అమ్మమ్మగారే "నీ కోరిక తీరిందా?" అని అడిగారు.

గుండ్లపల్లి రామ్మోహన్‌గారి విషయంలో "అన్ని పూలు ఉన్నాయి. ఒక్క చేమంతులు తప్ప" అన్నారుట. "నేను తీసుకురానా?" అనడిగారు. "అక్కర్లేదు. అమ్మవారే తెప్పించుకుంటుంది" అని బదులిచ్చారు. అంటే అవి 'లేవు' అని అనుకునేటప్పుడే 'కావాలి' అనే 'సంకల్పం' చేస్తారన్నమాట. అందుకే రిక్షాలో వెంటనే బుట్టెడు చేమంతులు వచ్చి దిగాయట. అలాగే ఒకరోజు రాత్రి పొద్దుపోయి వీళ్ళు బందరు నుండి ఏలూరు వచ్చారట. పొద్దున్నే పాలవాడు వచ్చి "చుట్టాలొచ్చారుట కదా! పాలు కావాలని అమ్మ కనబడి చెప్పారని" చెప్పి పాలుపోసి వెళ్ళాడుట. అంటే రాత్రి ఈమె ఇక్కడ కావాలనుకుని సంకల్పం చేయడమే, వారికి అక్కడ ఒక అమ్మ కనబడి చెప్పడం మనోసంకల్పం. మనస్సెంతో వేగం కదా!

**25.04.2003**

శ్రీమతి హరి దుర్గాంబగారు అమ్మమ్మగారిని సాక్షాత్తూ అమ్మవారిగా భావించి సేవలు చేసేవారు. అమెకు ఎన్నో అద్భుతమైన అనుభవాలు కలిగాయి. అయినా కూడా ఒకరోజు గుళ్ళో ఉన్న 'కాళీమాత'ను చూడాలనే సంకల్పం కలిగి గుడికి వెళ్తుండగా, మధ్యలో కమలమ్మ గారు కనబడి "ఎక్కడికి వెళ్తున్నావే?" అనడిగారు పరీక్షగా. అప్పుడు కూడా "అవునండి, కాళీమాత దర్శనం చేసుకుందామని" అన్నారు. కానీ జనం మూలంగా దర్శనం కాలేదు. మళ్ళీ తిరిగి వచ్చేటప్పుడు ఏమైందో అని అమ్మమ్మగారు అడిగారు. "దర్శనం కాలేదండీ" అని బాధపడ్డారు. ఆ తపనతో ఈమె "చూస్తావా? రా!" అని లోపలికి పిలిచి ఆ రూపంలో దర్శనం ఇచ్చారు.

భక్తుడు ఆర్తిగా కోరుకోవాలే గానీ, దేవుడు కరుణించడా? ఆ దర్శనంతో ఈమెకు కనువిప్పు కలిగించారు. ఆ కాళీ, సరస్వతి, లక్ష్మి, సర్వదేవతల స్వరూపం కమలమ్మగారేనని గ్రహించేలా చేశారు. తర్వాత, ఆమె చివరి వరకూ (80 సం॥లు) కమలమ్మను తప్ప మరే దేవతనూ స్మరించి కూడా ఎరుగరు. భక్తులను పరీక్షించి కనువిప్పు కలిగించి తనే సర్వదేవతా స్వరూపమని తెలియజేసినటువంటి మహత్తరమైన సంఘటన ఇది. దీనినిబట్టి **కమలాంబికా మంత్రం సర్వదేవతా మంత్రం** అని మనకు అర్థమవుతున్నది.

మరొకసారి హరి దుర్గాంబగారు, పుల్లాబ్జాక్షిగారు కలిసి కమలమ్మగారి ఇంటిమెట్లు ఎక్కుతుండగా "ఆగు" అని ఆమెకు జరుగబోయే ప్రమాదాన్ని సూచించారు. లోపలికి పిలిచి అభయమిచ్చారు. ఆమె చెప్పినట్లుగానే ఆస్తితగాదాల వల్ల దౌర్జన్యం జరిగి విఫలమైనది.

దీన్నిబట్టి చూస్తే ఆమె ముందుగా జరుగబోయే విషయాన్ని గ్రహించి, దాని నుండి తప్పించడం ఎలాగో కూడా ఆమే సూచించి, అభయాన్నివ్వడమనే అద్భుతమైన అనుభవాన్ని కలుగజేశారు. అలా మొదటి దర్శనంతోనే ఆమెకు నమ్మకాన్ని ప్రసాదించారు. ఎంతటి అదృష్టవంతులో కదా వారు! అందువల్లనే చివరి వరకూ కూడా వారు ఆ నమ్మకాన్ని ఇసుమంత కూడా సడలించుకోకుండా, ఆ గొడుగునే ఆశ్రయించుకుని ఉండగలిగారు. అమ్మవారి అనుగ్రహం అలా ఉంటుందన్నమాట.

**26.04.2003**

బుద్ధిరాజు రామకృష్ణకు దుర్గగుడికి వెళ్ళి ప్రసాదం తింటూ పై మెట్టుమీద నుండి ఒక్కసారిగా క్రిందకు ఎలా దిగారో అర్థంకాలేదు. ఆ కనకదుర్గ రూపంలోనే పిన్నిగారు కొండపై నుండి క్రిందకు దింపారు. అక్కడ దుర్గకూ, ఈమెకూ తేడా లేదని నిరూపించబడనది. అలాగే ఢిల్లీలో ఆమె తప్పిపోయినపుడు చేతిలో డబ్బులు లేవు, భాషరాదు. "నామాలవాడు" ఆటోలో తీసుకొచ్చాడని చెప్పారు. క్రిందకు దిగి చూస్తే అక్కడ ఎవరూ లేరు. ఇక్కడ అమ్మమ్మగారు (ఏడుకొండల వేంకటేశ్వరస్వామి శక్తిస్వరూపిణి, ఆమెకు పెద్దజుట్టు ఉంటుందని గతంలో శిష్యులకు స్వయంగా చూపించారట) ఆ శక్తిస్వరూపమే ఈమె కావున రిక్షావాణ్ణి 'నామాలవాడు' అని చెప్పి, తన శక్తిని స్వామి రూపంలో తెలియపరిచారు.

కోట జానకిరామశర్మ విషయంలో, "కలలో మంత్రోపదేశం చేయండి!" అంటే "నాకు కేశవనామాలు కూడా రావు" అని చెప్పారు. కమలమ్మగారి చరిత్రను రాసేటప్పుడు చాలామంది అనుభవాలు సేకరించాము. కానీ ఆమె ఎవ్వరికీ ఏ మంత్రమూ ఉపదేశించినట్లుగా చెప్పలేదు. "అమ్మవారికి నమస్కారం చేసుకోండి". వీలున్నవారిని వచ్చి "శుక్రవారాలు పూజచేసుకో"మని చెప్పేవారు. కానీ ఎవ్వరూ ఆమె పూజ చేయడంకానీ, కేశవనామాలు చెప్పడం కానీ (ఆమె పిల్లలు కూడా) చూడలేదు. కాబట్టి, ఆమె "కలలో మంత్రం ఉపదేశించండి" అనగానే ఖండించారు అతణ్ణి. దీన్నిబట్టి మనం కూడా ఏదో కన్పించినా, వినిపించినా నమ్మకూడదని దీని సారాంశముగా తెలుస్తోంది.

అతనికే మరొకసారి “అతడు క్రితం జన్మలో చేసిన సాధనా లోపం వలన అది అక్కడితో ఆగిపోయింది. అప్పుడు అతను అమ్మవారిని (మర్కట కిశోరన్యాయం) గట్టిగా పట్టుకుని సాధన చేశాడు. కొంత లోపం జరిగింది. ఈ జన్మలో మొత్తంమీద (మార్జాల కిశోరన్యాయం) అమ్మవారే అతణ్ణి గట్టిగా పట్టుకుని ఒడ్డుకు చేరుస్తుంది. అనవసరమైన ఆలోచనలు చేయొద్దు” అని చెప్పారు.

మనము అనవసరమైన ఆలోచనలు, ప్రయత్నాలు చేసినట్లయితే మళ్ళీ సాధన భ్రష్టత్వం పట్టే అవకాశం రావచ్చు. కాబట్టి **గురువు యొక్క ప్రతీమాటను అనుసరించడమే తప్ప శిష్యునికి వేరొక ఆలోచన ఉండటం తగదు.**

మహంకాళి నారాయణమూర్తిగారికి చెప్పిన “ఏమీ ఫర్వాలేదు. వెళ్ళిరా” అనే మాటే ఈ రోజుకీ సంధ్యావందన సమయంలో పిన్నిగారు ఆయన మనస్సులో ప్రత్యక్షమై అదే వాక్యం (ఏమీ ఫర్వాలేదు. వెళ్ళిరా) అంటారట. సంధ్యావందన సమయంలో ఆమె గాయత్రీ రూపంలో ప్రత్యక్ష దర్శనమిస్తున్నారన్నమాట.

ఈవిధంగా అమ్మమ్మగారు మానవరూపంలో ఉన్న “అపరాశక్తి”. అందుకే వారివారి అదృష్టాల్ని బట్టి, పూర్వపుణ్యాల్ని అనుసరించి ఆమె ఒకరికి రాజరాజేశ్వరిగా, మరొకరికి బాలాత్రిపుర సుందరిగా, వేరొకరికి వేంకటేశ్వరస్వామిగా, గాయత్రీదేవిగా, కనకదుర్గగా – అన్ని రూపాలు తనవేనని స్పష్టంగా, అర్థమయ్యేలా చూపించారు. దీన్నిబట్టి మనకు అన్ని రూపాలూ ఆమెవే, ఆమెవే అన్ని రూపాలు అని అర్థమవుతున్నది.

సామాన్య మానవురాలిగా జన్మించి, మనతో బ్రతికి, గురువు అనికూడా వ్యక్తమవకుండా, మనలను చక్కని మార్గంలో పెడుతూ, బాధలకు నివారణోపాయాలను సూచిస్తూ ఎండలో గొడుగులాగా నడిపిస్తూ, తనెవరో అవతలివాడికి తెలియజేస్తూనే ఉన్నారు. కానీ, మన పుణ్యం, యోగం ఎంతో, అంతవరకే ఈ జన్మలో మనం అర్థం చేసుకోగలుగుతాం. ఎన్ని జన్మలెత్తితే మనం ఆమె స్వస్వరూపమును తెలిసికొని ఆమెతో మనగలిగి, బ్రహ్మానందాన్ని పొందగలమో తెలియదు. దానికి కావలసింది సాధనే కదా!

**27.04.2003**

మరణసమయంలో ఆమె ‘నారాయణమూర్తి’ ధ్యానం చేశారు. ఆమె చివరిసారిగా పలికిన పలుకు “ఆ! నారాయణమూర్తి వచ్చావా!”. అంతే ఇంక మరి మాట్లాడలేదు. దీన్నిబట్టి చూస్తే అమ్మవారి ‘అర్థనారీశ్వర తత్వం’ ఈమె ఆ శివునిలో ఐక్యమైనట్లుగా మనకు అర్థమవుతున్నది. ఆమె ఈశ్వరునిలో లయం అయితేనే గానీ పరాశక్తి అయినటువంటి ఆ లలితాదేవి రూపం ప్రత్యక్షమవదు. ఆమె అమ్మలగన్న అమ్మ, ఆ తల్లులందరికీ తల్లి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను సృష్టించిన తల్లి. ‘లలితాపరాభట్టారిక’గా ఇక్కడ మనకు అవగతమవుతున్నది.

బ్రహ్మరంధ్రాల ద్వారా ప్రాణోత్క్రమణం జరగటం కూడా అమ్మవారి అవతీర్థంగా మనకు తెలియజేయడమే. పద్మాసనంలో కూర్చుని యోగమార్గములో వెళ్ళడం కూడా మనకు ఆమె

అవతార మహిమను తెలియజేస్తోంది.

ఇంకా జాలమ్మగారికి అమ్మమ్మగారు మరణానంతరం కనబడి 'రావటం లేదేం!' అనడుగుతూ పీఠంలో ఐక్యమవుతున్నట్లుగా దర్శనం ఇచ్చారు. ఇక్కడ మనకు పరాధిష్టాన దేవత (బాలాత్రిపురసుందరే ఈ కమలమ్మగారు) అనటానికి నిదర్శనంగా చూపించారు.

**"ఈ దేహం శాశ్వతం కాదు. ఆత్మ నాశనరహితమైనది. నేను వేరు. శరీరం వేరు. శరీరం ఉండదు. నేనెక్కడికీ పోను. ఈ పీఠంలోనే ఉంటాను. నీడలా నా భక్తుల్ని వెన్నంటి ఉండి రక్షిస్తాను"** అని కమలమ్మగారు చెప్పిన మాటలను పోల్చుకుంటే, దేహం-కమలమ్మ గారు, ఆత్మ-శ్రీ బాలాత్రిపురసుందరి, పీఠం - ఇద్దరి కలయిక జీవాత్మ, పరమాత్మల సంగమం, సాకార నిరాకారముల కలయికగా చెప్పుకోవచ్చు. అక్కడ దర్శించినవారికి ఆమె వెంటే ఉంటానని అభయమిచ్చారు కదా! ఎంత దయామయి ఆ తల్లి.

**28.04.2003**

సోమంచి పద్మశ్రీ అమ్మమ్మగారికి స్వయానా మనుమరాలు. మునిమనుమడు పుట్టాడని, ఆమె స్వయంగా ఆసుపత్రికి వచ్చి బిడ్డను ఎత్తుకుని ఆశీర్వదించినటువంటి సంఘటన. అమ్మమ్మగారు దేహంతో వచ్చి ఆశీర్వదించారనే అనుభవం పద్మశ్రీకి కలగడం కోసం కమలమ్మగారి రూపంలోనే రావాలి - నిదర్శనంగా. దేహం కనుకనే దుర్గాంబ గారికి కనబడి "గంగస్నానం చేయించు. ప్రథమ పూజకు చేరుకోవాలి" అన్నారు. "పురిటిబిడ్డను ముట్టుకున్నాను. కాశీగంగతో స్నానం చేయించు" అనడిగారు. దేహంతో వచ్చాను - అని చెప్పటానికి ఇది ఒక గొప్ప నిదర్శనం. ఆత్మతో అమ్మవారి స్వరూపంగా కనబడితే అప్పుడు ఇవన్నీ అక్కర్లేదుగా. శరీరంతో ఉన్నప్పుడు పాటించాల్సినవన్నీ పాటించాలని, ఆమె కూడా పాటించి చూపించారని ఇక్కడ మనకు తెలుస్తోంది.

ఆమెను ఆత్మస్వరూపంగా తీసుకుంటే ఇవేమీ అక్కర్లేదు. ఆ స్థితిలో ఆమె పూజలు అందుకుంటున్నదన్నమాట. నేను ఈ పీఠంలోనే ఉండి భక్తులను రక్షిస్తాను అనే దానికి ఒక గొప్ప ఉదాహరణ. దేహంతో కనబడి బిడ్డను ఎత్తుకుని ఆశీర్వదించారంటే ఆమెకూ-ఆ బిడ్డకూ ఏ జన్మాంతర సంబంధమో, గురుశిష్య సంబంధమో మనం అర్థంచేసుకోవచ్చు. మొత్తమ్మీద తల్లీబిడ్డలిద్దరూ కూడా సుకృతజీవులే అని తెలుస్తోంది.

సోమంచి దుర్గాంబగారి విషయంలో "నువ్వు, నేను అంతా కర్మబద్ధులం. పురాకృత కర్మను అనుభవింపక తప్పదు" అన్నారు. ఎందుకంటే అవతారమూర్తి అయిన ఆమె కూడా దేహాన్ని ధరించడం వలననే కదా సంసారబంధాలు, బిడ్డలు, బంధుత్వాలు, కష్టాలు, నష్టాలు మరెందరో సామాన్య మానవుల వలే ఆమె అనుభవించి మనకు చెప్పినటువంటి విషయం ఇది.

దేహంతో ఉన్న ఆమె, ఆ త్రిపురసుందరిని ప్రతిష్ఠించుకుని (మనసులో) బాహాటంగా (పీఠం) సేవచేసుకుంటూ ఆమెను నమ్ముకుని సాధనలు చేయడం ద్వారానే ఆ కష్టనష్టాలన్నీ కూడా

90% అమ్మవారు తప్పించిందనీ, మిగిలిన 10% మనం అనుభవించక తప్పదనీ చెప్పారు. అనుభవపూర్వకంగా చెప్పినటువంటి విషయమేమిటంటే – "ఎండలో గొడుగు పట్టుకు నడిచినట్లు ఉంటుందని" స్వయంగా అనుభవించి మనకు ఉపదేశించిన విషయం ఇది. అందుకే "నువ్వూ, నేను, అందరం" అని వాడారు.

ఈవిధంగా అమ్మవారిని ధ్యానం చేయడంవలన మనకు 'భక్తి' పుడుతుంది, భక్తినుండే జ్ఞానం కలుగుతుంది, జ్ఞానం కలిగితే తప్ప మనమేమీ ఆమెపై విషయాలను వదలము (వైరాగ్యం కలిగితేనే కదా!), వదిలితే తప్ప ఆమె గొడుగు పట్టుకోదు. గొడుగుంటే తప్ప మనం ఎండనుండి తప్పించుకోలేము. ఇవన్నీ సాధనా మార్గాలు. ఆమె ఒక్కమాటలో వేదాంతాన్ని చెప్పారు. "ఆమెను నమ్ముకోండి. అన్నీ ఆమే చూస్తుంద" ని చెప్పారు. అదొక్కటే మనం పాటించాల్సిన విషయం.

**29.04.2003**

కమలమ్మగారు భద్రాచల యాత్రకు వెళ్ళినప్పుడు, ఒక స్త్రీ కృష్ణుని విగ్రహాన్ని చంకనపెట్టుకుని మోస్తూ తిరుగుతోంది. ఆమె ఎవరని ప్రశ్నించారు. "ఒక పిచ్చిది, విగ్రహానికి స్నానం చేయిస్తుంది, అన్నం తినిపిస్తుంది, జోల పాడుతుంది'' అని చెప్పారు. దానికి ఆమె **"భవబంధాలు తెంచుకోవటానికి లౌకిక ప్రపంచానికి అతీతమైన భక్తి కావాలి. ప్రాపంచిక దృష్టిలో పిచ్చిగా కనిపించే ఆమె చేష్టలన్నీ ముక్తిసాధనలే"** అంటూ ఇక్కడ మనకొక ఉపదేశం ఇచ్చారు.

భక్తి అనేది ఉంటే, అది తన్మయత్వంతో కూడి ఉంటుందని, లౌకిక విషయాలతో సంబంధం ఉండదని చెప్పటానికి ఆమెను మనకు ఉదాహరణగా అమ్మమ్మగారు చూపించారు. ఆమె దానిని విగ్రహం అనుకోవడం లేదు. కృష్ణుడనే భావనతోనే ఉన్నది. లోకం దృష్టితో ఆమెకు పనిలేదు. తను వేరేలోకంలో ఉన్నది. ఆ విషయం కూడా ఆమెకు తెలీదు. అటువంటి వారిని మనం (లౌకికంగా) పిచ్చివాళ్ళంటాము. రామకృష్ణ పరమహంసను కూడా పిచ్చివాడేనని అన్నారు. అమ్మమ్మగారు కూడా చాలా విషయాల్లో మనకు (లౌకికంగా) పిచ్చివారుగానూ, అమాయకంగానూ, ఆమె లోకం వేరేదిగానూ కన్పించారంటే వారు ప్రాపంచిక దృష్టితో అర్థంకారన్నమాట. ఆ విషయమే ఆవిడ మనకు స్పష్టంగా తెలియజేసి ఉదాహరణతో చూపించారు.

**30.04.2003**

కమలమ్మగారి చెల్లెలి కుమార్తె సుశీల. చెల్లెళ్ళను నెల్లూరు పంపటానికి, విజయవాడలో రైలు ఎక్కించడానికి అమ్మమ్మగారు ఏలూరు నుండి విజయవాడ వచ్చారు. కనకదుర్గ చాలా నిదర్శనం అని చెప్పి కొంత డబ్బు వీళ్ళకు ఇచ్చారు. అమ్మమ్మగారిని ఏలూరు రైల్లో వెనక్కు పంపేశారు. వీళ్ళు టికెట్ తీసేసుకున్నాము కదా అని మిగిలిన డబ్బంతా ఖర్చుపెట్టేశారు. వెంటనే అనౌన్స్‌మెంట్ వచ్చిందట. ప్యాసింజర్ రద్దయిందనీ, అందరినీ మెయిల్ లేదా ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళమని చెప్పారట. వాళ్ళ దగ్గర డబ్బుల్లేవు. స్టేషన్‌లో టిక్కెట్ మార్చుకోవడం కూడా తెలియదు. కమలక్క "కమలమ్మ మహిమ చూపిస్తుంది" అన్నది. ఊరు తెలియని చోట వచ్చి పడ్డాము అని

గాబరా పడుతుండగా 16ఏళ్ళ వయస్సున్న ఒకపిల్ల వచ్చి "ఏమ్మా! ఏదో బాధపడుతున్నట్లున్నారు. కష్టమేదైనా ఉంటే చెప్పవచ్చు కదా! నేను అంతమాత్రం సహాయం చెయ్యనా?" అని అడుగుతూనే చేతిలోఉన్న ప్యాసింజర్ టిక్కెట్ లాక్కుని, మెయిల్ టిక్కెట్ కొనిచ్చి, రైలు ఎక్కించి నవ్వుతూ టాట చెప్పిందట. వీళ్ళు అడ్రస్ అడిగితే చెప్పకుండా మాయమైందట. రైలు కదలగానే వీళ్ళకు అమ్మమ్మగారి మాటలు గుర్తుకు వచ్చాయట. "కనకదుర్గమ్మ మహిమ చూపిస్తుంది" అని ముందుగానే చెప్పిందంటే, ఈమె ముందు వెళ్ళిపోయి, ఆమె రూపంలో వీళ్ళకు కనపడిందన్నమాట. ఆమెకూ, ఈమెకూ తేడా లేదని చెప్పకనే చెప్తున్నట్లుగా వున్నది ఈ అనుభవం.

**08.05.2003**

"సంసారం ఒక సాగరం" అన్నారు పెద్దలు. సాగరంలో అలలుంటాయి. పెద్దపెద్ద కెరటాలొస్తాయి. ఆటుపోటులుంటాయి. కానీ సముద్రం మధ్యలో నీరు గంభీరంగా ఉంటుంది. కదలిక నిశ్చలంగా ఉంటుంది. సముద్రగర్భంలో ఎన్నో రత్నాలు, ముత్యాలు, మణులు, మరెన్నో విలువైనవి ఉంటాయి.

ఇంక సంసారానికి వస్తే, అన్ని ఆశ్రమములలోకి గృహస్థాశ్రమమే శ్రేష్టమని చెప్తున్నారు మహానుభావులు. కానీ సాగరం కంటే ఎంతో పెద్దదైన ఈ సంసారాన్ని ఈదటమంటే మాటలా? మనిషికి దేవుడు మనసిచ్చాడు. ఆ మనస్సును ఆధారం చేసుకుని నువ్వు జీవించాలి. నువ్వేడిస్తే అది ఏడుస్తుంది. నువ్వు నవ్వితే అది నవ్వుతుంది. కానీ **సంసార సాగరంలో మనిషికి నవ్వుకంటే ఏడుపే ఎక్కువసార్లు వస్తుందనుకుంటాను**. ఎందుకంటే ఎక్కువసార్లు నవ్వుతూ బ్రతకటానికి అవకాశాలుండవు. ఈ సాగరంలో మనిషి పుట్టినప్పటినుండి, అంటే ఒక తల్లి బిడ్డను ప్రసవిస్తే, ఆ బిడ్డకు పాలిచ్చి పెంచడంలో ఎన్నో కష్టాలు. అలాగే విద్యార్థి జీవితంలో వాడితోపాటు ఆ తల్లికూడా కష్టపడాలి. తర్వాత వాడికి జీవనోపాధి దొరకడంలో మరెన్నో బాధలు, వాడి పెళ్ళి, ఆ భార్య అనుకూలవతి కాకపోతే వాడుపడే బాధలు, మళ్ళీ వాడికి పిల్లలు పుట్టకపోతే మరో బాధ. పుడితే... మళ్ళీ చక్రం తిరుగుతూ ఉంటుంది. ఈ తల్లి మట్టిలో కలిసేవరకూ, ఇలా బిడ్డలతో, భర్తతో, అత్తమామలతో, మరియు బంధుమిత్రులతో కలిసి సంఘంలో జీవించడంలో మరెన్నో బాధలు, ఇబ్బందులు, బాధ్యతలు, కష్టాలను ఎదుర్కొంటూ, పడుతూ, లేస్తూ గాడిద బరువును మోస్తున్నట్లుగా, ఈ మనిషి మోస్తూనే ఉండాలి. అందుకే 'గాడిద చాకిరీ' అన్నారు. ఆ చాకిరీనే మనం కష్టాలు అంటున్నాం. **మనిషికి కోరిక తీరేదీ లేదు. ఒకటి తీరితే మరొకటి వెంటనే ఉంటుంది.** ఈ అంతులేని సాగరంలో కోరికతోపాటే బాధలూ ఉంటాయి. తీరిందన్న సంతోషం కలిగే లోపలే మరొకటి పుడుతుంది మరి! ఆనందానికి సమయం ఏది? మళ్ళీ కోరిక. అది తీరితే ఇంకొకటి. లేకపోతే ఇది తీరలేదన్న బాధ. దీనికి దరి ఏది?

అందరి జీవితాలు పాపపుణ్య కర్మల మిశ్రమములే. పుణ్యఫలం అనుభవించేటప్పుడు మన మనస్సు స్పందన చాలా తక్కువగా ఉంటుంది. అదీ పాపకర్మలననుభవించే సమయం చాలా

ఎక్కువ సమయమని అనిపిస్తుంటుంది. ఎందుకంటే బాధను అనుభవించడం చాలా కష్టం. దారీతెన్నూ దొరకదు. మనస్సు నిరోధిస్తుంటుంది. బుద్ధి పనిచేయదు. ఎవ్వరి సలహానూ పాటించలేము. కుడితిలోపడ్డ ఎలుకలాగా కొట్టుకుంటూ ఉంటాము. బయటకు రావాలంటే దైవకృపే శరణ్యము. కానీ ఆ కృప మనకు దొరికేదెలా? పట్టుకుని ఈ కష్టాన్ని దాటడం ఎలా? ఇవన్నీ ప్రతి మనిషి జీవితంలో చాలాసార్లు ఎదురయ్యే సమస్యలే. వీటిని గురించి నిశితంగా ఆలోచించి, నిర్ణయానికి రావడమనే అవకాశాలు చాలామందికి చాలా అరుదుగా లభిస్తుంటాయి.

## అంతర్మథనం

నేనొకరోజు బొంబాయిలో ఈవినింగ్ వాక్ చేస్తున్నాను. ఒంటరిగా ఉండటం మూలంగా ప్రతి చిన్నవిషయం గురించి ఆలోచన సూటిగా మనసుకు చేరుతోంది. కానీ హైదరాబాద్‌లో అంత సమయం ఉండేది కాదు. ఆరోజు నాకు చాలామంది దగ్గరనుండి ఫోన్లు వచ్చాయి వారి వారి బాధనివారణోపాయాల గురించి. ఒక వ్యక్తికి భార్యాబిడ్డలను పోషించుకోవడం కోసం ఉద్యోగం చాలా అవసరం. వేరొకరికి 4 నెలలుగా ఆ కంపెనీ జీతం ఇవ్వడం లేదు. వేరొకరికి భార్యాబిడ్డల వియోగం, మరొకరు సంతానార్థం, మరొకరు వివాహం కొరకు, ఇంకొకరు జీవితంలో ఏ సుఖం అనుభవించక పరితపిస్తూ ఉన్నారు. వాళ్ళందరి కష్టాలు ఎలా తీరుతాయి? నివారణోపాయాలను తెలుపటం, వాళ్ళను అందులోంచి మరొక మెట్టు ఎక్కించడం గురించి ఆలోచిస్తూ పార్కులోనికి వెళ్ళాను. బెంచిమీద కూర్చున్నాను. నా గురుదేవులైన కమలాంబికను స్మరిస్తూ ఈ విధంగా ప్రార్థించాను.

"ఈ మహాసాగరంలో ఎన్నో జీవులు పడి ఈదుతున్నాయి, కొన్ని ఎదురీదుతున్నాయి, మరికొన్ని పట్టుకొమ్మలను వెదుకుతున్నాయి, కొన్ని నావలలో ప్రయాణిస్తున్నాయి, కొన్ని సాఫీగా నిశ్చలంగా ఈదుతున్నాయి. తీరంకోసం, తీరంలోఉన్న నిన్ను చేరుకోవడం కోసం... ఇంత కష్టంలోనూ చావుకు భయపడక నీ దగ్గర సేద తీర్చుకోవాలనే ఆకాంక్ష వలన వారికి ఈ సముద్రపు ఆటుపోట్లు, తుపాన్లు, అలల వలన భయాలు ఇవన్నీ ఏమీ గుర్తులేవు. నిన్ను చేరుకోవడమే ధ్యేయం అన్పిస్తోంది. నువ్వున్నావని తెలుసుకున్న వారు మాత్రమే దేనినీ లెక్కచేయకుండా అలా ఆ సాగరంలో పడి ఈదుతున్నారు. నువ్వు వారిని అన్ని వేళల్లోనూ కాపాడుతావనే నమ్మకం ఉన్నవారూ, లేనివారూ అలానే మునిగిపోతున్నారు. ఆ మునకలో కూడా నరకయాతనను అనుభవిస్తున్నారు. ఒడ్డుకు చేరితే నీ "రక్షణ కోట" ఉన్నది అక్కడ. సాధకులందరికీ దాన్ని చేరుకోవాలనే ఆరాటం. వాళ్ళందరికీ నీ రక్షణ వలయం ఉన్నది. భయం లేదు. ఓ తల్లీ... నన్నెందుకు పుట్టించావు? ఈ జీవితంలో నా పాత్ర ఏమిటి? నేనేం చేస్తున్నాను. ఏం చేయాలి? ఏం చేస్తే నా మనసుకు ఊరట కలుగుతుంది? నేను ఏ పనిచేస్తే నీ అనుగ్రహం నాకు పరిపూర్ణంగా లభిస్తుంది?"

మళ్ళీ ఈ విధంగా కోరుకున్నాను- "తల్లీ (ఆలోచించగా) ఒక ఊతకర్ర, చేతికర్రగా నాకు

ఈ జన్మను ఇచ్చావు. ఈ సాగరంలో పడి ఈదుతున్న వాళ్ళకు పట్టుకొమ్మగానో, నావగానో లేదా నీళ్ళలోపడితే వాడి చేతుల్లో శక్తిగానో నేను పనికివచ్చేలాగా జన్మనిచ్చావు. ధన్యురాల్ని తల్లీ. వాళ్ళకు ఎలాగోలా సాయంచేసి, నీ రక్షణకోట వద్దకు వారిని తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నాను. **నా ఊతంతో వారు ఎలాగోలా నేనున్నాననే ధైర్యంతో మొండిగా, దేన్నీ లెక్కచేయకుండా, మరిదేన్నీ మదిలో పెట్టుకోకుండా, ఆ కర్రసాయంతోనే నీ దగ్గరకు చేరుస్తాననే నమ్మకంతో ఈదుతున్నారు.** కానీ వాళ్ళు ఈదడంలో పడే కష్టంముందు నా కర్ర బలంగా నిలబడడం లేదనిపిస్తోంది.

అందువల్ల నువ్వు నన్ను అనుగ్రహించి, కర్రకు మరింత శక్తిని ఇవ్వగలిగితే నేను నా కర్తవ్యాన్ని నెరవేర్చగలను. లేదంటే వారికంటే ముందు నేనే మునిగిపోతానేమోననే భయం కలుగుతోంది. కావున నా పుణ్యఫలమును కాస్త వాళ్ళకోసం ఖర్చుపెట్టి, కర్రను బలంగా నిలిపి నేను కూడా ఈదుతున్నాను. ఓ తల్లీ పాపకర్మములను అనుభవించు స్థితిలో వారెలా ఉంటారో నేను ఊహించగలను. అందులోనే, నన్ను (కర్ర) ఊతముగా వాళ్ళకు ప్రసాదించడమే నీ అనుగ్రహము. మరి నేను దరిచేరాలంటే నా పుణ్యఫలము ఎక్కువ ఖర్చు అయిపోయిన యెడల నాచేత మరిన్ని పుణ్యకార్యములు చేయించి, నా మూటలో పుణ్యధనాన్ని ప్రోగుచేసి, వారి కోసం ఖర్చుపెట్టేలాగా నన్ను అనుగ్రహించు తల్లీ. అపుడు నేను పడిపోకుండా, వాళ్ళను పడనివ్వకుండా అందరమూ నీ కోటవద్దకు చేరుకుంటాము. తల్లీ! నా పుణ్యఫలము ఖర్చుపెట్టడం వలన మాత్రమే వారికి సాయపడగలుగుతున్నాను. ఆ ఫలాన్ని మరింత పెంచు తల్లీ. నేను మరింత వేగంతో మరింత మందిని వారివారి స్థానాలనుండి పైమెట్టు మీదకు ఎక్కిస్తూ చేతికర్రగా ఊతమిస్తూ, నిన్ను స్మరిస్తూ, నీ వద్దకు (బాధాతప్త జీవులను) చేరుస్తాను. నీ అనుగ్రహం నాకు మరింత అందజేయి... తల్లీ కమలాంబికా...."

**22.05.2003**

ఒకసారి హరి దుర్గాంబగారు, 'శని'కి అభిషేకం చేసుకోవాలి అనుకున్నారు. కానీ దానికి ఆమె భర్త అంగీకరించరు. ఈమెకి ఏ మంత్రం రాదు. పైగా ఆడవాళ్ళు చెయ్యకూడదేమో అనే అనుమానం ఉంది. ఒకసారి అమ్మమ్మగారు వీరింటికి సాన్నం చేయటానికి వచ్చారు. ఆమె దుర్గాంబ మనసులో ఉన్న అనుమానాన్ని గ్రహించి "దుర్గాంబ! ఈరోజు శనివారం **ఒక వీసె, సవాసేరు నువ్వుల నూనె తెచ్చి నాకు ఓం నమశ్శివాయ అనే మంత్రంతో అభిషేకం చెయ్యి.** నీ అనుమానం, మొక్కు రెండూ తీరతాయి. కానీ ఈ విషయం మరెవ్వరికీ చెప్పకు" అన్నారు. ఆమె అలాగే చేశారు. అంత నూనెతో అభిషేకం చేసినా ఆ ప్రదేశం కొద్దిగా జిడ్డుకూడా అవ్వలేదు. కొద్ది కుంకుడురసంతోనే తలజిడ్డు వదలడం కూడా ఆమెను ఆశ్చర్యపరిచింది. అది ఆమెకు చాలా వింతగా తోచింది.

'శని అభిషేకం' గురించి వ్రాస్తున్నాను. సాక్షాత్తూ ఆమె శివశక్త్యైక స్వరూపిణి అనడానికి ఇది నిదర్శనం. ఆమె శక్తి కదా! ఆమెయే శివుడు కూడానూ. అందుకే "ఓం నమశ్శివాయ" అనే

శివపంచాక్షరి మంత్రంతో అభిషేకం చేసినా ఆమెకే చెందుతుందని దీని అర్థము. అంతేకాదు నవగ్రహాలు కూడా ఆమెలోనే ఉన్నాయని శని గ్రహానికి జపంచేసినా, అభిషేకం చేసినా, ఆమెయే స్వయంగా చేయించుకున్నారంటే దాని అర్థమేమిటి? ఆమెలోనే అన్నీ ఉన్నాయని తెలియజెప్పే అనుభవం ఇది. దీన్నిబట్టి చూస్తే ఆడవాళ్ళు చేయకూడదు అని మనవాళ్ళు చెప్పిన సాకు కూడా మనకు ఇక్కడ వర్తించదన్నమాట. ఆమెయే స్వయంగా భక్తురాలిచేత అభిషేకం చేయించుకున్న ఈ సంఘటన ద్వారా మనకున్న మూఢనమ్మకాలకు ఒక కనువిప్పు కలిగించే సంఘటన ఇది. అంతేగాదు ఇక్కడ మనకు అమ్మమ్మగారు ఎవరికి చేసినా, ఏం చేసినా తనకు చేస్తేనే అవన్నీ ఫలిస్తాయనీ, తప్పులేదనీ నొక్కివక్కాణించి చెప్పారు.

అలా అభిషేకం చేయించుకున్నాక "ఇంక నీకేం ఫర్వాలేదు. దేన్ని గురించిన చింత, భయం నీకు అవసరం లేదు" అన్నారు. ఆ తర్వాత ఆమె చెప్పినట్లుగానే జరిగినది. భక్తులు చింతలో ఉన్నప్పుడు వాళ్ళకు స్ఫూర్తిని కలిగించి, వాళ్ళచేత ఆ మ్రొక్కులను చెల్లింప చేసుకుని, వాళ్ళను ఆ బాధలనుండి విముక్తి చేసేవారన్నమాట. అంటే శిష్యునికి గురువును ఆశ్రయించకుండా ఆ మొక్కులు, నియమాలు (వారు ఆదేశిస్తే తప్ప) తీర్చుకోకుండా ఉపశాంతి లేదని కూడా మనం అర్థంచేసుకోవచ్చు. ఆమె ఇలా చేయించినటువంటి ప్రక్రియలను చూసినప్పుడు ఆమె 'అనుగ్రహము'లను విశదీకరించి చూసినపుడు మాత్రమే ఆమె ఎవరో, ఏవిధంగా అనుగ్రహించారో అర్థమవుతుంది మనకు.

అలాగే మన పాపపుణ్యాలతోగానీ, వాటి ఫలితాలుగానీ భగవంతుడికి ప్రమేయం ఉండవు గదా! అందుకనే మనం శనికి రోజూ కొన్నివందల టన్నుల నూనెతో చేసినాగానీ అవేమీ ఆయనకు అంటవు. ఆయనకు అభిషేకం చేసిన పుణ్యం మనకు దక్కుతుంది. మన పాపఫలాలను మాత్రం ఆ నూనె రూపంలో గ్రహించి వాటిని రూపుమాపుతారని తెలుస్తోంది. అలాగే కమలమ్మగారు దుర్గాంబగారితో నూనె అభిషేకం చేయించుకున్నా ఆమె శరీరానికి గానీ, ఆ చుట్టుప్రక్కలఉన్న నేలకుగానీ చుక్కకూడా జిడ్డు అంటలేదు. అంటే అర్థం ఏమిటి? ఆమెకు పోగొట్టవలసిన గండం తాలూకు చెడును తైలాభిషేకం రూపంలో గ్రహించి, ఆమెకున్న చెడును తీసివేసి, ఇంక నీకేం ఫర్వాలేదు అని అభయమిచ్చారు. 'గ్రహించారు' అనటానికి నిదర్శనమే ఆ 'జిడ్డు' అంటకపోవడం.

**24.05.2003**

ఒకసారి హరి దుర్గాంబగారికి సుస్తీ చేసి 21 రోజులు ఆసుపత్రిలో ఉన్నారు. అప్పుడు అమ్మమ్మగారు ఊర్లో లేరు. త్రిపురాంబగారు ఒక నిమ్మకాయ ఇచ్చి తలకింద పెట్టుకుని పడుకోమని చెప్పారు. దుర్గాంబగారికి ఆ 21 రోజులూ అమ్మమ్మగారు త్రిశూలం పట్టుకుని మంచం చుట్టూ తిరుగుతున్నట్లుగా కనిపించారు. ఆమెను ఇంటికి తీసుకువచ్చాక, వారి అమ్మగారికి అమ్మమ్మగారు కలలో కనబడి "నేను 21 రోజులు ఆసుపత్రిలో ఉన్నాను. దేహం మైలపడింది. కావున నాకు 108 బిందెలు కాశీగంగతో స్నానం చేయించమని దుర్గాంబకు చెప్పు. 108 బిందెలు కాశీగంగ

తేవడం ఎలా అనుకుంటుందేమో! దుర్గాంబ అల్మరాలో ఒక సీసాలో కాశీగంగ ఉంచింది. అవి పంచపాత్రలోనికి తీసుకుని ఉద్ధరిణితో 108సార్లు పోయమను" అని చెప్పారు. ఆ తరువాత ఒకరోజు ఆమె ఇంటికి వెళ్ళి, పిలిచి, ఆమె చెప్పినట్లుగా చేశారు. "ఇకనుండి నీకు నలత ఉండదు. ఆరోగ్యం చేకూరుతుంది. ఇంకేం ఫర్వాలేదు" అని శలవిచ్చారు. అలా ఆ గండం నుండి ఆవిడ బయటపడ్డారు.

దీన్నిబట్టి చూస్తే మనకు ఏం అర్థమవుతోందంటే భౌతికంగా ఆమె ఇక్కడ లేకపోయినా సరే (పీఠంలోనుండి త్రిపురాంబగారు నిమ్మకాయ ఇవ్వడం) కమలమ్మగారి సమక్షం మనకు దక్కుతుంది అనటానికి నిదర్శనగా దుర్గాంబగారికి మంచం చూట్టూ త్రిశూలంతో అమ్మవారు తిరుగుతున్నట్లుగా 21 రోజులూ కనిపించడం. అంటే కమలమ్మగారు గండం నుండి ఎలా తప్పించారో ఈమె చూడగలిగారు. ఆమె అక్కడున్నట్లే గ్రహించగలిగారు. నిజానికి ఆమె అప్పుడు ఆ ఊర్లోనే లేరు. ఈమె ఇంటికి వచ్చిన తర్వాత ఈమె తల్లిగారికి కనబడి నేను ఆసుపత్రిలోనే ఉన్నాను అంటూ నిర్ధారించి ఏం చేయాలో శెలవిచ్చారు. ఈ విషయం దుర్గాంబగారికి కనబడి చెప్పవచ్చును కదా! ఆమె తల్లికే ఎందుకు చెప్పడం? అంటే దుర్గాంబగారికి ప్రత్యక్షంగా దర్శనం ఇస్తున్నారు. ఆమెకు ధైర్యంగానే ఉన్నది. అదే విషయం కూతురు తల్లితో చెప్తే ఆమె నమ్మవచ్చు, నమ్మకపోవచ్చు. అందుకనే కమలమ్మగారు ఆ నిజాన్ని నిర్ధారిస్తూ, ఏం చేయాలో తల్లికి చెప్పి, ఆమెకు కూడా నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. **108 బిందెల కాశీగంగను 108 ఉద్ధరిణులుగా సరిపెట్టారు**. పైగా, దుర్గాంబగారు గంగను ఎక్కడ దాచిపెట్టారో కూడా చెప్పారు. ఇవన్నీ ఈమెకు నమ్మకం కలిగించడం కోసమేనని మన అర్థంచేసుకోవచ్చు. ఈ విధంగా కమలమ్మగారు భక్తులకు దూరంగా ఉన్నప్పుడు కూడా దగ్గరే ఉన్నానని నిదర్శనములను కలిగించడం, దగ్గరే ఉన్నప్పుడు వాళ్ళచేత ఏం చేయించాలో, చేయించుకోవాలో అవన్నీ ప్రత్యక్షంగా జరిపించడం – ఇవన్నీ చూస్తే ఆమె లీలలు మనం అర్థం చేసుకోవడం చాలా కష్టమనిపిస్తుంది. కానీ భక్తులమైనప్పుడు ఎంతో కొంత ఆమె చర్యలను గమనించే ప్రయత్నం చేయాలనిపించి, చేసిన ఈ చిన్న ప్రయత్నం కొంతవరకైనా మనం అర్థం చేసుకోవచ్చునని నా అభిప్రాయం. రామచింతన ఎలా చేసినా పుణ్యమే గానీ తెలుసుకుని రామచింతన చేయాలని త్యాగరాజస్వామి వారు చెప్పారు కదా! మనం కూడా ఆ బాటలో నడిచే ప్రయత్నం చేద్దాము.

హరి దుర్గాంబ గారింట్లో కమలమ్మగారు ప్రతిరోజూ, స్నానానికి వెళ్ళడం, కొన్ని పర్వదినాల్లో అభ్యంగన స్నానం చేయడం, ఆమెచేత తైలాభిషేకం మరియు కాశీగంగలో స్నానమాచరించడం, ఇవన్నీ చూస్తే అమ్మవారికి స్వయంగా ఇవన్నీ చేసినటువంటి అదృష్టం ఆమెకే దక్కింది. అంత అదృష్టవంతురాలు గనుకనే ప్రతీ మంగళవారం ఆమెకు భోజనం వండి (ప్రత్యక్షంగా) పెట్టగలిగింది. పుణ్యాత్మురాలు కనుకనే ఆమెకు ఇంత అదృష్టం కలుగజేశారామె. చివరకు అమ్మమ్మగారు ఇవన్నీ ఆచరించినటువంటి ఇల్లును (ఆమెకే) ఆశ్రమం కోసం ఇవ్వగలిగారంటే, ఈమె దాన్ని గ్రహించారంటే, గురుశిష్యుల సంబంధాన్ని మనం అర్థంచేసుకోవాలి. ఆ

ప్రేమతత్వమును, ఆచరాణత్మకమును శిష్యులైనవాళ్ళు తప్పక గ్రహించి, ఆచరించవలసినటువంటి విషయాలు. ఆమె ఆఖరిసారిగా మంగళవారం (డిసెంబర్ 13, 1977) రాత్రి గం.8.30లకు ఆ ఇంట్లో భోజనం చేసి, గం.10.30లకు కమలాంబికా ముక్తిధామం లోనే ముక్తిని పొంది ఆ పేరును సార్థకం చేసుకున్నారు. **ఆమె భోజనం చేసిన (Last Supper) ఆ గృహమే ఈరోజు మనం భోజనం చేస్తున్న, నిద్రిస్తున్న, ప్రార్థిస్తున్న ఆలయం - ధ్యానమందిరం.** వారి మనస్సెంత గొప్పదైతే అమ్మమ్మగారు దాన్ని స్వీకరించి, వారిని తద్వారా మనల్ని కూడా అనుగ్రహిస్తారు. ఇలా భక్తుల అనుభవాలను విశ్లేషించడం వలన మనకు ఎన్నో సూక్ష్మాతిసూక్ష్మమైన విషయాలు బోధపడతాయని తెలుస్తోంది.

**25.06.2003**

ఈరోజు ఉదయం జిమ్‌కు వెళ్ళాను. అందరం కలిసి షాపింగ్‌కి దాదర్ (ముంబై) వెళ్దామనుకున్నాము. వచ్చేటప్పుడు, శోభ “మీ కొత్త చెప్పులు ఎక్కడ కొన్నారు? ఎంత?” అని అడిగింది. “రూ.100లు” అని చెప్పాను. “మీకు అన్నీ రూ.100లకే దొరుకుతాయే? మీ స్టాండర్డ్ రేటా?” అన్నది. “నేను రూ.100లకి ఇంకేం కొన్నాను?” అనడిగాను. “మీ డ్రెస్ కూడా రూ.100లకేగా” అంది. ఈలోపు ఉమ “రూ.100 డ్రెస్‌కోసం రూ.100లు ఖర్చుపెట్టుకుని వెళ్తున్నాం” అన్నది. “మీరు రూ.100ల డ్రెస్‌లెందుకు? రూ.200లవి చూడండి” అన్నాను. ఇంటికి రాగానే ఆలోచిస్తూ ఉన్నాను. మీరన్నీ రూ.100లకే కొంటారు అన్నమాట నన్నెందుకో చాలా బాధపెట్టింది. అప్పుడు ఉమతో “నేను రేపు షాపింగ్‌కు దాదర్ రాను. శోభ అన్నమాటలకి నేను బాధపడ్డాను. నువ్వు కూడా రూ.100ల కోసం రూ.100లు ఖర్చుపెడుతున్నాం అన్నావు కదా” అనడిగాను. “నేను ఆడవాళ్ళ మనస్తత్వం గురించి అన్నాను. మిమ్మల్ని బాధపెట్టాలని కాదు” అన్నది. వెంటనే సారీ చెప్పాను.

శోభ అన్న వెంటనే తను ఇలా అనడం, నేను ఈ విషయాన్ని అనవసరంగా ఉమవద్ద తీసుకువచ్చి శోభ అన్న మాటలను చాలా సీరియస్‌గా తీసుకుని అనవసరంగా ఉద్రేకపడి, పెద్దగొంతుతో మాట్లాడాను. కాసేపటికి సర్దుకుని ఈ పేజి వ్రాస్తున్నాను. ఒకవేళ బాధపడే విషయమే జరిగిందనుకో. అంతలా నేనెందుకు రియాక్ట్ అయ్యాను. అస్సలు ఏ విషయం పట్టించుకోనిదాన్ని. ఈ విషయాన్ని ఎందుకు (బాధపడితే మాత్రం) అంత సీరియస్‌గా తీసుకోవాలి. ఎందుకు బయటపెట్టాలి? నా మనసు ఎందుకింత వీక్‌గా అవుతోంది? ఇలాంటి పరిస్థితులు మామూలు మనుష్యుల మధ్య కూడా రావు. అలాంటిది నేను ఇంత చిన్న విషయాన్ని ఇలా డీల్ చేయడం ఎంత హాస్యాస్పదం? ఏమైంది నాకు? అర్థంకావడం లేదు. నేను 10 మందికి సలహాలిచ్చేదాన్ని. బాధపడితే ఎలా ప్రవర్తించాలో సరిదిద్దేదాన్ని, ఇలా బయటపడటం ఏమిటి? మళ్ళీ సారీ చెప్పడం ఏమిటి? నాకర్థం కావడం లేదు. ఏదో ఒకమాట అనేసి ఊరుకుంటే పోయేది. దీన్నింత పెద్దది చేయడం తగదు. ‘సాధన’ అనేది ఒకొక్కసారి ఎంత చిత్రంగా ఒక

చిన్న గీత తేడాతో ఎలా దిగజారిపోతుంది? మనసు ఎంత చంచలమైనది? పైమెట్టు మీద నుండి ఎప్పుడు, ఏ క్షణంలోనైనా దిగజార్చేస్తుందనటానికి నిదర్శనం ఇది. వాసనలు, కోపం, అసూయ, ద్వేషం అరికట్టుకోవాలనే సాధకుడికి కూడా క్షణంలో జారిపోవడం ఎంత తేలిక? బుద్ధి దాని పూర్వగణములను ఎంత వేగంగా బయట పడేస్తుంది? బుద్ధిని, మనస్సుని అరికట్టాలంటే మనిషి తెలుసుకోవాల్సినది ఒకటి ఉంటుంది. అవి రెండూ పెద్ద త్రాచుపాములాగా లోపల చుట్టుకుని పడుకుని ఉంటుంది. లోపల ఉన్నది త్రాచుఅని మనం తెలుసుకుని మెలగాలి. అది ఎప్పుడైనా, ఎలా ఉన్నా బుసకొడుతుంది. దాని గుణం అది. అలాగే సాధకుడు ఈ విషయాన్ని గమనించి సాధన చేస్తే చాలా తేలికగా ఉంటుంది. బుసకొట్టడం దాని సహజగుణం. వెంటనే సాధకుడు పట్టా తప్పుతాడు. తప్పడానికి పెద్ద కారణం కూడా అవసరం లేదు. ఇదే ఉదాహరణ. **కోపాన్ని నియంత్రించుకోవడం, విషయాన్ని వదిలేయడం అనేవి ఎంత కష్టం. సాధన చేయడానికి పెద్ద విషయం అక్కర్లేదు. ఇలాంటి ఒక చిన్నవిషయం చాలు.**

నేను నా చుట్టూ ఉన్న మనుషుల మధ్య తిరుగుతున్నప్పుడు ఎప్పుడూ ఒప్పు చేయడమే (మనుష్యుల్ని) పనిగా ఉండి మసలుతుండడంతో, నేనిలాంటి చిన్న చిన్న విషయాలను ఎదుర్కోవలసిన అవసరం రాలేదు నాకు. పరిధి నుండి బయటకు వచ్చి మనుష్యులతో కలుస్తున్నప్పుడు ఇంత సున్నితత్వం ఉన్నట్లు తెలిసింది. మొత్తానికి నేను కూడా ఒక సాధకురాలిగా మారి, సాధన చేయాల్సి వచ్చే అవకాశం వచ్చినపుడు, నా సాధన ఎంత ఉన్నదో అర్థమైంది. మొత్తానికి ఈ పరీక్ష తప్పాను. కాబట్టి సాధన అనేది ఎప్పుడైనా, ఎవరికైనా, ఏ నిమిషంలోనైనా ఎంత ముఖ్యమో, ఎంత కష్టమో తెలుసుకుని ప్రవర్తించాలని అర్థమైంది.

**18.08.2003**

శ్రీమతి లక్ష్మి ఉదయచంద్రిక (కోమలవల్లిగారి ప్రథమ పుత్రిక), తమ మూడవ కుమార్తె (11.8.75) పుట్టిన 21వ రోజున తీసుకుని అమ్మమ్మగారింటికి వెళ్ళారు. ఆ పిల్ల ఎడమచేతి ఉంగరపు వేలికి 'కణుపు' లేకుండా మడిచి ఉన్నది. డాక్టరు ఆ చంటిపిల్ల చేతికి ఆపరేషన్ చేయాలని చెప్పారు. అదే విషయం వారు అమ్మమ్మగారికి చెప్పారు. వెంటనే ఆమె 'ఈ పిల్లకు పేరు ఏం పెట్టారు?' అనడిగారు. 'రోజా' అని చెప్పారు. ఈ రోజునుండీ ఆ పిల్లపేరు 'లక్ష్మీసరోజ' అంటూ, ఈ వేలిని ఆమె చేతితో సవరిస్తూ 'ఏమైందే వేలికి?' అన్నారు. అంతే, ఆ తర్వాత నుండీ ఆ వేలు సరిగ్గా నిలబడి ఆపరేషన్ అవసరం లేకుండా చక్కబడింది. ఇది ఆమె అనుభవం.

ఈ అనుభవాన్ని విశదీకరించి చూస్తే, మొదట కమలమ్మగారు పిల్లకు లక్ష్మీసరోజ అని పేరుపెట్టారు. ముందు రోజా అని వాళ్ళే పెట్టుకున్నారు. ఈమె 'లక్ష్మి స' అనే మూడు అక్షరాలు కలిపారు. 'లక్ష్మి' అంటే కమల, 'స' అంటే కూడినది అని అర్థం. కమలాంబికతో కూడిన రోజా, లేదా 'సరోజ' అని తీసుకున్నా కమలమే. ఏవిధంగా చూసినా ఆమె తన పేరునే ఆ పిల్లకు కలిపారని అర్థమౌతున్నది. అంటే ఆమె పేరు పెట్టడంవల్ల, వాళ్ళు రోజూ ఆ పేరు పిలవడంవల్ల,

‘గురునామజపం’ ఎక్కువ చేయడం జరుగుతోంది. ఆ విధంగా అమ్మవారు వాళ్ళింట్లో ప్రవేశించడం జరుగుతుంది. ఆ పిల్లకు ఉన్న గ్రహస్థితిని పోగొట్టడం కోసం మొదటపేరు పెట్టి, ఆ సంకల్పం చేస్తూ వేలిని సరిచేశారు. ఇక్కడ అమ్మవారు ‘త్వక్స్థా’ (లలితా సహస్రనామం) కూడా అవడం వలన చర్మమును ఆవరించి ఉన్న ‘ధాతువు’ ఆవిడే కనుక, వేలిని చేతితో తాకడం ద్వారా వెంటనే వేలు ‘కణుపు’ను సరిచేయగలిగారని అర్థమౌతున్నది. లేదంటే, ఆ 21 రోజుల పిల్లకు ఆపరేషన్ చేయడం ద్వారా ఏడవవలసిన బాధను, ఆ జీవి కర్మను, ఆ పేరు పెట్టడం ద్వారా పోగొట్టారని మనకు అర్థమవుతున్నది. పేరు పెట్టడంలో ఇంత అర్థం ఉంటుందని, కర్మలను పోగొట్టే ప్రక్రియలలో ఇది కూడా ఒకటని మనకు తెలుస్తున్నది. ఈవిధంగా కమలమ్మగారు, తనని ఆశ్రయించడం ద్వారా ఎంత పెద్ద సమస్యలైనా ఎంత సులభంగా తొలగించబడతాయో చూపారు. ఆ శ్రమ ఏదో వాళ్ళే పడతారు. **ఎందుకంటే గురువు అంటే బరువు అని అర్థం. బరువులను వాళ్ళు మోస్తూ, మనకు ఆయాసం లేకుండా చేయడమే వారి పని.**

శ్రీమతి ఉదయచంద్రగారి వేరొక అనుభవం. నవంబర్ 11, 1999న ఈమెకు కల వచ్చింది. కలలో ఏలూరు పీఠంలో పూజలు జరుగుతున్నట్లు, అందులో అందరూ ఉన్నట్లు, తను మాత్రం లేనట్లు కనపడింది. కలలో అమ్మమ్మగారు, “నేను భోజనం చేసి వస్తాను. ఉండు. బొట్టుపెట్టించుకుని వెళ్ళు” అని భార్యాభర్తలిరువురికీ బొట్టుపెట్టినట్లు కనబడింది. ఇదే కల మూడుసార్లు వచ్చింది. ఇది జరిగిన కొద్దిరోజులకే ఆమె భర్తకు హార్ట్ఎటాక్ వచ్చి, కొద్దిపాటి మందులతోనే తగ్గి స్వస్థత చేకూరింది.

అమ్మమ్మగారు బ్రతికి ఉన్న రోజుల్లో, కొంతమందికి కలలో కనబడి “అమ్మవారు చెప్తుంది. ఆ విధంగా చేసుకోండి” అని చెప్పేవారు. ఆ విధంగా కలలో కనబడి కాపాడారని తెలియజెప్పే సంఘటన ఇది. ఆమె కలలో ఆమె పూజలో లేనట్లు కనబడటం, అమ్మమ్మగారు “ఉండు, భోంచేసి వచ్చి బొట్టుపెడ్తా” అని చెప్పి ఆశీర్వదించడం, ఆమె భర్తకు రాబోయే ప్రమాదాన్ని తెలియజేస్తూ, అయినా ఏం ఫర్వాలేదు. వేచి ఉండండి. సమయం ఉంది అని చెప్తున్నట్లుగా భోజనం చేసి వస్తా అని చెప్పడం యొక్క అర్థం. నమ్ముకున్న భక్తులకు ఆమె ఏవిధంగా ముందుగానే కల రూపంతో కన్పించి, రాబోయే ప్రమాదాన్ని సూచిస్తూ, ఆశీర్వదిస్తూ అనుగ్రహించారో అర్థమౌతోంది. అందుకే అంత హార్ట్ ఎటాక్ వచ్చినా, కొద్దిపాటి మందులతోనే తగ్గిపోయి, ఆయన ప్రమాదం నుండి బయటపడడం జరిగింది.

మొదటి ఉదాహరణలో, ఆమె ప్రత్యక్షంగా పిల్లను తాకి సరిచేస్తే, రెండవ ఉదాహరణలో ఆమె కలలో కన్పించి, సూచించి, ఆ విధంగా కాపాడారు. దీన్నిబట్టి చూస్తే, మనం నమ్ముకుంటే చాలు, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, భక్తులను ఆమె ‘రక్షణ’లోకి తీసుకుని కాపాడతారని అర్థమౌతోంది.

**19.08.2003**

నేను క్రిందటి సంవత్సరం దసరా ఉత్సవాల్లో భక్తులందరి చేత గురుమంత్రమును, గురుఅష్టోత్తరమును రోజూ చేయిస్తూ (4 సం॥ల వరకు) పీఠంలో ధారపోయాలని సంకల్పించాను. సంవత్సరం కాకుండానే శ్రీమతి సోమంచి పద్మశ్రీ (తణుకు) గురు అష్టోత్తరమును ఒక లక్షసార్లు అంటే కోటిమంత్రమును చేయడం జరిగింది. సరిగ్గా అదే సమయానికి నేను వరలక్ష్మి వ్రతాన్ని వాళ్ళింట్లో చేసుకోవాలని తణుకు వెళ్ళాను. ఆరోజు వ్రతం పూర్తిచేసుకుని, మరికొన్ని వ్రతాలను కూడా అక్కడున్న వారందరిచేత చేయించాను. ఆ మర్నాడు 'శ్రావణ శనివారం'. మధ్యాహ్నం భోజనంచేసి పద్మశ్రీ వాళ్ళ గదిలో మంచంపైన పడుకుని అందరం కబుర్లు (ఏవో మామూలు విషయాలు) చెప్పుకుంటున్నాము. అప్పటివరకు మాట్లాడుతున్న పద్మశ్రీ అప్పుడే బయటకు వెళ్ళింది. దత్తారావు నిద్రపోతున్నాడు. బుజ్జి ఏదో పనిచేస్తోంది. నేను నిద్రపోలేదు, మెలకువగానే ఉన్నాను. సరిగ్గా అదే సమయంలో **కమలాంబిక అమ్మవారు పద్మాసనంలో కూర్చుని 4 అడుగుల ఎత్తులో పెసరపొట్టురంగు ఆకుపచ్చ చీర (కొత్త నేతచీర) కట్టుకుని, బంగారు గాజులు, గొలుసులు వేసుకుని, ముక్కుకి బేసరి, చెవులకు తెల్లరాళ్ళ దుద్దులు పెట్టుకుని నవ్వుతూ నా తలపక్కనే పద్మాసనంలో కూర్చుని దర్శనం ఇచ్చారు.** వెంటనే నా ఒళ్ళు ఝల్లుమని, ఒక్క ఉదుటన 'పప్పీ' అంటూ లేచాను. అప్పుడు నా గుండెచప్పుడు వేగంగా ఉన్నది. వెన్నులో నొప్పి వచ్చేసింది. ఆ అదురు చాలాసేపటివరకు తగ్గలేదు. కొంచెం పానకం ఇచ్చారు. శివలింగాన్ని చేతిలో పెట్టుకోగానే వెంటనే నిద్రలోకి జారిపోయాను.

'పద్మశ్రీ' కోటిమంత్రము పూర్తిచేయగానే దాన్ని గ్రహించుటకే నేను తణుకు వెళ్ళానేమో అనిపించింది. కోటిమంత్రం (అదే సిద్ధమంత్రం) చేయగానే సిద్ధేశ్వరీ అయిన కమలాంబిక సిద్ధమాతగా దర్శనమివ్వటం నా జన్మ ధన్యమైందిగా భావించాను.

**20.8.2003**

గురువుగారు దేహంతో ప్రత్యక్ష దర్శనమివ్వడం వలన మనం ఆ మంత్రాన్ని సిద్ధమంత్రంగా గ్రహించగలుగుతాం. మంత్రం సిద్ధించినది కనుకనే దేవి ప్రత్యక్ష దర్శనం దక్కింది. అలానే కమలమ్మగారు కూడా మంత్రాన్ని సిద్ధింపచేసుకున్నారు (సాధకురాలిగా). కనుకనే ఆమె సిద్ధమాత అయ్యారు. సిద్ధమాత సిద్ధమంత్రాన్ని చేయటం వలన ఆమె "సిద్ధేశ్వరీ"గా రూపొందారు (కపాలమోక్షం). తర్వాత ఆమే "సిద్ధేశ్వరీ" అయ్యారు.

ఇక్కడ పద్మశ్రీ, సిద్ధమాత యొక్క మంత్రాన్ని కోటిసార్లు జపించి, గురుపీఠములో ధారపోయుటకు సంకల్పించుటచే, సిద్ధేశ్వరీ లేక కమలాంబికా రూపదర్శనం, సిద్ధమంత్రాన్ని జపించిన స్థానంలో గురువు రూపంలో (సిద్ధమాత) వచ్చి, సిద్ధేశ్వరీ దర్శనమివ్వడం జరిగింది.

***సిద్ధమంత్రం*** – *ఓం శ్రీ కమలాంబిక*

***సిద్ధమాత*** – *కమలమ్మగారు (భౌతికంగా)*

**సిద్ధేశ్వరీ** - కపాలమోక్షం జరిగిన పిమ్మట సూక్ష్మరూపం

ఇక్కడ పద్మశ్రీ చేసినది నిస్వార్థమైన సేవ (జపం) కనుకనే దాని శక్తి అన్నిరెట్లు పెరిగినది. ఆ శక్తిని భౌతికంగా మనం కొలవలేము. అది దర్శనం దొరికేంత వరకూ చేయడమైనది. వెంటనే అనుగ్రహం దొరకడం జరిగింది. **ఈ యుగంలో నామపారాయణ చేస్తే చాలు- అదే ముక్తి అని (పెద్దలు, శాస్త్రము) చెప్తున్నారు.** దానికి ఇది ఒక ఉదాహరణ లేక ప్రత్యక్ష నిదర్శమని చెప్పవచ్చును. ఇవన్నీ పూర్వపుణ్య ఫలములే తప్ప మరేవీ కావు.

అయితే, ఆ ప్రత్యక్ష దర్శనం పద్మశ్రీకే కలగవచ్చు కదా! అనే ప్రశ్న ఒకటి ఉదయిస్తుంది మనకు. దాని వివరణ తన గురువు, రత్నబాల రూపంలో తన వద్దకు వచ్చి, తనచేత చేయించుకోవాల్సినవన్నీ చేయించుకుని, తన చేయాల్సినవన్నీ చేసి, గురువు ప్రత్యక్ష దర్శనం ఇచ్చి, తన దీక్ష పరిపూర్ణమైందని చెప్పాలంటే అక్కడ పరమగురువు దర్శనం జరిగితే తప్ప సంపూర్ణం కాదు. అదీకాక తనకే ఆమె ప్రత్యక్ష దర్శనమిచ్చే అవకాశం ఉండదు. ఎందుకంటే గ్రహించవలసింది పీఠానికి. కనుక మధ్యలో తన గురువు మాత్రమే దానిని నిర్ధారించటం జరుగుతుంది. గురువుకు దర్శనమివ్వడం వలన మాత్రమే అది గ్రహించబడిందనే నిర్ధారణ మనకు తెలియచేబడుతోంది. లేకపోతే ఆ విషయాన్ని మనకు మనం తెల్సుకోలేము. అది తెలియజేసే విధానం కూడా కాదు. మన గురువుకు కనబడడంవలన మంత్రం సిద్ధించబడిందని, గురువాక్యం ద్వారా తెలియజేయబడింది.

**రత్నబాల అనే గురువు భగవంతునికీ, భక్తునికీ ఒక అనుసంధాన కర్తగా మారారు.** అష్టసిద్ధుల్ని (గరిమ, అణిమ...) ప్రసాదించేది ఆమే కనుక 'సిద్ధమాత' అయింది. సిద్ధమంత్రాన్ని సిద్ధించటం వలన అక్కడ భగవత్సాక్షాత్కారం జరిగింది.

**21.08.2003**

ఒక భక్తురాలు బిడ్డకు ప్రాణాపాయస్థితిలో ఉండగా, పీఠం వద్దకు వచ్చి, గండం గడిస్తే వెండి పూలసజ్జ చేయిస్తానని మొక్కుకుంది. ఆరోగ్యం కుదుటపడ్డాక పెద్ద పూలసజ్జ కూడా కొన్నది. కానీ ఇచ్చేటప్పుడు లోభంతో చిన్నసజ్జ చాలదా అనుకుని పెద్ద పూలసజ్జను ఇనుపపెట్టెలో దాచింది. ఆ రాత్రి ఆమెకు, అమ్మవారు కలలో కనిపించి 'పూలసజ్జ ఇనప పెట్టెలో దాచావా! నా వస్తువు నా దగ్గరకే చేరుతుంది' అని చెప్పింది. ఆవిడ భయపడి, మర్నాడు దాన్ని తెచ్చి కమలమ్మగారికి ఇచ్చింది. కమలమ్మగారు "ఇంత పెద్దది ఎందుకు తెచ్చావమ్మా? చిన్నది తెస్తే సరిపోయేది కదా" అన్నారట. దానికి ఆమె జరిగింది చెప్పిందట. కమలమ్మగారు విని నవ్వి ఊరుకున్నారట.

సాధారణంగా భక్తులందరిలోనూ ఇటువంటి 'లోభతత్వం' తలెత్తడం సహజంగా జరుగుతూనే ఉంటుంది. అపాయ పరిస్థితుల్లో గబగబా మొక్కుతుంటారు. అపాయం దాటిపోగానే ఆ మొక్కు యొక్క తీవ్రత తగ్గుతుంది. అయినా అమ్మవారు వచ్చి అడగరు కదా! ఏది సమర్పించినా మన

ఆత్మతృప్తి కోసమే కదా అనిఅనుకుని మొక్కులు తమ పద్ధతిలోనే తీరుస్తుంటారు. పై అనుభవాన్ని పరిశీలించినట్లైతే, మనం ఏది మొక్కుతామో అదే మనచేత అమ్మవారు తీర్పించుకుంటుంది. ఆ మొక్కు తీర్చడంలో ఏదైనా కొద్దిగా మనస్సులో ఊగిసలాట కన్పిస్తే, మనచేత తీర్పించడాన్ని వాయిదావేసైనా సరే, అలాగే తీర్పిస్తారు తప్ప మరొకలాగ జరగదు. లేదా మనసులో శంక తగ్గేవరకు ఆమె ఆగుతుంది. మొత్తానికి మనస్సులో అనుమానరహితం చేసి కానీ, ఆమె దాన్ని గ్రహించదు. ఎందుకంటే, మొక్కుకంటే ఆమెకు మనసు కదా ముఖ్యం. అయినా ఒకసారి మనం మొక్కామంటే ఇంక ఆ వస్తువు అమ్మవారిదే కదా! అది ఏదైనా కానీ, ఆమెది ఆమె తప్పక గ్రహిస్తుంది. మనం మనస్ఫూర్తిగా సమర్పించేలాగా చేయటానికి ఆమె ఏవిధానాన్నైనా అనుసరించవచ్చును అని మనకు అర్థమౌతోంది. అందుకే భక్తురాల్ని "ఇంత పెద్దది ఎందుకమ్మా?" అని ప్రశ్నించింది. మనసు ఆమెకు తెలుసు కదా! ఏమీ తెలుసుకోలేని శిష్యురాలు కలలో జరిగిన విషయాన్ని విశదీకరించింది. దానికి ఆమె నవ్వారు. అంటే కలరూపంలో మనస్సులోని లోభత్వాన్ని సవరిస్తూ, "నీ వస్తువు నా దగ్గరకు చేరుతుంది" అన్నారు. ఇక్కడ మనందరం గ్రహించాల్సిన విషయమేమంటే... **మొక్కులు చెల్లించడం మరిచిపోయినా, వాయిదాలు అవుతాయే తప్ప, తీర్చక తప్పదు.** ఎలా తీర్చేలా చేయాలో ఆమెకే తెలుసు. ఒకసారి ఆమెది అన్నాక, ఇంక అవి ఆమెదే అని మనం గ్రహించుకోవాలి. మనస్ఫూర్తిగా ఇస్తే వెంటనే గ్రహించబడతాయి అని కూడా అర్థంచేసుకోవాలి. **మొక్కు – అంటే భగవంతుడు మనకు దానగుణాన్ని అలవాటు చేసే ఒక ప్రక్రియ. ఆ దానం లోభత్వంగానీ, సంకోచంగానీ, అలక్ష్యంగానీ లేకుండా, స్వచ్ఛంగా సమర్పించడం ఎలాగో మొక్కులు మొక్కుకోవడం ద్వారా నేర్పుతున్నాడని తెలుస్తోంది.** ఇలాంటి వాటినే వాళ్ళు గ్రహిస్తారని కూడా అర్థమౌతోంది. అలా చేయగలిగినప్పుడే వాటి తాలూకు నిజమైన ఫలితాలు కూడా మనకు ఇవ్వబడతాయి. మనోనిర్మలతకు ఇది ఒక సాధనంగా ఉపయోగపడుతుందని అర్థం చేసుకోవచ్చు. "భౌతికంగానైనా మనం ఎవరికైనా ఇచ్చేవి కుంటివి, గుడ్డివి ఇవ్వకూడదు. ఇస్తే మంచివే ఇవ్వాలి. లేకపోతే మంచి పిల్లలు పుట్టరు. లేదా మంచి భర్త దొరకడు" అని అంటుంటారు. మరి దేవునికి సమర్పించేవి ఎలా ఉండాలంటే... "మనస్ఫూర్తిగా" ఇవ్వాలి అనేది ఇక్కడ మనం నేర్చుకోవాలి.

శ్రీ దేవగుప్తాపు మల్లపురాజు, కనకమహాలక్ష్మిగార్ల అనుభవాన్ని విశదీకరిస్తే, ఆమెకు గర్భంకాదని 'బల్ల' అని ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. అమ్మమ్మగారు, "కాదు, 18 నెలలు మోసి ఆడపిల్లను కంటుందని, ఆమెకు 'బాలాత్రిపురసుందరి' అని పేరు పెట్టమని" చెప్పారు. అలాగే జరిగింది. ఆ తర్వాత వారు అమ్మవారికి ఒక వెండి విగ్రహాన్ని సమర్పించాలి అనుకుని ఒక కంసాలివద్దకు వెళ్ళేసరికి, ఆ కంసాలి– ఈ కమలమ్మగారి కోసమే ఎదురు చూస్తున్నానని, ఆమెకు తనకు ఆమె కలలో కనబడి బాలాత్రిపురసుందరినని, వెండితో శాస్త్రోక్తంగా తన విగ్రహం చేయమని, ఫలానా రోజున వస్తానని చెప్పిందని, ఈమె సాక్షాత్తు అమ్మవారని అంటూ వాళ్ళకు నమస్కరించి, విగ్రహాన్ని సమర్పించాడు.

ఇక్కడ అమ్మమ్మగారే ఏదో విగ్రహాన్ని చేయించిపెట్టి త్రిపురసుందరీ ప్రతిష్ట అని మనకు చూపించవచ్చు గదా! ఆ విగ్రహ ప్రతిష్టకు ఎంత కథ జరిగిందో చూడండి! ఇక్కడ కనకమహాలక్ష్మి గారు 18 నెలలు గర్భం మోయడం లోకవిరుద్ధం. 9 నెలలు కాక మరో 9 నెలలు మోయడం అంటేనే అది సహజమైన పద్ధతి కాదని, భగవత్ ప్రేరణ అని అర్థమౌతోంది. వాళ్ళని ఏదో మిషతో తనవద్దకు రప్పించుకుని, వారికి వారివారి పుణ్యఫలితాలను ప్రసాదించే విధానం ఇది. బిడ్డను ఇచ్చి, విగ్రహాన్ని పీఠంలో ప్రతిష్టకోసం వారి వద్దనుండి గ్రహించడం ఎంత పుణ్యం చేసుకుంటే వారికి ఈ అనుగ్రహం కలిగిందో ఊహించలేము. విగ్రహం చేయించాలనే సంకల్పం వారికి కలుగచేయడం... పోనీ వారికి తనే అమ్మవారి అంశం అని ప్రత్యక్షంగా తెలియజేయవచ్చు కదా! ఆ కంసాలికి, కలలో కనబడి విగ్రహాన్ని తయారు చేయించడమే కాక, తనే బాలాత్రిపురసుందరినని 'కంసాలి'కి తెలియజేయడం పరిశీలిస్తే ఆ కంసాలి పుణ్యం వేరు, యోగం వేరు. అందువలన అక్కడ అనుగ్రహం వేరు. ఆ విగ్రహం చేయించుకుని అతని ద్వారా ఆమే బాలాత్రిపురసుందరి అని కనకమ్మగారికి పరోక్షంగా తెలియజేయడం. వారికి బిడ్డను ఇచ్చి విగ్రహం గ్రహించాలి. ఇక్కడ కంసాలి కూడా భక్తుడవ్వడం వలన, దర్శనమిచ్చి తనకు కావలసినట్లుగా విగ్రహం చేయించుకోవాలి. ఇద్దరికీ పని విభజించబడినది. ఇద్దరు పుణ్యజీవులచేత ఈ పని చేయించి విగ్రహ ప్రతిష్టను చేయాలి. ఆవిడే స్వయంగా చేసి ప్రతిష్టించవచ్చు కదా అని పైన అనుకున్నాము కదా! అలా చేయరు. ఎందుకంటే, విగ్రహ ప్రతిష్ట లోకకళ్యాణంకోసమైతే, వాళ్ళు స్వయంగా చేయాల్సిన పని ఏముంది? సుకృతజీవులను అనుగ్రహించి, వారిచేత కొన్ని పనులు చేయించి, వాటిని గ్రహించి, తద్వారా ఈ జన్మలో మరింత పుణ్యంచేసుకునే అవకాశాన్ని ఇచ్చి, కాపాడటమే గురువుల పనిగా మనకు ఈ అనుభవంలో తెలుస్తోంది. వారు గ్రహించడంలో ఇంత గూడార్థం ఉందన్నమాట. ఇక్కడ స్వయంగా ఆమే బాలాత్రిపురసుందరిననే విషయాన్ని కంసాలికి కలలో కనబడి తెలియజేసి అతనిచేత నమస్కారం చేయించుకోవడం- గ్రహిస్తే ఆ ప్రతిష్టించిన విగ్రహానికి కమలమ్మగారికి బేధం లేదని అర్థమౌతోంది. **తెలుసుకోగలిగినవాళ్ళకు కమలమ్మగారే త్రిపురసుందరి. తెలియనివాళ్ళకు ఆమె కమలమ్మ (గురువు)గారు** అని నొక్కిచెప్తున్నట్లుగా ఉన్నది కదా! నిస్వార్థమైన భగవత్‌సేవ చేయడానికి భగవంతుడే అవకాశం ఇచ్చి చేయిస్తే తప్ప, మనం చేస్తే మాత్రం భగవంతుడు గ్రహించాలి కదా!?

**22.08.2003**

కమలమ్మగారు, తమ భర్త పరమపదించినప్పుడు కృంగిపోక, "నేను 5 సం॥లు వైధవ్యాన్ని అనుభవించాల్సి ఉందని" అని ముందుగానే శిష్యులకు చెప్పారామె. సంప్రదాయాలను పాటించాల్సి వచ్చినపుడు, శిష్యులు వద్దని నిరాకరిస్తే, "ఎంత అమాయకులు, సనాతనహైందవ సంప్రదాయాలు సమాజశ్రేయస్సుకోసం నిర్ణయించబడ్డాయి. వాటిని ఉల్లంఘిస్తే అందరూ సంప్రదాయాలను వదిలేస్తారు. కర్మానుభవం తప్పదు. ఇకనుండీ...

**"సంస్కారమే - నాకు కుంకుమ**
**భక్తుల సంక్షేమమో - పసుపు, పారాణి**
**మాతృత్వమే - తాళి"**

అంటూ సంప్రదాయాలను పాటించి చూపించారు. దీని వివరణ– 'వైధవ్యం' అంటే ఏమిటో కమలమ్మగారు శిష్యులకు వివరించి చెప్పారు. ఆమె కూడా సమాజానికి కట్టుబడి ఉండాలని, భయపడాలని, ఎదిరించరాదని నొక్కి చెప్పారు కదా! **అమ్మవారు నిత్యసుమంగళి కదా!** మరి వైధవ్యం ఏమిటి? అని పరిశీలిస్తే – లోకం దృష్టిలో కనిపించే వైధవ్యం అంటే– పసుపు, బొట్టు ధరించకపోవడం. అయితే బొట్టు, పసుపు, పారాణి, తాళిలకు వేరే అర్థాలున్నాయని అమ్మమ్మగారు మనకు కూడా తెలియజేశారు. అంటే అమ్మవారు ధరించే ఈ మంగళకరమైన ఆభరణాల వెనుక ఇంత అర్థముందన్నమాట. మనం లౌకికంగా తీసుకునే ఈ అర్థాలు కావని ముందు మనం గ్రహించాలి. ఇక్కడ సంస్కారం అంటే సంఘనియమాలను ఉల్లంఘించకుండా ఉండడం, సంప్రదాయాలను పాటించడం అనేవి ఆమె జీవితాంతం పాటించి మనకు చూపించారు ఉదాహరణగా. అది ఆమె తిలకం.

పసుపు, పారాణి - ఆమె ఎందుకు ధరించాలంటే దాని వెనుక అర్థం ఇది - భక్తులను కాపాడడం, వారి సంక్షేమం కోసం, ఆమె జీవితాంతం వారికి సేవలు చేశారు. 70 సం॥ల వయస్సులో కూడా, ఓపిక లేకపోయినా, శిష్యుల ఇళ్ళకు వెళ్ళి వారిని అనుగ్రహించి, ఆనందాన్ని కలిగించేవారు (అప్పుడు త్రిపురం పిన్నిగారు కూడా బయటకు వెళ్ళవద్దనేవారు. కానీ ఆమె దానిని లెక్కచేసేవారు కాదు)

**మాతృత్వమే తాళి -** ఆమెను అందరూ పిన్నిగారని, అమ్మమ్మగారని, దేవీగారని, పూజ మామ్మగారని పిలిచేవారు. ఆ పిలుపులోనే ఉన్నది ఆమె మాతృత్వపు ప్రేమ. ఆమె పిల్లలు, పెద్దలందరితోనూ కలసిమెలసి తిరుగుతూ అందరినీ పిల్లల్లాగా ప్రేమించడమే ఆమె మాతృత్వానికి నిదర్శనం. అటువంటిదాన్ని 'తాళి'వలె ఆమె ధరించేవారు.

ఈ మూడింటినీ ఆమె జీవితమంతా పాటించినపుడు ఇంక భౌతికమైన తిలకం, పసుపు, తాళితో ఆమెకు పని ఏమిటి? ఈ వైధవ్యానికి అర్థమేమిటి? ఇవన్నీ సమాజ ధర్మములను పాటించడం కొరకే అని అర్థమౌతోంది. నిత్యమైన, మోక్షమార్గములైన ఆ సాధనలు చేయడమే ఆమె అలౌకిక సాధనలు. మనకు కన్పించే వైధవ్యం భౌతికం (అజ్ఞానులకు).

**23.08.2003**

శ్రీ కప్పగంతుల సుబ్రహ్మణ్యశర్మకు పిల్లలు లేకపోతే కమలమ్మగారి అనుగ్రహంతో ఒక బిడ్డ పుట్టింది. ఆ పిల్లకు తన పేరు (కమల) పెట్టమన్నారు. వారిచేత ఆమె భర్త కర్మకాండలు, ఆబ్దికాలు చేయించుకునేలాగా శర్మను అనుగ్రహించారు. అంటే ఇక్కడ వీరిది తల్లిబిడ్డల సంబంధమనీ, గురుశిష్య సంబంధమనీ, ఆత్మసంబంధం అనీ, వారిని ఆత్మపుత్రులుగా

సంబోధించారు కమలమ్మగారు. ఆమె అనుగ్రహంతో పుట్టిన పిల్లకు తన పేరు పెట్టించి, తన పిల్లగా భావించారు. ఒకరోజు తల్లి (గాయత్రి) ఆ పిల్లను కొట్టింది. వెంటనే, ఎక్కడో కలకత్తాలో ఉన్న కమలమ్మగారికి ఈ దెబ్బలు తగిలాయి. అందుకనే "పిల్లను ఇంకెప్పుడూ కొట్టవద్దు, కొడితే నేనుండను" అని హెచ్చరించారు. **భక్తులు మంచి సంకల్పం చేయగానే గురువులు ఎంత తొందరగా గ్రహిస్తారో, తనదైన వస్తువుకు బాధ కలిగితే కూడా అంత తొందరగానూ స్పందిస్తారు** అని ఇక్కడ తెలుస్తోంది. వెంటనే ఆ విషయం (బాధ) ఆమె ఎంతో దూరంలో ఉన్నా చేరిపోయింది. ఈ సృష్టికి 'మాత' తనే కనుక ఎక్కడ ఏ బిడ్డకు ఏం జరిగినా అది ఆమెకు జరిగినట్లే భావించగలదు... దీన్నిబట్టి శిష్యుడు తనకు భగవంతుడిచ్చిన వరాలను ఎంత పదిలంగా కృతజ్ఞతతో, భక్తితో చూసుకోవాలో అర్థంచేసుకునేందుకు ఒక ఉదాహరణ ఇది.

**24.08.2003**

ఒకసారి కమలమ్మగారు తన కుమార్తె త్రిపురాంబతో "నీకు వివాహయోగం లేదు. దీనికి నీవు బాధపడవద్దు. అందరూ నీ బిడ్డలే. ధనం లేదని బాధపడవద్దు. అవసరానికి తగినంత ధనం అమ్మవారు ఏదో రూపంలో నీకు అందిస్తుంది. నా తరువాత మూడవ తరంలో పీఠం విశేష ప్రతిష్ట పొందుతుంది. అప్పటివరకు నిర్వహించే బాధ్యత నీది" అని చెప్పారు.

**వివరణ:** అమ్మమ్మగారికి వివాహయోగం ఉన్నది. ముగ్గురు ఆడసంతానం. మగసంతానం ఆత్మసంబంధాన్ని కలిగి ఉండడం వలన వారి కార్యక్రమాలు, ఆత్మపుత్రులతో చేయించబడ్డాయి. ముగ్గురి స్త్రీ సంతానంలో కూడా ఇద్దరికి వివాహయోగం ఉన్నది. ఆడ, మగ సంతానాలు కలిగాయి. కానీ 3వ తరంలో మళ్ళీ మనుమరాలే, అంటే స్త్రీ సంతతినే పీఠబాధ్యతలో ఎన్నుకున్నారు. దీన్నిబట్టి చూస్తే ఇక్కడ ఆడ, మగ బేధం ఏమీ లేదు. స్త్రీ కూడా ఇటువంటి బాధ్యతా నిర్వహణకు అర్హురాలేనని నిరూపణ కోసమే త్రిపురాంబగారిని, తరువాత రత్నబాలగారిని ఎంచుకోవడం జరిగింది.

ఇంక త్రిపురాంబగారికి వివాహం, బంధనాలు, బాధ్యతలు ఇటువంటి రొంపి అవసరం లేకుండానే ఏకంగా పీఠబాధ్యత ప్రశాంతగా నిర్వహించేలా అనుగ్రహించారు. అందుకే ఆమె పదవీ విరమణ తర్వాత కూడా ప్రతి కార్తీకమాసంలో కాశీలో జీవనం, పుణ్యతీర్థములను దర్శించుట, ఎటువంటి లౌకికచింతనలు లేకుండా ప్రశాంతంగా ఉండేటట్లు జీవనాన్ని నిర్ణయించారు. ఎలాంటి బాదరబందీలు లేకుండా హాయిగా అమ్మవారిని సేవించుకునే అదృష్టాన్ని కలుగజేశారు. ఆమె పూర్వ పుణ్యఫలం అటువంటిది. అలానే కమలమ్మగారు, ఇవన్నీ ఉన్నా కూడా ప్రశాంతంగా పీఠసేవలో తరించారు. అంటే **మహాత్ములకు లౌకికబంధనాలు ఉన్నప్పటికీ, లేనప్పటికీ కూడా తామర ఆకుపై నీటిబొట్టువలె ఉంటార**నటానికి ఇది ఒక గొప్ప నిదర్శనం.

కడుపున పుట్టిన బిడ్డలు లేకున్నా ఆత్మసంబంధీకులందరినీ త్రిపురాంబకు ఆమె ఏర్పరిచారు. అందుకే "బిడ్డలు లేరని విచారం వద్దు. అందరినీ నీ బిడ్డలుగా చూడు" అన్నారు. అంటే మాతృత్వం

అనే తాళిని ధరించమని అర్థం. సంస్కారం అనే కుంకుమ, భక్తుల సంక్షేమం అనే పసుపు, పారాణిలు కనుక ఆమె ధరించగలిగితే సంతానం, వివాహం అనే వాటితో సంబంధం లేదని దీని అర్థం. పీఠస్థానమును అలంకరించవలసిన వారి బాధ్యతలు ఇవే అని మనకు అర్థమవుతున్నది.

**వివాహయోగం, సంతానయోగం ఉన్నా లేకపోయినా ఉండాల్సింది మాతృత్వం.** ఇకపోతే ధనం సంగతి. అవసరానికి సరిపడా అదే వస్తుందని చెప్పారు. అంటే ఎక్కువ ఉండాల్సిన అవసరం, దాచుకునే బాధ ఇవేమీ ఉండవు. ఎందుకంటే అవసరాలు అవే తీరతాయి అన్నప్పుడు ఇక దాని గురించిన చింత ఏముంది? ఆమె చెప్పినట్లుగానే 3వ తరంలో కూడా అలాగే జరుగుతున్నది. ఎప్పుడు ఏది చేయాలో, దానికి సరిపడా ఆ సమయానికి ఆమే అందిస్తున్నది. ఇక పీఠం అభివృద్ధిని గురించి బెంగపడాల్సిన అవసరం కూడా లేదు. అన్నీ ఆమే చూసుకుంటుంది అని ఒక్క ముక్కలో చెప్పినట్లుగా ఉంది.

పై వాక్యములను విచారిస్తే ఆ స్థానాన్ని అలంకరించేవారికి లౌకిక సంబంధాలేవీ అక్కర్లేదు. వారు పాటించాల్సినవి సంస్కారం, భక్తుల క్షేమం, మాతృత్వం అని మనకు అర్థమవుతున్నది.

**25.08.2003**

ఒకసారి హైమావతి “నేనేమీ నోములు చేయలేకపోతున్నానండి. చేయాలన్నా మా యింటి పరిస్థితులకు కుదరడం లేదు” అన్నది. దానికి కమలమ్మగారు “నీ చేతిలో ఎప్పుడు ఏది ఉంటుందో (పండు, కాయ, చీర, డబ్బు) అది అప్పుడు, ఎవరు వస్తే వారికి ఇచ్చేయి. అదే నోము. నోములు వేరే చేయక్కర్లేదు” అని చెప్పారు.

పూర్వకాలం నోము పేరు చెప్తే తప్ప దానధర్మాలు చేయడం కష్టం. అలా చేయడమంటే అందరికీ కుదరదు. కుదిరిన వాళ్ళు ఆ పద్ధతి ప్రకారం చేసేవాళ్ళు. మరి హైమావతిలాంటి వాళ్లకోసం అమ్మమ్మగారు ఎంత సులువైన మార్గం ఉపదేశించారో గమనించండి. అప్పటినుండి ఆమె అమ్మమ్మగారు చెప్పినట్లే తన వద్ద ఉన్నప్పుడే (ఏముంటే అది) ఎవరి చేతిలోనైనా పెట్టి నమస్కారం చేయడం నేర్చుకుంది. ఈ పద్ధతి ఎంత సులువుగా ఉందో చూడండి. ఏ ఆర్భాటం, హడావిడి, శ్రమ లేకుండా చక్కగా పుణ్యాన్ని ఆర్జించుకునే విధానాన్ని ఉపదేశించారు.

అమ్మమ్మగారు కూడా ఆమె జీవితంలో అలాగే ఆచరించి చూపించారు. ఆమె వద్ద ఆ సమయానికి ఏముంటే అది వచ్చిన వారికి పెట్టి పంపేవారు. ఆమె ఇంట్లో ఏమీ చేయలేకపోతే పక్కన హోటల్ నుండి టీ అయినా సరే తెప్పించి అతిథి సత్కారం చేసేవారు. ఒకసారి ఒక పేదస్త్రీకి ఎదురుగా ఉన్న పార్కులో పురుడు వస్తే ఆ సమయంలో అమ్మమ్మగారు వంటిపై ఉన్న చీరను ఇచ్చి, బట్టలు ఉన్న బీరువా తాళంచెవి త్రిపురంగారి వద్ద ఉండటంతో, ఆమె వచ్చేవరకూ ఒక కండువాను ధరించి ఇంట్లో తలుపులు వేసుకుని కూర్చున్నారట.

అలాగే ఒకసారి సుశీల (మద్రాసు) అక్కయ్యగారిని తీసుకుని రిక్షా ఎక్కి వారి బంధువులింటికి బయలుదేరారుట. రిక్షావాడు పెద్దవాడు. పైగా మధ్యాహ్నం 12 గంటలు దాటింది. ఎండలో

వాడు తొక్కలేకపోతున్నాడట. వాడి బేరం రూ.10లు అయితే వాణ్ణి మధ్యలో ఆపి, రూ.10లు విడిగా ఇచ్చి "4 ఇడ్లీలు కొనుక్కు తిని, కాసేపు విశ్రాంతి తీసుకుని రిక్షా తొక్కు నాయనా!" అని చెప్పి రిక్షా దిగి, ఇద్దరూ కలిసి నడిచి ఇంటికి వెళ్ళారట. ఆ సమయానికి ఏది ఉంటే (ఇవ్వగలిగితే) అది ఇవ్వాలని ఆమె సందేశము. ఆమె ఎప్పుడూ ఇంట్లో గాజులు, పసుపు, కుంకుమలు, జాకెట్టు బట్టలూ దగ్గర ఉంచుకునేవారుట. పెండ్లికూతుళ్ళు, పెండ్లికొడుకులు, శ్రీమంతములు అని అందరూ ఆమె ఆశీర్వచనమునకు వచ్చినప్పుడు, ఏదో ఒకటి వారికిచ్చి పంపేవారట.

దసరాల్లో ఒక పెద్దాయన అమ్మమ్మగారికి ఇష్టమని పెద్ద పెద్ద దానిమ్మపండ్లు తెచ్చి ఆమే తినాలనే ఉద్దేశ్యంతో చేతిలో పెట్టి నమస్కరించారట. ఈ చేతితో తీసుకుని, ఆ వెనుక వచ్చే వాళ్ళెవరో కూడా చూడకుండా, మరోచేత్తో దాన్ని ఇచ్చేసేవారట. అలాగే ఆమెకు ఒకచీర ఎవరైనా ఇస్తే, మరొకచేత్తో దాన్ని దానం చేసేవారట. దాన్ని దానం అని కూడా అనలేము. ప్రేమతో దాన్ని మరొకరికి ఇచ్చేవారట. ఇచ్చినవాళ్ళు తాము ఇచ్చింది ఆమె స్వీకరించలేదని బాధపడుతుంటే **"మీకు ఇవ్వడం వరకే. నా చేతికివచ్చాక అది నా ఇష్టం. మీరు దానికి విచారించకండి"** అని చెప్పేవారట. దాంట్లో ఎంత అర్థం ఉన్నదో చూడండి. మనం ఎవరికైనా, ఏదైనా సమర్పించినప్పుడు (మనసులో అమ్మవారి భావన ఉంటే) దాని గురించి వదిలేయాలి. అర్పణ అనేది మనస్ఫూర్తిగా చేస్తేనే భగవంతుడు దాన్ని గ్రహిస్తాడు. అప్పుడే మనకు ఆనందం, ఫలం, పుణ్యం అన్నీ దక్కుతాయి. అర్పణలో కించిత్ భావదోషం ఉంటే దానికి ఏ ఫలితమూ రాదని అర్థం.

ఈవిధంగా కనుక మనం సాధన చేస్తే వచ్చే ఫలితాన్ని లెక్కకట్టలేము. పైగా ఇలా చేయగలిగితే ఇంక నోములెందుకు? అవన్నీ పుణ్యం కోసమే కదా! దానగుణము అలవరచుటకే కదా! దాన్నే ఆమె ఎంతో సులువుగా, ఏ ఆర్భాటం లేకుండా చేయడం బోధించారు.

**26.08.2003**

కమలమ్మగారికి స్వయానా చెల్లెలి కుమార్తె అయిన సుశీలగారికి మంత్రాలయం వెళ్ళి రాఘవేంద్రుని వద్ద నిద్రచేస్తే, ఆయన కలలో సాక్షాత్కారం ఇస్తాడు అనే నమ్మకంతో, వెళ్ళాలనే సంకల్పంతో ఉంది. ఆదే సమయానికి కమలమ్మగారు 20మంది శిష్యులతో కలసి మంత్రాలయం వెళ్తూ సుశీలను కూడా రమ్మని పిలిచారట. అందరూ మంత్రాలయం వెళ్ళారు. 2 రాత్రిళ్ళు నిద్రచేసినా కూడా కల ఏమీ రాలేదుట. 3వ రోజు గుడిలోనే దుప్పట్లు పరుచుకుని, అందరూ పడుకున్నారు. సుశీల రాత్రంతా నిద్రపట్టక తెల్లవారుఝామున సరిగ్గా నిద్రపట్టే సమయంలో కమలమ్మగారు ఈమెను నిద్రలేపితే, విసుక్కుంటూ లేచి వచ్చి కళ్ళు గట్టిగా మూసుకునే ప్రయత్నం చేశారట. కలలో **రాఘవేంద్రస్వామి గుడిలో నుండి నడుచుకుంటూ బయటకు వస్తూ (రుద్రాక్ష మాలలు ధరించి) అక్కడ చాలా ఎత్తుమీద పద్మాసనంలో కూర్చుని ఉన్న కమలమ్మగారి చుట్టూ "ఓం శ్రీం కమలాంబికాయై నమః" అంటూ ప్రదక్షిణలు చేస్తున్నారట**. అది చూసిన వెంటనే ఈమెకు మెలకువ వచ్చి, తన పెద్దమ్మలాగ కనబడుతున్నది అమ్మవారే అని గ్రహించి,

తెలుసుకోనందుకు క్షమాపణతో అమ్మమ్మగారి కాళ్ళమీద పడి నమస్కరించినదట. కమలమ్మగారు ఏమీ తెలియని దానివలె నవ్వుతూ చూస్తున్నారట.

**వివరణ:** దీన్నిబట్టి చూస్తే సుశీలకు ఎక్కడ నమ్మకముందో అక్కడకు తీసుకువెళ్ళి గురువులందరికీ తనే గురువునని తెలియజేసిన సంఘటన ఇది. నేరుగా చెప్తే నమ్మకముండదు. నమ్మించటం చాలా కష్టం. అందువలన కల రూపంలో, ఆమెకు నమ్మకమున్న గుడికి తీసుకువెళ్ళి, అక్కడ తనే ఆదిశక్తిని, కమలాంబికని అంటూ నిదర్శనం చూపించినటువంటి దైవం ఆమె. సొంత పెద్దమ్మలాగా వెళ్ళి, తన ప్రక్కనే పడుకుని, కలలో విశ్వరూపం చూపించిన ఆమె 'విధానం' ఎంతో గొప్పగా ఉంది. ఆ దయ అటువంటిది. ఆ విధంగా చూపిస్తేగానీ వారికి ఆమె స్వరూపం తెలియదు కదా! నమ్మకం కలుగదు కదా! ఒకసారి అటువంటి బలమైన నిదర్శనం చూపిస్తే ఇంక ఈ జీవితమంతా ఆమె 'స్మరణ'లోనే ఉంటారని సంకల్పము. అప్పటినుండి ఇప్పటి వరకూ కూడా కమలమ్మగారు తల్చుకోగానే కలలోనో, ఇలలోనో సుశీల గారికి దర్శనమిస్తారని చెప్తుంటారు. **మనిషి జీవితంలో నమ్మకం, భక్తి కలగటానికి ఒక్క నిదర్శనం చాలు** అని అర్థమౌతున్నది.

నమ్మకం పెంపొందించటానికి ఇటువంటి ఎన్నో అనుభవాలను చాలామంది భక్తులకు కలుగజేశారు కమలమ్మగారు. ఆమె అందరికీ త్రిపురసుందరీ అవతారంగానే చూపించారు. అదే మానుషరూపంలో ఆమె అవతరించినప్పుడు మనం మాయ తెరవలన తెలుసుకోలేక పోతున్నాము. అందుకనే ఆమె 'కల' అనే ఒక స్థితిలో 'మాయ'ను తప్పించి, దర్శనమిచ్చి నిదర్శనములను, నమ్మకాలను బలపర్చారు. ఆ తర్వాత నుండే భక్తులు భక్తి, నమ్మకములను పెంపొందించుకుని, సాధన మొదలుపెట్టగలిగారు. నిజనిర్ధారణ అయ్యాక సాధన తేలిక అవుతుంది.

'గురువు'ను భగవంతుడిగా గుర్తించి, వారితో కలసిమెలసి తిరుగుతూ, యాత్రలు చేస్తూ, కలిసి భోజనం, నిద్రలు చేస్తూ బ్రతికిన వాళ్ళెంత అదృష్టవంతులు నిజంగా! ఆ ప్రత్యక్ష భావం కలుగజేయడం కోసమే ఆమె చాలామందికి దర్శనమిచ్చారు. అలా బ్రతకటానికి ఎంత పుణ్యాత్ములై ఉండాలో కదా! అయినా ఎంతమందికి అలాంటి అదృష్టం కలుగుతుంది? ఈ చరిత్రను, శిష్యుల అనుభవములను ఏర్చికూర్చి ఒక మాలగా తయారుచేసి, దాన్ని చదవి ఆనందపడటమే ఈ జన్మకు నాకు కలిగిన పెద్ద అదృష్టము. ఆమె జీవించి ఉన్నప్పుడే నాకు కూడా ఒక అనుభవంతో కళ్ళు తెరిపించి ఉంటే, ఆమె వెనుకాలే తిరిగి, చర్యలను గమనిస్తూ, చేష్టలను అర్థంచేసుకుంటూ, కలసి తిరగడంలో ఆనందాన్ని అనుభవిస్తూ ఉండే అదృష్టం ఈ జన్మకు ఇక లేదు కదా! మరోజన్మ ఎత్తి అయినా సరే, గురువు సమక్షంలో గురువును తెలుసుకుని, భగవత్ స్వరూపంగా ఆరాధిస్తూ ఆనందంగా బ్రతకాలనిపిస్తోంది. ఆ అదృష్టాన్ని, కోరికని తీర్చగలిగే అవకాశాన్ని అమ్మమ్మగారు ఇస్తారనే నమ్మకం నాకుంది. సాకార సాధనలో చక్కగా ఆనందాన్ని అనుభవించే అవకాశం (శరీరంతో) ఉన్నది. నిరాకారం ధ్యానంతో అలౌకికంగా అనుభవించేది, నిరాకార సాధనతో

ఎన్ని యుగాలైనా సరే చేయవచ్చును. కానీ సాకారంలో గురుపద సన్నిధిలో గడపడం అనేది ఒక వరం, అదృష్టం ప్రతి ఒక్కరూ పొందితీరాలనిపిస్తుంది.

**27.08.2003**

**గురువుతో మెలిగితేనే తప్ప గురువు ఆంతర్యాన్ని గ్రహించడం అసాధ్యం.** మనం జ్ఞానం పొందితేతప్ప గురువు పక్కనే ఉన్నా కూడా ఏమీ గ్రహించలేము. ఆ పరిస్థితి గుడ్డివాడు వెన్నెలను ఆనందించి, అనుభవించలేనట్లుగా ఉంటుంది. జ్ఞానము ఆ గురువే ప్రసాదించాలి. సుశీలకు అమ్మమ్మగారు తెలియజేసినట్లుగా తప్పితే మనం మాయపొర వల్ల కళ్ళముందున్న దాన్ని కూడా గ్రహించలేము. గురువుచే అజ్ఞానం తొలగించబడి, దైవస్వరూపంగా తెలుసుకుని, గురువుకు దగ్గరగా బ్రతకగలిగినప్పుడు (దగ్గరగా బ్రతకడమంటే అది అదృష్టమూ, యోగమూ కాదు), ప్రతి చిన్న చర్యలోని ఆంతర్యములను గ్రహించి, విశ్లేషించుకుంటూ, వారి ప్రతీ ఆనందాన్ని మనం మనసులో నింపుకుంటూ, వారి లౌకిక పనుల్లో, బాధల్లో సహాయపడుతూ, అంటిపెట్టుకుని ఉండే అదృష్టం ఈ జన్మలో నాకు కలుగలేదు. అందుకే నేను ఆంతరంగిక విషయాలను సరిగ్గా వివరించలేకపోతున్నానని అనిపిస్తోంది. గురువుల ప్రేమను అలాగేవారి కోపమును, విసుగును, చేష్టలను భరిస్తే తప్ప శిష్యుడు ఇసుమంతైనా గురువును తెలుసుకునే ప్రయత్నం చెయ్యడమోనని అనిపిస్తోంది. కానీ, ఇటువంటి లౌకిక సాధనను, లౌకికంగా గురువుతో చేయగలగడమంటే కోటిలో ఒక్కరికి కూడా సాధ్యం కాదేమో. ఆ భాగ్యం కలగడమంటే జన్మచరితార్థం అయినట్లేనేమో. అటువంటి జన్మ ఒక్కటిచాలు, ఎన్నో జన్మల పాపమును తగ్గించుకుని ఒక్క జన్మలో సాధనతో తరించవచ్చు. ఇది నిజం. ఒకసారి ఒక శిష్యురాలికి అమ్మమ్మగారు ఇలా చెప్పారు. **"ఏ విషయం గురించి మనసులో పెట్టుకుని బాధపడకు. నాకు చెప్పి వదిలెయ్యి. నేను చూసుకుంటాను. మనసుకు ఏ బాధ అంటనివ్వకు. అలా మనసుతో బాధపడితే ఒక పౌను రక్తం ఖర్చవుతుంది. మళ్ళీ అది ఎలా తెచ్చుకోగలవు? నీ వల్ల కాదు కనుక అలా బాధపడవద్దు."**

దీన్నిబట్టి చూస్తే, మనకు ఏ చిన్న సమస్య వచ్చినా కూడా ఆ సమస్యను కమలమ్మగారి ముందు (ప్రస్తుతం లేరు కనుక ఫొటోకి) చెప్పుకుని పూర్తి బాధ్యతను ఆమెకే వదిలేసి, మనం నిశ్చింతగా ఉండాలని అర్థమౌతోంది. ఇది మన నమ్మకానికి పెద్ద పరీక్ష.

**28.08.2003**

మనం బాధ పడుతున్నామంటే, మనసు బాధపడుతోందని అర్థం. మనస్ఫూర్తిగా కనుక గురువుకే వదిలేయగలిగితే బాధ ఉండదు. అదే గుర్తు. అలా కనుక మనం వదిలేస్తే పూర్తి బాధ్యత ఆమే తీసుకుని, మనకు ఇవ్వదగిన ఫలితాన్ని ఆమె అందిస్తారు. అలాకాక సగం వదిలేసి, సగం మనసుకు పట్టించుకుంటే మనసుతో బాధపడడం వలన పౌను రక్తం ఖర్చవుతుందని చెప్తున్నారు. ఆ విధంగా ప్రతి విషయాన్ని మనం మనసులోకి తీసుకుని ఆలోచిస్తూ, బాధపడుతూ ఉంటే రక్తం ఖర్చవటం వలన మానసికంగానూ, శారీరకంగానూ కూడా

బలహీనపడతాము. అదే ఇప్పుడు డాక్టర్లు 'డిప్రెషన్'లోకి వెళ్తాము అంటున్నారు. అప్పుడు మనకు సగమైనా సరే భగవంతునికి వదిలేయాలి అనే విషయం కూడా గుర్తుండకుండా పోతుంది. ఆరోగ్యాన్ని తిరిగి పొందలేము. కనుక మనసుకు ఏమీ అంటనివ్వకు అంటే తిరిగి ఆమె తత్త్వం మనసును స్వచ్ఛంగా ఉంచుకోవడం. ఉంచుకుంటే ఆమె గురించి ఆలోచించే అవకాశం ఉంటుంది. సాధకులైతే మనసు భక్తితో, ఆరాధనతో ఉంటుంది, కనుక మనస్సు నిశ్చలంగా ఉండాలని అర్థమౌతోంది. బాధలు, సంతోషం, వేదన, ఆనందం ఇవన్నీ కూడా ఆమెకే వదిలేయడానికి సాధకులు ప్రయత్నం చేయడం మొదలుపెట్టాలి. అప్పుడు ఇవేమీ మనసు వరకూ వెళ్ళవు. అక్కడకు వెళ్ళనిస్తే వీటన్నిటితో ఆ మనసు కప్పివేయబడుతుంది. ఆ మనసుని శుభ్రం చేయడానికి భగవంతునికి కూడా చాలా సమయం పడుతుంది. ఆమె మన మనసుని తాకాలంటే మనం **కనీసం పరిసరాలనైనా (మనసును స్వచ్ఛంగా ఉంచుకోవడం కష్టం కనుక) శుభ్రంగా ఉంచుకోగలిగితే మన ఆమె దగ్గరకు వచ్చే ప్రయత్నం చేస్తుంద**ని అర్థం.

వీటన్నిటితో నిండిఉన్న మనసు శుభ్రపడటం కష్టం. వదిలేయడం ప్రయత్నం చేసిన మనసు ఆమె వైపుకే తిరిగి వుంటుంది. అలాఉంటేనే ఆమె కూడా మనసుకు అన్నిరకాలుగానూ (ఆధ్యాత్మికంగా, లౌకికంగా, శారీరకంగా) కాపాడతానని ఇక్కడ మనకు, ఈ అనుభవంలో హామీ ఇస్తున్నారు.

**29.08.2003**

ఒకరోజు కమలమ్మగారి కుమార్తె అయిన త్రిపురాంబ పద్మాసనం వేసుకుని కూర్చుని ఆమాంతం గాలిలోకి పైకి లేచింది. బయట ఎండగా ఉన్నది కదా! చల్లదనం కావాలా? అంటూ విదిల్చింది. జలాజలా మల్లెపూలు కురిసాయి. మరొకసారి చేయి విదిలిస్తే చల్లటి నీటితుంపరలు జల్లుగా కురిశాయి.

ఇది చూసిన కమలమ్మగారు "తల్లీ నన్ను ఈ అల్పవిద్యలతో ప్రలోభపెట్టవద్దు. నాకు ముక్తిమార్గమును చూపించు. **ఈ పీఠం ముక్తిధామం కావాలేగానీ, కామకూటం కాకూడదు**" అంటూ త్రిపురసుందరిని ప్రార్థించగా త్రిపురాంబ భూమిపైకి దిగివచ్చింది. తరువాత మళ్ళీ ఇలాంటివి జరుగలేదు.

కమలమ్మగారికి (సాధకురాలిగా తీసుకుంటే) అమ్మవారు పెట్టిన ఒక పరీక్ష ఇది. సర్వసిద్ధులకు మూలం ఆ త్రిపురసుందరి. ఒక సిద్ధిని (గాలిలో పైకిలేవడం, పూలుచల్లడం, నీటిబొట్లు విదల్చడం – ఇవన్నీ కూడా కొన్ని అష్టసిద్ధులతో పొందగలిగేవి.) త్రిపురాంబపై అమ్మవారు ప్రదర్శించగా, వెంటనే దాన్ని గ్రహించి, నాకు కావలసినది అవి కాదు. ముక్తిని ప్రసాదించమని వేడుకున్నారు. అంటే సాధకులు ఎలా ఉండాలో ఇక్కడ అమ్మమ్మగారు నిరూపణగా ఉన్నారు. 'సిద్ధులు' ప్రయోగించడం అనేది – కామకూటంగా ఆమె వర్ణించారు. అంటే వాటివలన సంఘంలో పేరుప్రఖ్యాతలు, ఆర్థికసంపాదనలు కలుగుతాయి. కానీ సాధకుడైనవాడు మొదటి మెట్టుమీదే

ఉన్న ఈ ఆకర్షణలకు లొంగిపోతే ఇక ప్రయాణం ఎంతదూరం సాగుతుంది? అందుకే అమ్మవారు అలా ప్రయోగించగానే ఈమె వెంటనే తెలుసుకున్నారు. అంటే ఆమె ఎంత జాగరూకతతో ఉన్నారో మనం ఇక్కడ గ్రహించాలి. సిద్ధులు, ఆకర్షణలను తప్పించుకుని ముందుకు వెళ్ళే ప్రయత్నం చేశారామె. అంతేకాదు, చివరగా ఆమె చేరుకోవాల్సినది, కావల్సినది కూడా – ఈ పీఠం **ముక్తిధామం** కావాలని అడిగారు. అయితే, ఆమె ముక్తిని మాత్రమే కోరుకోవచ్చు కదా! మహాత్ములు, అవతారమూర్తులు గురువుగా జన్మనెత్తినప్పుడు వారు అలా కోరుకోరు. వారి కోరికలోనే ఎంత ఉన్నతస్థాయి ఉన్నదో చూడండి. ఏ ఉద్దేశం కోసం ఆమె జన్మ ఎత్తారో, దాన్ని కొన్నితరాల వరకు పంచాలంటే దాన్ని ఏవిధంగా ఆమె చేయాలనుకున్నారో ఆ కోరిక కూడా అలానే ఉన్నది. పీఠం ముక్తిధామం కావాలంటే ఆమె అవతారమూర్తి కదా! ఆమె అక్కడ ముక్తి పొందడం ద్వారా అది ముక్తిధామం అవుతుంది. అంతేకాదు అక్కడ అమ్మవారిని దర్శించుకుని, సాధనచేసే సాధకులకు కూడా ముక్తిని ప్రసాదించాలనేది ఆమె సంకల్పంగా ఇక్కడ మనం అర్థం చేసుకోవచ్చు. ఈ రెండు కారణాల వల్ల అది ముక్తిధామం అయింది.

సిద్ధుల ప్రయోగం వలన తాత్కాలికమైన కోరికలు తీరిపోతాయి. అంతేకానీ, ముక్తిమార్గాలను ఉపదేశించడం వరకూ రావు. ముక్తిధామం అలౌకికమైన, శాశ్వతమైన స్థితులకోసం పాటుపడేది. అందుకనే ఆమె దాన్ని సంకల్పం చేశారు. వెంటనే త్రిపురాంబగారు నేలపైకి వచ్చారు.

అంటే అక్కడ భగవదనుగ్రహం కూడా ఫలించింది. ఇంక ఆమె జీవితంలో ఎప్పుడూ ఇటువంటి పరీక్షలు ఎదుర్కోలేదు. ఆమె ఏ సంకల్పం చేశారో అమ్మవారు దాన్ని అనుగ్రహించింది. ఆకర్షణలకు లొంగకుండా సాధకుడు ఎంత నిష్ఠగా ఉండాలనేది ఇక్కడ ఉదాహరణ.

**సాధన పూర్తికాగానే ఆమె అక్కడే ముక్తిపొందారు. పీఠం 'ముక్తిధామం'గా మారినది.** అందుకనే సాధకులందరూ అక్కడకు చేరుకోవడం జరుగుతోంది. కాబట్టే ఈ తరంలో సాధనా మార్గాలు, జ్ఞానబోధలు, అనుమాన నివృత్తులూ, చరిత్రను సరియైన రీతిలో అర్థం చేసుకోవడం, సాధన చేయడంలాంటి వాటిపైన అమ్మమ్మగారు దృష్టిసారించారు. అందుకే ఇవన్నీ విని, ఆచరించే ప్రయత్నంలోకి మనం అడుగుపెట్టాము. ఈ స్థాయిలో ఉన్నప్పుడు లౌకిక కోరికలను నెమ్మదిగా వదిలేయడం ద్వారా సాధనలో స్థితప్రజ్ఞత్వం వచ్చి, ఈదశలో కోరినా, కోరుకోకపోయినా ఆ స్థితికి వచ్చినవాడి కోరికలు వాటంతట అవే తీరుతుంటాయి. వాటికోసం సాధనలు అవసరం లేదు. ఒకపక్క చిన్నచిన్న అవసరాలు తీరుస్తూ, సాధనలు చేయిస్తూ అమ్మమ్మగారు జ్ఞానమార్గంలోకి తీసుకెళ్తున్నారు. మనం ఎంత మందిమి వెళ్ళగలమో, వెళ్ళే ప్రయత్నం చేయగలమో చూడాలి. **మనసులో కనీసం ఆమె చేతినైనా పట్టుకుంటే బాగుణ్ణు అని అనుకుంటే చాలు, మిగిలినది ఆమే చూసుకుంటారు.** మనకు అదైనా అన్పించాలి కదా, దానికెంత అదృష్టం కావాలో!

**30.08.2003**

ఒకసారి అమ్మమ్మగారు, ఒక భక్తురాలి పిల్లలిద్దరికీ వివాహాలు ఆలస్యం అవుతున్న కారణంగా,

"మెడలో కట్టుకునే రెండు రూపులు ఇస్తాను. వారిద్దరికీ వెయ్యి. తరువాత మంచి సంబంధాలు వచ్చి వివాహాలు జరుగుతాయి" అని చెప్పారు. చెప్పిన కొద్దికాలానికే ఆమె సిద్ధి పొందారు. ఇంక 'రూపు'ల గురించి ఎవరిని ఎలా అడగాలో తెలీక వారు మౌనంగా ఉండిపోయారు. తరువాత కొద్దికాలానికి వాళ్ళింట్లోనే ఒక జాడిలో కుంకుమ తీస్తుండగా (అమ్మమ్మగారిచ్చిన కుంకుమ అంతా వాళ్ళు ఒక జాడీలో పోసిపెట్టుకుంటారట) అందులో 2 నాణెముల వలె కన్పిస్తున్న రూపులు (మెడలో ధరించేందుకు వీలుగా ఉన్నవి) దొరికాయట. ఆశ్చర్యంతో వాళ్ళు అమ్మమ్మగారు ఈవిధంగా ఇచ్చారని అనుకుని వెంటనే వాటిని కుంకుమలో దొరికాయని పీఠానికి తెచ్చి ఇచ్చేశారు. అప్పుడు అమ్మమ్మగారు అన్న విషయాన్ని చెప్పారు. సరేనని త్రిపురాంబగారు వీరికి ఆ రూపులను మెడలో కట్టుకోమని చెప్పగా, వాళ్ళు అలాగే చేశారు. తరువాత వారికి మంచి సంబంధాలు వచ్చి వివాహాలు జరిగాయి.

దీన్నిబట్టి చూస్తే గురువు ఒకసారి చేస్తానని మాట ఇస్తే, వారున్నా, లేకపోయినా (భౌతికంగా) సరే ఇచ్చితీరుతారు అనేందుకు ఇది గొప్ప ఉదాహరణ. సరిగ్గా మెడలో ధరించేలాగా ఆ రూపులు ప్రసాదించడం ఎంత విచిత్రం. వాళ్లింట్లోనే, ఆ కుంకుమలో దొరకడంవల్ల అది ఆమె ప్రసాదమేనని మనకు అర్థమౌతోంది. ఆమె ఇస్తానన్నారు కనుక ఆవిధంగా ఇచ్చారు. వారు అంత ఖచ్చితంగా మాట నిలబెట్టుకుంటారు. మనం మాటకాదు కదా, కావాలంటే గురువులను కూడా రోజుకొకళ్ళను మార్చగలము. అందుకే శిష్యుడు ఎంత నమ్మకస్తుడైతే గురువు అనుగ్రహాన్ని కూడా అంత నమ్మవచ్చు. కాబట్టి శిష్యరికం కూడా బలంగా ఉండాలి. అందుకే అమె పదేపదే **"అమ్మను నమ్ముకోండి. భారాన్ని ఆమెపై వేయండి. అన్నీ ఆమే చూసుకుంటుంది"** అని అంతగట్టిగా నొక్కిచెప్పారు. ఈ శిష్యురాలు నమ్మారు. ఆమె ఇస్తానన్నారు. కానీ భౌతికంగా లేరు కనుక ఎవరికి ఎలా చెప్పాలి, అవి ఎలా వస్తాయి? అని తర్జనభర్జన పడ్డారు. వాటికోసమే ఆలోచిస్తున్నారు. అంతేకానీ ఆలోచనలు ప్రక్కదారి పట్టలేదు. ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే, ఆమె మాటపై వారంత నమ్మకంతో ఉన్నారు. విషయాన్ని ఆమెకే వదిలేసి మౌనంగా ఉన్నారు. అంతే పరిష్కారం ఆమే చూపించారు. అంటే గురువెంత ఖచ్చితమన్నది, శిష్యుని ఖచ్చితత్వాన్ని బట్టి కూడా ఉంటుంది. కాబట్టి నమ్మకాన్ని స్థిరపరచుకోవాలని అర్థంచేసుకోవాలి.

**31.08.2003**

ఒకసారి కమలమ్మగారు లక్ష్మితో "మీరు పెద్దవాళ్ళయ్యేసరికి నేనుంటానో, పోతానో; ఒకవేళ చనిపోయిన తరువాత ఇలాగే నేను నీకు కనపడితే భయపడతావా?" అనడిగారు. "అవున"న్నాను. **"సరేలే అయితే, నేను నీడలా మీవెంటవుండి మిమ్మల్ని కాపాడుతూ ఉంటాను"** అన్నారు.

చనిపోయిన తరువాత ఆ భౌతికరూపంలో కనబడితే భయపడతారు కాబట్టి, "నీడలాగే కనపడతాను" అని ఆమె ఇక్కడ వాగ్దానం చేశారు. అందుకనే ఆమె తదనంతరం ఎవ్వరికీ కూడా (ఆ రూపంలో) కలలో కూడా కనపడట్లేదని చెప్పుకోవచ్చు. అనగా, ఆ శరీరాన్ని ఆమె

వదిలేశారు. ఆత్మస్వరూపంతో, గురువు రూపంలో మనం కొల్చుకుంటాము. శరీరాన్ని వదిలేశాక అంతా ఆత్మస్వరూపమే అవుతుంది. తరువాత వచ్చే గురువును మనం సాకార సాధన చేసుకోవచ్చు. కానీ అప్పటి పూర్వభౌతిక రూపంలో కనబడరు. ఎందుకంటే తరువాత గురువుకు రూపం ఉన్నది కాబట్టి, కనిపిస్తే క్రొత్తరూపంలో కనిపించవచ్చును. ఒకవేళ శిష్యునికి ఆ పూర్వభౌతిక రూపం చూడాలని ఉంటే, గట్టిగా తలచుకొని ప్రార్థిస్తే ఆమె ఛాయామాత్రంగా, అంటే నీడలా వెంట ఉండి కాపాడుతుంటారు. అంటే ఒక సమస్య వచ్చినపుడు, ఆ శిష్యుడికి సమస్య పరిష్కారమైనప్పుడు తప్పక ఆ నీడను చూడగలుగుతాడు. ఎందుకంటే ఆ 'నీడ' తన వెంటే ఎలా ఉన్నదో గురువు శిష్యుడికి తెలియజేస్తారు. దాని అర్థం ఇదన్నమాట. ఆ తరువాత గురువును అనుసరిస్తూ ఉన్నవాళ్ళకు, గురువు సాకారంగా కనపడవచ్చును. కానీ పనులు జరుగుతున్నప్పుడు ఆ గురువుకూడా వెనక ఉండదు. నీడలా వెన్నంటి పనిచేస్తున్నట్లు శిష్యుడు గ్రహించగలుగుతాడు. ఎందుకంటే గురువు నీడలా ఉండి కాపాడుతానన్నాడు కదా! అంటే సమస్యలు పరిష్కారమైనపుడు, తలచుకున్నప్పుడు, బాధపడినపుడు, ఆర్తిగా పిలిచినపుడు కూడా మనకు ఆ భయం మాత్రమే ప్రత్యక్షంగా కనబడుతుంది. **యాదేవీ సర్వభూతేషు ఛాయారూపేణా సంస్థితా** అని ఉంది కూడా.

అందరి అనుభవాల్ని పరిశీలించి చూస్తే, ఆమె శరీరంతో ఉన్నప్పుడు కూడా కలలో చెప్పడం, ఆమె వచ్చి శ్రీరామమూర్తిగారిని కాపాడడం, సుశీలకు కనకదుర్గ కాపాడుతుందని చెప్పడం, వెంటనే మరోపిల్ల వలె వచ్చి కాపాడడం, ఇలాంటివన్నీ ఆమె 'ఛాయా'రూపంగా చేశారని అర్థమౌతోంది. కాకపోతే అమ్మమ్మగారు జీవించి ఉన్నారు కనుక ఆమే చేశారని నమ్మకంతో ఉంటాము. కానీ అప్పుడు ఆ 'ఛాయ' గురించి ఆలోచించము. ఎందుకంటే ఆమె జీవించి ఉన్నారు కనుక. అందుకే అమ్మమ్మగారు (నేను లేనప్పుడు కూడా) 'నీడ'వలె ఉండి కాపాడుతాను అన్నారు. లేనప్పుడు, ఉన్నప్పుడూ కూడా ఛాయా రూపంగానే కాపాడుతున్నారామె. లేనప్పుడు కూడా మనం తెల్సుకునేందుకు ఛాయ, నీడ అనే పదాలను చెప్పి మనం భయపడనక్కరలేదని, నీడలా ఉంటారని మనం గుర్తించి ధైర్యంగా ఉండటానికి ఆమె అలా చెప్పారని అర్థమౌతోంది.

మనం ఆమెను నమ్మిన మరుక్షణం నుంచి ఆవిడ మనతోపాటు ఉంటారు. **అంటే, మనమంటూ ఉంటే నీడ ఎలా ఉంటుందో, అలాగే ఆమెను నమ్మితే ఆమె నీడ మనతో ఉంటుంది.** నీడ వెనకాలే మనతోపాటు అంటుకునే ఉంటుంది కానీ నీడ మననుండి వేరుకాదు. మీతోపాటే ఉంటానని చెప్పటానికి ఆమె ఎంత చక్కగా అర్థమయ్యేలాగా వివరించారో చూడండి.

మన నీడలాగా ఉంటే మన విషయాలన్నీ ఆమె విషయాలేగా! అందుకే ఇక్కడ అనుకోగానే వెంటనే అక్కడ తెలిసిపోతున్నాయి. అంటే ఇక్కడ సమస్య మొదలైతే వెంటనే ఉన్న నీడకు కూడా సమస్య తెలిసినట్లేగా! అందుకే గాయత్రి ఏలూరులో కమలను కొట్టగానే అక్కడ కలకత్తాలో ఉన్న అమ్మమ్మగారికి తగిలింది. కమల వెంటకూడా నీడలా ఉన్నది కదా! అందుకనే అది సాకారరూపంగా ఉన్న కమలమ్మగారికి తగిలింది. (ఆకాలంలో సంఘటన)

ఇప్పుడు కూడా ఆగస్టు 31 వినాయకచవితిన బొంబాయిలో మేమిద్దరమే ఉన్నాము. పైనున్న భవానీవాళ్ళు పండుగకు రమ్మని పిలిచారు. 'వాషి' (ముంబైలో ఒక ప్రాంతం, నవీముంబై అంటారు)లో ఉన్న శిష్యులు కూడా పిలిచారు. ఎందుకో పండగపూట ఎక్కడికీ వెళ్ళాలనిపించలేదు. ఏమిటి, వినాయకచవితిని ఎప్పుడూ తప్పలేదు. ఏదో వండి నైవేద్యం పెట్టడం అలవాటు కదా! సరే ఏం చేస్తాం? హోటల్‌కు వెళ్ళి భోజనంచేసి వద్దామనుకున్నాము. సరిగ్గా 12 గంటలకు ఒకాయన ఫోన్ చేశారు. (ఆయన 20రోజుల క్రితం రైలులో పరిచయమయ్యారు. ఆయన ఇస్కాన్ భక్తుడు. ఆయనతోపాటు హైదరాబాద్‌నుండి ముంబై ప్రయాణం చేశాము.) మా నెంబరు గుర్తుపెట్టుకుని, ఇస్కాన్‌లో భగవద్గీత గురించి ఉపన్యాసం ఉన్నది, మీరు తప్పకుండా రండి. నేను మిమ్మల్ని అక్కడ కలుస్తానని పిలిచారు. సరేనని ఇద్దరం వెళ్ళాం. గుడి చాలా పెద్దది. ఎంతో బాగుంది. భజనలు చేస్తున్నారు, డ్యాన్స్ చేస్తున్నారు. అందరూ తన్మయత్వంతో మునిగిపోయి ఉన్నారు. కృష్ణభక్తిని ఆమెరికావాళ్ళు ప్రచారం చేయడమేమిటి? మనం ఆనందంతో మునిగిపోవడం ఏమిటి? అందరూ లేచి నిలబడి రెండు చేతులూ పైకెత్తి, ఎగురుతూ మైమరచి డాన్స్ చేస్తున్నారంతా. పిల్లా, పెద్దా, ఆడా, మగా పడుచు, ముసలి తేడాలేకుండా చూస్తుంటే బృందావనంలో ఉన్నామా అనిపించింది. ఆ స్వామీజీ తెల్లటి మనిషి నామాలు పెట్టుకుని కృష్ణుని లాగా ఉన్నాడు. అందరూ గోపికలవలె నాట్యం చేస్తున్నారు. ఏమైనా అదొక విచిత్ర అనుభూతి. వేరే లోకంలో ఉన్నట్టుంది. ఇటువంటి భక్తి చైతన్యం ఈరోజుల్లో కూడా కనపడుతోందా అనిపించింది. సరే మేము కూడా పాల్గొని ఉపన్యాసం అయిపోయాక వచ్చేస్తుంటే అక్కడవాళ్ళు అందరికీ చక్కగా స్టీలు ప్లేట్లలో ప్రసాదం పెట్టారు. నాకెంతో ఆశ్చర్యం వేసింది. అంటే వినాయచవితి భోజనం నాకిక్కడ ప్రసాదించబడింది. చాలా సంతోషం కలిగింది. అందుకని మనస్ఫూర్తిగా ఈరోజు ఏం చేద్దాం అనుకోగానే వెంటనే అమ్మమ్మగారు కృష్ణప్రసాదం పెట్టించారు. మరి ఛాయలాగా ఉండి తెలుసుకున్నారో, దగ్గరుండి తీసుకెళ్ళారో ఆలోచించుకుంటే చక్కగా అర్థమౌతుంది.

**01.09.2003, బొంబాయి**

ఒకసారి కమలమ్మగారు, ఆమె చెల్లెలి కుమార్తె అయిన సుశీలతో కలిసి నెల్లూరుకు సుమారు 10 కి.మీ.ల దూరంలో ఉన్న వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి గుడికి వెళ్ళారు. అప్పుడు సుశీల భర్తను ఉద్యోగంలో సమస్య వచ్చి కొన్నాళ్లు సస్పెండ్ చేశారు. అక్కడ కమలమ్మగారు జ్వాలాముఖి అమ్మవారితో ఇలా అన్నారట– "నా బిడ్డకు ఉద్యోగం మళ్ళీ వస్తే, నేను మళ్ళీ వచ్చి నీకు భోగం చేయిస్తాను." తరువాత కొద్దిరోజులకే ఆయన తప్పేమీ లేదని, తిరిగి ఉద్యోగం ఇస్తున్నట్లుగా ఆదేశాలు వచ్చాయి. ఈ విషయం సుశీల, కమలమ్మగారికి ఉత్తరం రాశారట. వెంటనే ఆమె "నేను వచ్చి జ్వాలాముఖికి భోగం చేయిస్తాను" అని చెప్పారట. "నేను ఇక్కడే ఉన్నాను కదా! నేను చేయిస్తాను" అని సుశీల అన్నా, కాదని నెల్లూరువచ్చి, ఆ గుళ్ళో భోగం చేయించారట. భోగం అంటే ఏమిటి అక్కా? అనడిగితే **చక్కెర పొంగలి నైవేద్యం** అని చెప్పారట.

ఈ సంఘటనలో మొక్కు ఎలా మొక్కితే అలాగే తీర్చాలని ఆమె ఆచరణాత్మకంగా చేసి చూపించారు. ఉద్యోగం తిరిగి రాగానే ఆమె ఏలూరు నుండి నెల్లూరు వచ్చి తన డబ్బుతో భోగం చేయించారు. అంటే, మనం ఎక్కడ మొక్కామో అక్కడే, మన స్వంత డబ్బుతోనే మొక్కులు తీర్చాలని అమె సందేశము. లేకపోతే ఏలూర్లోనే అమ్మవారి వద్ద ఆ భోగం చేయించవచ్చును కదా? కానీ అలా చేయలేదామె. భగవంతుని విషయాలు మనం తేలికగా తీసుకోకూడదని, ఎలా అనుకుంటే అలాగే చేయాలని చేసిచూపించిన సంఘటన ఇది.

ఏలూరు పీఠంలో అమ్మవారికి కొబ్బరికాయ, పానకం, వడపప్పు (ఒక్క విజయదశమినాడు మినహా) తప్ప మహానైవేద్యం పెట్టరు. దసరా 9 రోజులు కూడా 'తీపి' ప్రసాదములే నైవేద్యములు. అందుచేతనే ఎవ్వరూ కూడా ఎటువంటి నైవేద్యాలు అక్కడికి వండి తేవడంగానీ, అమ్మమ్మగారు ఇది వంటి అక్కడ నైవేద్యం పెట్టమనిగానీ చెప్పిన సంఘటనలు లేవు. అమ్మమ్మగారు కొబ్బరికాయ కూడా ఇంట్లో కొట్టకండి. ఇక్కడకు వచ్చినప్పుడే కొట్టండి అని కూడా చెప్పారు. కానీ ఆమె నెల్లూరులో జ్వాలాముఖివద్ద ఒక లౌకికపరమైన కోరికను తన బిడ్డకోసం కోరడం జరిగింది. పైగా అక్కడ అమ్మవారికి పూర్వకాలంలో 'బలి' కూడా ఇస్తుండేవారట. కాబట్టి అమె అక్కడ అన్నంతో చేసిన చక్కెరపొంగలి చేయించి, ఆ దేవతకు పెట్టారు. **దేవతాస్థానాన్ని బట్టి, ప్రతిష్టలను బట్టి, కోరికలను బట్టి నైవేద్యాలు ఉంటాయని** మనకు ఇక్కడ తెలుస్తోంది. అందుచేతనే ఆమె ఏలూర్లో కాకుండా నెల్లూరు వచ్చి ఆ భోగం చేయించారని అర్థం చేసుకోవాలి.

'సప్తయోగినుల' గురించి శ్రీచక్రవర్ణనలో చెప్పుకుంటున్నప్పుడు ఏ చక్రంవద్ద అమ్మవారు ఏ రంగులో ఉంటుందో, ఏ ఆయుధాన్ని ధరిస్తుందో, ఆమెకు ఏ నైవేద్యం ఇష్టమో తెలియజేయ బడింది. అందుకే అమ్మమ్మగారు ఒక్కొక్కచోట ఒక్కొక్కలాగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది.

**02.09.2003, బొంబాయి**

## యోగపరిపూర్ణత

మేము ఆగస్టు 17, 2003న హైదరాబాద్ నుండి బొంబాయి వస్తుండగా మా ఎదురు సీట్లో కూర్చున్న ఒకాయన భగవద్గీత చదువుతున్నారు. కాసేపయిన తర్వాత నెమ్మదిగా ఆయన్ను కబుర్లలోకి దించాను. ఆయన ఇస్కాన్‌లో సభ్యుడు, కృష్ణభక్తుడు. ఇస్కాన్ కార్యకలాపాల గురించి, భగవద్గీత గురించి, హరేకృష్ణ మంత్రాన్ని గురించి చాలాసేపు చెప్పారు. చాలా చక్కగా సమయం గడిచిపోయింది. ఆయన రైలు దిగిపోతూ నాకొక పుస్తకం ఇచ్చివెళ్ళారు. దాన్ని చదువుదామనుకుని మర్చిపోయాను. మళ్ళీ ఆయనే హఠాత్తుగా ఆగస్టు 31 వినాయకచవితినాడు ఫోన్ చేసి ఇస్కాన్ ఆలయానికి (ఈ ఆలయం ముంబైలో చౌపట్టి అనే ప్రాంతంలో ఉంది) రమ్మని ఆహ్వానిస్తే, వెళ్ళి ఉపన్యాసం విని, ప్రసాదం తీసుకునివచ్చాను. నేనీమధ్య గురువుగారితో స్వయంగా అనుభవాలను పంచుకున్న సంఘటనలకు (కొందరి శిష్యులకు సంబంధించినవి) వివరణ ఇస్తున్నాను. ఈరోజు ఏదైనా ఒక పుస్తకాన్ని తీసుకుని, అమ్మమ్మగారి చరిత్రతో సమన్వయపరుద్దామని అనిపించింది.

పుస్తకాలు చూస్తుంటే ఆయన ఇచ్చిన పుస్తకం దొరికింది. ఆ పుస్తకం పేరు "యోగపరిపూర్ణత". అంతర్జాతీయ కృష్ణచైతన్యసంఘ స్థాపకాచార్యులు పూజ్యశ్రీ ఎ.సి. భక్తివేదాంతస్వామి ప్రభుపాదుల వారు వ్రాసిన పుస్తకాన్ని శ్రీ నెల్లుట్ల వెంకటేశ్వరరావుగారు తెలుగులోకి అనువదించారు. సరిగ్గా ఆ సమయంలో పుస్తకం అందింది కాబట్టి (ఆ జగద్గురువైన శ్రీకృష్ణుని ఉపదేశాలు ప్రామాణికాలు) దీన్ని ఆధారంగా చేసుకుని **"కమలాంబికా దివ్యచరితము"**ను సమన్వయుపరచుకుంటే బాగుంటుందనిపించింది. వెంటనే ఆ ప్రయత్నం మొదలుపెట్టాను.

ఈ 'యోగపరిపూర్ణిత' అనే పుస్తక విషయసూచికలో...

1. అర్జునుడు నిరాకరించిన ధ్యానయోగం
2. భక్తితో చేసే భగవత్ సేవయే యోగం
3. కృష్ణధ్యానమే యోగం
4. శరీరాన్ని, మనసుని నిగ్రహించడమే యోగం
5. ద్వంద్వాలనుంచీ, ఉపాధినుంచీ విముక్తి పొందడమే యోగం
6. యోగభ్రష్టుని గతి
7. శ్రీకృష్ణునితో సంబంధాన్ని తిరిగి స్థాపించుకోవడమే యోగం
8. యోగసిద్ధి... అనే 8 చాప్టర్లు ఉన్నాయి.

ఆ పుస్తకం ఇచ్చిన ఆయన పేరు పెద్దాడ మధుసూదనరావు. ఆయన పుస్తకం ఇస్తూ "శ్రీకృష్ణుడు జగద్గురువు. కనుక ఆయన భగవద్గీతలో చెప్పినటువంటివి ప్రామాణికములు" అని చెప్తూ 'భగవద్గీత యధాతథము' అనే పుస్తకంలో గురువులు సంప్రదాయబద్ధమైన విషయాలు, ప్రామాణికమైనవి చెప్పినట్లైతేనే మనము అనుసరించాలి అంటూ కొన్ని సంప్రదాయాలను ఆ పుస్తకంలో రాశారు" అని చెప్పారు. నేను "మన గురువుది ఏ సంప్రదాయమో మనమెలా తెలుసుకుంటాము?" అని అడుగుతూ మన అమ్మమ్మగారి విషయం చెప్పాను. ఆయన వెంటనే ఆమె మహితాత్మురాలు కాకుంటే ఇంతమంది ఆమెను అనుసరించరు అని చెప్తూ ఆమెకు బాలాజీ, శ్యామలరావుగార్లు అనే గురువులు ఉన్నారు కనుక ఆమెది 'గురుసంప్రదాయము' అంటే, ఇది శంకరాచార్యులవారు చెప్పినటువంటి సంప్రదాయము. ఇటువంటి సంప్రదాయములను ఆచరిస్తున్న గురువుల చెప్పే విషయాలైతేనే ప్రామాణికములు. కనుక ఆమె చెప్పిన విషయాలను ఇంతమంది ఆచరించగలుగుతున్నారు అంటూ అమ్మమ్మగారిని ఆయనకు తెలిసిన పద్ధతిలో నిర్ధారణ చేశారు. అలా ఆయన ప్రామాణికమైన వివరణ ఇవ్వగానే నేను ఆనందపడ్డాను. ఆ విషయాన్ని కొంచెంసేపు ఆలోచించాను కూడా.

అమ్మమ్మగారి గురువులైన బాలాజీ, శ్యామలరావుగార్లు కంచిపీఠానికి చెందినవారని తెలుసుకున్నాను. ఒకసారి 'కంచేదైవం' అనే కంచిపీఠానికి సంబంధించిన పుస్తకంలో వీరి గురించిన ప్రస్థావన చదివానని వసుంధర చెప్పింది. వీరిరువురూ కంచికామాక్షి పీఠమునకు

సంబంధించినవారు. వీరు కమలమ్మగారికి 'త్రిపురసుందరి' ఉపాసన ఇవ్వడం జరిగింది. ఈమె తండ్రిగారైన కొక్కొండ వెంకటరత్నంపంతులుగారు "తనుమధ్య, బిల్వేశ్వర స్వాములను" ఆరాధించి, ఎన్నో రచనలు కూడా గావించారు. కానీ వారికి గురువులున్నట్లుగా తెలీదు. వారి తండ్రిగారినుండి ఉపదేశాలు తీసుకోలేదు. గురుసంప్రదాయసిద్ధమైన ఒక పీఠానికి సంబంధించిన ఉపదేశములు తిరువత్తియూరు (మద్రాసు)లోని గుడిలో గురుసమక్షములో మంత్రోపదేశం పొందినటువంటి 'గురువు' ఈమె. కంచిపీఠము అనగా శంకరులు ప్రతిష్ఠించినటువంటి పీఠం అది. అందుకేనేమో వినగానే శంకర సంప్రదాయం అని నిర్ధారణ చేశారాయన.

ఇక్కడ కమలమ్మగారు 'కపాలమోక్షము' అనే సిద్ధిని పొందిన మాత కనుక మనం ప్రామాణిక గురువు అనకుండానే శాస్త్రసమ్మతమైన, శాస్త్రానుగుణమైన బోధనలు చేసిన గురువు అవడం వలన, ఆమెను మనం "ప్రామాణిక గురువు"గా చెప్పుకుంటున్నాము, అనుసరిస్తున్నాము. ఆమె బోధనలు ఎన్నో ప్రామాణిక గ్రంథాలను అనుసరించి ఉండవచ్చును. కానీ నేను ప్రస్తుతము ఈ 'యోగపరిపూర్ణత' అనే భగవద్గీతకు సంబంధించిన వాక్యములను అమ్మమ్మగారి వాక్యములతో పోల్చి చూసుకుంటున్నాను. ఇలా పోల్చి చూసుకోవడంలో నాకు ఆమె గురుత్వంపై అపనమ్మకం ఉన్నదని కాదు. ఆమె ఎంతో గొప్ప ప్రామాణిక వాక్యములను అంతే సులువుగా, ఆచరణాత్మకంగా చేసి చూపించారు. సులువుగా చేయుటకు అనుకూలంగా ఎంతో చక్కగా ఉపదేశం గావించారు. ప్రత్యక్ష అనుభవములను (శిష్యులకు) కలుగజేశారు. ఎంత ఆనంద చైతన్యములో ఊగిసలాడించారో తెలుసుకోవడం, తెలియజెప్పడం నా ఉద్దేశ్యం. ఆనాటి యుగంలో శ్రీకృష్ణుడు చెప్పిన వాక్యములను ఇప్పుడు అమ్మమ్మగారు ఇప్పటి కాలానికి అనుగుణంగా బోధించారు అని చెప్పే ప్రయత్నం మాత్రమే. అంతేకాదు ముఖ్యంగా నా గురువు యొక్క గొప్పతనాన్ని అన్నివిధాలుగా, అన్ని కోణాల్లోనూ, అన్ని శాస్త్రాలతోనూ, సాంప్రదాయాలతోనూ పోల్చి చూసుకుంటూ, ఆమె గొప్పతనాన్ని చూసి గర్వపడుతూ మహత్తరమైన ఆనందానుభూతికి లోనవ్వాలనే ఒక స్వార్థపు ఆలోచనతోనే ఈ పని చేస్తున్నాను.

సాధారణంగా ఒక తల్లికి, తన బిడ్డ ఎలా ఉన్నా సరే అందంగానే కనబడుతుంది. అలా అని వదిలెయ్యి లేదు కదా! మంచి బట్టలు వేసి, రకరకాల ఆభరణాలు పెట్టి, అందంగా అలంకరించి చూసుకుంటే కలిగే ఆనందం వేరు. అంతేకాదు, పిల్లను చూసిన ఇతరులు కూడా మెచ్చుకుని, పొగిడి, ఎత్తుకుని, ఆనందించి, ఆ విషయాన్ని మనకు చెప్తే, కలిగే ఆనందం అంతాఇంతా కాదు. అలాంటి ఆనందం పొందాలనే ప్రయత్నంలోనే ఇలా వ్రాసుకుంటున్నాను.

## భగవద్గీతలోని అంశములు - యోగపరిపూర్ణత

### 1. అర్జునుడు నిరాకరించిన ధ్యానయోగం

భగవద్గీతలో దేవాదిదేవుడైన శ్రీకృష్ణుడు అర్జునునికి యోగసిద్ధిని గురించి బోధించాడు. మనం యోగసిద్ధిని పొందాలనుకుంటే భగవద్గీతలోని పరమపురుషుని వాక్యాలను ప్రమాణంగా

గ్రహించాలి. యోగసిద్ధిని గురించి యుద్ధభూమిలో బోధించడం విశేషం.

యోగంలోని ధ్యానం చేసే పద్ధతిని గురించి వివరిస్తే ఆచరించడం తనకు సాధ్యంకాదని కృష్ణునికి దాపరికం లేకుండా చెప్తాడు అర్జునుడు. "నా మనస్సు రాక్షసునికంటే బలవంతమైనది. నువ్వు కనుక దానిని నిర్జించగలిగితే దయచేసి నిర్జించు. అపుడు ఈ యోగపద్ధతిని నిర్వహించడం సాధ్యమౌతుంది" అని అన్నాడు.

శ్రీమద్భాగవతంలో పరీక్షిత్ మహారాజుకు శుకదేవ గోస్వామి చెప్పిన మాటలు -

"స్వర్ణయుగమైన సత్యయుగంలో - ధ్యానయోగం

త్రేతాయుగంలో - యజ్ఞయాగాదులు

ద్వాపరయుగంలో - దేవాలయాల్లో ఆరాధన

**కలియుగంలో - కేవలం భగవంతుని నామాన్ని జపించడం, నామసంకీర్తన చేయడం పరిపూర్ణయోగం** అని ప్రామాణిక గ్రంథాలు మనకు తెలుపుతున్నాయి."

ఈ యుగంలో ధ్యాన, యోగవిధానానికి బదులు కృష్ణచైతన్యం అనే భక్తియోగం ద్వారా, హరేకృష్ణ అనే మంత్రాన్ని జపిస్తూ, శ్రీకృష్ణ వైభవాన్ని సంకీర్తన చేయడం అనే మంత్రయోగం ద్వారా, యోగవిధాన పరిపూర్ణతను మనం సాధింగలము. అదే వైదికగ్రంథాల్లో సూచించబడినది. శ్రీచైతన్య మహాప్రభువు వంటి ప్రామాణిక పురుషులచేత కూడా నిర్ధారించబడింది. నిజానికి మహాత్ములు అంటే మహితాత్ములు. ఎల్లప్పుడూ భగవంతుని విభవములను సంకీర్తనం చేస్తుంటారని భగవద్గీత (భ.గీ.9.14) చాటుతుంది. వైదిక సాహిత్యం ప్రకారంగానీ, భగవద్గీత ప్రకారం గానీ, ప్రామాణిక పురుషుల ప్రబోధం వల్లగానీ, ఎవరైనా మహాత్ములు కాదలచుకుంటే వారు 'హరేకృష్ణ' మంత్రాన్ని జపిస్తూ, కృష్ణచైతన్య విధానాన్ని అవలంబించవలసి ఉంటుంది అని ఈ పుస్తకంలో వివరించబడి ఉంది.

భక్తియోగం, నామజపం - నామసంకీర్తన, భగవంతుని విభవములను సంకీర్తన చేయాలి అని భగవద్గీతలో చెప్పబడి ఉంది.

<u>విధులు:</u> హరేకృష్ణ మంత్రాన్ని 108 పూసలున్న తులసిమాలతో 16సార్లు జపం చేయాలి. గ్రంథ అధ్యయనం చేసి భగవంతునికి కైంకర్యము చేయాలి.

<u>నిషేధాలు:</u> కాఫీ, టీ, మాదకద్రవ్యాలు సేవించరాదు; మాంసం చేపలు, అభక్ష్య భోజనం చేయరాదు; నిషిద్ధమైన లైంగికసంపర్కం పనికిరాదు; ఏవిధమైన జూదం ఆడరాదు.

శ్రీచైతన్య మహాప్రభువు భగవద్గీత, భాగవతములలోని ప్రామాణిక వాక్యాలను ఉపదేశించుట వలన, ఆయన ప్రామాణిక పురుషుడుగానూ, ఆయన ప్రబోధములు ప్రామాణికాలైనాయి. అలాగే శ్రీకమలమ్మగారి ఉపదేశ, మంత్రాలు కూడా భగవద్గీతలోని ప్రామాణిక వాక్యములేననీ, ఆమె ప్రామాణిక ప్రబోధనలు చెప్పుటకే ఈ యోగపరిపూర్ణతను నమూనాగా తీసుకుని పోల్చి రాస్తున్నాను. అందువలనే శ్రీమధుసూదనరావుగారు నాకు ఈ పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారని భావించి,

శ్రీకృష్ణుడే అమ్మమ్మగారి బోధనలు తనను అనుసరించేఉన్నాయని చెప్పినట్లుగా తోచి 'ప్రామాణికములు' అని చెప్పే ప్రయత్నం చేస్తున్నాను.

ఏ ధ్యానయోగాన్ని అర్జునుడు ఆచరించటం అసాధ్యమని చెప్పాడో (మనసును నిర్జించగలిగితే తప్ప) అదే అమ్మమ్మగారి విషయంలో భగవతియైన బాలాత్రిపురసుందరి "నీ మనస్సు నిర్మలమైనది. అందుకే నేను 3 సం॥ల్లో నీలో ఐక్యమౌతాను" అని చెప్పారు. అంటే మనస్సును నిగ్రహించుకో గలిగారని అర్థమౌతోంది. ఆమె మనకు ధ్యానయోగములు ఉపదేశించలేదు. కానీ ఆమె 5సం॥ల పిల్లగా ఉన్నప్పుడే ధ్యానంలో కూర్చుని భగవద్దర్శనమును గావించినటువంటి వ్యక్తి. "అమ్మ నన్ను పిలిస్తే వచ్చి ఇలా కూర్చుని ధ్యానంలోకి వెళ్ళాను" అని చెప్పారు. కానీ మనకు భక్తియోగాన్ని ఉపదేశించారు ఆమె. అన్నింటిలోకి చాలా సులువైన మార్గం కనుక అందరికీ సులభసాధ్యం.

ఇక్కడ ఆమె పుడుతూనే అరికాలిలో చక్రముద్రతో పుట్టారు. కమలాంబికా పేరుతో ప్రసిద్ధి చెందుతారని కూడా వారి తండ్రిగారి ద్వారా, ముందుగానే తెలియజేయబడింది. ఈమె పుట్టక ముందు సాధన మనకు తెలియదు. పుట్టాక త్రిపురసుందరీ ఉపాసన చేశారు. కానీ ఆమె ఎప్పుడూ భగవంతుని కథలు చెప్పడం, భగవంతుని మాటలను ఉపదేశించడం, కీర్తనలు చేయడం, చేయించడటం లాంటి ప్రవచనాలు చెప్పడం ఒక గురువుగా మనకు బోధించలేదు. ఇవన్నీ ఆమె జీవితంలో సహజంగా ఆచరించబడి ఉన్నాయి. అవి ప్రామాణికములు. ఆమె నిజజీవితంలో ఏమి ఆచరించారో, ఎవరితో ఏం మాట్లాడారో, ఎవరి విషయంలో ఎవరికి సలహా ఇచ్చారో- అవన్నీ తరచిచూస్తే, ఆమె జీవితాన్ని ఏవిధంగా అనుభవించారో, ఆచరించారో తెలుసుకుంటే అవన్నీ కూడా (శాస్త్ర ప్రమాణాల, వైదిక సంప్రదాయాల, మహాత్ముల ఆచరణలు) మూటగా మనకు గోచరిస్తుంది. నేను ఇప్పుడు ఆ మూటను విప్పి, ఏది భగవద్గీతలోని వాక్యము. ఏది భాగవత ప్రవచనము? ఏ మహానుభావుని జీవిత ఆచరణ ఇది? అని విడమర్చి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాను.

ఆ చాప్టర్‌కు సంబంధించిన విషయం ప్రకారము, ధ్యానయోగం కంటే ఆమె జీవితంలో భక్తియోగమునకే ప్రాధాన్యతనిచ్చారు. భక్తులకూ అదే ఉపదేశమిచ్చారు. తరచిచూస్తే ఆమె వాటన్నింటినీ ఆచరించి, పదిలపరచి మూటకట్టి ఉంచారు. అంతేతప్ప వాటిని ప్రబోధములుగా మార్చి, ఒక గురువుగానో, ఒక సంస్థగానో లేక ఒక ప్రామాణిక స్త్రీగా కనపడాలనే ప్రయత్నం చేసి, సమాజంలో ప్రత్యేకత సంతరించుకున్న ఒక శక్తిగా వ్యక్తమయ్యే ప్రయత్నం చేయలేదామె.

అవసరమైన వారికి (ఆకలిగొన్నవారికి) ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఆ మూటను విప్పి తీసుకునే ప్రయత్నం చేస్తారని ఆమె భద్రపరచి, అందరికీ అందేటట్లుగా పీఠంలో భద్రపరిచి ఉంచారు. కావాలనుకున్నవాళ్ళకు సులభంగా అందేందుకే ఈ మూటలో ఏమున్నాయో విప్పి, లిస్ట్‌రాసి ఉంచుతున్నాను. కావాలనుకున్న వాళ్ళకి సులభంగా అందజేయగలిగే సేవను ఈతరంలో ఉన్న నాకు ప్రసాదించారామె.

కృష్ణుని వాక్యములను ఆచరించినటువంటి ఈమె ఒక ఉదాహరణ. అంతేకాని వాక్యములు నమూనాలు కావు. అందుకే ఈమె ప్రామాణిక గురువు. ప్రబోధములు ప్రామాణికములు.

కృష్ణుడు ధ్యానయోగం చెప్పాడు. అర్జునుడు నిరాకరించాడు. ఇక్కడ అమ్మమ్మగారు ధ్యానంలో చిన్నప్పుడే భగవతిని దర్శించారు. తరువాత దసరాలలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నప్పుడు, ఆనందంతో కొద్దినిమిషాలు ధ్యానంలోకి వెళ్ళి ఆనందిస్తూ ఉండేవారు. ఇది చాలామంది ప్రత్యక్షంగా చూశారు. రాత్రిళ్ళు ఆమె ఎక్కువసేపు నిద్రపోయేవారు కాదు. తెల్లవారుఝామున లేచి మంచంపైన కూర్చుని ధ్యానశ్లోకాలు చదువుతూ, ఏవో పాటలు పాడుతూ తన్మయత్వంలో ఉండేవారు. ఇవన్నీకాకుండా ఆమెకు కపాలమోక్షం సిద్ధించేటప్పుడు కూడా ఆమె పద్మాసనంలో (ధ్యానంలో) కూర్చుని ఉన్నారు. వీటన్నింటినీ ఆమె ఆచరించి, భక్తులకు ఈ ధ్యానయోగం, భక్తియోగాన్ని ఉపదేశించారంటే అది ఎంత సులభమో మనకు తెలియదు కానీ, *అందరం సులభంగా ఆచరించేలాగా* ఉపదేశించారు. అర్జునుడు నిరాకరించినట్లుగా, శిష్యులు నిరాకరించే అవకాశం లేదు.

## 2. భక్తితో చేసే భగవత్‌సేవయే యోగం

భగవద్గీతలో కృష్ణుడు "సంపూర్ణంగా నాకు తనను తాను అర్పించుకునేవాడే నిజమైన యోగి" అంటాడు. త్యాగానికీ, సన్యాసానికీ, యోగానికీ బేధం లేదని కృష్ణుడు చెప్తున్నాడు.

*"ఇంద్రియ సంతృప్తిపట్ల వాంఛను విడిచిపెట్టకపోతే ఎవ్వరూ యోగి కాలేరు"* (భ.గీ.6.2)

మన మనస్సు కృష్ణసేవాభాగ్యంలో నిమగ్నమైనప్పుడు, కృష్ణచైతన్యంతో వ్యవహరించినప్పుడు మాత్రమే మనం నిజమైన సన్యాసులం, నిజమైన యోగులం అవుతాము. హఠ, కర్మ, జ్ఞాన, భక్తి వంటి సమస్త యోగపద్ధతుల సారము, త్యాగం లేక దానం యొక్క సారము, కృష్ణుని గురించి చింతించడమే.

కృష్ణుడు అర్జునుని యోగివి కమ్మంటాడు. అదే సమయంలో యుద్ధం (కర్మ) చేయమంటాడు. భౌతిక ప్రపంచంలో ఇంద్రియ తృప్తికే పాడుపడతారు. నిజమైన యోగి ఫలితాన్ని ఆశించడు. కృష్ణుడుతప్ప కోరిక ఉండదు. కృష్ణుడు అతనివద్దే ఉంటాడు. భగవంతునికి తనను తాను అర్పించుకున్నవాడు యోగి. యోగి అంటే (సన్యాసము) త్యాగము. సన్యాసం అంటే భౌతిక వాంఛలను వదిలేయడం. ఏదైనా సరే వదిలేయడమంటే త్యాగం, సన్యాసం. త్యాగం చేసినవాడు జీవితాన్ని, ముఖ్యంగా తన మనస్సును అర్పించి జీవించగలిగితే, వారిని మనం యోగి అని అనవచ్చును. ఈ విధమైన జీవనమును ఒక నమూనాగా, ఆచరణాత్మకమునకు ఉదాహరణగా శ్రీమతి కమలమ్మగారు కృష్ణుని వాక్యమును అనుసరించిన యోగిగా, అందులోనూ 13 సం॥లు ఆమె చేసిన భగవత్ సేవయే ఒక యోగం అని చెప్పే ప్రయత్నం చేస్తున్నాను.

**02.12.2003**

ఈ జీవితంలో ఇక చేయాల్సినవి ఏమీ లేనప్పుడు (బాధ్యతలన్నీ తీరాక), భగవంతుని

సమక్షములోనే గడపాలనే కోరిక ఉన్నప్పుడు (దేవుడిని చేరుకుంటే చాలు). ఈ లౌకిక సంబంధమైన కాలక్షేపం, ఉదా॥కు, ఇంగ్లీషు నేర్చుకోవడం, కంప్యూటర్ నేర్చుకోవడం – ఇవన్నీ మనకోసమో, మన పిల్లలకోసమో అవుతుంది కదా! కానీ మన లక్ష్యం అది కానప్పుడు, మనం దేవుని పట్ల నిజంగా, బలంగా లేమేమో అనిపిస్తుంది. ఉంటే లౌకికమైన వాటిపట్ల ఆకర్షితులం అవ్వము కదా. *(ఒకరోజు సాయంత్రం భవానీ ఈ ప్రశ్న వేసింది. దానికి సమాధానం వ్రాయాలనిపించింది)*

భగవంతుడు ఈ జన్మను ప్రసాదించాడు. దానికి కొంత ఆయుర్దాయం ఉన్నది. పూర్వజన్మ వాసనలు, కర్మలను బట్టి జన్మ వచ్చింది కాబట్టి జీవిస్తున్నాము. ఈ జన్మలో మోసుకురావడం వలన మన ప్రవర్తన, సంస్కారము, ఆలోచనలు అన్నీ వాటికి అనువర్తించి ఉంటాయి. వాటిని అనుసరించి మన లక్ష్యం నిర్ణయించబడుతుంది. లేకపోతే కోట్లాదిమందిలో లేని (భగవంతునిలో ఐక్యమవ్వాలని) కోరిక ఉత్పన్నమవడమంటే మనకు అర్థమవుతున్నది కదా!

జీవికి లక్ష్యం ఏర్పడ్డాక దానికోసం కృషిచేయాలి. అందుకే ఈ జన్మ ప్రసాదింపబడింది. జీవికి లౌకిక విషయాలపట్ల ఆసక్తి ఏర్పడిన తర్వాతనే ఈ కోరిక ఉదయిస్తుంది. (భగవంతుడు ఇచ్చిన ఇటువంటి జన్మలకు బాధ్యతలన్నీ ముందుగానే తీర్పించబడి, లక్ష్యసాధనవైపు మనసు మొగ్గచూపబడుతుంది.) ఇటువంటి జీవులకు గురువు ఇప్పటివరకూ దొరకకపోయినా, గురువు అవసరం ఇప్పుడు కలిగించబడిందని తోస్తున్నది.

నావ ఎటో వెళ్తుంది. దాన్ని సరియైన గమ్యమునకు చేర్చగలిగే నావికుడు కావాలి ఇక్కడ. నిరాకార సాధనలో వచ్చే విషయాలను అందుకోవడం సాధకుడికి కష్టము, ఆలస్యము కూడా అవుతుంది. అదే సాకార సాధనలో తొందరగా విషయాలు అర్థంగావింపబడతాయి. స్వంత విశ్లేషణతో కొంతదూరం మాత్రమే వెళ్ళగలము. ఖచ్చితమైన సమాధానాలు దొరకవు.

లౌకిక విషయాలను ఆచరించడమన్నది జీవించి ఉన్నంత వరకూ తప్పనిసరి. అటువంటప్పుడు వాటికి అంతేమీ లేదు కదా! పిల్లలు, భర్త, వారి బాధ్యతలు తీర్చడం అనేవి కాలం గడిచేకొద్దీ కొంచెం కొంచెం తగ్గుతుంటాయి. తగ్గేకొద్దీ ఆధ్యాత్మిక సాధనలపై మనసు ఎక్కువ మొగ్గు చూపుతుంది. అంతేకానీ, లౌకికమైన వాటిపట్ల ఆసక్తి తగ్గడం అనేది తప్పేమీ కాదు. భగవద్గీతలో చెప్పినట్లుగా సాధకులు, ఆర్తులు, జిజ్ఞాసువులు, ముముక్షువులు – ఇలా 4 రకాలుంటారు. జిజ్ఞాస అనేది ఉంటే తప్ప వాడు ఏరకమైన సాధనకు అర్హుడు కాడు. తర్వాతనే అది అలౌకికమునకు ఉపయోగపడుతుంది. ఈ ప్రపంచములో అన్నీ భగవంతునిచే సృష్టించబడినవి అయినప్పుడు అన్నీ ఆయనకు సంబంధించిన విషయములే. మనం ముందుకు వెళ్ళాలిగానీ అన్నిట్లోనూ ఆ భగవత్తత్వము గోచరిస్తుంది.

ఉదాహరణకు ఇంగ్లీషు నేర్చుకుంటే, అందులో ఉన్న ఆధ్యాత్మిక పుస్తకాలు చదవగలిగే స్థితి రాదా? కొంత కాకపోతే కొంత. నిజమైన కోరిక ఉన్నప్పుడు మనకు కావలసినవి ఎప్పుడు, ఎక్కడనుండి వస్తాయో మనకు తెలీదు కదా! తెలుసుకునేవాడు ఇది వద్దు, ఇది కావాలని

అనుకోవడమెందుకు? పాజిటివ్‌గానే తీసుకుని ముందుకు పోతూ ఉంటే కావలసినవి దొరుకుతాయేమో? మనకు తెలియదు కదా! అలాగే కంప్యూటర్లు నేర్చుకుంటే, ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక విషయాల గురించి చదివి, తెలుసుకోగలిగే అవకాశం దొరుకుతుంది కదా! పాజిటివ్‌గా వెళ్తే మనకు కావలసినవన్నీ కూడా వాటిల్లోనే దొరుకుతాయి. ఎందుకంటే అన్నీ భగవంతుని సృష్టే కాబట్టి. ఇది లౌకికం, అది అలౌకికం అనుకోనక్కరలేదు. ప్రతిదాంట్లోనూ తెలుసుకోవలసినది ఎంతో ఉంది. అవన్నీ మనకు అక్కర్లేదు. కనీసం ముందుకువెళ్తే ప్రతిదాంట్లోనూ మనకు కావలసిన దాన్ని వెతుక్కోవచ్చు. అప్పుడు ఎక్కువ విషయాలను తక్కువ సమయంలో తెలుసుకోగలుగుతాము. అందువలన ఈ లౌకికములు అలౌకిక సాధనకు ఉపయోగపడవు అని అనుకోనక్కర్లేదు. అన్నీ ఏదోవిధంగా ఉపయోగపడతాయి. వాటిల్లోంచి కూడా కొన్ని విషయాలు తెలుస్తుంటాయి.

ఒకసారి నేనొక ఫొటో చూశాను. రెండు చిలుకలు ఒక కొమ్మమీద కూర్చుని ఉంటాయి. దాని కింద ‘‘Where there is love, there are always miracles’’ అని ఉంది. ఇది చాలా బాగుందని చాలా రోజులు అనుకునేదాన్ని. తరువాత మా గురువుగారి తత్వమును అర్థంచేసుకునే స్థితికి వచ్చిన తర్వాత గురువుద్వారా పొందినటువంటి అనుభవాలను తరచి చూసుకున్న తర్వాత, వారి ప్రేమతత్వములో అన్నీ అద్భుతాలు మాత్రమే జరుగుతాయని తెలిసిన తర్వాత, ఆ వాక్యం యొక్క నిజమైన అర్థం బోధపడింది. ప్రేమకు, అద్భుతానికి ఎంతో దగ్గర సంబంధం ఉంది అనిపించింది. తర్వాతనుండి ఆ వాక్యములు ఎంతో ఆకర్షించి, చదివినప్పుడల్లా ఎంతో ఆనందాన్ని కలుగచేశాయి. ఇలా ప్రతి చిన్నదాన్ని అర్థంచేసుకుంటూపోతే మనకు ఆధ్యాత్మికతే గోచరిస్తుంది. అంటే మన దృక్పథం అటువైపే ఉన్నట్లయితే తప్పక అర్థమవుతుంది. ఇక్కడ లౌకిక, అలౌకిక ప్రసక్తి అక్కర్లేదు. దృష్టిమాత్రం అటే ఉంటే చాలు. ఇలా మనసులోకి వచ్చే ప్రతి ఆలోచననూ మనం ఆధ్యాత్మిక సాధనా దృష్టితో చూస్తూ ముందుకు వెళితే తప్పక మనకు ఆ దృష్టిలోనే సమాధానం దొరుకుతుంది. Where there is a will, there is a way.

ఇష్టములేనిదైనా సరే మన దృష్టితో ఆలోచించగలిగితే అందులోనే మనకు కావలసినది దొరికి తీరుతుంది. ఇది నిజం. భగవంతుడిలో లయం కావాలనో, లేక ఆయన వద్దే ఉంటే శాంతి దొరుకుతుందనో భావం ఉండడం మంచి లక్ష్యమే. కానీ దానికోసం మనం చేయాల్సిన సాధనలేమిటి అనేవి కూడా తెలుసుకోవాలి కదా! అవి చేయించేవరకూ ఈ జీవితం ఉంటుంది. ఉంది కాబట్టే ఇవన్నీ సక్రమంగా సరైన సమయానికి మనం చేసి తీరాలి. అప్పుడే కదా మన కోరిక నెరవేరేది.

“తండ్రీ, ఈ జీవితంపై ఆశలేదు. నీవద్దకు చేర్చుకో. అది చాలు నాకు” అంటే జన్మాంతర కర్మలు తొలగించుకోవడం ఎలా జరుగుతుంది? తొలగించుకుంటూనే, దగ్గరయ్యే మార్గం సాధన చేయాలి. భగవంతునికి ఏమీ అంటవు. నిర్మలైమన, నిశ్చలమైన ఆత్మ – అదే సత్యము, జ్ఞానము, ఆనందము. ఇవి ఆయన లక్షణాలు. మనం కూడా అవే సాధించగలిగితే ఆయన మనలను దగ్గరకు తీసుకుంటాడు, ఐక్యం చేసుకుంటాడు.

మనం కూడా ఆ లక్షణాలను సాధించడం కొరకు సాధన చేయాలి. అవే లక్ష్యసాధనలు. "మైత్ర్యాదివాసనాలభ్య మహాప్రళయసాక్షిణ" అనే లలితాసహస్రనామం తెలుసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష అనేవి నాలుగు యోగసాధనలు. ఇవి జీవి సాధిస్తే తప్ప, అమ్మవారు ముక్తిని ప్రసాదించరు అని దీనర్థము. ఇవి ముక్తిమార్గములు –

1. మైత్రి – స్నేహమును, ప్రకృతిని అలవర్చుకోవాలి.

2. కరుణ – పోనీలే పాపం అనుకుంటూ క్షమించగలిగే తత్వాన్ని అలవర్చుకోవాలి.

3. ముదిత – అంటే సత్సాంగత్యము.

మంచి మాటలు భగవంతునికి సంబంధించినవి, మనం ఆచరించగ్గవి తెలుసుకుంటూ ముందుకు పోతుండాలి.

4. ఉపేక్ష – తటస్థంగా ఉండడం, నచ్చనివాటిపై చర్చచేస్తూ పోకుండా తటస్థంగా ఉండడం. కష్టసుఖాల్లో కూడా తటస్థంగా ఉండడం, దేనికీ ఎక్కువగా స్పందించకుండా ఉండడంవంటి లక్షణాలను జీవి తప్పక అవలంబించాలి. లేకపోతే వాడికి మోక్షం లేదు అని అమ్మవారు ఈ నామంలో చెప్పింది.

ఇవన్నీ అలౌకిక సాధనలు కాబట్టి జీవించి ఉన్నప్పుడే చేయాల్సినవి. జీవితం ముగిసిపోవాలంటే ఎలా? జీవితాన్ని ప్రసాదించినది వీటన్నింటినీ ఆచరిస్తూ, అందరిలో భగవతత్త్వాన్ని చూడగల్గుతూ, ఆనందించగలిగే స్థితిని జీవుడు, జీవించి ఉన్నప్పుడే పొందగలుగుతాడు కానీ, జీవితం అంతమైనా ఈ లక్షణాలు సాధించేవరకూ మళ్ళీ పుట్టక తప్పదు. అందుకని, ఈ పొందిన జీవితాన్ని సార్థకం చేసుకోవడానికి ప్రతి జీవి (ముక్తిని కోరేవారు) ప్రయత్నించాలి. ప్రతి పనిలోనూ, ఆలోచనలోనూ, చేష్టలోనూ భగవతత్త్వాన్ని గ్రహించగలిగేలా మనస్సును సానపట్టాలి. అలాపడితే, అన్నింటిలోనూ విషయాన్ని గ్రహించగలుగుతాము. అందుకు సూచనలు – కొంత గ్రంథపఠనము, వినడం, విన్నదాన్ని పరిశీలన చేయడం. దాన్ని ఎంతవరకూ మనం చేయగలుగుతున్నామని మనం ఆత్మపరిశీలన చేసుకోవడం లాంటివి పాటిస్తూ, చేయలేని వాటిని చేసేలాగా సాధన చేయడమే యోగసాధనలు అవుతాయి. వీటిని ప్రయత్నిస్తే నిజంగా ఈ జీవితమే చాలదు కదా! తక్కువ సమయంలో ఎక్కువ సాధనలూ ఉన్నాయి. అందుకే ముక్తికి ఎన్నో జన్మలు పడతాయంటారు. అలాంటప్పుడు, మనం తెలివితక్కువగా జీవితాన్ని ముగించేసుకుని ఐక్యం అవ్వాలనే ఆరాటపడటం ఎంత హాస్యాస్పదము? తెలివి తెచ్చుకుని ఉన్న తక్కువ సమయంలో భగవంతుడి గురించే ఆలోచిస్తే, మన తప్పులు సరిచేసుకుంటూ సాధనలు చేస్తూ, తక్కువ జన్మలలోనే ముక్తికోసం పోరాడాలి, ప్రయత్నించాలి. కానీ జీవితమూ వద్దు, సాధనలూ వద్దు అంటే, మనం సరియైన కోరికను కోరడం లేదన్నమాట. అత్యాసతో ప్రార్థిస్తున్నామని తెలుసుకోవాలి.

కమలమ్మగారు తమ జీవితంలో సుమారు 11 సం॥ల వయస్సు వచ్చినప్పుడు గురూపదేశం

పొందారు. ముఖ్యంగా (దాంపత్య జీవితం కొరకు) మనకు కనిపించే భౌతికమైన ఇంద్రియవాంఛలు, సంతానార్థం కొరకు ఇవన్నీ లౌకిక ప్రపంచంలో ఆమె ఆచరించారు. వివాహం జరిగింది, పిల్లలు కలిగారు. పెంచారు. వారి వివాహ బాధ్యతలు కూడా ఆమె స్వీకరించారు. పరమపదించేవరకు గురుమార్గాన్ని, ఉపదేశాలను ఆమె స్వయంగా ఆచరిస్తూ కూడా జీవన విధానంలో అన్నింటిని సామాన్య జీవునివలె వర్తిస్తూ కనపడుతున్నారు.

అంటే కృష్ణుడు చెప్పినట్లు (యోగి కావల్సినవాడు కర్మలను ఆచరిచవలసిందే) ఈవిధంగా మనస్సును గురువులు ఉపదేశించిన మార్గంవైపు మళ్ళించి, త్రిపురసుందరీ పీఠమును అతిచిన్న వయస్సులోనే స్థాపించి, తను భక్తితో కొలుచుకుంటూ, తన చుట్టూ ఉన్నవారికి కూడా ఎలా పూజించాలో, మనస్సును నిర్మలంగాను, విశాలంగానూ ఉంచుకోవాలని బోధిస్తూ, తన జీవితంలో లౌకికంగా మనందరివలెనే బాధ్యతలు స్వీకరిస్తూ, మనస్సును మాత్రం భగవత్ కైంకర్యం చేయడంవలననే ఆమె జీవితంలోకి (సుమారు 35-40 సం॥ల మధ్య వయస్సులోనే) అమ్మవారు స్వయంగావచ్చి "నీలో ఐక్యమవుతాను" అని చెప్పడం జరిగింది. ఒకప్రక్క ఆధ్యాత్మిక సాధన పరిపక్వమై ముందుకు వెళ్తున్నారు. ఒకప్రక్క సామాన్యురాలిగా జీవిస్తున్నారు. ఇక్కడ మనం గ్రహించాల్సింది ఏమిటంటే- ఆమెకు డబ్బును తన కోసం దాచుకోవడం తెలియదు. తనవద్దకు వచ్చినవాళ్ళకు తనకు లేకపోయినా సరే ఎంతో కొంత ఇచ్చి పంపుతుండేవారు. తనకు ఉన్నాయో, లేదో అనే ఆలోచనే లేదు. ఇంద్రియభోగములు, సంతానార్థము, ఆ తర్వాత ఈమె పీఠబాధ్యతనే ఎక్కువగా స్వీకరించడం మనకు తెల్సిందే. భార్యాభర్తలిద్దరూ సాధకులే అవడం వలన ఒకరికొకరు నమస్కరించుకునేవారు. కాబట్టి ఎప్పుడు ఏది అవసరమో దానివరకే ఆ ధర్మాన్ని స్వీకరించారు తప్ప జీవితాంతం స్వీకరించింది. ఒక్క భక్తితో అమ్మవారిని సేవించడమో మనం గుర్తించవచ్చు.

ముఖ్యంగా ఆమె తనను ఆశ్రయించిన వారి భక్తిని ఉపదేశించి, వారిని ఆ మార్గంలోకి తీసుకువచ్చి, ఆరాధనా విధానాలను బోధిస్తూ, వాళ్ళచేత పాటింపజేసి, తరించేందుకే కృషిచేశారు. పుణ్యకార్యాలు చేయిస్తూ, ఉదా: ఇంటికివచ్చిన అతిథిని దైవంగా చూసి భోజనం పెట్టిపంపడం. అమ్మవారు ఆ రూపంలో వస్తుందని చెప్పి, ఆ పనిని వారిచేత మనస్ఫూర్తిగా చేసేలాగా మలిచారు. దీనికి ఉదాహరణ త్రిమూర్తులకు ఆమె అన్నంపెట్టడం. ఇక్కడ మనిషికి భోజనం పెట్టడం కంటే, వచ్చిన వారిలో భగవతి ఉన్నదని చెప్పే నమ్మకాన్నీ, భక్తిభావాన్ని పెంచడం – ఆమె చేసి చూపించిన భక్తిసేవాయోగం. ఆవిధంగానే తన వద్దకు వచ్చిన వారందరిలోనూ, వచ్చినది తను సేవించే అమ్మవారిగానే భావించి, అందరిలోనూ ఆమె అమ్మవారినే చూసేవారు. అందుకే ప్రేమతో పలకరింపు, ఆతిథ్యం, అపారమైన కరుణ, అవ్యాజమైన ప్రేమ. ఇవన్నీ చూస్తే భగవత్ తత్త్వం ప్రస్ఫుటంగా స్పష్టమౌతుంది. ఒకరకంగాచూస్తే ఆమెను భక్తురాలిగానూ, గురువుగానూ గుర్తుపట్టవచ్చును. ఆమె భగవతి పట్ల ఆచరించినవి – సాధకురాలిగా. అవే మనకు బోధితములైతే – ఆమే గురువుగా రెండూ మిళితమై ఉంటాయి. అందరిలోనూ అమ్మవారు ఉంటుంది. కాబట్టి అందర్నీ ఆమె ప్రేమతో సాధన చేశారు. అదే భగవంతుని పట్ల చేస్తే భక్తి అవుతుంది. అందరిపట్ల

చేస్తే ప్రేమ అవుతుంది. కనుక దాన్ని ఆమె ఆచరించిన విధానమే 'భక్తియోగం'గా చెప్తున్నాను. అదే **ప్రేమతత్వము**.

భక్తియోగపద్ధతిలో 9 మార్గాలున్నాయి. శ్రవణం, కీర్తనం, స్మరణం, సేవనం, దేవాలయంలో పూజించడం, ప్రార్థించడం, ఆజ్ఞాపాలన చేయడం, భగవంతుణ్ణి స్నేహితుని వలె సేవించడం, భగవంతుని కొరకు అన్నింటినీ త్యజించడం.

**1. శ్రవణం – వినడం, జపించడం:**

భక్తిమార్గములోని మొదటి పద్ధతిని ఆమె ఆచరించిన విధానము 'ఓం నమశ్శివాయ' అనే శివపంచాక్షరి మంత్రమును మొదట 108సార్లు చేసిన తర్వాతనే ఆమె పీఠంలో పూజచేయించే వారు. ఆమె నిరంతరం ఏదో ధ్యాసలోనో, జపంలోనో ఉన్నట్లు కనపడేవారు. దసరా ఉత్సవాలు జరుగుతున్నపుడు శిష్యులు బియ్యం ఏరుతున్నప్పుడు కూడా సమయం వృధా చేయకుండా 'ఓం నమశ్శివాయ' చెయ్యమని చెప్తుండేవారు. ఆమె ఎంత సాధన చేశారంటే రైలుశబ్దం కూడా నమశ్శివాయ మంత్రంలాగా వినిపించేంత వరకు. అంటే నామం ఊపిరిలోనూ, మనస్సులోనూ కూడా లయమైపోయిందన్నమాట. భక్తులు తమ వద్దకు వచ్చినప్పుడు వారి కష్టములను ఓర్పుగా **వినడమే** ఆమె శ్రవణ భక్తికి ఉదాహరణ.

**2. కీర్తనము:**

అమ్మమ్మగారికి గానం అంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు సంగీతం నేర్చుకున్నారు. ఒకచేత్తో హార్మోనీ వాయించేవారు. వారి తండ్రిగారు రాసిన పాటలను పాడుతుండేవారు. *"మధురమీనాక్షి అంబ"*, *"కాళరాత్రి స్వరూపిణి"*, *"కమలాంబ నా చింతదీర్చవమ్మా"* ఇలాంటి కీర్తనలు చక్కగా, రాగయుక్తంగా పాడేవారు. (ఆమె స్వయంగా పాటపాడిన క్యాసెట్ ఒకటి ఉంది) భక్తులెవరైనా వస్తే వారిచేత పాట పాడిస్తేనేగానీ వదిలేవారు కాదు. ఆమె కాలంచేసే రోజు సాయంత్రం కూడా, వారి కుమార్తె అయిన సరోజతో *"కాళరాత్రి"*, *"కమలాంబ నా చింతదీర్చవమ్మా"* అనే పాటలు పాడించుకున్నారు. చిన్నపిల్లగా ఉన్నప్పుడు కూడా ఏవో పాటలు *"కొడతానంటడు, తిడతానంటడు బందరు పిచ్చోడు"* లాంటి జానపదాలకు రాగాలు కట్టి పాడుతుండేవారు. తెల్లవారుఝామునే లేచి కొన్ని పద్యాలు, పాటలు అమ్మవారికి ఎదురుగా కూర్చుని పాడుతుండే వారు. ఎవరైనా పాడితే కూడా విని ఎంతో ఆనందించేవారు. ఈ విధంగా భక్తిలో రెండవదైన **'శ్రవణం'** కూడా చక్కగా ఆచరించిన దాఖలాలు ఉన్నాయి.

**3. స్మరణం:**

వారితో తోడుగా గురువులైన బాలాజీ, శ్యామలరావుగార్లను తలచుకుంటూ ఉండేవారు. వారిచే తీసుకున్న త్రిపురసుందరి ఉపాసనను చక్కగా ఆచరించేవారు. ఎవరిపైకైనా అమ్మవారు వచ్చినప్పుడు, వచ్చింది అమ్మవారుగా గ్రహించి "ఇంకచాలు, సంతోషంగా ఉంది కదా! ఇలా బయటకు వస్తే ఎలా? రావద్దు" అని చెప్తూ పానకం ఇచ్చి పంపేవారు. సన్నిహితులతో అమ్మవారు

తన వద్దకు ఎలా వచ్చిందీ, ఎపుడు తనలో ఐక్యమౌతానని చెప్పిందీ, వాక్సుద్ధి, భవిష్యత్ దర్శనం తద్వారా ఆమె పొందిందీ అవన్నీ చెప్తుండేవారు. వచ్చిన ప్రతివారికి "ఆమెకు నమస్కరించండి. మీ సమస్యలు పరిష్కారమౌతాయి" అనే స్మరణ తప్ప తనే దేవతననీ, తనకే నమస్కరించాలని ఎప్పుడూ చెప్పలేదు. అలా రోజంతా ఏదో విధంగా ఆమె ఆ తల్లి స్మరణలోనే ఉండేవారు.

ఆమె నిద్రలో శంకరుల సౌందర్యలహరిలోని శ్లోకములను బయటకు చెప్తుండేవారట. అది విన్నవారు ఆశ్చర్యపోతూ ఉండేవారట. ఆమె పెద్దబాలశిక్ష తప్ప చదువుకోలేదు. ఆమె తండ్రి "చదువులలోని మర్మములెల్ల చదివింది మా తల్లి" అంటుండేవారట.

**4. సేవనం:**

ఆమె ఏనాడూ అమ్మవారికి ధూపదీప నైవేద్యములతోనూ, పసుపు కుంకుమలతోనూ గంటల తరబడి పూజించగా ఎవ్వరూ చూడలేదు. ఆమెదంతా మానసిక పూజే. ముఖ్యంగా తన వద్దకు వచ్చిన భక్తుల సమస్యలు విని, ఓదార్చి, అమ్మవారిని నమ్ముకోమని, తప్పక సమస్యనుండి బయటపడి తీరతారని ధైర్యం చెప్పి, చేయాల్సిన విధానములను చెప్తుండేవారు. అయితే అమ్మవారిని చక్కగా అలంకరించి చూసుకొని ఆనందపడుతుండేవారు. వచ్చిన ప్రతివారిలోనూ వచ్చింది అమ్మవారేనని భావించి, సేవించారామె. "పీఠంలో శ్రీచక్రం ఉన్నదా?" అని ఎవరో స్వామి అడిగితే "లేదు, మనస్సు వక్రంగా లేకుండే శ్రీచక్రపూజ" అని సమాధానమిచ్చారు. భక్తులను కాపాడటమే ఆమె పూజ. అదే ఆమె సేవ. "సేవనం" అనే నాల్గవ పద్ధతిని కూడా ఏవిధంగా ఆచరించారో ఇది చదివితే తెలుస్తుంది మనకు.

దైవం మానుష రూపేణా అనే సిద్ధాంతాన్ని నమ్మినవారామె. అతిథిని గౌరవించి, ప్రేమతో ఆదరించడమే సేవగా భావించారామె. మానవసేవే మాధవసేవ – అదే ఆచరించి చూపించారామె. ఎవరో భక్తురాలికి "నోములు చెయ్యలేకపోతే బాధపడక్కర్లేదు. నీ చేతిలో ఏది ఉంటే దాన్ని ఆ సమయానికి వచ్చినవాళ్ళ చేతిలో పెట్టు. అదే నోము, అదే సేవ" అని చెప్పారట. ఒకచేతిలో ఎవరైనా ఏదైనా పండైనా, చీరైనా ఇస్తే వెంటనే మరొకరి చేతిలో దాన్ని పెట్టేసేవారు. మనస్ఫూర్తిగా ఏది చేసినా, ఎవరికి చేసినా అది భగవత్‌సేవే అని చెప్పారామె.

నేనెక్కడో చదివాను. వివేకానందుడు 3 రకాల సేవల గురించి చెప్తారు. కొందరు ఆర్థికసేవ చేస్తారు(డబ్బుండి తీరికలేక), కొందరు శారీరక సేవ (డబ్బులేక) చేస్తారు, అతికొద్దిమంది ఆధ్యాత్మిక సేవ చేస్తారు (గురువులు). అది ఒక్క గురువులు తప్ప మరెవరూ చేయలేనటువంటిది. ఆధ్యాత్మిక సేవ అంటే కమలమ్మగారి వలె ఆచరిస్తూ, ఆచరింపజేసేటటువంటి సేవలు అని అర్థం.

**5. దేవాలయంలో పూజించడం:**

అమ్మమ్మగారు పీఠాన్ని ఇంట్లోనే స్థాపించారు. అంటే గృహస్థాశ్రమంలో ఉంటూనే, గృహ బాధ్యతలు నెరవేరుస్తూ, వేరే ఆలయానికి వెళ్ళవలసిన అవసరం లేకుండా, ఇంట్లోనే అమ్మవారిని ప్రతిష్ఠించి, తను సేవిస్తూ, అందరికీ సేవించుకునే విధానాన్ని బోధించారు. దేవాలయాల్లో

పూజించడం పూజారులకు తప్ప మనకు సాధ్యంకాదు. మన పేరుతో ఆ పూజారి పూజ చేస్తారు. కానీ ఇక్కడ అలాకాదు. ఆమె మనందరకు, ఇక్కడకు వచ్చి స్వయంగా అమ్మవారిని పూజించుకునే విధానాల్ని ఏర్పాటుచేసి, మనచేత చేయించారు. శివపంచాక్షరి (ఓం నమశ్శివాయ)ని 108సార్లు ముందు జపించి, తర్వాత అమ్మవారి లలితా సహస్రనామము, అష్టోత్తరము, త్రిశతి, ఖడ్గమాలలను కుంకుమతో పూజచేసి, నైవేద్యం పెట్టి, హారతి ఇస్తే అప్పుడు అది పీఠపూజ అవుతుందని చెప్పి, అలా చేయించేవారు. ఇంట్లోకూడా అలానే చేస్తూ, శుక్రవారాలు, ప్రత్యేక రోజుల్లో పీఠానికి వచ్చి పూజ చేసుకోమనేవారు.

దసరాల్లో దశసహస్రములు, లక్ష కుంకుమార్చనలు, అభిషేకములు, సరస్వతీ పూజలు, బాలపూజలు, నైవేద్యములు; విజయదశమినాడు మహానైవేద్యం, అన్న సంతర్పణ గావించేవారు. వీలైనన్ని రోజులు అందర్నీ పీఠమునకు వచ్చి ప్రసాదం తీసుకోమని, మిగిలిన రోజుల్లో ఇంట్లో పూజ చేసుకోమనేవారు. అలా భౌతికంగా చేసే పూజలు నేర్పారు. ముఖ్యంగా ఆమె నేర్పినది మనస్ఫూర్తిగా ఒకరికి ఇవ్వడం – అదే నిజమైన పూజగా చేసిచూపించారు. దేవాలయంలో పూజించడం, మనస్ఫూర్తిగా ఇంటికి వచ్చిన వాళ్ళలో అమ్మవారిని చూసుకుని ప్రేమతో పలకరించడం – ఇవి ఆమె నేర్పిన విధానాలు.

**6. ప్రార్థించడం:**

అమ్మమ్మగారు అమ్మవారితో నేత్రభాషలో మాట్లాడేవారట. ''అమ్మా వాళ్ళింటికి వెళ్ళమంటావా?" అని ఆమె వైపు చూస్తూ ప్రశ్నించి, తర్వాత "అమ్మ వెళ్ళమంటోంది, వస్తానమ్మా" అని చెప్పేవారట.

ఆమె ఏవైనా పుణ్యక్షేత్రములకు శిష్యులను తీసుకువెళ్ళినప్పుడు "అమ్మా కామాక్షీ! నా బిడ్డలను తీసుకువచ్చాను. వాళ్ళ బాధలను తీర్చి చల్లగా చూడు తల్లీ!" అనేవారట. చూశారా! ఆమె ప్రార్థన. మహానుబావుల ప్రార్థనలు కూడా పరులకోసమే అన్నమాట. వారికేం కోరికలుంటాయి!?

శిష్యుల బాధలు తీరిన తర్వాత వారితో "పీఠానికి వచ్చి, అమ్మవారిని దర్శించుకోండి" అని చెప్పేవారు. అంటే అమ్మవారిని దర్శించుకోవటమే ఒక కృతజ్ఞతాభావం అన్నమాట. అదే ప్రార్థన. ఆమె చేసిన ప్రార్థనలు ఈవిధంగా ఉండేవి –

*"అల్పవిద్యలు వద్దు తల్లీ, ముక్తిమార్గమును చూపించు."*

*"వారి వంటిపైకి వచ్చి బాహాటంగా కన్పిస్తే నమ్మలేరు లేదా భయపడతారు. అందుచేత కలల్లోనే కన్పించు."*

*"వారిచేత ఏవైనా మొక్కులు తీర్పించాలంటే కలలో కనిపించి కావాలసినదేదో చెప్పి చేయించుకో."*

అమ్మమ్మగారికి జరగబోయే విషయాలు ముందుగానే తెలుస్తుండటం వల్ల ఒకరోజు *"నాకు జరగబోయేవి ముందుగా చెప్పకు" అని ప్రార్థించారట. (చెల్లెలు తనుమధ్యాంబ ముందు రాత్రే*

పోతారని కలలో ఆమెకు చెప్తే, అది వెంటనే జరగగానే బాధపడి, భయపడి ఆమె అలా ప్రార్థించారు.)

**7. ఆజ్ఞాపాలన చేయడం:**

తమ గురువులైన బాలాజీ, శ్యామలరావుగార్ల ఆదేశాలను, ఆజ్ఞలను చక్కగా పాటించడం వలననే ఆమెకు ముక్తి (కపాలమోక్షం) సిద్ధించుట జరిగింది.

డబ్బును ఆశించరాదు. ఒకసారి శిష్యుడు ఆమెకు రూ.100ల నోటు ఇస్తే అది చిత్తుకాగితంలా కనిపించి కర్పూరం వెలిగించారు. "అయ్యో! అది డబ్బా! నాయనా, నాకు తెలీలేదు" అన్నారట.

ధనలక్ష్మి పూజకు ఒకరు సూట్‌కేస్‌తో డబ్బు తెచ్చి మీకు కావల్సినంత తీసుకోండి అంటే దానితో నాకు పనేంటి! అయినా ఇదంతా నాదే కదా! దీనితో పనిలేదు అంటూ చేత్తో తాకి ఆశీర్వదించి వారిని పంపేశారట.

ఏదైనా ఈ చేత్తో తీసుకుని, ఆ చేత్తో ఇచ్చేస్తుండేవారు. బంగారం కూడా ఆమెకు విలువైనది కాదు. ఒక సందర్భంలో, దొంగకు స్వయంగా గొలుసు ఇచ్చారు. మరెవరికో బంగారుగాజులు ఇచ్చారు. అలా ఒంటిపైనున్న బంగారాన్ని కూడా ఆమె కాగితం ముక్కలాగే చూసేవారు.

కష్టంలో ఉన్నవారే ఆమెకు ఆప్తులు. వారిగురించే ఎక్కువ పాటుపడుతుండేవారు. ఆమెకు పిల్లలు, మనుమలు, అల్లుళ్లు, శిష్యులు, బయటివాళ్ళు అనే తారతమ్యం లేదు. అందుకే కప్పగంతుల సోదరులను పుత్రులుగా భావించి, వారితో కర్మకాండలు జరిపించుకున్నారు. స్వంత కూతురు సంపాదించిన డబ్బును కూడా ఆమెకు చెప్పకుండా పరోపకారం చేస్తుండేవారు. కష్టంలో ఉన్నవారిని ఇవ్వడమే తప్ప, ఎవరిదని ఆలోచించడం మహాత్ముల లక్షణం కాదు.

ప్రసాదం పంచుతున్నప్పుడు మనుమలు, చిన్నపిల్లలైనా కూడా అక్కడ ఉండనిచ్చేవారు కాదు. ఇవన్నీ మనవికావు అనేవారు. "నాకు కావాలంటే బంగారు ఇటుకలతో ఇల్లు కట్టుకునేదాన్ని, కానీ అదెందుకు నాకు?" అనేవారు.

సంస్కారము – భక్తుల క్షేమం, మాతృత్వాన్నే సాధనలుగా తీసుకుని ఆచరించి, తరించారు.

"ఎవరి వద్ద నుండి ఏమీ ఆశించరాదు. కావలసినప్పుడు ఆమే అందిస్తుంది" – అనే సిద్ధాంతాన్ని పాటించారు.

**8. భగవంతుని స్నేహితునివలె చూడటం:**

ఒకసారి చేబియ్యం అన్నపూర్ణమ్మగారు అమ్మమ్మగారిని తమ ఇంటికి రమ్మని ఆహ్వానించారు. అప్పుడు కమలమ్మగారు అమ్మవారి వంకచూసి, "వాళ్ళింటికి వెళ్తావా? పిలుస్తున్నారు" అని నేత్రభాషలో మాట్లాడారు. ఇది పరిశీలిస్తే, అమ్మవారిని ఒక స్నేహితురాలివలె ప్రశ్నించి, ఒక మనిషిలాగా చూస్తూ, మాట్లాడతూ ఆమె అనుమతితో వాళ్ళింటికి వెళ్ళడాన్నిబట్టి, అమ్మవారితో ఒక స్నేహితురాలిలాగా మెలిగినట్లు గ్రహించవచ్చు.

ఇంకోసారి, ఎవరో ప్రక్కవీధిలో ఉన్న కనకదుర్గ గుడికి వెళ్తూ, దారిలో ఉన్న మనింటికి వచ్చేవారట. చేతిలో ఉన్న పూలు, పళ్ళు ఆ గుళ్ళో ఇచ్చి, ఇక్కడ నమస్కారం పెట్టేవారట. ఆ సందర్భంలో అమ్మమ్మగారు **"మా అమ్మవారు కానుకలిచ్చే కనకదుర్గ కాదమ్మా, పరీక్షలు పెట్టే కఠినదుర్గ"** అన్నారట. మనం కూడా మన పిల్లల్నో, స్నేహితుల్నో ఎవరైనా తక్కువగా చూసినా, తక్కువగా మాట్లాడినా ఒకరకమైన బాధతో (ప్రేమవలన) అలాగే మాట్లాడతాము.

*మనస్సుని జయించినవాడు శాంతిని పొందుతాడు కనుక అతడు పరమాత్మను చేరుకున్నవాడు అవుతాడు. (భ.గీ. 6.7)*

ఇంద్రియాలను వశపరచుకోవాంటే యోగం తప్పనిసరి. యోగం అంటే భక్తి ద్వారా మనస్సును అమ్మవారిపైనో లేదా గురువుల పైనో కేంద్రీకరింపజేస్తే, ఇంద్రియాలను అదపుచేయడం సాధ్యమౌతుంది. ఈ విధంగా భౌతిక జీవనాన్ని జయించాకే శాంతి లభిస్తుంది.

అమ్మమ్మగారు (భౌతిక లాలసలను జయించాక) గురుసాధనలు చేస్తూ, ఇంద్రియ నిగ్రహం, భక్తసేవ, గృహకృత్య నిర్వహణ, పీఠ బాధ్యత వీటన్నింటినీ నిర్వహిస్తూ నిర్మలమైన శాంతిని పొందారు. శాంతిని పొందిన మనస్సు కనుకనే ఆమెకు ముక్తి ప్రసాదించబడింది. అదే అమ్మవారిలో లయం చెందడం.

**21.12.2003**

అమ్మమ్మగారికి మొదట అమ్మవారు నీలో ఐక్యమౌతానని చెప్పేవరకు ఆమె మనసు దేనిమీద లేదు. అందరికీ, అన్నీ పంచివ్వడం, అందరితోనూ స్నేహంగా ఉంటూ, భక్తిభావాన్ని పెంపొందింప జేయడమే తప్ప, లౌకికపరమైన విషయసూక్తులు ఆమెకు తెలియవు. కారణజన్ములైనటువంటి వారికి మనోనిర్మలత పుట్టుకతోనే ఉంటుంది. వారు ఆ దారిలోనే నడుస్తుంటారు. కనుక హఠాత్తుగా ఎప్పుడో ఒకసారి భగవద్దర్శనం కలగడం, అనుగ్రహం పొందడం లాంటివి జరుగుతాయి. **మనస్సును జయించడం అంటే ఇంద్రియాలను జయించడం.** లౌకికమైనవి (డబ్బు) ఆమెకు తృణప్రాయం. అమెకు బంగారానికి విలువ తెలియదు. చివరి దశలో కూడా ఎవరో అడగ్గానే ఆమె చేతికి ఉన్నవి ఇచ్చేశారు. జీవితంలో సంతానం కొరకు మాత్రమే ఆమె దాంపత్య జీవితాన్ని అనుసరించినట్లుగా తెలుస్తోంది. తరువాత వారు భౌతిక, మానసిక సన్యాసమును అనుసరించినట్లుగా అర్థం చేసుకోవచ్చును. పిల్లలు కలిగారు. వారి బాధ్యతలు చూస్తూనే, తను తరించి మనలను తరింపజేసే విధానాలను అనుసరించారు. డబ్బు దాచుకుని ఇళ్లు, వాకిళ్ళు ఏర్పరచుకోవాలనే ఆశ అసలు లేనేలేదు. అలా ఉంటే శివాలయంలోని ప్రాకారము నందు నివాసం ఏర్పరచుకోరు. అలా ఏర్పరచుకొనేవారు, ఎవరంటే శివుని అర్ధాంగియైన పార్వతీదేవి. కీర్తికాంక్షలు ఉంటే ఈ తత్వాన్ని ఎంతో ప్రచారంచేసి డబ్బు, కీర్తిప్రతిష్టలు పొంది ఉండేవారు.

వీటినన్నింటినీ జయించిన మనసు (కోరికలు లేని) కనుకనే అది శాంతిని పొందిఉంటుంది. అటువంటి నిర్మలమైన, శాంతిమయమైన మనసు కనుకనే, అమ్మవారు అక్కడ పీఠం వేసుకుని

కూర్చుని, నీలో ఐక్యమౌతాను అన్నది (పరమాత్మను చేరుకున్నవాడు అవుతాడు). పరమాత్మను చేరుకునేందుకు సంసిద్ధమైనటువంటి మానసిక స్థితికి చేరుకున్నాకే, పరమాత్ముడు వచ్చి కూర్చోవడం జరుగుతుంది. అప్పుడింక ఆ జీవుడి పరిస్థితి ఏమిటి? 'జీవన్ముక్తి స్థితి'. స్వచ్ఛమైన మనసు అనే పీటవేస్తే, భగవతి వచ్చి ఆశీనురాలైతే, జీవుడు జన్మ ఉన్నంతవరకూ ఆమెను అర్చిస్తూ, ఆ ఆనందంలో లయమవుతూ ఉండడం తప్ప వేరే కోరిక ఏముంటుంది? కారణజన్ములు కనుక మధ్యమధ్యలో ఇవతలకు వచ్చి మన పనులను కూడా చూసి, మనలను తరింపజేసే ఉపాయాలను బోధిస్తూ, మనలోనే ఆ దేవిని సాక్షాత్కరింప చేసుకుంటూ అందులో కూడా అదే ఆనందాన్ని అనుభవిస్తూ సదా బ్రహ్మానందభరితులై జీవిస్తారు.

శాంతిని పొందిన మనసు "శ్రీచక్రము". అదే పీఠము. దానిపై ఆశీనురాలైన తల్లి ఆ త్రిపురసుందరి. అందుచేతనే అమ్మమ్మగారు "మనస్సు వక్రము లేకుండుటయే శ్రీచక్రపూజ" అన్నారు. ఒక్క మాటలో దానివెనుక ఇంత అర్థమున్నదని తెలుసుకోవాలి. ఆమె మనసు 'బిందువాసిని' అయిన లలితా స్వరూపము (శివశ్యైక్య స్వరూపిణి) అయినప్పుడు ఆమె భౌతికంగా బాలాత్రిపురసుందరి స్వరూపమైన లలితాదేవి బిడ్డగా మనకు గోచరిస్తుంది. ఇక్కడ ఆమె, తన ఆత్మను పరమాత్మగా తెలుసుకుని, సేవించుకుంటూ అందరిలోనూ ఉన్నది ఆమేనని గ్రహించి, వారిని ముక్తులను చేసే ప్రయత్నం చేయగలిగేవారే జీవన్ముక్తులు లేదా కారణజన్ములు అనబడతారు. వీరు జీవించి ఉండగానే (సశరీరంతో) ముక్తిని పొంది బ్రహ్మానందమును పొందుతారు. కారణ జన్ములు కానివారు ముక్తిని పొందాక బ్రహ్మానందమును పొందుతారు (శరీరమును చాలించాక).

జీవన్ముక్తులు శరీరమును చాలించాక, వారు మనసుతో చేసిన ఆరాధనాశక్తి ఏమౌతుంది? శరీరము పాంచభౌతికము కనుక అది మట్టిలో కలిసిపోతుంది. "మనోప్రపతిష్ఠిత శక్తి ఆరాధన" విషయానికి వస్తే, మళ్ళీ వారే భౌతికంగా మనకోసం, లోకకళ్యాణార్థంగా (పీఠముగా వ్యవహరిస్తారు) అంటే వారి మనసునే, ఆత్మస్వరూపమునే పీఠముగా మనకు మలిచి చూపిస్తారు. వాళ్ళు దాన్ని ఎక్కడ ప్రతిష్టింప చేస్తారో అదే పీఠస్థానమవుతుంది. అంటే వారి మనసు, ఆరాధన, సేవ, తరింపజేసే విధానాలు, జ్ఞానమును కలిగించుట, భక్తుల కోరికలు తీర్చుట-ఇవన్నీ వారు జీవించి ఉండగా చేసినవే, కానీ శరీరం లేకపోయినా, ఆ ఉపాసనా దేవతను అక్కడ ప్రతిష్ఠించుట ద్వారా దాని ఉద్దేశ్యములన్నీ నెరవేరతాయి.

పీఠము – సంకల్పశక్తి, అదే భగవతిశక్తి అని చెప్పవచ్చు. అది ఒక సంకల్పశక్తి అయినపుడు, అసలు శరీరంతో పనేముంది? అందుకేనేమో ఆమె "మీరు ఎవరితోనూ పీఠం గురించి ప్రచారం చేయవద్దు" అన్నారు. మనుషులు చేసే ప్రచారంతో ఏమీ జరుగదు. ఎందుకంటే, అక్కడ మనసు లేదు కనుక అది ఫలించదు. ఆమె మనసుతో సంకల్పించి, వారు ఎక్కడున్నా వారిని పీఠము వద్దకు రప్పిస్తుంది, కనికరిస్తుంది, కటాక్షిస్తుంది. ఆ మనస్సు లేక పీఠము చేసే ప్రచారం ఎలా జరుగుతుందో కూడా ఊహించటం చాలా కష్టము. దాని సంకల్పం ఏమిటో అర్హులైనవారు మాత్రమే తెలుసుకోగలుగుతారు.

ఉదాహరణకు, కమలమ్మగారి మానసపుత్రులైన సుబ్రహ్మణ్యం గారిని, వారి భార్యను దగ్గరకు తీసుకున్న వైనం చూడండి. ఒకసారి ఈమె వాళ్ళింటికి వెళ్ళినట్లు కలరావడం, అందులో వీరి నలుగురు సోదరులు ఆమెకు అంత్యక్రియలు చేయడం, తర్వాత ఈమె వారిని ఆత్మపుత్రులుగా భావించటం, సుబ్రహ్మణ్యంగారికి ఒక బిడ్డను అనుగ్రహించడం, బదులుగా వారు తనకూ, తన భర్తకూ ఆబ్దీకములు జరిపేటట్లుగా నిర్ణయించడం జరిగింది. ఆమెవద్దకు కొన్ని వేలమంది భక్తులు వచ్చివెళ్తుంటారు. కానీ అందరికీ ఇలాంటి అదృష్టం కలుగదు కదా! వారిని ఆమె ఎందుకు రప్పించిందో తెలియదు. కానీ, వారి పూర్వజన్మ ఋణాలను ఏవిధంగా తీర్పించారో చూడండి. తల్లిదండ్రుల ఋణాలను తీర్చుకోలేకపోయి ఉంటారు. అందుకని ఈసారి భార్యాభర్తల ఋణాలను తీర్చటం ద్వారా ఋణవిముక్తులై ఉంటారు. అలాగే, వారికి సంతానం లేకపోవటం వలన ఒక బిడ్డను అనుగ్రహించి, తన పేరు పెట్టించి, ఆ విధంగా (బిడ్డరూపంలో) గురువు ఋణమును కూడా తీర్పించారు కమలమ్మగారు. ఎందుకు దగ్గరకు తీసుకుంటారో, మనచేత ఏం చేయిస్తారో, ఇవన్నీ వారి అనుగ్రహంపైన, మన ప్రాప్తం మరియు నమ్మకంపైన ఆధారపడి ఉంటాయి. ఇవన్నీ శిష్యుని విముక్తి కోసం చేయించే చర్యలు తప్ప, ఆమెకు ఆబ్దీకం అవసరమా? ఆలోచించినా దొరకనటువంటి సమాధానాలు ఇవి. అవే దైవలీలలు, అనుగ్రహములు.

**22.12.2003**

## సంతాన ప్రసాదం

కమలమ్మగారు తన భక్తులకు స్వప్నంలో దర్శనమిచ్చి కర్తవ్యం ఉపదేశించి, వారి కష్టాలను తొలగించేవారు. ఒకసారి ఆమె తిరువత్తియూరు (మద్రాసు) వెళ్ళారు. సాయంత్రం అయింది. ఆమె ఆలయంలో నడుస్తుండగా ఎవరో దంపతులు వచ్చి ఆమె కాళ్ళపైపడ్డారు. ఏమిటని అడిగితే, "మేము త్రిపురసుందరి భక్తులం, మాకు సంతానం లేదు, అమ్మవారు కలలో కనిపించి నా గుడికి ఫలానా రోజు ఒక పెద్దముత్తైదువ వస్తుంది. ముఖంపైన 2 పులిపిరికాయలు ఉంటాయి. ఆమెకు నమస్కారం చేసి బొట్టుపెట్టించుకోండి. సంతానం కలుగుతుందని సెలవిచ్చారు. అమ్మవారు చెప్పిన ముత్తైదువ మీరే అని" నమస్కరిస్తే ఆమె "అలానా?" అని, ఆడపిల్ల పుడుతుందని ఆశీర్వదించి పంపారు. తర్వాత వారికి అలానే ఆడపిల్ల కలిగింది.

ఇక్కడ కమలమ్మగారే 'బాలాత్రిపురసుందరి' అమ్మవారుగా ప్రస్ఫుటంగా కనబడే సంఘటన ఇది. కలలో అమ్మవారిలాగా కనబడటం, ముత్తైదువ వలె అమ్మవారిని చూపించడం, చేసే పన్నులన్నీ ఆమెచేత చేయించడం, అంటే నిరాకారంగా ఉండే త్రిపురసుందరి సాకారంగా కమలమ్మగారి రూపంలో కర్తవ్యాన్ని చేస్తుంది అని తెలుస్తోంది. ఫలానా సమయానికి గుడికి వస్తుందని చెప్తే, కమలమ్మగారు వారికి ఆ గుడిలోనే దర్శనం ఇవ్వటం-(ఎందుకంటే ఆ స్థానం ఆమెకు మూలస్థానం కదా!) అలా కాకుండా అమ్మవారు కలలో కనబడినప్పుడే నీకు ఆడపిల్ల పుడుతుందని చెప్పవచ్చును కదా! అలా అయినా అమ్మవారిని నమ్ముతాము కదా! మళ్ళీ

కమలమ్మగారి రూపం చూపడం ఎందుకు? అంటే, నేను సాకారరూపం ధరిస్తే, కమలమ్మగా చేయవలసినవన్నీ (బొట్టుపెట్టడం, నమస్కారం చేయించుకోవడం) ప్రత్యక్షంగానే చేస్తాను, చేయించుకుంటాను అని మనకు చెప్పడం. సాక్షాత్తూ త్రిపురసుందరి అవతారమేనని మనకు తెలియజెప్పడం కోసం చేసినటువంటి ప్రక్రియలు ఇవి. ఇది అప్పటి సంఘటన. ఇప్పుడు 3వతరంలో కూడా అలాగే జరిగిన సంఘటన - ఇది నా స్వానుభవం.

మా అబ్బాయికి ఆరోగ్యం బాగులేక నడవలేని రోజుల్లో, నాకుకూడా ఒక కల వచ్చింది. నేను త్రిపురసుందరీ గుడికి వెళ్ళినట్లు, అక్కడ కొబ్బరికాయ కొట్టి వెనక్కుచూస్తే మా అబ్బాయి పరిగెత్తుకుంటూ లోపలకు వస్తున్నట్లు కనబడింది. అలాగే మేము తిరువత్తియూరు వెళ్ళాము. పిల్లవాడిని ఎత్తుకుని ప్రదక్షిణం చేయడం కష్టంకదా! గుడి చాలా పెద్దది. ఎలాగా? అనుకుంటుంటే ఎవరో దంపతులు వచ్చి (40-45 సం॥లు ఉంటాయి) తమిళంలో అబ్బాయిని ఇవ్వమని అడిగి, పిల్లవాడిని ఎత్తుకుని గుడిచుట్టూ 3 ప్రదక్షిణలు చేసి (మేము ఎంత అడిగినా ఇవ్వకుండా) తరువాత బిడ్డను ఇచ్చి వెళ్ళిపోయారు. ఇంటికి వచ్చాక మా పిన్నిగారు చెప్పారు. పిల్లవాడిని త్రిపురసుందరీ, శివుని సమేతంగా వచ్చి ఆశీర్వదించారు అని రూఢీ చేశారు.

అప్పటికి నాకింకా అమ్మమ్మగారిపైన గురుభావం, నమ్మకంలాంటివేవీ లేవు. అందరూ అమ్మవారిని నమ్ముకో, ఆమే చేస్తుంది అనేవారు. ఆరోజుల్లో నేను అమ్మవారినే ప్రార్థిస్తుండేదాన్ని. అందుకేనేమో నాకు కలలో తిరువత్తియూరు వస్తే చాలని చెప్పింది, చూపించింది. సరేనని వెళ్తే, అక్కడ సాకారంగా ఆదిదంపతులు ఇరువురు వచ్చి ఎత్తుకుని ప్రదక్షిణలు చేయించి, ఆశీర్వదించి వెళ్ళారు. ఇక్కడ నాకొక విషయం అనిపిస్తోంది. ఆ దంపతులిద్దరూ బిడ్డను ఎత్తుకున్నారంటే "శివపార్వతీకా లాడ్‌లా! మాతా పార్వతీకా లాల్ గణపతి" అనే హిందీ భజన గుర్తొస్తోంది. ఎంత ముద్దుబిడ్డ కాకపోతే అంత ఆశీర్వచనం లభిస్తుంది. ఊహించడం చాలా కష్టం.

**23.12.2003**

"లౌకిక ప్రపంచమునకు విరుద్ధంగా కనిపించే చేష్టలన్నీ అలౌకిక ముక్తిసాధనలే" అని ఆమె ఒకచోట చెప్పారు. ముక్తి సాధనామార్గాలు-లలితాసహస్రంలో చెప్పే ఒక నామార్థము - "మైత్ర్యాది వాసనాలభ్యా మహాప్రళయ సాక్షిణీ" - అంటే మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష అనే 4 కూడా ముక్తిమార్గసాధనలనీ, వాటిని ఆచరిస్తే తప్ప అమ్మవారు ముక్తిని ప్రసాదించరని అర్థము. అంటే ప్రతి మనిషి కూడా వీటిని అవలంబించవలసిందేనని దీని అర్థం. కమలమ్మగారి జీవిత చరిత్రను తరచిచూస్తే ఒక అద్భుతమైన లక్షణము కన్పిస్తుంది. దాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేద్దాము.

1. చిన్నపిల్లప్పుడే 'సిగ్గుబిళ్ళ' ఇచ్చేసి రేగిపండ్లు కొని పిల్లలందరికీ పంచడం.
2. "పీఠంలో కొట్టిన కొబ్బరిముక్కగానీ, చెంచాడు పానకం గానీ, ప్రసాదంగానీ దాచిపెట్టడానికి పనికిరాదు. అందరికీ పంచిపెట్టవలసిందే. అవి మనకు కావు. అమ్మవారు వాటిని ఇచ్చినదే పంచడానికి. కానీ దాచుకోవడానికి కాదు" అని చెప్పేవారు.

3. బొడ్డులో ఉన్న చిన్నడబ్బాలోనుంచి డబ్బులు తీసి, పుట్టిన రోజులకి, పెళ్ళిళ్ళకు, ఒడుగులకు, అన్నప్రాసనలకు ఇస్తుండేవారు.

4. కుడిచేత్తో ఎవరైనా ఏదైనా పండో, బట్టలో సరే ఇస్తే, కనీసం కంటితో కూడా చూడకుండా, ఎడమచేత్తో పంచడం.

5. తనకు ఉన్నా, లేకపోయినా సరే ఇంటికి వచ్చిన ప్రతివాళ్లకీ ఏదో ఒకటి పెట్టి పంపడం.

6. తనవద్దకు వచ్చే బ్రాహ్మణపిల్లలకు పెళ్ళిళ్లకు సాయం చేయడం కోసం షాపులో 'అరువు' పై తెచ్చి వాళ్ళకు పెట్టడం, తర్వాత డబ్బు (కూతురికి జీతం రాగానే షాపులో కట్టేయడం, "పాపం అస్సలు వాళ్ళకు ఏంలేదు, అందుకని చేతనైనంత చేయాలి" అని చెప్తుండడం

7. అవసరమైన వాళ్ళకు ఇంట్లోని బియ్యం, పప్పులు అవీ కుమార్తెకు తెలియకుండా సహాయం చేయడం

8. పిల్ల పెళ్ళికి గాజులు లేవని అడిగినప్పుడు తీసి ఇచ్చేయడం.

9. దొంగ అడగ్గానే తన బంగారు గొలుసును ఇచ్చేయడం.

10. తనకున్న దాంట్లోనే పసిపిల్లలు, పెళ్ళికూతుళ్ళు వస్తేవారికి గాజులు, పసుపు, కుంకుమ, గౌన్లు, జాకెట్టు బట్టలు ఇస్తుండడం–ఇటువంటి లక్షణం మనకు లౌకికంగా దుబారాగానో, తెలివితక్కువగానో కన్పించవచ్చును. కానీ ఇవన్నీ అలౌకిక సాధనలుగా మనం గుర్తుపట్టవచ్చు.

ఈ సాధనలను లౌకికంగా ఎలా చేయవచ్చునో, ఎలా చేయాలో మనకు అర్థమయ్యేలాగా ఆచరించి చూపారు. కానీ అర్థం చేసుకోవడం ఎలాగో మనకు తెలియడంలేదు. ఇతరులకు సహాయం చేయడం కోసం. తన దగ్గర లేకపోతే బయట అరువుపై కొనుక్కొచ్చి, వాళ్ళకు పెట్టి, తర్వాత అప్పు తీర్చుకునేవారు. అప్పుచేయడమంటే విలాసం కోసమే తప్ప, ఇలాంటి వాటికి చేస్తారని మనకు తెలియదు. అరువు ఎలాంటప్పుడు చేయాలో తెలుస్తోంది. పెడుతుంటేనే మనకు అందుతుంటాయి. తవ్వితేనే జల ఊరుతుంది. దానం లేదా సేవ, ఇంట్లో ఉన్నవే ఎంత చక్కగా, చిన్నపద్ధతిలోనే ఎలా చేయవచ్చునో ఆదర్శప్రాయంగా చూపించారు. ఇవ్వడం మొదలుపెడితే, ఇవ్వగా ఇవ్వగా బంగారం, వెండి అనే భేదం లేకుండా అవికూడా దానం చేయగలిగేలా మనం మారతాము అని అర్థమౌతున్నది. ఆర్థిక సహాయం ఇంత తేలికగా చేయవచ్చునని మనం ఊహించలేము. పంచటం ద్వారా పుణ్యాన్ని సంపాదించుకోవచ్చు. తద్వారా మనోవిశాలత కూడా సాధించవచ్చును. దానం చేయడమంటే దాచుకోవద్దు అని అర్థంకాదు. దానం చేస్తే మన పుణ్యం జమ అవుతుంది. దానివలన మన ఖాతాలో పుణ్యం పెరుగుతూ ఉంటుంది. కానీ మనం లౌకికంగా డబ్బు ఖర్చయిపోతుందని భయపడుతుంటాము. దానం అనేది ఒకసారి మొదలుపెట్టి ప్రయత్నిస్తుంటే, కొంతకాలానికి అది 'సేవ' అనే అర్థం అవుతుంది.

**24.12.2003**

లలితా సహస్రనామములలో 'సప్తయోగినులు' అని, 'షట్చక్రములు' అని, అవి ఎక్కడున్నాయో అక్కడ అధిష్టాన దేవతలు, వారికి నైవేద్యములనీ చెప్తూ, ఏడవ దానిని సహస్రార చక్రము అనీ, అక్కడ కామేశ్వరుడు కామేశ్వరితో కూడి ఉంటాడని, బ్రహ్మానంద స్థితిని చేరుకోవాలంటే మూలాధార చక్రము నుండి సాధన మొదలుపెట్టిన సాధకుడికి, సహస్రార చక్రమును చేరుకునే ముందు అమృతవర్షం కురుస్తుందనీ, అప్పుడు జీవుడు బ్రహ్మానందమును అనుభవిస్తాడని చెపుతారు. దీనిమొత్తాన్ని శ్రీచక్రంగా జీవుని శరీరముతో పోల్చి అభివర్ణిస్తుంటాము.

ఐతే అమ్మమ్మగారు "వక్రములేని మనస్సు శ్రీచక్రము" అన్నారు. అన్ని చక్రాలకు స్థానమున్నట్లే, మనసు వద్ద ఉండేది శ్రీచక్రమన్నమాట. శ్రీ అంటే అమ్మవారు, చక్రము అంటే ఆవరణ, అనగా అమ్మవారు ఉండే ఆవరణ. తరవాతది సహస్రార చక్రము వద్ద ఉండే అమ్మవారు శివశక్త్యైక్య స్వరూపిణి, లలితాంబికా, తరవాత ఓం శ్రీలలితా సహస్రనామావళి సమాప్తః అని ముగిస్తారు.

మనసువద్ద శ్రీచక్రం, సహస్రార చక్రంలో లలిత ఉంటుందన్నమాట. ఈ 'శ్రీ'ని పొందాలంటే మనము మనసు వద్దకు వెళ్ళాలి. కనుక సాధకుడు ముందు మనసు వద్దకు వెళ్ళి సాధన చేయాలి. మిగిలిన చక్రసాధనలు, శాస్త్రాలు ఎంత బాగా వర్ణించినా, రాసినా, విన్నా, సాధన ఎలాచేయాలో అర్థంకావడం కష్టం. కానీ, మనకు సాధన బోధపరచడం కోసం అమ్మమ్మగారు ఈ శ్రీచక్రము అనే మనోచక్రమును ఎలా చేరుకోవాలో, చేరుకోవాలంటే ఏం చేయాలి? అంటే మనసులో ఉన్న వక్రమును సరిచేసుకోండి అంటున్నారు. అదిచేస్తే శ్రీచక్రము వద్దకు చేరుకున్నట్లే అంటారు. 'వక్రము' అంటే వంకర ఆలోచనలు రావడం, వాటిని క్రమపరచుకోవాలి. దానికి కూడా 'మనసు విశాలం చేసుకో' అని మరొక ఆధారం ఇచ్చారు. అవే ఇప్పుడు మనం వింటున్న క్లాసులలో నెగెటివ్‌ని తీసివేసి, పాజిటివ్‌ను పెంపొందించుకోవడం. దానితో వక్రము బాగుపడి సరి అవుతుంది. అందులోంచే నిజాయితీ, విశాలత, నిస్వార్థము, పరోపకారం పుడతాయి. అప్పుడే ఆ మనసు, శ్రీచక్రమును చేరుకుంటుంది. తరవాతి చక్రానికి అంటే, సహస్రార చక్రానికి చేరుకున్నాక పొందే బ్రహ్మానందమును గూర్చి చెప్పారు కానీ, అది ఎలా ఉంటుందో చవిచూసినా చెప్పేవారు లేరు. కానీ సాధకుడికి అమ్మమ్మగారు చెప్పిన శ్రీచక్రమును చేరుకుంటే జీవించి ఉండగానే వక్రములేని మనసుతో బ్రహ్మానందమును పొందగలడని చెప్పారు. ఎంత తేలికగా, అర్థమయ్యేలాగా అమ్మమ్మగారు బోధించారు!? ఆమెకు సహస్ర నమస్కారములు.

**31.12.2003**

ఒకసారి అమ్మమ్మగారి దగ్గరకు ఒకామెను, పొద్దున్నుండి వాంతులు అవుతున్నాయనీ, తగ్గడం లేదనీ భయపడుతూ, బొట్టుపెట్టించి తీసుకువెళ్దామని తీసుకువచ్చారట. ఆమె "నిన్న ప్రసాదంచేసి నైవేద్యం పెట్టి తిన్నాననీ, అప్పటినుండి తగ్గడం లేదని" చెప్పింది. "ప్రసాదం చేసేటప్పుడు ఏమైనా అనుకున్నావా?" అని అమ్మమ్మ అడిగారు. ఆమె కాసేపు ఆలోచించి తర్వాత

ఇలా చెప్పింది "పిన్నిగారి పిల్లలకైతే ఏ మడీ, ఆచారం అక్కర్లేదు, మనకైతే అన్నీచెప్తారు. చేయడం కష్టంగా ఉంది" అని అనుకున్నానని చెప్పింది. దానికి అమ్మమ్మగారు నవ్వి, "అందుకే కదమ్మా వాళ్ళకు విగ్రహాలు, పూజలు ఇవన్నీ ఏమీ ఇవ్వలేదు. అలాంటివన్నీ మీకే ఇస్తున్నాను (భక్తులు). ఐనా వాళ్ళతో మీరు పోల్చుకోకండమ్మా? మీకు ఇచ్చినవి మీరు ఆచరించండి" అన్నారట.

దీని అంతరార్థము పరిశీలిస్తే, అమ్మమ్మగారు చెప్పిన నియమములుగానీ, శుక్ర, మంగళవార దీక్షలుగానీ, ప్రసాదములు చేసి నైవేద్యం పెట్టడంగానీ, స్నానం, పూజలు చేయడం ఏవైనా సరే, మనస్ఫూర్తిగా భక్తిభావంతో ఆచరించాలి కానీ, ఈషణ్మాత్రముగానైనా వేరే భావము ఉదయిస్తే, అది ప్రసాదమైనా సరే, వాంతుల రూపంలో బయటికి వచ్చి, మళ్ళీ అమ్మమ్మగారి వద్దకు వచ్చి 'సమస్య పరిష్కారమైంది' అని చెప్పేవారు. ఆమెకు అమ్మమ్మగారికి ఒక పక్షపాతబుద్ధి ఉన్నదన్న భావము కలిగింది. దానికి అమ్మమ్మగారు, నాకలాంటివి ఏమీ ఉండవమ్మా, ఉంటే మా పిల్లలకు విగ్రహాలు, పూజలు ఇచ్చి మిమ్మల్ని వేరేలాగా చూసేదానిని. మరొకలాగా లేక వేరేలాగా చూస్తున్నానంటే మీకర్థం కాదు. వాళ్ళతో మిమ్మల్ని పోల్చుకోవద్దు అని ఖచ్చితంగా చెప్పారు.

ఎప్పుడు, ఎవరికి, ఏది అవసరమో దాన్ని ప్రసాదిస్తారు కానీ, పక్షపాతబుద్ధిఉంటే వారు ఆ స్థానములో ఉండరు కదా! వారికి ఇవ్వలేదు అంటే అప్పుడు వారికి అది  అవసరం లేదన్నమాట.

అందుచేతనే ఇప్పుడు నేను కూడా సాధనలో ఎప్పుడూ, ఎవరితోనూ ఎవరినీ పోల్చుకోవద్దనీ చెప్తుంటారు. పోల్చుకోవడానికి ఎవరి స్థాయి వారిది. గురువులకు వాళ్లపిల్లలు, వీళ్ళపిల్లలు అనే ప్రశ్న రాదు. అందరూ ఆమె బిడ్డలే కదా! ఎప్పుడు, ఎవరికి, ఏది అవసరమైతే దాన్ని పాటించమంటారు. భక్తులకు పాజిటివ్ ఆలోచనలే ఉండాలిగానీ, నెగెటివ్ ఆలోచనలు వస్తే ఇలాగే బయటపడేసి, సరిదిద్ది పంపుతారు.

**07.01.2004, బొంబాయి**

దీనికి వివరణ ఏమిటంటే- ప్రసాదం చేస్తున్నప్పుడు కలుషితమైన ఆలోచనలు వచ్చినా, వాటినే ఆలోచిస్తున్నా కూడా ప్రసాదం పనిచేసే విధానం కూడా నెగెటివ్‌గానే పనిచేస్తుందన్న మాట. అందుకే తినగానే వాంతులు అయ్యాయి. అయినా ప్రసాదం కనుక, అమ్మమ్మగారు ఇచ్చిన నియమం కనుక దాన్ని వారిచేత ఆచరింపజేసి, దురాలోచనను రప్పించి, అనారోగ్యం కలుగజేసి, తిరిగి ఆమె వద్దకు రప్పించుకుని, విషయాన్ని వెలికి తెప్పించి, ఆలోచనను సరిజేసి, స్వస్థత చేకూర్చి పంపించారు. కాబట్టి ఇది మనకు ఒక సందేశం. ప్రసాదం చేస్తున్నప్పుడు మంచి ఆలోచనల తోనో,  లేక భగవత్ ప్రార్థనతోనో చేయాలని కూడా తెలియజెప్పారు ఆమె. ఇక్కడ భక్తురాలు అమ్మమ్మగారి కుమార్తెల గురించే అనుకుంది. వారి కుమార్తెలు అంటే ఎవరు? ఆమె గర్భవాసాన పుట్టినవారు. వారికి ఏమి, ఎప్పుడు, ఎలా ఇవ్వాలో ఆమెకు తెలుసు. ఈ విషయంలో ఆవిడ ఇలా అన్నారు: "అందుకనే వారికి పూజలు, విగ్రహాలు ఏవీ ఇవ్వలేదు." అంటే ఏమిటి? అమ్మమ్మగారు పూజ చేయడం ఎవ్వరూ చూడలేదు. ఏ నియమం, మనలాగా

పాటించినట్లుగా మనకు తెలీదు. అదేదో ఆమె అంతర్ముఖంగానే ఆచరించారు తప్ప బాహ్యంగా చేయడం చూసిన వాళ్ళెవ్వరూ లేరు. అలాగే వారి పెద్దకుమార్తె రేవతి కూడా ఎప్పుడు ఏలూరు వచ్చినా, పూజలు, నియమాలు ఏమీ ఆచరించేవారు కారు. ఆచరించమనీ, పూజ చేసుకోమనీ, విగ్రహారాధన చేయమనీ కూడా కమలమ్మగారు ఎప్పుడూ శాసించలేదు.

అలాగే, త్రిపురాంబగారు పెళ్ళి చేసుకోకుండా, పీఠం సేవకే అంకితమైన వ్యక్తి. ఆమె కారణజన్మురాలని అమ్మమ్మగారు ముందుగానే చెప్పారు. అయినా ఆమె కూడా ఎప్పుడూ ఏ నియమ నిబంధనలు ఆచరించమనిగానీ, ఆచరించినట్లుగానీ దాఖలాలు లేవు.

మూడవ కుమార్తె సరోజిని విషయానికి వస్తే, చిన్నప్పుడు ఆమెకు ఒకసారి రిక్షాలో వెళ్తుండగా హఠాత్తుగా కళ్ళు కనిపించలేదట. తరువాత అమ్మమ్మగారు ఇకనుండి సరోజ "జన్మ శుక్రవారాలు ఉంటుంది" అన్నారట. అంతే ఆనాటినుండి ఆమె 'శుక్రవారాలు నియమం' పాటిస్తూ ఉండేది. తరువాత కొంత కాలానికి ఆ దంపతులచేత 'దసరా'లో కలశ స్థాపన చేయించి 9 రోజులు నవరాత్రి దీక్షలు ఆచరింపజేశారు.

అలాగే నా విషయానికి వస్తే, నేనొకసారి "అమ్మమ్మా నాక్కూడా ఏదైనా విగ్రహం ఇవ్వవా? శ్రావణ మంగళవారాలు పూజ చేసుకుంటున్నాను కదా. నా వద్ద ఏమీ లేవు" అనడిగాను. "నీకు విగ్రహాలు వద్దమ్మా. నువ్వు చేయలేవు. నీకు ఫొటోచాలు. అది పెట్టుకుని పూజ చేసుకో" అన్నారు.

మరొకసారి ఎవరో లక్షకుంకుమార్చనలు చేస్తుంటే చూసి, నేను "అమ్మమ్మ మీ మనవడు ఆఫీసర్ అయితే నాక్కూడా అలాంటి పూజ చేసుకోవాలనుంది" అన్నాను. ఆమె దానికి ఇలా అన్నారు "నీకు ఇలాంటి మంచి బుద్ధి పుట్టడమే ఒక మంచి జరిగే సూచన. కనుక అతడు తప్పకుండా ఆఫీసరు అవుతాడు. నువ్వు అలాగే ఆ పూజ చేసుకో" అన్నారు. తర్వాత సంవత్సరం ఆమె సిద్ధి పొందారు. అదే సంవత్సరం మావారు ఆఫీసరు అయ్యారు. నేను ఆ పూజ చేసుకున్నాను. పూజ చేసుకోవాలనిపించడమే (పాజిటివ్ ఆలోచన) శుభసూచకమనీ, ఆ పని నెరవేరుతుందని ఆమె చెప్పారు. అలాగే జరిగింది. భగవంతుడిపట్ల పాజిటివ్ ఆలోచనలే, పాజిటివ్‌గా సిద్ధిస్తాయనీ, ఆ భక్తురాలికి భగవతి బిడ్డలపట్ల నెగెటివ్ ఆలోచనలు రావడం వలన అది వికటించి, నెగెటివ్‌గానే జరిగి, ఆమె వద్దకు వెళ్ళడం వలన విషయాన్ని తెలియజేశారామె.

తరువాత నా పెళ్ళికి ఆమె ఒక 'దీపపు కుందె' ఇచ్చారు. ఏ విగ్రహాలు ఇవ్వలేదు. దాంట్లోనే నన్ను దీపంపెట్టమని చెప్పారు. నాలోని అజ్ఞానాన్ని పోగొట్టి జ్ఞానాన్ని కలుగజేయాలని ఆమె నా పెళ్ళికే సంకల్పం చేశారన్నమాట. ఆ విషయం ఇపుడు అర్థమైంది. దైవలీలలు అర్థంచేసుకునే స్థితి మన మనసుకి రావాలి కదా! అపుడే ఆమె ఆ ప్రయత్నం చేస్తారు.

నా విషయంలో నేను విగ్రహారాధనే చేయలేనన్నారు. అందుకని నీకు విగ్రహం వద్దు. ఫొటో చాలు అన్నారు. నాకప్పుడు ఆ విషయం అర్థంకాలేదు. మరిప్పుడు నాచేత తన పీఠనిర్వహణ బాధ్యతను నిర్వర్తింపజేస్తున్నారు. ఇది ఊహకు అందని విషయం. ప్రతిరోజూ చిన్నపూజ

చేయలేనిదాన్ని, పీఠనిర్వహణా బాధ్యత చేయడమంటే మనతో జరిగే పని కాదు. ఆమె సంకల్పంతో ఎప్పుడు, ఎలా జరగాలో అలా జరిపించబడతాయి. ఇది మనం అర్థం చేసుకోవాల్సిన విషయం.

రేవతి విషయం – అస్సలు ఏమీ చెప్పలేదు

పిన్ని (త్రిపుర సుందరి) విషయం – ఏ నియమనిబంధనలూ ఇవ్వలేదు. కానీ పీఠాన్ని అప్పగించారు.

సరోజిని విషయం – ఏం అవసరమో అవి చేయించారు.

నా విషయం – ఆమె భౌతికంగా లేరు. కానీ శుక్రవార దీక్షలు ఇప్పించడం, కలశస్థాపన చేయించడం, ఆమె 'ఆరాధన' నాచేత జరిపించడం, పరిష్కార మార్గాలను ఆమే నాచేత చెప్పించడం, అభివృద్ధి కార్యక్రమాలను జరిపించడం, ఇలా వ్రాయించడం ఇవన్నీ చేస్తున్నారు. అంటే ఒక్కొక్కరి విషయంలో ఆమె ఒక్కొక్కలాగా నిర్ణయించారు. ఆ విషయాలు మనకు అర్థంకావు కదా! మరి ఆ భక్తురాలు వాళ్ళ పిల్లలకేమీ లేవు. అన్నీ మనకే అనుకుంటే ఎలా? వాళ్ళకేమున్నాయో, ఆ భక్తురాలికేమున్నాయో, ఆమెను ఎలా బయట పడెయ్యాలో అమ్మమ్మగారికి తెలుసుకానీ, మనకు తెలీదు కదా! అయినా ఆమె బిడ్డలతో పోల్చుకుంటే, ఇప్పుడు వాళ్ళచేత చేయించే పనులు, మామూలు భక్తులు చేయలేరు కదా! ఎవరు ఎందుకు పుడతారో, ఏం నిర్వహిస్తారో ఆమెకే తెలుసుగానీ, మనకు ఆ లీలలు తెలియవు కదా!

అందుకే "వాళ్ళతో పోల్చుకోకండమ్మా" అన్నారామె. అంటే వాళ్ళు తన గర్భంలో పుట్టి, తను చేసే పనిలో వారిని కూడా భాగస్వాములను చేసే ప్రయత్నం చేశారామె. కాబట్టి వాళ్ళు ఈ లౌకిక నియమాలను దాటిన వాళ్ళై ఉంటారు. మరి అలాంటి వాళ్ళతో, మనలాంటి వాళ్ళను పోల్చుకోవడం మంచిది కాదని దీని అర్థము. అదే విషయాన్ని ఇప్పుడు మనం కూడా క్లాసులలో చెప్పుకుంటున్నాము కదా! ఆధ్యాత్మిక సాధన అనేది వ్యక్తిగతమైనది కానీ, సామూహికము కాదు. కనక స్థితలను పోల్చుకోకూడదు. ఎవరి సాధన, నియమనిబంధనలనూ వారే వ్యక్తిగతంగా ఆచరించాలి గానీ, ఇంకొకళ్ళ స్థితినిగూర్చి ఆలోచించరాదు.

**08.01.2004**

కమలమ్మగారి బజారులో నివసించే ఒక ఇల్లాలికి అనారోగ్యం ఏర్పడితే, ఒక కోయవాడు ఇది వ్యాధి కాదని, ప్రయోగమని చెప్పి, అది పోగొట్టడానికి ఏవో క్షుద్రపూజలు చేస్తూ డబ్బు గుంజుతున్నాడు. వ్యాధి తగ్గకపోగా వాడి పీడ ఎక్కువైంది. ఎవరో కమలమ్మగారి గురించి చెప్పగా వారు ఆమెను ఆశ్రయించారు. కమలమ్మగారు వాడివద్దకు వెళ్ళి "ఎవడ్రా నువ్వు వీరిని పీడిస్తున్నావ్?" అని గద్దించగానే క్షుద్రశక్తులు పలాయనం చిత్తగించాయి. వాడు క్షమించమని ప్రాధేయపడి పారిపోయాడు. అప్పుడు ఆమె అది వ్యాధేనని, భూతప్రేత పిశాచాల బెడదకాదని చెప్పి, తీర్థప్రసాదాలతో వ్యాధిని నయం చేశారు.

దీని వివరణ– క్షుద్రపూజలు చేసేవాళ్ళు భూతప్రేతాలను ఆవాహన చేసి, వాటిని అవతలి వారిపై ప్రయోగించి, డబ్బు గుంజి, మళ్ళీ వెనుకకు తీసుకోగల సమర్థులు అయిఉంటారు. అలాంటివాడి వద్దకు అమ్మమ్మగారు వెళ్ళగానే, వాడు వణికిపోయాడు. అమ్మవారి శక్తిముందు ఇవన్నీ ఒక నిమిషం కూడా నిలబడలేవు. అందుకనే వాడు భయపడి పరిగెత్తాడు. అమ్మమ్మగారు "ఇలాంటివన్నీ మన గుమ్మం దాటి లోపలికి రాలేవమ్మా!" అనేవారు. అంతకుముందు కూడా 'గాలి' ఆవహించిన ఒక బాలింత "నేను అమ్మవారినంటూ వచ్చి, నన్ను పీఠం వద్దకు తీసుకెళ్ళు" అని అరుస్తూ పీఠానికి వచ్చేదట. అమ్మమ్మగారు "ఇది అమ్మవారు కాదే" అని గద్దించగానే, జొన్నవాడ కామాక్షి ఫొటో ముందు సాష్టాంగ నమస్కారం చేస్తూ "ఇంకెప్పుడూ ఈమెను ఆవహించను" అని చెప్పింది. అందువలన ఇలాంటి క్షుద్రములన్నీ అమ్మమ్మగారిని చూస్తేనే పలాయించేవన్నమాట. అమ్మమ్మగారు ఇలాంటివారిని వారి బాధలనుండి తొలగించి, తన మార్గంలోకి అనుగ్రహిస్తూ ఉండేవారు. మనం గురువులను ఆశ్రయిస్తే క్షుద్రశక్తులు మనలను ఏమీ చేయలేవని అర్థమౌతోంది. ఆ తీర్థప్రసాదాలలో అంతటి మహిమ ఉంది కనుకనే, వాటితోనే వారిని విముక్తుల్ని చేసేవారామె. ఎవరికీ చేతులు చూపించవద్దనీ, జాతకాలు ఎవరికీ చూపించవద్దనీ, స్వామీజీలు, మాతాజీల వెంట ఊరికే పరిగెత్తవద్దనీ కూడా ఆమె భక్తులకు చెప్పేవారు. ఇవన్నీ మనలను క్షుద్రశక్తుల నుండి తప్పించడానికే అని అర్థమౌతోంది.

**09.01.2004**

పోతుకూచి పుల్లాబ్జాక్షి గారి విషయంలో, ఆమెకు కలలో ఒక స్త్రీమూర్తి కనిపించి "మా ఇంట్లో బాలాత్రిపురసుందరి పీఠం ఉన్నది. వచ్చి తీర్థప్రసాదములు తీసుకో" అని చెప్పింది. ఈమె వెళ్దామని నిర్ణయించుకోగానే ఆమె తిరిగి కలలో కనబడి, "నా పేరు కమలమ్మ. నేను మద్రాసు వెళ్తున్నాను. రెండురోజుల తర్వాత వస్తాను. అప్పుడు పీఠానికి రా" అని చెప్పింది. 2 రోజుల తర్వాత కలలో వినిపించిన గొంతే ఆమె పక్కింట్లో ఎవరితోనో మాట్లాడుతుండగా, "నేను ఈరోజే మద్రాసు నుండి వచ్చాను" అని వినిపించింది. కలలో కనబడ్డ ముత్తైదువే ఆమె. ఆమే కమలమ్మగారు అని ప్రక్కవాళ్ళు చెప్పారు. ఆ స్వప్నాన్ని కమలమ్మ గారితో చెప్తే ఆమె "నాకేమీ తెలియదు. అంతా అమ్మదయ" అన్నారు. తర్వాత ఆమె కమలమ్మగారి దయకు పాత్రురాలైనారు.

**10.01.2004**

ఇంతకుముందు చెప్పుకున్నట్లుగా, అమ్మమ్మగారి మనస్సునే పీఠములో ప్రతిష్ఠించి, శరీరంతో కమలమ్మగారిలా జీవించారు. (అమ్మవారు నీ మనసు నిర్మలమైనది. నేను నీలో ఐక్యమౌతాను అన్నారు కదా!) తర్వాత ఈమె మనసు అమ్మవారు ఐక్యమైన తర్వాత, పరమాత్మ స్వరూపమైనది. అందుకే అమ్మవారు "మా ఇల్లు" అన్నది. అంటే ఆమె నివసిస్తున్న గృహం అదన్నమాట. పీఠమున్నది అని చెప్పింది అంటే, బాలాత్రిపుర సుందరి కొలువైన స్థలమన్నమాట.

తీర్థప్రసాదములు పంచుటకు మానవ రూపంలో ఉన్న కమలమ్మగారి అవసరం ఉన్నదన్నమాట. సరేనని పుల్లాభ్జాక్షిగారు దర్శనానికి వెళ్ళటానికి సంసిద్ధమవ్వగానే, ఈమె వెంటనే కనబడి తన అడ్రసు మొత్తం చెప్పి, తనే కమలమ్మ అని చెప్పుకుని, తను (బాహ్యంగా) మద్రాసు వెళ్తున్నాను కనుక 2 రోజుల తర్వాత రమ్మని ఆహ్వానించింది. తర్వాత మళ్ళీ, "నేను ఈరోజే వచ్చాను" అని ఆమెకు వచ్చి తన వద్దకు రప్పించుకున్నది. అంటే స్వయంగా వారిని గురించి వారు భక్తులకు చెప్పుకుని వారిని పీఠమునకు రప్పించుకుని, కాపాడిన వైనం చాల ఆశ్చర్యము, అద్భుతము.

తర్వాత ఇదంతా ఆమెకు చెప్తే "నాకేమీ తెలియదు" అనటం నిజమే కదా! శరీరముతో ఉన్న కమలమ్మగారికి ఈ విషయం తెలీదు. అంతా మనోరూపంలో ఉన్న (పరమాత్మ) స్వరూపంలో ప్రచారం జరుగుతున్న విషయం ఆమెకు (శరీరంతో) తెలియాలని లేదు కదా! అందుకే "నాకేమీ లేదు. నాకేమీ తెలియదు. అంతా అమ్మదయ" అని చెప్తుండేవారు. భగవంతుడు అవతారమెత్తినప్పుడు వాళ్ళు అవతారపురుషులన్న సంగతి తెలియకుండానే అన్ని కష్టాలూ మనలాగే పడుతూ, మనలాగే బ్రతుకుతూ ఏమీ తెలియనట్లుగానే ఉంటారు (శ్రీరాముడు, శ్రీకృష్ణుడు). రాముడు సీతకోసం ఏడ్చాడు కూడా. ఆయనకు తెలియదా అంటే, మానవ అవతారంలో తెలియదు. అలాగే కమలమ్మగారు కూడా "నాకేమీ తెలియదు, అంతా అమ్మదయ" అనడం. అంటే అంతా ఆ మనసే, ఆత్మే, భగవతే ఇవన్నీ జరిపిస్తోందని చెప్తుండడం వలననే, వారేం చెప్తున్నారో, ఏం చేశారో అవన్నీ తర్వాత భక్తులు గుర్తుచేస్తేనే తప్ప వారికేమీ తెలియవు. నాకేమీ తెలియదు అనడం అబద్ధం కాదు, నిజమే. కానీ అది మనకు అర్థంకాక వారికి తెలియక పోవడం ఏమిటని అనుకుంటుంటాము. పైగా ఇంకో విషయం ఏమిటంటే, శరీరంతో చేస్తే ఆ ప్రచారములు ఆ విధంగా భక్తుడు నిజాన్ని తెలుసుకునేలాగా ఉండవు. కలల ద్వారా, అంటే సూక్ష్మరూపంలో కనబడి, అక్కడ కమలమ్మను శారీరకంగా చూపిస్తూ, రప్పించుకుని దయ కురిపించడం అనేది గమనించదగ్గ విషయం.

సూక్ష్మదేహంతో చేసే ప్రక్రియలుగానీ, సంకల్పములుగానీ, స్థూల, కారణదేహమునకు తెలియాలని లేదు కదా! అందుకే ఆమె చాలాసార్లు "అలాగా! నాకేమీ తెలియదు, అలా అన్నానా, అంతా ఆమె దయ" అంటుండేవారు. దేవతానుగ్రహములు దేవత ఆశ్రయించిన ఉపాధి (కమలమ్మ)కు తెలియాలని లేదు కదా!

**11.01.2004**

అలాగే శ్రీరామ్మూర్తి అనే భక్తుని సంరక్షణలో, (భార్య) భక్తురాలికి కలలో కనిపించి, "నీ మంగళసూత్రాలు తెగిపోతున్నాయి. చూసుకున్నావా" అని గుర్తుచేశారు. అంటే జరగబోయే ప్రమాదాన్ని, గండమును కలలో కమలమ్మగారి రూపంలోనే సూచిస్తున్నారు. ఇలలో రక్షించమని వేడుకుంటే "ఫర్వాలేదు. నేనున్నానుగా" అని (ప్రత్యక్షంగా) బొట్టుపెట్టి ఆశీర్వదించి పంపారు.

తర్వాత శ్రీరామ్మూర్తిగారు విజయవాడ వెళ్ళి దుర్గగుడి ప్రక్కన ఉన్న కోనేరులో కాళ్ళు

కడుక్కోవడానికి వెళ్ళగా కాలుజారి పడిపోయారు. ఒక స్త్రీమూర్తి ఎర్రచీర కట్టుకుని కమలమ్మగారి వలె కన్పించి, ఆయన్ను చేతుల్లో ఎత్తుకుని నీళ్ళనుండి బయటకు వచ్చి 3వ మెట్టుపైన పడుకోబెట్టింది. క్షణంలో నీటిలో పడడం, తిరిగి బయటకు రావడం చూసి పక్కనున్న వాళ్ళు ఆశ్చర్యపోయారు. అంటే దీన్నిబట్టి చూస్తే, అమ్మవారు కమలమ్మగారి లాగానే కనబడి, ప్రమాదాన్ని సూచించడం, బయట నేను చూసుకుంటానని చెప్పి అభయమివ్వడం. ఆ తర్వాత ప్రత్యక్షంగా కమలమ్మగారే వచ్చి రక్షించడం (ఆ మనిషి గ్రహించేలాగా చేయడం), గండం నుండి ఎలా తప్పించిందో, వాళ్ళకే తెలియజేయడం చూస్తే మనకు ఇక్కడ ఆ శక్తి, పరోక్షంగా, ప్రత్యక్షంగానూ కూడా ఏ విధంగా కాపాడుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఆ వ్యక్తిని కారణార్థంగా తన వద్దకు రప్పించుకుని, అనుగ్రహించి, భక్తునిగా చేసుకోవడం చక్కగా కళ్ళకు కట్టినట్లుగా కనిపిస్తున్నది.

తర్వాత శ్రీరామ్మూర్తి వెళ్ళి ''నాకు ప్రాణభిక్ష పెట్టావమ్మా, పీఠానికి ఏదైనా సమర్పించుకుంటాను. మీరు ఏది చెప్తే అది చేస్తాను" అన్నాడు. దానికి కమలమ్మగారు "నాకు ఏం తెలుసు నాయనా! నేను మానవమాత్రురాల్ని. త్రిపురసుందరే నిన్ను రక్షించింది. ఆమెకు ఏం కావాలో ఆమే చెబుతుంది. అలా చెయ్యి" అన్నారు. అంటే మానవమాత్రురాలిగా ఉన్న కమలమ్మకు ఈ విషయం తెలియని మాట నిజమేనన్నమాట. రక్షించింది దివ్యశక్తి అయిన త్రిపురసుందరి. అందుకే ఆమె చేసే లీలలు ఏమిటో, వారిని ఎలా కాపాడాలో అవన్నీ ఆమె చేసే అనుగ్రహ లీలలు. అలాగే ఆమెకేం కావాలో కూడా ఆమే చెప్తుందని రూఢి చేశారు. అంటే కమలమ్మగారు "దివ్యశరీరమును దాచిన దివ్యశక్తి". శక్తి చేసే క్రియలు శరీరమును మనసుద్వారా తెలుసుకునే ప్రయత్నం చేయకపోవచ్చును. అందుకే "నాకమీ తెలియదు"అని ప్రతిసారీ ఆమె అనడం. అంటే ఇక్కడ (నేను-నాకు అంటే శరీరమునకే వర్తిస్తాయి.) దివ్యశక్తితో జరిగే లీలలన్నీ ఆ త్రిపురసుందరే చేయిస్తున్నది, రక్షిస్తుంది అని ఆమె చెప్తున్నారు.

ఆమె చెప్పినట్లే అమ్మవారు శ్రీరామమూర్తికి కలలో కనిపించి "నిన్ను మూడు మెట్లు ఎక్కి రక్షించాను. కనుక 3మెట్లుగల పూజా మందిరమును చేయించమని" అడిగింది. వారు అలాగే చేయించి పీఠానికి సమర్పించారు.

**10.03.2004, గోవా**

## కల యొక్క వివరణ

శ్రీమతి మొక్కపాటి శాంతాదేవికి (నరసింహమూర్తి గారి భార్య), 1957 నుండి కమలమ్మ గారితో పరిచయం ఉంది. శాంతాదేవిగారి తోడికోడలు, తల్లిగారు అమ్మమ్మగారి దగ్గరకు వచ్చేవారట. శాంతాదేవిగారు వాళ్ళమ్మగారితో యోగాభ్యాస దర్శనం, అమ్మవారి దర్శనం, ఇంకా ఎన్నో ఆధ్యాత్మికంగా చాలా మాట్లాడుకునేవారట.

శాంత, తన పిల్లవాడు అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు పూజ పిన్నిగారి వద్దకు వెళ్ళిందట. ఆమె 27 శుక్రవారాలు ఉపవాస దీక్ష, పూజ చేయమన్నారట. ఇంటికి వచ్చాక ఆ రాత్రి కలలో

పల్లా మహాలక్ష్మమ్మగారిలాగా (స్నేహితురాలివలె) కన్పించి, "ఏమిటే, కష్టమనుకున్నావా? ఏమైనా ఇబ్బంది కలిగితే, మళ్ళీ వారం చెయ్యి. కాలచక్రం ఎంతసేపు తిరుగుతుంది?" అన్నారు.

4, 5 శుక్రవారాలు చెయ్యగానే కలలో – మద్రాసు నుండి ఒకమ్మాయి (మావీధిలో ఉండే వారి బంధువుల కూతురు) మంచి పట్టుపరికిణీ కట్టుకుని వచ్చి "ఏం చేస్తున్నారు?" అనడిగింది. "పులిహోర" అన్నారు. "నాకెంతో ఇష్టం" అన్నది. "నివేదన చేశాక పెడతాను" అన్నారామె. తరువాత పెట్టారు. "పెరుగు ఇష్టమా?" అనడిగారు. "నాకు చాలా ఇష్టం" అన్నదట. పెరుగు వేసుకుని తిని, "గిన్నెపెట్టు, చెయ్యి కడుక్కుంటా" అన్నదట. అప్పుడు శాంత గుర్తుపట్టి, కమలమ్మగారే 'బాల' రూపంలో వచ్చిందని తెలుసుకున్నారట (పూజపిన్నిగారు భోజనం అయిన తర్వాత చెయ్యి క్రింద కడగరు. ఏదైనా గిన్నెలో కడుగుతారు). మరునాడు పూజపిన్నిగారితో ఈవిషయం చెప్తే, ఆమె భుజం తట్టి "ఆమే వచ్చింది. నీకు బాల పుడుతుంది" అన్నారు. తరువాత పుట్టిన పిల్లకు 'బాలాత్రిపురసుందరి' అని పేరుపెట్టారు.

శుక్రవారం ఉపవాసానికి పాలు, పంచదార, పెసరపప్పు పాయసం నివేదన చేయమనేవారు. ఏమాత్రం నీరసంగానీ, ఆకలి గానీ ఉండేది కాదు. కమలమ్మగారు మామూలు ధోరణిలో చెప్పేవారు కాదు. తమ అంతర్గతమందు అమ్మను దర్శించి, జవాబు చెప్పేవారు. ప్రతి ఒక్కరితోను ఆవిడ స్నేహభావంతోనూ, ఆత్మీయతాభావంతోనూ మెలిగేవారు. ఆమెతో ఎంతసేపు మాట్లాడినా తనివితీరేది కాదు.

శాంత అనుభవాన్ని పరిశీలించి, గురువులు శిష్యులను కాపాడే విధానమును గూర్చి కొద్దిగా విపులంగా వ్రాస్తే బాగుంటుందని, అది చెప్పే ప్రయత్నం చేస్తున్నాను.

కమలమ్మగారు మొదట "కార్యకారణ నిర్ముక్తా" అనే నామాన్ని అనుసరించి, కార్యము చేయించేది ఆమే, కారణమును సృష్టించేదీ ఆమే. రెండూ ఆమే చేస్తుంది. అది ఎలా చేస్తుందో చూద్దాము...

కొడుకు అనారోగ్యం అనేది ఒక కారణం ఇక్కడకు, కమలమ్మగారి వద్దకు రావడానికి. అలా రప్పించబడ్డారు శాంతాదేవి. కారణం విన్నాక, కమలమ్మగారు పూజ–ఉపవాసదీక్ష ఇచ్చారు. ఇవ్వకుండా కుంకుమపెట్టి, "తగ్గిపోతుందిలేమ్మా" అని చెప్పి కూడా తగ్గించేసి, పంపేయవచ్చు. కానీ అలాకాకుండా, అనుగ్రహించి, కాపాడే భక్తుల పట్ల ఆమె అనుసరించిన విధానాలను గమనిద్దాము...

ఉపవాసం, పూజలు చేయలేనేమోననే అనుమానం మనసులోకి రాగానే, కలలో స్నేహితురాలిగా కనబడి, "ఏం ఫర్వాలేదు. ఒకవారం కుదరకపోయినా, మరొక వారం చెయ్యి" అని ధైర్యం చెప్పారు. అంతేకానీ మానేయమని చెప్పలేదు.

4, 5 వారాలు గడిచాక మళ్ళీ కలలో 'బాల'వలె కన్పడ్డారు. చేసే పూజలకు పెట్టవలసిన నైవేద్యము ఆమె చేత చేయించుకుని తిన్నారు. అది ఇష్టం, ఇది ఇష్టం అనుకుంటూ పులిహోర,

పెరుగు – అంటే పూర్ణభోజనం చేశారు. "గిన్నెపెట్టు చెయ్యి కడుగుతాను" అనగానే ఈమెకు ఆమె ఎవరో అర్థమైంది. అంటే కమలమ్మగారు చేసే ఆ విధానమును కలలో ఆ బాలచేత చేయించి, గుర్తించేలాగా, చేసి దర్శనమిచ్చారు. పూజ చేయించి, నైవేద్యము ఆరగించి, కలలో దర్శనమిచ్చి, ఆ దర్శనం తనదేనని, తనే "బాలా త్రిపురసుందరి"నని ఆ శిష్యురాలికి తెలియజేశారు.

ఇక్కడ ఒక అనుమానం – ఈ విషయం ప్రత్యక్షంగానే కమలమ్మగారు ప్రసాదం తీసుకుని, నీకు ఆడపిల్ల పుడుతుందని చెప్పవచ్చుకదా! కలలు ఎందుకు? రెండుసార్లు కలలో కన్పించి, వాళ్ళకు ఆ విషయం అర్థమయ్యేలా చేశారు. కారణం – పరమాత్మ స్వరూపిణి అయిన పరమేశ్వరి స్థూలంగా చూస్తే మహాలావణ్యశౌవధి. దుష్టశిక్షకి, శిష్టరక్షకి. కానీ సూక్ష్మరూపంలో ఆమె ప్రాభవము అంతర్ముఖమైనది. మంత్రరూపంలో ఆమె సూక్ష్మశరీరం కన్పిస్తుంది. స్థూలరూపంలో పరమేశ్వరి ఎంత ప్రభావం కలదో, సూక్ష్మరూపంలో మంత్రం అంత శక్తివంతమవుతుంది. (ఇలపావులూరి పాండురంగారావుగారు రాసిన 'లలితాసహస్రనామ నవనీతము'లోని విషయం)

మూలాధారంలో ఉన్న కుండలిని సహస్రారము చేరేందుకు మధ్య కొన్ని మార్పులున్నాయి. సహజంగా జీవి తన తనువే తానుగా భావిస్తాడు. పాంచభౌతిక ప్రపంచమే అతనికి సత్యం. ఇది జాగ్రదావస్థలోని వైశ్వానర రూపం. ఈ రూపం, ఈ భావం కుండలినీ, మూలాధారందాటి స్వాధిష్ఠానం వెళ్ళేవరకు ఉంటాయి. కానీ స్వాధిష్ఠానం దాటి మణిపూరం వెళ్ళేటప్పటికి "జాగ్రత్" సత్యానికి మించిన స్వప్నావస్థ ఉన్నదనీ, ఆ స్థితిలో జీవుడు "తైజస" రూపాన్ని ధరించి, తనలోని వెలుగును తాను చూసుకోగలడనీ, అప్పుడతనికి బయటి వెలుగుతో ప్రమేయం లేదనీ తెలుస్తుంది. ఈ జ్ఞానం ఉదయించడంతో **బ్రహ్మగ్రంథి** విడిపోతుంది. ఇది మొదటి మెట్టు.

కానీ జాగ్రదావస్థలోనే ఉండి, ఇలాంటి తైజసావస్థను అనుభవించటం అంత సులభమైన పని కాదు. ఆ తర్వాత అనాహత చక్రాన్ని సమీపించేసరికి కలలు, కల్పనలు శాంతించిన గాఢనిద్రలోని "ప్రాజ్ఞ" రూపం గోచరిస్తుంది. ప్రాజ్ఞారూపం అంటే ప్రజ్ఞ = బుద్ధి (బుద్ధికి మాత్రమే తెలిసేది) అని అర్థం. అంతటితో రెండో ముడి **(విష్ణుగ్రంథి)** విడిపోతుంది.

తరువాత విశుద్ధిచక్ర సహయంతో ఆజ్ఞాచక్రాన్ని అందుకోగానే ప్రాజ్ఞ రూపం కూడా పరమాత్మ స్వరూపంలో లీనమవుతుంది. అంతటితో మూడో ముడి **(రుద్రగ్రంథి)** కూడా విచ్చుకుంటుంది.

ఈ మూడు ముళ్ళు దాటిన తర్వాత జీవాత్మ పరమాత్మలో ఐక్యమై ఆత్మసాయుజ్యాన్ని పొందుతుంది. ఇదే కుండలినీయోగము. ఈ యోగసాధన ఫలించేందుకు అడుగడుగునా అమ్మవారి అనుగ్రహం అవసరం. 6 చక్రాలు దాటి సహస్రారం చేరేసరికి అక్కడ అమృతం కురిసే అఖండచైతన్యం సాక్షాత్కరిస్తుంది.

దీన్నిబట్టి అర్థంచేసుకుంటే అమ్మమ్మగారు భక్తులకు ఎక్కువగా కలల్లోనే దర్శమివ్వడం, అందులోనే వారికి అర్థమయ్యేలాగా తెలియజేయడం, విషయాలను బోధపరచటం, తన వద్దకు రప్పించుకోవడం, అనుగ్రహించటం కనిపిస్తుంది. ఎందుకంటే 'కల' అంటే స్వప్నావస్థలో జీవునికి

జాగ్రదావస్థకంటే మించిన సత్యం ఒకటుందని, ఆ స్థితిలో తైజసరూపాన్ని ధరించి, తనలోని వెలుగును తాను చూసుకోగలుగుతాడు. సుషుప్తిలోనికి వెళ్ళాక, అల్లకల్లోల స్థితినుండి శాంతిని పొందుతాడు. అప్పుడు అతడు అమ్మవారి ప్రాజ్ఞరూపాన్ని చూడగలుగుతాడు. అందుకే మనం జాగ్రదావస్థలో ఉన్నప్పుడు అమ్మమ్మగారు కనబడి "నేనే అమ్మవారిని" అన్నా కూడా మనం గ్రహించలేము. అందుకనే ఆమె ఆ స్థితిలోనికి మనలను తీసుకువెళ్ళి, అక్కడ దర్శనం ఇచ్చి, మనం గ్రహించేలా చేస్తున్నారు. మనం అప్పుడు మాత్రమే అమ్మవారిని దర్శించిన ఆనందాన్ని పొంది, నమ్మకాలను స్థిరపరచుకోగలుగుతున్నాము. అందుకే అమ్మమ్మగారు ఆ అవస్థలోనే మనకు అన్ని బోధలూ చేశారని అర్థమవుతున్నది. అదైనా ఆమె అనుగ్రహించి మనలను పై మెట్టుమీదకు తీసుకువెళితే తప్ప, మనకేమీ అర్థంకాదు. అదే జాగృదావస్థలో తెలుసుకోవాలంటే జీవుడు యోగసాధన చేసి, తన ప్రయత్నపూర్వకంగా తెలుసుకోవాల్సిందే కానీ మరోలా తెలుసుకోలేరు. ఆమె కరుణామయి కనుక మనలను ఆ స్థితిలోకి కొద్దిసేపు తీసుకెళ్ళి చెప్పవలసినవీ, చూపించవలసినవీ పూర్తయ్యాక, మళ్ళీ జాగృదావస్థలో తానే అన్నీ మనచేత చెప్పించి, కలలో కన్పించినది అమ్మవారేనని దృఢపరచి, 'బాల' అంశతో కుమార్తె జన్మిస్తుందని చెప్పి, పేరుపెట్టమని తెలియజెప్పి వారిని తరింపచేశారు. అటువంటి అంశతో పుట్టిన పిల్లను వారికిచ్చి, వారి నమ్మకాలను బలపరుస్తూ భక్తిభావాన్ని పెంపొందిస్తూ ఎన్నో అభయాలను ఇచ్చారు. కానీ జీవుడు వీటన్నింటినీ జాగృదావస్థలో తెలుసుకోలేడు. ఎందుకంటే సాధన లేదు కనుక.

జాగృదావస్థలో అమ్మమ్మగారు ఈ విషయాలన్నీ ప్రత్యక్షంగా చెప్పినా కూడా, వాళ్ళు మామూలు కమలమ్మగారు చెప్పిన విషయాలుగా తీసుకుంటారు గానీ, "బాలాత్రిపురసుందరీ" అమ్మవారిపైన భక్తిగానీ, నమ్మకంగానీ వారికి దృఢపడే అవకాశాలు లేవు. అందుకే జీవిని బట్టి, సంస్కారాన్ని బట్టి గానీ ఆమె స్థితులకు అనుగుణంగా వారికి దర్శనములిచ్చి, అనుగ్రహించారనటానికి ఇదొక చక్కని ఉదాహరణ.

ఇక్కడ ఇంకో విషయం – కమలమ్మగారు భోజనం చేస్తే (ఎవరింట్లోనైనా) క్రింద చెయ్యి కడుగరు. ఒక గిన్నెలో కడుగుతారు. ఆ విషయం శాంతాదేవికి తెలుసు. కలలో కనిపించిన బాల కూడా గిన్నెపెట్టు, చేయి కడుగుతాను అనడం ఈవిడ గ్రహించింది. ఆ చర్యవలన ఈమె గుర్తించేలాగా చేశారు. అంటే కలలో కన్పించిన ఆ బాలాత్రిపురసుందరే ఈ కమలమ్మగారు కదా! మరలాంటప్పుడు జీవుడు ఈ విషయాన్ని చాలా సులభంగా తన గురువే అమ్మవారు అని తెలుసుకోవచ్చును. కానీ మాయ, అజ్ఞానము వల్ల ఆమె స్వప్నావస్థను ఎన్నుకుని వాళ్ళకు నమ్మకం కలిగించి, ఉద్ధరించే ప్రయత్నం చేశారని అర్థమవుతోంది.

జీవుని యొక్క స్థితి ఏమిటో, సాధన ఎంతో గురువుకు తెలుసు కాబట్టి వాటిపై ఆధారపడే వాళ్ళకు, ఆ స్థితుల్లోనే అర్థమయ్యేటట్టుగా దర్శనమిచ్చి కాపాడుతారు. "అనువుగానిచోట అధికుల మనరాదు" అనే సామెతగురువులకు తెలీదా?

తర్వాత, ఆ పిల్లపుట్టేముందు శాంతకు తెల్లవారుఝామున ధ్యానంలో – ఒక ఇత్తడి పళ్లెంలో పద్మము, లతల మధ్య ఒక చంటిపిల్ల పడుకుని కనబడింది. తరువాత సుఖప్రసవమై పిల్లపుట్టింది. మర్నాడు ఆమె భర్త స్కూల్లో పనిచేస్తున్న సూర్యనారాయణ మాస్టారు (ఉపాసకులు) "పద్మాలమధ్య ఒక ఆడపిల్ల అమ్మవారిలాగా మీ ఇంట్లో ప్రవేశించినట్లు కన్పించింది. నిజమా?" అనడిగారు. అవును, ఆడపిల్ల అని చెప్పారు శాంతగారి భర్త. ఆశ్చర్యం. అంటే ఇక్కడ కమలమ్మగారు బాల పుడుతుందని చెప్పారు. దాని ధృడపరిచేందుకు ఇవన్నీ తార్కాణాలుగా చూపించారు. లేకపోతే జాగృదావస్థలో ఇవన్నీ ఖచ్చితంగా నమ్మలేము కదా! అందుకే ఇన్ని నిదర్శనాలు చూపించారు.

**11.03.2004**

ఒకసారి బొంబాయిలో ఒక వ్యక్తి భార్య క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంటే, డాక్టర్లు ఆమె పరిస్థితిని చూసి పెదవి విరిచారు. అప్పుడు అమ్మమ్మగారు స్వయంగా వారికి కలలో కనబడి, "ఏలూరు అగ్రహారం నందలి శివాలయం ప్రక్కనగల పెంకుటింట్లో నా పీఠము కలదు మీరు అక్కడికి వచ్చి తీర్థప్రసాదములు తీసుకుంటే నీ భార్య రోగవిముక్తురాలు కాగలదు" అని పలికారు. ఆ దంపతులిరువురూ అమ్మమ్మగారు చెప్పిన అడ్రస్ ప్రకారం ఏలూరు వచ్చి, ఆమె ముఖంపై పులిపిరి కాయలతో సహా అలానే కలలో దర్శనం ఇవ్వడం వలన, ఆమెను గుర్తించి, కాళ్ళపైబడి జరిగిన విషయాన్ని విన్నవించారు. తరువాత అమ్మమ్మగారి ఆశీర్వాదంతో ఆవిడ క్యాన్సర్ వ్యాధినుండి బయటపడింది. అప్పటినుండి చాలాకాలం అమ్మమ్మగారు, ఆ రోజుల్లో పోస్టుద్వారా 'కుంకుమ'ను వారికి పంపుతుండేవారు.

దీనికి వివరణ – ఆ భక్తులు అమ్మవారి ఉపాసకులు. వారికి గురువులు తెలీదు. ఎక్కడో బొంబాయిలో ఉన్నారు. కానీ అమ్మవారిని నమ్ముకుని ఉన్నారు. వారికి ఆపద వచ్చింది. ఎక్కడో ఉన్న కమలమ్మగారు వారు ఉపాసించే అమ్మవారేనని వారికి తెలీదు. వారికి అమ్మవారు ఎలా కాపాడుతుందో కూడా తెలీదు. కానీ, అమ్మవారికి దూరం, దగ్గరలాంటి కొలమానాలు లేవు కనుక అనుగ్రహించవలసిన వారి దగ్గరకు ఆమే వెళ్ళి, తన అడ్రసు చెప్పుకుని తన వద్దకు (ఏలూరు) రప్పించుకున్న వైనం ఇది.

వాళ్ళు మామూలు మనుషులు, ఈమె మానవావతారంలో ఉన్న దేవత. వాళ్ళది బొంబాయి, ఈమెది ఏలూరు. అయినా వారిని ఎలా రప్పించుకున్నారో చూడండి. వారిచే కలరూపంలో అంటే స్వప్న, సుషుప్తావస్థలలో ఉన్న ప్రాజ్ఞారూపం దర్శించుకునేలా చేశారు. ఆ స్థానంలో అంటే "ప్రాజ్ఞారూపం" ఏదో కనబడినా మనకు తెలీదు కదా! ఆ స్థానంలో ఈమె రూపంతో (పులిపిరి కాయలతో సహా) దర్శనమిచ్చి, చెప్పవలసినది చెప్పారు. ఆ అవస్థలోకి జీవుడిని తీసుకువెళ్తే తప్ప విషయాన్ని గ్రహించలేడు కదా. జాగ్రదావస్థలో తెలుసుకోలేడు. దాదాపు సుషుప్తి అవస్థలోకి వెళ్ళిన తర్వాత జీవుడు కొన్ని మెట్లు పైకి వెళ్ళి అక్కడ వెలుగును చూడగలిగే స్థితికి వస్తాడు. కనుక అమ్మమ్మగారి ప్రాజ్ఞారూపమును గుర్తుంచగలుగుతాడు. చెప్పినవి

అర్థంచేసుకోగలుగుతాడు. అది జాగ్రదావస్థలో జరగని పని. అస్సలు నమ్మలేము.

ఎదురుగా వచ్చి నిల్చున్నాసరే మనం గుర్తించలేము. ఎందుకంటే, ఇంకా మనం మొదటిమెట్టు మీదకు కూడా రాలేదు కనుక. ఆ అవస్థలో అమ్మమ్మగారు మనలను పైమెట్టు మీదకు ఎక్కించి, ఆ స్థితిని అర్థమయ్యేలాగా బోధపరుస్తారు. కనుక వెంటనే మనసు దానిని గ్రహించగలుగుతుంది. కనుకనే అది అంత బలమైనది. ఆవిధంగా అక్కడున్న అమ్మవారి ప్రాజ్ఞారూప స్థానంలో అమ్మమ్మగారు కనిపించి, రప్పించుకున్నారు. పులిపిరి కాయల వలన వారు సులభంగా గుర్తించి, అనుగ్రహం పొందారు (అనగా భౌతికరూపంలో).

అలాగే ఇంతకుముందు, శాంతాదేవిగారు భౌతికమైన చర్య (గిన్నెలో చేయి కడగటం) ద్వారా అమ్మవారిని గుర్తించారు. అంటే భౌతికాన్ని గుర్తుచేయాలన్నమాట. ఎందుకంటే, అమ్మమ్మగారు భౌతికంగా వారిని కలిసి అనుగ్రహించాలి కదా! తీర్థప్రసాదములు ఆమె చేతితో ఇవ్వాలి కదా! వారికి ఆమెను దర్శించుకుని, నమస్కారము చేసే అదృష్టాన్ని ప్రసాదించాలి కదా! మొదట ఆమె గొంతు విని, తరువాత విన్నవాటిని స్మరించుకోవాలి కదా! ఇవన్నీ జాగ్రదావస్థలో జీవునికి కావాలి. అందుకనే ఆమె ఆవిధంగా అనుగ్రహించారని తెలుస్తోంది. కలలోనే ఆమె తీర్థం ఇచ్చినాకూడా రోగవిముక్తురాలు కాగలదు. కానీ వారికి అమ్మవారి దర్శనభాగ్యాన్ని ప్రసాదించాలి కదా! నమ్మకం దృఢపడాలి కదా! ఇవన్నీ స్వయంగా కలిస్తే తప్ప జరగవు. అందుకనే ఆమె ఆవిధంగా అనుగ్రహిస్తున్నారని అర్థంచేసుకోవచ్చు. 'శివాలయం పక్కన పెంకుటిల్లు' అని అడ్రసుతో సహా చెప్పి వారిని ఆ మూలస్థానానికి రప్పించారు. అంటే ఆ స్థానం తొక్కి, ఆమెను అక్కడ దర్శనం చేసుకుని, ఆమె చేతితో తీర్థప్రసాదములు స్వీకరించి, ఆమెచే ఉపదేశము తీసుకుంటే తప్ప, వారికి పరిపూర్ణ అనుగ్రహం దొరకదన్నమాట. పైగా వారి ఉపాసనా బలంకొద్దీ, వారికి దర్శన భాగ్యమునకు సమయం ఆసన్నమైనదన్నమాట.

వీటన్నింటినీ చూస్తుంటే మనం ఒకటి అర్థంచేసుకోవచ్చు. శిష్యుడు అమ్మవారిని నమ్మి పూజిస్తుంటే చాలు. అమ్మవారు వారికి సమయం ఆసన్నమైనప్పుడు కలలో కన్పించి, వారిని రప్పించుకుని, స్వయంగా అనుగ్రహించి, కర్మవిముక్తుల్ని చేస్తుంది. ఈ ఒక్కరి విషయంలోనే ఇలా ఉంటే, సకల చరాచర జగత్తును సృష్టించిన ఆ తల్లికి, ఇన్ని జీవరాశుల్ని పెంచి పోషించి, రక్షించడమంటే ఎంత కష్టతరమైన (లౌకికంగా) పని. ఆమె 'శ్రీమాత' కనుక ఇది చేయగలుగుతుంది. తల్లి, బిడ్డను కని, పెంచి, పోషించి, పెద్దది చేస్తుంది. అందులో సంతోషం తప్ప, కష్టము కనిపించదు. అలానే ఆమె తల్లి కనుక, మనం 'అమ్మా' అనగానే, ఎక్కడున్నా సరే, మన వద్దకు వచ్చి మన ఆర్తి తీర్చి వెళ్తుంది.

అమ్మవారు శ్రీలను ప్రసవించే శ్రీమాత. ప్రపంచానికి తల్లి. తల్లిదండ్రులు కన్న పిల్లలకు ప్రాణంపోసి జ్ఞానాన్ని ప్రసాదించే జ్ఞానాంబిక. సిరిసంపదలను కురిపించే శ్రీవర్షిణి. తల్లి, తండ్రి, గురువు మూడు రూపాల్లోనూ అనుగ్రహిస్తుంది. తల్లిలా కని పెంచుతుంది, తండ్రిలా పోషిస్తుంది.

గురువులా ప్రాణికోటిని తప్పుదారి పట్టకుండా ఒక కంట కనిపెట్టి ఉంటుంది.

ఇటువంటి సంఘటనే మరొకటి. ఒకసారి మద్రాసులో ఒక స్త్రీ ప్రసవవేదన పడుతున్నది. డాక్టర్లు ఆశ వదిలేశారట. ఆ సందర్భమున, ఆమె తల్లిదండ్రులకు అమ్మవారు కలలో కనిపించి, "ఏలూరులో ఉన్న బెహరా కమలమ్మగారి వద్దకు వెళ్ళి, కుంకుమ పెట్టించుకు రండి" అని పలికారట. ఈ పరిస్థితుల్లో మేము వెళ్ళగలమో, లేమో అని వారు సందేహిస్తుండగా, "మీరు తప్పక వెళ్ళగలరు" అని తిరిగి అమ్మవారు పలికిందట. వారు ఏలూరు వచ్చి కమలమ్మగారి అడ్రసు తెలుసుకుని కుంకుమ బొట్టు పెట్టించుకున్నారట. అక్కడ వారి అమ్మాయికి సుఖప్రసవం జరిగింది.

ఈ సంఘటనలో వారి తల్లిదండ్రులను అనుగ్రహించి, వారిని పీఠానికి పిలిపించి, కుంకుమ, తీర్థములిచ్చి, వాళ్ళతో మొక్కు తీర్పించిన తర్వాత, వారి అమ్మాయికి సుఖప్రసవమైనదట. తల్లీబిడ్డ క్షేమంగా బయటపడ్డారు. ఆ తరువాత వారంతా పీఠమును దర్శించుకుని వెళ్ళారు. ముందు కన్నవారిని, తద్వారా వారి కుమార్తెను రక్షించిన వైనం ఇది. "మీరు వెళ్ళగలరు" అని రెట్టించి చెప్పి, వారిని పీఠమునకు రప్పించారు. ఒక్కరిని రక్షించడమనే పేరుమీద ఎంతమందిని అనుగ్రహిస్తారో మనకు తెలీదు కదా! అవి వారి అనుగ్రహచేష్టలు. ఎవరో ముక్కూ, మొహం తెలియని వారికి కలల్లో కనబడి, అడ్రస్ చెప్పి రప్పించుకోవడమంటే అవి మానవులకు సాధ్యమయ్యే విషయాలుకావు కదా ఆమె చెప్పినట్టుగానే ఇక్కడ కుంకుమ పెట్టించుకున్నాకే అక్కడ సుఖప్రసవం జరిగింది.

**శ్రీమతి కానుకొలను కమలమ్మగారి మాటలు**

1954 నుండి పరిచయము. ప్రథమ లక్షకుంకుమార్చన పీఠములో మాదే. కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి కుమారుడు శాంతానందస్వాములవారు లలిత ఉపాసకులు. ఏర్పేడు పీఠాధిపతి. మా తాతగారికి వీరు గురువులు. వీరు మా ఇంటికి వచ్చేవారు. నాకు 12వ ఏట 'బాల' ఉపదేశము జరిగింది.

బెహరా కమలమ్మగారితో నాకు స్నేహసంబంధములు ఉండేవి. "మన ఇద్దరి పేర్లు కమల. అప్పటినుండి మనకి వాసన ఉన్నది. మనము అప్పాచెల్లెళ్ళము" అనేవారు. నాకు ఆవిడని చూడగానే చాలా ఆనందము కలిగేది.

నేను మా ఇంట్లో ఏదైనా అనుకుంటే, అక్కడ ఆవిడకు "దేవి, కమల వస్తోందిరా" అని చెప్పేవారట. కొంతసేపటికి నేను రిక్షా దిగేదాన్ని. ఆవిడ ప్రేమమూర్తి. నిరాడంబర జీవి. వీరు, వారు అనే బేధము లేదు. పొరుగూరి నుండి వచ్చినవారికి భోజనం పెడుతుండేవారు. "నా తరువాత ఈ పీఠము వృద్ధి చెందుతుంది" అనేవారు.

మా కుటుంబంలో అన్ని కార్యక్రమములకు వచ్చేవారు. ముందుగా ఆవిడకు బట్టలు పెట్టేదాన్ని. ఒక కుటుంబంలాగా మెలిగేవాళ్ళం. ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడేవారు. మన మనోగత

భావాలను ముందుగానే తెలుసుకునేవారు. నాకు దైనందిన జీవితంలో కలిగే చాలా సమస్యలకు "ఇన్ని వారాలు పూజలు చేసుకోమని" నియమాలు ఇచ్చేవారు. అవి పాటించగానే సమస్యలు తొలగిపోయేవి. పీఠదర్శనముతోనే ధైర్యము, ఆనందము కలిగేవి.

శాంతానందస్వామివారు మా ఇంటికి వచ్చినప్పుడు నేను ఫిడేలు వాయించేదాన్ని. వారు పాటపాడేవారు. పిన్నిగారు కూడా పాటలు చాలా బాగా పాడేవారు. మహాశక్తి ఆ కుటుంబములోనే ఉన్నది. నాకు, డాక్టర్లు ఒకసారి పెద్ద ఆపరేషన్ చేయాలన్నారు. నేను చాలా భయపడ్డాను. పూజ పిన్నిగారు ఒక వెండి త్రిశూలం ఇచ్చి తలక్రింద పెట్టుకుని పడుకోమన్నారు. ఇక తిరిగి ఆపరేషన్ సమస్య రాలేదు.

'త్రిశూలం' అనేది ఒక ఆయుధం. అమ్మవారు దానిని దుష్టశిక్షణకు ఉపయోగిస్తారు. ఆమె త్రిశూలాన్ని తలకింద పెట్టుకుని పడుకోమన్నారు అంటే ఆమె దాని ద్వారా ఆ సమస్యను తొలగించారని అర్థము. అయితే అది ఆమె ఇవ్వబట్టి ముందు రోగికి ధైర్యం ఎక్కువ అవుతుంది. తర్వాత ఆమె చేసేది ఆమె చేశారు. మళ్ళీ ఇంక ఆ సమస్య రాలేదు.

అలాగే త్రిశూలం ఉంచడం ద్వారా శరీరమునకు ఉన్న కర్మను (ఆపరేషన్ లేకుండా) తొలగించారు. భక్తురాలికి శారీరక శ్రమ కర్మలనుండి తొలగించుటకు భౌతికముగా ఒక వస్తువును ఇచ్చి, ధైర్యమునిచ్చి, కర్మ తొలగించారు. ఇది ఒక భక్తురాలిని కాపాడిన వైనము.

ఒకసారి మాఇంటి చుట్టూ ఉన్న గుడిసెలు తగులబడుతున్నవి. మంటలు మా ఇంటివరకూ వచ్చేస్తున్నాయి. భయం కలిగి వెంటనే పిన్నిగారి దగ్గరకు వచ్చాను. ఇంటి చుట్టూరా కుంకుమనీళ్ళు చల్లి, ఇంటికప్పు మీద పెరుగన్నం పెట్టమన్నారు. నేను అలాగే చేశాను. అంతే, ఇంకేమి కాలేదు. కుంకుమనీళ్ళు చల్లేసరికి అగ్ని అక్కడిదాకా వచ్చి ఆగిపోయింది. కుంకుమ చల్లడం అంటే అక్కడ అమ్మవారు ఉన్నట్లే కదా! పైగా అగ్నికి పెరుగన్నం నైవేద్యం పెట్టించారు. దాంతో అగ్ని అక్కడే ఆగిపోయింది.

ఇంకొకసారి మా ఇంట్లోకి కట్లపాము వచ్చి కదలక, మెదలక అలానే పడుకున్నది. మాకు చాలా భయం వేసింది. వెంటనే కుంకుమ నీళ్ళు చల్లగానే అది మళ్ళీ కనబడకుండా ఎటో వెళ్ళిపోయింది.

కుంకుమ దివ్యౌషధం. శరీరంలోకి పంపితే అది ఔషధంలాగా పనిచేస్తుంది. జబ్బును నయంచేస్తుంది. అలాగే బాగుండని ప్రదేశాల్లో, ఉండకూడని వాటిపైన, నష్టంచేసే వాటిపైన చల్లినప్పుడు, వాటినుండి వచ్చే ప్రమాదాలను తప్పిస్తుంది. ఏదైనా చెడును తప్పించడమే దాని నైజం. అందుకే అమ్మమ్మగారు కుంకుమనే తీర్థముగా ఇస్తుండేవారు. ఈనాటికి అందులో అంత మహత్తు ఉండటం గమనిస్తున్నాము కదా!

ఆవిడ నాకు మంచి స్నేహితురాలు. ఆవిడపట్ల నాకు గల గురు పూజ్యభావం వలన అప్పుడప్పుడు భయం, సంశయము కలుగుతుండేవి. అయినా వాటిని త్రోసిపుచ్చి, ఆవిడ అతిప్రేమ

గాను, చనువుగాను వ్యవహరించేవారు.

నేను అమ్మమ్మగారిని స్నేహితురాలిగాను, కుటుంబ సభ్యురాలిగాను, గురుభావంతో చూస్తుండగా, ఆమె మనం అప్పాచెల్లెళ్ళం అని చెప్పడం ద్వారా చనువు సహజంగా ఎక్కువ అవుతుంది. అలా ఉంటునప్పుడు ఎప్పుడో ఒకసారి భయం వేస్తుంది. **ఆమె పట్ల మనం అలా అతిచనువుగా ఉండకూడదేమో, తప్పు చేస్తున్నామేమో, అలా చెయ్యకూడదేమో అనే సంశయం కలగడం కూడా సహజమే. శిష్యుడైనవారికి భయం, సంశయం అనేవి తప్పకుండా రావాలి. హద్దుల్లోనే మెలగాలి. ముఖ్యంగా గురువు కాబట్టి ప్రేమతోపాటు భయం, భక్తి, సంశయం, నమ్రత, ఓర్పు, పూజ్యభావం ఇవన్నీ తప్పక ఉండాలి. మనకు తెలియకపోయినా వారే తెలియజేస్తారు. తెలియజేసే లోపల ఒక్కొక్కసారి మనమే వారి కోపానికి గురికావచ్చు. లేదా వారిపట్ల దుష్ప్రవర్తనకు ఫలితం మనం అనుభవించవలసి రావచ్చును. ఏదైనా మనకు నష్టం వాటిల్లవచ్చును. అందువలన మనం హద్దుల్లోనే ఉండాలి. ఎప్పటికప్పుడు భయాన్ని, సంశయాన్ని గుర్తుకు తెచ్చుకుని మరీ సాధన చేయాలి. మనకు అలాంటి సాధన ఉన్నప్పుడే వారు వాటిని త్రోసిపుచ్చి అతిచనువుగాను, ప్రేమగాను వ్యవహరిస్తారు. అప్పుడే మనం వారి ప్రేమకు పాత్రులమౌతాము. వారి చనువు మనకెంతో ఆనందాన్ని, ధైర్యాన్ని ఇస్తాయి. గురుశిష్యుల మధ్య సంబంధం ఎప్పుడూ ఇలాగే ఉండాలి.**

ఈమె ఎంత అదృష్టవంతురాలో చూడండి. అమ్మమ్మగారి అన్నగారైన శాంతానందులవారితో కూడా పరిచయభాగ్యం ఉన్నది. అంతేకాక ఆయన పాడుతుంటే, ఫిడేలు వాయించేవారట. ఎంత అదృష్టం! ఇద్దరు పీఠాధిపతులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నాయంటే ఎంతో సుకృతజీవులు.

కమలమ్మగారు ఇంట్లో ఏదైనా అనుకుంటేచాలు – ఆ విషయం ముందే అక్కడున్నవారితో చెప్పేవారట. అందుకేనేమో "మనకీ వాసన అప్పటినుండి ఉన్నది" అన్నారు. రెండు మనసుల మధ్య అంతరం లేదన్నమాట. అంత స్వచ్ఛమైన మనస్సున్న శిష్యురాలు కనుకనే అమ్మమ్మగారు ఆవిడను అలా కోరుకునేవారు. ఒక కుటుంబంలో, ఒక తండ్రికి పుట్టిన ఇద్దరు యోగులను దర్శించి, సేవించిన ఈమె జన్మ ధన్యమైనది. ఇవన్నీ జన్మాంతర వాసనల వలన కలిగేవే తప్ప, ఈ జన్మలో సంక్రమించేవి కావు.

**12.03.2004**

**శ్రీమతి నాంచారు సుబ్బలక్ష్మి**

ఈమెకు 11 సం॥ల వయస్సు ఉన్నప్పటి నుండి పిన్నిగారితో పరిచయం. పీఠంలో కుంకుమపొట్లాలు కడుతుండేవారు. అమ్మమ్మగారు 41 రోజులు పీఠంలో నిద్ర చేయమన్నారట. ఆ తర్వాత ఈమె పెళ్ళి జరిగింది.

*వివరణ:* వివాహం తర్వాత ఉండే గండాలను, దోషాలను సరిచేయుట కొరకు ముందుగానే

పీఠంలో నిద్రలు చేయించారు. భగవతి స్థానంలో నిద్రచేయించుట ద్వారా ఈ దోషాలు సరిచేయబడతాయి. గురువులకు భవిష్యత్ ముందుగానే తెలియటం వలన చేయించాల్సినవన్నీ ముందుగానే చేయించి ఆశీర్వదిస్తారు.

ఒకసారి పెళ్ళికి ముందు ఈమెకు విపరీతమైన చెవిపోటు వచ్చింది. కుంకుమ, కొబ్బరినూనె, కర్పూరం (ఇంకోటి గుర్తులేదు) కలిపి కాచి చెవిలో పోశారట. అవతల చెవిలో నుండి పురుగులు బయటపడ్డాయట. ఎంత ఆశ్చర్యమో చూడండి. ఈ రోజుల్లో ఇన్ఫెక్షన్ అనీ, బ్యాక్టీరియా అని వేలాది రూపాయలు మందులు వాడినా కూడా పూర్తిగా రహితము కావడం లేదు. పైగా ఈ మధ్య ఒక పిల్లను (మెదడులో ఒక ప్రాబ్లం) నేను హాస్పిటల్‌లో చూపిస్తే ఆ డాక్టరు సంవత్సరం క్రితం వచ్చిన చెవిపోటు వలన ఇన్ఫెక్షన్ ఎక్కువై, వర్టిగో ప్రాబ్లం వచ్చింది. దీనికంతటికి చెవిపోటే కారణమని వాటికి సంబంధించిన మందులు వాడాక తగ్గింది. ఎక్కడ చెవిపోటు? ఎక్కడ మెదడు? ఇంత చదివిన డాక్టర్లే కొన్ని ఆలస్యంగా తెలుసుకుంటున్నారు. అటువంటిది అమ్మమ్మగారు చిన్న చిట్కా వైద్యంతో శిష్యురాలిని డబ్బుకీ, శ్రమకు ఓర్వనివ్వకుండా ఇంత తేలికగా నయం చేశారంటే గురువుల దయను చూడండి. ఏమిచ్చి గురువు ఋణం తీర్చుకోగలము?

ఈమె పెద్దకుమారుడు గర్భంలో ఉన్నప్పుడు తల (గడ్డము వరకు) మనిషి రూపంతో, శరీరము పాము రూపంతో గోడపైన కనిపించింది. ఈ విషయం పిన్నిగారికి చెబితే "బాలాజీ పేరు కలిపి నీకిష్టమైన పేరు కలుపు" అన్నారు. అప్పుడు బాలాజీ చంద్రశేఖర్ అని పెట్టుకున్నారు. బాలాజీ అమె గురువుగారు. వారి వద్దనే అమ్మవారికి ఉపాసన సంక్రమించింది. ఎవరో శిష్యురాలికి ఏదో వింతగా కన్పిస్తే ఆయన మా గురువుగారు అని ఆమె అనుగ్రహించడం ఏమిటి? పైగా ఆయన పేరు పెట్టుకోవడం ఎందుకు? అంటే ఇక్కడ ఒక వివరణ ఇస్తున్నాను.

ప్రొ॥ రామరాజుగారు వ్రాసిన 'ఆంధ్ర యోగుల చరిత్ర' పుస్తకంలో శ్రీ శాంతానందుల వారి జీవిత చరిత్రను రాస్తూ భాగవత దశమ స్కందంలో ఉన్నదని వ్రాస్తూ ఇలా చెప్పారు – "24మంది గురువులు ఉంటారనీ, వాటిలో 12వదో, 11వదో పాము అనీ, అవి చీమలుగానీ, చెదలుగానీ పెట్టిన పుట్టలలోనే నివసిస్తాయిగానీ వాటికై అవి ప్రత్యేకమైన ఆవాసము ఏర్పరచుకోవు. అలాగే యోగులైన వారు కూడా ప్రత్యేకమై మఠాలు, ఆశ్రయాలు ఏర్పరచుకోరు. ఎవరైనా కట్టించిన వాటిల్లోనే నివసిస్తారు."

ఈ విధంగా పాము కనబడగానే అమ్మమ్మగారు వారి గురువుల్ని గుర్తించారు. యోగుల గురించి యోగులకే తెలుస్తుంది. వాటి వెనుక అర్థాలు, మనం చెప్పినా కూడా అర్థం చేసుకోలేము. ఆవిధంగా బాలాజీగారు నాంచారు సుబ్బలక్ష్మికి దర్శనమిచ్చారు. కాబట్టి పరమ గురువులైన వారి పేరు పెట్టుకోమని ఆదేశించారు. ఒక శిష్యురాలి కుమారునికి గురువులు, పరమ గురువుల అనుగ్రహాలు ఏవిధంగా ప్రసరిస్తున్నాయో. జన్మాంతర సుకృతాలు అంటే ఇవే. జన్మసుకృతాలు శిష్యునికి ఉంటే జన్మాంతర గురువులు కూడా ఎలా వెన్నంటి ఉంటారో గమనించండి.

“నీకు రెండవసారి ఆడపిల్ల పుడుతుంది, కానీ బతకదు. పిల్ల బ్రతికితే తల్లి బ్రతకదు” అన్నారు. నిజంగా అలాగే జరిగింది. ఈ విషయం కమలమ్మగారికి చెబితే, “గండం గడిచింది” అన్నారట. ఆడపిల్ల పుట్టకుండానే ఆమె గండాన్ని తప్పించవచ్చు కదా! అంటే ఆ పిల్ల ఋణం తీర్చుకోవాలి. 9 నెలలు మోసి కనాలి. అప్పుడు గానీ పూర్తవదు. పిల్ల బ్రతికితే తల్లి బ్రతకదు అందుకే పిల్ల ఋణం తీర్పించి, ఆ గండమును తప్పించారన్నమాట. శిష్యులకు ఎప్పుడు ఏ ఆపద వస్తుందో ముందుగానే చెప్పి, వాటినుండి వారిని ఎంత సులువుగా, రక్షిస్తున్నారో చూడండి. కాబట్టి జరుగుతున్నవన్నీ మనం చూస్తుండాలి. అంతే. ఏవి, ఎందుకు, ఎప్పుడు, ఎలా జరుగుతాయో మనకు తెలీదు కదా! అలాగే ఎందులో ఏముందో, ఏది జరిగితే మనకు చెడో, ఏది జరిగితే మనకు మంచో, ఆమె ముందుగానే నిర్ణయించి దానిప్రకారం నడిపిస్తారు. మనం చెయ్యాల్సిందల్లా గట్టి నమ్మకంతో ఉండడమే. అలా కాకపోతే మనం కంగారుపడి, బాధపడి, ఆరోగ్యం పాడుచేసుకుని, చుట్టుపక్కల వాళ్ళను కూడా బాధించి, నమ్మకం ఉందంటూ అమ్మవారిని కూడా మన ఏడుపులతో, విసుగులతో బాధించడం వలన, 4 రోజుల్లో జరగబోయే మంచిని మనం ఈ 4 రోజులు, 4 సం॥లు బాధను అనుభవించవలసి ఉంటుంది. మన నమ్మకం కూడా కాస్త అటూఇటూ ఊగిపోతుంటుంది. ఊగకుండా గట్టిగా ఒకచోటే నిలబెట్టి మనం నిలకడగా ఉంటే చాలని అర్థం చేసుకోండి. సాధన చేయడానికి ప్రయత్నించండి.

**కుప్పా కామేశ్వరరావుగారి మాటలు**

కమలమ్మగారితో తొలిపరిచయం 1957. మా ఇంట్లో రాజరాజేశ్వరి ఉపాసన ఉన్నది. నవరాత్రులు జరిపేవాళ్ళం. అప్పుడు మేము తెనాలిలో ఉండేవాళ్ళం. నేను పూజపిన్నిగారిని కలవగానే ఆవిడ “మీ ఇంట్లో దేవి ఉపాసన ఉన్నదికదా. నవరాత్రులు పూజలు చేస్తారు కదా” అనడిగారు. నేను ఆశ్చర్యపోయాను. మాకు భీమడోలులో జాడీల ఫ్యాక్టరీ ఉంది. ఆవిడ ఆ స్థలాన్ని చూసినట్లే “అక్కడ వెలగచెట్టు, తాడిచెట్టు, మారేడు, మామిడిచెట్లున్నాయి కదా అవి నాకు చాలా ఇష్టం” అన్నారు.

ఇవన్నీ ఆమె చూసినట్లే చెప్పడానికి కారణం - వాళ్ళింట్లోనే కదా అమ్మవారి ఉపాసన, పూజలు చేస్తున్నది. అందుకే అవన్నీ ఆమెకు ముందే తెలుసు. వారు ఉపాసిస్తున్నారే గానీ, ప్రత్యక్షంగా గురువును కలిసే సమయం ఇంకా రాలేదు కదా! అందుకనే కారణార్థం వాళ్ళను ఏలూరు పిలిపించుకున్నారు. శిష్యులెక్కడున్నా గురువులు అనుగ్రహించడానికి వెతుక్కుంటూనే ఉంటారు కదా! వారు ఉపాసిస్తున్న దేవతే ఇక్కడ గురురూపంలో వారికి దర్శనమిచ్చి, వారిని ఎన్నో విధాలుగా ఎన్నోసార్లు కటాక్షించారు.

మా అమ్మాయి అరుణకు రూపుచేయించి ఇచ్చారు. అది చేయించిన వారంరోజులకు పెళ్ళి జరిగింది. కంసాలి స్నానం చేసి, రూపుని తయారుచేసి కమలమ్మగారి ఆదేశానుసారం లలిత అని రాశాడు. ఆ రూపుతో తయారుచేస్తున్నప్పుడు అతనికి ‘భ్రమరాంబ’ అని వినపడిందట. ఆ

పదము కూడా ఆ రూపుమీద రాశాడు. ఇలాగని కమలమ్మగారికి చెబితే “అరే, నేను మర్చిపోయాను. మంచి పనిచేశావు” అన్నారు.

ఆవిడ మర్చిపోవడం ఏమిటి? ఆ రూపు ఇద్దామనుకున్నప్పుడే ఆ పేర్లు ఆమె సంకల్పం చేసి ఉంటారు. అందుకే ఆ పేరు కంసాలికి వినిపించింది. అది వ్రాశాడు. వాళ్ళ సంకల్పమే ముఖ్యం, అదే జరుగుతుంది కూడా. వాళ్ళ మాటలు అన్నీ మనకు వినబడాల్సిన పనిలేదు. ఏది జరగాలో దాన్నే చేయిస్తారు వాళ్ళు. అదే జరుగుతుంది కూడా.

కమలమ్మగారికి, దానిమ్మకాయంటే ప్రీతి. ముఖ్యంగా దుర్గాష్టమి రోజు అమ్మవారికి ఎర్రనిపండు సమర్పిస్తుండేవారు. ఆవిడకు ఆకుపచ్చరంగు చాలా ఇష్టము. ఏలూరు పీఠములో దీపావళినాడు ధనలక్ష్మి పూజ మాతోనే మొదలైంది. ఆనాటినుండి ఈనాటివరకు జరుగుతూనే ఉన్నది.

మా అబ్బాయికి మేనరికపు సంబంధం చేసుకోవడం ఇష్టం లేదు. ప్రతిరోజు కలలో పిన్నిగారు తెల్లవారుఝామున 5 గం.లకు ఆ అమ్మాయికి జడవేసి, ఓణివేసి చక్కగా తయారుచేసి తీసుకు వచ్చేవారు. పిల్ల బంగారం అనేవారు. పిన్నిగారు “నేనిప్పుడు ఊరికి వెళ్తున్నాను. పెళ్ళినాటికి వస్తాను. పచ్చళ్ళు, ఒడియాలు ఎవరికీ పెట్టకు. ముందునాకు పెట్టాకే” అన్నారు.

కలలో కనబడి పెండ్లికొడుకు పెళ్ళికూతురు వడిబియ్యంతో గృహప్రవేశం చేశారు. నిజంగా వివాహమయ్యాక అలాగే గృహప్రవేశం చేశారు.

ఆవిడతోపాటు జొన్నవాడ, తిరుపతి, తిరువత్తియూరు యాత్రలు చేశాము. ఈ మూడు ప్రదేశాలు ఆమెకు ప్రక్కబజారువలె ఉండేవి. ఒకసారి నాతో “నువ్వునాకు పెద్దకూతురిలాగా కనిపిస్తావు. మీ ఆయన ముందుగా పోయినా దిగులు పడకు” అని చెప్పారు. ఇక్కడ వీరి అబ్బాయి పెండ్లి విషయం కూడా ఆవిడ చేయదల్చుకున్నదే చేశారు. కలలో కనబడి ఒప్పించేవారు. జరుగకూడనిది ఎలా ఆపుతారో, జరగవలసిన దానిని కూడా అలాగే జరిపిస్తారు. ఎందుకంటే కష్టనష్టాలను తప్పించాల్సినది ఆమే కనుక. అంటే దగ్గరుండి పెళ్ళి చేయించి, వధూవరులతోపాటు ఆమె కూడా గృహప్రవేశం చేశారు. వారిపైన ఎంత దయో చూడండి. వద్దన్నా సరే, కల ద్వారా జరుగబోయేది చూపిస్తూ, కార్యం నడిపించారు. నమ్ముకున్న వాళ్ళను సమస్యలను ఆమె అలాగే పరిష్కరిస్తారని చాలామంది విషయాల్లో మనకు అవగతమైంది కదా!

ఏ పుణ్యక్షేత్రాలు దర్శిస్తే, ఏ పీడలు ఎలా నివారింపబడతాయో ఆమెకు తెలుసు కాబట్టే, ఆమే స్వయంగా భక్తులచేత పుణ్యక్షేత్ర దర్శనాలు చేయిస్తుండేవారు. యాత్రలు చేస్తేనే పుణ్యం అంటే, గురువుతో పుణ్యతీర్థాలను దర్శించుకోవడం అంటే కర్మలను తొలగించుకోవడమేనని అర్థం. క్షేత్రదర్శనాలు, గురువులతో నిద్రలు చేయడం, పుణ్యనదుల్లో స్నానమాచరించడం, గురువుల సమక్షంలోనే దానధర్మాలు చేయడం, ఇవన్నీ గురువుల అనుగ్రహమే తప్ప మరేదీ కాదు. ఎంత కరుణ? దాన్నే ‘అవ్యాజకరుణ’ అంటారు. ఈ లోకంలో ఒక్క తల్లే పిల్లలను అలా చేయిపట్టుకుని

నడిపించగలదు (లౌకికంగా). కానీ గురువులు చేసే ప్రక్రియలు తల్లికి తెలియవు కదా! ఆమె 'అమ్మలగన్న అమ్మ' కనుక సాక్షాత్తూ శక్తిస్వరూపణి కనుక రాబోయే గండాలను తప్పిస్తూ, జరగాల్సిన మంచిని జరిపిస్తూ, శిష్యునికి ఎండలో గొడుగుపట్టినట్లుగా జరిపిస్తున్నారని అర్థమవుతున్నది.

"మీ ఆయన ముందుగా పోతారు. దిగులు పడకు" అనే మాటను ఆవిడ అన్నారంటేనే అందులోని సత్యం అవగతమవుతున్నది. భయపడవద్దు, నేనున్నాను, దిగులుపడకు అని చెప్తున్నారంటే ఎంతో అభయము, హామీ. ప్రపంచంలో ఈ మాటలు ఎవరు చెప్పగలరు? భర్తృ వియోగం కలిగితే, కలిగే దిగులను తీయగలవారెవ్వరు? అటువంటి దుఃఖాలు తీరేవా? మనిషిని వాటివల్ల కలిగే దిగులునుండి బయటపడేయటమంటే మాటలా? ఇవన్నీ ఒక్క వాక్యమును చెప్పడం ద్వారా ఆమె తీర్చగలిగేవారన్నమాట! వారి (గురువుగారి) మాట ఒక వాగ్ధానం, అభయం, ధైర్యం. శిష్యునికి బాధను పారద్రోలే శక్తి అన్నమాట. ఇక్కడ కమలమ్మగారు, ఈమెను తన "పెద్దకూతురిలా కనిపిస్తావు" అన్నారంటే, తల్లీబిడ్డల ప్రేమకు తార్కాణం వీరి అనుబంధం. అలాగే ఇంకొకరిని 'అప్పాచెల్లెళ్ళం' అన్నారు. ఇంకొకళ్ళను 'తల్లీ' అని, కొందరిని 'మానసపుత్రు' లన్నారు. ఈ లోకంలో ఇలాంటి సంబంధాలను రక్తసంబంధాలు అంటారు. గురుశిష్య సంబంధాలను 'ఆత్మసంబంధాలు' అంటారు. పరమాత్మకు జీవాత్మలపై ఉండే ప్రేమ ఇదే. వాళ్ళ అబ్బాయి పెళ్ళివిషయంలో ఒక మాట అన్నారు. "పచ్చళ్ళు, వడియాలు ఎవరికీ పెట్టకు. ముందు నాకు పెట్టాకే" అని. అంటే ముందు మనం ఎవరికి పెడతాము! భగవంతునికి. ఆ తర్వాతే కదా మనం ఏపనైనా చేసేది?

అంటే ఆ మాటలో ఎంత అర్థమున్నది! ఆమె భగవతి కనుక ముందు తనకే పెట్టమని చెబుతున్నారు. భగవంతుడు మానవ అవతారంలో మనతోపాటు తిరిగి గ్రహించడం చాలా కష్టం. మాయ కప్పబడిపోతుంది. అందుకనే వాళ్ళు అంత స్పష్టంగా చెప్పినా కూడా తెలుసుకోలేము. మామూలుగా 'పిన్నిగారు ఇలా అన్నారు' అంటామే కానీ 'భగవతి' అనే భావం చాలాసార్లు మరుగున పడిపోతుంది. కనుకనే కృష్ణుణ్ణి, రాముణ్ణి కూడా మానవ అవతారాలెత్తితే తెలుసుకున్న వాళ్ళు కొద్దిమందే. దాన్ని దృష్టిలో పెట్టుకుని మనం కూడా ప్రతి చిన్న పనికి ముందు ఆవిడకి చెప్పాకే, లేక, ఆవిడకు ముందు సమర్పించిన తరువాతే మనం పని మొదలుపెట్టాలని గుర్తించాలి. ఇది ఆమె ఆజ్ఞ, ఆదేశం అనుకుని, గుర్తించి మనం ప్రవర్తించాలి.

కమలమ్మగారు నిర్యాణం చెందినట్లు, కపాలమోక్షం జరిగినట్లు నాకు తెలిసినది. నేను చూడలేకపోయినందుకు అంతులేని బాధపడినాను. ఒకరోజు రాత్రి ఆవిడ కలలో కనిపించి "ఎందుకే బాధపడతావు? ఇలాచూడు, ఇదిగో ఇదే కపాలమోక్షమంటే, ఇదిగో రక్తపుచుక్క, బాగాచూడు" అని చెయ్యిపట్టుకుని చూపించారు. నా జీవితం ధన్యమైందని భావించాను. ఎప్పుడూ ఆమె భక్తుల వెన్నంటే ఉంటారు. ఆమె సిద్ధిపొందిన రోజు చాలామంది శిష్యులకు ఆమె వేర్వేరు ప్రాంతాల్లో కలలో కనిపించి తను వెళ్ళిపోతున్నట్లుగా చూపించారు, చెప్పారు కూడా.

కామేశ్వరమ్మగారికి కూడా అలానే చూపించారు. ఆమె ముందుగానే, తమ తండ్రిగారి వలె తనకు కూడా కపాలమోక్షం జరిగి సిద్ధిపొందుతారని ఒక శిష్యునికి చెప్పారు. సిద్ధిపొందిన రోజున ఆయన వచ్చి, ఆమె ఎలా చెప్పారో ఆలాగే అక్కడ జరగడం చూసి అందరికీ చూపించారు. తల మధ్యభాగంలో (మాడుపైన) కుంకుడు గింజ అంత రంధ్రంపడి, అందులోనుండి ప్రాణోత్క్రమణ జరుగుతుందని చెప్పారు. అలాగే జరిగింది. అక్కడున్న వాళ్ళందరూ చూశారు. కానీ చూడలేని వాళ్ళకు, చూడాలనే కాంక్ష ఉన్నవాళ్ళకు ఆమె వారి చెయ్యి పట్టుకుని, తన మాడుమీద ఉంచి, ఇదిగో, ఇక్కడ, ఇలా అంటూ చూపించారంటే ఎంత అదృష్టజీవి ఆమె. సుకృత జీవి ఆమె. కలల్లో (బ్రతికి ఉండగా) ఎన్నో చేసి, చూపించారు. అలాగే "కపాలమోక్ష సిద్ధిని" కూడా శిష్యులకు చూపించినటువంటి గురువు ఈమె. కలలో యోగాన్ని కూడా అనుభవింపచేశారంటే ఎంత అద్భుతమైన విషయం. ఇటువంటి శిష్యుల అనుభవాలను మననం చేసుకున్నా కూడా పుణ్యంగా భావించవచ్చును. గురువులు ఎలా చేస్తారో, ఎలాంటి శిష్యులకు చేస్తారో, శిష్యుడు ఎలా మెలగాలో, గురువులు ఎలా స్పందిస్తారో అన్నీ అర్థం చేసుకునేందుకు ఇలాంటివి ఉపయోగపడతాయి.

**13.03.004**

## శ్రీ గుండ్లపల్లి రామ్మోహన్

ఇతడు కమలమ్మగారి సోదరి 'తనుమధ్య' తనయుడు. మా అమ్మగారైన తనుమధ్యాంబ, మా పెద్దమ్మగారైన కమలమ్మగారి గురించి విశేషంగా చెప్పేవారు. మేము మద్రాసులో ఉండేవాళ్ళం. ఒకసారి మేము ఏలూరు వచ్చాము. పూజకు అన్ని సన్నాహములు జరుగుతున్నాయి. "అన్ని రకాల పూలు ఉన్నాయి. చేమంతులు లేవు" అన్నారు మా పెద్దమ్మ.

"నేను వెళ్ళి తీసుకువస్తాను" అన్నాను. "అక్కర్లేదు, అంబ తప్పించుకుంటుంది" అన్నారు మా పెద్దమ్మ. ఇంతలో ఒక వ్యక్తి రెండు బుట్టల పూలను తీసుకుని రిక్షా దిగాడు.

పూలబుట్టలు లోనికి తెచ్చి "చేమంతులు మాత్రమే దొరికినవి. వేరేవి దొరకలేదు" అన్నారు. అప్పుడు కమలమ్మగారు "చూశావా! నేనన్నట్లు ఆమె తెప్పించుకుంది" అన్నారు. ఆశ్చర్యపోయాను.

*వివరణ:* ఇక్కడ అమ్మమ్మగారికి రక్తసంబంధీకుడైన (కొడుకు వరుస) వాడు. వాళ్ళకి పెద్దమ్మపైన మమకారము, ప్రేమతోపాటు అజ్ఞానం వలన అమ్మవారిని తెలుసుకునే జ్ఞానాన్ని కలిగిఉండరు. అందుకని అమ్మమ్మగారు ఆ 'మాయ'ను తొలగించి, తనేమిటో చూపించే ప్రయత్నం చేశారిక్కడ. ఎలా? అంటే తన వాక్కుద్వారా, సంకల్పం ద్వారా పనులు ఎలా నెరవేరుతాయో చేసి చూపించారు.

వాళ్ళను నమ్మించాలని కాదు. తనలోని శక్తిని వాళ్ళు గ్రహించాలి అని చేసినటువంటి ప్రయత్నం ఇది. పైగా ఒక్క చేమంతులే కావాలని మనస్సులో సంకల్పం చేశారు. వాడెవడో "అవే దొరికాయి. వేరేవి లేవు" అన్నాడు. సంకల్పం ఏదైతే అదే సిద్ధిస్తుంది. నేను తెస్తానన్నారు ఆయన. అక్కర్లేదు ఆవిడే తెప్పించుకుంటుంది అన్నారు. 'ఆవిడ' రూపంలో ఇంకొకరు తెచ్చి

ఇచ్చి వెళ్ళారు. మహాత్ములను గుర్తుపట్టడం ఎలా? అంటే మనోసంకల్పం సిద్ధించుట ద్వారా (మనవే సిద్ధింప చేయగలిగినప్పుడు వారివి సిద్ధింపవా?) మనసులోకి రాగానే అవి సిద్ధిస్తాయి. ఆమె కుమారునికి చూపించాలనుకున్నారు. అందుకనే ఇలా అనగానే, అలా నెరవేరింది.

అలాంటివి చూస్తేనే గాని వాళ్ళకు నమ్మకం కలగదు. వారి సంకల్పమునకు, సిద్ధించుటకు మధ్య సమయం ఉండదు. నిజానికి అక్కడ సంకల్పములేదు, సిద్ధిలేదు. మనకోసం చేసిన ప్రక్రియలు ఇవన్నీ. కళ్ళకు కన్పించేవి, చెవులకు విన్పించేవే తప్ప మిగిలిన ఏ రకంగానూ మనము దేనినీ నమ్మలేము కదా! అందుకనే ఇవన్నీ 'ఆమె' తెప్పించుకుంటుంది అన్నారు కదా! అంతేకానీ నేనే సృష్టిస్తాను అన్నారనుకో. మన లౌకిక మనసులకు ఎక్కవు. వేరే ఎవరో అంటే ఓహో అని నమ్ముతాము. మన చిన్న బుర్రలకు ఎంత ఎక్కుతాయో వారికి తెలీవా? ఎంత కావాలో అంతే ఎక్కిస్తారు. అలా సంకల్పము చేసి, సిద్ధింపజేయుట ద్వారా ఆయన జరిగినది స్వయంగా చూసి, విని తెలుసుకోగలిగాడు. (కనీసం వేరే ఏ శక్తినైనా గ్రహించ గలుగుతారు)

*ఇంకొక సంఘటన* – ఆరోజు సాయంకాలం "రేపు వందమందికి సంతర్పణ చేయాలి" అన్నారు. అప్పటివరకు ఏ ఏర్పాట్లు చేయలేదు. ఎలా చేయగలరా? అని నేను ఆశ్చర్యపోయాను. తెల్లవారేసరికి మనుషులు, సామగ్రి అంతా సిద్ధమైనది. వందమందికి పైగా సంతర్పణ జరిగింది.

మహాత్ములు ఏర్పాట్లన్నీ ముందే చేసుకుని తరువాత మాట బయటపెడతారు. మనం ముందుమాటలు చెప్తాము. తరువాత ఏర్పాట్లు చేస్తాం. మన ప్రణాళికలకు వాళ్ళ ప్రణాళికలకు అంత వ్యత్యాసం ఉంటుంది. పైగా అది దైవకార్యం. వందమందికి ఆమె ప్రసాదాన్ని పంచాలనుకున్నారు. అక్కడ ఎవరు వండాలో, ఎవరు వడ్డించాలో, ఎవరు తినాలో, ఎవర్ని పిలవాలో ఇవన్నీ ముందే నిర్ణయింపబడతాయి. అందువలన అవి వాటంతట అవే జరిగి పోతాయి. మానవులు చేసే కార్యాలైతే మన ఒళ్ళు, వచ్చిన వాళ్ళ ఒళ్ళు కూడా హూనం అయి, ఆ తిన్నవాళ్ళు మనం చేసిన వాటికి వంకలు పెట్టి, 4 రకాల విమర్శలు చేసి వెళ్తారు. ఇవి మనం చేసేవి. ఆ జరిగే పద్ధతిలోనే మనం గ్రహించవచ్చును. దైవకార్యాలు ఎలా జరుగుతాయో చూస్తేనే చాలు. వాటి సంకల్పాలు పవిత్రమైనవి. భగవంతునిచే చేయించబడేవి. ఎలా? అని ఆయన ఆశ్చర్యపడుతుండగానే అక్కడ పని జరిగిపోయింది. అప్పుడే ఆయనకు తెలుస్తుంది. మనుష్యుల వలన ఇంతకొద్ది సమయంలో (ఆ రోజుల్లో) మడివంటలు, భోజనాలు, నైవేద్యాలు పెట్టిన భోజనం వందమందికి పెట్టడమంటే ఎంత ఆశ్చర్యం? అందుకే అమ్మమ్మగారు ఈ సన్నివేశం ద్వారా ఆయనకు విషయాన్ని బోధపరిచారు.

*మరొక సంఘటన*– మేము ఇంకొకసారి బందరు నుండి ఏలూరు వచ్చాము. రాత్రి చాలా పొద్దుపోయింది. పొద్దున్నే మా పెద్దమ్మగారికి పాలుపోసే మనిషి వచ్చి, "నాకు రాత్రి అమ్మగారు కలలో వచ్చి మాఇంటికి చుట్టాలు వచ్చారు. రేపు ఎక్కువ పాలు కావాలని పలికారు. అందుకని నేను ఎక్కువ పాలు తెచ్చాను" అన్నది. ఇవి నా జీవితంలో మరువలేని ఆశ్చర్యకరమైన సంఘటన.

*వివరణ:* వీళ్ళు రాత్రి ఎప్పుడో వచ్చారు. ఆ విషయం అమ్మమ్మగారు ప్రత్యేకంగా ఎవరికీ చెప్పే అవకాశం లేదు. రాత్రికి రాత్రే కలలో (ప్రాజ్ఞరూపంలో) దానికి అర్థమయ్యేలాగా విషయాన్ని బోధపరచారు. లేకపోతే అది కలే కదా అనుకుంటుంది. కానీ, ఆ పాలమ్మాయి 'నిజం' అనుకోదు కదా! నిజాన్ని బుద్ధికి తెలిసేలాగ ఆవిడ కలలో విషయాన్ని బోధపరిచారు. ఆ అమ్మాయి దాన్ని ఆచరించింది. మర్నాడు ఉదయమే వచ్చి వాళ్ళతోనే విషయం చెప్పింది. మరి వాళ్ళు ఇది చూసి ఆశ్చర్యపోక ఏం అవుతారు? ఒకసారి ప్రత్యక్షంగా ఎవరిచేతో చేమంతిపూలు తెప్పించారు. మరొకసారి వందమందికి భోజనాలు చిటికెలో పెట్టించి చూపించారు. ఈసారి కలరూపంగా వారికోసం పాలు తెప్పించారు. ఇవన్నీ మానవమాత్రులము చేసి చూపించే విషయాలు కాదుకదా! ఆమె మానవమాత్రులిని కానని చెప్పటానికి చూపించిన నిదర్శనములు మాత్రమే.

**14.03.2004**

**కోట జానకిరామశర్మ**

ఏలూరులో ఉద్యోగం చేస్తూ, హరి దుర్గాంబ గారింట్లో (ప్రస్తుతం ధ్యానమందిరం) అద్దెకు ఉండేవాడు.

"ఏమీ తెలియని అజ్ఞానంలో ఉన్న రోజుల్లో అదృష్టంకొద్దీ దుర్గాంబగారింటికి చేరితే, అక్కడికి రోజూ అమ్మమ్మగారు స్నానానికి వస్తుండేవారు. అలా ఆమెతో పరిచయం ఏర్పడింది. రోజూ పీఠానికి వెళ్ళి బొట్టు పెట్టించురావడం నా దినచర్య. ఇంట్లో ఎవరూ లేని రోజున నాతో మాట్లాడుతుండేవారు. శుక్రవారాలు పూజకు వెళ్తుండేవాడిని. నేను వెళ్ళిన మొదటిరోజున ఆమె అమ్మవారి ఎదురుగా కూర్చున్నారు."

"రారా నీకోసమే ఎదురు చూస్తున్నాను' అన్నారు.

"నేను వస్తానని ఎవరు చెప్పారండి?" అన్నాను.

"ఒక గుడిసెవాళ్ళం కదా, వేరే తెలియాలా?" అన్నారు.

మరోసారి, ఇప్పుడు చెప్తున్నా గుర్తుపెట్టుకో. "నువ్వూ, నేనూ ఆత్మరీత్యా తల్లీబిడ్డలం. నిన్ను దిద్దాల్సిన బాధ్యత తల్లిదేగా" అన్నారు.

ఒకరోజు దుర్గాంబగారింటికి స్నానానికి వచ్చి పిన్నిగారు "ఏరా! నువ్వు వంట బాగా చేస్తావుట కదా! నాకు భోజనం పెట్టు. తింటాను" అన్నారు. అలాగే పెడతానన్నాను.

మా అమ్మగారి తద్దినానికి ముందో, వెనుకో గుర్తులేదు. భోజనానికి ఏర్పాటు చేసి పిన్నిగారిని, దుర్గాంబగారిని, త్రిపురాంబను, సరోజినిని పిలిచి భోజనం పెట్టాను. "వాడి కర్మ తీసి వాడిని ఉత్తమమార్గానికి తీసుకువెళ్ళే రోజు వచ్చింద"ని దుర్గాంబగారితో అన్నారు. వడ్డన జరుగుతుండగా, హఠాత్తుగా ఆమె జుట్టుముడి ఊడిపోయింది. భోజనం చేస్తూ "ఒరే! మీ అమ్మ తరించిందిరా!" అన్నారు. మామూలుగా అంటున్నారేమో అనుకున్నాను. తరువాత ఆ మాటకు అర్థం సంవత్సరం

తర్వాతగానీ తెలియలేదు. మా అమ్మగారి తద్దినం ముందురోజు కలలో కనబడేది. ఒకసారి కనబడడం మానేస్తే, పిన్నిగారు కలలో కన్పించినపుడు "అమ్మను చూడాలని ఉంది" అని అడిగాను. "మంచిది కాదు, వద్దు" అన్నారు. పట్టుపట్టాను. "ఈ ఒక్కసారికే, మరింక అడగకు" అని ఒట్టు వేయించుకున్నారు.

కలలో – ఒక సముద్రపు తీరంలో శివాలయం ఉన్నది. 12 సం॥ల బాలిక "నా వెంట రా" అని గర్భగుడిలోకి తీసుకెళ్ళి గుడిలోని శివలింగాన్ని ప్రక్కకు తోసి, లింగం క్రింద ఉన్న సొరంగంగుండా బయటకు వచ్చేసరికి మేము సముద్ర మధ్యభాగంలో ఉన్నాము. అక్కడి నుండి వేరేచోటికి వెళ్తే అక్కడ వసారాలాంటి ప్రదేశం బయట ఆ బాలిక నిలబడింది. నన్ను లోపలికి వెళ్ళి చూసిరమ్మంది. లోపల బల్లలపై పుణ్యస్త్రీలు, ఎదురుగా ఒకామె పార్వతీదేవి గురించి, ఆమె సహజ కేశసౌందర్యం గురించి చెప్తుంటే వీరందరూ వింటున్నారు.

ప్రక్కవాళ్ళను అడిగి మా అమ్మ దగ్గరకు వెళ్ళి పలకరించాను. ఆమె "ఎవరో మహానుభావులు ఏదో చేశారు. దానివల్ల తరించాను. యిక్కడ ఉన్నాను. ఇక దేనితోనూ పనిలేదు" అన్నది.

"తద్దినం పెడితే నీకు అందుతాయా?" అనడిగాను.

దానికి ఆమె "చల్లగాలిలో కూర్చున్న వాళ్ళకి ఫ్యాన్ వేస్తే ఎలా ఉంటుందో అదీ అంతే. నాకు వేటితోనూ పనిలేదు. ఇక వెళ్ళు" అన్నది.

బయటికి వచ్చి నాతో వచ్చిన బాలిక మళ్ళీ గుడి సొరంగం నుండి బయటకు తీసుకొచ్చేసింది. ఇంటికి వచ్చాము. అమ్మతో మొదటి మధుర అనుభూతి ఇది.

**వివరణ:** ఎంత అద్భుతమైన విషయం ఇది. ఇలాంటి అనుభవాలకు వివరణ వ్రాయాలంటే మళ్ళీ ఆవిడే వచ్చి వ్రాయించాలి తప్ప, ఇవి మానవమాత్రుల బుర్రలకు తట్టేవి కావు. "మొదట నాకు భోజనం పెట్టు, తింటాను" అన్నారు. గురువులు భోజనం అడిగారంటే దానివెనుక వేరే కథ ఉందన్నమాట. లేకపోతే వాడి ఇంట్లో, వాడిచేత్తో పెట్టిన (వండిన)ది తింటాను అనడం; మనం ఒక పర్వదినంరోజు గానీ, తద్దినంనాడు గానీ ఎవరినైనా పిలిచి భోజనం ఎందుక పెడతాము? ఆ రూపంలో వున్న మరేవరో తింటే వాళ్ళు తింటారనే ఉద్దేశ్యం. వాళ్ళకు చెందుతుందనే నమ్మకం.

అలాగే గ్రామదేవతలకు నైవేద్యాలు పెట్టడం, పెళ్ళిళ్ళల్లో ముందు ఇంటి కులదేవతలకు పెట్టుకోవడం లాంటివి కూడా చేస్తాము. ఆ పేరు చెప్పి, మరెవరో ముత్తైదువకి చీరలు మొ॥వి పెడతాము. అవి అమ్మవారికి చెందుతాయని నమ్మకం. అలాగే మనకిష్టమైన వాళ్ళకు, లేకపోతే పెట్టవలసివచ్చినప్పుడు వారిపేరు మీద వేరేవారికి పెట్టడం మనకు ఆనవాయితీ ఉంది. అంటే వీళ్ళు వాళ్ళను తల్చుకుని వారికి పెడుతున్నామనే సంకల్పం చేసి, మరెవరికైనా పెడితే వారికే అందుతుందని మన నమ్మకం. అలా చేయగానే మనకు తృప్తి కూడా మిగులుతుంది. ఇది జరిగే విషయం.

***పీఠంలో విషయం –*** అమ్మమ్మగారు ఉన్న రోజుల్లో "దసరా ముందు శ్యామలాంబ వస్తుంది. చీరపెట్టి పంపించండి" అని అమ్మమ్మగారు చెబితే ఎవరో ఒకామె వచ్చి "ఒక చీర ఇవ్వండమ్మా, నేను రాజమండ్రి నుంచి వస్తున్నాను" అని అడిగి, తీసుకెళ్తుండేదట. తరువాత ఇది విని "వచ్చిందా, రాజమండ్రి శ్యామలాంబ" అని, "అలాగే పండుగ ముందు వచ్చి తీసుకెళ్తుంది" అన్నారట. అంటే రాజమండ్రి శ్యామలాంబ అమ్మవారు ఎలా వస్తుంది? అంటే ఎవరో స్త్రీ రూపంలో వచ్చి, ఆనవాళ్ళు చెప్పి, మనకు తెలిసేలా ప్రవర్తించి, మన వద్దనుండి తీసుకెళ్తుందన్నమాట. అంటే "దైవం మానుష రూపేణా" అనే సిద్ధాంతంలాగా భగవంతుడు మనిషి రూపంలోనే వచ్చి, మనం ఇచ్చినవి అందుకుంటాని అర్థం.

అసలు విషయానికి వస్తే "నాకు పెట్టు తింటాను" అని స్వయంగా గురువే (అమ్మవారే) అడిగితే, పెట్టగలగడం మరెంతో అదృష్టం. ఆమె తినడం అంటే అది ఆ శిష్యునిపై అనుగ్రహం. అంతేకాదు ఎందుకు తినాలనుకున్నారో మనకు తరువాత తెలిసింది. వాళ్ళ అమ్మగారి తద్దినం ముందుగా పిలిచాడు. అమ్మమ్మగారు, దుర్గాంబ, త్రిపురం, సరోజ, మరో ముగ్గురు వ్యక్తులతో కలిసి భోజనానికి వచ్చి, వాడు పెట్టినది తను తింటూ "ఒరే! మీ అమ్మ తరించిందిరా" అన్నాడు. అంటే వీడి మనసులో ఉన్న వాళ్ళ అమ్మ తాలూకూ భావాలు ఆమెకు తెలీవా? ఆవిడ ఎంతో పుణ్యజీవి అయి ఉంటారు. లేకపోతే ఆ భోజనం ఆవిడ చేసి, ఎలా తరింపజేస్తారు?

"ఒరేయ్ నువ్వూ, నేను ఆత్మరీత్యా తల్లీబిడ్డలం" అన్నారు. ఎందుకంటే ఇక్కడ వాడు ఈ ఉద్దేశ్యంతో ఆమె తల్లికి పెట్టవలసిన భోజనం ఈ తల్లికి పెట్టి ఉంటాడు. (ఇది వాడి భావమై ఉంటుంది.) కానీ గురువులైన అమ్మమ్మగారు, సాక్షాత్తూ శక్తిస్వరూపిణి కనుక ఆ భోజనాన్ని ఆ సంకల్పం చేసుకుని పెట్టినప్పుడు అది అమృత భోజనంగా మారిపోతుంది. అది వాళ్ళకు అందడం చేత అక్కడ ఆ తల్లి అనబడే జీవి తరిస్తుంది. అందుకే ఆవిడ కలలో "ఎవరో మహానుభావులు ఏదో చేశారు. నేను తరించాను" అని చెప్పింది. మహానుభావులు తరింపజేయాల్సిన జీవులకు అందించే ఆహారాన్ని స్వయంగా వారు తింటే అది అమృత సమానంగా మారుతుంది అనడంలో వింత ఏముంది? ఎవరినైతే సంకల్పం చేసి పెట్టారో, వారికి (అమ్మమ్మగారు) అందజేయాలి. ఆమె ద్వారా అమృత ఆహారం ఆ జీవికి అందినపుడు ఇంకా వారికి తరింపుకాక మరేమిటి? అందుకే ఆ తల్లి ఇంక వీడికి కలలోకూడా కనబడడం లేదు. కలలో అమ్మమ్మగారిని ప్రశ్నించినప్పుడు ఆవిడ ఈ సమాధానాలు చెప్పించారు. "మేం పెట్టే తద్దినం మీకు అందుతాయా?" అని అడిగితే "చల్లగాలిలో కూర్చున్న వాళ్ళకు ఫ్యానుగాలి వీస్తే ఎలా ఉంటుందో అది అంతే" అన్నారు.

అంటే గురువులు తింటే వాళ్ళు తరిస్తారు. తరించిన వారికి మనం పెట్టే తద్దినంతో పనిలేదు అని అర్థమయ్యేలాగా అమ్మమ్మగారు చెప్పారు. అంటే ఒకసారి ఆ జీవికి తరించటానికి కావలసినట్లుగా ఆహారం (గురువు స్వీకరిస్తేనే అలా మారుతుంది) అందజేయబడు తుందన్నమాట. ఇలా ఎవరు చేస్తారు? గురువులు చేస్తేనే అలా అవుతుందని ఇక్కడ అమ్మమ్మగారు నిరూపించారు.

ఈ విషయాన్ని అమ్మమ్మగారే ప్రత్యక్షంగా వాడికి చెప్పినా, గురుసామర్థ్యం పైన, అనుగ్రహం పైన అంత నమ్మకం వాడికి ఉండదు. అందుకని కొన్ని విషయాలు (భోజనం) ప్రత్యక్షంగా చేసి, మరికొన్ని కలలో వాడి బుద్ధికి మాత్రమే అందేలాగ, ప్రాజ్ఞారూపంలో 12 సంııల బాలికగా త్రిపురసుందరీ దేవిగా (అమ్మమ్మగారి వెనక ఉండి) వీడిని తీసుకెళ్ళి చూపించి, తరించిందని ఆమె చేత చెప్పించి, ఇంక వీడు చేయవలసినది ఏదీ కూడా లేదని చెప్పి, వాడి ప్రశ్నలకు సమాధానం చెప్పారు. అంటే కొంతభాగం ముఖతః కుదరదు కాబట్టి, కల ద్వారా కొంత వీడికి అర్థమయ్యేలాగా చేశారు. ఆ తల్లి ఎంత అదృష్టవంతురాలో! ఆమెను తరింపజేయడం కోసం, అమ్మమ్మగారు వీడిని దగ్గరకు రప్పించుకుని, ఆమెకు ముక్తినిచ్చారు. దైవలీలలు ఎలా ఉంటాయో గమనించండి!

అలాగే ఈ జన్మలో మనద్వారా, మన రక్తసంబంధీకులు, పూర్వీకుల పుణ్యఫలం వలన ఇలాంటివి ఎన్ని జరుగుతున్నాయో, ఎన్ని జరుగుతాయో తెలియదు కదా! తెలుసుకోవలసినదల్లా ఒక్కటే! అవిడని అంటిపెట్టుకుని ఉంటే ఆవిడ అనుగ్రహాన్ని పొందుతాము. అది ఈ జన్మకు మాత్రమే కాదు. మరెన్నో జన్మలవరకూ లేదా తరించేవరకు కావచ్చును. ఇవి మనం గ్రహించాల్సిన విషయాలు. అందుకే సాయిబాబా "నీది, నాది 74 జన్మల ఋణానుబంధము" అన్నారు. ఇప్పుడు చెప్పిన వివరణలో కూడా 'ఆత్మరీత్యా తల్లీబిడ్డలం' అనీ, 'అప్పాచెల్లెళ్ళం' అనీ, మరొకామెను 'నా పెద్దకూతురువి' అనీ, కప్పగంతుల సోదరులను 'మానసపుత్రులు' అనీ – ఇవన్నీ ఏమిటి? ఇవి రక్తసంబంధాలు. కానీ ఈ జన్మలోవి కావు. పూర్వజన్మలలోనివి. మరి ఈ జన్మలోని సంబంధాలవలె ఆమె ప్రవర్తించారు. వాళ్ళు కూడా ఈమెతో అలాగే మెలిగారు. ఎందుకంటే, ఆత్మలయొక్క అనుబంధాలు కనుక, అవి ఈ జన్మ అయినా, ఏ జన్మ అయినా సరే ఆ ప్రేమబంధాలు, ఆత్మీయతాభావాలు గురుశిష్యుల మధ్య ప్రస్ఫుటిస్తుంటాయి. మనం ఈ విషయాలను అర్థం చేసుకోవాలి.

**15.03.2004**

ఒకరోజు సాయంత్రం పీఠానికి బొట్టు పెట్టించుకోవడానికి వెళ్ళాను. అక్కడ చాలామంది పెద్దవాళ్ళున్నారు. ఒకామె తనకు డబ్బు లేదన్న కారణంగా కొంచెం తక్కువచేసి మాట్లాడారు. ఆరోజు ఉదయం 'దశసహస్రాలు' చేసి, అమ్మవారికి లడ్డూ నైవేద్యంపెట్టి, అందరికీ పంచుతూ తనకు ఇవ్వలేదు. ఇంటికి వెళ్ళి చాలా బాధపడ్డాను. తెల్లవారుఝామున పిన్నిగారు కలలోకి వచ్చారు. నల్ల అంచు పసుపు పట్టుచీర కచ్చాపోసి కట్టుకుని ఒకచేత్తో లడ్డు పట్టుకుని "ఒరేయ్ జానకీ, నీకు ఎప్పట్నించో ఒక మాట చెప్పాలి అనుకుంటున్నానురా, నీకు జన్మ శుక్రవారాలు దీక్ష ఇస్తాను, చేస్తావా?" అనడిగారు. "చేస్తాను" అన్నాక, "నీకు ఇక నుండి జన్మ శుక్రవారాలు" అంటూ లడ్డూని నాచేతిలో వదిలారు. ఈ కల విషయం ప్రొద్దున్న పిన్నిగారివద్దకు వెళ్ళి చెప్పాను.

"ప్రసాదం పెట్టలేదనుకున్నావు కదా! అందుకే ఆమే వచ్చి నీకు ప్రసాదం పెట్టింది. వీళ్ళ

ప్రసాదం నీకెందుకురా? నీకు అమ్మవారే పెట్టింది. మనుష్యులు పెట్టే ప్రసాదం ఇష్టాయిష్టాల మీద ఉంటుంది. దైవప్రసాదం ప్రాప్తాప్రాప్తముల మీద ఉంటుంది. నీకు అమ్మవారే ఇస్తుంటారు. ఇక దానిగురించి ఆలోచించకు" అన్నారు.

ఆమె ఎంత చక్కని విషయం చెప్పారు. "నీకు ప్రాప్తమున్నట్లయితే అమ్మవారే నీకు ఎలాగో అలాగ ఇస్తుంది. మామూలు మనుష్యులకు ఎన్నో తారతమ్యాలు ఉంటాయి. కనుక వాటిని పట్టించుకోవద్దు. ప్రాప్తముంటే ఆమే ఇస్తారు" అని చెప్పారు. ప్రతి విషయాన్నీ కూడా మనం పీఠంలో ఉన్నప్పుడు కానీ, లేనప్పుడు కానీ ఈ దృష్టితోనే చూడాలన్నమాట! ఇది ఆవిడ ఆదేశము. ఇప్పుడు కూడా మనం ఈ స్థానంలో ఎంతోమందితో కలిసి పది రోజులు గడుపుతాము. ఇది అందినది, అది అందలేదు, వారికి పక్షపాతము, అందుకని మనదాకా రాలేదు, లేకపోతే మనకు వీరు అందివ్వలేదు, మనలను గౌరవించలేదు లేదా మర్యాద చేయలేదు అనే భావాలు మానవులం కనుక అప్పుడప్పుడు వచ్చే అవకాశాలున్నాయి. కానీ వీటికి అమ్మమ్మ గారు అప్పుడే సమాధానం చెప్పారు. ఇక్కడ దక్కేవన్నీ కూడా ప్రాప్తం మీద ఆధారపడి ఉంటుంది. కనుక మనుషులను, వారి చేష్టలను దృష్టిలో పెట్టుకోవద్దని ఆవిడఎప్పుడో చెప్పారు. ఇప్పుడు మనకు ఈ విషయం తెలిసింది. వీడు ప్రసాదం పెట్టలేదని ఏడిస్తే, ఆమె కలలోకి వచ్చి శుక్రవారాలు దీక్ష ఇచ్చి, ప్రసాదం పెట్టి మరీ వెళ్ళారు. మనం అడగక్కర్లేదు. ఎప్పుడు ఏది ఇవ్వాలో ఆమెకు తెలియదా!

**17.03.2004**

ఆ సంవత్సరం నుండే నవరాత్రుల దీక్ష మొదలైంది. అది విచిత్ర సన్నివేశం. ఒకరోజు ఉదయం అమ్మ దగ్గరకు వెళ్ళాను. ఒక్కరే ఉన్నారు. "ఏరా జానకీ! ఒక మంచి విషయం చెప్తాను. ఏమీ లేదు, నువ్వు చేసిన వంట అమ్మకు బాగుందిట. ఇకనుండి నవరాత్రి దీక్ష ఇస్తున్నాను. నవరాత్రుల్లో ఉదయం నుండి ఉపవాసం ఉండి, సాయంత్రం పూజ చేసుకో. నవరాత్రికి ప్రసాదం చెయ్యి. అమ్మ నీకు అన్నం, గుడ్డ, ధనం, కావలసినవన్నీ ఇస్తుంది" అన్నారు. సాయంత్రం పిలిచి "మూలా నక్షత్రం నుండి దశమిదాకా పూర్తిగా ఉపవాసం ఉండు" అన్నారు. "అలాగే" అన్నాను. దశమి రోజున 400మందికి వంట చేశాను. పిన్నిగారు నన్ను పిలిచి "వీడు వంట ఎలా చేశాడు?" అనడిగితే, అందరూ చాలా బాగున్నాయన్నారు. దానికి ఆమె "వీడు అమ్మవారి ఆంతరంగిక వంటవాడు. ఆవిడకు మాత్రమే వండి పెడతాడు. ఆవిడే కుదుర్చుకున్నది" అని అందరికీ చెప్పారు. ఆ తరువాత ఆమె భోజనం చేసి, ఆ విస్తరిలో వాడిని భోజనం చేయమన్నారు. ఎందుకంటే ఆమె తిని వదలిన ఆకులో 'ఔషధాలు' వదులుతానని, వాటిలో జ్ఞానం, ధనం, వాక్చాతుర్యం, అఖండ వాక్యజ్ఞానం ఇంకా ఎన్నో ఉంటాయి. అవన్నీ లభిస్తాయని చెప్పారు. వాడు ఆ విధంగా చేశాడు.

"అమ్మవారికి నీపైన అనుగ్రహం ఎక్కువ. అన్నీ ఆమె సన్నిధిలోనే చూపాలని, చెప్పాలని, చేయించాలని ఆమె కోరిక. అందుకే ఆవిడని నమ్ముకో. అన్నీ సమకూరుస్తుంది" అన్నారు.

***వివరణ:*** "నవ్వు చేసే వంట బాగుందిట" అంటే అమ్మవారు ఎప్పుడు తిన్నారు ఆమె బాగుందని చెప్పడానికి. కమలమ్మగారు అడిగి భోజనం పెట్టించుకుని తిని, వాళ్ళమ్మగారు తరించారని చెప్పారు. అంటే ఈవిడ ప్రత్యక్షంగా తిని, ఆమెకు బాగుందిట అని చెప్పారు. అంటే ఈమెకే బాగుందన్నమాట. అప్పుడు ఆ శిష్యుడు ఆ విషయాన్ని గ్రహించలేడు. ఎందుకంటే ఇంకా 'ద్వైత స్థితి'లో ఉంటాడు కనుక తెలుసుకోలేడు. పైగా రెండూ వేర్వేరు అని చెప్తుంటే, ఆ దారిలోనే వెళ్తుంటాడు.

ఏ స్థితిలో ఉన్న శిష్యుడినైనా సరే, గురువులు ఏవిధంగా లౌకికంగా (కన్నబిడ్డలకంటె) ఎక్కువగా ఎలా కాపాడుతారో చూడండి. ఆమెకు వాడుపెట్టిన ప్రసాదం నచ్చింది. అయితే తన ఒక్కదానికే వాడిని వండిపెట్టమనవచ్చు కదా! అలాకాకుండా వాడికి 'దసరా'లో ఉపవాసదీక్ష ఇచ్చి, ప్రసాదం చేయించి, నైవేద్యం పెట్టించి తద్వారా వానికి అన్నవస్త్రాలకు లోటు లేకుండా కాపాడింది. మనం భగవంతునికి ఏమి ఇస్తామో వాటికి రెట్టింపు ఫలితంగా ఆమె మనకు వాటిని తిరిగి ఇస్తారు. అయితే రూపాయి మనంతట మనం ఇవ్వాలంటే ఇవ్వలేము. ఇవ్వు అని ఆవిడ అనుగ్రహించి మనం ఇస్తే తప్ప, ఆవిడ మనకు తిరిగి ఇవ్వదు. మనలో ఇచ్చే గుణాన్ని వృద్ధి చేయాలంటే ఆమె అనుగ్రహముంటే తప్ప అది రాదని ఇక్కడ మనం తెలుసుకోవాలి.

మనం చేసిన ప్రసాదం ఆమె తింటుందో లేదో తెలీదు కానీ, అది పవిత్రంగా చేసి, నైవేద్యం పెట్టడం ద్వారా మనకు ధనం, వస్త్రం, అన్నం లభిస్తాయని మాత్రం ఇక్కడ కమలమ్మగారు ఘంటాపథంగా చెప్తున్నారు. అందుకే ఆమె ఆ పది రోజుల ఉత్సవాల్లో భక్తులచేత, ఉపవాస దీక్షతో ప్రసాదాలు చేయించి నైవేద్యం పెట్టించేవారు. అది ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. అంటే వాటికి ఫలితాలు అవన్నమాట.

మూలా నక్షత్రం నుండి దశమి వరకు 3 రోజులు పూర్తిగా ఉపవాసం ఉండి, 4వ రోజున సంతర్పణ భోజనం వండుటలో వాడిని పాల్గొనమని ఆదేశించారు. ఇలా ఎందుకంటే, అది మహాప్రసాదం. అమ్మమ్మగారు ఉత్సవాల తరువాత (పది రోజులు ఉపవాస దీక్ష) అమ్మవారికి నైవేద్యం పెట్టి, ఆ ప్రసాదాన్ని భక్తులందరికీ పిలిచి పెట్టేవారు. అది తినడానికే ఎంతో పుణ్యం, యోగం కావాలి. ముఖ్యంగా ఆమె అనుగ్రహం కావాలి. అలాంటి ప్రసాదాన్ని తయారు చేసేందుకు ఆమె వాడిని ఆదేశించారంటే వాడు ఎంత అదృష్టవంతుడు!

దీన్నిబట్టి మనం అర్థం చేసుకోవాల్సింది ఒకటుంది. 400 మందికి వంట చేశాడు. ఆమె చేయించారు. అంటే అంత ప్రసాదం చేయించబడి, వినియోగించబడినది. అటువంటి మహానైవేద్య వితరణ జరుగుటలో వాడిని పాత్రధారునిగా చేసే సేవను వాడికి ప్రసాదించారు. అంటే అలాంటి సేవ పూర్తిగా అమ్మవారి సేవ, ఎందుకంటే ప్రసాదం తినేవాళ్ళందరూ కూడా ఎంతో అదృష్టవంతులు, యోగులు అయితే తప్ప తినలేరు కదా! అలాంటిది వీడిచేత చేయించారంటే (కొన్ని సంవత్సరాలు, తరాలు) వాడికి ఎన్ని జన్మల కర్మలను తప్పించారో, ఎంత పుణ్యాన్ని

సంపాదించుకునే లాగా చేశారో... ఇవన్నీ అమ్మవారి చిట్టాపద్దులలో ఉండేవి. అవి మనకు కనపడవు. కానీ ఫలితాలను మాత్రం ఎప్పటికప్పుడు, సమయం వచ్చినప్పుడు ఆవిడ అందిస్తూనే ఉంటుంది. వాటిని బట్టి మనం గ్రహించుకోవచ్చును.

'అతిథి దేవోభవ' అన్న సూత్రం ప్రకారం, ఒక మనిషికి మనం భోజనం పెడితేనే ఎంతో పుణ్యం కదా! మరి ఇటువంటి మహాప్రసాదాల వినియోగ తరుణంలో గురువుల ఆదేశానుసారం మనచేత చేయించబడే ఈ సేవా కార్యక్రమాల వల్ల వచ్చే ఫలితాలు ఎంత ఉంటాయి? మనకు ఎంత అందజేయాలి– అవన్నీ ఆవిడ నిర్ణయాలు.

ఇప్పుడు (శిష్యులు) తెలుసుకోవల్సిన విషయాలు అర్థమయ్యే ఉంటాయనుకుంటాను. గురువులచే, గురుపీఠములో చేయబడే అమ్మవారి కార్యక్రమాలన్నింటినీ కూడా మహాకార్యాలు అంటారు. అవన్నీ దేవతలనుద్దేశించి చేయబడేవి. ఆ రూపంలో వాళ్ళే వచ్చి తింటారు. అలా తినబడటం ద్వారా వారి వారి దేహకర్మలు తొలగించబడతాయి. అక్కడ జరిగే విషయం ఇది.

అందువలన మహాకార్యములకు వచ్చే వారందరూ కూడా, ఇక్కడ ఏం చేసినా అది దైవకార్యమని, అందులో పాల్గొనడమే మహా అదృష్టమనీ గమనించి, పాల్గొంటే అందులో అర్థం, పరమార్థం గోచరిస్తాయి. చివరకు, అరటిపండు తొక్కలు తీసి బయట పడెయ్యడం కూడా అమ్మవారి సేవే అని అర్థంచేసుకోండి. అది మీది, ఇది మాది అనే అనుకోడానికి ఇవి ఏ ఒక్కరి పనులు కావు. దైవకార్యాలు. అవి గుర్తుంచుకుని మసలుకొని, సేవ చేసుకునే అదృష్టాన్ని పొంది తరించమని అమ్మమ్మగారు జానకిరామునికి ఉపదేశం ఇచ్చి, మనకు తెలియజేశారు.

వాడిచేత మహాప్రసాదాన్ని వండించి, అది ఆమె (దశమినాడు) తిన్నాక, ఆ విస్తరిలోనే వాడిని తినమని అంటే (అది మహాప్రసాదం, అందులో ఔషధులుంటాయని చెప్పారు) ఆమే స్వయంగా వాడికి ప్రసాదం పెట్టారు. అందుకే వాడికి అది తినడం వలన జ్ఞానం, ధనం, వాక్చాతుర్యం, అఖండకావ్యజ్ఞానం వంటి ఫలితాలు ఉంటాయని చెప్పారు. అలాచేసి, వాడికి ఏం కావాలో వాటిని ప్రసాదించారన్నమాట.

పైగా ఇంకొకటి స్పష్టం చేశారు. "నీపైన ఆమెకు అనుగ్రహం ఉన్నది. అందుకనే ఇవన్నీ ఆమె సన్నిధిలోనే అంటే (అమ్మమ్మగారు ఉన్నప్పుడే) చూపించాలని, చేయించాలని, గ్రహించాలని చేస్తున్నారు. నువ్వు మాత్రం గట్టిగా నమ్ముకుంటే నీకు అనుగ్రహం సదా నీ వెంటే ఉంటుంది. నీకన్నీ ఆమే సమకూరుస్తుంది" అని. గురువులు చేసేవి మహాకార్యములు. ఎందుకంటే అందులో ఏ స్వార్థం ఉండదు. పదిమందిని తరిపంచేయడమే తప్ప మరొకటి ఉండదు. దాంట్లో మనం పాల్గొని ఒక చిన్నపని ఒక గంటో, 2 గంటలో చేస్తేనే ఎంతో ఫలితం ఉంటుందన్నారు. పని, సమయం కంటే కూడా ఇక్కడ అమ్మవారి భావం ముఖ్యం. అప్పుడే దాని ఫలితం. అందుకని మనం భావాన్ని గ్రహించగలిగితే అది గంట లేక ఒక రోజు లేక వారం లేక సంవత్సరం అనేది మన అదృష్టాన్ని బట్టి, యోగాన్ని బట్టి వాళ్ళు నిర్ణయించి మనలను అనుగ్రహిస్తారు. ఇది మనం

అర్థంచేసుకోవాలి.

తరువాత మరొక విషయం ఏమిటంటే, దేవతా ప్రసాదాన్ని ఆమె తిని, అందులో ఔషధులు ఉంటాయనీ, వాటిద్వారా మంచి ఫలితాలు ఉంటాయని కూడా చెప్పారు. కాబట్టి ప్రసాదం అంటే ఔషధమన్నమాట. అది అంత పవిత్రమైనదని అమ్మమ్మగారు చెప్తున్నారు. అవి తింటే, ఎవరికి ఏం కావాలో అవి ప్రసాదించబడతాయన్నమాట. ఇది మొత్తం ఎంత పవిత్రమైన కార్యమో గ్రహించుకుని మనం అర్థంచేసుకుని మసలుకుంటే, మన మనసులు వీటి ద్వారా శుద్ధిపొంది, నిర్మలత్వం వైపు ప్రయాణించే అవకాశం పొందగులుతామనిపిస్తోంది.

**18.03.2004**

అమ్మ మనమధ్య తిరగడం ఇది ఆఖరి సంవత్సరం కాబోలు. ఆరోజు అమ్మ పుట్టినరోజు. జనవరి 13, 1977 ఉదయం ఇంటికి వెళ్ళాను. ఒక్కరే ఉన్నారు. "ఒరేయ్ జానకి రాముడూ! ఈరోజు నా పుట్టినరోజు. ఇంక మరొకటి రాదు" అన్నారు. ఒక అరిసె నాచేతికి ఇచ్చారు. "ఇదేమిటమ్మా?" అన్నాను. "ఏం లేదురా. ఈ సంవత్సరంలో నలుగురు సిద్ధంగా ఉన్నారు. వాళ్ళు ఎవ్వరూ నాకుముందుగా వెళ్ళకూడదు. అమ్మదయతో వాళ్ళ గండాలు ఆపి నేనే ప్రశాంతంగా వెళ్ళిపోతాను. లేకపోతే బాధ భరించలేను" అన్నారు.

"1. సుబ్రహ్మణ్యాన్ని (మానసపుత్రుడు) గండం నుంచి కాపాడాలి, 2. సరోజిని (కూతురు), 3. శ్యాము (తమ్ముడు, అల్లుడు కూడాను), మరి నాలుగు?" అన్నాను.

"చెప్తాను లేరా" అని వీళ్ళను కాపాడడానికి నా ప్రాణమైనా అడ్డువేయడానికి వెనుకాడను" అన్నారు.

"అదేమిటి, మీరు మానవమాత్రులు కాదు కదా! మీ ప్రాణాల వరకు ఎందుకు?" అన్నాను. ఆ గండాలు అంత గట్టివి. వారం రోజుల ముందు అమ్మవారికి నాకు ఈ సంభాషణ జరిగింది.

"అమ్మ విత్తం కావాలా? ప్రాణాలు కావాలా? అని అడిగిందిరా. నాకు విత్తం (డబ్బు) వద్దన్నాను. ప్రాణం కావాలన్నాను. అప్పుడు అమ్మ నీ ధనప్రాణాలు ఫణంగా పెట్టాలి అన్నదిరా. అలాగే అన్నాను."

"మీ దగ్గర డబ్బు ఏముంది?" అనడిగాను.

"లేకేమి? ఉన్నది. విత్తం అంటే డబ్బేకాదు. వస్తువులైనా విత్తమే" అన్నారు.

"ఏమున్నది?" అనడిగాను.

"గాజులు, గొలుసులు, ముత్యాలు" అన్నారు.

"మరి 4వది" అన్నాను.

"ప్రాణమైనా పెట్టాలి. గుర్తుపెట్టుకో. మన ప్రాణం అడ్డం వేసి వేరే ప్రాణం కాపాడాలి. జీవితానికి అదే గొప్ప త్యాగం" అన్నారు.

"మానవ శరీరంతో పుట్టిన మన దేహం, ప్రాణం పోయిన మరుక్షణం ఎవ్వరికీ పనికిరాదు. అదే వేరే జంతుజాలమైతే, కొంతమందికైనా ఆహారంగా అవుతుంది. కాబట్టి ఈ శరీరంతో ఉన్న మనం ప్రాణం ఉండగా కొంతమందికైనా ఉపయోగపడడం ధర్మం. మనం ఏమి తిన్నాం, ఎలా ఉన్నాం అన్నది ముఖ్యంకాదు. ఎవరికి పెట్టాము? ఎంతమందికి పెట్టాము? ఎంతమందికి ఉద్ధరణ మార్గం చూపెట్టాము? ఎంతమంది తరింపబడ్డారు? మన దేహం ఎంత పుణ్యం చేసింది? ఎంత కర్మ తీసుకున్నది? ఇవన్నీ ఈ జీవితంలోనే తేల్చుకోవచ్చు. కర్మజీవులం. కర్మను తగ్గించుకోవచ్చు, పెంచుకోవచ్చు.

ఉపకారం చేయడం, పాపాన్ని విడవడం, ఇతరుల బాధలను మరిపింపచేయడం, ఇతరులను మంచిమార్గంలో నడిపించడం, వారి జీవితాల్లో ధన్యత్వాన్ని కలిగించడం చేయాలి. కర్మ అనుభవైకవేద్యము. కర్మను అనుభవించడమే కానీ దాన్ని తీసివేయడం ఎవ్వరి తరంకాదు. అమ్మను నమ్మి శరణుఅంటే రూపాయిలో 80పై. తీసి 20పై. అనుభవం ఉంచుతుంది" అన్నారు.

అమ్మను ఇన్నాళ్ళనుండీ చూస్తున్నాను కానీ ఇంత కర్మసిద్ధాంతం, వేదాంత ధోరణి నేనెన్నడూ చూడక నిర్ఘాంతపోయి అంతా విన్నాను.

***వివరణ:*** జనవరి 13, 1977 సం॥ ఆమె మరణం గురించి ఆమెకు ముందుగానే తెలుసు. ఆ సమయంలో ఏం జరగబోతున్నాయో తెలుసు. వాటిని ఎలా ఆపాలో తెలుసు. సర్వాంతర్యామి అయిన ఆ తల్లి మానవరూపంలో ఉంటే మాత్రం ఏమిటి? సర్వమును చక్కదిద్దగలిగే సమర్థత కలిగిన ఆ తల్లికి ఏ పనైనా చాలా సులభమే.

బిడ్డ చిన్న కోరిక కోరితేనే తల్లి తల్లడిల్లిపోయి దాన్ని తీర్చడానికి ఎన్నో ఆలోచించి, ఎంత కష్టమైనా ఆ కోరిక తీరుస్తుంది. మరి ఆ శ్రీమాత ఏం చేస్తుందంటే, వారి గండాలను తీసివేయడం, తప్పించడం కోసం అవసరమైతే ప్రాణంతో సహా త్యాగంచేసి, ఆ జీవునికి జీవితాన్ని ప్రసాదించి, ఈ శరీరంతో వాడు ఇంకొంత సాధన చేసే అవకాశాన్ని కల్పించి తరింపజేస్తుందని ఈ అనుభవంలో మనకు తెలియజేసింది.

మానవరూపంలో ఉన్నది కనుక (అమ్మవారైనా) తన ప్రాణాన్ని త్యాగం చేయడం ద్వారా తన రక్తాన్ని పంచుకుపుట్టిన కూతురు ఒకరైతే, తోడబుట్టిన వారు మరొకరు. కొడుకుగా తీసుకున్నవాడిని గండం నుంచి కాపాడడం లాంటివి చేయడానికి కూడా ఆమె ఇసుమంతైనా సందేహించలేదు. ఈ ప్రేమను ఏమంటారు? అవ్యాజకరుణామూర్తి అనేదానికి ఇదే ఉదాహరణ. ఆ జీవులను బయటపడేస్తే మరికొంత కాలం లౌకిక, అలౌకిక సాధనలు చేయించడానికి వారికి వీలు కలుగుతుంది, వారు ఉద్ధరించబడతారు. తను ఎలాగైనా వెళ్ళిపోవాలి. వెళ్తూ, వెళ్తూ డబ్బుతోపాటు, సొమ్ములు మరికొంతమందికి ఇచ్చింది. ఆ సొమ్ములు (నగలు) అందుకైనా ఉపయోగపడుతున్నాయని సంతోషించారట. (సొమ్ములను ఈవిధంగా ఖర్చు పెట్టవచ్చునని ఈ జీవితానికి మనకు అర్థంకాదు)

శరీరంతో ఉండగానే ఆమె మనకు ఎలా ఉండాలో, ఏం చేయాలో అన్నీ ఆమే స్వయంగా చేసి చూపెట్టారుకదా! ఈ చేతిలోది ఆ చేతితో పంచేసేవారు. ఈ చేతిలోది ఆ చేతిలోకి వెళ్ళినట్లు ఆ చెయ్యి ఎవ్వరికీ చెప్పదు అనేవారు. అంటే దానం లేక సేవ అంత గుప్తంగా ఉండాలని అర్థం. అలాగే ప్రాణత్యాగం కూడా అంత గుప్తంగా చేస్తారన్న విషయం మనకు అర్థమయ్యేలా చేసింది ఈ సంఘటన.

అమ్మమ్మగారికి అమ్మవారే చెప్పింది, వేరే ప్రాణాలు కాపాడాలంటే నీ ధనప్రాణాలు ఫణంగా పెట్టాలని. ఈ రెండిటినీ త్యాగం చేసేందుకు కూడా ఆవిడ సిద్ధపడ్డారు. అంటే, ఆ మాతృప్రేమకు వెలకట్టలేమన్నమాట. సాక్షాత్తూ అమ్మవారు పరీక్ష పెడితే ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడ్డారు (ఒక భక్తురాలిగా). ఇక్కడ మనం నేర్చుకోవాల్సినది ఏమిటంటే భగవంతుడు పెట్టే పరీక్షలకు భక్తుడు ఎలా స్పందించాలో, ప్రాణం ఇవ్వడానికి కూడా వెనుకాడనటువంటి స్థితి ఉండాలన్నమాట. భక్తులను, శిష్యులను ఉద్ధరించే విషయంలో గురువుగా అలా స్పందించాలన్నమాట. ఇది అమ్మమ్మ గారికి అమ్మవారు పెట్టిన పరీక్ష. ఇది అమ్మమ్మగారు ఆచరించిన విధానం. ఇక్కడ విత్తము అంటే డబ్బే కాదు. వస్తువులు, బంగారం అని కూడా చెప్పారు.

మరొకరి కోసం ప్రాణాలివ్వడాన్నే గొప్ప త్యాగమంటారుట. మనకు ఈ విషయం ఇప్పటి వరకు తెలియదు. త్యాగం చేయడమంటే మన దృష్టిలో ఉన్న అర్థంవేరు. దానికీ, దీనికి ఎంతో తేడా ఉన్నది. జంతువులు బ్రతికి ఉన్నా ఇంకొకరికి ఉపయోగాన్ని కలుగజేస్తాయి, చనిపోయినా వేరొకరికి ఆహారంగా ఉపయోగపడతాయి. ఇది సత్యం. అలాగే మనం బ్రతికుంటే ఒక్కొక్కసారి 'మన' అనుకునే వాళ్ళకే బరువును, బాధను కలుగజేస్తాము. చనిపోయాక సంతోషపడేలాగా చేస్తుంటారు కొందరు.

మరికొందరు (అమ్మమ్మగారిలాంటి వాళ్ళు) బ్రతికి ఉన్నంతవరకూ ఇతరులకు ఉపయోగపడడమే కాకుండా, చనిపోతూ ఇతరులను ఉద్ధరించడం కోసం త్యాగం చేస్తుంటారు. అందుకే వాళ్ళను అవతార పురుషులు, సిద్ధులు, యోగులు, మహాత్ములు అని రకరకాలుగా పిలుస్తుంటాము. "శరీరం కడు ధర్మసాధనం" అంటూ అమ్మమ్మగారు శరీరంతోనే ధర్మసాధన చేయాలి. శరీరం లేకపోతే ఆధ్యాత్మిక సాధనకు వీలు పడదు కదా! పైగా అది ఇంకెవ్వరికీ ఏ విధంగానూ (జంతువులవలె కాక) ఉపయోగపడదు. కాబట్టి శరీరంతో జీవుడు ఏంచేయాలి? అన్నది విపులంగా చెప్పారిక్కడ.

చివరికి అమ్మమ్మగారు కర్మసిద్ధాంతాన్ని అంతా మూడుముక్కల్లో ఈవిధంగా చెప్పారు. అమ్మవారిని నమ్ముకుంటే రూ.1కి 80పై. తీసివేయబడుతుంది. 20పై. కర్మ మాత్రమే జీవుడు అనుభవించాల్సి ఉంటుంది. కనుక అమ్మవారి అనుగ్రహంతో, గురువుల నీడలో జీవుడు ఎలా నడుచుకోవాలో, ఎలా బ్రతకాలో చక్కగా చెప్పారు. చెప్పడం కాదు, ఇవన్నీ ఆచరించి చూపించి జీవితాన్ని సార్థకం (ఒక సాధకురాలిగా) చేసుకున్నారు. కానీ ఇవన్నీ అర్థంచేసుకోకుండా మనలాంటి

జీవులు కొంతమంది మనమే గురుస్థానాల్లో ఉన్నామని చెప్పుకుంటూ, గురువులుగా వ్యవహరిస్తూ, ఇతరులకు సలహాలిస్తూ పట్టాలు తప్పి నడుస్తున్నారు. అటువంటప్పుడు మన నడక లోయవైపుకేనని గుర్తుంచుకోవాలి. మనం ఏం చేయాలి? ఎలా నడచుకోవాలి? పాపపుణ్యాలను బేరీజు వేసుకోవడం ఎలా? చెయ్యాల్సినవి ఏమిటి? వదిలేయాల్సినవి ఏమిటి? అన్నవి అమ్మమ్మగారు స్పష్టంగా చెప్పి, ఆచరించి చూపారు కూడా.

ముందుగా మనం చేయాల్సిందేమిటంటే ఆమె యొక్క తత్వాన్ని అర్థం చేసుకుని, ఆచరించే ప్రయత్నం ఈ జీవితాంతం చేస్తూనే ఉండాలి. అప్పుడు కనీసం వచ్చేజన్మలోనైనా ఆమెవద్ద శిష్యరికం సాగించే అదృష్టాన్ని పొందగలుగుతాము. లేదంటే లోయ పొంచే ఉంటుంది. పడిన తర్వాత మళ్ళీ పట్టాల మీదకు రావడం ఎంత కష్టం. అంటే లౌకికంగానే అంత కష్టమైతే, ఆధ్యాత్మిక సాధన మరెంత కష్టమో ఊహించుకోండి.

ఎంతో కష్టమైన విషయాలను ఎంతో తేలికగా మనకు అర్థమయ్యేలాగా చెప్పారు. ఎందుకంటే అనుభవం పొందుతుంటే, సాధన చేయడం చాలా తేలిక అవుతుంది. ఆవిడ ఎన్నింటినో ఆచరిస్తున్నారు కనుక ఆఖరికి ప్రాణత్యాగంలో కూడా కష్టం అనిపించలేదు. అందుకే అంత సులువుగా కర్మసిద్ధాంతాన్ని చెప్పారు.

**19.03.2004**

17.03.2004 గురువారం రాత్రి సుమారు 7గం.ల ప్రాంతంలో కూర్చుని జానకిరాముడు రాసిన పుస్తకాన్ని చదువుతూ, దానివెనుక అమ్మమ్మగారి భాషయొక్క అంతరార్థాన్ని రాసే ప్రయత్నం చేస్తున్నాను. అది చదువుతుంటే వాడు ఎంత బాగా రాశాడో అనిపించింది. అమ్మమ్మగారితో వాడు గడిపిన మధురక్షణాలు చదువుతుంటే, అప్పుడప్పుడు నాకు 17 సం॥ల పిల్లగా ఉన్నప్పుడు మా ఇంట్లో వాతావరణం, అమ్మమ్మగారు, వారి శిష్యులు, అప్పటి మాటలు, భావాలు, పనులు, కార్యక్రమాలు అన్నీ కళ్ళకు కట్టినట్లు కనబడుతున్నాయి. పైగా మనసు గతంలోకి వెళ్ళి అమ్మమ్మగారి మాటల వద్ద ఆగిపోతోంది. పైగా వాడు ఎంత అదృష్టవంతుడో కదా అనిపించింది. ఆ విషయాలను అంత బాగా గుర్తుంచుకుని కళ్ళకు కట్టినట్లుగా వ్రాసి, నా మనసును తరింపజేశాడు.

ఎందుకో ఒక్కసారిగా దుఃఖం పొంగుకొచ్చింది. గురువును అమ్మవారిగా తెలుసుకునే ప్రయత్నం చేస్తూ, ఆమెతో దగ్గరగా గడుపుతూ అన్నీ తెలుసుకుంటూ, ఆచరిస్తుండటం అంటే ఎంత యోగమో అది. వాడి పూర్వజన్మ సుకృతమేనని అమ్మమ్మగారే చెప్పారు. వాడు రాసిన విధానం మాత్రం అద్భుతంగా మనసుకెక్కింది. దాంతో మనసులోంచి ఏదో పోగొట్టుకున్న దిగులు, బాధ, ఉక్రోషం, కోపం, అసహాయతలాంటివి నన్ను విపరీతంగా చుట్టుముట్టాయి. అంతే భోరున పెద్దగా ఏడవడం మొదలుపెట్టాను. రూమ్‌లో ఒక్కదాన్నే ఉన్నాను. చాలా ప్రశాంతంగా, మనస్ఫూర్తిగా ఏడ్చాను. దాని భావం ఏమిటంటే, "నువ్వు దగ్గరుండి శిష్యుల్ని ఎంత బాగా బిడ్డవలె చూసుకున్నావు. నీ సన్నిధిలో వాళ్ళెంత ఆనందాన్ని గడిపారు. ఎంత

జ్ఞానాన్ని సముపార్జన చేసుకున్నారు. వారికి అలాంటి అవకాశాన్ని లభింపచేశావు. మరి ఇప్పుడు అటువంటి ఉపశమనపు మాటలు, నా ద్వారా భక్తులకు వినిపించి, వాళ్ళను ఆనందింప చేయుచున్నావు. నామాటలు ఫోన్‌లో వింటేనే వారి సమస్యలు పరిష్కారమవుతున్నాయి. గొంతు వింటేనే ఉపశమనం కలుగుతోంది. నాతో గడపడం వారికి కూడా మధుర క్షణాలు అవుతున్నాయి. అప్పుడూ, ఇప్పుడూ కూడా భక్తులకు ప్రత్యక్ష అనుభవాలను నీతోనే ప్రక్కనుండి కలుగజేస్తున్నావు. శిష్యులు తరిస్తున్నారు, మనశ్శాంతిగా ఉండగలుగుతున్నారు.

మరి నా సంగతేమిటి? నువ్వున్నప్పుడు నాకు నువ్వెవరో తెలియకుండా బాంధవ్యాన్ని అడ్డం వేశావు. కష్టం కలిగించడం ద్వారా వెలుగులోకి వచ్చి నన్ను పరోక్షంగా కాపాడుతున్నావు. తలచుకోగానే పనులు జరుగుతున్నాయి. చూడాలన్న కోరిక ఏనాడూ కలుగలేదు. అలాగని కలలోనూ స్పష్టంగా ఎన్నడూ కనిపించలేదు. అవసరమైనప్పుడు నాకే ఏదోవిధంగా తెలియ చేస్తున్నావు. నేను దానికే ఆనందపడుతున్నాను. అంతకంటే ఇంక ఏ ఆనందం ఉంటుందో కూడా నాకు తెలియడంలేదు. ఈమధ్యే ఎందుకో సాకారంగా గురువును దర్శించాలనే కోరిక మొదలైంది. బహుశ నేను ఇవన్నీ వ్రాయడం మొదలుపెట్టినప్పటి నుండి కావచ్చు. సుమారు 1 1/2 సం॥ క్రితం –ఈరోజు అది చాలా గట్టిపడిపోయి, ఏమైనా సరే నువ్వు నాకు దేహంతో వచ్చి, దగ్గరుండి (నేను చేస్తున్నట్లుగా) నన్ను ఆనందింపచేయాలి. నాకు ఒక ఓదార్పు కావాలి. నేనెలా చేస్తానో, నాకు అలా నీవద్ద నుండి కావాలి. నన్నెవరు ఓదారుస్తారు, నాకెవరు చెప్తారు. నువ్వు ఎలా చెప్పినా సరే, నాకేదో వెల్తిగా ఉంది. స్వయంగా వచ్చి నన్ను ఓదార్చు. నువ్వేం చేస్తావో నాకు తెలీదు. ఎన్నో అద్భుతాలు చేశావు కదా! ఇది కూడా అలాగే చెయ్యి అని ఏడ్చి, ఏడ్చి ఇలా వేడుకుని, కాసేపటికి ఆయన వచ్చాక భోజనానికి హోటల్‌కు వెళ్ళాము.

గత రెండు రోజులుగా శ్రీరామ్ అమెరికా వెళ్ళడం గురించి, లావణ్యకు ఆరోగ్యం బాగాలేదంటే దాని గురించి, పవన్‌కు డ్యూటీ మార్చకపోతే కష్టం, ఆరోగ్యం పాడవుతోందంటే దాని గురించి ఏవో చిన్నచిన్నగా ఆలోచిస్తున్నాను. కానీ అవేమీ అంత సీరియస్ విషయాలు కావు. వాటికోసం ఏవో నియమాలు కూడా చేస్తున్నాను.

ఇదేరోజు మధ్యాహ్నం ఇక్కడి (వాస్కోడగామా) బ్రాంచ్ ఎజిఎమ్‌గారి భార్య శ్రీమతి గోఖలే, ఆమె పేరు మాధురి, మహారాష్ట్రవాళ్ళు, నాసిక్ నుండి వచ్చారు. ఆమెతో కలిసి కారులో దక్షిణ గోవాలో ఉన్న బాలాజీ, మహాలక్ష్మి, ఇలా మరికొన్ని ఆలయాలు చూశాము, కలసి భోజనం చేశాము. ఆమె వయస్సు కూడా నా వయస్సే. ఆమెకు కోడలు వచ్చింది. ఆమె దేవి భక్తురాలట. కొల్హాపూర్ మహాలక్ష్మి వారి కులదేవతట. రోజూ శ్రీసూక్తం 16సార్లు చదువుతుందట. సరే బాగుందనుకున్నాను. ఎందుకో నాకు ఆమెను చూస్తే నాలాగే ఉన్నదనిపించింది. అంటే వెడల్పు మొహం, నాలాగే మొటిమలు వచ్చి తగ్గినట్లుగా గుంటలు పడిఉన్నాయి. భుజాలు వెడల్పుగా ఉన్నాయి. రింగులు పెట్టుకుని నార్త్ ఇండియన్ స్టైల్‌లో ఉంది. ఆమె మాటతీరు, పద్మశ్రీ నాకు నచ్చింది. అలాగే ఆమెకు నేను కూడా బాగా నచ్చాను. “అయ్యయ్యో, మీరు ఇక్కడికి 10 రోజులు

అయిందా? Really I missed you, Ratna” అని ఆమె చాలా బాధపడిపోయింది.

సరే ఆ ప్రయాణంలో ఎన్నో మాట్లాడుకున్నాము. కానీ మాటల మధ్యలో ఆవిడ నాతో “నాకు జరగబోయేవి అప్పుడప్పుడు తెలుస్తుంటాయండీ. చాలాసార్లు దేవి కలలో కనబడి జరగబోయేవి చెప్తుంటుంది, చూపిస్తుంటుంది. మా ఇంట్లో దసరా పూజలు చేస్తాము. దేవిని ఇంట్లో నిలబెడతాము” అన్నది. నేను “మా ఇంట్లో కూడా మేమూ అంతే” సింపుల్‌గా అన్నాను. అంతేగాని పెద్దగా పట్టించుకోలేదు. ఆరోజు సాయంత్రమే నేను అమ్మమ్మ గురించి ఏడవడం జరిగింది. ఆ రాత్రి వాళ్ళు మమ్మల్ని హోటల్‌కు డిన్నర్‌కు పిలిచారు. అందరం కలసి భోజనం చేసి రూమ్‌కు వచ్చాము.

ఆ మర్నాడు శుక్రవారం. నేను 12 గం॥ల వరకు ఏదో పనిచేసుకుని, నెమ్మదిగా సాయంత్రం వాళ్ళింటికి వెళ్ళి, వాకింగ్‌కి వెళ్దాం రమ్మన్నాను. ఇద్దరం కలిసి పార్క్‌కు వెళ్ళి ఒక సిమెంట్ బెంచ్ మీద కూర్చున్నాము. ఆవిడ వాకింగ్ చేసే మూడ్‌లో లేదు. కబుర్లు ఏవో చెప్తోంది. ప్రక్కనే కూర్చుని వింటున్నాను. ఆవిడ ఒక్కసారిగా నావైపు చూసి చిన్నగా నవ్వుతూ “మీరు మీ అమ్మాయి గురించి బాధపడుతున్నారు కదా!” అని అడిగింది. నేను ప్రశ్నార్థకంగా చూస్తున్నాను. “మీ అల్లుడు అమెరికా వెళ్తున్నాడు కదా! బాగా సెటిల్ అవుతారు. వెంటనే అక్కడ జాబ్ దొరుకుతుంది. 3, 4 నెలల్లోపే మీ అమ్మాయి కూడా వెళ్ళిపోతుంది” అని చెప్పింది. ఇదంతా ఈమెకు ఎలా తెలుసు? నేను మా పిల్లల గురించి అస్సలు చెప్పనేలేదు కదా అనుకుంటున్నాను. ఆశ్చర్యంగా చూస్తున్నాను. ఆమె అలాగే చిద్విలాసంతో చూస్తూ నీకు మంచి కోడలు రాబోతోంది. పెళ్ళి ఎలా జరుగుతుందా అనుకుంటున్నారు కదా! ఏం కాదు, ‘వైదిక విధి’ ప్రకారమే జరుగుతుంది. పెళ్ళయిన 6 నెలలలోపుగానే వాళ్ళుకూడా అమెరికా వెళ్ళిపోతారు” అన్నది. నాకు ఇది మరీ విచిత్రంగా అనిపించింది. మా అబ్బాయి పెళ్ళిగురించి ఈమె చెప్పడం మొదలుపెట్టగానే నాకు ఆవిడ ధోరణి వేరేగా అనిపించింది. ఇదంతా ఆమె హిందీలోనే చెప్తుంటే అలా చూస్తున్నాను. అప్పుడు ఒక మాట అన్నది “దేవీ ఆప్ సే సేవా కర్ లేతీ హైం, మీరు ఎక్కడికి వెళితే అక్కడే దేవీదర్శనం అవుతుంది. ఆమె మీతోపాటే, మీకంటే ముందుగా నడుస్తుంటుంది” అని చెప్పింది.

అది వినగానే నిన్నరాత్రి 7 గం॥లకు నేను ఆవిడే వచ్చి స్వయంగా నాకు ధైర్యం ఇచ్చేలాగా ప్రక్కన కూర్చుని మాట్లాడాలని అనుకున్నాను కదా అనే స్ఫురణ వచ్చింది. అందుకే ఆమె స్వయంగా వచ్చి పక్కన కూర్చుని, నాకు జరగబోయే విషయాలను చక్కగా అర్థమయ్యేట్లుగా చెప్పి, నాకు ఆనందాన్ని కలుగజేసింది. అమ్మమ్మ అనుకున్నా, అమ్మవారు అనుకున్నా, ఏమనుకున్నా ఆమెకోసం నిజంగా ఏడిస్తే, తప్పకుండా సశరీరంతో వచ్చి విషయాలను చెప్పి (లౌకికంగా) వెళ్ళింది. ఇలాంటిది ఇదే మొదటిసారి జరగడం. ఇదొక చిత్రమైన అనుభూతి. నేను ఇతరులకు చెప్పేలాగా నాకు ధైర్యం చెప్పమని అడిగాను. ఆమె అలాగే ఇంట్లో విషయాల గురించి ధైర్యం చెప్పారు.

సశరీరంగా కనపడమన్నాను. కనపడడం, ఆమె కొంచెం నాలాగ ఉండటం ఒక చిత్రము.

తరువాత అమ్మవారు నా ద్వారా సేవలందుకుంటున్నారని చెప్పింది. నాచేత సేవ చేయించు కుంటుంది, నాతోనే ఉంటుందని చెప్పింది. అమ్మవారు ఉన్నచోటుకి నేను వెళ్ళడం కాదు, నేనెక్కడికి వెళితే అక్కడే నాకు ఆమె దర్శనం ఇస్తుందని చెప్పింది. ఏదిఏమైనా, నా సేవలు ఆవిడే స్వీకరిస్తోంది అని నాకు రూఢిగా తెలియజేసింది. అమ్మవారు నాతోనే ఉంటుందని కూడా తెలియజెప్పింది. ఒకరకంగా అమ్మవారు నాలోనే ఉందని కూడా చెప్పింది. ఈ విషయాలను వినగానే బ్యాటరీని రీఛార్జ్ చేసినట్లుగా అయి ఎంత ఆనందం కలిగిందో మాటల్లో చెప్పలేని సందర్భం. ఇది నా జీవితంలో జరిగిన మహాద్భుతమైన సంఘటన.

**20.03.2004**

శనివారం కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారిని చూద్దామని వెళ్ళాము. ఆరోజు (ఉగాది) సంవత్సరాది పండుగ. ఉదయం 9 గం॥లకు హోటల్ నుండి బయలుదేరి గుడికి వెళ్ళాము. అది చాలా పెద్దగుడి. మహారాష్ట్రులు 'గుడిపాడ్వా' అనే పండుగను చాలా బాగా చేసుకుంటారట. గుడి అంతా కళకళలాడుతోంది. చాలా పెద్ద క్యూ ఉన్నది. క్యూలో నిలబడ్డాము. నేను నియమాలు చేస్తున్నాను. మధ్యలో– "మహాలక్ష్మి అమ్మవారు అంటే లక్ష్మి అంశ కదా! మన అమ్మమ్మగారిది కూడా లక్ష్మి అంశే కదా. ఒకసారి భాస్కరరావుగారు నాతో మహాలక్ష్మి మంత్ర బీజాక్షరములను తిరగవేస్తే కమలాంబికా మంత్రం యొక్క బీజాక్షరములు వస్తాయి. ఈ విషయాన్ని నేను అథర్వణవేదంలో మహాలక్ష్మిమంత్ర బీజాక్షరాలను చూసినప్పుడు తెలిసిందండీ. అందుకే అమ్మమ్మగారిని నమ్మినవాళ్ళకు డబ్బుకు కొదవ లేకుండా ప్రసాదిస్తారు అని చెప్పి, ఆ పుస్తకం కూడా నాకు తెచ్చి చూపించారు. ఇప్పుడు ఈ విషయం గుర్తుకు వచ్చింది. ఈ రోజు చేసే నియమాలన్నీ నేను ఇక్కడే, నీ పాదాల దగ్గరే ధారపోస్తున్నాను. ఎందుకంటే నువ్వు ఇక్కడే ఉన్నావని, నీది అదే అంశ అనీ నమ్మి ఇక్కడే ధారపోస్తున్నాను. నువ్వు ఈ గుళ్ళో ఉంటే, ఇప్పుడు ఇక్కడ దర్శనమిచ్చి నాకు ఈ విషయాన్ని రూఢి చెయ్యి" అనుకున్నాను. నేను సాధారణంగా ఏ నియమాన్ని అయినా సరే, ఎప్పుడూ కమలాంబికా పాదారావిందముల చెంతనే (కమలాంబికా ముక్తిధామం) ధారపోస్తాను తప్ప, మరెక్కడా సంకల్పం కూడా చెప్పను. అలాంటిది ఈరోజు క్యూలో నిలబడ్డప్పుడు మన అమ్మమ్మ గారు, మహాలక్ష్మి ఒక్కటే అని భాస్కరరావు గారి మాటలు గుర్తుకు రావడం, అది నిజమనే నమ్మకంతో ఆమె పాదాల వద్ద వదులుతున్నాననుకుని, ఈ విషయం నాకు తెలియాలంటే అప్పుడు, అక్కడ జరిగితే కాని నాకు తెలియదు కదా! అనుకున్నాను.

ఏమిటో ఇలాంటి పరీక్షలను నేను ఆవిడకు పెట్టడమా లేక, ఆవిడే నన్ను పరీక్షించి, పడిపోకుండా లేపుతున్నారో తెలియదు కదా! క్యూలో నుండి గర్భగుడి ముందుకు వచ్చాము. సరిగ్గా అప్పుడే సెల్‌ఫోన్ రింగ్ అయింది. ఎవరా అని చూస్తే ఏలూరు నుండి రామకృష్ణ ఫోన్ చేసి, "మేమందరం పీఠానికి వచ్చాము. పిన్నిగారు మీతో మాట్లాడతారట. మీరు మాట్లాడండి" అన్నాడు. త్రిపురం పిన్ని– "రత్నం ఇవాళ ఇక్కడ నియమాలు అవీ జరిగాయి. అందరికీ భోజనాలు

ఏర్పాటు చేశాను. నేవేద్యాలు పెట్టించు. నువ్వు ఏం చేస్తున్నావు?" అన్నది. నేను "క్యూలో ఉన్నాను" అని చెప్పాను. "అయితే అమ్మవారికి నా తరఫున కూడా నమస్కారం చెయ్యి" అన్నది. ఇంతలో మా అమ్మకూడా మాట్లాడి "నన్ను ఆ గుళ్ళో ఒక్కసారి తలచుకో చాలు. మేమూ అక్కడున్నట్లే" అన్నది. ఫోన్ పెట్టేశాక, నేనడిగిన ప్రశ్నకు సమాధానం గర్భగుడిలోనికి వెళ్ళకముందే దొరికింది. ఆవిడా, ఈవిడా ఒకే అంశ కాబట్టే నాచేత నియమం అక్కడ, ఆ పాదాల వద్ద ధారపోయించబడింది అని అర్థమైంది.

తరువాత కొల్హాపూర్‌కు 4 కి.మీ.ల దూరంలో ఉన్న నృసింహవాడి, దత్తాత్రేయ గుడిని దర్శనం చేసుకుని వచ్చాము. మర్నాడు ఉదయమే పండరీపురం వెళ్ళి పాండురంగ దర్శనం కావించుకుని, సాయంత్రానికి అక్కల్‌కోట వెళ్ళి (ఆయన కూడా దత్తావతారంలో 45వ వాడట. అక్కడ ఆయన ఒక చెట్టుక్రింద కూర్చుని 22 సం॥లు తపస్సు చేశారట) స్వామి దర్శనం చేసుకుని, మరునాడు పొద్దున్నే గాణుగాపురం (దత్తావతారంలో మొదటి స్థలం అదేనట) వెళ్ళి అక్కడ ఆయన తపస్సు చేసిన స్థలం చూసి, హైదరాబాద్ వచ్చేశాము. నేను ఇంటినుండి బయలుదేరే ముందు 7 రోజులు గురుచరిత్ర చదివాను. మళ్ళీ నా టూర్ అయి వచ్చేటప్పుడే అన్ని దత్తస్థానాలను దర్శనం చేయించారు గురువులైన అమ్మమ్మగారు. బహుశా అవన్నీ గురుపీఠాలే కావడం వల్లనేమో, నా ప్రశ్నలు - ఆమె సమాధానములు ఋజువులు, ఇవన్నీ జరిగాయి అని అనిపిస్తోంది. జానకిరాముడు (?) రాసిన పుస్తకంలో, అమ్మమ్మగారు "ఒరేయ్ నిన్ను కొన్ని నిజస్థలాలకు తీసుకువెళ్ళాలని, అక్కడ స్నానాలు, దర్శనాలు చేయించాలని" ఆవిడ చెప్పారని వ్రాశాడు. అమ్మమ్మగారు చెప్పినట్లు కొన్ని నిజస్థలాలలో గురువులు ఎంత ప్రత్యక్షంగా ఉంటారో, ఎలాంటి ఋజువులు, దర్శనమిస్తారో నాకు ఆ అనుభవాన్ని ప్రసాదించారు ఆమె.

**24.06.2004**

2 రోజుల క్రితం వరకూ అంటే గత 2 నెలల నుండి ఒకటే మానసిక ఆందోళన. ఎందుకో తెలీదు. తెలియని టెన్షన్. ఏమీ తోచదు. అన్నింటినీ, అందర్నీ కూడా తప్పుపట్టడం, అశాంతి, మనసులో ఏదో తెలీని అసహనం మైండ్ అంతా గజిబిజిగా ఉంటోంది. ఒకరోజు చెన్నై వచ్చాక ఈయనను మనసు ప్రశాంతంగా ఉంచుకోవడం ఎలా? అని అడిగాను. దానికి ఆయన మెడిటేషన్ చేయమని చెప్పారు. దాని వలన నాకేమీ ఫలితం కనిపించలేదు. కానీ చేస్తున్నాను. 25న దగ్గరలో ఉన్న పార్కుకి ఈవెనింగ్ వాకింగ్ వెళ్ళి వచ్చి, టీ తాగుదామని గెస్ట్ హౌస్‌లో క్రింద ఉన్న కుక్ దగ్గరకు వెళ్ళి టీ అడిగాను. ఆమె పేరు రమణి. ఆమె క్రిస్టియన్. ఇద్దరు మగపిల్లలు. ఆమె గెస్ట్‌హౌస్‌లో వంట చేస్తారు. ఆమెకు తెలుగు అర్థమౌతుంది. కొద్దికొద్దిగా మాట్లాడుతుంది. నేను హాల్లో కూర్చుని టీ త్రాగుతూ, ఆమె స్వంత విషయాలు అడుగుతున్నాను. చిన్నప్పుడే భర్తపోతే పిల్లల్ని ఎలా చదివించిందో, ఉమ్మడి కుటుంబంలో అందరికీ ఎలా వండిపెట్టిందో చెప్తోంది. కొడుకుకి పెళ్ళి కుదిరిందట. చర్చిలో పెళ్ళి ఎలా జరుగుతుందో వివరించి చెప్తోంది.

ఆమె తమిళం, కొంచెం తెలుగులో కలిపి చెప్తోంది. మాటల మధ్యలో ఇలా అన్నది.

"ఒంట్లో శక్తి ఉన్నంత వరకూ మన పని మనం చేసుకుపోవాలి. అవతలివాళ్ళు మన పని గుర్తించారా లేదా అని ఆలోచించకూడదు. మన పని మనం చేస్తూ ఉంటే, ఎప్పటికో అప్పటికి వారే మన మంచితనాన్ని గుర్తిస్తారు. గుర్తించకపోతే అది వారికే వదిలేయాలి. అది మన విషయం కాదు. మనమెప్పుడు కూడా దైవానికే బాధ్యత వహించాలి. దైవం దృష్టిలో మనం ఉండాలంటే మనమెప్పుడూ మంచి పనులే చేయాలి. అంటే మన బాధ్యతను మనం నిర్వర్తించాలి. అప్పుడు ఆయన దృష్టిలో మనం నిజాయితీపరులం. అంటే భగవంతుణ్ణి దృష్టిలో పెట్టుకుని మన బాధ్యతలను సక్రమంగా చేస్తున్నామా లేదా అని తరచి చూసుకుంటే చాలు ఆయన దృష్టిలో పడతాము. మనకు మనశ్శాంతి దొరుకుతుంది. మనమెప్పుడూ భగవంతుని ఒక్కనికే సమాధానం చెప్పాలి తప్ప భార్యా, పిల్లలు, చుట్టుపక్కల వాళ్ళకు కాదు. వీళ్ళెవ్వరి (అంటే లౌకిక బంధాలతో వచ్చే సంబంధ బాంధవ్యాలతో) మెచ్చుకోళ్ళతో, కృతజ్ఞతలతో పనిలేదు. ఇవన్నీ తాత్కాలికము. మన బాధ్యతను మనం సక్రమంగా నిర్వర్తిస్తున్నామా లేదా అని చూసుకుంటే చాలు. అప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది" అని చెప్తూ ఇలా అన్నది.

"మీ కోడలు ఉన్నది కదా! ఆమె మీ అమ్మాయి అయితే ఎలా అనుకుంటారో అలాగే అనుకోవాలి. కూతురు అయితే చిన్నపిల్ల, దానికేం తెలియదు అనుకుని సర్దుకుంటాము. అలాగే కోడలు కూడా. ఆమె ఫోన్‌చేసి మీతో మాట్లాడలేదనుకోండి. మీరు మనసులో "ఎందుకు చేయదు? బాధ్యత లేదా? ఎప్పుడు తెలుసుకుంటుంది?" అని అనుకోవద్దు. మీరే ఒక ఫోన్ చేసి బాగున్నావా? ఏమిటి విశేషాలు అని పలకరించారనుకోండి. మీ మనసులో అసహనం, అశాంతి రెండూ ఉండవు. మీ ధర్మం మీరు చేయడం వలన భగవంతుడి దృష్టిలో గుర్తించబడతారు. మనశ్శాంతి దొరుకుతుంది. కొన్నాళ్ళ తర్వాత మీరు ఒకసారి చేయకపోతే ఆమే చేసి, ఎందుకు చేయలేదో కనుక్కుంటుంది. ఆవిధంగా ప్రేమ పెరుగుతుంది. అంతేకాని, మనం చెప్పడం వలన ప్రేమ కలుగకపోగా ద్వేషం కూడా ఎక్కువ అవుతుంది" అని చెప్పింది.

వెంటనే 2 రోజుల క్రితం నేను వేసుకున్న ప్రశ్న (మనశ్శాంతి ఎలా కలుగుతుంది?)కు సమాధానం అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లుగా చెప్పిందనిపించింది. ధర్మాన్ని పాటించడం వలన (ఎవరి నుండి ఏదీ ఆశించకుండా) దైవానుగ్రహం కలుగుతుందని ఎంత బాగా చెప్పింది.

అక్షరజ్ఞానం లేని ఒక (హరిజనురాలు) పని చేసుకునే ఆమెలో ఎంత సంస్కారం! ఎంత సాధన! ఆలోచిస్తే మనలాంటి చదువుకున్న వాళ్ళ సాధన ఎక్కడుంది? మనం ఎంతలో ఉన్నాము? అని ప్రశ్నించుకుంటే చాలా దూరం ఉందనిపించింది. సాధకులు ఎప్పుడూ అలాగే నివురుగప్పిన నిప్పులాగ ఉంటారనిపించింది. అగాధమైన జలనిధిలో ఆణిముత్యాలు ఎలా ఉంటాయో, సాధకులను కూడా ఎంతో లోతులోకి వెళ్తే తప్ప తెలుసుకోలేము. వాళ్ళు ఎక్కడైనా, ఎలా ఉన్నా కూడా వాళ్ళ ప్రవర్తన వలననే తప్ప మరేవిధంగానూ తెలుసుకోలేము. కాబట్టి, సాధన చేయడానికి

ఒక సులువైన మార్గం చెప్పిందనిపించింది. మనం సక్రమంగా చేస్తున్నామా లేదా అని చూసుకుంటే చాలు. భగవంతుడు మెచ్చుకుంటాడు. మనకు మనశ్శాంతి దొరుకుతుంది. తద్వారా ఆరోగ్యంగా ఉండగలుగుతాము. ఆరోగ్యంఉంటే మన పనితోపాటు ఇతరులకు కూడా సేవ చేయగలుగుతాము. అలా ఉంటే (మనశ్శాంతితో) సుఖమరణం వస్తుందని బైబిల్‌లో వ్రాసి ఉందని చెప్పింది. అలాంటి వారే హాయిగా మరణిస్తారు. అదే ఆనందంతో సుఖంగా, తేలికగా మరణించడం అని చెప్పింది. ఆలోచిస్తే ఇంత చిన్నవిషయంలో ఎంతో వేదాంతం గోచరిస్తోంది. సాధన ఎంత నిగూఢంగా ఉన్నది!

ఇంకో చిన్న ఉదాహరణ చెప్పింది. "నువ్వు నన్ను పిలిచివానుకో. నేను వెంటనే పనుందమ్మా, తర్వాత వస్తానులే అన్నాననుకో. నువ్వు బాధపడతావు. మనసు చివుక్కుమంటుంది. పిలిస్తే వెళ్ళలేకపోయానని తర్వాత నాకు కూడా అనిపిస్తుంది. నీకు అశాంతిని ఇచ్చాను కనుక నాకు అశాంతే ఉంటుంది. కాబట్టి మనం ఎప్పుడూ ఇతరులకు సాధ్యమైనంత వరకు మంచినే చేయాలి. ఫలితంగా భగవంతుడు కూడా మనకు మంచినే చేస్తాడు."

**03.08.2004**

ఆగస్టు 3, 2004 రాత్రి, పల్లవి హైదరాబాద్ నుండి యుఎస్ ఫ్లైట్ ఎక్కింది. 4వ తేది మధ్యాహ్నం మేము రాయవెల్లూరుకు బయల్దేరి అర్ధరాత్రికి అక్కడకు చేరుకున్నాము. అక్కడికి రాణీపేట బ్రాంచ్‌వాళ్ళు కారు పంపారు. సుమారు 30 కి.మీ. ప్రయాణం చేసి రాణీపేట చేరాము. అక్కడ షాలిమార్ పార్క్ అనే హోటల్‌లో దిగాము. మర్నాడు 'తిరువలం' అనే గ్రామం (సుమారు 15 కి.మీ.)లో ఉన్న బిల్వేశ్వరస్వామి ఆలయానికి వెళ్ళాము. అది చాలా పెద్దగుడి. అది రాజరాజనరేంద్రుడు పరిపాలించినప్పటిది. ఆయన పేరుమీద అందులో చిన్నవిగ్రహం కూడా పెట్టారు. ఆ గుడి సుమారు 3,500 సం॥ల క్రితం నాటిది. అదంతా ఒకప్పుడు బిల్వారణ్యం. దగ్గరలో ఉన్న 'కంజశిఖరం' మీద నుండి అసురులు అక్కడ తపస్సు చేసుకుంటున్న ఋషులపైకి యుద్ధానికి వెళ్తుంటే వారు శివుణ్ణి ప్రార్థించారు. అప్పుడు శివుడు వారిపైకి నందిని పంపాడు. అది రాక్షసులను సంహరించి, మళ్ళీ వారిని ఇటువైపు రాకుండా ఎప్పుడూ కాపలా కాస్తుంటుంది. అందుకనే శివునికి ఎదురుగా కాకుండా నంది వెనుకకు తిరిగి ఉంటుంది. ఇక్కడ ఇది ఒక విశేషం. ఇక్కడ శివుడు స్వయంభువు. అది పెరుగుతూ ఉంటుంది. ఇక్కడి అమ్మవారు 'ధనుర్మధ్యాంబ'. ధనస్సుకు మధ్యలో ఉన్న స్థానం ఎలాంటిదో ఇక్కడ అమ్మవారి స్థానం అలాంటిది. తనుమధ్యాంబ అని కూడా పేరు ఉంది. అమ్మవారిది చాలా అందమైన విగ్రహం. ఆ గుళ్ళోకి వెళ్ళగానే ఒక్కటే అనిపించింది. మా ముత్తాత గారైన శ్రీ కొక్కొండ వెంకటరత్నం పంతులుగారు ఆరాధించిన దేవతల యొక్క మూలస్థానం. ఆయన 'బిల్వేశ్వరీయం', 'తనుమధ్యాంబ శతకం' అని అమ్మవారిపై 1000 పద్యాల్ని వ్రాశారు. అటువంటి ఆరాధ్యదేవతల గుడిని దర్శించటంతో ఏదో అనిర్వచనీయమైన ఆనందం కలిగింది. మళ్ళీ 15 సం॥ల తరువాత వారి మునిమనుమరాలికి

ఆ గుడికి వెళ్ళే అదృష్టం కలిగించారు ఆ దేవతలు. తమిళులు 'త'కు బదులు 'ద' పలుకుతారు. అందుకని వాళ్ళు 'ధనుర్మధ్యాంబ' అని చెప్పారు. తాతాగారు 'తనుమధ్యాంబ' అని వ్రాశారు. అక్కడి పూజారి ఆ గుడిపైన, స్వామిపైన ఎన్నో విషయాలను రీసెర్చ్ చేస్తున్నారట. నేను తాతాగారి గురించి చెప్పేటప్పటికి, ఆయన చాలా ఆశ్చర్యంతో, ఆనందపడి "మీరు తప్పకుండా ఆ పద్యాలను, పుస్తకాలను తెప్పిస్తే రోజూ గుళ్ళో భక్తులచేత పాడిస్తాను (ఇప్పుడు తమిళంలో పాటలు పాడుతున్నారట). తెలుగులోనైతే ఏమిటి? ఏ భాష అయినా ఫర్వాలేదు. స్వామివారి మీద పద్యాలు తెప్పిస్తే ఆ క్యాసెట్ గుళ్ళో రోజూ అందరూ వినేలాగా చేస్తాను" అని మరీమరీ పంపించమని చెప్పారు. నేను అలాగేనని చెప్పాను. ఈ విషయంలో రాణిపేట చీఫ్ మేనేజర్ స్వామినాథన్ కూడా "మీరు నాకు జిరాక్స్ పంపండి. నేను వెళ్ళి ఆయనకు అందజేస్తాను" అని మరీమరీ చెప్పారు. ఇదొక ఆనందకరమైన సంఘటన. అందుకోసమే ఈయనను ఆ బ్రాంచ్‌కు పంపారేమో అనిపించింది. అంతా అమ్మవారి దయ.

**07.08.2004**

బ్యాంక్ మేనేజర్, పిబిడి మేనేజర్ ఇద్దరూ మా హోటల్ రూమ్‌కు వచ్చి, నన్ను ఒక ఫంక్షన్‌కు చీఫ్‌గెస్ట్‌గా రమ్మని ఆహ్వానించారు. పేదపిల్లలకు లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ వాళ్ళు ఒక హాస్టల్ నడుపుతున్నారు. అందులో 20 మంది పిల్లలున్నారట. దానికి ఎస్‌బిఐ, రాణిపేట బ్రాంచ్ మేనేజర్ రూ. 10,000లు స్కూల్ యూనిఫామ్స్ కోసం దానం చేశారు. ఆ డ్రెస్‌లు నా చేతులమీదుగా ఆ పిల్లలకు అందజేయమని అడిగారు. వెంటనే సరేనన్నాను. ఆరోజు ఆ స్కూల్‌లోని సిస్టర్స్ నన్ను బాగా రిసీవ్ చేసుకుని, స్కూల్ అంతా చూపించి, వాళ్ళ చర్చికి తీసుకెళ్ళి, స్కూల్ పూర్వాపరాలన్నీ వివరంగా చెప్పారు. ఆ ఫంక్షన్ చాలా బాగా జరిగింది. చాలా ఆనందం వేసింది. నేను ఆయన పక్కన కూర్చుని ఆ పిల్లలకు యూనిఫామ్స్ పంచడం కోసం రాణిపేట వెళ్ళానేమో అన్పించింది.

అక్కడి సిస్టర్స్ నన్ను "Have you children?" అనడిగారు. "Yes" అన్నాను.

"Where are they?" అనడిగారు. "They are settled. And both are married" అన్నాను.

"Do you have grand children?" అనడిగారు.

"I don't have till now" అన్నాను.

వెంటనే ఆ Mother superior, "I will pray for them" అన్నారు.

నాకు చెప్పలేనంత సంతోషం కలిగింది. వాళ్ళెవరు? నేనెవరు? ఎప్పుడో నాకు పుట్టబోయే మనుమల కోసం ఆమె ప్రార్థిస్తానంటే నాకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

వాళ్ళెవరో, ఎక్కడి నుండి వచ్చారో తెలియదు. ఇక్కడ ఈ స్కూలులో పనిచేస్తూ అందరినీ వదులుకుని 'సేవ'ను ఎన్నుకుని, ఎంతోమంది పిల్లల్ని అభివృద్ధిలోకి తెచ్చి, మరెంతోమంది

పేదపిల్లలకు తిండి, బట్ట, చదువులను అందిస్తూ, ప్రపంచమంతా "మనవాళ్ళే" అనుకుంటూ సాధన చేయడం అంటే మాటలు కాదు. ఎంతో అంకితభావం ఉండాలి. నిజంగా క్రిస్టియన్స్ అంటే (నేను ఏలూరులో క్రిస్టియన్ కాలేజ్‌లోనే చదివాను) అంతకు ముందెన్నడూ కలుగనంత గౌరవం, అభిమానం, వాళ్ళు చేసే సేవపైన చెప్పలేనంత ఆనందం కలిగింది. ఆ సేవ ఎంతో లీనమై చేస్తే తప్ప, ఆ సిస్టర్ వెంటనే "మీ మనుమలకోసం నేను ప్రార్థన చేస్తాను" అనలేరు కదా! అంటే ఇతరులకు సహాయపడడం కోసం అంతగా మనసును సన్నద్ధపరచుకోవాలన్న మాట. నిజంగా సేవ చేద్దామనే ఉద్దేశ్యం ఉన్నవాళ్ళు, మనసు ఎంత మెత్తపడితే అది చేయగలుగుతారు. ఏదైనా సేవ అనేది వాళ్ళ దగ్గర్నుండి నేర్చుకోవాల్సిందే అనిపించింది. వాళ్ళు చిన్నప్పుడే ఇల్లు వదిలేయడం వలన 'నా' అనే అహం, 'మా' అనే స్వార్థం అనేవాటికి దూరమౌతారు. అప్పుడు మిగిలిన ప్రపంచమంతా వాళ్ళదే అనుకోవడం వలన స్వార్థరహితమైన సేవ చేయడం మొదలవుతుంది. క్రమంగా అదే అందరిపట్లా ప్రేమగా మారుతుంది. తరువాత అదే దయ, కరుణ, క్షమించడం లాంటి దివ్యలక్షణాలు అలవడటానికి నాంది అవుతుంది. ఎవరికైనా ఏం కావాలో, దాన్ని వాళ్ళు అడగకుండానే నిస్వార్థంగా భగవంతుణ్ణి అది ఇవ్వమని ప్రార్థించడం అనేది నిజంగా ప్రేమతత్వానికి ఒక ఉదాహరణ.

**08.08.2004**

అక్కడికి దగ్గరలోనే (50 కి.మీ. దూరంలో) 'కంచి' ఉన్నది. ఉదయమే స్వామినాథన్ (బ్రాంచ్ మేనేజర్), మేమిద్దరమూ కలసి బయల్దేరాము. ముందుగా కంచి కామకోటి పీఠాన్ని దర్శించుకున్నాము. మూడవ గురువుగారు అభిషేకాలు చేయడం చూశాము. ఆషాఢమాసంలో వచ్చే ఏదో పవిత్రమైన నక్షత్రం ఆ రోజు ఉందట. అందుకని విశేషంగా పూజలు జరుగుతున్నాయి. ఎంతో వైభవంగా ఉంది. 2వ పీఠాధిపతి కూడా అక్కడే ఉన్నారు. వారి దర్శనం చేసుకున్నాము. అక్కడినుండి ఏకాంబరేశ్వరస్వామి ఆలయం చేరుకున్నాము. అది చాలా పెద్దది. చాలా అందమైన శివలింగం. ఆ తరువాత కంచి కామాక్షిని దర్శించుకున్నాము. ఆరోజు చాలా రద్దీగా ఉన్నది. ఒక్క నిమిషం చూడటానికే చాలా సమయం పట్టింది. ఆ విగ్రహం యొక్క అందాన్ని కళ్ళల్లోనే ఇముడ్చుకోలేకపోయాను. చాలా అందంగా ఉంది. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేంత అందం, ఆకర్షణ ఉంది. అక్కడ భోజనం చేసి రాణిపేట వచ్చేశాము. స్వామినాథన్‌కు ఇవన్నీ బాగా తెలియటం మూలంగా అన్నీ వివరంగా చూపించి, దర్శనాలు చేయించారు. మేము ఆ ఊరు వదిలి వచ్చేస్తుంటే, స్కూల్‌లో జరిగిన ఫంక్షన్ ఫొటోలు, ఆ పేపర్ కటింగ్స్ (దినకరన్ మ్యాగజైన్) తీసుకు వచ్చి నాకు గిఫ్ట్‌గా ఇచ్చారు. చాలా సంతోషపడ్డాను. ఇది ఒక మరపురాని సంఘటన.

అక్కడినుండి త్రిచూర్ వచ్చాము. కేరళ చాలా బాగుంది. అంతా పచ్చదనం. కొబ్బరిచెట్లు, అందమైన ఇళ్ళు, చక్కని ఆలయాలు, మంచి కూరగాయలు అన్నీ బాగున్నాయి. మేము దిగిన హోటల్ (Cee Pee Towers)కు దగ్గరలోనే స్వరాజ్ గ్రౌండ్స్. అందులోనే "వడిక్కనాథన్" ఆలయం.

దానికి ఎదురుగా పరమోక్క అమ్మవారి (లలిత) గుడి. ఆ గుడి కూడా పెద్దదే. అది నల్లని సాలగ్రామంతో చేయబడిన నిలువెత్తు విగ్రహం. ఒక శుక్రవారం వెళ్ళి దర్శనం, అక్కడే నియమం చేసుకునివచ్చాను. ఇక శివన్ ఆలయం ఎకరం స్థలంలో ఉంటుంది. అక్కడ చాలా పెద్ద పెద్ద చెట్లు ఉంటాయి. ప్రదక్షిణం చేయడానికి ప్రహరీచుట్టూ నాపరాళ్ళు పరిచారు. మామూలుగా నడక అలవాటులేని వాళ్ళకు ఒకసారి ప్రదక్షిణం చేయడమే కష్టం. ఆ ప్రహరీలోనే ఆదిశంకరా చార్యుడు, కృష్ణుడు, శంఖుచక్రాలు, మృత్యుంజయుడు, నాగేంద్రుడు, అయ్యప్ప, పరశురామునికి గుళ్ళు ఉన్నాయి. ముందు వీరందరినీ దర్శించుకున్నాక అసలు శివుని గుడిలోకి అడుగుపెడతాము.

లోపలకు వెళ్ళగానే ముందుగా నందిని దర్శించుకోవాలి. తరువాత ఈశ్వరుడు. ఆయనకు రూపం లేదు. నాగాభరణంలాగా అలంకారం అంతే. తరువాత అమ్మవారు పార్వతి. బంగారు తొడుగు. తరువాత వినాయకుడు, శ్రీరాముడు, శంకరుడు, నారాయణుడు ఆఖరికి ధ్వజస్థంబాన్ని చూడాలట. ఇదంతా చూడాలంటే కనీసం 2 గంటలు పడుతుంది. ఎంతో మహిమగల ఆలయం. 10 రోజులు వెళ్ళి దర్శనం చేసుకుని, కొందరి నియమాలు అక్కడ చేయగలిగే అదృష్టం కలిగింది.

ఇంత పెద్ద గుడిలో ఇంతమంది దేవుళ్ళను చిన్నవాళ్ళ నుండి, చదువుకునే పిల్లలు, మధ్యవయస్కులు, ముసలివాళ్ళు అందరూ ఎంతో భక్తిగా రోజూవచ్చి దర్శనం చేసుకుని వెళ్ళడం గమనించాను. ఏమైనా ఇక్కడి వాళ్లకు భక్తి ఎక్కువ. అందుకే కేరళ అంత సుభిక్షంగా ఉన్నదేమో అనిపించింది. శివుడు నిలువెత్తు నాగాభరణంతో, కొంచెం వైవిధ్యంగా ఎంతో ఆహ్లాదంగా కన్పిస్తాడు. ఇదొక అదృష్టం. తరువాత ఒక ఆదివారం (ఆదివారం అమావాస్య వచ్చింది) 'గురువాయూర్' వెళ్ళాము. చిన్నికృష్ణుడికి చక్కగా చందనంతో అలంకారం. చాలా బాగుంది. చాల పెద్దగుడి. అక్కడ కొంతమంది కోసం కొన్ని మొక్కులు మొక్కాను. అవి తీరాక మళ్ళీ వస్తానని దణ్ణం పెట్టుకున్నాను. వాళ్ళ బ్యాంక్‌లో ఆఫీసర్ ఒకాయన మమ్మల్ని తీసుకెళ్ళారు. అక్కడ మాకు స్పెషల్ పాయసం, ప్రసాదాలు ఇచ్చి పంపారు. సాధారణంగా ఆ సమయంలో అవి బయటకు ఇవ్వరట. అది మా అదృష్టం అన్నారు వాళ్ళు. తరువాత 'ధన్వంతరి గుడి' (మన దక్షిణ భారతదేశంలో ఇక్కడ ఒక్కచోటే ఉన్నది. గురువాయూర్ నుండి 30 కి.మీ.ల దూరంలో ఉంటుంది) వెళ్ళి అందరి ఆరోగ్యం కోసం నమస్కరించాను. అటువంటి స్థలానికి వెళ్ళి అందరి ఆరోగ్యం కోసం అక్కడ నమస్కారం చేయాలని అమ్మమ్మగారి సంకల్పమేమో. అందుకని అక్కడకు తీసుకెళ్ళారు. ఇక్కడ విష్ణుమూర్తికి ధన్వంతరి వైద్యుడు మందిచ్చి రోగాలు నయం చేశాడుట. ఆయనను దర్శించి ఒక ప్రత్యేక నమస్కారం చేశాను. అదేమిటంటే "ఉన్నవాళ్లైనా, లేనివాళ్ళైనా సరే దగ్గరలో ఏ డాక్టర్ దొరికితే, ఆయన ఏ మందిస్తే అదే నీ మందులాగా పనిచేసి రోగవిముక్తులను చెయ్యి తండ్రీ" అని నమస్కరించాను. అందుబాటులో ఉన్న డాక్టర్‌తో నువ్వే మందులియ్యి అని నమస్కరించాను. ఈ నమస్కారం చాలా ఆత్మసంతృప్తినిచ్చింది. కమ్మలమ్మగారే ధన్వంతరి రూపంలో, అక్కడ దర్శనమిచ్చారా అని అనిపించింది. ఇక్కడ మూలికలు, చెట్లు, వేర్లు చాలా ఎక్కువ. అందుకనే ఇక్కడ ఆయుర్వేద

మందుల తయారీ, హాస్పిటల్స్, వైద్యం చాలా ఎక్కువ. ఇంత అందమైన ప్రకృతి మధ్యలో భగవంతుని దర్శనాలు చేయడం, చాలా ఆనందంగా, ఆహ్లాదంగా అనిపించింది.

**21.08.2004**

ఈరోజు ఆగస్టు 21. త్రిచూర్ నుండి బయల్దేరి కొచ్చిన్ వెళ్ళాము. కొచ్చిన్‌లో గెస్ట్‌హౌస్ చాలా బాగుంది. వంట చేసుకునేందుకు వీలుగా ఉందని వంట మొదలుపెట్టాను. సాయంత్రంకాగానే ఫ్లాట్స్ చుట్టూ వాకింగ్. బ్యాంకుకు 3 రోజులు సెలవులు వచ్చాయి. కొచ్చిన్‌లో మెరైన్ డ్రైవ్‌కు వెళ్ళి వాకింగ్ చేస్తుంటే క్రూయిజ్‌లో వెళ్తూ మ్యూజిక్ పార్టీవాళ్ళు మళయాళంలోనూ, తమిళంలోనూ, హిందీలోను పాడే పాటలను వింటూ ఎంజాయ్ చేశాను. తర్వాత ఒక వారంలో బుజ్జి, దత్తారావును మున్నార్ వెళ్దాం రమ్మన్నాను. ఈలోపుగా వరలక్ష్మి వ్రతం వచ్చింది. అక్కడ అమ్మవారిని పెట్టుకుని పూజ చేసుకుని పెసరపప్పు, పాయసం నైవేద్యం పెట్టుకున్నాను. మధ్యాహ్నం బయల్దేరి 'కాలడి' (శంకరాచార్యులవారు పుట్టిన స్థలం) చూడటానికి వెళ్ళాము. అక్కడ మరొక విశేషమేమిటంటే, అక్కడి అమ్మవారు 'శారదాదేవి'ని శృంగేరీ పీఠాధిపతియైన (33వ గురువులు) శ్రీసచ్చిదానంద నృసింహ భారతీ స్వాములవారు ప్రతిష్ట చేశారట. ఆయన పాత ఫొటో ఒకటి అక్కడ పెట్టారు. ఆ ఫొటోను మేము వీడియోలో తీసుకున్నాము. వారు అక్కడ ఒక శిలవద్ద కూర్చుని 13 సం॥లు తపస్సు చేశారట. అంతకు ముందువరకు శంకరులు పుట్టినది కాలడీ అని తెలుసుకానీ, స్థలం ఎక్కడో ఎవరూ నిర్ధారించలేదట. ఈయన తపస్సు చేసిన స్థలమే శంకరుల తల్లి ఆర్యాంబయొక్క సమాధి అని, ఆయన పుట్టిన స్థలం మరొకటని ఈ గురువుగారే నిర్ధారించి అప్పటి ట్రావెన్కూరు మహారాజుగారి ఆధ్వర్యంలో శారదాంబను ప్రతిష్ట చేశారని అక్కడ పూజారిగారు ఆ స్థలపురాణమంతా వివరించి చెప్పారు. నాకు చాలా ఆనందం కలిగింది. ఎందుకంటే ఆంధ్రమహాయోగులు - 4వ భాగంలో ప్రొ॥ బి.రామరాజుగారు అమ్మమ్మగారి జీవిత చరిత్రతోపాటు వారి అన్నగారైన శాంతానందులవారి జీవిత చరిత్రను కూడా ప్రచురించారు.

అందులో వారు శ్రీకొక్కొండ వెంకటరత్నం పంతులుగారికి గౌతమ మహర్షి కనిపించి నీకు పుట్టిన కుమారుడు మునుజన్మలో చొప్పళందాన్ అనే భక్తుడిగా పుట్టి, శివుణ్ణి కొలిచి కంజశిఖరం మీద సమాధి పొందాడనీ, ఆయనే తరువాతి జన్మలో శృంగేరీ పీఠాధిపతులుగా జన్మించారని, తరువాత జన్మలో నీ కడుపున పుట్టి శాంతానందులుగా వర్ధిల్లుతారనీ చెప్పారు. ఇవన్నీ ఆయన చాలా ఆధారాలు సేకరించి, చరిత్రను విడుదల చేశారు. ఆ విషయాన్ని నేను ఆ సంవత్సరాల ఆధారంగా చూస్తే, 33 లేక 34వ గురువులు నృసింహభారతి అని నేను తెలుసుకున్నాను. ఇంకా విపులంగా తెలుసుకోడానికి శృంగేరికి వెళ్ళాలని (పుస్తకాల కోసం) అనుకున్నాను. ఈలోపుగా కాలడివచ్చి, ఆక్కడ ఆయన ఫొటో చూసి, ఈ చరిత్ర విని అమితానందపడ్డాను. సరేననుకుని ఆయన తపస్సు చేసిన స్థలంలో కొంచెంసేపు కూర్చుని ధ్యానంలోకి వెళ్ళాను.

నాకు ఆ ధ్యానంలో, నేను కూర్చున్న స్థలం క్రింద అంటే ఎంత లోతుగా ఉందో తెలియదు

కానీ, (పైనుండి చూస్తే కింద వస్తువు ఎంత పెద్దదైనా మనకు చాలా చిన్నదిగా కనిపిస్తుంది కదా!) ఒక దేదీప్యమైన వెలుగు నలుచదరంగా అంటే ఒక తగరపు కాగితంలా కదులుతూ విపరీతమైన కాంతితో శక్తి అంతా కూడుకుని ఆ ఆకారంలో ఒకేచోట నిక్షిప్తమై వ్యాపించినట్లు కన్పించింది. కాబట్టే అక్కడ శంకరులు పుట్టడం, వారి తల్లి ఆర్యాంబ సమాధి, మరియు నృసింహభారతి స్వాములవారు తపస్సు చేయడం లాంటివి జరిగాయేమో అన్పించింది. తరువాత ఆయన వారి తల్లికోసం పూర్ణానది యొక్క పాయను వారి ఇంటివద్దకు ప్రవహించేలాగా ప్రార్థించారు. అక్కడకు వెళ్ళి కాళ్ళు కడుక్కుని, నీళ్ళు తలపై జల్లుకున్నాను. అక్కడినుండి ఆయన ప్రతిష్ఠించిన వేణుగోపాలస్వామి ఆలయానికి వెళ్ళాము. ఇదంతా సుమారు సాయంత్రం 4-6 గంటల మధ్య జరిగింది. ఏదైనా సరే 33వ గురువుగారి చరిత్రను తెలుసుకుని కొంత సమన్వయపరచుకోవాల్సి ఉందని అనుకున్నాను.

ఆ మర్నాడు పొద్దునే కైకలూరు నుండి హైమ ఫోన్ చేసి “నిన్న మా అమ్మాయిని తీసుకుని వరలక్ష్మి పూజకు ఏలూరు వెళ్ళాను. నేను నెలరోజులక్రితం కొన్న ఆంధ్రయోగుల చరిత్ర పుస్తకం త్రిపురం పిన్నికి చూపిద్దామని తీసుకువెళ్ళాను. ఆరోజున త్రిపురం పిన్ని స్వయంగా శాంతానందుల వారి చరిత్ర చదివి వినిపించింది. ఎంతో ఆనందం కలిగింది” అని చెప్పింది. నేను “ఎన్ని గంటలకు” అని అడిగాను. సరిగ్గా 4-5 గంటల మధ్య అని చెప్పింది. అదివిని నేను మరింత ఆశ్చర్యపోయాను. నేను సరిగ్గా కాలడిలో వారు తపస్సు చేసిన స్థలానికి వెళ్ళి, వారిని స్మరించుకునే సమయంలోనే ఏలూరులో పిన్ని ఆయన చరిత్ర చదవడం నాకొక విచిత్రమైన అనుభవం కలిగింది. దాంతో వారే వీరు అయి ఉంటారనే నమ్మకం దృఢపడింది. మరొక 3 రోజులకు దత్తారావు వాళ్ళు వెళ్ళిపోయారు. ఆరోజు వాళ్ళను స్టేషన్‌లో దింపి, మేము కేరళలోని ‘తొడుపుళ’ (Todupuzham) అనే చోటికి వెళ్ళాము. అక్కడకు వెళ్ళిన దగ్గర్నుండి నాకు ఒంట్లో బాగుండలేదు. అక్కడ మంచి మిషనరీ హాస్పిటల్ ఉంది. అన్ని టెస్ట్‌లు చేసి, మందులిచ్చి విశ్రాంతి తీసుకోమన్నారు. ప్రతిరోజూ హాస్పిటల్‌కు వెళ్ళి ఫిజియోథెరపీ చేయించుకుని మధ్యాహ్నం 1 గంటకు వచ్చి పడుకుని నిద్రపోవడం. మొత్తానికి ఒక వారంలో తగ్గింది.

అక్కడి నుండి బయల్దేరి ‘ఈరోడ్’, తమిళనాడుకు వచ్చాము. ఆ హోటల్, భోజనం బాగున్నాయి. కానీ ఇల్లు వదిలి చాలాకాలమైంది, దాంతో ఇంటిమీద బెంగ వచ్చింది. హైదరాబాద్ వెళ్తే విశ్రాంతి ఉండదు. ఫోన్లలో మాట్లాడాలంటే కష్టం. మళ్ళీ తొందరలో దసరా వచ్చేస్తోంది. ఇప్పుడిలా ముందే అలసిపోతే దసరాకు కష్టం కదా అని బలవంతంగా ఉంటున్నాను. సెప్టెంబర్ 18 వినాయకచవితి ఉంది. ఆయన “2 రోజులు సెలవులు కదా ఏంచేద్దాం?” అన్నారు.

క్రిందటి సంవత్సరం బొంబాయిలో ఉన్నప్పుడు మహారాష్ట్ర వాళ్ళతో కలిసి పండుగ చేసుకుని, వినాయకుడిపైన భజనలు నేర్చుకుని, అందరితో కలిసి పాడాను. ఒకసారి ఆయనెవరో రైల్లో కన్పించి, మమ్మల్ని చవితినాడు ఇస్కాన్ ఆలయానికి రమ్మని, భోజనం పెట్టించి పంపారు. అప్పుడు వినాయకుడు ఆవిధంగా ఆశీర్వదించాడు. ఈసారి ఎలా ఆశీర్వదిస్తాడో చూడాలి!!

**18.09.2004**

ఈరోజు వినాయకచవితి. ఉదయమే లేచి, స్నానంచేసి క్రింద రెస్టారెంట్‌కు వెళ్ళాము. 4, 5 రకాల ఉండ్రాళ్ళు, రాగిపిండితో చేసినవి, తియ్యటివి, ఉప్పువి పెట్టారు. ప్రసాదం తిని, పక్కనే ఉన్న వినాయకుణ్ణి దర్శించుకుని, కాసేపు రోడ్‌మీద వెళ్ళి, దారిలో నాకు పరిచయమైన హోమియోపతి డాక్టర్ సుగంధి వద్దకు కొన్ని స్వీట్స్ ఫ్రూట్స్ తీసుకెళ్ళి, కాసేపు మాట్లాడి వచ్చాము. తిరిగి 12 గంటలకు రూమ్‌కు చేరాము. మధ్యాహ్నం గం.1.30లకు రామక్రిష్ణ కొడుకు కమల్, ఇద్దరు ఆడపిల్లలు, ఇద్దరు మగపిల్లలు మొత్తం 5గురు ఏదో పనిమీద ఈరోడ్ వచ్చారట. నన్ను వాళ్ళకు చూపిస్తానని చెప్పి అందర్నీ హోటల్‌కు తీసుకువచ్చాడు. వాళ్ళతో కాసేపు తెలుగులో మాట్లాడేటప్పటికి వాళ్ళు, నేను చాలా ఆనందపడ్డాము. టైము గం.2.30లు అయింది. బయట వర్షం. సరే, పండుగనాడు వీళ్ళందరూ సరిగ్గా భోజనం టైమ్‌కి వచ్చారనిపించింది. పైగా వచ్చింది కమల్ (అమ్మమ్మగారి ఆశీర్వచనంతో పుట్టాడు). అందర్నీ పక్కనున్న హోటల్‌కు తీసుకెళ్ళి, భోజనం పెట్టించి, వాళ్ళతో ఆనందంగా గడిపాను. అందులో ఒక తమిళ అమ్మాయి నాతో "మీరు తెలుగు వాళ్ళతో మాట్లాడిన విధానం, జోక్స్ నాకు అర్థంకానందుకు బాధగా ఉన్నది. నాకు ఇంగ్లీషు వచ్చినా బాగుండేది. నా లైఫ్‌లో మిమ్మల్ని మళ్ళీ ఒకసారి చూడాలి" అన్నది. అందరూ "మమ్మల్ని ఆశీర్వదించండి" అని నమస్కరించి వెళ్ళిపోయారు. ఆవిధంగా వినాయకుడు నావద్దకు వచ్చి మమ్మల్ని ఆశీర్వదించాడు అనిపించింది. ఒకసారి ఆయన నన్ను పిలిచి భోజనం పెట్టాడు. మరొకసారి ఆయనే నలుగుర్ని తీసుకొచ్చి, నావద్ద భోజనం పెట్టించాడు. ఏదైతేనేమి? ఆయన ఆశీర్వచనం, దర్శనం ముఖ్యం. ఈసారి వినాయకచవితి ఈవిధంగా గడిచింది.

**19.09.2004**

ఈరోజు మరచిపోలేని అనుభూతి పొందిన రోజు.

ఉదయం లేస్తూనే టివిలో తిరుపతి బ్రహ్మోత్సవాల 3వరోజు స్వామిని ముత్యాల రథంపై ఊరేగిస్తున్నారు. సామవేదం షణ్ముఖశర్మ "ముత్యం ఎంత స్వచ్ఛమో స్వామి ఆత్మ కూడా అంతే స్వచ్ఛం కాబట్టే, అన్నమయ్య 'ముద్దుగారె యశోద ముంగిట ముత్యము వీడు' అని పాడాడు" అని చెప్తున్నారు. స్వామిని చాలా చక్కగా చూపించారు. అది చూస్తూ నేను "ఒక్కసారైనా తిరుపతి వెళ్ళి బ్రహ్మోత్సవాలను కంటితో చూడలేదు. భవాని (బొంబాయిలో) ఎన్నోసార్లు వెళ్ళివచ్చి, కళ్ళకు కట్టినట్లు విషయాలను చెప్పేది. తను ఇవి చూసి చాలా సంతోషపడి ఉంటుంది కదా!" అనుకుని దాన్ని మర్చిపోయాను. గం.9.30లకు హోటల్‌కు వెళ్ళి టిఫిన్ చేసి అలా వాకింగ్ చేస్తూ, దగ్గరలో ఉన్న 'శివం' గుడికి చూడటానికి వెళ్ళాము. ఆ గుడి అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళాము. అది చాలా పెద్ద గుడి. ఒక ప్రదక్షిణం చేసి శివుణ్ణి దర్శించుకున్నాము. అక్కడి శివుని పేరు 'కపాలీశ్వరుడు', అమ్మవారి పేరు 'వారుణాంబికేశ్వరి' అని పూజారి చెప్పాడు. ఈలోపు ఆయనవచ్చి అక్కడ ప్రక్కగా 3 తలలతో ఒక విగ్రహం పెట్టి ఉంది, అది ఏమిటని నన్ను అడిగారు. నేను దక్షిణామూర్తిగానీ, బ్రహ్మగానీ అయిఉంటాడని అన్నాను.

పక్కనే ఉన్న దేవుడికి ఒక అమ్మాయి, ఆకుపచ్చ చీర కట్టుకుని, దీపం వెలిగిస్తోంది. ఆ అమ్మాయిని నేను ఇంగ్లీషులో "ఈ దేవుడెవరు?" అనడిగాను. దానికి ఆ అమ్మాయి "జురహరేశ్వర స్వామి అని, ఈ దేవుడివద్ద దీపం వెలిగించి నమస్కరిస్తే, అనారోగ్యం పోగొడతాడు. ఇక్కడ ఇది చాలా ముఖ్యం. హాస్పిటల్‌లో రోగులెవరైనా ఉంటే వాళ్ళు ఇక్కడికి వచ్చి దీపం వెలిగిస్తుంటారు" అని చెప్పింది. తను ఒక చిన్న క్యాన్‌లో నూనె, వత్తులు, అగ్గిపెట్టె అన్నీ ఒక పూలసజ్జలో పెట్టుకుని వచ్చింది. తననే 2 ప్రమిదలు, నూనె, వత్తులు అడిగి తీసుకుని, అనారోగ్యవంతులందరినీ తలచుకుని, వారి అనారోగ్యాన్ని పోగొట్టమని ప్రార్థిస్తూ, దీపం వెలిగించాను. ఆ అమ్మాయికి సుమారు 18 సం॥లు ఉంటాయి. కళ్యాణం బొట్టులా పొడుగ్గా బొట్టు పెట్టుకుని, ఆకుపచ్చని పట్టుచీర కట్టుకుని ఉన్నది "నీ పేరేమిటి?" అన్నాను. "పునీత" అంది. "ఏం చదువుతున్నావు?" అన్నాను. "ఎంసిఎ 2వ సం॥" అంది. నేను "మా అమ్మాయి కూడా ఎంసిఎ చదివింది" అన్నాను. చక్కగా మాట్లాడుతోంది. "నీకు మంచి భర్త వస్తాడు" అన్నాను. "థ్యాంక్స్, కానీ నాకు మంచి జాబ్ కావాలి" అన్నది. ఈయన "ముందు నీకు మంచి జాబ్ రావాలని దీవిస్తున్నాను" అన్నారు. "థ్యాంక్స్ అంకుల్" అన్నది.

గుడి మొత్తం చూస్తున్నాము. వాళ్ళ నాన్నగారు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేపర్లో ప్రెస్ రిపోర్టర్ అనీ, పేరు అన్నాదురై అని చెప్పింది. మధ్యమధ్యలో గుడి విశేషాలు, గోపురానికి ఎక్కడినుండి నమస్కరించాలో అన్నీ చెప్పి మాతో చేయిస్తోంది. "ఇక్కడ అమ్మవారిని సేవిస్తే వర్షాలు కురుస్తాయని నమ్మకం" అన్నది. అమ్మవారిని చూపించింది. అక్కడ చందనంతో అమ్మవారికి అభిషేకాలు చేస్తున్నారు. నేను "ఆంధ్రప్రదేశ్‌లో వానలు పడి, దసరా నాటికి చల్లని వాతావరణం ఏర్పడాల"ని దణ్ణం పెట్టుకున్నాను.

"నేను ఎదురుగా ఉన్న పెరుమాళ్ళు గుడికి వెళ్తున్నాను. మీరు ఇది చూసి అక్కడకు రండి. మీకోసం ఎదురు చూస్తుంటాను" అన్నది. పావుగంట తర్వాత ఎదురుగా ఉన్న పెరుమాళ్ళు గుడికి వెళ్ళాము. ఆ అమ్మాయి అక్కడే ఉంది. "రండి, రండి. ఇతను మా అన్నయ్య, ఇతను మా మామయ్య" అంటూ ఇద్దరిని పరిచయం చేస్తూ, మా ఇద్దరికీ రెండు చాక్లెట్స్ ఇచ్చి ఈరోజు నా పుట్టినరోజు అని చెప్పింది. నేను విష్‌చేసి చాలా సంతోషం అని చెప్పి, ఈయనతో ఒక ఫైవ్‌స్టార్ చాక్లెట్ తెమ్మని చెప్పాను. ఈయన బయటకు వెళ్ళారు. ఈలోపుగా ఆ అమ్మాయి నాకు "ఈయన చక్రత్తాళ్వార్ స్వామి, ఈయనను దర్శిస్తే మీకు అప్పులన్నీ తీరిపోతాయి" అంది. నేను "అప్పులబాధలో ఉన్నవాళ్ళందర్నీ ఋణవిముక్తుల్ని చేయి" అని నమస్కరించాను. తరువాత ఇది "వైకుంఠ ద్వారము. సం॥నికి ఒకసారే తెరుస్తారు. 10 రోజుల వరకు తెరచి ఉంచుతారు. అప్పుడు గనుక ఎవరైనా చనిపోతే వారు ఏకంగా స్వర్గానికి వెళ్తారని ప్రతీతి" అన్నది. "అలాగా" అన్నాను. ఈయన "విష్వక్సేనుడు. ఈయన ఇక్కడనుండి ఎవరేం చేస్తున్నారో చూస్తుంటాడు" అన్నది. ఆయనకు నమస్కరించాను. తరువాత అమ్మవారి వద్దకు తీసుకువెళ్ళింది. నేను ఈయన కోసం ఎదురుచూస్తున్నాను. ఈయనేమో గుడి అంతా తిరుగుతున్నారట.

అమ్మవారి గుళ్ళో పూజారి, ఈ అమ్మాయిని ఎంతో గౌరవంగా ఆహ్వానించి, వాళ్ళ గోత్రనామాలు అడిగి, నన్ను అడిగాడు. 'కాశ్యపస గోత్రం' అని చెప్పాను. "నాదీ అదే గోత్రం, ఈవిడ నాకు అక్క అవుతుంది" అన్నాడు. ఆ అమ్మవారిపేరు "కమలవల్లీ తాయారు" అని చెప్పాడు. నేను ఆశ్చర్యంగా అమ్మవారిపేరే అవడంతో చాలా ఆనందంగా చూస్తున్నాను. ఆయన పూజ చేయించాడు. ఈలోపుగా ఈయన చాక్లెట్ తెచ్చారు. అది నేను ఆ పిల్లచేతిలో పెట్టాను. ఈ మధ్యలో ఆ గుళ్ళో పూజారికి ఈ అమ్మాయి తన పుట్టినరోజని చెప్పి చిన్న చాక్లెట్ ఇచ్చింది. దానికి ఆయన "నాకు ఫైవ్‌స్టార్ చాక్లెట్ కావాలి. అదైతేనే తీసుకుంటాను" అన్నాడు. నేను ఆశ్చర్యపడ్డాను. నేను కూడా ఈ పిల్లకు అదే తెప్పిద్దామనుకున్నాను. ఆయన కూడా అదే అడిగాడు. అదీగాక 'ఈమె నా అక్క' అని నన్ను అంటున్నాడు. చాలా ఆశ్చర్యంగా అనిపించింది. ఈయన వచ్చాక మళ్ళీ అందరం కలసి అమ్మవారిని చూసి, అయ్యవారి పాదాలను దర్శించి, స్వామివారిని చూడటానికి ఆ లోపలి గుడికి వెళ్ళాము. ఆ అమ్మాయి "మీరు మంచిరోజు వచ్చారు. ఈరోజు నుండి ఇక్కడ బ్రహ్మోత్సవాలు జరుపుతారు. తిరుపతిలో మొదలుపెట్టి ఇవ్వాల్టికి మూడవరోజు. ఈ రోజు స్వామి హంసవాహనంపైన ఊరేగుతారు. ఎంతోమంది భక్తులు వస్తారు. రాత్రి గం.7.30లకు వస్తే మీరు చూడొచ్చు. ఇక్కడ కూడా తిరుపతిలో మాదిరిగానే ఉత్సవాలు జరుపుతారు. మీరు చాలా అదృష్టవంతులు" అన్నది. అప్పటిని నాకు బుర్ర వెలిగింది. ఓహో! ఉదయం నేను లేస్తూనే బ్రహ్మోత్సవాల ఊరేగింపును చూడాలని కోరుకున్నాను కదా! బహుశః ఇది దాని ఫలితమేమో అన్పించింది.

గుడి లోపల ఉత్సవ విగ్రహాలు ఉన్నాయి. ఒకప్రక్క హంస వాహనాన్ని అలంకరిస్తున్నారు. అక్కడి పూజారికి ఈ అమ్మాయి మా గురించి– ఈయన బ్యాంక్ ఆఫీసర్ అనీ, ఆంధ్రానుండి వచ్చామని పరిచయం చేసింది. ఆయన కూడా ఐ.ఓ.బి. చీఫ్ మేనేజర్‌ట. ఈయన బ్యాంక్ దగ్గరలోనే పనిచేస్తున్నారట. ఆయన చాలా సంతోషపడుతూ "మీరు కలవాల్సి ముఖ్యమైన అమ్మాయినే కలిశారు. ఈ అమ్మాయి ఎవరోకాదు. సాక్షాత్తూ లక్ష్మీదేవే. మీకు అన్నీ చూపించి, దర్శనాలను చేయిస్తోంది. అంటే, మీరు కూడా సామాన్యులు కారు. సాక్షాత్తూ పెరుమాళ్ళు– ఆండాళ్ళు అమ్మవార్లే. మీకు ఈ అమ్మాయికంటే మరెవ్వరూ గుడి విశేషాలు చెప్పలేరు. ఎందుకంటే, ఈ గుడికి సంబంధించిన విషయాలపై రీసెర్చ్‌చేసి, ఒక ప్రాజెక్ట్‌ను తయారుచేసి ఇంటర్నెట్‌లో పెట్టింది. ఎంతో భక్తిశ్రద్ధలు కలది. ఈ అమ్మాయిని శ్రీకృష్ణుడే వచ్చి పెళ్ళాడాలని దీవిస్తుంటాను" అన్నాడు. మరింత ఆశ్యర్యంతో ఆ అమ్మాయి బుగ్గలు నొక్కి ఆశీర్వదించాను.

"ఆ అమ్మాయి రీసెర్చ్ ఫలితంగా ఈరోజు సాక్షాత్తు ఆ భగవంతుడే మీ దంపతుల రూపంలో వచ్చి ఆశీర్వదించారు. ఆ లక్ష్మీదేవే ఈ పిల్లరూపంలో మీకు గుడిని చూపించి దర్శనాలు చేయించి, మిమ్మల్ని ఆనందపరచింది" అన్నాడు. నాకు మతిపోతోందనిపించింది. ఒక పళ్ళెం నిండా పువ్వులు, తులసీదళాలు పోసి, మా ఇద్దరి చేతికిచ్చి, వేదం చెప్పి, 2 పూలదండలను ఇచ్చి మా ఇద్దరితో ఒకళ్ళనొకళ్ళకు వేయించాడు. (బహుశః పెళ్ళి తర్వాత 30 సం॥లకు

మేమిద్దరం ఈ గుళ్ళో దండలు మార్చుకున్నాము) ఇప్పుడు వీరిద్దరూ "పెరుమాళ్ళు-ఆండాళ్ళు" అని అంటూ ఆ పిల్లను మాకు చాక్లెట్స్ ఇవ్వమన్నాడు. ఆ పిల్ల మళ్ళీ ఇచ్చింది. "మీరు ఆ అమ్మాయిని ఆశీర్వదించండి" అన్నాడు. మేము అలాగే చేశాము. ఈ పూజకు ముందు మా గోత్రనామాలు, పిల్లల నక్షత్రాల పేర్లు అడిగాడు. నేను చెప్పాను. "మరి ఈ పిల్లది చెప్పరేం. ఈమె కూడా మీ పిల్లే ఇప్పుడు" అని ఆ గోత్రం, నామం చెప్పి పూజ చేశాడు. తర్వాత దండలు తీసేస్తుంటే, "తీయకండి, లోపల పెరుమాళ్ళు కూడా సాక్ష్యం ఉండాలి కదా!" అన్నారు. లోపల స్వామి రంగనాయకులవలె పెద్దమూర్తి, శయనంలో ఉన్నారు. ఆ విశేషాలను చెప్తూ, హారతి ఇచ్చారు. ఆయన, ఇవన్నీ వింటున్న మిగిలిన పూజారులందరూ మాకు నమస్కరించారు. ఇదింకా విచిత్రంగా అనిపించింది. అప్పుడు నేను బాహ్యస్మృతిలోకి వచ్చినట్లుగా అనిపించి ఆయనతో...

"మా గురువులైన శ్రీ కమలమ్మగారి పేరే ఇక్కడ అమ్మవారి పేరు అవడం, ఆమె ఎప్పుడూ ఆకుపచ్చ చీరలోనే కనబడతారు కనుక ఈ పిల్లకూడా అదే రంగు చీరలో ఉండడం, ఆ ప్రక్క గుళ్ళో పురోహితుడు మీది మాది ఒకటే గోత్రం, ఈమె నా అక్క అనడం ఇవన్నీ నాకు మా గురుదేవుల అనుగ్రహం అనీ, ఈ పిల్లను చూసి అప్పుడే నేను అమ్మవారిగా తలచానని" అన్నాను. మన పీఠం గురించి కొద్దిగా విశేషాలు చెప్తే, ఆయన చాలా ఆనందపడి "మీకు వారి అనుగ్రహం పరిపూర్ణంగా ఉంది. మీరు ఇక్కడకు వచ్చారంటే తప్పకుండా ఆమె (కమలమ్మగారు) ఇక్కడ కూడా ఉన్నారని నాకనిపిస్తోంది. ఈరోజు ఇక్కడ కలిగిన అనుభవాలను అనుభవించడమే తప్ప, వర్ణించుకోవడం చాలా కష్టం. బయటకు చెప్పలేనివి. ఇవి కాకతాళీయాలు కావు. యధార్థాలు" అని చెప్పారు. అమితానందంతో బయటకు వస్తూ, ఆ పిల్ల అడ్రస్ తీసుకుని, నా ఫోన్ నెం. ఇచ్చి ఒకసారి మా హోటల్‌కు రమ్మన్నాను. ఆ పిల్ల తప్పక వస్తానని చెప్పింది. గుడి బయటకు వస్తోంటే ఆ పూజారి ఇ.ఒ. గారిని పరిచయం చేసి, "పెళ్ళి చేసుకోబోతున్నాడు, ఆశీర్వదించండి" అని నన్ను కోరాడు. మరొక పూజారి "మా ఇల్లు ఇక్కడే, మీరు తప్పక రావాలి" అన్నాడు. అందరూ సాయంత్రం ఉత్సవానికి రమ్మని పిలిచారు.

**04.10.2004**

మేము తిరుచ్చి (తమిళనాడు) వచ్చి 10 రోజులైంది. ఇంకొక 10 రోజుల్లో దసరాలకు ఏలూరు వెళ్ళాలి. ఇక్కడ గెస్ట్‌హౌస్ చాలా బాగుంది. ఇక్కడకు 10 గజాల దూరంలోనే పెద్ద అయ్యప్ప గుడి ఉంది. ఎంత అందంగా ఉందో మాటల్లో చెప్పలేనిది. విశాలమైన ప్రహరీ. గణపతి, అమ్మవారు, నవగ్రహాలు, నాగేంద్రుడు ఇలా అన్నీ గుళ్ళూ అందులోనే కట్టారు. ఇక్కడ రోజూ వాకింగ్‌కు వెళ్ళడానికి పార్క్, గ్రౌండ్‌లాంటివి లేవు. అందుకని రోజూ గుడికివెళ్ళి 45 ని॥లు ప్రదక్షిణలు చేస్తూ, అందరి గురించి కొన్ని నియమాలు చేస్తూ, సర్పదోషాలు, నవగ్రహదోషాలు ఉన్నవారికోసం వాటిని పోగొట్టేలాగ ప్రదక్షిణలు చేస్తున్నాను. ప్రతిరోజూ సాయంత్రం దినచర్య అలా గడుస్తోంది. మధ్యాహ్నంపూట స్వయంగా వండుకోవడం, పనివాళ్ళతో

ఇంగ్లీషులోనో, హిందీలోనో మాట్లాడటం, వాళ్ళు తమిళంలో మాట్లాడితే అది నేర్చుకోవడం, నాకంటే వాళ్ళే చక్కగా తెలుగును నేర్చుకుని, నన్ను మరికొంతకాలం ఇక్కడే ఉండమని అడుగుతున్నారు.

మనసులో ఎప్పుడో అయ్యప్పకోసం శబరిమలై వెళ్ళాలని, లేదా ఎవరినైనా పంపుతానని మొక్కుకున్నాను. కానీ ఈ గుళ్ళో ఇన్ని రోజులు దర్శనాలు, ప్రదక్షిణలు చేస్తూ ఆ బంగారురంగులో ఉన్న చిన్ని అయ్యప్పను చూస్తుంటే ఆ శబరిమలైలోని స్వామి నాకు ఇక్కడే దర్శనమిస్తున్నాడా అనిపించింది. ఆ దీపాలంకరణలో ఎంత అందమో చెప్పలేనిది. గోడల మీద మంచి మంచి వాక్యాలు రాశారు. చాలా బాగున్నాయి అవి. అందులో ఒకటి నాకు బాగా నచ్చింది.

*ఒకసారి రోడ్డుమీద ఒక వ్యక్తి, చలిలో గజగజా వణుకుతూ, ఆకలిగొన్న ఒక ముష్టివాడిని చూశాడట. "దేవుడా, ఎందుకు వీళ్ళను ఇలా పుట్టించావు? వాళ్ళకోసం ఏదైనా చెయ్యకూడదా?" అని అడిగాడట. ఒక నిమిషం తర్వాత దేవుడు "ఎందుకు చేయలేదు! చేశాను. అందుకేగా నిన్ను పుట్టించాను" అన్నాడట.*

ఇందులో ఎంత అర్థమున్నది?! ప్రక్కవాడికి మనం చేయగల్గిన దానిగురించి ఆలోచించకుండా దేవుడా నువ్వు చేయవచ్చు కదా అని అడుగుతున్నామంటే ఈ లోకంలో మనుష్యులెంత స్వార్థపరులు. ఈ విషయాన్ని రచయిత చాలా బాగా చెప్పాడు. ప్రక్కవాడిని ఆదుకోవడానికి మనం చాలు. అందుకే దేవుడు మనకు జన్మనిచ్చాడు. మనం చేయాల్సిన 'విధి' అదన్నమాట. మనం ఎందుకు పుట్టామో చెప్పాడు. చాలా స్పందించాను. భగవంతుణ్ణి చాలా తేలికగా, హక్కులాగా, చిన్న విషయాలను కూడా మన విధులేమిటో తెలుసుకోకుండా ఆయన్ని కోరికలు కోరుతుంటాం. ఈ ప్రశ్న అడగటంలో ఎంత అవివేకం? ఆయన సమాధానం ఎంత జ్ఞానబోధ? దీన్ని బట్టి మనం తెలుసుకోవాల్సిందేమిటంటే దేవుణ్ణి ప్రార్థించే ముందు లేదా ఏదైనా అడిగే ముందు అది సమంజసమైనదా? కాదా?, ఇది అడగవచ్చునా? లేదా అని తర్కించుకుని అడగడం మంచిదనిపించింది. అలాగే అక్కడ ఇంకొక వాక్యం పెట్టారు.

First deserve. Then desire – కోరిక కోరేముందు దానికి మనం తగిఉన్నామా? లేదా? కోరవచ్చా? లేదా? అన్యాయంగా కోరుతున్నామా? సబబుగా కోరుతున్నామా? అని ఆలోచించుకుని భగవంతుణ్ణి ఆ కోరిక కోరవచ్చును. ఆయన మనకు ఎదురుగా కనపడదు కాబట్టి, మనకు తోచిందల్లా కోరేస్తుంటాము. మనలాంటి వాళ్ళకోసం ఈ 2 లైన్లు:

*"Faith gives life. Faith gives Exaltation. Through genuine faith, one can accomplish anything. Complete faith and surrender are essential factors in the spiritual life. When we have them, all our troubles cease, not that they have been eleminated, but we have risen above them."*

చాలా అద్భుతంగా ఉంది కదూ! నిజమైన విశ్వాసం, నమ్మకం గురించి వ్రాశారు. అది ఉంటే ఏదైనా సాధించగలమని మనం నమ్ముతాము. నమ్మకంతో సాధించగలము కూడా. అలా

నమ్మకం మొదలై విశ్వాసం దృఢపడుతుంది. కానీ ఆధ్యాత్మిక జీవితమునకు కావలసినవి – ఒకటి నమ్మకం, రెండు శరణాగతి అని చెప్తున్నారు.

దీన్నిబట్టి మనకెలా అర్థమవుతోందంటే, మనం ఆధ్యాత్మిక జీవితంలోనే జీవిస్తున్నామని పూర్తిగా చెప్పలేము. అడుగు మాత్రమే పెట్టాము. మొదట నమ్మకం మొదలవుతుంది. అనుభవాలు ఎదురయ్యేకొద్దీ అలౌకిక ఆనందం మధ్యమధ్యలో కలుగుతుంటుంది. ఈవిధంగా అది దృఢపడి విశ్వాసం వరకు వస్తాము. ఈలోపుగా అన్ని లౌకికమైన కోరికలు వెంటవెంటనే తీరుతుంటే ఈ మెట్టుమీద కొంతకాలం ఉంటాము, లేక కొంత ఆలస్యమైతే నమ్మకం పడిపోవచ్చు లేదా సన్నగిల్లవచ్చు, లేదా గురువు/దైవాన్ని మార్చవచ్చు. ఏదైనా జరగవచ్చును. అలా కాకుండా కోరికలు తీరుతుంటే, మనం అదే మెట్టుమీద ఉంటూ వాటిని అనుభవిస్తూ, మళ్ళీ మళ్ళీ అలాంటి కోరికలే కోరుతూ ఆనందిస్తుంటాము. ఇదంతా కేవలం లౌకిక జీవనంలో మాత్రమే. కానీ నమ్మకం అనే దాన్ని అడ్డంపెట్టుకుని మనం చక్కని ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నామనుకుంటుంటాము. దీన్నిబట్టి చూస్తే మనం ఎక్కడున్నట్లు? అసలు ఇంకా లోపలికి ప్రవేశించనేలేదు. ఎలాగంటే, గుళ్ళోకి వెళ్ళగానే మంచి అగరుబత్తి వాసన వస్తుంటుంది. ప్రశాంత వాతావరణం ఉంటుంది. వాటిని చూడగానే మనం భక్తులమని గుర్తుకువచ్చి, నమస్కారం చేస్తూ, కోరికలు కోరడం మొదలుపెడతాము. ఆ అగరుబత్తి వాసన ఎలాగో, అది ఎంతదూరం వ్యాపిస్తుందో మనం కూడా అక్కడే ఉన్నట్టు. అంతేగానీ, ప్రాకారంలోనే దేవుడు కనబడడు కదా! ఒకవేళ కనబడితే మన లిస్ట్ తయారవుతుంది. అంతేకాని, ఆయన గురించి, ఆయనని చూడటం, ఆయన చెప్పేవి వినడం, ఆచరించడానికి ఆయన ఇచ్చే ఆధ్యాత్మిక జీవనంలోకి ప్రవేశించడంలాంటి ఆలోచనలు అసలు మెదడులో ఉండనే ఉండవు. ఆలోచించడానికి కూడా అస్సలు టైము దొరకదు. కాబట్టి మొదటిదాని గురించే (విశ్వాసం) పూర్తిగా ఆలోచించే అవకాశం లేనప్పుడు మరిక రెండో మెట్టు అయిన శరణాగతి అనేది మనకు చాలా దూరంలో ఉన్నది. పైగా అలాంటిది ఒకటి ఉందని మనకు తెలిసేటప్పటికి జీవుడు చాలా జన్మలు ఎత్తవలసి వస్తుంది.

సరే, మనకు విశ్వాసం గురించి ఎంతోకొంత అర్థమవుతుంది. రెండోది అస్సలు తెలీని విషయం కదా! Surrendance- పూర్తిగా భగవంతునికి అర్పించేయడం, శరణాగతి అనడం. ఇది కూడా ఆచరించినప్పుడే మనిషి జీవితం ఆధ్యాత్మికపరమైనదని చెప్పాలట. లేకపోతే దానికి అర్థంలేదు.

ఒక ఉదాహరణ. మనిషికి ఎప్పుడూ బాధలు, బాధ్యతలు, హక్కులు అన్నీ ఉంటాయి. బాధ కలగానే వెంటనే గురువునో, దేవుణ్ణో ఆశ్రయిస్తాము. బాధలనేవి నిరంతర ప్రక్రియ. అవి వస్తూనే ఉంటాయి, తీరుతూనే ఉంటాయి. మనసు కూడా దాంట్లోనే కొట్టుకుంటూ బాధవచ్చినప్పుడు విచారపడటం, తీరినప్పుడు సంతోషపడటం ఇవీన్న తాత్కాలికము. ఈరకమైన మొదటిమెట్టుపైనే ఉంటే శాశ్వతమైన ఆనందంకోసం పాటుపడాలనే ఆలోచన కలగడమే చాలా

కష్టం. ఈ స్థితి శ్లేష్మంలో ఈగలాంటిది. దానిలోంచి బయటపడటం చాలా కష్టం. ఈ స్థితిలో కూడా గురువును పట్టుకొనే ఉన్నాడు (స్వార్థపరంగానే కావచ్చు) కనుక, కనీసం తాత్కాలిక ఆనందం కలిగిన రోజుల్లోనైనా, ఈ రెండో మెట్టు గురించో, గురువు గురించో, బాధల గురించో కనీసం బలవంతంగానైనా ఆలోచనను తెచ్చుకుని ఆలోచిస్తూ ఉంటే, తొందరగానైనా 2వ మెట్టు ఒకటుందని తెలుస్తుంది లేదా గురువు తెలియజేస్తాడు. కనీసం దాన్ని పట్టుకోగలుగుతాము. అదృష్టవంతులు తొందరలో పట్టుకోగలిగితే ఆ లౌకిక బాధల్లోనే పడుతూ, లేస్తూ ఈ రెండవ సాధన కూడా చేయవచ్చుననిపిస్తుంది. 'శరణాగతి' అంటే కోరికలను కోరవద్దని కాదు సుమా. మన బాధలను దేవునికి కాక మరెవరికి నివేదిస్తాము? అదీ నిజమే.

ఒక శిష్యుడు గురువును నమ్మకంతోనే ఆశ్రయించి, కోరికలు కోరుతుంటాడు. అవి జరుగుతూ ఉంటాయి. ఇది మొదటి మెట్టు (విశ్వాసం). నాకు మగపిల్లవాడు పుట్టాలి అని కోరాడు అనకుందాము. వాడికి దేవునిపై ఉన్న విశ్వాసం వలన అది దక్కుతుంది. ఆ ఆనందం తాత్కాలికమే. తర్వాత వాడు సరిగ్గా పెరగాలని, ఆలోచించాలని, చదవాలని, మంచి ఉద్యోగం రావాలని, ఆరోగ్యంగా ఉండాలి అని వాపోతాడు.

అవి మన కోరికలు గనుక భౌతికంగా మన కష్టనష్టాలన్నీ మనం భరిస్తుంటాము. కష్టాలను పడుతూనే ఉండి ఆ ప్రేమలో ఉంటాము కనుక వాటికోసం ఆరాటం. అందులోనే ఆవేదనలు మొదలైనవి ఉంటాయి. అలాకాకుండా "ఎవరిని ఇస్తావో నీ ఇచ్ఛ, ఎలా ఉంటే అలా ప్రసాదించు" అని కోరామనుకోండి. ఎవరిని ఇచ్చినా సరే (తాత్కాలికంగా బాధపడినా) దాన్నే స్వీకరించడానికి మనసును సంసిద్ధత చేసుకోగలిగితే... అదే 2వ సాధన.

ఇప్పుడు మగపిల్లవాడు కాకుండా ఆడపిల్ల పుట్టిందనుకోండి. కొద్దిరోజులు మనసులో అసంతృప్తి వస్తుంది. 'నీ ఇచ్ఛ' అనుకుంటూ సాధన చేస్తూపోతే.... ఆ పిల్ల చదువు, నడవడిక, ఉద్యోగం, పెళ్ళి, పిల్లలు... అన్నీ జరిగిపోతుంటాయి. అందులో మీ కోరిక లేదు కనుక మీరంతగా పట్టించుకోవడం తగ్గుతుంటుంది. అలాంటప్పుడు అన్నీ భగవదిచ్ఛానుసారం జరుగుతున్నాయి అనుకుంటూ సాధన చేసే కొద్దీ మనసు లౌకికబాధల నుండి తప్పుకుంటూ ఉంటుంది. మనసు భగవంతునిపై లగ్నంకావడానికి, బోధనలు వినడానికి సంసిద్ధం అవుతుంటుంది. అప్పుడు ఆ పిల్లకు ఏం జరిగినా, జరగకపోయినా కూడా మనసుకు అంతగా బాధ కలుగదు. పైగా కొంతకాలానికి ఏకొంచెం జరిగినా కూడా చాలా ఆనందం కలుగుతుంటుంది. రెండవ పద్ధతిలో కలిగే ఆనందానికి, మొదటి పద్ధతిలో కలిగే ఆనందానికి తేడా ఉంటుంది. గమనించండి. నేను చెప్పేది అర్థమవుతోందా?

మొదటి పద్ధతిలో ఆనందం కలిగినా కూడా వెంటనే మనసు మరొక కోరికపైకి వెళ్ళిపోతుంది. రెండవ పద్ధతిలో కలిగిన ఆనందంలో, భగవంతునిపై కృతజ్ఞత కలగడం వలన వచ్చిన ఆనందం కాబట్టి అది శాశ్వత ఆనందంగా మారిపోయే అవకాశం ఉంటుంది. అలా మొదలై, నెమ్మదిగా

ఈ లౌకిక సంబంధాలను వదిలేసి, సమస్యలు వచ్చినప్పుడు భగవంతుని పరిష్కారంవైపు ఆలోచనలు మళ్ళి, ఆయన లీలలు అర్థంచేసుకునే అవకాశం కలుగుతుంది. అప్పుడు సమస్యలు ఉండవని కాదు. అవి ఉంటూనే ఉంటాయి. కాని ఎలా వస్తున్నాయో, ఎలా పోతున్నాయో మీరు పట్టించుకునే స్థితిలో ఉండరు. ఎందుకంటే, లౌకికం నెమ్మదిగా dilute అయిపోయి దాని వెనుక ఉన్న అదృశ్యహస్తాన్ని గురించి ఆలోచనలు పెరుగుతాయి. ఇది రెండవ పద్ధతిలో ఉండే సాధన.

వినడానికి, రాయడానికి చాలా తేలికగానే ఉంటుంది కానీ ఆచరణలో చాలా కష్టం. అతికష్టమైన విషయాలను పారద్రోలి, వెలుగును చూపించడానికే కదా గురువు ఉన్నది. ఆలస్యం చేయకుండా మొదటి మెట్టుమీద ఉంటూనే, రెండవ మెట్టు గురించి సాధన చేయవచ్చుకదా! అంటే ఈ factors ఒకేదాంట్లో ఉన్నాయన్నమాట. కాబట్టి సాధన ఈ రెండింటిని కలిపి చేయవచ్చు. కానీ ఈ వాక్యంలో ఆధ్యాత్మిక జీవితానికి ఈ రెండూ కావాలన్నారు. మనం వీటిని రెండు అనుకోకుండా, అంతా ఒకటే అనుకుని తేలికగా సాధన చేయవచ్చునేమో ప్రయత్నించండి. ఎందుకంటే, మనకు ఎలాగూ గురువు అనుగ్రహం ఉంది. ఏమంటారు?

అసలు కోరికలు లేకుండా సాధుపుంగవులుగా ఉండమని కాదు నా ఉద్దేశ్యం. ఏదైనా సరే మనస్ఫూర్తిగా అనుకోవాలి. ముందు మనసు పూర్తిగా ఉండదు. కానీ ఏం చేస్తున్నారు? ఫలితాలు ఎలా ఉంటున్నాయి? ప్రతిచర్య వెనుక ఉన్న ఆంతర్యమేమిటి? ఎలా జరుగుతున్నదీ? అని వివరంగా అర్థంచేసుకునే ప్రయత్నం చేస్తే ఎంత ఆనందం కలుగుతుందో చెప్పలేము. భగవంతుడు మనకు ఎప్పుడూ మేలే చేస్తాడు, కీడుచేసి బాధపెట్టాలనే మతం కాదు ఆయనది. మనం చేసుకున్న వాటినే మనకు తిరిగి ప్రసాదిస్తున్నాడు. ఆయన కరుణామూర్తి కనుక బాధ కలుగకుండా, సునాయాసంగా మనచేత అనుభవింపచేస్తాడు. ఆ చేసే విధానాలపై మనం కొంచెం దృష్టిసారించి, నిదానంగా పరిశీలిస్తుండాలి. ఇది కూడా సాధనలో ఒక భాగమే. అలాంటప్పుడు మాత్రమే ఆ లీలలను మనం అర్థంచేసుకోగలిగే జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు.

మనం ఒక అడుగు ముందుకువేస్తే, ఆయన 10 అడుగులు ముందకువేసి మనకు సహాయం చేస్తాడు. అదీ ఆయన విధానం. కాబట్టి కోరికకు గట్టిగా బలపడిపోవద్దు. ఏదిచ్చినా సరే, వెంటనే సమాధానపడిపోండి. అది ఆయన ఎందుకిచ్చాడో గమనిస్తూ ఉండండి. తరువాత సత్ఫలితాలను పొంది, కృతజ్ఞతలను తెల్పండి. ఆ తెర వెనుక జరుగుతున్న ఉపాయాలు, వాటి ఆచరణలూ అన్నీ గమనిస్తూ, ఆయన ప్రజ్ఞ తెలుసుకునే ప్రయత్నం చేయండి (లౌకికంగానే అర్థంచేసుకుంటూ ఉండండి). అది ఎంత శాశ్వతమైనదంటే నిర్విరామంగా ఆనందాన్ని పొందుతూనే ఉండగలుగుతారు. ఇంకా కోరికలు (లౌకికంగా) ఎలా తలెత్తుతుంటాయో, అలాగే ఇంకా భగవదానందాన్ని పొందాలనే ప్రయత్నంలోకి వెళ్ళిపోతారు. అది ఒక దాహంగా మారిపోయినా ఆశ్చర్యపడక్కర్లేదు. ఇది నిజం. 24 గంటలూ ఈ ప్రయత్నంలోనే ఉండిపోతారు కనుక లౌకిక విషయాలను గమనించడం, స్పందించడం, బాధపడటం, సంతోషపడటంలాంటి వాటికి సమయం ఉండదు. అప్పుడు మొదటి మెట్టునుండి రెండవ మెట్టుపైకి ఎప్పుడు వెళ్ళారో

కూడా మీరు తెలుసుకోలేరు. ఈ విధానాన్ని అవలంబిస్తే మనకు తెలియకుండానే, ఎక్కువ సాధన చేయకుండానే ఇంద్రియ నిగ్రహం కూడా అలవడుతుంది.

**13.11.2004**

ఉదయం చిన్నదత్తు ఫోన్ చేసి, వాడి ఇంట్లోకి అద్దెకు వచ్చినవాడు బ్రోతల్‌హౌస్ నడుపుతున్నాడనీ, 15మందిని అరెస్ట్ చేశారనీ, తనకి కూడా ప్రాబ్లమ్ అవుతుందనీ కంగారుపడుతూ చెప్పాడు. అప్పుడు నేను "సరేలే. ఏం ఫర్వాలేదు, మనకేం రాదులే, పోలీసులకు నాకేం తెలియదని చెప్పు, మీరే వాడిని ఖాళీ చేయించమని అడుగు" అని చెప్పాను. వాడు సరే అన్నాడు. అప్పటినుంచీ అంతకుముందు 3, 4 రోజులనుండీ మనసులో ఏదో దిగులు, అర్థంలేని ప్రశ్నల పరంపరలు, అంతుబట్టని సమాధానాలు, ఇవీ అని చెప్పడానికి వీల్లేకుండా మనసు అంతరాంతరాళాల్లోకి వెళ్ళే ప్రయత్నం చేయడం. కొంచెం దూరం వెళ్ళగానే వెనక్కు రావడం. దానివలన మనసు అస్తవ్యస్తంగా మారింది. అది లౌకికమేమో అనుకున్నాను. (గత 3, 4 నెలలుగా పిల్లాడు, నేను ఆయనకు దూరంగా ఉండడంవలన) కానీ ఇప్పుడెందుకు? ఆయన దగ్గరే ఉన్నాను కదా? హాయిగా ఎసి రూమ్, టివి, టైమ్‌కి ఎక్సర్‌సైజ్, ఆహారం మొ॥వి. లౌకిక సమస్యలు వినడం లేదు. ఫోన్ల ఇబ్బంది లేదు. మనస్సెంతో ప్రశాంతంగా ఉండాల్సింది పోయి, చిక్కులముడిలో ఇరుక్కున్నట్లుగా ఉంది. అందులో ఎన్నో వేల ప్రశ్నలు. సమాధానాలు. ఏమీ అర్థంకా దిగులుగా ఉండిపోయింది. అందులోంచి బయటపడ్డ ఒక ప్రశ్నను వ్రాస్తున్నాను.

దత్తు నుండి ఫోన్ వచ్చాక ఈ ప్రశ్న ఉత్పన్నమైంది. దత్తు నన్ను (కమలాంబికపై నమ్మకం) అడిగి నియమం తీసుకున్న తర్వాతనే కదా ఇల్లు అద్దెకు ఇచ్చాడు. అంటే నేనే ఇవ్వమన్నాను కదా! పూర్తిగా భారం నామీదే వేసి ఇచ్చాడు. మరి అలాంటప్పుడు ఇలాంటి కేసులో ఎందుకు ఇరుక్కోవడం జరిగింది? అసలే పోలీసులంటే వాడికి భయం. అనవసరమైన గొడవలు, ఎందుకిలా జరిగింది? అది అమ్మమ్మగారి వాక్కు కదా! ఒక్కొక్కసారి ఇంకొంత మంది (బాబు) కేసులలో కూడా ఇలా జరిగింది. మరి ఆవిడ వాక్కు ఎందుకిలా negative ఫలితం ఇవ్వడం జరిగింది? అని బాగా లోతుగా వెళ్ళి పరిపరివిధాలుగా ఆలోచించాను. ఒకవేళ నేను గానీ సాధనలో ముందుకు వెళ్తున్నాను అనే 'ఇగో' (Ego)తో వాక్కును దుర్వినియోగం చేసినప్పుడు ఇలాంటి ఫలితాలు వస్తున్నాయా? అని స్వయంవిశ్లేషణ చేసుకున్నాను. అమ్మమ్మగారి వాక్కు అయితే అలా ఎందుకు జరుగుతుంది? ఈ ఆలోచన ఎంతో అసంతృప్తిగా, భయంగా, దిగులుగా, అసహనంగా అనేక విధాలుగా నా మనసును కలవరపెడుతోంది. శిష్యుడివైపు నుండి ఆలోచిస్తే (భౌతికం) నన్ను నమ్ముకున్నందుకు వాడికి ఇంత సమస్యా! నా పొరపాటు వల్ల అయిందేమో అన్న బాధ నన్ను తినేస్తోంది. ఆరోజు మధ్యాహ్నం వాడు అందులో చిక్కుకోకుండా "నియమం" చేస్తే తప్ప ఆ దిగులు తీరలేదు. కొంచెం కుదుటపడ్డాను.

సమాధానం కోసం ఆ రోజు సాయంత్రం అమ్మమ్మగారి జీవిత చరిత్రను తిరగేస్తున్నాను.

అందులో ఆమె తండ్రిగారు కూడా "ఏమిటి, అలా అన్నానా? నాకేం తెలీదు" అనడం జరుగుతుంది. అదేవిధంగా అమ్మమ్మగారు కూడా "నాకేం తెలీదమ్మా. ఆవిడే మీకు చెప్తుంది. అలా చేసుకోండి" అనడం జరుగుతుంది. అదేవిధంగా పరిష్కారం ఇవ్వడం, ఆ వాక్కు ఏది చెప్తే అదే జరిగిందని శిష్యులు మళ్ళీ చెప్పేవరకూ నాకూ తెలీదు. ఈ పరంపర ఇలానే కొనసాగుతోంది. ఆయన వచ్చాక ఈ విషయం గురించి ఆయనతో మాట్లాడాను. దానికి ఆయన "ఆ వాక్కు నీది కానప్పుడు అది తప్పు జరిగిందా, ఒప్పు జరిగిందా అన్న సందేహం నీకెందుకు ఉండాలి? అది అవతలవాడికీ, ఆమెకీ సంబంధించినది. అందులో ఉన్న కష్టనష్టాలు వాళ్ళిద్దరివీ. మధ్యలో నీకెందుకు? అది నీకు అనవసరం. అలాంటి సందేహం రావడమే తప్పు, నువ్వేం చేయగలవు? అలా అవతలివాడి కష్టసుఖాల వెంట నీ మనస్సు పరుగుపెట్టడం అనవసరం. దానికి ఎవ్వరూ ఏమీచేయలేరు. అయినా నీ ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్తుంది. ప్రశ్న ఎక్కడ పుట్టిందో సమాధానం అక్కడే దొరుకుతుంది. సమయం కోసం వేచిచూడడం తప్ప ఏమీ చెయ్యలేము" అన్నారు. ఈ విషయం పక్కనపట్టేసి డిన్నర్‌కు వెళ్ళాం. రాత్రికి మళ్ళీ ఆలోచించాను. చివరకు ఒక నిర్ణయానికి వచ్చాను. ఈ లౌకిక విషయాలేవీ నన్ను పట్టుకోకుండా, మనస్సుకి నిలకడను ప్రసాదించి, నేను చేయాల్సిన పనులేమైనా ఉంటే వాటిని ప్రసాదించమని వేడుకుంటూ దానికోసం 'నియమం' మొదలుపెట్టాను.

అంతే, మర్నాడు ఉదయం గం.7.30లకు దత్తునుండి ఫోన్ వచ్చింది. "నేను, ఆంజనేయులుగారూ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ని కలిసాము. వాడిమీదే కేసు పెట్టి, మొదటిసారి కాబట్టి నామీద ఏ చర్య తీసుకోకుండా, ఒక పోలీసును పంపి వాడిచేత ఇల్లు ఖాళీ చేయించమంటే, వాడు నేనే వెళ్ళిపోతానని చెప్పి సాయంత్రానికే ఇల్లు ఖాళీచేశాడని" చాలా ఉద్వేగంతో చెప్పాడు. "నేను నీ గురించి నియమం చేశానురా" అని చెప్పాను. వాడు ఆశ్చర్యపోతూ, ఆనందంతో మళ్ళీ చెప్పాడు. నాకు భారం తగ్గి కొంచెం మనశ్శాంతిగా ఉంది. కొద్దిగా excile అయ్యి సంతోషంగా ఈయనకు ఈ విషయం చెప్పాను. విని ఊరుకున్నారు.

పొద్దున ఆయన బ్యాంక్‌కు వెళ్ళాక విశ్లేషణ మొదలుపెట్టాను. మావారు చెప్పిందే నాకు కావల్సిన సమాధానం అనిపించింది. ఇంత సమస్యలో ఇరుక్కున్నా కూడా, వాడు కమలాంబికను నమ్మి, అడిగి, నియమం చేసి ఇచ్చాడు కనుక వాడికేమీ నష్టం కలుగలేదు. సమస్య ఎలా వచ్చిందో అలాగే సులభంగా పరిష్కరించబడింది. అలాకాకుండా వాడుకూడా నాలాగే ఆలోచించి, చెప్తే మాత్రం ఏమౌతుంది? చెప్పే ఇల్లు అద్దెకు ఇచ్చాను కదా! మరి ఎందుకిలా జరిగింది? అని నాకు చెప్పకుంటే నియమం చేయడం జరిగేది కాదు కదా! మళ్ళీ చెప్పడమే వాడి నమ్మకం. 5, 6 ఏళ్ళనుండి ఇల్లు అద్దెకు ఇస్తూనే ఉన్నాడు. ఎప్పుడూ ఇలా జరగలేదు. ఇప్పుడే ఎందుకిలా జరగడం? మంచివాళ్ళే రావచ్చు కదా! ఈ కేసు హడావిడి అంతా ఎందుకు? అని ప్రశ్నించుకుంటే, వాడికి ఈ సమయంలో ఏదో పెద్ద కేసులో పడి కొట్టుకోవాల్సినట్లుగా జరగాల్సి ఉన్నది. అమ్మమ్మగారు ఈ విషయాన్ని 3, 4 నెలల ముందే వీడి రూపంలో ఆ ఇంట్లోకి దించి, గొడవ పెద్దదే కానీ, వాడికేం సంబంధం లేదు. అయినా ఓనర్‌గా వాణ్ణి కూడా ఇందులో దింపి,

ఒకసారి పోలీస్ స్టేషన్‌కు వెళ్ళేలా చేసి, ఆ 'పెద్ద సమస్య' నుండి వీడిని తప్పించింది.

ఈ మాస్టర్‌ప్లాన్స్ మనకు అర్థంకావు కదా! అది ఆవిడకూ, వాడికే. భగవంతునికి భక్తునికీ సంబంధించినటువంటి నమ్మకంపై ఆధారపడ్డ విషయం కాబట్టి ఆయన చెప్పినట్లు నాకు ఇది అనవసరమైన విషయం. నేనెందుకు? ఆ వాక్కు అవునా, కాదా? నా జోక్యం తప్పా? అక్కర్లేదనిపించింది. **నా సంబంధం నియమాలు ఇవ్వడం, అవసరమైతే చేయడం అంతవరకే** తప్ప ఎక్కువ ఆలోచించడం తప్పనిపించింది. ఇది ఇంకొక జ్ఞానోదయం. అవతలి వాడితో వాడి కష్టసుఖాల వెంట నేను కూడా పరుగెత్తడం అనే జోక్యం కూడా నా మనస్సనే సముద్రం అల్లకల్లోలం అవడానికి కారణం అనిపించింది. కాబట్టి ఇంకెప్పుడూ వాడితో నవ్వడం, వాడితో ఏడవడం నా పనికాదు అనే విషయం జ్ఞానోదయమైంది. బహుశః జ్ఞానోదయం కావాలని రాత్రి నియమం తీసుకున్నానేమో, దాని ఫలితమే ఈ విషయాన్ని ఇలా తెలియజేయడం అనిపిస్తోంది.

**01.12.2004**

నవంబర్ 5, 2004న హైదరాబాద్ నుండి 8 మంది కలిసి, సింగపూర్ ట్రిప్‌కు వెళ్ళాము. శ్రీలంక, సింగపూర్, థాయ్‌లాండ్ మలేషియా అన్నీచూసి, మేము బెంగుళూరు వచ్చేశాము.

తరువాత నవంబర్ 22న కోజికోడ్ (కేరళ) చేరి హోటల్లో దిగాము. హోటల్, భోజనం అన్నీ బాగున్నాయి. నేను దగ్గరలో ఉన్న శివుని గుడికి రోజూ వాకింగ్‌కి వెళ్తున్నాను. కార్తీకమాసం అంతా ఈ విధంగా శివుడు దర్శనమిస్తున్నాడు. 'కార్తీక పౌర్ణమి' రోజు ఇక్కడ గుళ్ళో చాలా విశేషాలంకరణతోపాటు గుడి అంతా దీపాలంకరణ కూడా చేశారు. ఆ రోజు శుక్రవారం అవ్వడం వలన ఉపవాసం, దైవదర్శనం చాలా సంతోషం కల్గించాయి. ఆఖరి ఆదివారం ఈ బ్రాంచ్ రీజనల్ మేనేజర్ ఒకరు మమ్మల్ని తాజ్‌మహల్ హోటల్‌కు డిన్నర్‌కు పిలిచారు. ఆయన పెద్దాయన. ఆయనకు 58 ఏళ్ళు ఉండచ్చు. చాలా పండులాగా ఉత్సాహంగా ఉన్నారు. నాతో చాలాసేపు మాట్లాడి, "నేను మిమ్మల్ని వదలను, మళ్ళీ ఎలాగైనా సరే కలుస్తాను. మీ చేతి వంట తింటాను" అని అన్నారు. రమ్మని ఆహ్వానించాను.

బెంగుళూర్ నుండి కాశీ వెళ్ళాము. ఉదయం దిగి ఆటోలో గెస్ట్‌హౌస్‌కు వెళ్తూ, ఇక్కడి 'శివపార్వతులు' ఈ కార్తీకమాసంలో మనకు కనబడితే బాగుణ్ణు అనుకున్నాను. మళ్ళీ మధ్యాహ్నమే ఢిల్లీకి మా ప్రయాణం. అందుకని తొందరగా తయారై 9 గం॥లకు కాశీ విశ్వేశ్వరుని గుడికి చేరుకున్నాము. ఆ గుడి ముందు ఒక మనిషి నిలబడి ఎడమవైపు నుండి లోపలికి దర్శనమునకు వెళ్ళమన్నాడు. చాలా రద్దీగా ఉన్నది. సరే... గుళ్ళో ఎడమవైపు ఒక అరుగు ఉంటే అది ఎక్కాము. అక్కడే నాకు దర్శనమైనది. ఒకవైపు సత్యనారాయణ, మరొకవైపు అమ్మవారు మహాలక్ష్మి విగ్రహాలు చాలా అందంగా ఉన్నాయి. ఆ సత్యనారాయణ విగ్రహం అచ్చం మా తాతగారైన సత్యనారాయణగారిలాగే ఉన్నది. ఆ నవ్వు, ముక్కు చూడగానే అంతా తాతగారిదే అన్పించింది. వెంటనే ఆ విగ్రహాన్ని ఈయనకు చూపించి "అలాగే ఉన్నదా?" అనడిగాను. "అవును" అన్నారు.

ఒకసారి నాకు భాస్కరరావు (ఇండియన్ బ్యాంక్) మన అమ్మమ్మగారి బీజాక్షరములను తిరగవేస్తూ "మహాలక్ష్మీ మంత్ర బీజాక్షరము"లే అని అధర్వణ వేదములో 64వ శ్లోకమనుకుంటాను అని ప్రత్యక్షంగా ఆ పుస్తకం తీసుకొచ్చి, ఆ బీజాక్షరములను కమలాంబికా నామ బీజాక్షరముతో సరి చూపించారు. కాబట్టి ఈ మహాలక్ష్మి, సత్యనారాయణగార్ల దర్శనమే నాకు శివపార్వతుల దర్శనము అని గ్రహించి ఎంత పరమానందభరితురాల్ని అయ్యానో తెలియదు. లోపలికి వెళ్ళాక విశ్వనాథ దర్శనము కూడా నేనంత ఆసక్తిగా చెయ్యలేకపోయాను. మనసంతా హాయిగా, తేలికగా అయిపోయింది. శివపార్వతులెవరు? కమల, సత్యనారాయణగార్లు ఎవరు? ఏ క్షేత్రమునకేగినా, నా గురువే నాకు అన్ని రూపములలోను అక్కడ ఉంటున్నట్లుగా ఎంత బాగా తెలియజేశారు. అసలు కాశీలో ముఖ్యమైన గుడిలో ముందే వీరి దర్శనమవ్వడం ఏమిటి? అంటే నేను ఆ క్షేత్రపాలకులైన శివపార్వతుల దర్శనం కావాలనుకుంటే వారి కంటే ముందు వీరే దర్శనమిచ్చారు. అంటే వారికి, వీరికి ఏ తేడా లేదన్నమాట. వీరే ఆ రూపంలో అక్కడ ఆ క్షేత్రంలో వున్నారని తెల్సుకుంటే ఎంత చక్కని జ్ఞానోదయం ఇది. శిష్యుడు మూర్ఖంగా ఏవో రెండు రకాలు ఉన్నాయనుకుని, అజ్ఞానంతో కోరుకుంటే మాత్రం– గురువులున్నది ఈ 'మాయ'ను తొలగించి, జ్ఞానబోధ చెయ్యడానికే కదా ఉన్నది. అందుకనే అమ్మమ్మగారు ఎంత సులభంగా జ్ఞానబోధ చేశారో చూడండి! ఇలా కాకుండా మరోలాగ నాకు వారు దర్శనమిచ్చినా నేను తృప్తిచెందలేను. నా మనసు ఆమెకు తప్ప మరెవరికి ఎరుక? అందుకే అక్కడ ఆవిడ ప్రత్యక్షమై, తాతగారి ముఖంతో ఉన్న సత్యనారాయణ దర్శనమే, క్షేత్రంలో వున్న 'శివ' దర్శనమని తెలుసుకున్నాక విశ్వేశ్వరస్వామి లింగాన్ని దర్శించినా కూడా నాకు సత్యనారాయణస్వామి ముఖమే కనిపించింది. (తాతగారిది కూడా 'శివాంశ' అవతారమని మనకు అమ్మమ్మగారు చెప్పిన ఉదంతములను బట్టి, బాలాజీ, శ్యామలరావుగార్లు కూడా వారికి 'శివ పంచాక్షరి'ని ఉపదేశించడం – ఇవన్నీ మనకు తెలుసు కదా!)

తరవాత విశాలాక్షి గుడికి వెళ్ళాము. దర్శనమవ్వగానే భోజనం చేసి 2 గంIIలకు మేము స్టేషన్‌కు వచ్చేశాము. రైలు 3గంIIలకు. ఏ ప్లాట్‌ఫామ్ అని అడిగితే అతను "ఈ ట్రైన్ క్యాన్సిల్ అయ్యింది. రాత్రి 10 గంIIలకు, ఇప్పుడు కాదు" అన్నాడు. సరే... కంగారుగా ఈయన కౌంటర్ దగ్గరకు వెళ్ళారు. నేను సామాన్లు చూస్తూ అక్కడే నిలబడ్డాను. మరునాడు తెల్లవారుఝామున 5 గంIIలకు ఢిల్లీకి చేరాలి. రైలు లేకపోతే మాకు 9 గంIIలకు అక్కడి నుండి బొంబాయి విమానం ఉంది. ఆ మరునాడు బొంబాయి నుండి కాలికట్‌కు టిక్కెట్లు రిజర్వ్ అయి ఉన్నాయి. ఈ రైలు లేకపోతే మేము ఉదయం 5 గంIIలకు ఎలా ఢిల్లీ చేరుకోగలము? రాత్రి 10 గంIIలకు ఎక్కితే మరునాడు మ. 1గంIIకు చేరితే ఈ టిక్కెట్లు, ఆ ప్రోగ్రామ్ అంతా రద్దవుతుంది. ఎలా అనుకుంటూ నేను కమలాంబికా మంత్రజపాన్ని చేస్తూ, మరేమీ ఆలోచించకుండా, "అమ్మమ్మా, ఈ క్షేత్రంలో అడుగుపెట్టగానే చక్కగా కన్పించి, ఆశీర్వదించావు కదా! దీన్ని వదిలి వెళుతున్నప్పుడు కూడా అంత చక్కని సంతోషాన్ని వదలకుండా ఉండేలాగా చెయ్యచ్చు కదా" అనుకుంటూ ఆపకుండా

మంత్రం చేస్తున్నాను. 2.30..., 3.00..., 4.00..., 4.30 గంIIలు అయ్యింది. నేనలాగా నిల్చునే ఉన్నాను. ఢిల్లీకి వెళ్ళే రైళ్ళు రెండు వెళ్ళిపోయాయి. సరిగ్గా 4.30గంIIలకు North East Express ఢిల్లీ వెళ్ళేది వచ్చింది. నా ముందే టి.సి. టిక్కెట్లు చెక్ చేస్తున్నాడు. ఈయన ఎక్కడున్నారో తెలియదు, ఏమవుతోందో తెలియదు. 10నిIIలకు పరిగెత్తుకుంటూ వచ్చి "పదా! ఈ ట్రైన్‌లో ప్రయత్నిద్దాం అన్నారు". "ఇదిగో, టి.సి ఇక్కడే ఉన్నాడ"ని చూపించాను. "రెండు ఎ.సి. బెర్తులు ఉన్నాయా?" అన్నారు. చెయ్యి చాపాడు. రు.500 ఇచ్చారు. "లోపలికి వెళ్ళి 22, 23 సీట్లలో కూర్చోండి. రు.2,200లు కట్టండి" అన్నాడు. సరే అని ఆదరాబాదరాగా రైలు ఎక్కాము. లోపలికి వెళ్ళాక తెల్సింది. ఆ రైలు 9 గంIIలు ఆలస్యంగా ఇప్పుడొచ్చిందిట. ఈ రాత్రి 9 గంIIలకు చేరాల్సింది, రేపు ఉదయం 5 గంIIకు చేరుతుంది అన్నాడు టి.సి. హమ్మయ్య అనుకుని రు.2,200లు కట్టి బెర్త్ తీసుకున్నాము. ఆ విధంగా అమ్మమ్మగారు మా ప్రోగ్రామ్ గందరగోళం కాకుండా సునాయాసంగా పరిష్కారం చేశారు. (మనసులో బొంబాయి వెళ్ళలేమేమో... భవానీని చూడాలి? ఎలా అనుకున్నాను) సమస్య తీరిపోయింది. భవానీతో మాట్లాడి, బొంబాయి నుండి కోజికోడ్ వెళ్ళాము.

కోజికోడ్ నుండి ఉదయం 8.30 గంIIలకు కారుని రమ్మని చెప్పారు. ఇక్కడకు గంట దూరంలో ఉన్న 'వడికిరి' భగవతి ఆలయానికి చూడటానికి బయల్దేరాము. భగవతి ఆలయం గురించి గతవారం Indian Expressలో పడిందిట. అక్కడకు శంకరాచార్యుల వారు వెళ్ళారని, అప్పుడు అమ్మవారు ఆయనకు దర్శనం ఇచ్చి, భూమిలోకి వెళ్ళిపోయిందని, ఇప్పుడు అక్కడ ఒక ఖాళీప్రదేశంలా ఉంటుంది అదే దర్శించుకోవాలని వ్రాశారట. ఈయన అది చదివి నాకు ఆ ఆలయం చూపించాలని బ్యాంకుకు పర్మిషన్ పెట్టి, నన్ను తీసుకెళ్ళారు. సుమారు గంటన్నరసేపు ప్రయాణం చేసి, ఆ గుడికి చేరుకున్నాము. అది చాలా పెద్ద గుడి. అమ్మవారు శంఖం, చక్రం, వరద, అభయములతో ఏలూర్లోలాగా (చిన్న విగ్రహం, వెండిది) ఉన్నది. అలాంటివే చిన్న చిన్న చేతులు, చూడగానే మనసు ఆనందపడింది. ఈయన ప్యాంట్‌తో ఉన్నందువల్లలోపలికి రాకుండా బయటనుండే అమ్మవార్ని చూడాల్సి వచ్చింది. నేను లోపలికి వెళ్ళి పూజారిని ఆ గుడి విశేషం చెప్పమని అడిగాను. ఆయన "ఈ భగవతి దక్షిణ కేరళ నుండి వచ్చింది. చాలా విశేష పూజలు జరుగుతాయి. శాస్త్రబద్ధంగా ఇక్కడి పద్ధతిలో పూజలు చేస్తామని" మళయాళంలో చెప్పాడు. సరే... ఇంకో ఆయన నాకు ఇదంతా హిందీలో చెప్పాడు. మేము చూద్దామనుకున్న గుడి ఇది కాదని తెల్సుకున్నాక నాకు కొంచెం ఈయన బాధపడతారేమోనని అన్పించింది. పైగా బయటే నిలబడ్డారు. పక్కనే పురాతన శివాలయం, దాని పక్కనే విష్ణాలయం వరుసగా మూడు పెద్ద పెద్ద గుళ్ళు ఉండడం విశేషంగా ఉంది. వాటిని కూడా దర్శించాము.

ఈయన ఈలోపుగా అక్కడ ఎవరో కౌంటర్‌లో కూర్చున్న (ఇండియన్ బ్యాంక్‌లో పనిచేసేవారు) ఆయనతో ఈ విషయాన్ని చెప్పి, ఆ గుడి ఎక్కడుంది? ఇదే ఆ గుడి అనుకుని వచ్చామని చెప్పారుట. మేము వచ్చేస్తుంటే ఒక ఇద్దరు ఇంగ్లీషులో మాట్లాడుతూ, "ఆ ఆర్టికల్ ఏ రోజు

పేపర్‌లో వచ్చింది సార్? మేమే కొంత మంది కమిటీలాగా వేసుకుని నిర్వహిస్తున్నాం. ఈరోజే ఆధునీకరణ కోసం ఒక కొత్త కౌంటర్ తెరిచాము. కొద్దిగా విరాళం ఇవ్వండి సార్" అనడిగారు. నేను "ఏవైనా ఇవ్వండి" అన్నాను. మధ్యలో ఆ రెండో వ్యక్తి ఆ గుడి చరిత్రను ఈ విధంగా చెప్పాడు "కనీసం 1000 సం॥లకు ముందే అక్కడ విష్ణాలయం ఉంది. అమ్మవారు ఎక్కడుందో కనుక్కోవడం కోసం ఆ దగ్గరలో ఉన్న కొండపైకి ఎక్కి కొంతమంది ఒక గుర్తులాగా వేశారు. ఆ గుర్తు వచ్చి ఈ భగవతి ఆలయంలో పడింది. అక్కడ ఒక పెద్ద చెట్టు మీద అమ్మవారు ఒక 'శక్తి' లాగా కూర్చుని ఉన్నారని ప్రతీతి. ఆ తరువాత 1000 సం।ల క్రితం అక్కడ ఉత్సవ విగ్రహాన్ని పెట్టి గుడి కట్టారు. ఇవ్వాళ అమ్మవార్ని కనుక్కున్న రోజు. కార్తీకమాసాన్ని వాళ్ళు ఏదో చెప్పారు. ఈరోజు 16వ రోజు. అందువలన ప్రతి సంవత్సరం ఇక్కడి నుండి భక్తులందరు ఆ కొండపైకి వెళ్ళి 'జ్యోతి' లాగా వెలిగిస్తారు. ఈరోజు అంత పవిత్రమైననది" ఆ రోజు మేము ఇక్కడికి వెళ్ళటం ఎంత విశేషం? అనుకుంటూ ఆశ్చర్యపోయాము మేము. ఈయన్ని అదంతా వీడియో తీమన్నాను. అందుకని, గుడి అభివృద్ధి కోసం ఈరోజే ఒక కౌంటర్ పెట్టారట. నేనే (నా పేరే వ్రాశారు) మొదటి దాతను. మమ్మల్ని భోజనానికి ఉండమన్నారు. మాచేత అన్నదానం చేయిస్తామని చెప్పారు. అప్పటికి 11.30 గం॥లు అయ్యింది. బ్యాంక్‌కు టైమ్ అయిపోతోందని తిరిగి వచ్చేశాము.

అప్పుడు వాళ్ళతో నేను ఇలా చెప్పాను, "మేము ఏదో అనుకుని ఇక్కడు వచ్చాము, కానీ ఇక్కడ ఇంత మహాత్యముందని తెల్సుకుని ముఖ్యంగా అమ్మవారు ఇక్కడకు వచ్చిన రోజే మేమూ రావడం అదృష్టంగా భావిస్తున్నాము. ఇప్పుడు చాలా సంతోషంగా ఉంది. మీరు మేము కారు ఎక్కబోయేటప్పుడు ఈ విషయాలన్నీ చెప్పారు. లేకపోతే మావారు చాలా బాధపడేవారు. ఏదైనా సరే మీరు ఈ గుడి చరిత్రను ఒక బ్లాక్‌బోర్డ్‌పై వ్రాసి అందరూ చదువుకునేలాగా పెట్టించండి. మాలాంటి క్రొత్తవాళ్ళు కూడా చదువుకుని, ఆనందిస్తారు" అని ఒక సలహా ఇచ్చాను. అది విని కమిటీ వాళ్ళు "మంచి సలహా ఇచ్చారు. అలాగే చేస్తాము" అని చెప్పారు. అమ్మమ్మగారు నేను ఎక్కడికి వెళ్ళాలో, ఏం చూడాలో, ఎలా ఆనందించాలో, ఏం తెలియజెయ్యాలో అన్నీ వరుసగా నా కోసం సిద్ధంగా ఉంచి, ఒక పద్ధతి ప్రకారం నా జీవితాన్ని నడిపిస్తున్నారు. నేను తల్లి చెయ్యి పట్టుకుని నడుస్తున్న 5 సం॥ల బాలికవలె, అటూ ఇటూ చూస్తూ, ఆనందంతో తల్లితో నడుస్తున్నాననిపిస్తోంది. పిల్లకేం తెల్సు తల్లి ఆలోచన? పిల్లకి ఆనందం కలుగజేయడమే తల్లి కర్తవ్యం. అదే జరుగుతోందిప్పుడు...

**02.12.2004**

గీతా ప్రెస్, గోరఖ్‌పూర్ వాళ్ళు ప్రచురించిన **"నవవిధ భక్తిరీతులు"** అనే పుస్తకం చదువుతుండగా కల్గిన ప్రేరణ వలన ఇది వ్రాయాలనుకుంటున్నాను. నవవిధభక్తులలో– శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం అని 9

రకాల భక్తి విధానాలున్నాయి. అయితే ఏదైనా మనం ఎన్నుకోవచ్చు, తద్వారా తరించవచ్చు. అది చెయ్యవలసిన విధానం ఏమిటంటే .....

***స్వామియొక్క నామ, రూప, గుణ, ప్రభావ, లీలా, తత్త్వ రహస్యాదులకు సంబంధించిన అమృతమయ గాథలు శ్రద్ధాపూర్వకంగా, ప్రేమపూర్వకంగా విని, విన్న వాటిని, చదివిన వాటిని మననం చేసుకోవడం, అలా చేస్తే శరీరాన్ని మరచి భగవంతుని స్వరూపంలో ధ్రువునిలాగా లీనమై వర్తించడం ఇందులోని అంశము.***

భగవంతుని సగుణ, నిర్గుణ, సాకార, నిరాకార తత్వాన్ని తెలుసుకుని గుణ ప్రభావసహితమైన ఆ భగవత్స్వరూపాన్ని చింతన చెయ్యడం, భగవన్నామాన్ని మనస్సులో స్మరిస్తూ ఉండడం, భగవంతుని లీలలను తలచుకుని ముగ్ధులవ్వడం, భగవత్ తత్త్వాన్ని, రహస్యాన్ని తెలుసుకోవడం కోసం ఆయన గుణప్రభావాలను చింతన చెయ్యడం, ఇంకా దివ్యస్తోత్రాలతో ప్రార్థించడం ఇవన్నీ భక్తిని సాధించడానికి అనేక పద్ధతులని శాస్త్రాలలో చెప్పబడినవి. ఇవి ఆచరించడం వలన భగవంతుని తత్వరహస్యం తెలుస్తుంది. దాని వలన భగవద్భక్తి, శ్రద్ధ, ప్రేమ పెంపొంది, సాంసారిక భోగాల మీద విరక్తి కలిగి, వాటిని విరమించడం సంభవమై, భగవద్ధ్యానంలో ప్రగాఢ స్థితి సమకూరుతుంది.

అయితే ఈ విధంగా సగుణ, నిర్గుణ నిరాకారతత్త్వంతో ధ్యానం చెయ్యగల్గితే అది "పురుషోత్తముని సమగ్ర స్వరూపధ్యానం" అవుతుంది. దానిని విశదపరచేందుకు వీలైన ఉపమానాలు, దృష్టాంతాలు, రూపకాలు, ఉదాహరణలూ ఈ లోకంలో లేవు. అలా అయితే తెలియజెప్పడమెలా సాధ్యం? భగవంతుని అత్యంత లక్షణం, దుర్విజ్ఞేయం అయిన స్వరూపాన్ని ఏ దృష్టాంతం చేతనూ బోధపరచలేము. ఉపమానం లేనిదానికి ఏదో ఒక ఉపమానాన్ని గ్రహించడంచేత వారుచేసే బోధ అంశికమే అవుతుంది. సమగ్రం కావడం లేదు.

అవ్యక్త కారణరూపంలో ఉన్న (మేఘాలలో నీరుందని తెలుసు. వాన కురిసినప్పుడు మాత్రమే నీరు ప్రత్యక్షంగా కంటికి దృశ్యమానం అవుతుంది) నీరు – రసరూపంలో ప్రత్యక్షం అవుతుంటుంది. అలాగే నిర్గుణ నిరాకార పరబ్రహ్మం భక్తునిలో భక్తి తీవ్రతనుబట్టి, భావతీవ్రతనుబట్టి సగుణ సాకారంగా ప్రత్యక్షమవుతాడు. దర్శనం పొందిన భక్తుడు పరవశుడవుతాడు. స్పృహలోనికి వచ్చినా తాను చూచిన దివ్యమంగళమూర్తిని కానీ, అనుభవాన్ని కానీ వర్ణించి చెప్పలేడు. ఎందుకంటే స్వామియొక్క రూపమాధురిని వర్ణించుటకు వాక్కు రాదు, శక్తి చాలదు. అట్టి పరిస్థితిలో నావంటి సాధారణ మానవుడు ఆ పరమ దివ్యమంగళ రూపమాధురిని శతాంశ మాత్రమైనా వర్ణించడానికి (రచయిత) ఎలా సమర్థుడు కాగలడు?

ఇది చదివిన తర్వాత నాకు అనిపించినదీ, వ్రాయదల్చుకున్నదీ వ్రాస్తున్నాను...

భగవద్భక్తిని పొందడమనేది పూర్వజన్మ సుకృతం. ఆ భక్తిని సక్రమమైన మార్గంలోనికి ప్రసరింపజేసి, ధన్యుణ్ణి చెయ్యడమనేది 'గురుకృప' మీద ఆధారపడి ఉన్నది. ఇవన్నీ భక్తితో

గురువుని ఆశ్రయించాక జరిగే మార్పులు. అనుభూతుల్ని వ్యక్తపరచడం ఎవరివల్లా కాదు. వ్యక్తపరచినా అది కొంతభాగమే అవుతుంది తప్ప మొత్తం కాదు. పైన వ్రాసిన పరిచయంలో నాకు నచ్చినదీ, ఆచరించవలసినదీ ఏమిటంటే అది భగవంతుని 'లీలా' విశేషములను మననం చేసుకోవడం, గుణగణములను స్తుతించడం. (వాటికి భక్తుల కథలు, శాస్త్రాలు చదవడం ఒక పద్ధతి) దైవం గురువు రూపంలో ప్రత్యక్షంగా తిరుగుతుంటాడు. దైవం ఎక్కడో లేదు గురువు రూపంలో మన మనసులో ఎల్లప్పుడూ తిరుగుతూనే వుంటాడు. 'గురు చరిత్ర'ను పారాయణ చెయ్యడం వలన, శిష్యుల అనుభవాలను తల్చుకుంటూ వుండడంవలన భక్తి వృద్ధి చెందుతుంది. ఆనందం కలుగుతుంది. నమ్మకం పెరుగుతుంది. గురులీలలు ఇలా ఉంటాయని అర్థం చేసుకునే స్థాయికి మనస్సు ఎదుగుతుంది.

మన జీవితంలో, గురువు మనకు అనుగ్రహించిన (భౌతికమైనవి కానీ, అలౌకికమైనవి కానీ) విశేషములను మననం చేస్తూ (ఏకాంతంగా), వాటిని విశ్లేషిస్తూపోతుంటే అందులో ఆయన గుణగణాలను కూడా మనం అర్థం చేసుకోవచ్చు అని అనిపిస్తోంది. అప్పుడు ఆయన చేసే లీలలను, గుణగణాలను, రూపాలను, అర్థంకావించబడిన విషయాలను అన్నీ కూడా ఆయన మనకే అర్థమయ్యేలా చేస్తాడని నా నమ్మకము. అలా చేస్తే ఏం తెలుస్తాయో, ఎలా తెలుస్తాయో, అవి ఎలా మననం చేసుకోవాలో, వాటిని ఏ విధంగా సమన్వయపరచుకోవాలో తెలియజెయ్యడం కోసం నేను ఈ చిన్న ప్రయత్నాన్నీ, విధానాన్నీ ఇక్కడ వ్రాసే ప్రయత్నం చేస్తున్నాను. దానికోసం నా జీవితంలోని ఆధ్యాత్మిక అనుభవాల్నే ఆధారం చేసుకుని వ్రాస్తున్నాను.

అది 1996 సం॥ము అనుకుంటాను. నేను మొదటిసారిగా "బాలత్రిపుర సుందరీ పీఠము"లో కలశస్థాపన చేశాను. ఆ సం॥ 9 రోజులు దీక్షతో ఉదయం పూజ చేసేదాన్ని, బహుశ 2 లేక 3వ రోజు కాబోలు, (నాకు అంతకుముందు గానీ, కనీసం ఇప్పుడు గానీ ధ్యానం చెయ్యడం అనే అభ్యాసం లేదు. నేనూ ప్రయత్నించలేదు కూడా. నాకు ప్రత్యేకంగా భగవంతుని సాకార, నిరాకార దర్శనాలు కలగాలనే కోరిక అప్పుడు లేదు) అదే మొదలు కావడం వలన ఒక రోజు పూజలో నేను ధ్యానంలోకి వెళ్ళిపోయాను. నా దేహ స్మృతిని కోల్పోయాను. అలా పద్మాసనంలో పూజ చేస్తూ, చేస్తూ అలా వుండిపోయాను. సుమారు 10 ని॥ల పాటు... తర్వాత నెమ్మదిగా కళ్ళు తెరచి చూస్తే, తలపై 100 టన్నుల సిమెంటు బస్తాలున్నంత బరువు. ఎలాగో అందరూ పడుకోబెట్టారు. సుమారు ఆ రోజంతా ఏ ఆలోచన లేకుండా ఒక స్థితిలో వుండిపోయాను.

ఆ రోజు ధ్యానస్థితిలో నాకు కన్పించిన దృశ్యం ఏమిటంటే- **నేను అమ్మవారి ఎదురుగా కూర్చుని ఉన్నాను. అమ్మవారి విగ్రహానికి, నాకూ మధ్యలో నుండి ఒక కాంతిపుంజము (మతాబు రవ్వకాంతి) బయల్దేరి గుండ్రంగా, వలయాకారంలో తిరిగి మళ్ళీ వచ్చి అక్కడే కల్సిపోయింది. నేను కూడా ఆ వలయంతోపాటు ఉన్నాను. తిరిగాను. అయితే శారీరకంగా కాదు. కాంతిపుంజములో నేను ఆ వలయం పూర్తి అయ్యేలోపుగా ఎన్నో సముద్రాల మీదుగా, కొండల మీదుగా, పెద్ద పెద్ద వృక్షాలమీదుగా, చీకటిలో పెద్దపాములు చుట్టచుట్టుకుని నేలమీద పడుకుని**

**ఉన్నాయి. అదొక లోకం. ఆ తర్వాత చాలాసేపు చీకటిలో నుంచే, అలా ఎన్నెన్నో ప్రకృతిలోని అంశాలను చూడడం జరిగి, మళ్ళీ నన్ను విగ్రహం వద్ద దించేసాక స్మృతిలోకి వచ్చాను. ఇదంతా కొన్ని నిముషాల్లోనే (కొన్ని లక్షల బిలియన్ల మైళ్ళు) జరిగింది. ఆ దూరం కొలవటానికి శక్యం కాదు.** అలా కన్పడింది. కళ్ళు తెరచిన తర్వాత అక్కడున్న అందరికీ ఈ విషయం చెప్పాను. ముఖ్యంగా మా అమ్మగారు ఆ అనుభవం విని చాలా సంతోషించారు. ఆమె నేను పూజ చేస్తున్నప్పుడు– "అందరూ మణిద్వీపం ఉందనీ, అది ఇలా ఉంటుంది, అలా ఉంటుందని పుస్తకాల్లో వర్ణిస్తున్నారు. కనీసం చూసిన వాళ్ళెవరైనా వచ్చి ఇలా ఉందని చెప్తే బాగుణ్ణు, ఆనందం కల్గుతుంది" అనుకున్నారట. వెంటనే నాకు ఇలా జరిగి, బయటకు చెప్పడం జరిగింది. ఆమె చాలా ఆనందపడ్డారు. "ఓహో ఇంత ప్రకృతి ఉన్నదా? నీకు అమ్మవారు చూపించిందా? ఇప్పుడు నాకు నేను చూసినంత ఆనందం కల్గుతోంది" అని అన్నారు.

ఆ తర్వాత 'శాస్త్రి' దేవీభాగవతంలో సృష్టి ఇలా వర్ణించబడి ఉందని ఆ పుస్తకం సాయంత్రం చదివి వినిపించాడు. ఓహో అనుకున్నాను. కానీ ఆ విషయాన్ని గురించి మరెప్పుడూ ఇది ఎందుకు ఇలా కనబడిందని కానీ, అంతరార్థమేమిటని కానీ నేను ఆలోచించలేదు. అందుకని 'లీల'ను తెల్సుకోవడం కోసం ఇప్పుడు దాన్ని గుర్తుకు తెచ్చుకుని, విశ్లేషణను చేసుకుని, గుణ, రూప, స్వభావాలను తెల్సుకొని, ఆనందించాలని ఇది వ్రాస్తున్నాను.

ఇంక నాకు కన్పించిన "తేజో పుంజము" గురించి తెల్సుకుంటే– భగవానుడు భగవద్గీతలో ఈ విధంగా చెప్పాడు. "విభూతి యుక్తమైనది అనగా ఐశ్వర్యవంతమైనదీ, కాంతివంతమైనదీ మరియు శక్తివంతమైనది అయిన వస్తువు ఏది కలదో, ఆయా వస్తువును నీవు నా 'తేజం'లోని ఒక అంశం యొక్క "అభివ్యక్తి" అని తెలుసుకొనుము. కనుక ఓ అర్జునా "యింత వివరణ ఎందుకు? నేనే ఈ సమస్త జగతినంతటినీ, నా యోగబలముచే కేవలం ఒక్క అంశములోనే ధరించియున్నాను దీన్నిబట్టి, నేను దర్శించిన ఆ 'కాంతిపుంజము' భగవంతుని యొక్క అంశ. భగవంతుడు ఆ కాంతిరూపంలో నాకు అభివ్యక్తమై, నాకెన్నో దర్శనాలు ప్రసాదించాడు.

సగుణసాకార రూపానికి రెండు బేధాలున్నాయి. ఒకటి మాయతో కూడినది. మరొకటి మాయకు అతీతమైనది. అతీతమైన వాటియందు సత్త్వరజస్తమోగుణాలు ఈషణ్మాత్రంగా కూడా వుండవు. కాబట్టి ఆ రూపంలో ఉన్న భగవానుని గుణస్వరూప ప్రభావాదులన్నీ చిన్మయములే. కానీ అవతారధారణం చేసి అందరకు దృగ్గోచరమయ్యే రూపంలో ఉన్నప్పటికి భగవంతుడు మాత్రం మాయా సంబంధం కల్గివుంటాడు. ఇదే విషయం కృష్ణుడు గీతలో చెప్పియున్నాడు. (గీత 4/6)

"నేను జన్మలేనివాడను, నాశం లేనివాడనై యుండియు, సకల ప్రాణులకు ప్రభువును అయివుండియు, నా ప్రకృతిని అధీనం చేసుకుని నా యోగమాయ ద్వారా బహిర్గతమగుచు (అవతరించుచు) నుందును" మరొక శ్లోకం (గీత 7/25)లో "నా యోగమాయ ముసుగులో

దాగియుండిన నేనందరకు గోచరించువాడను కాను. అందుచేత ఈ అజ్ఞానముతో కూడిన యీ జనసముదాయం, జన్మయు, నాశనము లేని పరమేశ్వరునిగ నన్ను తెలియజాలదు. అనగా నన్నును పుట్టుచు, గిట్టుచుండు వానినిగా భావింతురు.”

భగవానుని తత్త్వరహస్యం తెలుసుకున్న భక్తునికి మాత్రం స్వామి మాయావరణం తొలగించి, నిజరూపాన్ని దర్శింపచేస్తాడు. మళ్ళీ అనుభవానికి వస్తే, భగవంతుడు ప్రకృతిని అధీనం చేసుకుని యోగమాయ ద్వారా అవతరిస్తానని భగవద్గీతలో చెప్పినట్లుగా.... నేను బాలాత్రిపురసుందరీ పీఠములో కలశస్థాపన చేసి ఆవాహన చెయ్యగానే ఆ తల్లి తన ఉనికిని నాకు ఆ విధమైన అనుభవరీతిలో తెలియజేసిందని అర్థమవుతున్నది.

నిర్గుణ నిరాకారరూపంలో ఉన్న భగవత్‌శక్తి ఆ కాంతిపుంజ రూపంలో పీఠంలోని త్రిపుర సుందరీ విగ్రహం వద్ద నుండి బయల్దేరి, ప్రకృతి స్వరూపమైన శక్తి, కాంతిరూపంతో ప్రకృతి తనేనని నాకు చూపిస్తూ, మళ్ళీ పీఠంలో వలయాకారంగా తిరిగి వచ్చారంటే, ఈ ప్రపంచములోకి “బాల”గా అవతరించాను అని నాకు అర్థమయ్యేలా దర్శనమిచ్చారు. అంటే తన అవతార విశేషాన్ని ఇక్కడ ఆమె నాకు స్పష్టంగా చూపించారు. అంటే బాలా త్రిపురసుందరే “కమలాంబిక” అయిన నా గురుస్వరూపులైన నాకు చక్కగా అర్థమయ్యేలాగా వివరించి చూపించారు. సాకారముగా ఇక్కడ ఆమె “కమలాంబిక”గా అవతరించారన్నమాట. ఈ మాయా ప్రపంచంలో కమలాంబిక అవతారమెత్తి లీలలను చూపిస్తున్నారు. కానీ అర్థం చేసుకునే జ్ఞానం కూడా ఆవిడ ఇస్తేతప్ప అర్థంకాదు కదా! ఆ మాయపొర తొలగిస్తే తప్ప ఈ విషయాలు జీవునికి ఏం అర్థమవుతాయి? ‘ఆవాహన’ చెయ్యగానే తన ఉనికిని ఈ విధంగా నాకు తెలియపరిచారు నా గురువులైన కమలాంబిక. నా జీవితం ధన్యమైనదిగా భావిస్తున్నాను. ఇంకొంచెం విపులంగా వ్రాస్తాను...

పీఠంలో ఆమెను ‘రమ్మని’ ఆహ్వానించి ‘కలశం’ పెట్టగానే తన ఉనికిని, తనెవరో తెల్పుతూ, చక్కగా దర్శనం ద్వారా నాకు చూపించారు. అంటే పీఠస్థానం ఎటువంటిందో మనం చెప్ప శక్యం కాదు. అందుకనే కమలమ్మగారు, మీరు మీ పనులైతే ఇక్కడకు వచ్చి నమస్కారం చేసుకోండి, లేకపోతే పూజ చేసుకోండి, కర్పూరం వెలిగించండి అని శిష్యులకు చెప్పేవారు. అంటే ఆ స్థానంలో మనం చేసేవన్నీ ఎంతెంత ఫలితాలను ఇస్తున్నాయో మనమందరం ఈ రోజుకీ అనుభవిస్తూనే ఉన్నాము కదా. “ఇక్కడ నిద్రజేయండి, పౌర్ణమి, అమావాస్యలకు ఇక్కడకు వచ్చి నిద్ర చెయ్యండని” – నిద్రలు ఇవ్వడం, ఆ స్థానంలో ఆవిడ చేత్తో వండి, వచ్చిన వాళ్ళకు పెట్టడం – పక్కనే శివాలయం ఆవరణవరకూ మనదేనని, శివాలయంలో నిద్రచేసినా, పీఠంలో నిద్రచేసినా ఒకటే. ఇదంతా ఒకే స్థలం అని చెప్పడం, శివాలయములో ‘దసరా’ భోజనము పెట్టడం, శివుని పక్కనే వెలసిన పార్వతీ అంశ అయిన శ్రీ బాలాత్రిపురసుందరి ఈమే అని మనకు ప్రత్యక్షంగా అర్థమవుతోంది. అందుకే ఆ పీఠస్థానమునకు అంత ప్రత్యేకత, పవిత్రత, శక్తివంతం అని తెలుస్తోంది మనకు.

అవతారమూర్తి అయిన కమలమ్మగారు సాకారంగా వున్నంత కాలం నన్ను (మాయలోవుంచి) తనవద్దే ఉంచుకుని నా దుష్కర్మలను తొలగించి ఉంటారు. అప్పుడు నేను అజ్ఞానపు అంధకారంలో ఉండుట వలన, ఎదురుగా సాకారమూర్తి ఉన్నప్పటికీ గ్రహించలేక పోయాను. అదే "మాయ పొర". అజ్ఞానము అయినా ఆమె ఎంత కరుణామూర్తో అర్థమవుతోంది నాకు. తన సంరక్షణలో వుంచుకుని, నా కర్మను పూర్తి చేయించి, నాకు వివాహము చేసి, భర్తను ఆమే నిర్ణయించి, నాకు పురుళ్ళు పోసి, బిడ్డలను తనే ముందు ఎత్తుకుని, నన్ను ముందుకు నడిపిస్తూ వచ్చారన్న మాట. నేను అది గ్రహించలేక (మాయ) ఆమెతో విరోధముగా శత్రువువలే దూషణలాడి బాధించాను కూడా. అయినా ఆమె నాకింత వరాన్నిచ్చి, నన్ను పీఠస్థానములోనికి ఆహ్వానించి, పెద్దపీటను వేసి (లౌకికంగా తల్లికూడా చెయ్యదు అలాగ) నడిపిస్తున్నారు. నాకు సేవ చేసుకునే అదృష్టాన్ని కల్గించిన ఆ మాతృమూర్తి హృదయమును, అపారమైన కరుణ, ప్రేమను అంచనా వెయ్యలేను. కానీ జన్మజన్మలకూ నేను ఆమె పాదాల వద్దే వుండే అదృష్టాన్ని నాకు కలుగచెయ్యాలని వేడుకుంటున్నాను.

ఇంత అమృతమయి కనుకనే, నేను పక్కనే ఉన్నను తెలియనీయలేదు (నా కర్మల వలన), అయినా ఆమె వదలలేదు. చెయ్యవలసినవెన్నో ఆమె చేసి ఉంటారు. సుమారు 15 సం॥లు ఆమె వద్దే ఉన్నాను. ఆమె వండిపెట్టిన ప్రసాదము తిన్నాను. ఆమె మంచము క్రిందనే పక్క వేసుకుని పడుకునేదాన్ని. నేను ఆమె వద్దనే చదువుకున్నాను. ఇటువంటి ఆదృష్టము, అంటే దగ్గరే ఉండి మసలుకునేలాంటి అదృష్టాన్ని కలుగజేశారు. అమృత హృదయము వెనుక ఉన్నటువంటి కరుణను **నేను ఎల్లవేళలా గుణగానము చేస్తుండాలి.** ఇది ఒక **"గుణ"**(1)మును స్తుతించడం, మననం చేసుకోవడంలోకి వచ్చే విధానముగా మీరు గ్రహిస్తారని భావిస్తాను. ఇది భగవంతుని గుణమును గ్రహించడానికి ఒక అనుభవాన్ని గుర్తు చేసుకుని, విశ్లేషించి, అర్థం చేసుకుని గుణమును తెలుసుకుని, ఆర్ద్రతతోనో, ఆనందంతోనో మనకు నచ్చినవిధంగా కొలుచుకోవడం అవుతుంది.

**"రూపము"**(2) అంటే బాలరూపం మనకు తెలీదు. కమలాంబికా రూపాన్ని మనకు ఆమె చూపించారు. అందుకని అదే రూపాన్ని మనసులో ఎల్లప్పుడూ దర్శిస్తుండాలి. ఆ విశాలమైన నుదురు భాగమును, అమాయకంగా కన్పిస్తున్న కళ్ళను, ఆమెను చూసిన వాళ్ళైతే ఆమె స్వరమును, మాట్లాడిన మాటలను, వాళ్ళకు ఆమె ఇచ్చిన ఉపదేశములను, తెలియపరచిన జాగరూకతలను, కలసి గడిపిన మధుర క్షణములను, వేదాంత ఉపన్యాసములను, దండింపబడిన సంఘటనలను, చూపించిన క్షేత్రములను, చెప్పిన క్షేత్రమహిమలను ఎల్లవేళలా మననం చేస్తూపోతే, ఈ జీవితమే చాలదు నిజానికి. అంతకంటే మరింత ఆనందం ఈ జీవితానికి ఏముంటుంది? సాంసారిక జీవనంలో ఉంటూ కూడా సులభంగా చెయ్యగలిగే ఈ సాధన ఎంత సులభోపాయమైనది. ఎవ్వరికీ తెలిసేలా చెయ్యాల్సిన పని కూడా లేదు. ఇది మనసుతో చేసే సాధన. అదేగా అమ్మమ్మగారు చెప్పారు. **"మనసు వక్రం లేకుండా ఉంటే అదే చక్రపూజని"**. ఈ విధమైన సాధనలో మనసుకు

ఎంతో సాధన వస్తుంది. ఎంతవస్తే అంత పవిత్రం, నిర్మలం. అపుడు అమ్మమ్మగారి మనసుతో లయం చెయ్యడం చాలా సులభం కదా! అంతెందుకు? మనం తలవడం మొదలుపెట్టగానే ఆవిడే మన వద్దకు వచ్చి, మన సాధనను నిస్సందేహంగా సరళీకృతం చేస్తారు. ఇవి మననం చేసుకోవడంతోపాటు నేను పైన చేసిన విధానములాగా విశ్లేషించుకుంటూపోతే గుణమును తెల్సుకునేందుకు అవకాశం ఉంటుంది. ఆ గుణాన్ని మనం అవలంబించే ప్రయత్నం కూడా చెయ్యాలి. అందుకే ప్రతి ఒక్కళ్ళు గురువుతో వారి అనుభవాన్ని, అనుభూతుల్ని విశ్లేషించుకుని, 'గుణ'ములను గ్రహించి, అనుసరించటానికి ప్రయత్నం కనీసం చేస్తుండాలి. ఈ సాధనలోని అంతరార్థము ఇదే.

**"నామము"**(3) కమలాంబికాయైనమః అనగానే రూపం గుర్తుకు వస్తుండాలి. సాధ్యమైనంత వరకూ రూపాన్ని కూడా తల్చుకునేలాగా నామం చేస్తుంటే మరీ మంచిది. రూపంలో ఒకభాగం ఏదైనా సరే... కళ్ళో, పులిపిరికాయలో, నవ్వుకానీ ఏదైనా సరే గుర్తుకు తెచ్చుకునేలాగ నామం చేస్తుంటే ఆ ముద్ర మనసులో చెరిగిపోకుండా ఉండటం వలన సాకార రూపంగా ఎప్పుడైనా దర్శనం ఇచ్చినా కూడా తక్షణం గుర్తించగల్గుతాము. నిరంతర నామముతోపాటు రూపం కూడా కలిపి సాధన చేస్తే, అది సాకార సాధనే అవుతుంది. ఇలా సాధన చేస్తున్నపుడు 'గుణము' కూడా గ్రహిస్తే, అది వెంటనే గుర్తుకు వస్తుంటుంది.

ఈ విధంగా ఆమె నామ, రూప, గుణములతో సాధన వలన మనకు ఆమె పూర్తి సాకార సాధన చెయ్యగలిగేలా అనుగ్రహించబడతాము. అప్పుడు 'కమలాంబిక' అనగానే ఆ కరుణ, అందమైన మూర్తి అనుభవైకవైద్యమవుతుంది. అది మనలను ప్రభావితుల్ని చేస్తుంది. అప్పుడు నిజంగా మనము ఆ ప్రభావితంలో సాధన చెయ్యగల్గుతాము. కదిలే స్వరూపముగా మనకు గోచరిస్తుంది. మన పక్కనే నడుస్తున్నట్లుగా, ఆమె మనలోనే ఉన్నదన్నంత ధైర్యముగా బ్రతకగల్గుతాము అనిపిస్తోంది.

**"లీల"**(4) ఆమె సాక్షాత్తు అమ్మవారి అవతారం అయిఉండి నాతో మెసలి, నాకు తెలీకుండా, నాలోని అజ్ఞానాన్ని పోగొడ్తూ, నన్ను అజ్ఞానం (మాయ)లో ఉంచి, సరిదిద్దడం అనేది ఇక్కడ ఆమె చేసిన 'లీల'.

తరువాత కొంతకాలానికి ఆమె సాకారంగా లేకపోయినా అజ్ఞానపు పొరను తొలగించడానికి, పరీక్షలు పెట్టి, కళ్ళు తెరిపించి, అప్పటి అమ్మమ్మను నేనే. నువ్వు ఇప్పుడు 'గురువు'గా తీసుకున్న శ్రీ బాలాత్రిపురసుందరి అని "మాయ"ను తొలగించి, జ్ఞానాన్ని అందచేసి, అనుభవములను కల్గించి, విషయమును విశదపరుస్తూ, ఏమీ తెలియని అజ్ఞానురాలికి అన్నీ అందిస్తూ, ఒక అత్యున్నత స్థానమును కల్పించి, తనను ప్రపంచానికి నా ద్వారా తెలియపర్చుకోవడం అనేది కూడా ఆమె చేసిన 'లీల'లోని అంతర్భాగమే. ఎంత ఊహించని సంఘటనలు – మార్పులు జీవితంలో ఏ క్షణమునకు ఏమి జరుగుతాయో జీవితంలో మనం గ్రహించలేము. కానీ

గురురక్షణలో ఉన్నంతకాలం, సాధనలో ఉన్నంతకాలము 'విచారము' అనే పదాన్ని మరచిపోవచ్చు. అంతే ఆనందం లేక అనుభవం అవుతుంది మనకు. నా విషయంలో సాధన ఏ విధంగా జరిగిందో, ఎన్ని అద్భుతమైన విషయాలుగా రూపొందాయో చూడండి. అలాగే మీ జీవితాల్లో కూడా అద్భుతమైన విషయాలు జరిగే వుంటాయి తప్పకుండా. **లేకపోతే మీరు ఈ పీఠంలో ఉండరు కదా!** కాబట్టి సాధన మొదలుపెట్టి విషయాలను తవ్వడం మొదలుపెట్టండి. అన్నీ ఎరుకకు వస్తాయి. 'లీలలు' బోధపడ్తాయి. 'లీల'లు గ్రహించలేకపోతే జన్మ వ్యర్థమవుతుంది. చూపిస్తానన్నా చూడలేకపోతే గ్రుడివాళ్ళతో సమానము అవుతాము.

**"తత్త్వరహస్యాలు"**(5) – ఈ అనుభవములో తత్త్వరహస్యమును తెల్సుకోవడం ఎలా? అంటే ఇక్కడ గురుతత్త్వం బోధపడ్తోంది కదా! ఎటువంటి కర్మజీవినైనా సరే వేలుపట్టుకుని ముందుకు నడిపించడమే కానీ, వదిలెయ్యడం అనేది గురువులకు ఉండదు. మనమే వారిని వదలాలి తప్ప – వాళ్ళు మనలను జన్మ జన్మలనుండి వదలకుండా పట్టుకున్నారు. కనుకనే, మనం వారి వద్ద ఉండగల్గుతున్నాము. లేకపోతే ఇక్కడ ఉండము కదా! గురువుది మాతృతత్త్వము. తల్లి (ఇహలోకములోనే కాదు) మనసు వంటిది. బిడ్డ ఎటువంటివాడైనా సరే, తనను లెక్క చేయకపోయినాసరే, ద్వేషించినా సరే, తల్లి మనసు కలుషితం కాదు. బిడ్డపైన ఎల్లవేళలా ప్రేమ తప్ప మరొకటి ఉండదు. అలాగే ఈ లోకంలో తల్లి అయితే బిడ్డ తప్పులను కడుపులో పెట్టుకుని, క్షమించి వదిలేస్తుంది. కానీ *గురుమూర్తిలోని* మాతృతత్త్వం మాత్రం అలా కాదు.

***బిడ్డలోని లోటుపాట్లను, తన అండలోనే ఉంచుకొని, సరిచేసి, మానవమాత్రునిగా తయారుచేసి, తర్వాత సాధకునిగా చేసి, తన మాతృహృదయంతో వాడి మనసును రంజింపచేసి, తన వైపునకు త్రిప్పుకొని, వాడికి ఉన్నతగతులను ప్రసాదించి తరువాత తనలో 'లయం' చేసుకుని,*** *శాశ్వతానందాన్నీ, బ్రహ్మలోకప్రాప్తిని కలుగజేస్తుంది. అదీ 'గురువు'లోని మాతృహృదయం. వారి తత్త్వాలు అలాగే ఉంటాయి. సాధనలో ఉన్నప్పుడు పైకి కఠినంగా కనపడతాయి. కానీ ఓపిక పడితే రహస్యం బోధపడ్తుంది. సాధన చెయ్యాలి, ఓపిక పట్టాలి. అప్పుడు కదా తత్త్వరహస్యం బయటపడేది. సాధనలో ఉన్నప్పుడు కష్టాలు కలగగానే... ఆమె మనకు ఇచ్చిన శిక్షగా భావించాలి. 'తప్పు చేశాము కనుక అనుభవించాలి కదా!' అనుకుని దాన్ని మనస్ఫూర్తిగా తీసుకుని, మనస్థైర్యంతో ముందుకు సాగిపోవాలి అని అర్థం చేసుకోవాలి. ఈ శిక్ష తీసుకునే కాలంలో మనకు గురువు ఒక "కాళీరూపం"లో కనపడవచ్చు. "శిక్ష" వేస్తున్నారు అనుకోకుండా "శిక్షణ" ఇస్తున్నారు అనుకొని, సాధన చెయ్యాలి శిష్యుడు. 'శిక్ష' వేస్తూ, అన్ని కోణాలనుండీ ఆమె మనకు 'శిక్షణ' ఇస్తుంటారు. అవి మనం గుర్తించగలిగే స్థితికి రావాలంటే పైన నేను వ్రాసిన సాధన చెయ్యాలి. అప్పుడు తప్పక గుర్తించగల్గుతాము. 'శిక్ష' వేసి ఆమె చూస్తూ ఊరుకోలేదు. బిడ్డ అన్ని విధాలా నలిగిపోతాడేమోనని ఒక ప్రక్క చూస్తుంటుంది. అందుకే మనకు వెంటనే ఇంకో కోణంలో ఏదో ఆశాజనకంగానూ, ఆనందదాయకంగానూ ఏదో చిన్న 'తాయిలం' పెడ్తుంది. మనకు 'సాధన' లేకపోవడం మూలంగా 'తాయిలం' తినేస్తాం, వెంటనే మర్చిపోతాం.*

***కృతజ్ఞత అనే ఆలోచనకు తావే లేదు మనకు. మళ్ళీ వెంటనే చిన్నపిల్లాడిలా ఏడవడం మొదలు పెడతాం. మనల్ని వారు కొట్టాడనో, తిట్టాడనో, నష్టం జరిగిందనో, గురువు ఏమీ చెయ్యలేదనో, భగవంతుడు లేడనో, ఏదో నోటికి వచ్చినట్లుగా అనుకుంటాం. అది మన నైజం. ఇందులో ఉన్న తత్త్వరహస్యాన్ని గ్రహిస్తే ఆమె అన్ని విధాలా మనలను చెయ్యిపట్టుకుని, పడిపోకుండా కాపాడుతున్నారని అర్థం చేసుకోవచ్చు. కాపాడడమే తప్ప, మరొకటి తెలియని తత్త్వం గురువుది. అదే మనం గ్రహించవలసినది. తత్త్వంలోఉండే రహస్యాలను విశ్లేషణలో మనం తెలుసుకో గలుగుతాము. ఇలాంటి సాధనలు చేస్తున్నవారే త్యాగరాజు, అన్నమయ్యలాంటి వాళ్ళు. భక్తితో ఎన్నో కీర్తనలు వ్రాసి, పాడి తరించి, భగవంతునిలో ఐక్యమయ్యారు. అలాంటి కథలు మనకెన్నో తెలుసు. కానీ ఆ కథలు తెల్సుకోవడంవలన ఏదో తాత్కాలిక ఆనందమే తప్ప, భక్తిమార్గంలోకి అడుగుపెట్టడమే కష్టము. అందుకని 'భక్తి' ఉండి, 'గురు రక్షణ'లో ఉన్న వారికి నేను వ్రాసిన ఈ విశ్లేషణా విధానం చక్కగా ఉపయోగపడుతుందని నా నమ్మకం.***

ఈ విధంగా గురువుని నామ, రూప, గుణ, తత్త్వరహస్య లీలా విశేషములను విశ్లేషించుకొని, రహస్యములను అవగాహన చేసుకుంటే ప్రతీరోజు అనుభవమును ఆధ్యాత్మికమైనా సరే, లౌకికమైనా సరే, ప్రతీదాన్ని అన్వేషించుకుంటూపోతుంటే (సాధన మొదలుపెడితే చాలు – గురువే తీసుకు వెళ్తారు అక్కడకు మనలను) ఆనందంకాక మరేమీ మన వద్దకు రావని నేను **నూరుశాతం** హామీ ఇస్తున్నాను.

ఈ విధంగా అనుక్షణం మనకు జరిగిన, జరుగుతున్న 'లీల'లను గమనిస్తూ పోతే, మనం శారీరకంగా వేరేగా ఉన్నా మానసికంగా 'ఆమె'లో కల్సిపోతున్నామనే భావన తప్పకవస్తుంది. అలా కొంతకాలం చేసాక (సాధన తీవ్రతను బట్టి) ఇదే జన్మలోనే మనం కలిసిపోయినా ఆశ్చర్యం లేదు. ఎందుకంటే ఆమె అంత కరుణామయి. జన్మాంతర పాపకర్మలను కూడా 'క్షణం'లో తీసివెయ్యగల అమృతమనస్కురాలు. మనం చెయ్యవలసినదల్లా ఆమెను ప్రేమించడం మొదలుపెట్టడమే. ప్రేమ ఎలా కలుగుతుంది? మనకు ఎక్కువ సన్నిహితులుగా ఉంటే మనకు ప్రేమ. మరి 'గురువు' మనకు ఎంత సన్నిహితురాలు? మనం బహుశః ఇప్పటి వరకూ ఆమెను భయముతోనూ, భక్తితోనూ కొలిచి, కొంచెం దూరంలో నిలబడి పూజిస్తున్నాం.

అలా కాకుండా దగ్గరకు వెళ్ళి "ఏంటమ్మా!" అని పలకరిద్దాము. ఆ ప్రేమకు ఆమె ఎలాగైనా లొంగిపోతుంది. ఆమెకు కావల్సినదీ అదే. అందుకే మనం దాన్ని పెంపొందించుకుందాము. ఈ విధమైన "గురుప్రేమ"ను సాధన చెయ్యడం మొదలుపెడితే నేనిప్పటి వరకూ చెప్తున్న, మీరు చెయ్యలేకపోతున్న లౌకిక సాధనలు (అందర్నీ ప్రేమించడం, విమర్శలు చెయ్యకుండా ఉండడం లాంటివి) వాటంతట అవే పోతాయి. వాటికోసం ఇంక పెద్దగా కష్టపడక్కర్లేదను కుంటాను. ఎందుకంటే మనకు 'గురువు'ను ప్రేమించడం మొదలుపెడితే, మిగిలినవన్నీ ఎంత?– అసలు ప్రేమ అనే ఎలాగో అలాగ మొదలవ్వాలిగానీ– "**ఒకవైపు కుదరకపోతే రెండవవైపు నుండి నరుక్కురావాలిట**". అలాగ లౌకికంగా మనకు రావడంలేదు– పోనీ, ఇలా 'గురువు'

వైపు నుండి ప్రయత్నిద్దాము. గురువే తప్పక సహాయం చేస్తారు కదా, భయం లేదు. **మీకు ఇది సులభంగానే పట్టుపడుతుందని నాకు అనిపిస్తోంది**. ఏమంటారు?

**23.03.2005, చెన్నై**

"రామకృష్ణ జీవిత చరిత్ర"లోని **భావముఖం** అనే మానసిక స్థితిని గూర్చి బాగా చదివిన తర్వాత ఆ స్థితిలో అమ్మమ్మగారు ఏ విధంగా వ్యవహరించారో పరశీలించాలనిపించి ఇది రాస్తున్నాను. ముందుగా చదివినంతా వ్రాయనక్కరలేదు కానీ అర్థంకావడానికి కొంత రాస్తున్నాను. తరువాత సమన్వయం చేస్తాను.

1. శ్రీరామకృష్ణులు ఆరునెలలపాటు 'నిర్వికల్ప సమాధి'లో శరీర స్మృతినిగానీ, బాహ్యప్రపంచమునుగానీ తెలియకుండా అవిచ్ఛిన్నంగా సమాధిలో మునిగిపోయారు. 6 నెలలు గడిచిన తర్వాత అమ్మ ఆజ్ఞ ఇలా వినిపించింది. "భావముఖంలో ఉండు. మానవునికి ఆత్మోన్నతి కలిగించడానికే భావముఖంలో ఉండు." 6 నెలల తర్వాత ఆయన మనస్సు సమాధి స్థితినుండి మామూలు దేహం మీదకి వచ్చింది.

2. 'భావముఖం' అనే మాటను గురుదేవుడే మొదటిసారిగా వేదాంతానికి తెలియజేశారు. ఈ మాటకు 'గుమ్మము' (జగత్తునకు కాక పరిణామానికి గుమ్మము) అని అర్థము. భవనం యొక్క గుమ్మంలో ఉన్నవాడు లోనికి, బైటకు కూడా పోగలడు. రెండువైపుల ఉన్న విషయాలో సన్నిహిత సంబంధం కలిగి, మానవుని 'ప్రజ్ఞ'లో ఒక చేతనాస్థితి ఉంది. అది కేవలం (బ్రహ్మం) 'వ్యావహారిక' జగత్తులకు సర్వికల్ప, నిర్వికల్ప చైతన్యస్థితులకు 'కూడలి' స్థానము. అవతార పురుషులే మాత్రమే, అజ్ఞానంలో కొట్టుమిట్టాడు జీవులయందలి కరుణచే, వారు వ్యావహారిక జగత్తులో అవతరిస్తారు. భగవత్ప్రేమకు, దివ్యకరుణకు చిహ్నాలు. భగవంతుని యొక్క ఉదారశక్తి యొక్క రూపుదాలుస్తారు. కావున **భావముఖ స్థితిలో అరూఢుడైనవానికి స్వప్రయోజనం కానీ, స్వీయముక్తికై ప్రయత్నం కానీ ఉండదు. అతడు సంసారంలో బాధపడు వారందరి సంక్షేమానికై పూర్తిగా అంకితమవుతాడు**.

3. జ్ఞానంలో అరూఢుడైన వానిని విజ్ఞానిగా చెప్తారు. అతడు ఈ విశ్వాన్నంతా 'మాయ'గా కాక సాకార, నిరాకార దైవముగా, శక్తి, బ్రహ్మం యొక్క 'లీల'గా దర్శిస్తాడు. విజ్ఞాని యొక్క అహంకారము దైవ కేంద్రీకృతమైతే సామాన్యుని అహం దేహ కేంద్రీకృతమై ఉంటుంది. విజ్ఞాని జీవులను, వస్తువులను, తనకు అనుకూల, ప్రతికూలముగా ఉన్న తన సుఖసంతోషాలతోకాక, తాను ప్రేమించి, సేవించవలసిన భగవద్విభూతులుగా పరిగణిస్తాడు. 'భావముఖ' స్థితిలోనివారు ఇచ్ఛామాత్రంగా మామూలు స్థితినుండి అత్యున్నత స్థితికి చేరుకోగలిగి అందరితోనూ, అన్నివిధాలుగా ఉండగలడు. విజ్ఞాని చైతన్యప్రకటనమునందలి అన్ని మార్గములలోను పయనించగలడు. విశ్వాత్మ శక్తిని ప్రవహించే వాహకంలాగా ఉంటాడు. ఇచ్ఛామాత్రంగానే పాపాత్ముని పరమ సాధువును గావించగలడు. ఆయనకు సన్నిహితంగా పరిశీలించుట వలన

భక్తుని స్థితి, ఉద్ధారకుని స్థితులమధ్య మారుతుండటం వలన ఆయన భావన నిస్సంశయముగా నిరూపణగావించబడినది.

4. 'భావముఖం'లో ఉన్నవాడు బాహ్యవ్యవహారమైన 'లీల'లో మాత్రమే గాక, అవ్యక్తమైన అఖండము, నిర్గుణముతో కూడా సంబంధము కలిగిఉంటాడు. ఈ రెండిటినే గురుదేవుడు నిత్య – లీల అని వ్యవహరించాడు. ఆయన 'నిత్య' (బ్రహ్మం)ను గూర్చిన ప్రజ్ఞలో ఉన్నప్పుడు లీలలో ఉన్న జడత్వము యొక్క సంబంధము పూర్తిగా ఆ 'నిత్య'ను గూడిన ప్రజ్ఞలో యిమిడి ఉంటుంది. అలాగే 'లీల'లో ఉన్న సమయమంతటిలోనూ ఆయన 'నిత్య'తో సంబంధము కలిగే ఉన్నాడు. అదే 'భావముఖ' (గుమ్మం) స్థితిలో ఉండడం. నిర్వికల్ప స్థితిలో 'లీల' నిషేధించబడలేదు. అణిగి ఉంది, అంతే! రెండిటితో సంబంధమును కలిగేఉన్నాడు. ఇచ్ఛామాత్రంగా దేనిలోనైనా మునగగలడు. ఆయన బాహ్యప్రపంచంతో సంబంధం కల్పించుకునేందుకు, చిన్న చిన్న కోర్కెలు కల్పించుకునేవాడు. ఫలానా చోటికి పోవాలి. ఫలానా వాడిని కలవాలి. అవీ, ఇవీ కావాలి అనే కోరికలతో ప్రపంచ వ్యవహారం నడపటానికి 'భావముఖ' స్థితిలోనికి తన మనస్సును లాగుతారు. ఆ స్థితిలో దివ్యజనని యొక్క సంకల్పము తప్ప, తన సంకల్పము లేదు.

5. "జీవులను ఉద్ధరించే శక్తిని ప్రదర్శించినప్పుడుగానీ, దేవీ విగ్రహాన్ని అర్చించేటప్పుడు గానీ ఆ దివ్యజనని సంకల్పముతో తాదాత్మ్యం చెంది అది నడిపినట్లు నడిచేవాడు."

6. తీవ్రమైన శారీరక బాధలు అనుభవించేటప్పుడు కూడా, ఒక్క జీవునికైనా బాధలంతరింప చేసి విముక్తిని కలిగింపగలిగినట్లైతే ఎన్ని జన్మలైనా అనుభవించటానికి తన సంసిద్ధతను తెలియజేశాడు. ఈ విశ్వప్రేమ అభివ్యక్తమగుటచే దేవి భావముఖంలో ఉండమని ఇచ్చిన దివ్యాదేశము యొక్క ప్రత్యేకత.

7. నిర్వికల్ప సమాధిలో శాశ్వతముగా నిలిచిఉండవలెనను స్వభావము గల తన మనస్సును, ఆయన మానవ సముద్ధరణకై భావముఖ స్థితిలో ఉండునట్లు నిర్బంధము చేశాడు. ఆయన మానవోద్ధరణకై ఆవిర్భవించిన భగవత్శక్తి యొక్క రూపము. ఆయనను "అవతార పురుషుడు" అనుటలో అంతరార్థమిదే.

పై విషయమంతా "రామకృష్ణ జీవిత చరిత్ర"లోనిది. ఇప్పుడు దీన్ని కమలాంబిక (అమ్మమ్మ)గారి జీవిత చరిత్రతో పోల్చి చూద్దాము.

కమలమ్మగారు 5 సం॥ల పిల్లగా ఉన్నప్పుడే వారి తండ్రిగారి పూజామందిరంలో ఒంటరిగా పద్మాసనంలో కూర్చుని ధ్యానంలో ఉండి, "అమ్మ నన్ను పిలిస్తే నేనిక్కడకు వచ్చి ధ్యానంలో ఉండిపోయాను" అని చెప్పారు. అప్పుడు వెంకటరత్నంగారు ఆమె కాలిలో ఉన్న శ్రీచక్రమును చూసి తన పీఠమునకు ఈమె వారసురాలనీ, పీఠనిర్వాహకురాలు కాగలదని చెప్పి, అంతకు ముందున్న పేరు వెంకట సిరినరసమ్మ, 'కమల'గా ప్రసిద్ధికెక్కుతుందని కొత్త నామకరణం చేసి, ఆశీర్వదించారు.

తరువాత 11, 12 సం॥ల కాలంలో మద్రాసులోని 'తిరువత్తియూరు' గుడిలో ఉండే శ్రీబాలాజీ, శ్రీశ్యామలరావు గురువు గార్లను కలిసి, దీక్ష తీసుకుని (భార్యాభర్తలు) అమ్మవారి గర్భగుడిలో సుమారు 40 రోజులపాటు ఒంటిపూట భోజనం, నేలపై నిద్ర, పూజలు, దీక్షలు ఆచరించిన తర్వాత ఆమెకు ఒక కల వచ్చింది. అందులో "నీకు భోగభాగ్యములతో విలసిల్లెడి జీవితము కావాలా? లేక సామాన్య జీవితంతో కూడిన ఆధ్యాత్మిక జీవనము కావాలా?" అని అడుగగా ఈమె రెండవది కోరినది. అది విని గురువులు ఈమెకు "బాలాత్రిపురసుందరీ" దీక్షను ఇచ్చారు. జన్మాంతర శుక్రవార ఉపవాసదీక్ష ఒసంగారు. భర్తగారైన సత్యనారాయణ గారికి కూడా 'శివపంచాక్షరీ' దీక్షను ఇచ్చి, సంసార జీవితప్రాప్తి నొసంగగా వారికి ముగ్గురు పిల్లలు కలిగారు.

శ్రీరామకృష్ణుని 'భావముఖం'లో ఉండమని చెప్పిన విషయమునే ఇక్కడ జగజ్జనని కమలమ్మకు ఆధ్యాత్మిక (సంసారముతోనే) జీవితమును ఒసంగి, సంసారములో తనుంటూనే, ఆ బాధ్యతలు అనుసరిస్తూనే, తన వద్దకు వచ్చే సంసారుల జీవితములలోని బాధలనువిని, పరిష్కారములను సూచిస్తూ, వారిని భక్తిమార్గంలోనికి మరల్చుతూ, కష్టాలను తీరుస్తుండేవారు.

ఆమె చిన్నప్పుడే సమాధిస్థితిలో ఉన్న మనిషి. కానీ ఉపదేశము తర్వాత కలిగిన 'పరివర్తన' వల్ల, మనసును దేహంపైకి మళ్ళించి, సంసారంలో ఉండి, జీవుల ఆత్మోద్ధరణకు పాటుపడ్డారు. అదే 'భావముఖ' స్థితి. అమ్మవారు ఆదేశించిన స్థితి.

భగవంతుని యొక్క 'ఉద్దారశక్తి' రూపునే వీరు దాలుస్తారు. భగవత్ప్రేమకు, కరుణకు చిహ్నము వీరు. స్వప్రయోజనముగానీ, స్వీయముక్తికై తపనగానీ వీరికి లేవు. బాధపడే జీవులను ఉద్ధరించుట కోసమే ఈ అవతారము.

కమలమ్మగారిని ఒకసారి కంచి పీఠాధిపతులు, "ఈ ముఖంగా పీఠాన్ని ఎందుకు పెట్టావు? దీనివలన నీకేమీ ప్రయోజనము ఉండదు కదా?" అని ప్రశ్నిస్తే, "ఈ పీఠం నా ప్రయోజనమునకు కాదు. లోకకళ్యాణార్థం ఈ దిక్కులో పెట్టాను. ఇక్కడకు వచ్చినవాళ్ళు తరించడంకోసమే తప్ప, నా స్వీయముక్తి కొరకు కాదు" అని చెప్పారు. దాని వారు సంతోషించి ఆమెకు నమస్కరించారు. అవతారమును అవతార పురుషులే గ్రహించగలరు. ఈ ప్రశ్న, జవాబులు మనకు అర్థంకావడం కోసమే అని గ్రహించాలి మనం.

ఆమె జీవితాంతం స్వప్రయోజనమునకు ఎవర్నీ ఆశించినట్లు గానీ, ఒక్క రూపాయికూడా ఎవరినుండి గ్రహించినట్లు గానీ (ఒకవేళ పండో, ఫలమో ఎవరైనా సమర్పిస్తే కుడిచేత్తో గ్రహించి, వారెదురుగానే ఎడమచేత్తో వేరొకరికి ఇచ్చేసేవారు) జీవిత చరిత్రలో కనబడలేదు. ఒకసారి ఒకరు సూట్‌కేస్ నిండా డబ్బు తెచ్చి, "పిన్నిగారూ మీకు కావలసినంత గ్రహించండి" అని అడిగితే పెట్టెపై చేయివేసి, "ఇదంతా నాకెందుకు నాయనా? దీనితో నాకేంపని? ప్రతి సంవత్సరం మీరు పీఠానికొచ్చి 'ధనలక్ష్మీపూజ' చేసుకుని తరించండి" అని చెప్పి తిరిగి వారికే ఇచ్చేశారు.

మరొకసారి ఎవరో అమ్మమ్మగారిని పరీక్షించడం కోసం రూ.100ల నోటును పళ్ళెంలో వేస్తే, దాన్ని కర్పూరంలా వెలిగించేశారు. వాళ్ళు "అయ్యో! అది డబ్బు" అంటే, "నాకు అది కాగితం ముక్కలాగా కనపడింది నాయనా. ఇక్కడ హుండీ లేదు. **మా అమ్మవారు కామితములు తీరుస్తుంది తప్ప కానుకలు తీసుకోదు**" అని శలవిచ్చారు.

ఇలాంటివి ఎన్నో ఆమె జీవితంలో ఉదాహరణలు. ఇంక స్వీయశక్తి. ఆమె పూజచేసినట్టుగానీ, లలితా సహస్రనామం చదివినట్టుగానీ, మడితో నైవేద్యాలు పెట్టినట్టుగానీ, ఆమె 73 సం॥ల జీవితంలో ఎవ్వరూ చూడలేదు. ఆమె చేయలేదు. ఆమె సిద్ధాంతమంతా "మనసు నిర్మలత్వంగా ఉండాలి కానీ, పైపైవి అన్నీ అంత ముఖ్యంకాదని" చెప్పారు. అలాగని ఎప్పుడూ ధ్యానంలో కూడా ఉండేవారు కాదు. తపస్సు, యోగం లాంటివి కూడా చేసినట్లుగా మనకు కనపడదు. అమ్మవారే స్వయంగా ఈమెతో "నీ మనసు నాకు నచ్చింది. నేను నీలో ఐక్యమై, నువ్వేది చెప్తే అది జరిగేలాగ నీ వాక్కులో ఉండి పలుకుతాను" అని చెప్పింది. ఇంక స్వీయముక్తికై ఈమె సాధనలు ఏముంటాయి? సంసారంలో బాధపడేవారి సంక్షేమానికే జీవితమంతా అంకితము చేశారు. వారి బాధలు తొలగించి ఆత్మోద్ధరణకై వారిని భక్తిమార్గం లోకి లాగి, మనశ్శాంతిని ప్రసాదించేవారు. అటువంటి వారే 'భావముఖి'లో ఉన్నటువంటి అవతారమూర్తులని శ్రీరామకృష్ణులు చెప్పారు. దానికి ఉదాహరణ శ్రీకమలమ్మగారైన మన గురువులు.

విజ్ఞాని, విశ్వాన్ని 'మాయ'గా కాక 'శక్తి బ్రహ్మ' యొక్క లీలగా సాకార, నిరాకార దైవంగా చూస్తాడు. ఉదాహరణకు, కమలమ్మగారి దగ్గరకు ఎవరో ముగ్గురు వ్యక్తులు వచ్చి అన్నం పెట్టమన్నప్పుడు, ముగ్గురికీ భోజనం పెట్టగా, వారు మొత్తం తినేసి, ఇంకా ఉందా? అని అడుగగా "ఎంత తిన్నా తరిగేదేముంది? అంతా పూర్ణమే. విశ్వంలో ఎంత తీస్తే మాత్రం ఎంత తరుగుతుంది?" అని వేదాంత ధోరణిలో పలికి, వారు "మడి కట్టుకునివండారా?" అని అడుగగా, "ఆ" అని సమాధానం చెప్పి, ఆకలి తీర్చిన తరువాత నిజం చెప్పి, "ఆత్మకు మడితో పనేముంది? శరీరానికి ఆకలిదప్పులు ముఖ్యం. ఆకలికి వెంటనే అన్నంపెట్టి క్షుద్బాధను తీర్చాను. అదే ముఖ్యం" అని చెప్పారు. వారు ఆమెకు నమస్కరించి వెళ్ళాక, వారు 'త్రిమూర్తులు' అని చెప్పారు. మనకు త్రిమూర్తులంటే ఎక్కడో, ఏవో లోకాలలో ఉంటారనీ, వారు దైవాలనీ, మనం చూడలేమనీ అనుకుంటాం. కానీ ఆమె తన చుట్టూ ఉన్న ఈ ప్రపంచంలోనే దైవాన్ని సాకారం గానూ, నిరాకారంగానూ కూడా చూడగలిగారు. బ్రహ్మం శక్తి దాల్చి ముగ్గురు మనుషులు వచ్చి అన్నం పెట్టమని అడిగినప్పుడు ఆమె వారిని త్రిమూర్తులుగా గుర్తించారు. ఇదే విజ్ఞాని యొక్క దృష్టి. ప్రతి మనిషిలోను, వస్తువులోను కూడా భగవంతుడిని చూడగలరు. ఎందుకంటే దైవం విశ్వమంతా ఉన్నదని వారికి తెలుసు కదా! అదే అవతార విశేషము. వారు కూడా ఆ తానులో ముక్కే కదా! వారి ముఖం అద్దంలో చూసుకుంటున్నట్లుగా ఉంటుంది. విశ్వాత్మ, శక్తి ప్రవహించే వాహకం కనుక, ఆమె వారిని అంత బాగా అర్థం చేసుకుని, భగవంతునిగా వారిని గుర్తించి సేవించారు. అదే మనకూ, వారికీ ఉన్న తేడా.

భావముఖ స్థితిలోనివారు ఇచ్ఛామాత్రంగా మామూలు స్థితి నుండి అత్యున్నత స్థితికి చేరుకోగలరు. అందరితోనూ అన్ని విధాలుగా ఉండగలరు. ఉదాహరణకు, కమలమ్మగారు ఒక సామాన్య స్త్రీవలె సంఘంలో బ్రతికారు. ఆర్థికంగా కూడా చాలా చిన్నస్థాయిలో ఉన్నట్లుగా కనిపిస్తారు. కానీ డబ్బు సమర్పిస్తే నిరాకరిస్తారు. వారికి దానితో పనిలేదు. కావాలంటే కోటీశ్వరులుగా మారటం అనేది వారి ఇచ్ఛకు సంబంధించిన విషయం. సామాన్యంగా ఉండి "నాకేమీ తెలియదు నాయనా! ఆమెకు నమస్కరించండి. ఆమె మీకు కలలో కన్పించి చెప్తుంది" అని అసలు పరిచయం లేనివాళ్ళలాగా చెప్తారు. త్రిమూర్తులు వచ్చినప్పుడు వారితో ఎంతో ఉన్నత స్థాయిలో వేదాంతధోరణిలో మాట్లాడారు. **"వక్రములేని మనసే శ్రీచక్రము"** అనే వాక్యమును తీసుకుంటే కైవల్యోపనిషత్తు యొక్క మొత్తం సారాంశమంతా ఒక్క ముక్కలో చెప్పారు. అసలు స్థితులను మనలాంటి వాళ్ళు ఎలా గుర్తిస్తారు? వారికి కూడా అలాంటి 'స్థితి' ఉంటే తప్ప. ఉన్నవారు అడిగినప్పుడు వారికి అర్థమయ్యే స్థితిలో సమాధానం చెప్పారు. ఎవరి స్థితిని బట్టి వారితో మెలిగారు. మొత్తమంతా వారివద్దే ఉంది కాబట్టి, వచ్చిన వారి స్థితి, అవసరం, ఆర్ద్రతను బట్టి వారు వ్యవహరించారు. ప్రాప్తముంటే అర్హత లేకపోయినా సరే ఆమె ఇచ్ఛతో మనం అర్హత పొందగలుగుతాము. ఇలా ఎంతమందికో, ఎన్నో ప్రాప్తమై ఉంటాయని ఎన్నోసార్లు నిరూపణ జరిగింది. ఒకామెకు జాతకంలో వివాహయోగం లేదని చాలామంది చెప్తున్నారని, ఆమె తండ్రి కమలమ్మగారికి చెప్తే, ఆమె దీక్షలు ఇచ్చి, తనతోనే ఉంచుకుని, దోషములు పోగొట్టి, వివాహం జరిపించారు. ఇప్పుడు ఆమె పిల్లాపాపలతో హాయిగా ఉంది. అది ఆమె ఇచ్ఛామాత్రంగానే ప్రసాదించారని మనం గ్రహించాలి.

భావముఖంలో ఉన్నవారికి ప్రపంచ వ్యవహారం నడపడానికి మనసును దేహంపైకి లాగినప్పుడు, ఆయనకు అమ్మవారి సంకల్పం తప్ప, తన సంకల్పం ఉండదు. ఉదాహరణకు, కమలమ్మగారు శిష్యులను ఉద్ధరించేటప్పుడు, వారి బాధ్యతలు తీర్చేటప్పుడు, పరిష్కారములను తెలిపేటప్పుడు, ఆమెకు సంకల్పముండదు (దేహపరంగా ఉన్న కమలమ్మలాగా). ఆ అమ్మవారి సంకల్పమేదో అదే జరుగుతుంది. అందుకనే వ్యవహారములో అవతలివారు ఎంత క్రూరులైనా, అహంభావులైనా, అజ్ఞానులైనా వీరికి కోపంగానీ, ద్వేషంగానీ, క్రోధంగానీ రావు. వాటితో పనిలేదు. అమ్మవారే వీరి నోటిగుండా సంకల్పాన్ని పలికిస్తారు. అందుకే పరిష్కారాన్ని సూచించేటప్పుడు వారుండే స్థితి వేరు. విడిగా ఉన్న కమలమ్మగారు వేరు.

ఒక శిష్యునికి ఉపదేశాన్ని ఇచ్చేటప్పుడుగానీ, ఉద్ధరించేటప్పుడుగానీ, దేవీ విగ్రహాన్ని అర్చించేటప్పుడుగానీ, ఆ దివ్యజనని సంకల్పంలో తాదాత్మ్యం చెంది, ఆ ప్రకారమే మనల్ని నడిపిస్తారు. ఉదా॥కు, ఒక శిష్యురాలు వాళ్ళింటికి రమ్మన్నప్పుడు, ఈమె అమ్మవారి విగ్రహంవైపు చూసి, "వాళ్ళు రమ్మంటున్నారు, వాళ్ళింటికి వెళ్తావా?" అని అడిగి, "ఆమె మీ ఇంటికి వస్తుందిట. నేను ఫలానా రోజు వస్తాను" అని వారికి చెప్పేవారు. అంటే, ఈమె ఈ విషయాన్ని దేవీసంకల్పంతో తాదాత్మ్యం చెంది (ఆ స్థితిలోకి వెళ్ళి), ఆ ప్రకారమే నడిచేవారని అర్థమౌతోంది.

తన చెల్లెలు, తనమధ్యాంబ ఫలానా రోజు చనిపోతుందని కలలో చెప్పడం, మరొకరికి (ముందుగానే) కళ్ళు పోతాయని చెప్పడం, తన కుమార్తెకు పెండ్లికాదనీ, పీఠసేవకే అర్పితమవుతుందని చెప్పడం, ఇలాంటివి ఎన్నో భవిష్యత్ దర్శనాలు ఆమె చెప్పేవారంటే, ఆమె ఆ ప్రజ్ఞలోకి వెళ్ళి, అక్కడ అమ్మవారి సంకల్పంతో తాదాత్మ్యం చెంది, విషయాన్ని మనకు చెప్తుండేవారని అర్థమౌతోంది. అది అమ్మవారి ఆజ్ఞ, సంకల్పం మాత్రమే. అంతేగాని, కమలమ్మగారి మనసుకి, బుద్ధికి తోచినట్లు చెప్పడం కాదన్నమాట. మనసు, బుద్ధి దాటి ఆ ప్రజ్ఞలోకి చేరుకుంటే తప్ప, సూచించేవారు కాదని తెలుస్తోంది. అది వ్యక్తిగతమైతే, ఇంత ఖచ్చితమైన, సత్యమైన పరిష్కారాలు సూచించబడవని కూడా మనం గ్రహించుకోవచ్చు.

భావముఖ స్థితి గలవారికి విశ్వప్రేమ వలన, వారెంతో బాధలో ఉన్నాసరే అవతలివారి బాధను విముక్తి చేయడానికి సంసిద్ధంగా ఉంటారు. ఉదాహరణకు, ఆమె గొలుసు పోయినప్పుడు, దొంగను జైల్లోపెట్టి కొడుతుంటే, ఆమె "అతణ్ణి కొట్టకండి, గొలుసు దొరికింది కదా! అయినా, అది నేనే అతనికి ఇచ్చాను. అతన్ని వదిలేయండి" అని అతణ్ణి విడిపించారు. *(విశ్వప్రేమ)*

"అమ్మాయికి గాజులు పెడితేగానీ, అత్తగారు తీసుకెళ్ళమంటున్నారు" అని ఒకామె చెప్తే, నా గాజులు తీసుకెళ్ళి ఆమె సంసారాన్ని బాగుచేయమన్నారు. *(కరుణ)*

"పాపం ఆడపిల్ల పెళ్ళిచేసుకుంటోందిరా" అని ఒకళ్ళ వద్ద డబ్బు తీసుకుని వాళ్ళకి సర్ది, తరువాత మళ్ళీ వీళ్ళకు సర్దేస్తుండేవారు.

ఆమె దగ్గర ఏమీ లేకపోయనా సరే, ఉన్నదేదో వచ్చినవాళ్ళకు పెట్టకుండా పంపేవారుకాదు.

ఒక పేదస్త్రీ నడిరోడ్డులో పురుడు పోసుకుంటూ, ఒక పాతచీర ఇమ్మని అడిగితే, కట్టుకున్న చీర ఆమెకు ఇచ్చి, ఒక పంచె చుట్టుకుని ఇంటికి వచ్చారు. తరువాత త్రిపురం పిన్నిగారు వచ్చి బీరువా తాళంతీసి చీర ఇస్తే అప్పుడు కట్టుకున్నారట. మనకున్నదా, లేదా అనే ప్రశ్నకాదు, ఇవ్వటమే వారి కరుణకు చిహ్నము.

ఇటువంటి లక్షణములు ఉన్నవారినే అమ్మవారు భావముఖ స్థితిలో ఉండమని, మానవజాతి ఉద్ధరణ కోసం అవతరించమని ఆదేశిస్తారు. వారు అమ్మవారి ఉద్ధారశక్తి ప్రతిరూపాలే. మనసు ఎప్పుడూ బ్రహ్మమందే ఉంచి, అందులోనే లయం చెందుతూ, ఆనందాన్ని అనుభవించాల్సిన స్థితి ఉండి కూడా, అంటే అమ్మవారి స్థితే..... ఆమే అవతార స్త్రీమూర్తిగా ఉద్భవించి, మనలాగే మనమధ్య తిరుగుతూ, కష్టాలుపడతూ, ఆర్థికంగా సామాన్య జీవితం గడుపుతూ, భర్త, పిల్లలు, సంసారమను గృహస్తాశ్రమ ధర్మాలు పాటించి, సంఘంలోని కట్టుబాట్లు, ఆచారాలను గౌరవిస్తూ, అమ్మవారి ఉపదేశ దీక్షలు తీసుకుని, ఎంతోమందిని ఉద్ధరించి, మరెంతోమందికి మార్గం చూపెడుతూ, రాబోయే తరాలవారికి మార్గదర్శకంగా నిలిచిన ఈ అవతారమూర్తిని 'అమ్మమ్మ' అని పిలుచుకోగలిగిన అదృష్టాన్ని రక్తసంబంధంతో ఈ జన్మలో పొందగలిగాను. ఆత్మసంబంధంతో గురువుగా, అవతారమూర్తిగా గ్రహించగలిగే జ్ఞానాన్ని ప్రసాదించిన దేవతామూర్తికి నేను కోటి

ప్రణామములు సమర్పించుకుంటున్నాను. నాకు ఆదేశించిన కర్తవ్యాన్ని నేను సక్రమంగా ఆచరించేలాగా అనుగ్రహించమని వేడుకుంటున్నాను.

**07.04.2005, నమక్కల్**

## శ్రీరామకృష్ణ జీవిచరిత్రలో మధురుని స్వీయానుభూతి

శ్రీరామకృష్ణ మేనల్లుడైన హృదయునకు, దక్షిణేశ్వరంలో రాణీరాస్మణీ దేవి నిర్మించిన ఆలయంలో పూజారిగా నియమింపబడ్డ రామకృష్ణుడు 'దైవమా? అవతారపురుషుడా?' అనే అనుమానంతో ఉన్న ఆమె అల్లుడైన మధురునికి కల్గిన అనుమానం వలన వైద్యునకు చూపిస్తే "గురుదేవుని స్థితి అవతార పురుషులకు మాత్రమే కలిగే అత్యుత్తమమైన మహాభావ స్థితి" అని శాస్త్రప్రమాణముల ఆధారంతో నిరూపించే అవకాశం మొదటి గురువైన భైరవీబ్రాహ్మణికి దక్కింది.

మధురబాబుకు గురుదేవుని విషయంలో సందేహమున్నా, ప్రత్యక్షంగా తనకు కలిగిన అనుభూతి వలన నివృత్తి అయింది. ఒకరోజు దేవాలయ ప్రాంగణంలో ఉన్న గదిలోనుండి చూస్తుండగా, మధురునకు గురుదేవుడు పచార్లు చేస్తూ కన్పించారు. ఒకవైపు నడుస్తున్నప్పుడు దివ్యజననిగానూ, రెండవవైపు తిరిగి నడుస్తున్నప్పుడు శివ్యునిగా కనిపించింది. ఇలా ఎన్నోసార్లు చూసినా, నిజమేనని అంగీకరించక తప్పలేదు.

మరొక సంఘటన. భగవంతుడు సృష్టినియమాలను మార్చగలడా? అనే విషయాన్ని మధురుడు గురుదేవుని సవాలు చేశాడు. "భగవంతుడు తల్చుకుంటే ఎర్రమందారాన్ని తెల్లపువ్వుగా మార్చగలడా?" అని ప్రశ్నించాడు. "అది సాధ్యమే" అన్నారు రామకృష్ణులు. కొన్ని రోజుల తర్వాత ఒక చెట్టుయొక్క ఒకే రెమ్మకు రెండు పూవులు - ఒకటి ఎరుపు, ఒకటి తెలుపు పూయడాన్ని గురుదేవుడు మధురునకు చూపించి నవ్వారు.

అట్టి సంపన్నుని మద్దతు, ప్రాపంచికుడైన హృదయుని పరిచర్య (మేనల్లుడు) ప్రపంచ పరిస్థితులనే మరచి, భక్తిపరాకాష్టలో తన సాధనా స్థితిలో అవసరమైపోయింది. ఇవి మధురుని ద్వారా, హృదయుని ద్వారా దైవికంగా ఏర్పరచబడినవి. మధురుని గూర్చి గురుదేవుడు, దివ్యజనని తనకు ఏర్పాటుచేసిన (రసద్దారు) వస్తువులు అందించువాడు అని చెప్పినాడు.

కమలమ్మగారి జీవిత చరిత్రను పరిశీలిస్తే, ఆమె సుమారు 1954-55 సం॥లలో ఏలూరు వచ్చి, ఒక ఇంట్లో పూజామందిరాన్ని ఏర్పరచుకుని, పూజ చేసుకుంటూ, ఇద్దరు ఆడపిల్లలను స్కూల్ ఫైనల్ చదివించుకుంటూ, మామూలు గృహిణివలె జీవిస్తున్న సమయంలోనే ఒకసారి పక్కవాటాలో ఉన్న వ్యక్తి భార్య "ఏమిటో, ఈ పూజలు అవీ!" అని అనుకుందిట. తర్వాత ఆమె భర్తకు, ఒక చిన్నపిల్ల పరికిణీ కట్టుకుని, గాజుల చప్పుడుతో పరిగెత్తుకుంటూ కమలమ్మగారింట్లోకి వెళ్ళటం, దేవుని గూట్లో (మందిరం వద్ద) మాయమవటం కనబడిందట. వెంటనే ఆయన తన భార్యతో, "ఇంకెప్పుడూ ఆమెను విమర్శించకు. ఆమె ఇంట్లో అమ్మవారు ఉన్నది. నాకు స్వయంగా కనబడింది" అన్నారట. ఆ విధంగా ఇక్కడ ఆమె తన ఉనికిని తనే తెలియజేసుకుంది.

తరువాత 1956లో శ్రీప్రతాప విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న పెంకుటింట్లో నివాసముంటానని మరొకరికి కలలో కనిపించి మూడుమెట్లున్న పీటను చేయించమని ఆజ్ఞాపించింది. తరువాత కమలమ్మగారు కమలాంబికా ముక్తిధామమనే నివాసమునకు మారి బాలాత్రిపురసుందరీ అమ్మవారి పీఠస్థాపన చేశారు. (ఇలాగే గురుదేవులు దక్షిణేశ్వరంలో కాళికాలయమునకు పూజారిగా ఉండి, అర్చిస్తూ, సాధన చేసుకున్నారు). అలాగే కమలమ్మగారు "బాలాత్రిపురసుందరి" వద్ద అర్చకురాలిగా, సాధకురాలిగా, మనలాంటివాళ్ళకు బోధకురాలిగా, వచ్చిన వాళ్ళకు సేవకురాలిగా, అమ్మవారికి మనకు మధ్యలో 'భావముఖ స్థితిలో' గుమ్మంవలె ఉండి, ఆమె అక్కడే తరించి, మనచేత ఇప్పటికీ తరింపజేసే సాధనలను చేయిస్తున్నారనడం నిస్సందేహము. ఈ "మహాభావస్థితి" అవతారపురుషులకు మాత్రమే కలుగుతుందని అత్యుత్తమ శాస్త్ర ప్రమాణాలతో భైరవీ బ్రాహ్మణి లోకానికి నిరూపించారు.

ఇక్కడ, ఈయన మధురుని 'రసద్దారు'గా అమ్మవారు తనకు ఏర్పరచింది అన్నారు. అలాగే కమలమ్మగారికి తన గర్భంలో పుట్టిన త్రిపురాంబకు (కోరలతో పుట్టింది, కాళికాంశ అని చెప్పారు) పుట్టిన 3వ రోజున కోరలు రాలిపోయాయట. ఆ జగజ్జననే ఈమె కడుపున, కుమార్తెగా ఉద్భవించి (లౌకికంగా) రసద్దారుగా నియమించబడ్డారు. ఆ కుమార్తే, చదువుకుని ఎలిమెంటరీ స్కూలులో టీచరుగా పనిచేస్తూ, ఆర్థికంగా చివరి వరకు సహాయపడింది. (ఆమె వివాహం చేసుకోకుండా, పీఠానికే అంకితమవుతుందని కమలమ్మగారు ముందే చెప్పారు.)

ఆ భగవతే తన కూతురుగా ఉద్భవించి, ఆర్థికంగా తోడ్పడకపోతే లౌకికంగా ఆమె జీవనం వేరేగా ఉండేది కదా! ఇక్కడ కూతురే తల్లిలాగా వ్యవహరించి, ఆమెకు అన్నివిధాలుగా రక్షణ కల్గించింది. ఎంత లీల అమ్మవారిది? ఆలోచిస్తేగానీ అంతుబట్టనివి. ఆ డబ్బుతోనే ఈమె వచ్చినవారికి భోజనం పెట్టడం, అవసరం ఉన్నవారికి అనేకవిధాలుగా సహాయం చేయడం, తన మరొక కుమార్తెకు పెళ్ళిచేయడం, పురుళ్ళు పోయడంవంటి లౌకిక బాధ్యతలెన్నో నిర్వహించ డానికి, అలాగే ప్రశాంతంగా అమ్మవారి కార్యక్రమాలు నిర్వహించుకోడానికి, తన వద్దకు వచ్చేవారి సమస్యలు తీర్చడానికి, పూజాకార్యక్రమాలు వారిచేత చేయించడానికి, ఉత్సవాలు జరిపించడానికి, ఇలా ఎన్నోవిధాలుగా ఆమె సేవలు (మధురునివలె) కమలమ్మగారికి అంకితమయ్యాయి.

కమలమ్మగారికోసం ఆ దివ్యజనని ఏర్పాటుచేసిన రసద్దారు, 'త్రిపురాంబ'. హృదయునివలె పరిచర్యలు కూడా ఈమెచేత చేయించబడ్డాయి. ఇవన్నీ ఆమెకు అమ్మవారు చేసిన ఏర్పాట్లు (మధురుని అనుభూతులవలె). కమలమ్మగారు కూడా ఎంతమందికో– మొదట్లో పుల్లాబ్జాక్షిగారికి కలలో కనబడి తనవద్దకు రప్పించుకోవడం, దుర్గాంబగారికి కాళికాదర్శనం ఇచ్చి, తనే కాళికాంశనని తెలియజెప్పడం, నాంచారికి సాకారంగా రాజరాజేశ్వరీ దర్శనం కలుగజేయడం, మరొకరికి దుర్గగుడి మెట్లమీద (కృష్ణలో పడిపోతే, చేతులతో ఎత్తి పడుకోబెట్టి) రక్షించడం, ఇలా ఎన్నెన్నో నిదర్శనలు చూపించి, తనెవరో వారికి తెలియజేసి తన వద్దకు రప్పించుకోవడం, సాక్షాత్తూ తనే అమ్మవారని వారికి తెలిసేలా జ్ఞానాన్ని ప్రసాదించడంలాంటి ఎన్నో అనుభూతులు

ఎంతోమంది శిష్యులకు ఆమె అనుగ్రహించడం మనం ఆమె జీవితచరిత్ర చదివితే గ్రహించవచ్చు. అందుచేతనే ఆ రోజుల్లోనే ఎంతోమంది ఆమెను గురువుగానూ, సాక్షాత్తూ అమ్మవారిగానూ భావించి ఈరోజుకి కూడా “ముక్తిధామాన్ని” దర్శిస్తూ, కొలుస్తూనే ఉన్నారు.

భగవంతుడు సృష్టి నియమాలను మార్చగలడా? ఎర్రమందారాన్ని తెల్లమందారంగా మార్చగలడా? అనే మధురుని ప్రశ్నకు గురుదేవులు స్వయంగా చేసి చూపించారు.

అలాగే ఇక్కడ ఈమె చరిత్రలో, సాక్షాత్తూ తన కుమార్తె త్రిపురాంబ ఒకసారి పద్మాసనంలో కూర్చుని, గాలిలోకి అంత ఎత్తున లేచి, “ఇదిగో చూడు” అంటూ ఒకచేతిని విదిలించి మంచువానను కురిపించారు. మరొకచేతిని విదిలించి మల్లెలవాన అంటూ మల్లెల్ని కురిపించారు. అది చూసిన కమలమ్మగారు ఆ భగవతి తనకు పెడుతున్న పరీక్షగా గ్రహించి, “ఇటువంటి సిద్ధులూ, ప్రలోభాలకు నన్ను గురిచెయ్యవద్దు తల్లీ! ఈ పీఠం కామకూటం కారాదు. ముక్తిధామం కావాలి” అని వేడుకున్నారట. ఆ తర్వాత త్రిపురాంబ నేలపైకి వచ్చింది. ఈ సంఘటనను స్వయంగా కమలమ్మగారు శిష్యులకు చెప్పారు.

దీన్నిబట్టి మనం, అమ్మవారు సృష్టి నియమాలను ఎంత అవలీలగా మార్చగలదో అర్థంచేసుకోవచ్చు. ఆమె ఇచ్ఛ ప్రకారం ఏదైనా జరుగుతుందని తెలుస్తోంది. అక్కడ ఎర్రమందారం, తెల్లమందారం రెండూ ఒకే కొమ్మకు పూసినట్లుగానే - ఇక్కడ ఒక చేతిలో మంచువాన, రెండోచేతిలో మల్లెలవాన కురిపించారు ఆ అమ్మవారు. మంచువాన సృష్టి నియమమే. మల్లెలవాన సృష్టి విరుద్ధము కదా. దాన్నే అమ్మవారు మార్చి చూపించారు ఇక్కడ.

అలాంటివి జరిగినప్పుడు కూడా సాధకులు ఎలా ఉండాలో కమలమ్మగారు ఆచరించి చూపించారు. ఆ సిద్ధులవల్ల కామములు (లౌకికం) తీరుతాయి. కానీ అవి సాధనకు (ఆధ్యాత్మికానికి) ఉపయోగపడవు. అవి ముక్తిమార్గానికి అవరోధాలు అని బోధకురాలైన కమలమ్మగారు తెలియజేశారు. కాబట్టి, ఇక్కడ అమ్మవారి ఇచ్ఛతోనే ఏమైనా జరుగుతాయని, సృష్టి నియమాలు తిరగబడతాయని, ఇద్దరు అవతారమూర్తులు తెలియజేసి, అనుభవానికి తెచ్చి చూపించారు. ఇది చూసినవాళ్ళు, విన్నవాళ్ళు, చదివినవాళ్ళు కూడా ఎంతో అనుగ్రహపాత్రులైతే తప్ప ఈ విషయాలు మామూలు జీవులకు బోధపడేవి కావు. ఇదంతా ఆ దివ్యజనని యొక్క దివ్యకరుణకు ఉదాహరణలు. రామకృష్ణునికి కూడా అష్టసిద్ధులు కలిగినవి. కానీ దివ్యజనని వాటిని అశుద్ధమువలె నీచమైనవిగా చూపుటవలన వాటిని అసహ్యముతో నెట్టివేశారు.

## గురుదేవుని తాంత్రిక సిద్ధి - సాధన

అవతార పురుషుడైన గురుదేవుడు ఉత్తమ సాధకుడు కావడం మూలాన తంత్రశాస్త్ర నిర్దిష్టమైన 64 తంత్రసాధనలను భైరవీబ్రాహ్మణి ఆయనచేత చేయించింది. 2 నుండి మొదలుకుని 10 చేతులు కల్గిన దేవదేవీ దర్శనములు ఆయనకు కల్గినవి. ఆ దేవతలలో కొందరు ఆయనతో ముఖాముఖి మాట్లాడి, అనేక విషయములు బోధించారు. ఆయనకు దర్శనమిచ్చిన అన్ని రూపాలు

అత్యంత సౌందర్యంగా ఉన్నా, అవి 'షోడశి' అని చెప్పబడే రాజరాజేశ్వరి అమ్మవారి సౌందర్యంతో పోల్చదగినవి కావని ఆయన చెప్పారు. దేవిని వర్ణిస్తూ గురుదేవుడు "నాకొక దృశ్యంలో షోడశి దర్శనమిచ్చింది. ఆమె సౌందర్యం ద్రవించి అన్నివైపులా వ్యాపించి దిక్కులన్నింటినీ ప్రకాశవంతం చేసింది" అన్నారు. భైరవుడు మొ॥గు పురుషాకృతి గల దేవతలు కూడా ఆయనకు దర్శనమిచ్చారు.

తెంపులేని అనాహత ప్రణవనాదాన్ని ఆయన విని, దానివల్ల జంతువుల ధ్వనులతో సహా అన్ని శబ్దాలలో ఉన్న అర్థాన్ని గ్రహించారు. సుషుమ్ననాడి గుండా కుండలినీశక్తి పైకి లేస్తున్నట్లుగా గుర్తించారు. ఆయన స్వభావం ఒక పిల్లవాని స్వభావంగా మారిపోయింది.

ద్వందాతీతస్థితి వృద్ధిచెంది పవిత్రతకు, అపవిత్రతకు తేడా నశించి, అన్నీ పవిత్రంగానే కనబడడం మొదలైంది. అమ్మవారిని ప్రార్థించాక అమ్మవారి సౌందర్యం ఆయనలోకి వెళ్ళిపోయింది. అందరిలోనూ అమ్మవారే ఉన్నట్లుగా గోచరించింది. అష్టసిద్ధులు కలిగినవి.

అమ్మవారు కొన్నిసార్లు నక్కరూపాన్ని ధరిస్తుందని, కుక్కలు భైరవుని వాహనాలు అవుతాయని ఆయనకు ఉపదేశింపబడడం వలన కుక్కలు తిన్న ఎంగిలి మెతుకులను ఆయన ప్రసాదంగా స్వీకరించాడు.

"అత్యంత కష్ట సాధనమైన తాంత్రిక సాధనలో నీవు సిద్ధి పొంది దివ్యస్థితిలో నిలిచిపోయావు. వీరసాధనలో ఇది తొలిమెట్టు" అని బ్రాహ్మణి చెప్పింది. ఆయన మానవజాతికి అందుబాటులో ఉన్న మార్గాలన్నింటి ద్వారా భగవంతుని దర్శించాలని తపించి, ఒకే దైవాన్ని అన్ని విధానాల ద్వారా ప్రత్యక్షం చేసుకున్నారు.

సామాన్యుడు సిద్ధి పొందటానికి అనేక జన్మలుపట్టే ఏ సాధనైనా ఆయనకు మూడురోజులకన్నా ఎక్కువ పట్టేదికాదు. గుమ్మడి మొదలైన చెట్లలో ముందు పిందెపుట్టి తరువాత పూలు వికసించినట్లు అవతార పురుషుల విషయంలో సాధనకు ముందే సిద్ధి కలుగుతుంది అని ఉపదేశం గావించి, స్వీయజీవితములో వ్యక్తం చేశాడాయన.

**శ్రీకమలాంబికా చరిత్రను పరిశీలిస్తే...**

ఆమె 5 సం॥ల పిల్లగా ఉన్నప్పుడే, "అమ్మ నన్ను పిల్చింది. లోపలికి వెళ్ళాను" అంటూ తండ్రి పూజామందిరంలో పద్మాసనంలో కూర్చుని ధ్యాననిమగ్నురాలైంది. 11 సం॥ల పిల్లగా ఉన్నప్పుడు తిరువత్తియూరు గుళ్ళో, గురువుల సారధ్యంలో, ఉపవాసదీక్షను సాగించినపుడు ఆమెకు పార్వతీపరమేశ్వరుల దర్శనమైంది.

సుమారు 40 సం॥ల వయసులో అమ్మవారు కనబడి "నేను బాలాత్రిపురసుందరిని. నీ దగ్గరే ఉంటాను" అంటే, "నీకు మరి వడ్డాణం లేదేం?" అని ప్రశ్నించింది. "నేనే వెండికొండను. ఒక గనిని. నాకు వడ్డాణంతో పనిలేద"ని అమ్మవారు చెప్పింది. "మరి, నీకు నైవేద్యాలతో నేను వండిపెట్టలేను" అన్నారట. దానికి అమ్మవారు "నీ మనోనైర్మల్యం నచ్చింది. కనుక నీచేత్తో తులసితీర్థం ఇవ్వు చాలు. నీవద్ద ఉంటాను. వాక్కులో పలుకుతాను" అని చెప్పి దర్శనమిచ్చింది.

ప్రతి దసరా ముందురోజుల్లో, రాజమండ్రి నుండి శ్యామలాంబ (అమ్మవారు) వచ్చి, చీర తీసుకుంటుంది అని చెప్పేవారు. అలాగే ఆకుపచ్చ చీర కట్టుకుని, ఎవరో ఒక స్త్రీరూపంలో పండుగ ముందురోజుల్లో వచ్చి, ఈమె చేత్తో చీర తీసుకుని వెళ్ళడం ఇప్పటికీ జరుగుతూనే ఉన్నది. అమ్మవారు ఈవిధంగా ఈమెతో ముఖాముఖి మాట్లాడిన సంఘటనలు చాలా ఉన్నాయి.

షోడశి అని చెప్పబడే రాజరాజేశ్వరి సౌందర్యానికి గురుదేవులు ముగ్ధులైనారు. అలాగే కమలమ్మగారికి ఒకసారి రాత్రి 11 గం॥ల మధ్యకాలంలో "తెల్లని వస్త్రములు ధరించి, కిరీటము, త్రిశూలమును ధరించి, గుర్రమును ఎక్కి, రాజరాజేశ్వరి కన్పించి, తనవద్దకు వచ్చినట్లు దర్శనమైందని ఆమె స్వయంగా తన పిల్లలకు, శిష్యులకు చెప్పారు.

ఒకసారి కమలమ్మగారు రైల్లో ప్రయాణం చేస్తూ, "రైలుకూతలో ఏం వినబడుతోందో గమనించారా? ఓం నమశ్శివాయ అనే ప్రణవనాదం వినిపించడం లేదూ" అని శిష్యులను ప్రశ్నించారు. అందువలననే ఆమె అన్ని ధ్వనులలోనూ కూడా శివపంచాక్షరీ మంత్రాన్నే వినగలిగారు. యివన్నీ సాధనలో పరివర్తన కలిగాక వచ్చే మార్పులని మనకు తెలుస్తోంది. ఆమె మనస్తత్వం కూడా చిన్నపిల్లల మనస్తత్వంలాగా మారిపోయినది. అందుకే పిల్లలతో పిల్లలాగా మెలిగేవారు. పెద్దవాళ్ళతో పెద్దవాళ్ళలాగా, జ్ఞానులతో జ్ఞానిలాగా, విజ్ఞులతో విజ్ఞానిలాగా ప్రవర్తించేవారు. మొత్తంమీద బాల్య మనస్తత్వం ఎక్కువగా కనబడేది. చీకూచింతా లేకుండా ఎల్లప్పుడూ శిష్యులతో నవ్వుతూ, నవ్విస్తూ హాయిగా కాలం గడుపుతుండేవారు.

గురుదేవుడు, సుషుమ్నానాడి ద్వారా సహస్రారానికి కుండలిని లేవడం గమనించారు. ఈమె 73 సం॥ల వయస్సులో పద్మాసనంలో కూర్చుని, యోగముద్రలు ధరించి, సహస్రారము గుండా కుండలినీ శక్తి అనంతవాయువుల్లోకి పంపి, కపాలమోక్షము అనబడే ముక్తిని పొందారు. (కపాలములో రంధ్రమును చూడమని శిష్యులకు ముందే చెప్పడం వలన, అందరూ ఆ క్రియయొక్క ఫలితమును చూసి తరించారు) ఈ శక్తి ప్రసారమును అందరికీ చేసిచూపించారు.

ద్వంద్వాలకు అతీతం కనుకనే, ఇక్కడకు వచ్చేవాళ్ళకు బీద ధనికులు, మంచి చెడు, పెద్ద చిన్నా, శాస్త్రం మూర్ఖత్వం ఇలాంటి బేధాలేవీ లేకుండానే ఈమెను ఆశ్రయించి, బాధలు చెప్పుకుని, ఆమె చెప్పిన విధానాలను అనుసరించి, బాధావిముక్తులవుతున్నారు. ఆమెకు పవిత్రం, అపవిత్రం అనే పదాలకు అర్థం తెలియదు. 'మనసు' పవిత్రంగా ఉండాలనేదే ఆమె సిద్ధాంతము. లౌకికంగా కనబడే వాటితో వాళ్ళకు పనిలేదు. ప్రతివాళ్ళకు పవిత్రభావం భగవంతుడి పట్ల ఉంటేనే తప్ప, మనసు విశాలం కాదనీ, ఆ భావాన్ని అందరిపట్ల వర్తింపజేసే సాధన చేస్తేనేగానీ మనోనైర్మల్యం రాదనీ, కాబట్టి మనసును విశాలం చేసుకోమని చెప్పారు. 'నిర్మల హృదయమే – భగవతి నిలయమని' కూడా చెప్పారు.

ఒకసారి, "వివేకానందుని ఫొటోనుండి ఒక కాంతిపుంజము తనలోకి ప్రవేశించిందనీ, తన చెవివద్ద జన్మజన్మల నుండీ నీలో ఐక్యమవ్వాలని తపిస్తున్నానని చెప్పిందని" ఆమె స్వయంగా

తన శిష్యులతో చెప్పారు. ఆమె వద్దకు వచ్చిన వారందరిలోనూ ఆమె అమ్మవారినే చూసి, అమ్మవారుగానే భావించి సేవ చేసేవారు. ఎప్పుడూ, ఎంతమందికైనా సరే ఆమె బొట్టు పెట్టేవారు. వచ్చిన వాళ్ళకు ఏదో ఒకటి పెట్టి పంపించడం, ఆడపిల్లలకైతే గాజులు కొనుక్కోమని డబ్బులివ్వడం, బట్టలుపెట్టడం చేసేవారు. శిష్యులకు ఆమే స్వయంగా ఇంట్లో ఉంచుకుని పురుళ్ళు పోశారు. పుట్టిన పిల్లలకి అమ్మవారిపేరు, ఆమె గురువుగార్ల పేర్లు పెట్టేవారు. ఆమె ఏపని చేసినా, అది దైవానికే చేస్తున్నామన్న భావనతో పూర్తి ఆత్మర్పణం చేసేవారు. నాది, నీది, మేము అనే పదాలు ఆవిడ నోట్లోంచి రావడమే ఎవ్వరూ వినలేదు. అన్నీ అమ్మవారికే చెప్పుకోండని ఆమె మనకు సమాధానం ఇస్తుంది. అలా చేసుకోండి" అనేవారు.

కాలభైరవుడు అంటే దత్తాత్రేయుడనీ చెప్తూ, భయంలేదు. అమ్మవారు కాలభైరవి రూపంలో మన వెనుకే ఉంటుందనీ, అది రక్ష అనీ భయపడాల్సిన పనిలేదనీ పిల్లలకు చెప్పేవారు. సత్యనారాయణగారు (భర్త) పిల్లల్ని తీసుకుని, రాత్రి సమయంలో ఒంటరిగా వస్తున్నప్పుడు పిల్లలు భయపడితే, "భయంలేదు. మన వెనకాల కుక్క వస్తోంది అదే మనకు రక్ష" అనేవారట. వీళ్ళు ఇంటివరకూ వచ్చాక చూస్తే అది కనపడేది కాదట.

ఇంటిదొడ్డివైపున ముస్లిమ్‌లు ఉండేవారు. వాళ్ళింట్లో కోళ్లు, గేదెలు అవీ ఉండేవి. కోడిపిల్లలన్నీ (ఎక్కువ స్థలం లేకపోవడం వలన) మన వంటింట్లోనే ఉండేవి. ఆమె ఎప్పుడూ వాటిని తోలేవారు కాదు. ఇంట్లో ఉన్న గింజలు, పప్పులు తింటుండేవి. దొడ్లో ఉన్న గేదెలకు కుడితినీళ్ళు, అరటిపండ్లూ అవీ పెడుతుండేవారు. మనుషులతోపాటు జంతుదయ కూడా ఎక్కువే ఆమెకు.

ఆమె గురువులు ఇచ్చిన సాధనలు సక్రమంగా చేయడం వలన దివ్యస్థితిని పొందుటచే మానసిక స్థితులలో కలిగే మార్పులను గ్రహించగలుగుతాము. అదే వీరసాధకులకు తొలిమెట్టు అని బ్రాహ్మణి చెప్పింది. ఆయన అన్ని విధానాల్లోనూ ఒకే దైవాన్ని సాధన చేసి, సాక్షాత్కారం పొందారు. అందుకు చాలామంది గురువులు కూడా తోడ్పడ్డారు. ఈమెకు బాలాజీ, శ్యామలరావు గారు అనే ఇద్దరు గురువులు ఇచ్చిన ఉపాసనా మార్గాన్ని సాధన చేసినట్లుగా (లౌకికం) కనబడుతోంది. కానీ అమ్మవారే ఈమెలో (సాధన కంటే ముందూ, వెనుక కూడా) ఐక్యమౌతానని చెప్పారు. అంటే గుమ్మడిపిందె ముందుపుట్టి, పూలు తర్వాత వికసిస్తాయి. అలాగే అవతారపురుషుల విషయంలో కూడా అంతే అన్నట్లుగా ఈమె విషయంలో అదే నిజమైంది. భగవతే ఈమెలో ఐక్యమైంది. తర్వాత ఈమె చేసిన సాధన అంతా జీవులరూపంలో ఉన్న భగవతిని దర్శించడం కోసమే అని దృగ్గోచరమవుతుంది. ఏదేమైనా ఈమె చేసి చూపించిన సాధనలు, బోధలు శిష్యునికి ఆచరణాత్మకంగా ఉండేవే కానీ, ఇబ్బంది పెట్టేవికావు. సులభతరమైనవి. ఈమె సాక్షాత్తూ అమ్మవారే అని చెప్పటానికి మనకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?

అవతారమూర్తులందరూ ముందు సిద్ధులే. సాక్షాత్తూ భగవంతుని యొక్క ఉద్ధారశక్తి రూపాలే. కానీ ఈ సాధనలు, వాళ్ళ జీవితవిశేషాలు ఇవన్నీ మనల్ని తరింపచేయడానికి ఇచ్చే సందేశాలుగా మనం గ్రహించాలి.

**08.04.2005, నమక్కల్**

మేము ఏప్రిల్ 5న మద్రాసులో బయలుదేరి, ఉదయం సేలం వచ్చి, మధ్యాహ్నం ఒంటిగంటన్నరకు నమక్కల్ వచ్చాము. ఊరికి 3 కి.మీల దూరంలో ఉన్న 'నాలా' అనే త్రీస్టార్ హోటల్‌లో దిగాము. హోటల్‌కు ఎదురుగా, రోడ్డుకు అవతల హౌసింగ్‌బోర్డ్ కాలనీ ఉంది. ఉదయం టిఫిన్ చేయగానే, 10 గంటలకు బయలుదేరి కాలనీలోకి వెళ్ళాము. లోపల ఒక అమ్మవారి గుడి కనిపించింది. గుడికి తాళం వేసి ఉండటంతో, బయటినుండే నమస్కారం చేసి వచ్చేశాము. మధ్యాహ్నం 3 గంటలకు ఆయన బ్యాంక్‌కు వెళ్ళారు. నేను సాయంత్రం గం.5.30లకు మళ్ళీ ఆ గుడికి వెళ్ళాను. అమ్మవారి పేరు 'ముత్తుమారియమ్మన్'. చాలా అందంగా 'భువనేశ్వరి' లాగా ఉన్నది. గుడి చూసి వాకింగ్ చేద్దామని ఆ కాలనీలోకి బయల్దేరాను. గుడికి ప్రక్కగా కొంచెం దూరంలో ఉన్న ఒక ఇంట్లో (ఆరుబయట) గేటు దగ్గర ఉన్న ఇద్దరు ఆడవాళ్ళు నన్ను చూసి "మీరు ఎవరికోసం వెదుకుతున్నారు?" అనడిగారు. ఒకామె పసుపురంగు చీరకట్టుకుని, పెద్దబొట్టు పెట్టుకుని పడక కుర్చీలో కూర్చుని ఉన్నది. ఆమెను "ఇంగ్లీషు వచ్చా?" అనడిగాను. ఆమె "కొంచెం పురియుం" అంది. ఆమె తమిళంలో నా వివరాలు అడుగుతోంది. నేను ఇంగ్లీషులో చెప్తున్నాను. ఈలోపు హైదరాబాద్ నుండి పద్మ ఫోన్ చేస్తే నా మాటలు విని ప్రక్కనామె "తెలుంగా? నాకు తెరియుం. నాన్డా తెలుంగువాళ్ళం" అంది. నేను సంతోషంగా కుర్చీలో కూర్చున్నాను. మాటలు మొదలుపెట్టారు. రెండో ఆమె డ్రెస్‌లో ఉన్న నన్నుచూసి "పెళ్ళి అయ్యిందా?" అనడిగింది. "అల్లుడు, కోడలు కూడా ఉన్నార"న్నాను. వాళ్ళు ఆశ్చర్యపోయారు. ఆ అభినందనకు నేను చాలా ఆనందించాను.

ఈప్రక్క కుర్చీలో కూర్చున్న ఆమె తన ఫ్రెండ్ గురించి నాతో "ఈమె ఎదురుగా ఉన్న గుడికి ముఖ్యమైన వ్యక్తి. భజనలు, పాటలు చాలా బాగా పాడతుంది. ఈమె పిల్లలూ, భర్త కూడా డాక్టర్లు. ఆమె వయస్సు 4 సం॥లు. పేరు 'మిణ్ణరసి'. మీరు ఒక పాట పాడించుకుని వినండి. ఆమె శక్తిని పూజిస్తుంది. ఆమెను అందరూ ఓంశక్తి అని పిలుస్తారు. ఎల్లుండి శుక్రవారం నాడు ఉదయం గం.10.30ల నుండి గం.12.30ల వరకు రాహుకాల పూజలు గుళ్ళో ఈమెచేత చేయించబడతాయి. ఈమె పాడితే కొంతమందిపైకి అమ్మవారు వచ్చి, అందరికీ అన్నీ చెబుతుంది" అని చెబుతూ, "అమ్మవారి ప్రతిష్టకు ఈమె కాలనీలో అందరి వద్ద డబ్బు వసూలు చేస్తోంది, నేను కూడా రూ.30వేలు విరాళం ఇచ్చాను" అంది.

ఈలోపుగా ఆమె లోపలికి వెళ్ళి, దీపం వెలిగించి, నన్ను లోపలికి పిలిచి, తిన్నగా దేవుని గదిలోకి తీసుకెళ్ళింది. అమ్మవారు 'శారదాదేవి' (3 అడుగుల విగ్రహం) చేతిలో చిలకతో, చీరకట్టి అలంకరించి చాలా అందంగా ఉంది. "నేను కొలిచే ఓంశక్తి" అని చెప్పింది. నేను నమస్కరించాను. తరువాత ముగ్గురం హాల్లో కూర్చున్నాము. నేను ఒక పాట పాడమన్నాను. వెంటనే ఆమె "మా ఇంటి మహలక్ష్మి నువ్వే, రత్నదేవివి నువ్వే" అంటూ వచ్చీరాని తెలుగులో, నేనేదో తెలిసినదానిలా, నావైపు చూస్తూ ఒక పాట పాడింది. తరువాత తమిళంలో కొన్ని

పాటలు పాడి నన్ను ఒక జోలపాట పాడమంది. నేను 'కమలాంబ నా....', "ఉయ్యాల జంపాలలు' అనే రెండు పాటలు పాడితే ఆవిడ తన్మయత్వంతో విని, నీ గొంతు చాలా మాధుర్యంగా ఉంది అంటూ మెచ్చుకుంది. (ఆమె సంగీత విద్వాంసురాలు, కచేరీలు కూడా ఇస్తుంది). నేను రేపు టేప్‌రికార్డర్ తెచ్చి రికార్డ్ చేస్తానని చెప్పాను. ఆమె అలాగేనని, చీకట్లో ఒక్కరూ వెళ్లలేరని వాళ్ళిద్దరూ నన్ను హోటల్ దగ్గర దింపి వెళ్ళిపోయారు. మర్నాడు నేను అటువైపు వెళ్ళలేదు.

ఈ రోజు 7వ తారీకు, అమావాస్య (రేపు ఆంధ్రాలో ఉగాది). నేను ఉదయం ఆంజనేయ స్వామిని, నరసింహస్వామిని దర్శించుకుని, 11.00లకు గుడికి రాహుకాల పూజకోసం వెళ్ళాను. డ్రైవర్ "ఈమె ఎస్‌బిఐ ఆఫీసరు భార్య" అని నాగురించి చెప్పాడు. ఆమె "ఏం ఫర్వాలేదు. నేను చూసుకుంటాను" అంది. అక్కడ ఆమె దాదాపు 25మందితో కలసి పాటలు పాడుతుంటే, అమ్మవారు 'దుర్గ'కు పసుపు, గంధము, పెరుగు, పాలతో అభిషేకములు చేసి హారతులిస్తున్నారు. గుళ్ళో ఆమె పాడిన 3, 4 పాటల్ని రికార్డ్ చేశాను. హఠాత్తుగా ఆవిడ బాలాత్రిపురసుందరి పైన ఒక పాట, అమ్మమ్మ, అమ్మమ్మ అని మరొక పాట పాడింది. "అమ్మమ్మ అంటే ఎవర"ని అడిగాను. "అమ్మవారే" అంది. ఆ పాట వినగానే అమ్మమ్మ అక్కడున్నట్లుగా అనిపించి చాలా సంతోషం వేసింది. మరియమ్మన్ దర్శనం కూడా చక్కగా జరిగింది.

గుళ్ళో కార్యక్రమం అయిపోగానే వాళ్ళింటికి వెళ్ళాను. అవీ ఇవీ మాట్లాడుతూ, కొన్ని పాటలు పాడుతుంటే, ఆమె భర్త రామన్ భోజనానికి వచ్చి, నాతో మాట్లాడుతూ విషయాలన్నీ తెలుసుకుని "నా భార్య మీ గురించి చెప్పింది. మిమ్మల్ని చూసి చాలా ఆనందపడుతోంది. మీ గొంతు బాగుందని చెప్పింది" అన్నారు. ఆయన కేరళ బ్రాహ్మణుడు. "ఈరోజు అమావాస్య వల్ల పొద్దునే మా తండ్రిగారికి తర్పణం వదలి, స్వయంపాకం గుళ్ళో ఇచ్చి, మధ్యాహ్నం మాత్రమే భోజనం చేస్తాము" అంటూ నన్నూ భోజనానికి పిలిచారు. "నేను ఈరోజు ఉపవాసం" అన్నాను. సరేనని ఆయన భోజనం చేస్తూ, తన భార్య గురించి "ఆమె గుడి కట్టించినప్పుడు ఒకసారి గుడికి వెళ్ళి దణ్ణం పెట్టుకుని ఇంటికి తిరిగి వస్తుంటే అక్కడ దణ్ణం పెట్టుకుంటున్న ఒక వ్యక్తి ఈమె వెనకాల అమ్మవారు వీళ్ళింట్లోకి వస్తున్నట్లుగా చూశానని చెప్పాడు. అదే రోజు సాయంత్రం మళ్ళీ ఈమె గుడికి వెళ్తే, మరొకాయన కూడా అలాగే (అమ్మవారి ఛాయ) ఆమె వెనుక గుళ్ళోనించి వాళ్ళింట్లోకి వెళ్ళడం చూశానని చెప్పారట" అని చెప్పారు.

నేను ఆసక్తిగా వింటూ ఆయన కొన్ని మాటల్ని రికార్డ్ చేశాను. మరొకసారి ఈమె గుళ్ళో పాడుతుండగా, ఒకామె పైకి అమ్మవారు వచ్చి, అక్కడున్న వాళ్ళందరి గురించి చెప్పిందట. మరొకసారి కోయంబత్తూరులో ఉన్న ఆయన అక్కవాళ్లింట్లో అందరూ కలిసి భోజనం చేస్తుంటే, హఠాత్తుగా వాళ్ళ పనిమనిషి మీదకు అమ్మవారు వచ్చి, 'ఓంశక్తి' అని ఈమెకు నమస్కరించిందట. నువ్వే అమ్మవారివి అన్నట్లుగా ఏదో చెప్పిందట. మరొకసారి నాగదేవత గుడికి వెళ్తే, అక్కడ ఒకామె పైకి వచ్చి "నేను నాగదేవతను. నిన్ను చూడటానికి వచ్చాను. నువ్వు గుడికి రాకపోయినా, వచ్చేవారం నేనే వచ్చి నిన్ను చూస్తాను" అన్నదట. మరుసటి వారం వాళ్ళకు వెళ్ళడం కుదరలేదు.

ఆ పైవారం వీళ్ళు వాళ్ళ అన్నయ్యగారి ఊరు వెళ్ళారట. హఠాత్తుగా గదిలో పైనుండి ఒక నాగుపాము దిగిందట. వీళ్ళందరూ ఆశ్చర్యపోయారట. ఈలోగా వాళ్ళన్నయ్య దాన్ని తరిమేసి, చంపేశారట. వాళ్ళ ఇలా జరిగిందేమిటని భయపడుతున్నారు.

ఆ తరువాతి వారం గుడికి వెళ్తే వేరెవరి మీదకో ఆ దేవత వచ్చి "నేను నిన్ను చూడటానికి వస్తే, నన్ను కొట్టి చంపేశారు. అయినా సరే, నిన్ను క్షమించి, వదిలేసి ఆశీర్వదిస్తున్నాను" అని చెబితే ఆశ్చర్యపోయారట. (ఈ విషయం ఈ భార్యాభర్తలకు తప్ప వేరెవరికీ తెలీదు). వాళ్ళింటినుండి అమ్మవారి గుడి కనిపిస్తుంది. ఆయన ఒకరోజు రాత్రి గం.12లకు బయటకు వెళ్దామని లేచి, గుడివైపు చూస్తే చిన్నపిల్ల గుళ్ళో నుండి వీళ్ళింట్లోకి వస్తుంటే ఆయన చూసి భయపడి తలుపులు వేసేశారట.

ఈ విషయం ఉదయం తన భార్యకు చెప్తే "అవును, నేనూ చూశాను" అందట. ఇలాంటి అనుభవాలు చెబుతూ "ఆమెను అందరూ సకల గుణశీల" అని పిలుస్తారని, ఆమె కుట్టిన ఎన్నో కర్టెన్లు, దుప్పట్లు అన్నీ దగ్గరుండి చూపించారు. ఆమెకు మొదటి నుండి పాటలు పాడడం రాదనీ, 15 ఏళ్ళ క్రితం ఆయనకు గుండెనొప్పి వచ్చినప్పుడు ఒక గుడికి వెళ్తే, అక్కడ అమ్మవారి పాదాల ముందు తల పెట్టుకుని ఏడుస్తుంటే, హఠాత్తుగా పాటలు పాడడం వచ్చిందనీ, అప్పటినుండి కచేరీలు చేస్తోందని చెప్పాడు. ఆమె బొమ్మలు బాగా వేస్తుందని, వంటలు బాగా చేస్తుందని, ఆశువుగా కవిత్వం చెబుతుందనీ, పాటలు రాసి రాగాలు కట్టి పాడుతుందని" ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా చెబుతూ "మీరు శ్రద్ధగా వింటున్నారని ఇవన్నీ చెబుతున్నాను. లేకపోతే ఇలాంటి విషయాలు అందరికీ అర్థంకావు" అని అన్నాడు. నేను మధ్యమధ్యలో ఆయన మాటల్ని రికార్డ్ చేస్తున్నాను.

ఆమె ముఖంలో గర్వంకానీ, అతిశయంకానీ, గొప్పలు చెప్పుకుంటున్నట్లుగాకానీ నాకు అన్పించలేదు. ఆయన ఉత్సాహంగా చెప్తున్నారు. ఆమె నవ్వుతూ ఆయన మాటలు వింటోంది. నేను ఆశ్చర్యపోతూ వింటున్నాను. వాళ్ళ పిల్లలు డాక్టర్లనీ, వాళ్ళు ఆ ఊళ్ళోనే ఇల్లు, నర్సింగ్‌హోం కట్టుకున్నారనీ, రోజూ వీరిద్దరికీ మధ్యాహ్నం భోజనం కొడుకు ఇంటినుండి వస్తుందిట. ఇద్దరి కొడుకులూ రోజూ పొద్దునే వచ్చి, వీళ్ళను చూసి, ఈమె చేత్తో ఫిల్టర్ కాఫీని తాగి వెళ్తారట. నాకెందుకో ఆమె అదృష్టం, వారిద్దరి దాంపత్యం, ఆ ఇంట్లో పద్ధతి చూస్తే నాకు నా సంసారమే గుర్తుకు వచ్చింది. ఆయనకు 71 ఏళ్ళు. ఆరోగ్యంగా ఉన్నారు. ఆయన కలుపుగోలుతనం చూస్తే నాకు సాంబశివరావుగారే గుర్తుకు వచ్చారు. మా కుటుంబంలాంటి మరో కుటుంబం తమిళనాడులోని నమక్కల్‌లో ఉన్నదనుకున్నాను. తరువాత ఆయన హాస్పిటల్‌కి వెళ్ళిపోయారు.

నేను వెళ్తానని లేస్తుంటే, ఆవిడ కాఫీ ఇస్తానని వెళ్ళి, స్టవ్ తుడిచి, వెండికప్పు, వెండిగ్లాసులో నాకు కాఫీ తెచ్చి ఇచ్చింది. నా గురించి ఆమెకు ఏమీ తెలియదు కదా! ఈరోజు వాళ్ళింట్లో ఇలా ఉండిపోయానేమిటి అని అనుకుంటుండగా, "ఏమైనా తింటారా?" అనడిగింది. ఏదైనా ప్రసాదం

చేసి వాళ్ళింట్లో అమ్మవారికి నైవేద్యం పెట్టాలనిపించి, పుల్కాలు చక్కెర వేసి శారదాదేవికి నైవేద్యం పెట్టి, హారతిచ్చి, 'జయజయ శ్రీమంగళమనరే శ్రీకమలాంబకు' అనే పాట పాడాను. ఆమెకు రెండు పుల్కాలు పెట్టి, నేనూ తిన్నాను. ఆమె ఫొటో ఆల్బమ్స్ చూపిస్తుంటే మరొక ఆశ్చర్యం వేసింది. ఆమె దసరా చాలా దీక్షగా చేస్తారట. బొమ్మల కొలువు పెడతారట. (అందులో ఒక బొమ్మ, ఆకుపచ్చ చీర కట్టుకుని, రోకలి దంచుతున్న, అమ్మమ్మగారి పోలికలున్న ఒక చిన్న బొమ్మ ఉంది). నేను బొంబాయి నుండి తెచ్చి ఏలూరులో పెడితే, అందరూ "అమ్మమ్మగారి బొమ్మ ఎక్కడ చేయించావు?" అనడిగారు. అలాంటి బొమ్మ ఈమె వద్ద ఉన్నది. దసరా అయిపోగానే దానిని గుడ్డలో చుట్టి దేవునికి ఎదురుగా ఉన్న అటకమీద దాచేస్తారట. అలాంటి బొమ్మే నా దగ్గరా ఉండడం చూసి, "ఇవి ఏనాటి ఆత్మసంబంధాలో కదా? లేకపోతే ఇన్ని లక్షణాలున్న ఈమె వద్ద ఈ బొమ్మ ఉండడం ఎంత ఆశ్చర్యం?" అనిపించింది. నిజంగా అమ్మమ్మ అనుగ్రహం వీళ్ళమీద కూడా అపారంగా ఉంది. లేకపోతే అంతపెద్ద కాలనీలో నేను ఆమె ఇంటికే వెళ్ళడం ఏమిటి? ఆమె నన్నే పిలవడం ఏమిటి? విచిత్రంగా అనిపించింది.

నేను ప్రసాదం చేయడానికి వంటింట్లోకి వెళ్ళాను. ఆమె నాకు అన్నీ అందిస్తోంది. ఇంతలో ఎవరో ఒకామె (ఎర్రచీర కట్టుకుని ఉంది, పనిమనిషిలాగా ఉంది) ఈమెకు పూలు తెచ్చి యిచ్చింది. నన్ను హాల్లోకి పిలిస్తే నేను వెళ్ళాను. టేప్‌లో పాటల వింటూ ఆ వచ్చిన అమ్మాయి పద్మాసనంలో కూర్చుని ఊగిపోతూ, గుండ్రంగా తిరిగిపోతూ, తమిళంలో ఏదో మాట్లాడుతోంది. వెంటనే టేప్ ఆపేసి "నువ్వు ఎవరు?" అనడిగింది. "నేను శక్తిని" అన్నది. ఎందుకొచ్చావంటే, "నీ ఇంటిముందు ఒక నిమ్మకాయ కోసి పెట్టు" అని చెప్పింది. నాకు భయం వేసి, లేచి నిలబడ్డాను. నన్ను చూపించి "ఈమె ఎవరు?" అనడిగింది. "నువ్వు ఆరాధించే శక్తి" అన్నది. "ఆమె గురించి చెప్పు" అంది. "బాల ఎక్కడుంటే అక్కడ అమ్మవారు ఉంటుంది. అంతా బాగున్నది. ఆమె గురించి చెప్పేదేమీ లేదు. ఎక్కడున్నా అమ్మకే నమస్కరిస్తుంది, పిలుస్తుంది. నీ గుళ్ళో ఉన్న అమ్మే ఈమె" అంది తమిళంలో. అది విని ఆమె ఆశ్చర్యపోయి, నావైపు చూస్తూ నాతో ఇవన్నీ ఇంగ్లీషులో చెప్పింది. "నువ్వూ, నేనూ ఒకటేనని, మనిద్దరిదీ ఆత్మసంబంధమనీ చెప్తోంది" అంటే ఆశ్చర్యపోయాను. అప్పటినుండి నాకు వెండి కంచం కడిగి తెచ్చి అందులో ప్రసాదం పెట్టుకోమని, పాలుకాచి అందులో పుల్కాలను వేసుకోమని, మరొకసారి కాఫీని వెండిగ్లాసులో ఇచ్చి త్రాగమని కొంచెం బలవంతం చేసింది.

ఈసారి నేను మరింత ఆశ్చర్యపోయాను. ఆమె కోసం నేను వెళ్ళానా? నేనెవరో ఆ పనిమనిషి మీదకు వచ్చి, నా గురించి తెలియజేసింది. ఎంత ఆశ్చర్యం. ఆ తర్వాత నేను మన పీఠం, పిన్నిగారు, ధ్యానమందిరం, దసరాల గురించి కొన్ని వివరాలు చెప్పాను. 54 మందితో కూడిన ఒక ట్రస్ట్‌కు ఆమె ట్రస్టీ. నేను కూడా అదే చెబితే బాగుండదేమోనని, నా గురించి ఇంకేమీ చెప్పకుండా పిన్ని గురించి చెప్పాను. "శక్తి మనిద్దరినీ కలిపింది" అన్నదామె. నేను అవునన్నాను. ఉదయం గం.11.00లకు వెళ్ళినదాన్ని, సాయంత్రం గం.6.00ల వరకు అక్కడే ఉన్నాను.

నేను వచ్చేస్తుంటే, నాకు పసుపు, కుంకుమ, జాకెట్టు గుడ్డ, పసుపుతాడు, పసుపుకొమ్ము, నాలుగు గాజులు ఒక కవర్‌లో పెట్టి ఇచ్చింది. ఊరుకాని ఊళ్ళో, శుక్రవారంనాడు, రేపు ఉగాది అనగా, ఇవన్నీ జరగడం చూసి, ఆ అమ్మాయి చెప్పినట్లుగా నేనున్నచోటే, నాతోనే అమ్మవారు కూడా వస్తుంటుంది అన్నమాట ముమ్మాటికీ నిజమేనేమో అనిపించింది.

**09.04.2005, నమక్కల్**

## యాత్రలు

గురుదేవుడు 1869లో మధురనాథునితో యాత్రలు చేశారు. కాశీ, బృందావనం ముఖ్యక్షేత్రాలు. ఆయనకు కాశీనగరం మట్టి, రాయితోకాక బంగారంతో నిర్మించబడినట్లు, తపస్సు చేసిన అసంఖ్యాకులైన భక్తులనుండి వచ్చిన ఆధ్యాత్మిక అనుభవాలతో పొరపైన పొర చొప్పున నిర్మింపబడినట్టు దర్శనమైంది.

“కాశీలో మరణించిన జీవులకు శివుడు తారకమంత్రాన్ని ఉపదేశిస్తున్నట్లు, మృతదేహాలను తగులపెడుతున్నప్పుడు (మణికర్ణికాఘట్టం) ఒక పొడుగైన తెల్లని వ్యక్తి, జడలు కట్టిన ఎర్రని జుట్టుతో, ఆ స్మశానంలోని ప్రతి జీవి దగ్గరకు గంభీరమైన అడుగులు వేస్తూ, నెమ్మదిగా లేవనెత్తి చెవిలో పరబ్రహ్మ మంత్రాన్ని ఉపదేశిస్తున్నట్టు కనిపించింది. మరొకవైపు మహాకాళి జీవుల పురాకృత స్థూల, సూక్ష్మకారణ కర్మబంధాన్ని విప్పి తన చేతులతో ముక్తిమార్గాన్ని తెరచి వారిని అనంతధామానికి పంపుతున్నట్లు కనబడింది. ఆ విధంగా విశ్వనాథుడు అనేక యుగాల తపోబలంవల్ల వచ్చే అద్వితీయానందాన్ని ప్రసాదించి, జీవునకు సద్యోముక్తి కల్గించాడు” అని గురుదేవుడు స్వయంగా చెప్పినాడు.

బృందావనంలో కూడా అనేక భావసమాధులు కల్గి, కృష్ణుని జీవితంలోని అనేక ఘట్టాలను దర్శించాడు. నవనీరదఘనశ్యాముడు, కేకిపింఛధరుడు అయిన శ్రీకృష్ణ దర్శనం ఆయనకు అయింది. శ్రీకృష్ణ స్మృతులతో నిండిపోయిన గోవర్ధనము, నిధువనము దర్శించి, పుణ్యస్థలాల్లో భావసమాధి పొందాడు.

తిరుగు ప్రయాణంలో మరొకమారు కాళిని దర్శించి, గయ వెళ్ళటానికి నిరాకరించాడు. క్షేత్రనాథుడైన గదాధరుడు నుండి తాను ఉద్భవించడం వలన, అక్కడికి పోతే తాను అందులో విలీనం కావచ్చని వెళ్ళలేదు. 1871లో వైష్ణవ క్షేత్రాలైన ఖిల్నా, నవద్వీపం దర్శించాడు. ఆ యాత్రకాగానే మధురుడు మరణించాడు.

శ్రీకమలమ్మగారు ప్రతి సంవత్సరం కొంతమంది శిష్యులతో కలసి యాత్రలు చేస్తుండేవారు. అందులో ముఖ్యమైనవి- తిరుపతి, జొన్నవాడ, తిరువత్తియూరు (మద్రాసు). ఇవికాక రామేశ్వరము, కాశీ, ప్రయాగ, మంత్రాలయం, కన్యాకుమారి, మరెన్నో పుణ్యక్షేత్ర దర్శనములు, నదీస్నానములు ఆమె చేస్తూ, శిష్యులచేత కూడా చేయించేవారు. ఆమె కలకత్తా కాళి దర్శనం కూడా చేశారు.

ముఖ్యంగా కొన్ని క్షేత్రములలో నిద్రలు కూడా చేయించేవారు. ఆ క్షేత్రంలో ఉన్న దేవత యొక్క దర్శనము వచ్చిన శిష్యులకు అనుభవమయ్యేలాగా చేస్తుండేవారు. ఇవి వ్రాయాలంటే చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని గుర్తున్నవి:

1. మంత్రాలయంలో శ్రీరాఘవేంద్రుడిని చూస్తూ, "ఆయన వీణానాదం చేస్తున్నారు. నీకు వినిపిస్తోందా?" అని శిష్యురాల్ని అడిగారు. కానీ వీణానాదం విన్నానని ఆమె స్వయంగా చెప్పారు.

2. తిరుపతిలో 'బాలాజీ' శక్తిస్వరూపమని ఆయనకు వెనుక స్త్రీవలె వెంట్రుకలు ఉన్నాయని చెప్పి, ఒక శిష్యురాలికి స్వామి దర్శనం అలా చేయించారు.

3. మరొకరిని జొన్నవాడ తీసుకెళ్ళి, గుళ్ళో నిద్రచేయించి, ఆమె నిద్రపోతూ "నువ్వు మేలుకుని చూస్తూఉండు. ఆమె వస్తుంది" అని చెప్పారు. ఆమె అలా నిద్రలేకుండా చూస్తూనే ఉన్నది. ఒక 5 సం॥ల పిల్ల పట్టుపరికిణీ, జాకెట్టు, వడ్డాణము, అరవంకెలు అన్నీ పెట్టుకుని నడుస్తూ గుడిలోనుండి ఈమె పడుకున్న ప్రదేశానికి వచ్చి, ప్రక్కలో ఉన్న చంటిపిల్లవాడిని ప్రక్కకు జరిపి, ఆ పిల్ల పక్కన పడుకున్నదట. ఈమె అలా చూస్తూనే ఉన్నది. తర్వాత ఆమెకు ఆడపిల్ల పుడితే 'బాల కామాక్షి' అని పేరు పెట్టింది.

4. "జ్వాలాముఖి" నెల్లూరులోని వరిగొండలో ఉన్నది. అక్కడకు తన చెల్లెలి కుమార్తెను తీసుకెళ్ళి, అల్లుడుకు ఏదో ఉద్యోగంలో సమస్య వస్తే, అది తొలగిన తర్వాత నేను మళ్ళీ ఇక్కడకు వచ్చి నీకు భోగం చేయిస్తానని మొక్కుకున్నారు కమలమ్మగారు. తర్వాత వెంటనే అల్లుడికి ఆ ఉద్యోగం తిరిగిరాగానే ఆమె ఏలూరు నుండి స్వయంగా నెల్లూరు వచ్చి భోగం చేయించి, జ్వాలాముఖి చాలా సత్యమైన దేవత అని చెప్పారు. భోగం అంటే ఏమిటి? అని అడిగితే "చక్కెర పొంగలి నైవేద్యం" అని చెప్పారు.

5. మరొకరు, రాఘవేంద్రస్వామి కలలో కనబడాలని కోరికతో అమ్మమ్మగారితో కలసి మంత్రాలయం వెళ్ళారు. ఎంతకీ నిద్రపట్టక మగతలో ఉన్నప్పుడు శ్రీరాఘవేంద్రస్వామి విభూతి రేఖలతో, రుద్రాక్షలతో గుళ్ళోనుండి బయటకు వస్తే, మండపములో పడుకున్న కమలమ్మగారు ఇంత ఎత్తున కూర్చుని ఉన్నారట. ఆమెకు ఆయన చేతులతో నమస్కరిస్తూ "ఓం శ్రీకమలాంబికాయై నమః" అంటూ ప్రదక్షిణము చేస్తూ కనబడ్డారు. శిష్యురాలు కళ్ళు తెరచి చూస్తే, కమలమ్మగారు ప్రక్కన నిద్రిస్తూ కన్పించారట. రాఘవేంద్రుడు కొలిచే తల్లి ఈమేనని తెలుసుకుని, నమస్కరించారు. తరువాత "ప్రక్కన ఈమె ఉన్నా, తెలుసుకోలేక ఏవో దర్శనాలు కావాలను కున్నాను, మూర్ఖురాలిని. ఆమె కళ్ళు తెరిపించి దర్శనమిచ్చింది" అనుకున్నారట.

6. కన్యాకుమారిలో మరెవరికో కలలో కనబడి "కమలమ్మాళ్" అనే పేరుగల వ్యక్తి కనబడి, పంచామృతములు మీకు ఇస్తుంది, బొట్టు పెట్టించుకోండి. మీకు పిల్లలు కలిగితీరుతారు" అని చెప్పిందట. వారు ఆ పేరు రాసుకుని, వెదుకుతూ కన్యాకుమారి వచ్చారు. అక్కడ ఆమె శిష్యులతో కూర్చుని, ఒక పెరుగుకుండ, చిన్న పాలకుండ కొని, వాటిని కలిపి పంచామృతంలాగా చేసి,

శిష్యులకు ఇస్తుంటే వాళ్ళు చూసి ఆమెను గుర్తించి, నిర్ధారించుకుని ఆశీర్వాదం పొంది, బిడ్డను పొందారు. కమలమ్మగారు ధరించిన చీర (ఎర్రనిది) కన్యాకుమారి ధరించిన చీర రెండూ ఒక్కటే ఉంటాయని కూడా కలలో చెప్పినట్లుగానే ఉండడం చూసి వాళ్ళు ఆనందభరితులయ్యారు.

7. మరొకరికి 'తిరువత్తియూరు' బాలాత్రిపురసుందరి గుళ్ళో, ఆమె అరికాలిలో శ్రీచక్రమున్నదని వారికి చూపించారు. వారెంతో అదృష్టవంతులు. అలాగే ఇంకొకరికి, ఆ గుళ్ళోకి వచ్చి తనతో బొట్టు పెట్టించుకోమని చెప్పారట. వారు ఈమె వద్దకు వచ్చి ఆశీస్సులు పొందారట.

8. ఆమె హరిద్వార్ కుంభమేళాకు వెళ్ళి, శిష్యురాలి ఇంట్లో దిగి, ఆమె అన్నగారితో కలిసి హరిద్వార్ బయలుదేరి, మధ్యలో తప్పిపోయారు. భాష తెలియదు. వేరే బస్సు ఎక్కి, ఆటోలో వాళ్ళింటికి తిరిగి వచ్చేశారట. ఆయన 3 రోజులు వెదికి, దొరకక వెనుదిరిగి ఇంటికి వచ్చేసరికి, ఈమె ఇంట్లో ఉన్నదట. "మీరొక్కరే ఎలా వచ్చారు?" అనడిగితే, "ఒక నామాలవాడు నన్ను ఇక్కడకు తీసుకొచ్చి దింపాడు" అన్నారట. ఆటోవాడికి డబ్బులిచ్చి పంపమంటే, బయటకు వచ్చిచూస్తే ఎవరూ లేరట.

9. రాజమండ్రిలోనూ, కైకలూరులోనూ ఉన్న శ్యామలాంబను ఆమె దర్శిస్తూ ఉండేవారు. ఆమె దసరా ముందు వచ్చి వస్త్రం తీసుకెళ్తుందని చెప్పేవారు. అలాగే ఎవరో ఒకామె రూపంలో వచ్చి చీర అడిగి తీసుకెళుతుండేది. అంతేగాక, కమలమ్మగారు, సయ్యద్-బాజీ సమాధిలో జరిగే ఉరుసు ఉత్సవాలకు వెళ్లి, బెల్లపు బూంది నైవేద్యం పెట్టి, దాన్ని అందరికీ పంచేవారు.

10. కంచి, తిరవళ్ళూరు, తిరువణ్ణామలై, మధుర, మొత్తం తమిళనాడు అంతా ఆమె ఎన్నో క్షేత్రదర్శనాలు చేయడమే కాక, శిష్యులకు ఏది అవసరమో అక్కడకు తీసుకెళ్ళి, కావలసినవి వారిచేత చేయించేవారు. మూలస్థానమైన తిరువత్తియూరులోని శ్రీబాలా త్రిపురసుందరీ ఉపాసన దీక్షను తీసుకుని ఏలూరులో స్థిరపడి పీఠమును ప్రతిష్టించిన తర్వాత కూడా ఆమె యాత్రలు చేసి రాగానే దుర్గాంబగారిని రమ్మని పిలిచి, ఆమె చేత కాళ్ళు కడిగించుకుని పీఠంలో అడుగుపెట్టేవారు. "నువ్వు ఇవన్నీ చూడలేవు కదా! అందుకని నా తీర్థయాత్రల ఫలాన్ని నీకు ఇస్తున్నాను" అని చెప్పేవారు.

ఒకసారి త్రిపురాంతకంలో నీళ్ళలో ఉన్న అమ్మవారిని చూడలేక పోయానని దుర్గాంబగారు బాధపడుతుంటే, "ఎందుకే, ఇక్కడ మన అమ్మవారు కూడా నీళ్ళలోనే ఉన్నది. ఇక్కడ దర్శించుకో చాలు. అన్ని యాత్రలూ చేసినట్లే. దీనిక్రింద సర్వనదులూ ప్రవహిస్తున్నాయి" అన్నారట.

అలాగే ఆమె సిద్ధిపొందిన 20సం॥ల తర్వాత పీఠాన్ని పునర్నిర్మాణం చేస్తున్నప్పుడు అమ్మవారి పీఠంవద్ద ఉన్న స్తంభాన్ని తవ్వితే నీళ్ళు ఫౌంటెన్‌లాగా పొంగాయిట. అది చూసిన దుర్గాంబగారు "అప్పుడు అమ్మమ్మగారు చెప్పిన విషయాన్ని ఇప్పుడు చూస్తున్నాము. అంతే" అన్నారు.

ఇలా వ్రాస్తూ పోతుంటే, ఎన్నైనా వ్రాయవచ్చు. మొత్తమ్మీద చెప్పేదేమిటంటే యాత్రలు శిష్యులతో చేయించి, ఆమె దర్శిస్తూ, మనకు క్షేత్రదేవతా దర్శనము ప్రసాదించేవారు.

**10.04.2005, శ్రీనగర్**

అమ్మమ్మగారి ఆరాధన అయ్యాక, డిసెంబర్ 23న ఏలూరు నుండి ఫణి పెళ్ళికి వెళ్ళి, అక్కడి నుండి హైదరాబాద్ వెళ్ళాం. వ్రతం జరిగాక, ఫణి తను వెళ్ళేవరకూ ఉండమని పట్టుబడితే ఉండిపోయాం. వాడి పెళ్ళి బాగా జరిగింది. బాగా ఎంజాయ్ చేశాం. ఈలోపు యూసఫ్‌గూడాలోని ఇంటి యజమాని ఇల్లు ఖాళీ చేయమంటే, రెండు రోజుల్లో ఖాళీ చేసి, సామాన్లు హ్యాపీహోమ్ అపార్ట్‌మెంట్స్‌లోకి మార్చి, రామకృష్ణ కొడుకు కమల్‌ను, తన ఫ్రెండ్స్‌తో ఆ ఇంట్లో ఉండమని చెప్పాను. వాడు ఆ ఇంట్లో ఉంటూ చదువుకుంటున్నాడు. జనవరి 5న ఈయన పుట్టినరోజు. పద్మకు ఒంట్లో బాగుండలేదని ఆ విషయం మేము ఎవరికీ చెప్పలేదు. కానీ, అనుకోకుండా రాజీ, శ్వేత ఫణి వాళ్ళింటికి వచ్చారు. అందరమూ వాళ్ళింట్లోనే భోజనం చేశాము. మధ్యాహ్నం గం.3.00లకు బయటకి వెళ్దామని బయల్దేరుతుంటే పవన్ కేక్ ఆర్డర్ ఇచ్చాడు. బేకరీవాడు వెతుక్కుంటూ తెచ్చి ఇచ్చాడు. మళ్ళీ అందరం ఇంట్లోకి వచ్చి ఆయనతో కేక్ కట్ చేయించాము. ముందుగా ఎందుకు చెప్పలేదని అందరూ అన్నారు. కేక్ పైన "Dear Daddy and Best Friend" అని వ్రాసి ఉంది. తరువాత రెండురోజుల్లోనే లీవు క్యాన్సిల్ చేసుకుని మద్రాస్ వచ్చేసి, గెస్ట్‌హౌస్‌లో దిగాము. తరువాత ప్రియ, వీరేందర్ (కాన్పూర్, కొచ్చిన్‌లో ట్రైనింగ్‌కు వెళ్ళినప్పుడు వాళ్ళ, మేము పక్కపక్క రూమ్స్‌లోనే ఉన్నాము) గార్లు చెన్నై వచ్చి మా పక్క రూమ్‌లోనే దిగారు. మేము అక్కడ 15 రోజులపైనే ఉన్నాము. ఆమెకి హిందీ తప్ప వేరే భాష రాదు. ఉదయం 10 నుండి రాత్రి 9 గం॥ల వరకు ఆమెతో హిందీలో మాట్లాడి కొంచెం నేర్చుకున్నాను. మధ్యమధ్యలో ఆమెకు యోగా నేర్పుతూ, వాకింగ్‌కు నాతోపాటు తీసుకెళ్ళేదాన్ని. ఆమె బరువు తగ్గుతున్నందుకు చాలా సంతోషపడేది. ఒక ఆదివారం మేమందరం మహాబలిపురం బీచ్‌కు వెళ్ళి, బాగా ఎంజాయ్ చేశాము. తరువాత వాళ్ళని త్రివేండ్రం, మమ్మల్ని జైపూర్ ట్రాన్స్‌ఫర్ చేశారు.

మేము ఢిల్లీ వచ్చి, కొన్ని గంటలు శాంత వాళ్ళింట్లో ఉండి, భోజనం చేసి, స్వీట్స్ తిని, శారద కూతురు సుప్రియ వస్తే అందరం వాళ్ళ కొత్త ఇంటికి వెళ్ళాము. ట్రాఫిక్ మూలంగా ఎయిర్‌పోర్ట్‌కు ఆలస్యంగా వెళ్ళడంవలన ఫ్లైట్ మిస్సయ్యింది. 2 రోజులు అక్కడే ఉన్న తర్వాత జైపూర్ వెళ్ళాము. గెస్ట్‌హౌస్ చాలా బాగుంది. మా రూమ్ తలుపు తీస్తే బాల్కనీలో చెట్టుపైన 2 నెమళ్ళు ఉండేవి. అప్పుడప్పుడు అవి బాల్కనీలోకి దిగి డ్యాన్స్ చేస్తుండేవి. 4 రోజుల తర్వాత శాంత ఢిల్లీ నుండి జైపూర్ వచ్చి నాతో 4 రోజులు గడిపింది. ఇద్దరం కలసి రోజూ హవామహల్ వరకు బస్‌లో వెళ్ళి వస్తుండేవాళ్ళం. చాలా షాపింగ్ చేశాము. ఒకరోజు అక్కడి బ్రాంచ్ మేనేజర్ ఇంటికి డిన్నర్‌కి వెళ్ళాము. వాళ్ళు మంచి డైనింగ్‌సెట్ వాడేవారు. డైనింగ్ టేబుల్ ఎలా సిద్ధం చేయాలో నార్త్ ఇండియా వచ్చాక బాగా అర్థమైంది. Veg. salads, fruit salads, dal, veg. subji, roti, rice, curd, papad, kheer, raita మొదలైనవి ఎంతో చక్కగా సిద్ధంచేస్తారు. బాగా తింటారు కూడా. ఆ భోజనం బాగానే అలవాటైంది. బ్రాంచ్ మేనేజర్‌గారి పేరు సంజయ్. వారి పిల్లలు పుష్టి, చియా. అందరం కలసి ఒక ఆదివారం శాంతను కూడా తీసుకుని అజ్మీర్, పుష్కర్

చూసివచ్చాము. రోజంతా బాగా ఎంజాయ్ చేశాము. అక్కడ ఒక సంఘటన జరిగింది.

శాంత గురువారంరోజు నా దగ్గరకు వచ్చింది. బుధవారంనాడు కలలో, ఒక తెల్లటి గడ్డం, తెల్లటి జుట్టుతో, కౌపీనం మాత్రమే పెట్టుకుని, ఛామనఛాయ రంగులోఉన్న ఒక ముసలాయన నేలపై పడుకుని, తల ప్రక్కకు తిప్పి నన్నే చూస్తున్నారు. ఆయన నావైపు చూస్తున్నప్పుడు నేను ఇలా అనుకున్నాను. పైన సమాధిలాగా ఉన్నట్లుంది కదా, మరి క్రింద ఈయన జీవించే ఉన్నారే? నన్ను సజీవంగా చూస్తున్నారు. ఇలా కూడా ఉంటారా? అనుకుంటుండగా మెలకువ వచ్చింది. లేచాక ఆయనని 'రమణ మహర్షి'లాగా ఉన్నారని గుర్తుపట్టాను. నేను 2, 3సార్లు అరుణాచలం వెళ్ళాను కానీ, ఆయన దర్శనం అవ్వలేదు. ఇప్పుడు, ఇక్కడ ఆయన ఎందుకు దర్శనమిచ్చారో తెలియదు అనుకున్నాను. గురువారంనాడు నేను, శాంత ఊరు బాగా చూశాము. శుక్రవారం ఉదయమే స్నానం చేసి, గెస్ట్‌హౌస్‌లో కబుర్లు చెప్పుకుంటున్నాము. అక్కడి కేర్ టేకర్ (గోపాల్, భార్య మందిర, కూతురు రియా) పేపర్ చూపించి "చాలా సం॥ల తర్వాత ఆల్బర్ట్ హాల్‌లోని గేట్ తెరిచారు. పైకి వెళ్ళి చూస్తే జైపూర్ అంతా కనబడుతుంది. వెళ్ళండి" అన్నారు. అది మంచి అవకాశం అనుకుని, ఇద్దరం బస్ ఎక్కాం. అంతకుముందు మా అత్తగారి వాళ్ళతో కలసి చేసిన దక్షిణ భారతదేశ యాత్రావిశేషాలు ఆమెకు చెప్తున్నాను. అరుణాచలం అనగానే ఆవిడ "రమణ మహర్షి ఆశ్రమం చూశారా? బాగుందా?" అంటూ ఆత్రంగా తెలుసుకోవాలని ఆత్రంగా అడిగారు.

అప్పుడు నాకు వచ్చిన కల గుర్తొచ్చింది. "అవునండీ, నాకు మొన్న ఆయన కలలోకి వచ్చి దర్శనమిచ్చారు" అంటూ జరిగినదంతా చెప్పాను. ఆవిడ సంతోషంగా "అయితే ఈరోజు మనకు ఒక అనుభవం తప్పకుండా కలుగుతుంది" అన్నారు. అలా మాట్లాడుకుంటూ ఆల్బర్ట్ హాల్లోకి వెళ్ళాము. రాజస్థానీవాళ్ళ రాజుల డ్రెస్సులు, బొమ్మలు, నగలు, వాళ్ళు వాడిన వస్తువులు అన్నీ మ్యూజియంలో పెట్టారు. అవి చూసి మొదటి అంతస్తు ఎక్కాము. అక్కడ ఒక శవపేటికలాంటి పెట్టి ఉంది. దగ్గరకి వెళ్ళి చూస్తే, అందులో ఒక 'మమ్మీ' ఉంది. జైపూర్ రాజు ఈజిప్టు నుండి తెచ్చి మ్యూజియంలో పెట్టాడట. అది చిన్న సైజులో ఉన్నది. అది రెండులా కనబడుతుంటే అక్కడ ఉన్నవాళ్ళని అడిగితే, పైన ఉన్నది మమ్మీని కప్పే ఒక పేటికట. క్రింద ఉన్న మమ్మీ మాత్రం ఒక lady priest అనీ, "అమ్మన్" అంటారనీ, దేవుడి కుటుంబానికి చెందినదనీ, రాజకుటుంబానికి చెందినదనీ అక్కడ రాసిపెట్టి ఉంది. దానిని నేను ఒక కాగితం మీద రాశాను. అంతకుముందు నాకు కనబడ్డ రమణ మహర్షిలాగా కనపడ్డారేమిటి, అనుకుంటూ ఆశ్చర్యంగా ఇద్దరమూ మమ్మీని చూశామని ఆనందపడుతూ తలప్రక్క, కాళ్ళ దగ్గర నిలబడి కమలాంబికా నామజపం చేసి, క్రిందికి వచ్చి బయట అరుగుమీద కూర్చుని లలితా సహస్రనామం చేశాము. తరువాత బ్రాంచ్ మేనేజర్ వచ్చి షాపింగ్‌కు తీసుకువెళ్ళారు. చాలా మంచి డిజైనర్ చీరలు చూపించారు. నేనలాంటివి ఎక్కడా చూడలేదు. నేను రెండు చీరలు కొన్నాను.

తరువాతి ఆదివారం అజ్మీర్ వెళ్ళాము. అక్కడ ముస్లింలకు చెందిన ఒక ప్రఖ్యాత దర్గా ఉంది. బ్రహ్మదేవుని గుడి పుష్కర్‌లో మాత్రమే ఉన్నది. చూడటానికి వెళ్ళాం. గుడి ఒంటి గంటకు మూసేస్తారని ముందుగా దర్శనం చేసుకుని, పుష్కర్‌లోని నీళ్ళు తలపై చల్లుకున్నాము. లంచ్‌కోసం మార్గమధ్యంలో ఒక గార్డెన్‌కి వెళ్ళాము. దైవికంగా అది దయానంద సరస్వతి ఆశ్రమమని తెలుసుకుని చాలా సంతోషపడ్డాము. తరువాత అజ్మీర్ దర్గాకు వెళ్ళాము. అక్కడ చాలా మంది జనం ఉన్నారు. సరైన నిర్వహణ లేదు. జనం విపరీతంగా తోసుకుంటున్నారు. అక్కడ పెద్ద అండాలాంటి గిన్నె ఉంది. దానికి ఒక చిన్న ఉయ్యాల కట్టి ఉంది. అందరూ అందులో డబ్బులు, బియ్యం వేస్తున్నారు. నేను కూడా ఆ ఉయ్యాల ఊపి, డబ్బులు అందులో వేశాను. తరువాత క్యూలో నిలబడ్డాము. ముందు ఆయన, తరువాత నేను, నా వెనుక శాంత నిలబడ్డాము. నేను కళ్ళు మూసుకుని నామం మొదలుపెట్టగానే నాకు 'రమణమహర్షి' కల కనబడింది. వెంటనే నేను శాంతకు, ఈ దర్గాకు ఆ కలకు ఏదో సంబంధం ఉందనిపిస్తోందని చెప్పాను. దానికి తను "ఇంకొంచెంసేపు మీరు ధ్యానం చేస్తే మీకే అర్థమవుతుంది" అంది. జనం మమ్మల్ని తోసేసరికి, లోపలికి వెళ్ళాము. పైన ఉన్న సమాధిని చూశాను. క్రింద ఏదో సమాధి ఉందని, అక్కడ ఉన్న ఒక సాధువు, మనుషుల్ని క్రిందికి లాగి, తలను పట్టుకుని ఆ సమాధి గడప దగ్గర ఆనిస్తున్నాడు. శాంతకి ఆ దర్శనం అయ్యింది. జనం తోసేస్తుంటే, ఇంక వెళ్ళలేమని, మేము బయటకి వచ్చేశాము. ఆ తోపులాటలో ఈయన జేబులో ఉన్న ఎస్‌బిఐ కార్డు, ఐడి కార్డు, ఫోన్ బుక్ అన్నీ ఉన్న పర్సు ఎక్కడో పడిపోయింది. దాన్ని వెతకటానికి మేమిద్దరం మళ్ళీ లోపలికి వెళ్ళాము. నేను లలితా సహస్రనామం చదువుతూ ఆ శిఖరాన్ని చూస్తున్నాను. అందరూ నమాజ్ చేస్తున్నారు. చివరికి పర్సు దొరకలేదని బయటకు వచ్చేశాము. "ఈ సమాధి ఎవరిదో, దీని సంగతేమిటో తెలుసుకోకుండా మనం ఇక్కడకు ఎందుకు వచ్చామో" అన్నాను శాంతతో. అక్కడ ఒక బోర్డు ఉంటే ఈయన, నేను చదువుతున్నాము. ఇంతలో శాంత అక్కడ ఉన్న వాలంటీర్‌ను దీని విశేషమేమిటని అడిగితే, ఆయన ఇలా అన్నాడు.

"అరబ్‌దేశాలనుండి ఒకాయన వచ్చి, ఇక్కడ ఉండి, ప్రజలకు ఎంతో సేవ చేశారు. ఆయన ఇక్కడ సమాధిలో ఉన్నారు. ఆయన ఇంకా జీవించే ఉన్నారు. మీరు ఏది కోరితే అది మీకు ఇస్తారు. వెళ్ళండి. దర్శనం చేసుకుని మొక్కుకోండి. కోరికలు తీరతాయి" అని ఎంతో శ్రద్ధగా చెప్తే, విని శాంత "రత్నగారూ, ఆయన ఇందులో జీవించి ఉన్నారట. కోరిక కోరుకోమంటున్నాడు. నాకేమీ గుర్తుకు రావడం లేదు. మీరు కోరుకోండి" అంటూ తొందరపెట్టింది. అక్కడ ఏవో ఆకుపచ్చ దారాలు కట్టి ఉన్నాయి. నేను అవి ముట్టుకుని, శిష్యులైన పద్మకు, శంకర్‌కు నడుంనొప్పి తగ్గాలనీ, కమలాంబికా పీఠంలోని వారందరికీ మంచి జరగాలని కోరుకున్నాను. తరవాత ముగ్గురం బయటకు వచ్చేశాము. బ్రాంచ్ మేనేజర్‌గారి కుటుంబం లోపలికి రాలేక బయటే కూర్చున్నారని తెలిసింది. ఆరోజు బయల్దేరి రాత్రికి జైపూర్ వచ్చేశాము. అక్కడున్న ముస్లింలందరూ తెల్లటి జుట్టుతోనూ, తెల్లటి గడ్డముతోనూ ఉన్నారు.

ఒక చిన్న గడ్డమున్న అతన్ని చూశాక కలలో కనిపించిన, రమణ మహర్షికి కూడా ఇలాగే గడ్డముందనీ, ఆయన నాకు ఇక్కడి వాళ్లలాగే కనబడ్డారనీ చెప్పాను. అప్పుడు, రమణులకు గడ్డం ఉండదని, కలలో కనిపించిన వారు 'మహమ్మద్ భిస్కీ' అని విశ్లేషణ చేసుకుంటే తెలిసింది. చాలా ఆనందపడ్డాను. యోగులకు మహమ్మదీయులు, హిందువులు అని ఏముంటుంది? అవన్నీ మనకు గానీ! అయినా ఆయన నాకు కలలో కనిపించి, వెంటనే దర్గాకు పిలిపించుకుని, దర్శనమిచ్చారు. అక్కడ సమాధిలో ఉన్న ఆయన ఉన్నారని కూడా ఎప్పుడూ వినలేదు. కానీ కల కన్నాను, దర్శించాను, తరించానని అనిపించింది. పూర్వజన్మ పుణ్యం తప్ప, ఇలాంటి అనుభవాలకు కారణాలు ఎలా వెతకగలము? మొత్తానికి ఈయన ఇన్‌స్పెక్షన్ మూలంగా ఎన్నో ప్రదేశాలు తిరగడం ఎందుకంటే, ఇలాంటి దర్శనభాగ్యములు ఎన్నో పొందటానికని మరోసారి అర్థమైంది.

**11.04.2005**

## మాతృదేవి ఆగమనము – షోడశ పూజ

గురుదేవుని జీవితంలోకి (1872లో) శ్రీశారదాదేవి అడుగుపెట్టి, కలకత్తా వచ్చింది. ఆమె రాక ఆయన జీవితానికి నూరురెట్లు ప్రాధాన్యత కలిగించింది. ఆమె రాకతో కేవలం సన్యాసిగా ఉండాల్సిన ఆయన ఆధ్యాత్మిక ఉత్కృష్టత జీవితం, గృహసంబంధమైన ప్రేమానురాగాలతో, ఎడారిలో ఉన్న పచ్చికబయలుగా మారింది. యవ్వనవతియైన భార్యను ఆయన ఒకసారి ఇలా ప్రశ్నించాడు: "నువ్వు ఇక్కడికి ఎందుకు వచ్చావు? నన్ను ప్రాపంచిక జీవితంలోకి లాగాలని వచ్చావా?" అంటే ఆ పిల్ల "నేనెందుకు అలా చేస్తాను? మీకు సేవ చేయడానికి, మీనుండి నేర్చుకోవడానికి, మీ ఆధ్యాత్మిక జీవనంలో చేదోడువాదోడుగా ఉండటానికి వచ్చాను" అని సమాధానం చెప్పింది.

మరొకసారి ఆమె భర్తను ఇలా ప్రశ్నించి, పరీక్షించింది: "మీరు నన్ను ఏవిధంగా తలుస్తారు?" అంటే, "ఏ దేవి దేవాలయంలో పూజలు అందుకుంటున్నదో, ఏ తల్లి నా శరీరాన్ని కన్నదో, ఆమెయే ఇప్పుడు నాకు సేవ చేస్తున్నది" అని పలికాడు.

తన భార్యతో ఆయనకు గల సంబంధమును తెలియజేసే ఒక సంఘటన. ఒక ఫలహారిణీ కాళీపూజ జరిగే సమయంలో భార్యను కాళికాదేవికై అమర్చని పీఠంలో కూర్చుండబెట్టి, సాక్షాత్తూ దేవిగా భావిస్తూ, శాస్త్రోక్తమైన ఉపచారాలు చేశారు. చివరలో తనతో సహా తన సాధనా ఫలితాలను ఆమె పాదాల చెంత సమర్పించి, సమాధి నిమగ్నుడయ్యాడు. తన భార్యద్వారా ఆయన దివ్యజననికి చేసిన ఆరాధన స్త్రీజాతి పట్ల ఆయనకు గల గౌరవమును, తన శిశు స్వభావమునకు నిదర్శనము. ఆవిధంగా జీవితకాలంలో, తర్వాత కూడా తన దివ్య ఉద్యమసానుకూలతతో అర్హురాలైన సహకారిణిని గావించాడు.

తర్వాత ఆమె ఆయన శిష్యులతో మాతృదేవిగా వ్యవహరించబడింది. (దీక్ష తీసుకున్నాక) ఆయన సన్యాస నియమాలకు విరుద్ధంగా భార్యకు సేవచేయడానికి అంగీకరించారు. దీనిని

హిందూ ధర్మశాస్త్రాలలో నిర్వచించిన 4 ఆశ్రమాలకు అతీతమైన 'అత్యాశ్రమి' అని పిలవవచ్చు. ఆయన భగవత్ అవతారం కాబట్టి గృహస్థులకు, సన్యాసులకు కూడా ఆదర్శంగా ఉంటూ, ఏకకాలంలో భార్యగానూ, సన్యాసిగానూ రూపొంది శారదాదేవి సాంగత్యంలో దీనిని సాధించాడు.

కామినీ, కాంచనముల దుష్టప్రభావములకు రాజీపడని ఉపదేశమును ఆలోచించాలి. స్త్రీ దివ్యజనని పుత్రిక అని, కాంచనం లోభానికి ప్రతీక అని ఆయన సిద్ధాంతము. మాతృదేవి జీవితంలో అంతర్భాగం కాకపోయినట్లయితే గురుదేవుని ఉపదేశములు, ఆచరణకు తగినవి అనిపించక, కేవలం పండిత వాక్యాలని భావింపబడేవి.

కమలమ్మకు సుమారు 8 సంIIల వయస్సులో, 11 సంIIల సత్యనారాయణగారితో వివాహమైంది. రజస్వల అయిన తర్వాత అత్తగారింటికి వెళ్ళిన కమలమ్మ, భర్తతో సరియైన అవగాహన కరువై, ఎడముఖం, పెడముఖంగా ఉన్న రోజుల్లో ఆయన అన్నగారైన బెహరా తిమ్మరాజుగారు "తిరువత్తియూరు"లోని బాలాత్రిపుర సుందరి గుడికి సంబంధించిన ఆశ్రమంలో ఉన్న ఇద్దరు యోగిపుంగవులను (బాలాజీ, శ్యామలరావుగార్లు) ఆశ్రయించి, తన తమ్ముడి సమస్యను వీరికి వివరించారు. తరువాత వారివద్దకు భార్యాభర్తలను తీసుకెళ్ళారు. ఆయన వారిద్దరిచేత, గర్భగుడిలో దీక్షలు చేయించి, ఆయనకు శివపంచాక్షరిని, ఆమెకు త్రిపుర సుందరీ దీక్షలను ఒసంగి, (ఇరువురి ఆధ్యాత్మిక స్థితులను గ్రహించి, సరిచేసి) దీవించి పంపారు. ఆ తరువాత వారిద్దరూ కలిసి బొంబాయిలో (ఉద్యోగరీత్యా) కాపురం పెట్టారు. తరువాత స్కూల్ టీచరుగా కలపర్రు, అన్నదేవరపేట, మరికొన్ని ఊళ్ళలో పనిచేశారు. ఒక గృహంలో సంసారం సాగించడం (గృహస్థాశ్రమంలో) మొదలైన తర్వాత, అప్పటి వరకూ వారిలో ఉన్న ఆధ్యాత్మిక శక్తులు బయటకు రావడం మొదలైంది. (బొంబాయిలో ఉన్నప్పుడు ఒక సాధువు వచ్చి ఈమెకు ఏదో చెప్పాడని నెల్లూరు సుశీలక్క చెప్పింది.)

ఈమె చిన్నప్పుడే, బొంబాయి వెళ్ళిన కొత్తల్లో మరాఠీ నేర్చుకుని, చుట్టుపక్కల వాళ్ళు ఏవో కష్టాలు చెప్తుంటే విని పరిష్కారాలు సూచించడం ప్రారంభించారు. ఇక్కడకు వచ్చిన తర్వాత కూడా, ఆమె ఇంట్లో చిన్నగూట్లో అమ్మవారిని ప్రతిష్టింప చేసుకుని, శుక్రవారం విశేషంగా పూజలు చేసి, పానకం వడపప్పు నైవేద్యం పెడుతుండేవారు. అప్పటినుండే ఆ చుట్టుపక్కల వాళ్ళు వచ్చి, ఈమెతో బొట్టు పెట్టించుకుని వెళ్తుండేవారు. వాళ్ళ పనులు పూర్తవుతుండేవి. కొంతమందికి 'బాల' రూపంలోను, కొంతమందికి 'రాజరాజేశ్వరి' రూపంలో కనబడి, ఆమె వద్దకు రప్పించుకునేవారు.

భీమడోలులో ఉన్నప్పుడు-

1. కోమలవల్లికి బాలరూపంలో కనబడడం

2. దేవులపల్లి రాజరాజేశ్వరమ్మగారు ఈమెను కాలువ గట్టున నీళ్ళకు వచ్చినప్పుడు చూసి, వాళ్ళింట్లో ఇల్లు అద్దెకు ఉందని చెప్పి వాళ్ళింట్లోకి ఈమెను చేర్చడం

ఇలా ఈమెలోని దివ్యశక్తి ప్రసరించడం మొదలై, శిష్యులకు ఆధ్యాత్మిక అనుభవాలు ప్రసాదించడం మొదలైంది.

అలాగే భర్తయైన సత్యనారాయణగారు కూడా ఉపాసకులు కావడం వలన ఒకసారి ఎవరో ఆయన్ని పిచ్చిపంతులు అని (ఈయన నూతిలో నీళ్ళు తోడుతున్నప్పుడు) వెళ్తూవెళ్తూ హేళనగా మాట్లాడితే, ఇంటికి వెళ్ళగానే ఆయనకు పొట్ట ఇంత ఉబ్బిపోయి, క్రిందపడి దొర్లుతూ బాధపడ్తుంటే, ఆయన భార్య అడిగిందట. ఈయన సత్యనారాయణగారిని ఇలా అన్నానని చెప్పారట. వెంటనే ఆయన వద్దకు వెళ్ళి క్షమాపణ చెప్పారట. ఆయన నవ్వి, కుంకుమ పెట్టి పంపించారు.

అలాగే ఒకసారి గోదావరిదాటి ఇంటికి వచ్చేటప్పటికి చాలా రాత్రి అయితే "కమలా! నువ్వు తలుపు తీయకు. నేను వరండాలోనే పడుకుంటాను" అని చెప్పేవారు. ఆయన ఒంటిమీద అమ్మవారు ఉండేదని అమ్మమ్మగారు చెప్పారు. ఒకసారి సత్యనారాయణగారి మీదకు అమ్మవారు వచ్చి, "నేను కాళిని. మేక, కోడి మాంసం కావాలని" అడిగితే, అమ్మమ్మగారు "ఇక్కడ అవేమీ దొరకవు. పప్పన్నం మాత్రమే ఉంటుందని తెలియదా!" అనడిగారట. "అయితే, అదే పెట్టు" అనడిగి, ఆకుతో సహా నమిలి మ్రింగేసేవారు. ఆ తర్వాత నాలుకపై కర్పూరం వెలిగించేవారు.

ఎంత అర్థరాత్రి అయినాసరే, ఆయనవెంట ఒక నల్లకుక్క వచ్చేది. ఏం భయంలేదు. అది మనకు రక్షగా ఉంటుందని చెప్పేవారు. మా అమ్మగారైన లక్ష్మీసరోజ పుట్టేముందు ఆయనకు రోడ్డుమీద నడుస్తుండగా ఒక బంగారు మొగలిరేకు దొరికిందట. ఇంటికి వచ్చి, ఆమె చేతిలో పెడితే, "ఇది అమ్మేసి, ఆ డబ్బుతో పూజసామాగ్రి తీసుకురండి. మనం సత్యనారాయణ వ్రతం చేసుకుందాం" అని చెప్పి, పూజ చేసుకున్నారు.

ఆ తర్వాత పుట్టిన ఆడపిల్లకు లక్ష్మీ దొరికిందని, లక్ష్మీసరోజ అని పేరుపెట్టారు. 2వ కుమార్తె (త్రిపురసుందరీ దేవి) పుట్టుక ముందు కూడా అమ్మవారు కమలమ్మగారి కలలో కన్పించింది. ఈ పిల్ల పుట్టినప్పుడే 2 కోరలతో పుట్టింది. పెద్దకుమార్తె రేవతి పుట్టినప్పుడు, కమలమ్మగారు చిన్నపిల్ల అవడం వలన, ఆమెను బంధువులు పెంచి పెద్ద చేశారు. తర్వాత తన తమ్మునికిచ్చి వివాహం చేయడం జరిగింది.

1956 సం॥ తర్వాత ఇక్కడ (ఏలూరులో) స్థిరపడ్డాక, సత్యనారాయణగారు పిల్లల్ని చూడటానికి ఏలూరు వచ్చి, "త్రిపురాంబ కోసం వచ్చాను" అని చూసి వెళ్ళిపోతుండేవారట. పీఠంలోకి వచ్చి అమ్మవారిని చూడగానే, ఆయన మీదకు అమ్మవారు వస్తుండేది. అమ్మమ్మగారు హారతి, పానకం ఇచ్చి వెళ్ళిపోమనేవారు. అందుకే అమ్మమ్మగారు ఎక్కువ వారిని ఉండనిచ్చేవారు కాదు.

పిల్లలు కలిగిన కొంతకాలానికి వారు రాజమండ్రి దగ్గర్లో ఉన్న బంధువుల ఇంట్లో కొంతకాలం ఉన్నారు. డబ్బుకోసం (కారణార్థం) ఆయనపై బ్రహ్మరాక్షస ప్రయోగం చేయబడింది. కంచంలో అన్నం పెడితే అది పురుగుల వలె కన్పించేది. తరువాత భోజనంకూడా చేసేవారు కాదు. ఆ తర్వాత ఆయన కొవ్వూరు గోపాదక్షేత్రంలోనూ, మరికొంతకాలం రాజమండ్రి మార్కండేయస్వామి

గుడిలోనూ తపస్సు చేసుకుంటూ ఉండిపోయారు. అప్పుడప్పుడు ఏలూరు వచ్చి, అమ్మవారిని దర్శించుకుని, పిల్లల్ని చూసి మళ్ళీ వెళ్ళిపోయేవారు.

కమలమ్మగారికి సుమారు 65-70 సం॥ల మధ్య ఒకసారి శిష్యులతో యాత్రలు చేస్తూ, కొవ్వూరు వెళ్ళారు. అక్కడ అమ్మమ్మగారు గోదావరి నదీస్నానం చేసి, శిష్యులతో కలిసి బాలా త్రిపురసుందరీ క్షేత్రదర్శనానికి వెళితే, గుళ్ళో సత్యనారాయణగారు కన్పిస్తే, ఆయన ఈమెను చూసి నమస్కారం చేశారు. ఆమె కూడా ఈయనకు నమస్కారం చేశారు. "వీరు మీ బాబుగారు, నమస్కరించండి" అని శిష్యులతో అన్నారు. అందరూ వీరిద్దరికీ నమస్కారం చేశారట. అప్పటికి మా చెల్లెలైన రాజశ్రీ చిన్నపిల్ల. తనను చూపిస్తూ "సరోజ కూతురు" అని చెప్తే, ఆయన తలపైన చెయ్యివేసి ఆశీర్వదించారు.

ఈ సంఘటనను బట్టి వారి సంసార జీవితము ఎంత ఆధ్యాత్మికమైనదో చెప్పవచ్చు. కలిసే సంసారం చేశారు. గృహస్థులుగా జీవించి, ముగ్గురు బిడ్డలకు తల్లిదండ్రులైనారు. తరువాతి కాలంలో ఈమె ఏలూరులో నివాసమేర్పరచుకుని, త్రిపురసుందరీ ఉపాసన చేస్తే, ఆయన కొవ్వూరులో త్రిపురసుందరీ ఉపాసనా దీక్షను చేపట్టారు. గృహస్థ ధర్మాన్ని పాటిస్తూనే పిల్లలను పెద్దచేసి, పీఠధర్మాన్ని కూడా పాటించేవారు కమలమ్మగారు. అప్పుడు ఆమె ఒంటరిగా సాధన చేశారు. మొత్తమ్మీద భార్యాభర్తలిద్దరూ కూడా వ్యక్తిగత, ఆధ్యాత్మిక సాధనలు విడివిడిగానే చేశారు. ఆయన స్వీయముక్తికై సాధన చేసుకుని తరించారు. ఈమె లోకోద్ధరణకు జీవితాన్ని అంకితం చేసి, ఎంతోమందికి జ్ఞాన, భక్తి, ముక్తి మార్గాలను ఉపదేశించారు. ధర్మాచరణ మార్గాలను ఆచరించి చూపించారు.

ఈరకంగా ఈమె బాల్యంలోనే (సిద్ధురాలైనప్పటికీ) "అమ్మ పిలిచింది. అందుకే ఇక్కడికి వచ్చాను" అంటూ ధ్యానంలోకి వెళ్ళిపోయారు. యవ్వనంలో గృహస్థాశ్రమ ధర్మాల్ని పాటిస్తూ, ఆ రోజుల్లోనే పిల్లల్ని చదివించి, పెళ్ళిపేరంటాలు చేసి, పీఠస్థాపన చేశారు. వానప్రస్థ ఆశ్రమంలో ఏలూరు వచ్చి, సంపూర్ణంగా పీఠబాధ్యతలను స్వీకరించి, మానవజాతి ఉద్ధరణకు కంకణం కట్టుకున్నారు. ఆమె వృద్ధాప్య జీవితంలో, మనం చెప్పుకోవటానికి కూడా, దాని గురించి బాధా, భయం ఆమెకు లేవు. శిష్యులతో ప్రశాంతమైన జీవితాన్ని ఆనందంగా గడుపుతూ, యాత్రలు చేస్తూ, తన ఇంటికి వచ్చిన వారిని ఆదరిస్తూ, దసరా ఉత్సవాలను బ్రహ్మాండంగా జరిపిస్తూ, అందరినీ ఆనందింపజేస్తూ, డిసెంబర్ 13, 1977, రాత్రి 10 గంటల సమయంలో యోగంలోకి వెళ్ళి, సహస్రార చక్రం నుండి ఆత్మను విశ్వాత్మలోకి పంపించేశారు. ఇప్పుడు సర్వం కమలమయం. అందుకే ఆవిడ ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎలా పిలిచినా పలుకుతున్నారు, దర్శనమిస్తున్నారు, ఆత్మబోధ చేస్తున్నారని చెప్పడంలో సందేహం లేదు.

కమలమ్మగారు, సత్యనారాయణగారు ఒకరినొకరు నమస్కరించుకున్నది దేహాలతో కాదు, ఆత్మలతో. ఇద్దరిదీ పరమాత్మ సంబంధమేనని యోగులకు తెలుసు. మనకు లౌకికమే తప్ప, ఆ

సంబంధాలు అప్పుడు అర్థంకాలేదు. ఇప్పుడు అర్థం చేసుకునే సమయం వచ్చింది కనుక అన్నీ అర్థంకావించబడుతున్నాయి.

సత్యనారాయణగారిలాంటి యోగి, భర్త కనుకనే ఆమె అన్ని ఆశ్రమధర్మాలను చక్కగా పాటించి, సమాజానికి చూపించారు. ఇద్దరూ కారణజన్ములే. ఒకచోట కలిసి కొన్ని ధర్మాలు పాటించి, తరువాత వారివారి ఆధ్యాత్మిక జీవనం, సాధనలు వ్యక్తిగతంగా చేసుకుని తరించారని చెప్పవచ్చు. వీరే అవతార పురుషులు.

శ్రీరామకృష్ణ-శారదాదేవిల జీవితాలను, కమలమ్మ-సత్యనారాయణగార్ల జీవితాలను సమన్వయపరచి చూద్దామని నా సంకల్పం. వారివారి జీవిత విశేషాలను మరోసారి రూఢిచేస్తూ, నాచేత వ్రాయిస్తున్నారని నాకు అనిపిస్తోంది. కలకత్తా నగరంలో జీవించిన ఆయన జీవితానికి, దక్షిణదేశంలో జీవించిన ఈమె జీవితానికి ఎంతో పోలిక. జీవితాల సరళిలోని ఏకత్వం, ఆధ్యాత్మిక జీవితంలోని ఏకత్వం, ధర్మాచరణలు ఒకేలాగ ఉండడం, ఒకే భావనలు, మానవజాతిని ఉద్ధరించడం, సంసారంలో బాధపడేవారి ఆత్మోద్ధరణకు పాటుపడడం, నిర్మల మనస్కులవడం, ఏదో కొద్దిమందికి చెప్పిన ఉపదేశాలే ప్రపంచవ్యాప్తమవడం అచ్చు గుద్దినట్లుగా ఉన్న ఈ పోలికలు ఎవరికి ఉంటాయి! అవతరించిన ఆ భగవతికే తెలుస్తుంది, లేదా ఇలా కొంతమంది చేత వ్రాయించడంద్వారా మాత్రమే తెలియజేయాలి. లేకపోతే ఎన్ని జన్మలైనా వృధా అయిపోతాయి తప్ప తెలుసుకోవడం అనేది జరుగనే జరగదమోనని అనిపిస్తోంది.

## గురుత్వము

1. ఒకే వ్యక్తిలో దివ్యత్వ, మానవత్వాల అద్భుత కలయికే అవతారము. జీవిత ఘట్టాలలో కొన్ని సమయాల్లో ఈ రెండింటిలో ఒకటి హెచ్చుగా కనిపిస్తుంది. చిన్నతనంలో అప్పుడప్పుడూ కనిపించిన స్థితి, పరిణితి చెందే కొద్దీ మరింత హెచ్చుగా గోచరిస్తుంది.

2. పురాణాల్లో మానవాతీత కృత్యాలు, మానవాతీత ప్రకటనలు, అవతారం యొక్క దివ్యత్వానికి గీటురాళ్ళుగా వర్ణింపబడ్డాయి. అవతారమనే అవగాహనను మెరుగుపరచే కవుల అసహజవర్ణనల వెనుకనున్న సత్యస్వరూపాన్ని అర్థంచేసుకోవటానికి గురుదేవుని జీవితం ఉపకరించింది. దివ్యత్వ ఆవిర్భావంక్రమంగా వచ్చేదని ఈయన జీవితంద్వారా మనకు తెలుస్తుంది.

3. ఆయన జీవితంలో మొదటిది- శ్రీనివాసు అనే బీదవాడు (శంఖుగాజులు చేసుకునే వాడు) గురుదేవునితో భక్తివిషయాలు చర్చించేవాడు. ఆయనలో దివ్యత్వాన్ని దర్శించాడు. ఒకసారి అతను ఇలా ప్రార్థించాడు- "నేను పేదవాణ్ణి అయ్యాను. ఈ ప్రపంచంలో నీవు చేసే అద్భుత కృత్యాలను దర్శించే భాగ్యం నాకు లేదు. ఈ సేవకునిపై కరుణాదృష్టిని ప్రసరింప చేయమని వేడుకుంటున్నాను." ఈ విధమైన దివ్యత్వ ప్రకటన హెచ్చుకాజొచ్చింది. (సాధన పెరిగే కొద్దీ సమాధి స్థితి ఎలాగో అలాగే దివ్యత్వ ప్రకటన)

4. మధురనాధునకు తాను ఒకసారి కాళిగా, శివునిగా ఎలా దర్శనమిచ్చినదీ, గురుత్వ భావం దాల్చి రాణీ రాస్మణీని ఎలా సరిదిద్దినదీ మనకు విదితమే. ఈ దివ్యశక్తి వలనే అనేకమంది పండితులు ఆయన్ని అవతారమని అంగీకరించారు. తన గురువులైన తోతాపురి, భైరవి బ్రాహ్మణి, జటధారిల విషయంలో కూడా వారి లోపాలను సరిదిద్ది వారి అనుభవాలకు పరిపూర్ణత కలిగించడానికి తోడ్పడ్డాడు.

ఇక, శ్రీకమలమ్మగారి విషయానికి వస్తే, చిన్నప్పుడు 5 సం॥ల వయసులో కన్పించిన ఆమె ధ్యానస్థితి, అమ్మవారు పిలిచిందని చెప్పడం చూసి తండ్రిగారు అప్పుడే ఆ దివ్యత్వమును గ్రహించి 'కమలమ్మ' నామధేయాన్ని ప్రకటించారు. అంతకుముందు పేరు వెంకట సిరినరసమ్మ.

దీన్నిబట్టి మనం గ్రహించాల్సినది, మానవత్వ లక్షణాలకు అతీతంగా కనబడిన ఆ దివ్యత్వ ప్రకటన తర్వాత, ఆమెకు రెండవ నామధేయాన్ని ఇచ్చారు. అంటే పరివర్తన చెందిన వ్యక్తికి రెండవ పేరు వస్తుందన్నమాట (మొదట గదాధరుడు తర్వాత శ్రీ రామకృష్ణ పరమహంసగా మారినారు). చిన్నప్పుడు కన్పించిన ఈ స్థితే పరిణితి చెందే కొద్దీ మొదట తండ్రి, తర్వాత గురువులు, ఆ తర్వాత ఆమె భర్త గ్రహించారు. తర్వాత భక్తులకు అనుభవాలను ప్రసాదించడం ద్వారా తెలియపరిచారు. అవతారమూర్తులలో క్రమంగా ఈ లక్షణాలు ఈవిధంగా వృద్ధి చెందుతాయని తెలుస్తోంది. ఆ ఆవిర్భావం క్రమంగా రావడం వలన కమలమ్మగారి జీవితమును విశ్లేషించగా, అవతార విశేషమును గ్రహించగలుగుతున్నాము.

కమలమ్మగారి జీవితంలో ఒక ప్రక్కన గ్రహస్థాశ్రమంలో ఉంటూనే, ఇంట్లో అమ్మవారిని పూజించుకుంటున్నప్పుడే దివ్యత్వ ప్రకటనలు మొదలయ్యాయి. దానికి ముందుగానే, ఒకసారి కలలో అమ్మవారు కనబడి "3 సం॥ల్లో నీలో ఐక్యమౌతాను. తర్వాత నువ్వేది పలికితే అది నిజమవుతుంది, సిద్ధిస్తుంది. భవిష్యత్ దర్శనమును ప్రసాదిస్తున్నాను" అని పలికింది.

3 సం॥ల కాలపరిమితి ఎందుకు? అంటే ఆ సమయమంతా సాధనాసమయంగా పరిగణించాల్సి వస్తుంది. ఆ సమయంలో ఆమె వద్దకు మనుషులు వచ్చి, కష్టసుఖాలను చెబుతుండే వారు. దానికి ఆమె "అమ్మవారిని నమ్ముకోండి, నమస్కరించుకోండి ఆమే వాటిని తీరుస్తుంది" అని చెప్తుండేవారు. ఆ తర్వాత దివ్యత్వ ప్రకటన జరిగింది.

ఒకసారి 2వ కుమార్తె త్రిపురాంబ చిన్నపిల్లగా ఉండగా, ఒకరి ఇంటికి ఒక కోయవాడు వచ్చి, ఏవో చేతబడి ప్రయోగాలు చేయదలిచాడు. దానికోసం వారి ఇంట్లో ఒక ముగ్గువేసి, అందులో త్రిపురాన్ని పిలిచి కూర్చోబెట్టమని, ప్రయోగం మొదలుపెట్టాడు. మధ్యలో ఒక అద్దాన్ని ఇచ్చి ఏం కనిపిస్తోందని అడిగాడు. ఆ పిల్ల పుర్రెలాంటి ఆకారం కనిపిస్తోందని చెప్పింది. అంతా అయ్యాక తినడానికి ఏవో పెట్టి, పంపించేశాడు. ఈ పిల్ల ఈ విషయం ఇంట్లో చెప్పలేదు.

ఆ రాత్రి కమలమ్మగారికి కలలో అమ్మవారు కనబడి, "వాడు బ్రహ్మం. చేతబడి చేయడం లోనూ, త్రిప్పడంలోనూ సమర్థుడు. వాణ్ణి ఊరినుండి వెళ్ళగొట్ట"మని చెప్పింది. మర్నాడు కమలమ్మ

గారు వాళ్ళింటికి వెళ్ళి “ఏమిటి నీ పేరు బ్రహ్మమేనా? ఇక్కడకు ఎందుకొచ్చావ్? నీకు చేతబడి చేయడం, త్రిప్పడం కూడా వచ్చుట కదా! నీ సంగతంతా అమ్మవారు చెప్పింది” అనగానే వాడు భయపడి ఆమె కాళ్ళపైబడి, ఊరువదలి వెళ్ళిపోతానని చెప్పి వెళ్ళిపోయాడు. ఆ విధంగా ఆ ఇంటివాళ్ళను రక్షించి, వాళ్ళకు ఈమె ఎవరో తెలియజేయబడింది. అలా దివ్యత్వ ప్రకటనలు ప్రారంభమైనాయి. (1950–55లో ఆమె భీమడోలులో ఉన్నప్పుడు జరిగిన సంఘటన ఇది)

ఆమె ఆ ఊరు వెళ్ళిన కొత్తలో, ఇల్లు వెదుక్కునే రోజుల్లో ఒకసారి కాలువలో నీళ్లు తేవడానికి వెళ్ళినప్పుడు, పక్కనున్నవాళ్ళను ఇల్లు ఏదైనా ఉంటే చెప్పండని అడిగారట. అక్కడికి స్నానం చేయడానికి వచ్చిన రాజేశ్వరమ్మగారు ఈమెను చూసి, “మా ఇంట్లో బాలాత్రిపుర సుందరీ అమ్మవారు ఉంది. పక్కనే ఒక భాగం ఖాళీగా ఉంది. మీకు నచ్చితే రావచ్చు” అని చెప్పిందట. తరువాత ఆమె వాళ్ళింట్లో చేరారు. అప్పటినుంచి రాజేశ్వరమ్మగారి కుటుంబమంతా ఆమె శిష్యులుగా చేరిపోయారు. వాళ్ళ అబ్బాయినే, తన కొడుకనీ, అతని భార్యను కోడలు అని పిలుస్తూ, వారికి అత్యంత సన్నిహితురాలిగా, వాళ్ళ ఇంట్లో మనిషిలాగా కమలమ్మగారు మెలిగారు. ఈ విధంగా ఆమె దివ్యత్వం ప్రకటించబడడం మొదలైంది.

తరువాత పూజా సమయంలో, త్రిపురాంబ మీదకు అమ్మవారు వస్తుంటే, చూసిన వాళ్ళందరూ ఈమె అమ్మవారి అంశ అనీ, వాళ్ళింట్లో అమ్మవారు ఉందనీ గ్రహిస్తుండేవారు. ఆమెకు అప్పటినుంచే ప్రచారం చేయడమనేది లేదు. ఆమెను చూడగానే వాళ్ళకే విషయం తెలిసిపోయేది. ఆమె దివ్యాకర్షణ అటువంటిది. శుక్రవారంనాడు అమ్మవారిని పూజించి, పానకం వడపప్పు నైవేద్యం పెట్టే సమయానికి ఇరుగుపొరుగు వారు ఈమెతో బొట్టు పెట్టించుకుని, ప్రసాదం తీసుకుని వెళ్తుండేవారు.

సాధనా కాలంలో చాలామంది ఆమెచేత ఆకర్షింపబడేవారు. 3 సం॥ల తర్వాత అమ్మవారు ఐక్యమయ్యేముందు ఈమెకు ఒక కల వచ్చింది. అందులో ఈమెకు తెలిసిన ఒకావిడ (నారాయణమూర్తి గారి తల్లిగారైన సువర్ణాంబగారు) నదిలో ఈమె తలను ముంచేస్తున్నట్లుగా కనపడిందట. ఆ తర్వాత నుండి ఈమె చెప్పింది జరగటం, వాక్సుద్ధి, భవిష్యత్ ముందుగానే తెలియడం, అందరకూ రాబోయే, జరగబోయే విషయాలను కూడా చెప్పడం మొదలైంది. అప్పటినుండి ఆమె ‘గురువుగా’ ప్రకటింపబడ్డారు. ఏలూరు వచ్చి, పీఠమును ప్రతిష్ఠించినప్పటి నుంచీ ఆమె పూజ పిన్నిగా, దేవుడమ్మగా, దేవీగారుగా, అమ్మమ్మగారుగా, ఒక గురువుగా గుర్తించబడ్డారు. ఎంతోమందికి గురుత్వాన్ని చేపట్టారు. అమ్మవారి ప్రతిష్ఠతో ప్రారంభమైన కొత్త లక్షణం, గురులక్షణం వృద్ధిచెందడం, సామాన్య భక్తురాలిగా ఉండడం ఆమె యొక్క సహజ స్వభావం. కానీ తాను ఒక ప్రయోజనాన్ని సాధించాలని, ప్రపంచానికి కొంత మేలు చేయాలని, అమ్మవారి ఉపకరణముగా వ్యవహరించాలనే భావన ఆమెలో వృద్ధిచెంది, భక్తులను అనుగ్రహించే శక్తి పెంపొంది, ఇచ్ఛామాత్రంగానే వారి ఆధ్యాత్మిక చైతన్యాన్ని జాగృతపరచే

అనుభవాన్ని ప్రసాదించేవారు. ఆమె దృక్పథంలో మార్పు ఏమిటంటే, వారికి అనుభవాలను ప్రసాదించడం, తన వద్దకు రప్పించుకోవడం, మార్గాన్ని ఉపదేశించడం, కష్టాలనుండి విముక్తుల్ని చేయడం – తద్వారా భక్తిమార్గంలోకి ప్రవేశపెట్టడం, భక్తిలోనే ఉన్నవారిని జాగృతపరచి, సాధనలో పెట్టడం, సేవ చేయాలనే విషయాన్ని నేర్పడం, వారిచేత అనేకరకాలుగా సేవ చేయించడం వంటివన్నీ ఆమె దివ్య వక్తిత్వాలైనాయి.

## గృహస్థ శిష్యులు

1. ఆయనను గౌరవించిన పెద్దలు, ఆయననుండి నేర్చుకున్న వారెవరైనా జీవితంలోను, సందేశాన్ని ప్రచారం చేయడంలోనూ ప్రాధాన్యత వహించలేదు. ఈ విషయంలో ప్రముఖపాత్ర వహించిన బృందము ఆయనకు అత్యంత సన్నిహితులైన భక్తులు, శిష్యులు మాత్రమే. గృహస్థులు, సన్యాసులు, స్త్రీ శిష్యులు ఇలా వీరిలో కొంత ముఖ్యులైనవారున్నారు. గృహస్థులైన మహేంద్రనాథ్‌గుప్తా బెంగాలీలో 'రామకృష్ణ కథామృతము'నకు గ్రంథకర్త.

2. ఆయన గురుదేవుని దర్శించటానికి వెళ్ళిన రోజుల్లో, అక్కడ చూసిన దృశ్యాలు సంక్షిప్త లేఖనము ద్వారా దినచర్యలో వ్రాసినవే. గురుదేవుడు నిర్యాణం చెందిన చాలా కాలానికి ఈ అనర్ఘపుటలను ఆయన తయారు గావించారు. శ్రీరామకృష్ణ సందేశములు ఈయన గ్రంథముల నుండి సంకలనము చేసినవే.

పూర్వ అవతారపురుషుల చరిత్రలు, ఉపదేశములు కర్ణాకర్ణిగా, కవుల, తత్త్వవేత్తల రచనల ద్వారా మానవ జాతికి లభించినవి. కాని గురుదేవుని సందేశములను యధాతథముగా ఆయన వ్యక్తిత్వమును గూర్చి, ఇతరులతో వ్యవహరించిన తీరు గూర్చి ఆయన నిత్యజీవితమును గూర్చి, విస్పష్టమైన లేఖాచిత్రనము మనకు అందచేసిన మహేంద్రునికి ధన్యవాదములు.

3. ఇంక సన్యాస శిష్యులలో ముఖ్యమైన వారు శారదానంద, వివేకానంద. మహాచార్య శ్రీరామకృష్ణ (వంగమూలం) శ్రీరామకృష్ణ లీలాప్రసంగము అను బృహద్గ్రంథముగా రచించిన వారు శ్రీ శారదానందస్వామి. జీవితచరిత్రలోని అన్ని వివరాలకు అది మూలం.

ఇక రెండవవారైన స్వామి వివేకానంద. శిష్యవర్గంలో అత్యంత ప్రాధాన్యత వహించిన జగద్విఖ్యాత వ్యక్తి. గురుదేవుని జీవితంలో ఆయన పాత్రను అంచనా వేయగలము. గురుదేవుని అనుభూతులకు ఒకవిధంగా గీటురాయి. సహజంగా అతడు హేతువాది. విజ్ఞాన, తత్వశాస్త్రములను అధ్యయనం చేసినవాడు. హిందూ జీవన విధానములను, ఆరాధనలను నిరసించేవాడు. విమర్శకుడైన పరిశీలకుడుగా ఆయన శ్రీరామకృష్ణుని సమీపించాడు.

"మీరు దేవుని చూశారా?" అని గురుదేవుని ప్రశ్నిస్తే, "నేను చూశాను. నిన్ను చూసిన దానికంటే విస్పష్ట విధానంలో భగవంతుని చూస్తున్నాను. నా ఆదేశములను అనుసరిస్తే భగవంతుని దర్శించుటకు నీకుకూడా తోడ్పడగలను" అని సమాధానమిచ్చారు.

ఈ చక్కని సమాధానం ఉరకలెత్తుతున్న నరేంద్రుని పాదాక్రాంతుణ్ణి చేసింది. "నిరసించడానికి వచ్చినవాడు, అర్చించడానికి నిలిచాడు" అనే దానికి ఇది ఒక తార్కాణము.

ఈ యువకుడు గురుదేవుని అనుభవముల యొక్క శక్తిచేతనూ, నిస్వార్థమైన ప్రేమమాధుర్యాల చేతనూ అణచివేయబడ్డాడు. వాదముతో కాక వికాసము చెందిన వ్యక్తిత్వ ప్రాభవమున గురుదేవుడు అతన్ని జయించాడు. ఇచ్ఛామాత్రమున గురుదేవుడు నరేంద్రుని చిత్తవృత్తిని పైకెత్తి, 'ఉన్న సర్వమూ ఒక్కటే' అను భావన అతనిలో చొప్పించాడు. ప్రారంభంలో అద్వైతాన్ని నిరసించే నరేంద్రుడు, దాన్ని ప్రతిపాదించే ఆధునికులలో సుప్రసిద్ధుడైనాడు. అతని దృక్పథములో గురుదేవుడు తెచ్చిన విప్లవమునకు జోహార్లు.

కాళికాదేవితో సహా హిందూ దేవతలను తూలనాడేవాడు, విగ్రహారాధనను విమర్శించేవాడు, పూర్తిగా హిందూ సంస్కృతిని సమర్థించడంలో నిష్ణాతుడైనాడు. విమర్శక పరిశీలకుడైన వివేకానందుడు ప్రధాన శిష్యుడుగా మారడం అనేది, గురుదేవుని జీవితం సరిగా అర్థంచేసుకోవడం గొప్ప ప్రాధాన్యత వహించింది. శ్రీరామకృష్ణునికున్న శక్తి, పాండిత్యంలోగానీ, సంపదలోగానీ, సంఘటిత శక్తిలోగానీ లేదు. నిరహంకారమైన అమాయక శిశువు అయిన ఆయన శక్తి పూర్తిగా నిస్వార్థ ప్రేమలోను, పలు రకాలైన ఆధ్యాత్మిక అనుభవములలో ఉన్నది. ఆధ్యాత్మిక అనుభవములు మతిభ్రమణలేనని విమర్శించే వారికి ఈవిధమైన సమాధానం ఇవ్వాలి.

"కుమ్మరివాడు మట్టితో కుండలు చేసినట్లుగా, దృఢప్రజ్ఞగల వివేకానందుని మనసుని మలిచి, అతడు ఏ విషయాలను గూర్చి తీవ్రంగా విమర్శించాడో తిరిగి ఆ విషయాలనే ధాటిగా ప్రచారం చేసే ప్రచారకునిగా రామకృష్ణుడు ఎలా మార్చగలిగాడు?" అన్నదే ఆ ప్రశ్న. శ్రీరామకృష్ణుని అనుభూతులు నిత్యత్వము అనే పునాదిపై నిర్మింపబడినవి.

**14.04.2005, నామక్కల్**

ఈరోజు తమిళనాడు ఉగాది పండుగ. బ్యాంకుకు శెలవు. సాయంత్రం 4 గంటలకు 50 కి.మీ.ల దూరంలో ఉన్న 'కొడుముడి' అనే ఊళ్ళో ఉన్న పాత శివాలయం చూడాలని బయల్దేరాము. ఆ గుడి 2000 సం॥ల క్రితంనాటిది. డ్రైవర్ సుబ్రహ్మణ్యం చాలా మంచివాడు. మాకు అన్నీ చూపించాలని తాపత్రయపడుతుంటాడు. సాయంత్రం గం॥5.30-6.00ల మధ్య గుడికి చేరాము. పసుపు చీరలు కట్టుకుని, బిందెలకు పూలు, కుంకుమలు అలంకరించి, నెత్తిమీద పెట్టుకుని చాలామంది జనం పాటలు పాడుతూ గుడికి వెళ్తున్నారు. అది జాతరలాగ జరుగుతోంది. డ్రైవర్ "దర్శనం రొంబ కష్టం ఇనికి, పండుగ వేరే" అన్నాడు. ఆ జనం మధ్యలో దర్శనం కష్టమే. లోనికి వెళ్ళాము. చాలా పెద్ద గుడి. టిక్కెట్స్ తీసుకున్నా జనం విపరీతంగా ఉన్నారు. అప్పుడు అక్కడ తీర్థం ఇచ్చే పూజారి మమ్మల్ని చూసి, వేరే ఉన్న గేట్లోంచి రమ్మని, గేటు తెరిచారు. తిన్నగా లోపలికి వెళ్ళాము. స్వామి స్వయంభువు అని, పేరు మకుటేశ్వరన్ అని చెప్తూ, అమ్మవారి పేరు సౌందర్యనాయకి, అటు వెళ్ళి చూడండి అన్నాడు. దర్శనం బాగానే

అయింది. నేను లలిత సహస్రనామం చేసుకున్నాను. అమ్మవారి గుడికి వెళ్ళాము. అక్కడ కూడా ఆ జనంమధ్యలో మమ్మల్ని లోపలికి తీసుకెళ్ళారు. అమ్మవారు నిలువెత్తున నిలబడి ఉన్నది. పచ్చని ముఖము. ఎర్రటి అంచుఉన్న పసుపురంగు చీరను ధరించి, అందమైన అలంకరణలో వున్నది. అలా చూస్తూ ఉన్నాను. అమ్మవారి పేరు ఏమిటని అడిగాను. ఆ పూజారి "వడివడియమ్మన్. మద్రాసు తిరవత్తియూరులో ఉన్న వడివడియమ్మనే ఈమె. ఇక్కడ ప్రతిష్టించారు. ఇక్కడ ఈమెను సౌందర్యనాయకి అని పిలుస్తారు" అన్నాడు. లోపల ఇంకా చాలా గుళ్ళు ఉన్నాయి. అన్నీ చూశాము. ఎదురుగా కావేరీ నది. అక్కడకు వెళ్ళాము. అందరి కోసం ఒక నియమం చేస్తూ, అటుఇటూ తిరుగుతుంటే, ఈయన మెట్లు దిగి నదిలో కాళ్ళు కడుక్కుని, చేత్తో నీళ్ళు తెచ్చి నాకిచ్చారు. నేను చల్లుకుని, ఆయనకు చల్లాను. తిరిగి వస్తుంటే ఆయన "ఈ అమ్మవారికి ఏలూరు ఒకటే అనుకున్నాము. ఇంకా బ్రాంచీలున్నయన్నమాట" అన్నారు. నవ్వుకున్నాము. కానీ నాకు చాలా ఆశ్చర్యం, ఆనందం కలిగాయి. ఉగాదినాడు ఎక్కడో తమిళనాడులో ఉన్న మారుమూల గ్రామంలో మన అమ్మవారు (మూలస్థానం) అక్కడుండి, నన్నక్కడికి పిలిపించుకుని దర్శనమివ్వడం ఏమిటి, ఆమె నాతోనే ఉండి నన్నెక్కడికి తీసుకెళ్ళాలో ఆమె నిర్ణయించి ఆ స్థానాల్ని దర్శింప చేస్తోందని అనిపించింది.

**16.04.2005**

ఉదయం టిఫిన్ చేసి 10 గంటలకు నేను హౌసింగ్‌బోర్డ్‌లో ఉన్న మిణ్ణరసి ఇంటికి వెళ్ళాను. ఇంట్లో ఆమె భర్త కూడా ఉన్నారు. ఇద్దరూ బయట కుర్చీల్లో కూర్చున్నారు. నన్ను రోజూ రావటం లేదేమని అడిగారు. ఎండలు కదా అందుకని రావటం లేదని చెప్పాను. పండుగరోజు ఏం చేశారని అడిగితే కొడిముడి వెళ్ళామని చెప్పాను. దానికి ఆయన "తమిళనాడులో ఉన్న రెండు శనీశ్వరాలయాల్లో అది ఒకటి. జాతకంలో శని నడుస్తున్న వాళ్ళు తప్పక అక్కడకు వెళ్తారు. అక్కడకు వెళ్ళి, నూనెతో దీపాలు వెలిగించి, నువ్వులు మూటకట్టి దీపంలాగా వెలిగిస్తారు. (ఆంధ్రప్రదేశ్‌లో మందపల్లిలోలాగా) అందుకు ఆ గుడి ముఖ్యమైనది. ఆ పనులు చేశాక, కావేరిలో కాళ్ళు కడుక్కుని, నీళ్ళతో తలపైన సంప్రోక్షణం చేసుకుంటే శని ప్రభావం తప్పక విడిపోతుంది. అంత పురాతనమైన శనీశ్వర విగ్రహం అది" అన్నారు.

ఆయన చెప్పగానే, తెలీకుండానే ఆ గుడిని దర్శించి కావేరీ నీళ్ళతో సంప్రోక్షణం చేశాము కదా అని నాకు ఇంకా ఆనందం వేసింది. ఆ విధంగా అక్కడ వడివడియమ్మన్ ఉండి, ఆ ప్రక్కనే శనీశ్వరాలయం కూడా ప్రతిష్టించబడిన గుడికి వెళ్ళాము. క్రొత్త సంవత్సరం చాలా ఆనందంగా మొదలైంది అనిపించింది. ఆ కావేరీ ఒడ్డున గట్టుమీద కూర్చుని, నియమం చేసి, లోకకళ్యాణార్థం అని సంకల్పించి ధారపోశాను. అమ్మవారు నాచేత అలా ముఖ్యమైన ప్రదేశాలకు తిప్పి, అందరికీ చేయించాల్సినవన్నీ నాచేత చేయిస్తోంది అని తెలియగానే, ఆమెకు నాపై ఉన్న కరుణ గుర్తుకు వచ్చి, నాచేత జీవితాంతం ఇలాగే చేయించమని వేడుకున్నాను.

**18.04.2005**

ఈరోజు శ్రీరామనవమి. ఉదయమే హైదరాబాద్ నుండి అన్నపూర్ణగారు, గుడికి నేను రాలేకపోతున్నందుకు బాధపడుతూ ఆశీర్వచనం కోసం ఫోన్ చేశారు. "ఈ సంవత్సరం మీరే పోయండి. నేను పోసినట్లే" అని చెప్పాను. కైకలూరులో దత్తారావు ఇంట్లో శాస్త్రి, భార్యాపిల్లల్ని కూర్చోమని శ్రీరామకళ్యాణం చేసి అందరికీ భోజనాలు పెట్టమని చెప్పాను. తరువాత టివిలో వచ్చిన సంపూర్ణ రామాయణం సినిమా చూశాను. సాయంత్రం గం.5.00లకు అనుకోకుండా ఎదురుగా కాలనీలో ఉన్న మిణ్ణరసి, ఆమె ఫ్రెండ్ తెలుగావిడ నా దగ్గరకు వచ్చారు. ఒక గంటసేపు కూర్చుని, కబుర్లు చెప్పుకుని, పాటలు పాడుకున్నాము. ఆమె "ఎదురుగా ఉన్న హోటల్లో మా మనవలు స్విమ్మింగ్ చేస్తున్నారు. వెళ్ళి వాళ్ళని ఇంటికి తీసుకురావాలి" అన్నారు. "సరే, నేనూ వస్తా, పదండి" అని, వాళ్ళిద్దరికీ రెండు జాకెట్టు ముక్కలు, కుంకుమ, అరటిపండ్లు బొట్టుపెట్టి యిచ్చి బయల్దేరాము. అక్కడ కాసేపు కూర్చుని రాత్రి గం.7.00లకు తిరిగి వస్తుంటే మిణ్ణరసి "ఓ కమలం రోడ్డు పక్కగా నడువు" అన్నది. నేను వెంటనే "కమలం ఎవరు?" అనడిగాను. దానికి మిణ్ణరసి తెలుగావిడను చూపిస్తూ, "ఈమె పేరు కమల. మేము కమలం అని పిలుస్తాము" అని చెప్తూ, "ఓహో! మీ అమ్మమ్మ కమల కదా, ఆమె ఈరోజు ఇలా మీ ఇంటికి వచ్చింది. నీచేత్తో పసుపు కుంకుమ తీసుకుంది" అన్నది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. చాలా ఆనందపడ్డాను కూడా. నేను అటు హైదరాబాదు, ఇటు కైకలూరు ఎక్కడికీ వెళ్ళలేదు, ఏ కళ్యాణమూ చూడలేదు. కానీ ఎక్కడో మారుమూల ఈ హోటల్లో కూర్చున్న నా వద్దకు అమ్మమ్మ పేరుతో ఒకామె వచ్చి, నాచేత్తో పండు, పసుపు కుంకుమలు తీసుకోవడమే కాకుండా, ఆమె రూపంలో వచ్చింది నేనే అంటూ నాకు ఆ పక్కనామెతో ఈ విషయం చెప్పించింది. నేను ఎక్కడున్నా సరే, అమ్మమ్మ ఆ సమయానికి వచ్చి నన్ను ఆశీర్వదిస్తుంది అని మరొకసారి రుజువైంది. ఉగాదినాడు ఆమె నాకు పెట్టింది. శ్రీరామనవమికి నా వద్దకు వచ్చింది. ఏదైతేనేం ఆవిడ నన్ను వదలదు అన్న ధైర్యం ఎక్కువైంది. ఆరోజు రాత్రి బుజ్జి ఫోన్ చేసి, కార్యక్రమం చాలా బాగా జరిగిందని, పాతికమంది వరకూ వచ్చారని చెప్పింది.

ఇక, కమలమ్మగారి జీవిత చరిత్రను అవలోకిస్తే, ఆమె జీవించి ఉన్నప్పుడు కూడా ప్రచారానికి ఆమె విరుద్ధం. "ప్రచారం వద్దు. అమ్మవారి గురించి, లీలలు గురించి, ఉపవాస దీక్షల గురించి ఎవ్వరికీ చెప్పవద్దు. దివ్యత్వమును ఎవరికివారే అనుభవించాలే తప్ప ప్రచారముతో అందరికీ అర్థమవ్వదు సరికదా వాళ్ళు విమర్శిస్తే, లేనిపోని పాపం అంటుకుంటుంది. ఎవరి కర్మ పరిపక్వం అవుతుందో వారిని అమ్మవారు ఈ గడపలోనికి అడుగుపెట్టేటట్టు చేస్తుంది. లేకపోతే ఈ ఛాయలకు కూడా రాలేరు. కాబట్టి మీ ప్రచారము ఏమీ కాదు. ఆ పని చేయకండి" అని చెప్పారు.

ఇంక ఆమె సందేశాలను, జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని ఎవరు ప్రచారం చేయగలరు? ఆమె సిద్ధి పొందిన అనంతరం సుమారు 15-18 సం॥ల తర్వాత ఆమె మానసపుత్రులలో ఒకరైన శ్రీకాశీ విశ్వేశ్వరశర్మగారు ఆమె భక్తులను, శిష్యులను, పీఠమును దర్శించుటకు వచ్చిన వారిని ప్రశ్నించి,

విషయాలను సేకరించి, ఒంటిపూట భోజనం చేసి, నేలపై పడుకుని, సాయంత్రం ఆఫీసునుంచి వచ్చిన తర్వాత స్నానంచేసి, పట్టుపంచె కట్టుకుని, అమ్మవారి ముందు కూర్చుని ఈ 'కమలమ్మ గారి సంక్షిప్త జీవితచరిత్ర"ను వ్రాసి, తీసుకొచ్చి, నేను ఏలూరులో ఉండగా నా చేతిలోపెట్టి, దీన్ని ఎలా ప్రింట్ చేయిస్తావో, నీ ఇష్టం. మొత్తంమీద ఇది అందరికీ అందాలి" అన్నారు.

దాన్ని నేను చదివాక, ఇంకా సంపూర్ణంగా వ్రాయాలని అనిపించింది. అందుకని దాన్ని అప్పుడు పక్కన పెట్టేశాను. తర్వాత కొద్దికాలానికి 1997లో 'శ్రీకమలమ్మగారి దివ్యచరిత్ర'ను మరికొంత మంది శిష్యుల వద్దకు వెళ్ళి, మరికొన్ని విషయాలను సేకరించి, శ్రీపింగళి వెంకటకృష్ణారావుగారితో ఎడిట్ చేయించి, పుస్తకాన్ని ప్రచురించడం జరిగింది.

దీన్నిబట్టి మనకు అర్థమైనదేమిటంటే అందరం అమెవద్దే ఉన్నా, ఆమెకు సంబంధించిన విషయం ఒక్కటి కూడా ఎవరికీ చెప్పలేము. ఇంక ప్రచారం ఏం చేస్తాము? ఈ పనికోసం ఆమెయే ఎవరినో నిర్ణయిస్తారు. వాళ్ళు మాత్రమే ఈ పని చేయగలరు. గురుదేవుని జీవిత చరిత్రను 'మహేంద్రనాథుడు' వెలుపలికి తెస్తే, కమలమ్మగారి చరిత్రను 'కాశీ విశ్వేశ్వర శర్మ' బయటకు తెచ్చారు. ఈశ్వరేచ్ఛ లేనిదే చీమైనా కుట్టదన్నట్లు, ఈశ్వర రూపంలోనే ఆ పేరుగల వాళ్ళే పూనుకోవడం ఈ చరిత్రల్లో వాళ్ళ పేర్ల సారూప్యమని తెలుస్తోంది.

గురుదేవుని సన్యాస శిష్యులలో శ్రీశారదానంద ముఖ్యులు. ఆయన పుస్తక రచయిత కూడా. ఇక కమలమ్మగారికి సన్యాస శిష్యులు లేరు. అందరూ సంసారులే అనుకుంటాము. ఎందుకంటే ఆమె గృహస్థు కదా. కానీ ఆమె 2వ కుమార్తె 'సన్యాసిని'. ఆమె ఈ పీఠబాధ్యతలు స్వీకరిస్తుందని కమలమ్మగారు ముందే చెప్పారు. అలాగే ఆమె జీవితాంతం సన్యాసినిగా ఉండి పీఠాన్ని నిర్వహించడం ఈ చరిత్రల్లోని సామీప్యము, సారూప్యము.

రెండవవారు శ్రీవివేకానంద స్వామి. గురుదేవులు ఏవిధంగా మనసును మలచి, ఆయన మతమును ప్రచారం చేయించారో, నిరసించేవాడిచేతనే అర్పించేలాగ మలిచారో తెలుసుకున్నాము కదా. దానికి నా జీవితంలో జరిగిన ఒక అనుభవాన్ని వ్రాస్తున్నాను.

1. శ్రీకమలమ్మగారి మనుమరాలినైన నేను (రత్నబాల) చిన్నప్పటి నుండి ఆమె వద్దనే చదువుకున్నాను. నేను పుట్టబోయే ముందే కమలమ్మగారికి 'శ్రీరాజరాజేశ్వరి' తెల్లని వస్త్రములు ధరించి, తెల్లని గుర్రం ఎక్కి, త్రిశూలధారణతో లోపలికి అడుగుపెడుతున్నట్లుగా దర్శనమిచ్చింది. నేను పుట్టిన విషయం చెప్పటానికి వచ్చిన మా నాన్నగారిని "ఆడపిల్ల పుట్టిందా?" అని అడిగి, ఈ కల విషయం చెప్పారు.

2. నాకు 3 సం॥ల వయస్సప్పుడు, నేను శివాలయంలో శివుని ఎదురుగా ఉన్న నందిపైకి ఎక్కి ఆటలాడుతున్నాను. అమ్మమ్మగారు శిష్యులతో కూర్చుని మాట్లాడుతున్నారు. హఠాత్తుగా నేను అమ్మమ్మగారి వద్దకు పరిగెత్తుకు వచ్చి "అమ్మమ్మా! ఈ ఎద్దు (నందిని చూపిస్తూ) నన్ను చాముండి, చాముండి అని పిలుస్తోంద"ని చెప్పానుట. (పక్కనున్న శిష్యులు చెప్పినవి) దానికి

అమ్మమ్మగారు "చూశారా, ఇది ఏమని చెప్తోందో? అది అమ్మవారి అంశతో పుట్టింద"ని అక్కడున్న వారితో చెప్పారట.

3. మరొకసారి శిష్యులతో ఆమె మంత్రాలయం వెళ్ళినప్పుడు, తుంగభద్రలో స్నానంచేస్తూ, ఒక శిష్యురాలితో "ఈ పీఠం ఎక్కడికీ వెళ్ళదు. దాన్ని భరించి చూసేవాళ్ళకు చాలా సహనశాంతులు ఉండాలి. రత్నం (నన్ను అలా పిలిచేవారు) పెద్దదయ్యే వరకూ ఇలాగే నిగూఢంగా ఉంటుంది. తర్వాత మూడోతరంలో చాలా వ్యాప్తి, వృద్ధి చెందుతుంద"ని ఇప్పుడు జరిగే విషయాలను ఆమె అప్పుడే చెప్పారు.

ఇవన్నీ నాకు ఊహ తెలియకుముందు జరిగిన విషయాలు (అమ్మమ్మగారు చెప్పినవి). ఊహ తెలిసిన దగ్గర్నుంచీ అక్కడే పెరిగాను, ఆమె వద్దే ఉండి చదువుకున్నాను. 1వ తరగతి మా పిన్నిగారైన 'త్రిపురసుందరి' పనిచేసే స్కూల్లో (థియోసాఫికల్ ఎలిమెంటరీ స్కూల్) చేర్పించారు. ఆ స్కూల్ హెడ్‌మిస్ట్రెస్ పేరు కమలమ్మ. ఇంటర్ 2 సం॥లు సెయింట్ థెరిసా కాలేజీలో చదివాను. మధ్యలో 2, 3 సం॥లు మా నాన్నగారు పనిచేసిన ఊళ్ళు (భీమవరం, పాలకొల్లు) తప్ప మిగిలిన సంవత్సరాలన్నీ అమ్మమ్మగారి వద్దే ఉన్నాను. నేను చదువుతుండగానే, నాకు శ్రీసాంబశివరావుగారితో దగ్గరుండి వివాహం జరిపించారు.

సుమారు 17 సం॥లు ఆమెతోనే ఉన్నా, ఆమె చేస్తున్న కార్యక్రమాలేమిటో, ఆమె ఎవరో, ఎందుకు అంతమంది మా ఇంటికి వస్తున్నారో, ఆమె వీరికి ఏం ఉపదేశిస్తున్నారో నాకు తెలుసుకునే ఉద్దేశ్యమూ, శ్రద్ధా లేవు. ఆమెకూడా నాకు ఏమీ చెప్పలేదు. చిన్నచిన్న పిల్లలు వచ్చి పూజలు (మడి కట్టుకుని) చేసుకుంటూ ఉండేవారు. కనీసం ఒక్కసారైనా ఆమె నాకు చెప్పే ప్రయత్నం చేయలేదు, వినే స్థితిలో నేనూ లేను. కనీసం ఒక్కరోజైనా ఇంట్లో దేవునివద్ద దీపం వెలిగించలేదు. ఆమె వండిపెట్టేవారు, నేను తిని కాలేజీకి వెళ్ళేదాన్ని. ఫ్రెండ్స్‌తోనే ఎక్కువ గడపడం, కాలేజీ మానేసి సినిమాలకు వెళ్ళడం జరిగేది. అప్పట్లో హిందీ సినిమాలు చూడడం బాగా ఫ్యాషన్.

ఇంటికి అందరూ మడికట్టుకుని వచ్చేవాళ్ళు. వాళ్ళను ముట్టుకుంటూ ఉండేదాన్ని. ఎంగిలి, మడి అంటే తెలియవు. అన్నిటినీ తొక్కుకుంటూ, తన్నుకుంటూ నడుస్తుండేదాన్ని. దానికి అమ్మమ్మగారు కేకలేస్తుండేవారు, అరుస్తుండేవారు. నేనూ అరిచేదాన్ని. ఇంటికి వచ్చినవాళ్ళు కూడా నేనేం ముట్టుకుంటానో అని భయపడుతుండేవారు. కొందరైతే (ముఖ్యంగా కుప్పా కామేశ్వరమ్మగారు, పుల్లాబ్జాక్షిగారు) నేను తిన్న ఎంగిలి కంచం కూడా తీయనిచ్చేవారు కాదు, శుద్ధిపెట్టడం కూడా తెలియదని. ఇంక నా బట్టలు ఉతకడం, ఇస్త్రీ చేయించడం, ఏరోజు ఏది వేసుకోవాలో అవన్నీ లలితక్క (అమ్మమ్మగారి శిష్యురాలు) చూస్తుండేది. సినిమాలకు వెళ్ళడానికి, మా నాన్నగారు ఊరినుండి వచ్చినప్పుడు డబ్బులు ఇస్తుండేవారు. జీతం రాగానే పిన్ని డబ్బులిచ్చేది. పిన్నికి తెలీకుండా అమ్మమ్మ కూడా డబ్బులిచ్చేది. ఈరకంగా పైలాపచ్చీసులాగా తిరగడమే తప్ప, దేని గురించి పట్టించుకోవడం, ఆలోచించడం అనేది అప్పట్లో లేదు.

నాకోసం స్నేహితులు ఎవరైనా వచ్చినా, (ముందు చిన్న గదిలో) ఎప్పుడూ ఇంట్లో విపరీతంగా జనం, పూజలు, హడావిడి, మధ్యాహ్నంపూట కొబ్బరికాయలు కొట్టడంలాంటి ఏవో పనులు చేస్తుండేవారు. ఎవరెవరో వచ్చి అమ్మమ్మగారిని ప్రశ్నలు అడుగుతుండడం, ఆమె ఏవో సమాధానాలు చెప్తుండడం, అదో లోకంలాగా ఉండేది. వీళ్ళందరి మధ్యనుండి వంటింట్లోకి వెళ్తే, పిన్నిగాని లేక లలితక్కగాని నాకు భోజనం పెట్టేవారు. నేను అన్నం సరిగ్గా తినట్లేదనీ, క్యారేజి అలాగే ఇంటికి తెచ్చేస్తున్నాననీ, ఆవిడ శిష్యులకు చూపిస్తుండేవారు.

అలాంటప్పుడు పిచ్చికోపం వచ్చి, గట్టిగా ఆవిడని కోపగించుకుంటూ ఉండేదాన్ని. ఒకసారి ఆమెను "నీ కాళ్ళకు దణ్ణం పెడుతున్నవాళ్ళంతా ఒట్టి ఫూల్స్" అన్నాను. అంతమంది జనాన్ని ఇంట్లో చూస్తుంటే కూడా కోపం వచ్చేది. కానీ అందులో నాకు అమ్మాజీ అక్క, లక్ష్మి అక్క, నాంచారి అక్క లాంటి కొంతమంది ఫ్రెండ్స్ ఉన్నారు. ప్రతి దసరాకు, మేమందరం పక్కనే ఉన్న శివాలయంలో ఆరుబయట పక్కలు వేసుకుని, సినిమా కబుర్లు చెప్పుకునేవాళ్ళం. నేను పడుకున్నప్పుడో లేక మెలకువగా ఉన్నప్పుడో వాళ్ళు అమ్మమ్మగారి గురించి, అమ్మవారి గురించి, పూజావిశేషాల గురించి మాట్లాడుకునేవారు. అవన్నీ అర్థమయ్యేవికావు, వినాలన్న శ్రద్ధా లేదు.

ఆగస్టు 22, 1973లో నాకు ఏలూర్లో (కె.పి.డి.టి. స్కూల్‌లో) వివాహం జరిగింది. అప్పటికి తాతయ్యగారు పోయి కొద్దికాలమే అయింది. అందుకని అమ్మమ్మ నా వివాహానికి రాలేదు. కానీ, ఇంట్లోనే ఉండి అన్ని పనులు స్వయంగా జరిపించారు. పెళ్ళికి ముందు ఏడాది అంటే, 1972 ఆగస్టులో శ్రావణమాసం, మంగళగౌరి నోము (కన్నెనోము) అని, నాతో ఒక బుట్టెడు గులాబీలు తెప్పించి, ఆ నోము మొదటిసారిగా నాచేత పీఠంలో దగ్గరుండి చేయించారు. మరుసటి ఏడాదే నాకు వివాహమైంది. ఇంటికి కావలసిన సామాన్లన్నీ కొని, సారెపెట్టి, త్రిపురం పిన్నిని, కప్పగంతుల లక్ష్మి అక్కనీ తోడు వెళ్ళమని, నిడదవోలులో కాపురం పెట్టించారు.

1975లో మా నాన్నగారు కొవ్వూరు గవర్నమెంట్ హాస్పిటల్‌లో హెల్త్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తుండేవారు. మొదటి కాన్పుకు ఆమె స్వయంగా నన్ను ఏలూరు తీసుకొచ్చింది. మా అత్తగారికి, మా వారికి కూడా పురుడు ఏలూరులోనే అని చెప్పింది. కానీ నేను ఆమెతో పేచీ పెట్టుకుని అక్కడ ఉండడని గొడవ చేసి, మా నాన్నగారు నన్ను చూడడానికి వస్తే, ఆయనతో కలిసి (అప్పటికి నాకు 9వ నెల) కొవ్వూరు బయల్దేరాను.

అప్పుడు ఆమె రిక్షా వద్దకు వచ్చి "నారాయణరావు (మా నాన్న), దాన్ని బాగానే చూసుకుంటాను నాయనా! సరోజిని (మా అమ్మ)కి ఒంట్లో బాగాలేదు. అక్కడ ఒక్కతే చేయలేదు. దీన్ని ఇక్కడ ఉంచేసి వెళ్ళు" అని కళ్ళనీళ్ళతో మా నాన్నగారని తీసుకువెళ్ళవద్దని ప్రాధేపడింది. నేను ముందే రిక్షాలో కూర్చుని దిగనన్నాను. మా నాన్నగారు, ఆమెను ఓదారుస్తూ, "బాధపడకండి. 4 రోజులు ఉంచుకుని సరోజినిని ఇచ్చి మళ్ళీ ఇక్కడికి పంపిస్తాను. బెంగ పెట్టుకుందేమో. ఇప్పుడు తీసుకెళ్తాను" అని నచ్చజెప్పి నన్ను కొవ్వూరు తీసుకెళ్ళారు.

తర్వాత నా పురుడుకు ఆమె శిష్యురాలిని (చిట్టెమ్మగారు) తీసుకుని సున్నిపిండి, కుంకుడుకాయలు మోసుకొచ్చి, దగ్గరుండి పురుడు పోసి, 11వ రోజున బారసాల చేయించి, ఆమె భర్తగారి పేరైన 'సత్య' కలిపి పిల్లకు పేరు పెట్టమని చెప్తే, మేము 'సత్యపల్లవి' అని నామకరణం చేశాము. 1976 నవంబర్‌లో కొవ్వూరులోనే రెండవ పురుడు కూడా పోసి, బారసాల చేయించి, 'కళ్యాణపవన్' అని పేరు పెట్టించి వెళ్ళారు. 1977లో పవన్‌కు (9వ నెలలో) ఆమే స్వయంగా ఏలూరు పీఠంలో అన్నప్రాశన చేసి, చిన్న వెండి కంచం చేయించి, అందులో వాడికి పరమాన్నం తినిపించారు.

ఆఖరిసారిగా (1977లోనే) దసరా ముందు మా ఇంటికి (అప్పటికి మావారు తాడేపల్లిగూడెం ఎస్‌బిఐలో పనిచేస్తున్నారు) వచ్చి, ఆమె పవన్‌కి ఇచ్చిన చిన్నవెండి కంచం అడిగి, దాంట్లో భోజనం చేశారు. ఆ తర్వాత ఆమె ఇంక మాఇంటికి రాలేదు.

1977 సం॥ దసరాలో ఒక విశేషం జరిగింది. దసరా ముందు మావారు బ్యాంక్‌లో ఆఫీసర్స్ టెస్ట్ రాశారు. అందులో సెలక్ట్ కావడం చాలా కష్టం. సెలక్ట్ అయితే జీతం రూ.750 నుండి రూ.1500 అవుతుంది. దానికోసం ఆయన చాలా కష్టపడుతున్నారు. దసరా నాటికి, వ్రాతపరీక్షలో పాసైన 500మందిలో మావారు ఒకరు. ఇంక పర్సనల్ ఇంటర్వ్యూ కావాలి. అప్పుడు నేను దసరా పూజలకు ఏలూరు వెళ్ళాను. అమ్మమ్మగారు దీక్షలో ఉన్నారు. అప్పటికీ నాకు అమ్మమ్మగారి గురించి అవగాహన గానీ, ఎలాంటి భక్తిగానీ, భయంగానీ, నమ్మకంగానీ కలుగలేదు. అయినా, ఏ భావంతో, ఎందుకు అడిగానో తెలీదు కానీ, "అమ్మమ్మా! మీ మనవడు బ్యాంక్ పరీక్ష వ్రాశారు. అది పాసవ్వడం చాలా కష్టం. పాసైతే అమ్మాజీ అక్కవాళ్ళు చేసుకునే 'లక్షకుంకుమ పూజ' నేను పీఠంలో చేసుకుంటాను. కానీ, ఆయనకు ప్రమోషన్ వస్తుందంటావా?" అనడిగాను. దానికి ఆమె నావైపు తిరిగి ఆశ్చర్యంగా చూస్తూ, "ఏమిటీ, నువ్వు లక్షకుంకుమ పూజ చేసుకుంటావా? నీకు ఇలాంటి సంకల్పం కలగడమే చిత్రంగా ఉంది. మరేమీ ఫర్వాలేదు. సంకల్పం కలిగింది కదా. ఆ పని అదే అయిపోతుంది" అని అన్నారు.

1977 డిసెంబర్‌లో ఆమె పరమపదించారు. తర్వాత నేను హైదరాబాదులో ఉన్న ఒకాయన (పీఠంలో శిష్యుడు) చెప్తే ప్రమోషన్‌కు పని అవ్వచ్చని, ఆయనను కలుద్దామనుకుని ముందుగా నారాయణమూర్తి మామయ్యగారింటికి (మరొక శిష్యుడు) వెళ్ళి విషయం చెప్పాను. దానికి మామయ్య నవ్వి, అమ్మమ్మ ఫోటో చూపించి "ఈమెకు నమస్కారం చెయ్యి. ఆయన దానికన్నా ఈవిడ రికమండేషన్ పనిచేస్తుంది. మన అమ్మమ్మ ఉండగా వాళ్ళు, వీళ్ళు ఏం చేయగలరు?" అని నాచేత ఫోటోకి నమస్కారం చేయించి, ఇంటికి వెళ్ళమన్నారు.

తర్వాత ఈయన ఒక్కరే ఆ బ్రాంచ్‌నుండి సెలక్ట్ అయ్యారు. మామీద అమ్మమ్మగారి దయ అలా ఉంది. కానీ ఈ విషయం చెప్పడానికి అమ్మమ్మగారు లేరు. అప్పటికే ఆమె సిద్ధి పొందారు. అనుకున్నట్లుగానే అప్పటినుంచీ ఇప్పటివరకూ లక్షకుంకుమార్చన వదలకుండా చేస్తూనే ఉన్నాను.

ఈరకంగా ఒక చిన్న లౌకికమైన కోరికతో మొదలైన నా పరిచయం, ఆమె కనుమరుగైన తర్వాత (1986లో పవన్ కుదుటపడ్డాక) నెమ్మదిగా నమ్మకంగా మారింది. నమ్మకం అమ్మమ్మ మీదా? పీఠంపైనా? అంటే తెలియదు. ఏదైనా పని కావాలంటే, దణ్ణం పెట్టుకుంటే అవుతుందనే నమ్మకం మొదలైంది. పవన్ ఆరోగ్య విషయంలో అకుంఠిత దీక్షలాగా సాధన చేసి, నమ్మకాన్ని స్థిరపరచుకున్నాక, మరొక కోరిక కోరాను. 'వాడికి తగ్గి, వాడు కాళ్ళమీద నిలబడితే నా జీవితాన్ని నీ సేవకు వినియోగిస్తాను' అని ఒక ప్రమాణం చేశాను. ఆమె నా కోరిక తీర్చింది.

1986 నుండి నా జీవితంలో ఆధ్యాత్మిక ఘట్టం మొదలైంది. మాకు ఏలూరునుండి విజయవాడ ట్రాన్స్‌ఫర్ అయింది. అక్కడి నుండి నా జీవితం, మనసు, ఆలోచన, నమ్మకం అన్నీ మారిపోయినాయి. ఎవరైనా కష్టపడుతున్నారని తెలిస్తే, వినలేకపోయే దాన్ని. వెంటనే పీఠం అడ్రసు ఇచ్చి ఏలూరు వెళ్ళమనేదాన్ని. ఆమెకు నమస్కరిస్తే, పనులు జరుగుతాయని చెప్పేదాన్ని. నేను విజయవాడలో ఉండగా చాలామంది పీఠానికి పరిచయం అయ్యారు. నేనేదైనా చెప్పినా, కుంకుమ ఇచ్చినా పనులు జరగడం మొదలైంది. ఇలాగ నేను చాలామందికి తెలియడం జరిగింది. మా ఇంటికి వచ్చి గంటలకొద్దీ కూర్చునేవారు. అమ్మమ్మగారి విషయాలు చెబుతుండేదాన్ని. రోజులు నిమిషాల్లాగా గడిచిపోయేవి. పిల్లలతో గడపడానికి కూడా సమయం దొరికేది కాదు. అయినా అలాగే పిల్లల్ని చదివిస్తూ, వచ్చే వాళ్ళతో మాట్లాడుతూ, బంధువులు వస్తే వండిపెడుతూ ఒక్క నిమిషం కూడా ఖాళీ దొరికేది కాదు. అలా సుమారు 5, 6 సం॥లు గడిచాయి. తరువాత గణపవరం వెళ్ళాము.

**19.04.2005, నమక్కల్**

ఒకరోజు మిణ్ణరసి వాళ్ళింట్లో ఉన్నప్పుడు ఒక విషయం చెప్పింది. ఇక్కడకు రెండున్నర కి.మీల దూరంలో ఒక పెద్దాయన ఉన్నారనీ, ఆయన పేరు 'శంకర్ అయ్యర్' అనీ, ఈయనకు 75 సం॥లు ఉంటాయనీ, పెద్ద జ్యోతిష్యశాస్త్రవేత్త అనీ, వాక్శుద్ధి కలవాడనీ, ఆయనను కలవడమే చాలా కష్టమనీ, సినిమా యాక్టర్లు, రాజకీయ నాయకులువంటి పెద్దపెద్దవాళ్ళు వస్తారని చెప్పింది. ఆయన రాజరాజేశ్వరీ ఉపాసకులనీ, ఉత్సావాలు అవీ జరుపుతారనీ, అమ్మవారి అలంకరణ చాలా బాగుంటుందని చెప్పింది.

నేను "ఆహా! అలాగా, ఒకసారి కలుద్దామా?" అనడిగాను. ఆయన ఫంక్షన్స్‌లో మిణ్ణరసి పాటలు పాడుతుంది. అందుకని ఈమెకు బాగా పరిచయము. "సరే, ప్రయత్నిద్దాం" అంది. ఉదయమే తను ఫోన్ చేసి "11 గంటలకు స్వామీజీ వద్దకు వెళ్దాము. ఆయనకు 4, 5 రోజులనుంచీ ఆరోగ్యం బాగుండలేదుట. మా అబ్బాయి (డాక్టర్) ఆయన వద్దకు వెళ్ళి డ్రిప్ పెట్టి వస్తున్నాడు. ఈరోజు అమ్మ ఫ్రెండ్ ఒకామె హైదరాబాద్ నుండి వచ్చారు. ఆమె మిమ్మల్ని కలిసి నమస్కారం చేయాలనుకుంటున్నారు. టైమ్ ఇస్తారా? అనడిగితే, సరే రమ్మన్నారట" అంది. నేను కారులో వాళ్ళింటికి వెళ్ళి, ఆమెను ఎక్కించుకుని వారింటికి వెళ్ళాము. కారు

డ్రైవర్ (సుబ్రహ్మణ్యం) "15 రోజులుముందు అపాయింట్‌మెంట్ తీసుకుంటేగానీ వారిని కలవలేము కదా! మీకు అపాయింట్‌మెంట్ ఎలా వచ్చింది?" అనడిగాడు. ఆమె ఏదో చెప్పింది. నావైపు తిరిగి "తమిళనాడు మాజీ మినిస్టర్ ఎం.జి. రామచంద్రన్, భార్య జానకి, దేవెగౌడలాంటి పెద్దవాళ్ళు వస్తారు. కంచి స్వాములవారు కూడా వీరి సలహా తీసుకుంటారు" అని చెప్తున్నాడు.

వాళ్ళింటిముందు దిగాము. అది చిన్న ఇల్లు. ముందు చిన్న హాలు పొడుగ్గా ఉంది. అక్కడినుండి కుడివైపు వెళితే మరొక చిన్న గది. అందులో ఒక పడక కుర్చీలో కూర్చుని ఉన్నారాయన. మేము తీసుకెళ్ళిన పండ్లు, పూలు, నిమ్మకాయలు ఆయన వద్ద పెట్టి కాళ్ళకు నమస్కరించాము. ఆయన కూర్చోమన్నారు. కాషాయ వస్త్రాలు ధరించారు. తెల్లగా మెరిసిపోతున్న ఛాయతో పండులాగా ఉన్నారు. తెల్లని గడ్డము, పెద్ద నుదురు, విభూతి రేఖలు, మధ్యలో బొట్టు. ఆయన కాళ్ళకు ఎదురుగా ఆమె, పక్కన నేను కూర్చున్నాము.

ఇంట్లోకి అడుగుపెడుతున్నప్పుడే, ఒకామె (సన్నగా, పొడుగ్గా ఉంది) వచ్చి మమ్మల్ని లోపలికి ఆహ్వానించగా, మిణ్ణరసి "తెలుగువాళ్ళే మీలాగా" అని నా గురించి చెప్పింది. నేను వెంటనే "ఏ ఊరు మీది?" అనడిగాను. ఆమె "మేము నియోగి బ్రాహ్మలం. మైసూర్ దగ్గర కూచిమంట" అని తెలుగులో చెప్పి నన్ను కౌగిలించుకుంది (ఆమె ఆయన చెల్లెలట). ఈవిడ లోనికి వచ్చి, తెలుగువాళ్ళని నవ్వుతూ నా గురించి ఆయనకు పరిచయం చేసింది. ఆయన కూర్చోమని చెప్తూ, "ఎక్కడినుండి వచ్చారు?" అన్నారు. నేను "హైదరాబాద్ నుండి. స్వస్థలం ఏలూరు" అనగానే, మిణ్ణరసి "వీళ్ళకు కమలాంబికా పీఠం ఉంది" అని తమిళంలో ఏవేవో చెప్పగానే, ఆయన పెద్దగానే నవ్వుతూ, నమస్కారం చేస్తూ చాలా సంతోషం అన్నారు. నా గురించి నేను పరిచయం చేసుకున్నాను. వెంటనే ఆయన రాజరాజేశ్వరి, లలితా సహస్రనామం, అగస్త్యుడు, హయగ్రీవుల గురించి ఏవేవో మాట్లడుతున్నారు.

ఆయన, 100 చండీయాగాలు చేశాననీ, అనేక వేలకోట్ల నామజపం అవుతుంటుందనీ, హోమంలో పూర్ణాహుతిమాత్రం నేనే చేస్తానని, చాలా పెద్దపెద్దవాళ్ళు ఇక్కడ వస్తుంటారు. కానీ టైమివ్వడమే కష్టం. అందరికీ దొరకదని చెప్పారు.

జ్యోతిషశాస్త్రం గురించి కాసేపు మాట్లాడారు. తెలుగు, తమిళం, ఇంగ్లీషు కొంచెంకొంచెం కలిపి మాట్లాడారు. "గ్రహాల ప్రభావం వలన మనం ప్రవర్తిస్తుంటాము. ఇవన్నీ శాస్త్రాలు. కానీ చివరకు జన్మాంతర పాపపుణ్యాలను అనుసరించి మన ప్రవర్తనలు ఉంటాయి. 7 జన్మల పుణ్యం బ్యాంక్‌లో ఉంటుంది. పుణ్యం తరతరాల నుండి వస్తుంది. ఒకసారి అమ్మవారు ఇంట్లోకి వస్తే, కొన్ని తరాలు అలాగే ఉంటుంది. బయటకు వెళ్ళదు. ఆ పుణ్యంవలన నువ్వు ఇక్కడకు వచ్చావు" అన్నారు. "అవును. మా ఇంట్లో మా అమ్మమ్మ కమలమ్మగారు కపాలమోక్షం జరిగి సిద్ధిపొందారు. మా ఇంట్లో బాలా త్రిపురసుందరీ పీఠం ఉన్నది. అమ్మ పలుకుతుంది మా ఇంట్లో. నాకు రాజరాజేశ్వరీ అంటే ఇష్టం. మిణ్ణరసి మీ గురించి చెప్పగానే చూద్దామని వచ్చాను" అన్నాను.

దానికి ఆయన, "కమలాంబిక ఒక అవతారము. దాని ఉపాసన నేను చేశాను. అవన్నీ ఎవరికో ఇచ్చాను కూడా. అంతా ఒకటే. కంచిస్వాముల వారి జాతకంలో జైలు తప్పదని ముందే ఆయనకు చెప్పాను. జయలలిత వస్తానంటే అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. అమ్మ ఎవరిని అనుమతిస్తుందో, వాళ్ళు మాత్రమే ఇక్కడకు రాగలరని, మిణ్ణరసి కుటుంబం చాలా మంచిదనీ, తనకు సన్నిహితులు" అని చెప్పారు.

చెల్లెల్ని ఫొటో ఆల్బమ్ తెచ్చి నాకు చూపించమన్నారు. ఆల్బమ్ చూశాను. ఫంక్షన్స్ జరిగినప్పటివి. 'రాజరాజేశ్వరి' ఆకుపచ్చ చీర ధరించి, పూలదండల మధ్య ఉన్నది. విగ్రహం ఏలూరు విగ్రహం లాగానే ఉన్నది. ఆశ్చర్యపోయి "ఏలూరులో ఇలాంటి విగ్రహమే" అని ఆమెకు చెప్పాను. ఆయనకు ఫోన్ వస్తే మాట్లాడుతున్నారు. మధ్యలో నాకు 4 ఫోన్లు వస్తే "ఆయన వెళ్ళి మాట్లాడు" అన్నారు. నేను ప్రతిసారి బయటకు వెళ్ళి "మళ్ళీ చేయండి" అని చెప్పడం, లోపలికి వచ్చి కూర్చోవడం. ఆయన నన్ను చూసి ఏవేవో ఆవేశంగా, ఆనందంగా మాట్లాడుతున్నారు. (ఈమె మనం నమస్కారం చేసుకుని 5 నిమిషాల్లో వచ్చేయాలి. ఆయనకు ఒంట్లో బాగాలేదని చెప్పింది.) ఆయనేమో వదలకుండా ఒక గంటసేపు మాట్లాడి, ఆమె వైపు తిరిగి "ఈ విషయాలన్నీ అందరితో మాట్లాడితే ఏమి అర్థమౌతాయి, వినేవాళ్ళకు, అర్థమయ్యేవాళ్ళ వద్ద మాత్రమే మాటలు వస్తాయి" అని నవ్వారు. నా మనసు పెద్దదని ఆమెకు చెప్పారు.

తర్వాత నేను వెంటనే "నన్ను ఏం సేవ చేయమంటారు? మీరేదైనా చెప్పండి" అన్నాను. దానికి ఆయన నవ్వి "నువ్వు చాలా సేవ చేస్తున్నావుగా! కమలాంబిక అయితే ఏమిటి, రాజరాజేశ్వరి అయితే ఏమిటి? నీతోనే ఉండి, అన్ని జరిపిస్తున్నది కదా! అన్నీ బాగా చేస్తావు. వృద్ధులకు ఆశ్రమం కట్టించు. వాళ్ళను చూసేవాళ్ళు ఎవరూ లేరు. నువ్వు ఎన్ని మంత్రజపాలు చేసినా, ఒక రోగికి 3 గంIIలు సేవచేస్తే, దానివల్ల వచ్చే పుణ్యమే ఎక్కువ. నువ్వు అది చెయ్యి" అన్నారు. అలాగేనన్నాను. "100 ఎకరాల్లో ఒక గుడి కట్టించు. అందులో ఒకప్రక్క అమ్మ కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. మరోపక్క ఆశ్రమంలో వృద్ధులకు వసతులు కల్పించి చక్కని సేవ చెయ్యి. నువ్వు చేయగలవు" అన్నారు. సరేనన్నాను. "శనగపిండిలో చక్కెర కలిపి, డైమండ్స్ చేయవచ్చు. ఉండలు చేయవచ్చు. ఏంచేసినా అదే రుచి. అలాగే ఏ పేరుతో పిల్చినా అమ్మ ఒకరే. అది నీ వెంట ఉన్నది" అన్నారు. "అంత పెద్ద ప్రాజెక్ట్ చేయగలనా?" అన్నాను. "చెయ్యగలను అనుకో. విఘ్నేశ్వరునికి దీపం వెలిగించి మొదలుపెట్టు. అన్నీ అవే జరిగిపోతాయి. కమలాంబిక వెంట ఉంటే నువ్వు చేసేదేముంటుంది. అదే జరిపిస్తుంది" అన్నారు.

"పిల్లలు ఎంతమంది?" అన్నారు. పిల్లల గురించి, ఆయన గురించి చెప్పాను. "చక్కని కుటుంబం. చక్కని పరంపర. తరతరాల పరంపర. తరతరాలు ఉండేలాగా వృద్ధి చెయ్యి. చెయ్యగలవు. మరోసారి విశ్రాంతిగా వచ్చినప్పుడు నీ జాతకచక్రం తీసుకురా. దాన్ని చూసి నువ్వు ఏం చేస్తే బాగుంటుందో వివరంగా చెప్తాను" అన్నారు. సరే అని లేచాము.

స్వామీజీ ఇలా చెప్పారు– “ధ్యానం చేసుకుని మనసుని ఎప్పుడూ ఖాళీగా ఉంచుకోవాలి. అప్పుడు భక్తులు ఎవరైనా బాధలు వినిపిస్తే, వెంటనే అర్థంచేసుకుని ప్రార్థన చేయగలుగుతాము. అందుకని ఎప్పుడూ ధ్యానంచేసి మనసుని ప్రశాంతంగా పెట్టుకోవాలి.” మరొకసారి “మనిషిని శారీరకంగా ఏదే చేసేసి, బాధపెడితేనే పాపం కాదు. మనసులో వాడిపట్ల తప్పుగా ఆలోచించినా చాలు. అదీ పాపమే. మనసును ఎప్పుడూ ధ్యానంలో ఉంచుకుంటే మంచిది. మీవారికి నా ఆశీర్వచనము చెప్పు” అన్నారు. “అలాగేనండి, థ్యాంక్స్” అన్నాను. ఆయన భోజనం చేసి 40 సం॥లు అయ్యిందట. అన్నం వండినప్పుడు వచ్చే పైనీళ్ళు త్రాగుతారట. చాలా ఉత్సాహంగా మాట్లాడారు. “మా అమ్మమ్మగారు కూడా మనసే ప్రధానమని చెప్పారు” అని ఆయనతో అన్నాను. కమలాంబిక అనగానే చేతులు పైకెత్తి నమస్కారం చేశారు. నన్నుచూసి చాలా ఆనందించారు.

ఏలూర్లో ఉన్న అమ్మవారి విగ్రహంలాంటి విగ్రహం, పూజ, బ్రాహ్మణత్వం, మడి, ఆచారం, పద్ధతులతో సహా అలాగే ఉన్నటువంటి రాజరాజేశ్వరీ పీఠం ఈ మారుమూల ఉన్న నమక్కల్‌లో ఉండడం ఏమిటి? నేనక్కడకు వెళ్ళడం ఏమిటి? ఆయన నన్ను చూసి సంతోషపడడం ఏమిటి? వీళ్ళందరినీ కలవడం వెనుక ఉన్న అర్థమేమిటో కమలమ్మగారే చెప్పాలి! (ఈ రాజరాజేశ్వరీ పీఠాన్ని, శ్రీ అయ్యర్‌గారిని వీడియో తీయటం జరిగింది.)

**12.04.2006**

ఏప్రిల్ 12, మధ్యాహ్నం ఏదో పుస్తకం తీసుకుని క్రిందకు దిగి, టేబుల్ దగ్గర కూర్చుని చదవడం మొదలుపెట్టాను. కొంచెం దూరంలో ఒక జంట కూర్చుని టీ, స్నాక్స్ తీసుకుంటున్నారు. కాసేపయ్యాక ఆమె భర్త వెళ్ళిపోగానే, ఆమె నా దగ్గరకు వచ్చి, “ఆప్ కహాఁసే ఆయా?” అంటూ కుర్చీలో కూర్చున్నారు. నేనూ మాటల్లోకి దిగాను. ఈ రోజుకి కాలక్షేపం అయిపోతుంది అనుకున్నాను. అదే ఆనందం. మిగతాచోట్ల గెస్ట్ హౌస్‌లలో మనుషులు ఎక్కువగా కలుస్తారు. కాలక్షేపం అవుతుంది. ఇక్కడ ప్రకృతే ఫ్రెండ్ అయింది, మనుషులు తక్కువే. ఒకావిడ దొరికింది అనుకున్నాను. దాదాపు 2 గంటలు మాట్లాడాము. నా కుటుంబ వివరాలు తెలుసుకుని, “నా పేరు సుమన్. నేనూ మీలాగే” అంటూ “మా పిల్లలు ముగ్గురూ అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉంటున్నారు. నేను కూడా ఆయనతోపాటు బిజినెస్ పనిమీద అన్నిదేశాలు తిరుగుతుంటాను. జమ్ము మా స్వస్థలం. మాకు హరిద్వార్‌లో గురువులున్నారు. వాళ్ళని అనుసరిస్తాము. పూజలు చేసుకుంటాను. కవిత్వం వ్రాస్తాను. పెయింటింగ్ నేర్చుకున్నాను. హార్మోనియం వాయిస్తాను. రవిశంకర్ ‘ఆర్ట్ ఆఫ్ లివింగ్’ చేశాను. 6 నెలలు ఇండియాలో, 6 నెలలు అమెరికాలో ఉంటాను. నా జీవితంలో ‘బోర్’ అంటే ఏమిటో తెలియదు” అన్నది. “హమ్మయ్య! ఈమె నాకు సందేశం ఇవ్వడం కోసమే వచ్చింది” అనుకున్నాను.

ఈ ప్రపంచంలో చేయడానికి ఎన్నో ఉన్నాయి. భగవంతుడు సమయం ఇచ్చింది సద్వినియోగం చేసుకోవడానికి. చదవడానికి మంచి ఆధ్యాత్మిక పుస్తకాలు ఉన్నాయి. చదవడం

మొదలుపెడితే గురువులే వాటిని అర్థమయ్యేలాగా అనుగ్రహిస్తారు. జ్ఞానం సంపాదించుకోవడానికి ఇదే చక్కని మార్గం. దేవుడు ఇంత చిన్న వయసులో బాధ్యతలు అన్నీ తీర్చించేసి, చక్కని సమయాన్ని ఇచ్చినందుకు చక్కగా వినియోగించుకోవడం మన ధర్మం. అది మానేసి, ఇచ్చినది వదిలేసి, లేని దానికోసం ఏడవటం అవివేకం కదా! అందుకే నేను ఒక్క నిమిషం కూడా సమయం వృధా చేయను. సంగీతం వింటే ఎంత ఆనందం? అప్పుడప్పుడు స్తబ్దుగా అలా కొంచెంసేపు కూర్చుంటాను. నాకు శక్తి తిరిగి వస్తుంది. నచ్చినది చేస్తాను. చదివిన మంచి పుస్తకాల్లోని సారాంశాన్ని మా ముగ్గురు పిల్లలకు మెయిల్ చేస్తాను. పాపం వాళ్ళకు చదువుకునే సమయం ఉండదు కదా! కనీసం నేను పంపినది చదివినా వాళ్ళకెంతో మేలు జరుగుతుంది" అన్నది. నేను ఆనందంతో వింటూ "ఇంకా చెప్పండి" అన్నాను.

మధ్యమధ్యలో "మీకు బోర్ కొడుతోందా?" అంటూ చెప్తోంది. "లేదు, తెలుసుకుంటున్నాను" అన్నాను. "మా పిల్లల్ని చిన్నప్పటి నుండి కూడా ఆధ్యాత్మిక విషయాలను వినడం పట్ల ఆసక్తి కలిగేలా పెంచాను. అందుకే వాళ్ళు ఈరోజు ఇంత పెద్ద స్థితిలో ఆనందంగా బ్రతుకుతున్నారు. మావారు గురువుగారి మందిరాల నిర్మాణంలో పాల్గొంటారు. ఈమధ్య ఒకటి అమెరికాలో కూడా కట్టారు. మా పిల్లలు కూడా వాటికి విరాళాలిస్తూ, కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఈ ప్రపంచంలో నాకు అత్యంత ఇష్టమైన విషయం ఇదే. మా పిల్లలకు కూడా, మాలాగే భగవదనుగ్రహం కలగడమే అదృష్టం. చిన్నప్పటినుండి భగవత్ తత్త్వము పిల్లలకు నేర్పితే– కుటుంబం అంటే ఏమిటి? బంధాలు అంటే ఏమిటి? ఎవరితో ఎలా ఉండాలి? ఇతరులతో ఎలాంటి సంబంధం కలిగి ఉండాలి? Social values, Moral values అంటే ఏమిటో చిన్నప్పటినుండే పిల్లలకు నేర్పితే, 18 సం॥ల తర్వాత మనం వాళ్ళ గురించి పట్టించుకోవాల్సిన పని లేదు. వాళ్ళకు చెడిపోయే అవకాశమే ఉండదు. అలాగే నిచ్చెన ఎక్కి మంచి స్థాయిని అందుకుంటారు. 18 సం॥లలోపు కూడా వాళ్ళ సమస్యలను వాళ్ళే పరిష్కరించుకోవడానికి నేను సహాయపడేదాన్ని. ఇది చెయ్యి, అది చెయ్యి అని నేను ఎప్పుడూ ఒత్తిడి చేసేదాన్ని కాదు. దాంతో వాళ్ళ వ్యక్తిత్వం వికాసం చెందే అవకాశం కలిగింది. పిల్లలు కొట్టుకున్నప్పుడు కూడా నేనెప్పుడూ judge చేసేదాన్నికాదు. అలా చేయడం వలన, ఇవతల వాళ్ళు న్యూనత చెంది, తల్లిదండ్రులకు తమపై ప్రేమ లేదనుకుంటారు. అందుకే సమస్యను వాళ్ళ మధ్యే పెట్టి, వాళ్ళే పరిష్కరించుకునేలాగా చేసేదాన్ని. 18 సం॥ల తర్వాత వాళ్ళతో ఫ్రెండ్స్‌లాగా మెలగాలి. మా పిల్లలు ప్రతి చిన్న విషయాన్ని నాతో చెప్తుంటారు. ఏదీ నా దగ్గర దాచరు. చాలా openగా ఉంటారు. ఎప్పటికప్పుడు వాళ్ళే self-analysis చేసుకుని జరిగినవి నాతో చెప్తుంటారు, నేను వింటాను. అంతే సలహా మాత్రం ఇవ్వను. ఈ self-analysis నేర్పడం వలన వాళ్ళు మంచి పౌరులుగా ఎదిగే అవకాశం కూడా ఉంటుంది" అన్నారు.

"వాళ్ళలో వాళ్ళకు సమస్యలు ఏర్పడినా, అందరు చెప్పినవీ వింటాను. ఎవరికీ మద్దతు ఇవ్వను. సమయం వచ్చినప్పుడే అన్నీ పరిష్కారం అవుతాయి" అన్నారు. నేను "ఈలోపుగా మరి

మీరు బాధపడకుండా ఎలా ఉంటారు? అందరూ పిల్లలే కదా!" అన్నారు. "పొరపాటు, వాళ్ళు పిల్లలు కాదు, పెద్దవాళ్ళే. తప్పులు తెలుసుకోగల సమర్థులే కదా! అందువలన చక్కగా పరిష్కరించుకోగలుగుతారనే నమ్మకం వాళ్ళపై నాకు ఉంది. కాకపోతే విషయాన్ని విని, వదిలి వేయగలిగితే అవే చక్కగా పరిష్కారమవుతాయి. మనకు ఇందులో ఒకటి నచ్చి, ఒకటి నచ్చకపోయినా బాధ కలుగుతుందనుకోండి. మనమే ఫోన్ చేసి ఇలా బాధపడ్డాను అని చెప్పేస్తే సరిపోతుంది. అహం పెంచుకుని, కోపం, బాధ లోపల పెట్టుకున్నామనుకోండి రోగాలు వస్తాయి. దానివలన మనకే నష్టం. అందుకని ఇది మన సమస్య అనుకుంటే మనం అలా మాట్లాడి, బాధను వెంటనే పోగొట్టుకోవాలి. అంతేకానీ మనసులో ఉంచుకుని బాధను ఎక్కువ చేసుకోకూడదు" అన్నారు. ఆవిడ థియరీ చాలా బాగుంది అనిపించింది. ఆవిడ చెప్పినవన్నీ గుర్తులేవుకానీ, కొన్ని మంచి పాయింట్స్ గుర్తుపెట్టుకున్నాను. ఇవి చాలామందికి, పిల్లల్ని పెంచేవాళ్ళకి (చిన్నప్పటి నుంచీ) తెలుసుకుంటే చాలా లాభం పొందుతారు అనే ఉద్దేశ్యంతో ఈ సంభాషణలు వ్రాస్తున్నాను.

ఎప్పుడైనా వాళ్ళ పిల్లలకు అమెరికాలో ఉద్యోగం దొరకకపోతే, అప్పుడు ఈవిడ ఇండియాలో రోజూ ఎవరికో ఒకరికి భోజనం పెడుతుండేవారట. వాళ్ళకు అక్కడ ఏది కరువైతే అది ఇక్కడ ఈమె ఎవరికైనా చేసేవారట. వాళ్ళకు అది వెంటనే దొరుకుతుండేదట. "మనం ఎవరికైనా ఏదైనా చేస్తేనే, అది మన పిల్లలకు దొరుకుతుంది. ఇది నా స్వానుభవం" అని చెప్పారు. ఇది ఆచరించడానికి ఎంతో అనువుగా ఉందనిపించింది.

"Moral values చిన్నప్పటినుండి పిల్లలకు నేర్పకపోతే, పెద్దయ్యాక వాళ్ళను నువ్వెందుకు ఇలా చేయలేదు? అలా ఎందుకు చేశావు? అనడిగితే ఏమీ ప్రయోజనం ఉండదు. ఆ విలువలు ఆ వయసులో తెలుసుకుని ఆచరించడం కష్టమవుతుంది. అలా చెప్పే అవకాశాన్ని మనం కోల్పోయినట్లే."

"ఒకవేళ, పిల్లలమీద మనకు కోపం వస్తే, వాళ్ళతో మాట్లాడకుండానో, లేక కోపంగా మాట్లాడటమో, ఇలా చేయమని ఆదేశించడమో, ఏదో ఒక పద్ధతిలో చేస్తాము కదా! అలాకాకుండా, మన కోపం పోగొట్టుకోవడం కోసం మనమే ముందుగా మాట్లాడి, "మాకు కోపం వచ్చింది" అని చెప్పి, టెన్షన్ లేకుండా ఉండడం నా పద్ధతి. తల్లికి, పిల్లలకి మధ్య అహం ఏమిటి? అలా, ముందు మనం ప్రశాంతంగా ఉంటే మనల్ని చూసి వాళ్ళు అలాగే ప్రవర్తిస్తారు."

"పిల్లలు-పిల్లలు మధ్య భేదాభిప్రాయాలు వస్తే, పెద్దవాళ్ళు, చిన్నవాళ్ళకు space ఇవ్వాలి. వాడు చిన్నవాడు అనుకోవాలి. చిన్నవాళ్ళను క్షమించడం నేర్చుకోవాలి. ఎందుకంటే, అలా లేకపోతే మన పెద్దరికం ఏముంటుందక్కడ? అందుకే చిన్నప్పటినుండీ పెద్దవాడి మాట వినాలి అని చిన్నవాడికి, చిన్నవాడిని క్షమించాలి అని పెద్దవాడికి నేర్పాలి. అప్పుడు వాళ్ళ మధ్య పొరపొచ్చాలు రావు. ఈ విలువలు చిన్నప్పటి నుండి అభివృద్ధి చేయాలి."

ముఖ్యంగా, పై విషయాలు నాకు ఎంతో నచ్చాయి. నేను ఇప్పుడు నేర్చుకుని ఆచరించే

విషయాల కన్నా, చిన్నపిల్లల తల్లిదండ్రులు నేర్చుకుని ఆచరించేందుకు వీలుగా ఉన్న ఈ పెంపకంలోని ముఖ్య విషయాలను రాస్తే కొంతమందికైనా ఉపయోగపడతాయి కదా! ఇవి ఆచరించగలిగితే నిజంగా ధన్యులే. తల్లిదండ్రులూ, పిల్లలూ కూడా ఎంతో అన్యోన్యంగా, ఆనందంగా జీవితం గడపవచ్చు కదా! ఇంతకంటే ఒక కుటుంబంలో కావల్సినది ఏమిటి?

మరొక ముఖ్య విషయం, కొడుకులకు పెళ్ళిళ్ళు అవగానే ఆవిడ ఇలా అన్నారట- "మీరు అక్కచెల్లెళ్ళతో రక్తాన్ని పంచుకుపుట్టారు కనుక ప్రేమ, అభిమానాలు, అనుబంధాలు మీ మధ్యే ఉంటాయి. క్రొత్తగా వచ్చిన కోడలికి మీ అక్కచెల్లెళ్ళను ప్రేమించాల్సిన అవసరం లేదు. అందుకని ఇది వాళ్ళకు సంబంధించిన విషయం కాదు. మీరు మీ జీవితాంతం అక్కచెల్లెళ్ళతో చక్కని సంబంధాలు నిలుపుకోవడం మీ బాధ్యత. అందుకే మీకు చెప్తున్నాను. మిమ్మల్ని చూసి మీ కోడళ్ళు అలవాటు చేసుకున్నా, చేసుకోకపోయినా అది అనవసరం. ఆ బాధ్యత మీరు తీసుకోవాలి."

ఇది ఎంత నిజం. ఈ విషయాన్ని నిజంగా మనలో ఎంతమంది ముందుగా చెప్తాము? విలువలు ఉండాలని మనకు కూడా తెలుసు. కానీ ఇలా చెప్పడం వలన ఉపయోగం కలుగుతుందని మనకు తెలియదు. తల్లి చెప్పాల్సిన మాటల్లో ఇది ఒకటి. సాధారణంగా మనం ఈ విషయాన్ని పక్కన పెట్టేస్తాం. ఇది ప్రతి తల్లీ నేర్చుకోవలసిన విషయమే అనిపించింది.

ఈ విధంగా, తల్లి బాధ్యతలు, పెంపకం, పిల్లలపట్ల ప్రవర్తించాల్సిన తీరును చెప్పి, అలా ఉండడంవల్ల ఎంత ఆనందం కలుగుతుందో, ఎంత తృప్తిగా ఉంటుందో ఆవిడ చెబుతున్నంతసేపూ ఆమె కళ్ళల్లో ఉన్న ఆనందాన్ని చూసిన నాకు, ఆ తల్లి జన్మ సార్థకమైందనిపించింది. అంత సార్థకమైన తల్లి మాటలను, ఉపదేశాలుగా భావించి, ఆచరించడంవల్ల కనీసం కొంతైనా మనం కూడా లాభం పొందే అవకాశం కలుగుతుంది. ఆవిడ చెప్పినవన్నీ వ్రాయలేకపోయాను కానీ, ముఖ్యమైన సారాంశం ఏమిటంటే, పిల్లలకు మన ఆధ్యాత్మిక వారసత్వాన్ని చిన్నప్పటినుండీ అందించడం వల్లనే మనకు-వాళ్ళకు మధ్య చక్కని అవగాహన, సంబంధాలను కలిగి ఉంటామనీ, అదే ఇరువురి సంబంధ బాంధవ్యాలను గట్టిపరుస్తుందన్న ఆవిడ మాటలను నేను భగవతి ఉపదేశంగా భావించి, మనందరం పాటించాల్సిన విషయం కనుక దీన్ని గుర్తుపెట్టుకుని వ్రాశాను. విషయం సామాన్యమైనదిగా గోచరిస్తున్నా, ఆచరించినప్పుడు తేడాను మాత్రం తప్పక గ్రహించ గల్గుతాము. పిల్లల్ని ఉత్తమపౌరులుగా కూడా పెంచగలుగుతాము. ఇది ఎంతమందికి ఉపయోగ పడుతుందో చూద్దాం! ఇప్పటినుండైనా సరే, గురూపదేశాన్ని శ్రద్ధగా పాటించే ప్రయత్నం చేద్దాం.

### 15.04.2006, శ్రీనగర్

ఈరోజు మధ్యాహ్నం గ్రీన్‌హౌస్ హోటల్‌లోని గార్డెన్‌లో కుర్చీలో కూర్చుని ఏదైనా రాద్దామనిపించి కళ్ళజోడు, పుస్తకం అన్నీ తీసుకుని క్రిందకు వచ్చాను. నీరెండలో కుర్చీలు, టేబుల్స్ వేసి ఉంచుతారు. నాలాగా రూమ్స్‌లో ఉన్న ఆడవాళ్ళు కూడా అక్కడకు వచ్చి కూర్చుంటారు. చుట్టూ కొండలు, మధ్యమధ్యలో కొన్ని మంచుతో కప్పబడినవి కొన్ని (సఫేద్‌లు

అంటారు) పెద్ద పెద్ద, అందమైన రంగుపూల చెట్లు వాటి మధ్యలో ఆ గార్డెన్ ఉంటుంది. మేము ఉన్న రూమ్ (2వ అంతస్తు) నుంచి చూస్తుంటే, పెద్ద కొండపైన ఉన్న శంకరాచార్యులవారు స్థాపించిన పీఠం కనిపిస్తుంటుంది. రోజూ ఆ శిఖరానికి నమస్కరించడం నా దినచర్య. చెట్లకు ఆకులు తక్కువ, పూలు ఎక్కువ ఉండడం ఎక్కడా చూడలేము. మేము శ్రీనగర్ వెళ్ళినప్పుడు చలికాలం అయిపోయినందువలన అక్కడ మొక్కలలో (ఆకులు లేని స్థితిలో) ముందుగా పూలు పూచి, అవి కాయలుగా మారి ఋతువు ప్రారంభమైంది. అప్పుడు కొమ్మలకి ఆకులు వస్తాయి. మొక్కలు, చెట్లు అన్నీ ఆకులు లేకుండా, పూలతో నిండి వుండటం చాలా అందంగా ఉంటుంది. కొన్ని చెట్ల పూలు బొమ్మలలాగే కనిపిస్తాయి. దాన్ని చూస్తే అది పువ్వో, బొమ్మో తెలియదు. వాటిల్లో అందమైన రంగులు.

మా బ్రాంచ్ మేనేజర్, “దేవుడికి ఈ భూమి అంటే ఇష్టమట. శ్రీనగర్ నుండి బదరీ, కేదారనాథ్‌లు వీటన్నింటినీ ‘దేవభూమి’ అని పిలుస్తారు. ఋషులు, మునులు ఎందరో ఈ శ్రీనగర్ అంటే హిమాలయాల కొండలపై తపస్సు చేశారు. ఇప్పటికీ మా పూర్వీకుల్లో కొందరు తపశ్శాలులు ఇక్కడ కొండలపైన నివసించారు. అందుకే ఈ శ్రీనగర్‌వాసులకి దేవత భవానీ. ఇక్కడ ఈమెకు పాలు, పాయసం నైవేద్యం పెట్టడం మూలంగా ఈమెను ‘కీర్ భవాని’ అని పిలుస్తారు. కాశ్మీర్‌లో ఉండే పండితులు అందరూ హిందువులే. ఇది హిందూభూమి. ముస్లింల గొడవల్లో ప్రాణభయంతో మేమందరం రాత్రికి రాత్రే ఆస్తులన్నీ వదిలి పారిపోయి జమ్ములోనూ, అక్కడక్కడా స్థిరపడిపోయాము” అని చెప్పారు. “బ్రతికి ఉంటే చాలని పారిపోయాం. ముస్లింలు ఆడవాళ్ళతో ఎంత నిర్దాక్షిణ్యంగా ప్రవర్తించారంటే, ఇక్కడ పుట్టి పెరిగిన వాళ్ళమైనా సరే, కాశ్మీర్‌కు రావడానికి భయపడిపోయాము” అని అన్నారు.

పచ్చటి పొలాలు, ఆవ పొలాలు, ఆవ పూలు, పసుపు పచ్చని రంగుతో దట్టంగా పొడుగాటి పెద్ద చెట్లు, తెల్లటి మంచుతో కొండలు వర్ణింపనలవి కాని అందం. ప్రకృతి ఇంత అందమైనదని ఇక్కడికి వచ్చాక అర్థమైంది. పైగా ఇది పూలు పూచే సమయమట. ముందు పూలు పూశాక, తర్వాత కాయలు కాస్తాయట. ఎన్నో ఆపిల్ చెట్లు, రకరకాల డ్రైఫ్రూట్స్ చెట్లు. వాటి పేర్లు కూడా మనం విని ఉండము. ఇళ్ళన్నీ అందంగా కట్టి ఉంటాయి. మంచుపడితే జారిపోవడానికి ఇంటి పైకప్పు రేకుతో వేస్తారు. చలి క్రిందకు దిగకుండా ఇంటిలోపల చెక్కతో చేస్తారు. స్వెట్టర్, షాల్స్, రెయిన్‌కోట్ లేకుండా బయటకు వెళ్ళే ప్రసక్తే లేదు. ఎప్పుడు వర్షమో, ఎప్పుడు ఎండో తెలియదు. ఎప్పుడూ డ్రెస్ వేసుకునే ఉండాలి. మా హోటల్‌లో అన్నం, రోటీ, పప్పు, కూరలు అన్నీ దొరికేవి. ఇక్కడ వాళ్ళుకూడా అన్నం ఎక్కువ తింటారు. ఇంత అందమైన ప్రకృతితోపాటు ఎంతో అందమైన మనుషుల్ని కూడా సృష్టించింది ఈ అమ్మవారు. ప్రకృతిని చూసినా, మనుషులను చూసినా మైమరచిపోతాము. సన్నగా, గులాబీరంగుతో, కోటేరు వేసిన ముక్కుతో, ఎర్రని పెదాలతో చలాకీగా అందంగా, మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేలాగా ఉంటారు. పిల్లలు కూడా చాలా అందంగా ఉంటారు. మగవాళ్ళు, ఆడవాళ్ళు, ముసలివాళ్ళైనా సరే ఆ వాతావరణానికి అలాగే ఉంటారట.

నేను ఉన్న నెలరోజుల్లో, ఆ నీరెండలో కూర్చోవడం వలన కొంచెం నల్లబడిపోయాను. రాత్రిపూట కిటికీలోంచి చూస్తే, ఎత్తైన కొండలు, చెట్లు, నిర్మానుష్యంగా ప్రకృతి భయమేస్తూ, కాళీ స్వరూపంలో గోచరించింది. తెల్లవారితే చెట్లపైన, గడ్డిపైన తెల్లటి మంచు బిందువులు పడి ముత్యాల్లాగా మరింత శోభాయమానంగా కనిపిస్తుంది. ఉదయపు నీరెండలో ఆ ప్రకృతి లక్ష్మీ స్వరూపంలో మరింత అందంగా కనిపిస్తుంది. మనుషులంతా పండితులు, హిందువులు. శంకరులు ఇక్కడ సరస్వతీ దేవిని ప్రతిష్ఠించడం, ఇది దేవభూమి కావున ఇక్కడ నేను 'కీర్ భవాని, బాలాత్రిపురసుందరి ఆలయాలు' చూడడం జరిగింది. సాక్షాత్తూ హరికొండపైన త్రిపురసుందరి ఇక్కడ వెలసి ఉన్నది. (ఇక్కడ నా అనుభవాల గురించి వివరంగా మరొకచోట వ్రాశాను.)

ఇంక, మహాలక్ష్మి, మహాకాళీ, మహా సరస్వతులు, అందమైన రూపాలు ధరించి అందమైన ప్రకృతిలో విహరిస్తున్నారేమో అనిపించింది. కనుక ఇది దేవభూమి అనడంలో ఆశ్చర్యం లేదు. అందుకే ఎందరో కవులు, నెహ్రూగారు కూడా కాశ్మీర్‌ను 'భూతలస్వర్గమని' వర్ణించారు. ఇంతకుముందు టూరిస్ట్‌గా ఒకసారి (1988లో) ఇక్కడకు వచ్చాను. అప్పుడు చూసిన కొన్ని కొన్ని దృశ్యాలు మనసులో ముద్రించుకుపోయాయి. కానీ, ఇప్పుడు కొంతకాలం ఇక్కడ ఉండే అదృష్టం కలిగించింది ఆ అమ్మవారు. ఇది నా పూర్వజన్మ పుణ్యమై ఉంటుంది. అందుకే దాదాపు నెలరోజులు ఇక్కడ ఉన్నాను. ఇప్పటికి 40 రోజులు దాటింది.

ఈ గార్డెన్‌లో వాకింగ్ చేస్తూ, నియమం చేసుకుంటూ, ఏవో పుస్తకాలు చదువుకుంటూ, వ్రాసుకుంటూ, ఎవరితోనైనా మాట్లాడుకుంటూ, చాలా చాలా అందమైన జీవితాన్ని నాకు ప్రసాదించిన ఆ తల్లికి, నా గురువుకు సహస్రవందనాలు.

ఇక్కడ రూమ్స్ శుభ్రంచేసే పనివాళ్ళు ఇద్దరు ఆడపిల్లలు – స్వీటీ, ప్యారీ. 20 ఏళ్ళుంటాయి వాళ్ళకి. ఎంతో అందగత్తెలు. మనం చూసిన అందమైన వాళ్ళు వేరేగా ఉంటారు. వాళ్ళని చూస్తే ఎంత ఆనందం వేసిందో చెప్పలేను. బహుశా ఈ దేవతా భూమిలో నివసించే వీరందరూ కూడా, దేవతాంశసంభూతులే అయి ఉంటారు. మా బ్రాంచ్ మేనేజర్, "ఐశ్వర్యారాయ్ ఇక్కడకు వస్తే ఎవరూ చూడరండీ, ఎన్నో సినిమాలు ఈ దాల్ లేక్‌లో తీశారు. సినిమా యాక్టర్లను ఎవ్వరమూ చూడము. ఎందుకంటే కాశ్మీర్ మనుష్యులకంటే అందమైన వాళ్ళు ఎవరుంటారు? మా కాశ్మీర్‌లో లేని అందం మరెక్కడ ఉంది?" అన్నారు. అది నిజమే. మేమున్న హోటల్‌లో చాలా సినిమాల షూటింగ్ చేశారట. మా పనివాళ్ళిద్దరినీ సినిమాలలోకి తీసుకుంటాము, రమ్మన్నారట. కానీ వాళ్ళకు ఘోషా, పరదాలు, కొంత ముస్లిం పద్ధతులు ఉండటం వలన ఎక్కువగా సినిమాలలోకి వెళ్ళరని మా హోటల్ ఓనర్ చెప్పింది. ఆవిడ పాకిస్తానీ, ఆమె భర్త కాశ్మీరీ. ఇద్దరు పిల్లలు ఇంతకు ముందు కెనడాలో ఉండి, తిరిగి కాశ్మీర్‌లో స్థిరపడ్డారట.

ఒక ఎకరం స్థలంలో గెస్ట్‌హౌస్ మరియు హోటల్‌లాగా కట్టారు. అది ఎక్కువ బ్యాంక్ ఉద్యోగస్తులకు ఇస్తారట. చాలా అందంగా ఉంటుంది. మధ్యలో అందమైన గార్డెన్. ఆవిడ

ఉదయం 7 గం॥ల నుండి రాత్రి 10 గం॥ల వరకు ఆ గార్డెన్‌లోనే తిరుగుతూ, పైకి, క్రిందకు ఎక్కుతూ, వచ్చిన వాళ్ళతో చక్కగా మాట్లాడుతూ, బిజినెస్ చేస్తుంది. ఆమెకు రుమటాయిడ్ ఆర్థ్రైటీస్. ఒక్క మసాజ్ మాత్రమే చేయించుకుంటూ, మందులు లేకుండా రోజంతా శ్రమిస్తూ, అంత చక్కని బిజినెస్ చేస్తుండం నాకు మరింత ఆశ్చర్యం కలిగించింది. "శ్రమ వలననే రోగాలు దగ్గరకు రావు. వాటిని పట్టించుకుంటేనే ఎక్కువ అవుతాయి. వాటిని వదిలేస్తే అవి మనల్ని వదిలేస్తాయి" అని నాకు మాటల మధ్యలో చెప్పింది. ఆ హోటల్లో ఆవిడ మేనేజ్‌మెంట్, ఇల్లు, construction ఇవన్నీ చూస్తే, నాకు కూడా రోజుకు 15 గంటలు పనిచేసేలాగా అవకాశం వస్తే బాగుంటుంది అనిపించింది. ఇక్కడ నాకు వంట లేదు, బట్టలు ఉతకక్కర్లేదు, మరే పనీ లేదు. గార్డెన్‌లో కూర్చుంటే అన్నీ అక్కడికే వస్తాయి. ఇంత పనిలేని జీవితం, సమయం వృధా అయిపోతోందన్న బాధ అప్పుడప్పుడు కలుగుతుంటుంది. కానీ ఏం చేస్తాం? ఇచ్చిన జీవితంలో ఆనందంగా ఉండాలంటే, అందరితో మాట్లాడుతూ, వారి జీవన విధానం తెలుసుకుంటూ, వ్రాసుకుంటూ, చదువుకుంటూ, కాలం గడపడమనే అవకాశం ప్రస్తుతం ఇలా వినియోగించుకుంటున్నాను. ఇదొక అదృష్టంగా భావిస్తున్నాను. కానీ 'బోర్'ను భరించడం కూడా కష్టమే. ఇది కూడా ఒక పోరాటమేనేమో అనిపించింది. ఏదైతేనేమి, దానితో 4 సం॥ల పాటు కష్టపడి పోరాడి, ఎన్నో విషయాలు తెలుసుకుని, ఎంజాయ్ చేసి, దాన్ని ఓడించాను అన్పించింది. ఈ సాధించిన విజయంతో ఇంకా ఆనందంగా ఉంది.

..... ఎక్కడో మొదలుపెట్టాను, ఏదో వ్రాద్దామనుకున్నాను, కానీ 'అందం' దగ్గరే ఆగిపోయాను. "Beauty is God" అంటారు వర్డ్స్‌వర్త్ అనే కవి. ఆయన ప్రకృతిని ఇంకెంతగా ఆరాధించాడో తెలియదు మరి.

ఇంకొక విషయం ఏమిటంటే, ఇక్కడ రాత్రిళ్ళు చలి $3^0$ లేక $4^0$లు ఉంటుంది. పగటిపూట $9^0$ లేక $10^0$లు ఉంటుంది. ఇక్కడ పరుపులో హీటర్స్ అమర్చారు. అది వేసుకుని, మనం పరుపులోకి దూరి, కప్పేసుకుంటే లోపల వేడిగా ఉంటుంది. చాలాసేపు మనం అలాగే కూర్చుని ఉండాలి. కరెంట్ పోయినప్పుడు, ఏదైనా రాద్దామనుకుంటే చేతులు వణుకుతాయి. ఇంత హీటర్స్‌లోనే బ్రతకడం కష్టంగా ఉంటుంది. అన్నిటికంటే ముఖ్యమైనది పక్షుల గురించి. పిచ్చుకలు, పావురాలు, గోరింకలు, కాకులు ఇంకా ఎన్నో తెలియని రంగురంగుల పక్షులు ఇక్కడ తిరుగుతుంటాయి. చలి మరీ ఎక్కువగా ఉన్నప్పుడు, అన్నీ గుంపుగా పెద్ద పెద్ద చెట్ల కొమ్మల మధ్యలో ఒదిగి కూర్చుంటాయి. కొంచెం ఎండరాగానే, ఆకాశంలో తిరుగుతూ కన్పిస్తాయి. ఇక్కడ గద్దలు ఎక్కువ. కానీ భగవంతుడు వాటికి ఈ చలిని భరించడానికి శరీరంపైన ఏదైనా సృష్టించాడేమో తెలియదు. అవి చలిని చక్కగా భరిస్తాయి. నాకేమో ఈ హీటర్స్ ఉన్నా చలిని భరించడం కష్టంగానే ఉంది. ఈ సీజనే ఇలా ఉంటుందేమో తెలియదు. చెట్లన్నీ పొడుగ్గా ఉన్నా సరే, పెద్దగా గాలి రాదు. కానీ, సన్నగాలి వీస్తుంది. అలాగే కదలకుండా నిల్చుని, తలపైభాగం మాత్రమే కొద్దిగా అటూఇటూ ఊపుతూ, ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నట్లుగా, భక్తిపారవశ్యంతో

కళ్ళుమూసుకుని చిన్నగా భజన చేస్తున్నట్లుగా, మరోసారి గురువుగారి రాకకోసం భక్తితో, ఆనందంతో ఎదురుచూస్తున్న శిష్యులలా, నమ్రతగా, చిన్నగా తలలు ఊపుతూ, కొమ్మలనిండా పక్షులను నింపుకుని, చెట్లన్నీ చిత్రంగా కనిపించాయి. వాటిని అలాగే చూస్తూఉంటే మనసులో చెప్పలేని పులకరింత. మాటలకందని భావాలు కలుగుతాయి. నీరెండలో గార్డెన్‌లోకి వెళ్ళి కూర్చుంటే, అక్కడున్న పూలచెట్ల వద్దకు ఈ చిన్నచిన్న పక్షులన్నీ వచ్చి, కిలకిలారావాలు చేస్తూ, సందడిసందడిగా ఆహారాన్ని సేకరించుకుంటాయి. అది చెప్పనలవికాని దృశ్యం. ఇక్కడ నేను, అన్నిచోట్ల మాదిరిగా కాకుండా, మనుషులకంటే ప్రకృతితో ఎక్కువ స్నేహంగా బ్రతుకుతున్నానేమో అనిపించింది. అందుకే ఇదంతా ఇంత శ్రద్ధగా, ఆనందంగా గమనించే అవకాశం కలిగింది. ఈ దేవభూమిలో నాకు కలిగిన అనుభవాలు రాస్తాను. ఇవన్నీ కూడా ఆ భగవంతుడు నాకు తెలియజెప్పడానికే ఈ అవకాశం ఇక్కడ కల్పించాడని భావిస్తూ, ఇవన్నీ కూడా బోధనలే అనుకుంటున్నాను. గుర్తొచ్చినవి ఒకటొకటే నెమ్మదిగా....

**15.04.2006, శ్రీనగర్**

మేము కాశ్మీర్‌కు వచ్చిన రోజునే, మరొక ఆఫీసర్ 'శ్యామ్‌ప్రసాద్ సింగ్' మా రూమ్‌కు వచ్చి పరిచయం చేసుకున్నారు. ఆయన స్వస్థలం బీహార్‌లోని మధుబని. కూతురు ఢిల్లీలో, కొడుకు బెంగుళూరులో, భార్య బీహార్‌లోనే టీచర్‌గా పనిచేస్తున్నారు. ఈయన కూడా ఇన్‌స్పెక్షన్ కోసం శ్రీనగర్ వచ్చారట. మా క్రింద రూమ్‌లో ఉంటారట. మేము కూడా ఇన్‌స్పెక్షన్ కోసమే వచ్చామని తెలుసుకుని, ఆయనే పరిచయం చేసుకుని బ్యాంక్ స్ట్రైక్ గురించి కాసేపు మాట్లాడి వెళ్ళిపోయారు. ఆయన క్షత్రియుడు, దేవీభక్తుడు. ఒక వారంరోజులపాటు సమ్మె ఉండటం వలన రూమ్‌లో కూర్చోలేక, మేమూ ఆయన కూడా గార్డెన్‌లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్లం. ఆయన చాలా భక్తిపరుడు, ఎన్నో పూజలు చేస్తాడు. నమ్మకం ఉండడమే కాదు, ఆదర్శవంతంగా జీవితం గడిపేవాడని అర్థమైంది. ఈయనకు కూడా ఆయన నచ్చడం విశేషం. ఆయన చెప్పే మాటలు (భక్తిపారవశ్యంతో) మా ఇద్దరినీ గంటలకొద్దీ కూర్చుని వినేలాగా చేసేవి. అప్పటినుంచీ ఆయన్ని కలవని, మాట్లాడని రోజులేదు. మేము చలికి బయటకు రాలేకపోతే, శాలువా కప్పుకుని, బ్యాంకు నుండి రాత్రి 9 గం॥లకు వచ్చినా సరే, మా రూమ్‌కి వచ్చి కాసేపు బ్యాంక్ విషయాలు, ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడకుండా వెళ్ళేవాడు కాదు. ఆయన మాట్లాడే విధానము, వేసే జోక్స్, ఆయన నవ్వు, హావభావాలు, మాటల్లోని లోతు, ఆయన చెప్పే ఎన్నో ప్రాపంచిక విషయాలు వింటే కానీ రోజు గడిచేది కాదు. కాశ్మీర్‌లో ఇదొక అదృష్టమనిపించింది.

మాకోసం భగవంతుడే ఈరూపంలో వచ్చి విషయాలు చెప్తున్నాడా అనిపించేది మా ఇద్దరికీ. ఆయన పేరు శ్యామ్ అవడం వలన పరమగురువులు శ్యామలరావుగారై ఉంటారని నేను భావించాను. వీరందరి నివాసము ఇక్కడే కదా! మనిషి కూడా ఎంతో అందంగానూ, ఆహ్లాదంగానూ ఉంటాడు. ఆయన మాటతీరు ఎవరినైనా ఆకర్షించకమానదు. మేమిక్కడకు వచ్చిన రెండవరోజు,

ఇక్కడున్న ఒక ఆఫీసరు మమ్మల్ని, ఆయనను తీసుకుని కీర్‌భవానీ గుడికి, బాలాత్రిపురసుందరి గుడికి తీసుకువెళ్ళారు. "అమ్మ పిలుపు వస్తుందని నాకు తెలుసు" అనుకుంటూ ఆనందంతో ఆయన గుళ్ళో ప్రార్థనలు చేసుకున్నాడు. ఆయనకు వెంటనే 'కీర్‌భవాని' గుడి ప్రక్కనే ఉన్న బ్రాంచ్‌ని ఆడిట్ చేయమని ఆదేశం వచ్చింది. ఇంక ఆయన ఆనందం అంతాఇంతా కాదు.

శ్రీరామనవమినాడు శంకరుల గుడికి వెళ్దామని ఇద్దరం బయలుదేరాము. ఆరోజు శుక్రవారం. గార్డెన్‌లో ఈయన కూర్చున్నాడు. పలకరిద్దామని వెళ్ళాము. తరువాత ఆయన చెప్పిన అనుభవాలు విన్నాక, ఇంక శ్రీరాముడిని దర్శించనక్కరలేదు అనిపించింది. దాదాపు 2 గం॥ల తర్వాత నాకు ఆనందం కలగడంతో ఇంక అంత దూరం వెళ్ళి ఆయన్ని చూడడం ఎందుకు? ఇక్కడే ఈయన కన్పించారు కదా అనుకొని రూమ్‌కి వెళ్ళిపోయాము.

హిమాలయాల గురించి ఆయన వర్ణించిన విధానం చాలా బాగుంది. "పర్వతంపైన ఉన్న శివుణ్ణి (నరుడు), బదరీలోని నారాయణుని చూడనిదే ఈ జీవితానికి మోక్షం కలుగదు" అంటూ ఆ యాత్ర గురించి, ఎలా వెళ్ళాలో కూడా చెప్పారు. ఇండియాలో ఆయన చూడని గుడి లేదు, దేవత-దేవుడు లేరు. అష్టాదశ పీఠాలు, పంచారామాలు, చార్‌ధామ్ యాత్ర, భారతదేశంలో ఉన్న గుళ్ళలోని ప్రత్యేకమైన పూజలు ఏవైతే చూడాలో, అవన్నీ చూసి, కళ్ళకు కట్టినట్లుగా, అనుభూతులతో సహా ఆయన వర్ణించి చెప్తుంటే, అవన్నీ ప్రత్యక్షంగా చూసిన అనుభూతి కలిగింది. ఎంతో తన్మయత్వంతో ఆయన వర్ణిస్తుంటే, మేమిద్దరం కూడా లీనమైపోయి, అంతా విని ఆకళింపు చేసుకున్నాము. ఆ కొండలమధ్య ఉన్న కాశ్మీర్ వ్యాలీలో మాకు అవన్నీ దర్శనం చేసుకున్న అనుభూతిని ప్రసాదించారాయన (గురువులు).

హిమాచల్‌ప్రదేశ్‌లో ఉన్న ఎన్నో ప్రదేశాలు- చింతపుర్ణి, నైమిశారణ్యం, ఉజ్జయిని, శృంగేరిలాంటివి కాకుండా మరెన్నో తెలియని, కనీసం వినని ఎన్నో ఆలయాల విశేషాలు చెప్పారు. "బదరీ యాత్ర భయం అంటారు కదండీ, కష్టమేనా?" అని అడిగాను అమాయకంగా. దానికి ఆయన "చావు ఈ జీవితానికి ఒకేసారి వస్తుంది. 2సార్లు వస్తుందా?" అని నన్ను ప్రశ్నించి, "నిర్భయంగా వెళ్ళి దర్శనం చేసుకోండి. ఒక్కసారైనా ఆ దేవభూమిని దర్శించాలి. సాక్షాత్తూ శివపార్వతుల దర్శనం అయి తీరుతుంది. హరిద్వార్‌లో గంగాస్నానం చేసి, సాయంత్ర హారతిని దర్శించుకుని, అన్నిచోట్లా ధ్యానం చేసుకోండి. అప్పుడు మనసుకు ఎంతో శాంతి కలుగుతుంది" అన్నారు. "సరే" అన్నాము. ఆయన ప్రతి స్థలంలోనూ పొందిన అనుభూతులను కూడా చెప్పారు. కానీ గుర్తున్న వాటిలో ఒకటి మాత్రం ఇక్కడ రాస్తున్నాను.

ఆయనకు కాశీలో విశేషమైన ఒక అభిషేక పూజను పర్వదినాల్లో ఎవ్వరూ లేకుండా మనస్ఫూర్తిగా, విశ్రాంతిగా చేసుకోవాలని ఒక కోరిక ఉండేది. కానీ అది సాధ్యపడే విషయం కాదు కదా! ఒకసారి ఆయనకు కాశీలో ఇన్‌స్పెక్షన్ పడింది. ఒక పౌర్ణమినాడు ఆయన విశ్వేశ్వర దర్శనానికి బయల్దేరారు. ఆరోజు విపరీతమైన జనం, అందులోనూ కుమారమంగళం బిర్లా

వస్తున్నారని దర్శనం ఆపేశారు. అక్కడి పూజారి ముందే పరిచయం కావడం, ఆయనతో ముందే ఈ పూజను సిద్ధం చేసుకోవడం వలన ఆయన ప్రత్యేకంగా వేచిఉండమన్నాడు. బిర్లాగారు రావడానికి ఇంకా 2 గంటలు పడుతుందని తెలిసి, ఆ పూజారి "ముందు మీరు రండి, మీచేత చేయిస్తాను" అంటూ కర్టెన్స్ వేసి, ఈయన్ని కూర్చోబెట్టి పంచామృతాలతో అభిషేకం చేయించాడు. ఆయన మనుమరాలు (9 సం॥లు) ఆయనతోపాటు 2 గం॥ల సేపు శివమంత్రాన్ని పఠిస్తూ గంగాళంలోని పాలను అభిషేకం చేస్తున్న చెంబులో పోసేది. దాంతో ఈయన ఆనందానికి అవధులు లేవు. "సాక్షాత్తూ కాశీ విశ్వేశ్వరుని గర్భగుడిలో ఒక్కడే కూర్చుని 2 గం॥ల పాటు ఆ అభిషేకాలు బాలిక రూపంలో అమ్మవారు నాచేత చేయించింది. అదే నా భాగ్యము. అమ్మకు నామీద అంత ప్రేమ. నేను మొండిపట్టు పడితే ఎలాగైనా నా కోరిక తీరుస్తుంది. పిల్లవాడి కోరికను అమ్మ కాకపోతే మరింకెవరు తీర్చగలరని శంకరాచార్యులవారు చెప్పారట" అంటూ తన్మయత్వంతో, కన్నీళ్ళు కారుస్తూ ఆయన చెప్పాడు.

"ఈ లోకంలో చెడ్డ కొడుకులుంటారు కానీ, చెడ్డ తల్లులు ఉండరు. అమ్మ నా కోరిక ఎందుకు తీర్చదు? తప్పక తీరుస్తుంది" అంటూ ఆయన విశ్వాసంతో చెప్పిన ఉదాహరణలు ఎన్నో. ఇవన్నీ వింటుంటే, అమ్మని అసలు ఎలా వేడుకోవాలో, ఎలా ప్రేమించాలో మనకు తెలియదేమో అనిపించింది. ఎలా మెలగాలో ఆయన తెలియజేస్తున్నాడని మాత్రం తెలిసింది. ఆయన పుట్టిన స్థలం సీతాదేవి పుట్టిన మిథిల దగ్గర. తులసీదాస్ రాసిన రామాయణమంతా ఆయనకు కంఠోపాఠం. బిడ్డ బాధలో ఉంటే ఏ శ్లోకం చదవాలో అలాంటి కొన్ని ప్రత్యేకమైన శ్లోకాలు, దుర్గా సప్త స్తుతి, విష్ణుసహస్రనామాలు, ఇంకా ఎన్నో ఆయనకు బాగా వచ్చు. చిన్నప్పటినుంచీ వాళ్లమ్మగారు అవన్నీ చదివించేవారట. రాత్రిపూట మా రూమ్‌కు వచ్చి అవన్నీ చదివేవారు. ఆయనకు జ్యోతిషశాస్త్రం కూడా తెలుసు. గ్రహాలు, దోషాలు, ఎప్పుడు ఏమి ధరించాలో, అవన్నీ అవలీలగా చెప్పేవారు. వాటిని తెలుసుకుని, పాటిస్తే తప్పక నివారణోపాయాలు దొరుకుతాయని చెప్పారు.

ఆయన చెప్పినవన్నీ నన్నెంతగానో ఆకర్షించాయి. మనల్ని పాటించమని చెప్పే 'బోధ'లాగా అనిపించింది. ఆయన రెండుసార్లు మాత్రమే దేవుడి గుడికి వెళ్ళి ప్రార్థిస్తారట–

ఒకటి – ఎక్కువ ఆనందం కలిగినప్పుడు, "ఇంత ఆనందం కలగడానికి కారణం నువ్వే, ఈరోజు ఇంత ఇచ్చావు. దీనిలో నా ప్రయత్నమేమీ లేదు. అంతా నీ దయే. ఈ ఆనందంలో నాకు గర్వంకానీ కలుగుతుందేమో. దానిని మాత్రం దూరం చెయ్యి. అది నా దగ్గరకి రాకుండా నన్ను కాపాడు " అంటూ కృతజ్ఞతతో ప్రార్థించటానికి వెళ్తారు.

రెండు – దుఃఖం వచ్చినప్పుడు, "ఇది కూడా నువ్వే ఇస్తున్నావు. దీన్ని అనుభవించేటప్పుడు నాకు కావలిసినంత శక్తిని, ధైర్యాన్ని, సహనాన్ని నాకు ప్రసాదించు" అని అడుగుతారు. అలా ఆ సమస్యను శక్తికి అప్పగించిన మరుక్షణం ఆయనకు బాధ అంటే ఏమిటో తెలియదు. దాన్నే

పూర్తి శరణాగతి అంటారు. మళ్ళీ హాయిగా నవ్వుతూ తిరుగుతారట. "రెండూ ఆవిడే ఇస్తుంది. ఈ జీవితమే ఆవిడ భిక్ష" అంటారు. అలా రెండుసార్లు ప్రార్థన ఎలా చేయాలో తెలుసుకున్నాను.

ఇంకొక ఉదాహరణ, ఆయనకు 30 ఏళ్ళనుండి షుగర్ వ్యాధి ఉన్నదట. మందులు వాడుతున్నారు. అందులో ఆయనకు massive heart attack వచ్చింది. ఆ విషయం ఆయనకు తెలియనే తెలియదు. కొంచెం అనారోగ్యంగా ఉండి డాక్టర్ దగ్గరకు వెళ్తే, ECG చూసి, నీకు హార్ట్ఎటాక్ వచ్చిందని చెప్పారట. ఆయన "నొప్పిలేదే?" అని అడిగితే, వాళ్ళు "షుగర్ ఉన్నవాళ్ళకు నొప్పి రాకపోవచ్చు" అన్నారట. "చూశారా! అమ్మ నాకు నొప్పి తెలియనివ్వకుండా ఎంత మేలు చేసిందో. గుండెనొప్పి వస్తే ఏమిటి? అమ్మ ఉండగా" అంటూ లౌకిక విషయాలు కూడా ఆధ్యాత్మిక భాషలో మాట్లాడుతుంటారు. నేను "ఏమండీ, ఉపవాసం ఉన్నప్పుడు షుగర్ లెవల్స్ ఎక్కువగా ఉంటే ఏంచేయాలి?" అని ఒక లౌకిక విషయాన్ని అడిగాను. దానికి ఆయన ఒక కథ చెప్పారు.

(బీహారులో) బిడ్డపుట్టిన ఆరవరోజు బ్రహ్మ, బిడ్డ నుదుటిమీద ఆ బిడ్డ ఆయుష్షు, ఎలా భోగిస్తాడు, మరణం, జీవనం అన్నీ వ్రాస్తాడట. దాన్ని సరదాగా ఎలా చెప్పాడంటే, "మీకు ఆయుష్షు 60 ఏళ్ళు అనుకోండి. జీవితకాలంలో మీరు 60 కిలోలు షుగర్ తినాలని వ్రాశాడు అనుకోండి, 40 ఏళ్ళకే 50 కిలోల షుగర్ తినేశారు. అంటే 10 కిలోలు ఇంకా 20 ఏళ్ళు తినాలి కదా! అందుకని షుగర్ లెవల్ని సరిచేయడానికి ఈ వ్యాధి ఇచ్చాడు. అంతేతప్ప మరేమీ కాదు. రోగాలను అందుకే ఇస్తాడు. కాబట్టి తినాల్సినదానికంటే ముందే ఎక్కువ తిన్నామన్నమాట. దీనికోసం భయం ఎందుకు? ఇది కూడా అమ్మ మనకు ఎందుకో మంచి చేయడానికే ఇచ్చి ఉంటుందని మనం గ్రహించాలి. అంతేకానీ రోగం వచ్చిందని చింతించరాదు" అంటూ చాలా తేలికగా చెప్పారు. నాకు కూడా నిజమే అనిపించింది. విషయాన్ని అర్థం చేసుకోవడంలోనూ, దాన్ని ఆధ్యాత్మికంగా మార్చుకోవడంలోనూ ఎంత తేడా ఉంది? అది తెలియక మనం ఎంత దుఃఖిస్తామో కదా! శరణాగతి ఎలా అవ్వాలో ఎంతో చక్కగా, సునాయాసంగా మరొకసారి నాకు నేర్పిస్తున్నారు అనిపించింది.

సరే, అంతకుముందే రోజు నాకు ఆయన పేరు 'శ్యామ్ప్రసాద్' అని తెలిసింది. మర్నాడు సాయంత్రం, ఈయన బ్యాంక్ నుంచి వచ్చాక ఇద్దరం ఆయన రూమ్కి వెళ్ళి "ఏదైనా చెప్పండి సార్" అని కూర్చున్నాము. దానికి ఆయన నవ్వారు. నేను మావారితో "ఈయన పేరు శ్యామ్ కదా శ్యామలరావుగారే ఇలా మాట్లాడుతున్నారని అనుకుంటున్నాను" అన్నాను. ఆయన "ఏమిటి?" అన్నారు. "మా పరమగురువుల పేరు మీ పేరే. అందుకే ఇంత మంచి విషయాలు మాట్లాడుతున్నారనుకుంటున్నాను" అన్నాను. "నేను అంత గొప్పవాడిని కాదండీ, మీకొక విషయం చెప్తాను. నేనిప్పటివరకు ఎవ్వరికీ చెప్పని విషయం ఇది. నా పుట్టుక గురించి ఒక పెద్ద కథ ఉంది. ఇది మా అమ్మ నాకు చెప్పింది. అది మీకు ఈరోజు చెప్తాను" అంటూ టీ త్రాగుతూ చెప్పడం ప్రారంభించాడు. మేమిద్దరం ఆసక్తిగా వింటున్నాము.

"మేము క్షత్రియులం. బీహార్‌లోని మధుబని గ్రామం. మా అమ్మకు పెళ్ళై 9 సం॥లైనా పిల్లలు కలగలేదు. మా తాతగారు మా నాన్నకు మరొక వివాహం చేయడానికి సంకల్పించారు. దానికి మా నాన్న ఒప్పుకోలేదు. మా తాతగారిది ఒక కిరాణా కొట్టు. మధ్యాహ్నం అన్నం తిని అందరూ వరండాలో నిద్రిస్తున్నారు. అప్పుడు జటాఝూటం, కాషాయ కౌపీనం ధరించి, చేతిలో దండముతో ఉన్న ఒక సాధువు ఈయన్ని లేపి, భోజనం పెట్టమని అడిగారు. ఆ పెద్ద ప్రాంగణంలో ఎక్కడో ఒక మూల ఆడవాళ్ళుంటారు. అక్కడకు మగవాళ్ళు వెళ్ళరు. మధ్యాహ్నం 3 గం॥ల సమయంలో ఈయన అక్కడికి వెళ్ళి, భోజనం ఏదైనా ఉందా అని అడిగితే, లేదని, కొంచెం అటుకులు, బెల్లం, వేడిపాలు ఇస్తే, దానిని సాధువుకు ఇచ్చారు. తర్వాత ఆ సాధువు మా తాతగారి వైపు చూసి, 'నువ్వు వంశాభివృద్ధికోసం ఎదురు చూస్తున్నావు కదా? కొడుకుకి పిల్లలు లేరు కదా, మీ కోడలిని ఒకసారి చూడవచ్చా' అని అడిగారు. ముఖంపై పరదాతో ఆమెను ఆ ప్రాంగణం మధ్యలోకి తీసుకువచ్చి కళ్ళు మాత్రం కనపడేలా పరదా తీసి చూపించారు. ఆయన ఒక కోడి, కొన్ని మేకులు, సింధూరం, ఇంకా ఏవో తెమ్మని అడిగారు. ఆ రాత్రికి అక్కడే పడుకుని, మర్నాడు ఆ ప్రాంగణం మధ్యలో పేడతో అలికించి, ముగ్గులు వేయించి, మా అమ్మని కోడికి సింధూరం పెట్టమని చెప్పి, ఆమె పడుకునే గదిలో 4 వైపులా 4 మేకులు, గది మధ్యలో ఒక మేకును పాతి 'ఈ గదిని మాత్రం మీరు ఎప్పటికీ ఉంచుకోండి' అని చెప్పారు.

మా అమ్మకు ఏవో 2 ఆవగింజలలాంటివి ఇచ్చి ప్రసాదం తినమన్నారు. తరువాత ఆయన తను కామరూపంలో ఉన్న కామాఖ్య అమ్మవారి ఉపాసనాపరుడిని, అక్కడ ఈమెపేర పూజ చేయించాలి, ఒక కాణీ ఇవ్వమని అడిగి తీసుకుని వెళ్ళిపోయాడు. మళ్ళీ ఎప్పుడూ ఆయన తిరిగి రాలేదు. ఆయన వెళ్ళిన 11 నెలలకు మా అమ్మ గర్భవతి అయింది. నేను పుట్టాను. శ్యామ్ అని పేరు పెట్టారు. శ్యామ్ అంటే కాళీ, మా ఇలవేల్పు. ఆ గది యిప్పటికీ మా అధీనం లోనే ఉంది. పెళ్ళయిన ప్రతివాళ్ళు ఆ గదిలో ఒకరోజైనా నిద్రచేసే ఆచారం ఇప్పటికీ ఉంది" అంటూ ఆయన పుట్టుక వృత్తాంతం చెప్పారు. అంతా విన్నాక నిజంగా శ్యామలరావుగారే మాట్లాడుతున్నారని అర్థమైంది. శ్యామలరావుగారు కూడా త్రిపురసుందరీ ఉపాసకులు. అలాగే కామాఖ్య అంటే త్రిపురసుందరేనట. ఈయన కూడా ఆ తల్లి అనుగ్రహంతో జన్మించారు కాబట్టి, నేను పరమగురువులు అనుకున్న వెంటనే ఆయన ఈ కథ చెప్పడం, ఎంత చక్కగా సంబంధం కుదిరిందో చూడండి. ఈ హిమాలయాల్లో యోగులు సజీవంగా ఉంటారని, దర్శనమిస్తారని 'ఒక యోగి ఆత్మకథ'లో చదివాం కదా. నాకు ఈ శ్రీనగర్‌లో ఆ దర్శనం కలిగిందని అనిపించింది.

మేము ముగ్గురం కలిసి కీర్‌భవానీ, బాలాత్రిపురసుందరీ ఆలయాలకు వెళ్ళినప్పుడు నాకు ఈయన పేరు తెలియదు. అయినా ఆయనతో కలిసి త్రిపుర దర్శనం చేసుకున్నాము. అంటే గురువులు దగ్గరుండి దర్శనం చేయించారన్నమాట. త్రిపురసుందరి గుళ్ళో నాకు ఒక అనుభవం కలిగింది. 'హరికొండ'పైన అమ్మవారి నివాసము. 70, 80 మెట్లు ఎక్కి వెళ్ళాము. అక్కడ చిన్నకొండలాగా ఉంది. దానిమీద ఏవో గుర్తులున్నాయి. అదే అమ్మవారు అంటే ప్రదక్షిణం

చేసి, నమస్కరించి లోపలకు వెళ్ళాము. అక్కడ మహాలక్ష్మి, మహాకాళీ, మహాసరస్వతి ఫొటోలు 3 వేర్వేరు గుళ్ళలాగా కట్టి వాటిల్లో పెట్టి ఉన్నాయి. ఈ 3 ఫొటోల క్రింద ఒక చిన్న ఫొటో పెట్టి ఉంది. అది త్రిపురసుందరి ఫొటో అన్నాడాయన. అది బాగుందనిపించి ఒకటి (రూ.80లు) కొన్నాను. మహాలక్ష్మి అమ్మవారి ఫొటో చూస్తే అచ్చు నా మొహం (35 సం॥లు ఉన్నప్పుడు) లాగా ఉంటే, ఈయను చూపించాను. “అవును, అలాగే ఉన్నది” అన్నారు. ఇక్కడి ఫొటోలు మన వైపు ఫొటోలలాగా కాకుండా, 18 చేతులతో, క్రింద 2 పెద్ద సింహాలు అటూ ఇటూ కాపలా కాస్తున్నట్టు ఉన్నాయి. అంతవరకూ ఒక గ్లాస్ డోర్ బిగించారు. మనం కూడా ఏలూర్లో ఇలా పెడితే బాగుంటుంది అనుకున్నాను. ఈ విధానం నాకు బాగా నచ్చింది. ఆయన, మావారు అక్కడ కాసేపు ధ్యానం చేసుకున్నారు. రాత్రి 8 గం॥లకు ఇంటికి తిరిగి వచ్చాము. భోజనం అయిన తరువాత నేను మళ్ళీ ఆ ఫొటో చూశాను. అమ్మవారు కాశ్మీర్ స్త్రీలాగా డ్రెస్‌లో ఉంది. 18 చేతులు ఉన్నాయి. కాశ్మీర్ వాళ్ళ మంగళసూత్రాలు చెవి నుండి ఛాతి వరకు వేళ్ళాడుతున్నాయి. వెనుక ఎత్తైన కొండలు, క్రింద ఒక సరస్సు, మధ్యలో కమలంలో అమ్మవారు కూర్చుని ఉంది. అది చూసిన తర్వాత నాకు ఒక విషయం గుర్తుకు వచ్చింది.

1997 దసరాల్లో అనుకుంటాను, 3 లేక 4వ రోజున నేను ధ్యానంలో ఉన్నప్పుడు ఒక దృశ్యం కనబడింది. దానిని అప్పుడు అందరికీ చెప్పాను కూడా. ఎత్తైన కొండల మధ్య ఎక్కడి నుండో నీళ్ళు పడుతున్నాయి. క్రింద సరస్సు. మధ్యలో ఎత్తైన సింహాసనంపై కూర్చున్న ఒక స్త్రీ. ఆమె నుదుటిపై పెద్ద కుంకుమ బొట్టు. మధ్యలో 3 ముడుతలు కన్పిస్తున్నాయి. కళ్ళ క్రింద నుండి చూస్తే ఆ స్త్రీ ముఖం నా ముఖంలాగే ఉన్నది. అప్పుడు నాకు కనిపించిన ఆ దృశ్యాన్ని బొమ్మ గీస్తే, ఇప్పుడు నేను కొన్న ఫొటోలోని స్త్రీ సరిగ్గా సరిపోతుంది. ఎప్పుడో 10 సం॥ల క్రిందట నేను ధ్యానంలో చూసిన అమ్మవారు ఈ కాశ్మీర్ లోయలో ఉన్నదనుకుని, మావారికి చెప్పాను. ఆయన కూడా ఆశ్చర్యపడి “వ్రాసి ఉంచు” అన్నారు. త్రిపురసుందరీ అనుగ్రహంతో పుట్టిన శ్యామ్‌గారు, అలాగే నేనూ కలిసి ఈ కాశ్మీర్‌లోని త్రిపురసుందరిని దర్శించటం, అది నేనెప్పుడో చూసిన దృశ్యానికి చిత్రం కావడం, నేను వారిని పరమ గురువులుగా భావించడం – ఇప్పుడు ఇవన్నీ ఆలోచిస్తే గురువులే దగ్గరుండి దర్శనం చేయించారని తెలిసిన తర్వాత చెప్పలేని ఆనందం కలిగింది. ఇదొక విచిత్ర అనుభూతి.

**16.04.2006**

ఉదయం 11 గం॥లకు శంకరాచార్య మందిరానికి వెళ్దామని బయల్దేరాము. శ్యామ్‌గారిని “వస్తారా” అనడిగాము. “పదండి, వెళ్దాము” అన్నారు. రోజూ మా రూమ్ నుండి కొండపై ఉన్న శిఖరాన్ని చూసి నమస్కారం చేసుకుంటాను. గుడికి వెళ్ళగానే, మెట్ల వద్ద సెక్యూరిటీ, వీడియో కెమెరా తీసుకెళ్ళకూడదన్నారు. వాళ్ళు కూడా “మేము ఉంచుకోమ”న్నారు. ఆటోలో పెట్టడం ఎలాగా అని చాలాసేపు ఆలోచించి చివరకు పోలీసు వాళ్ళను అడిగాము. ఒకచోటు చూపించి “అక్కడ పెట్టి వెళ్ళండి” అన్నారు. 200కు పైగా మెట్లు ఉంటాయి. ఈ 10 రోజుల్లోనే ఎప్పుడో

ఒకసారి మాటల మధ్యలో ఆయన నాతో "ఆంజనేయ మంత్రం చేయండి. పిల్లలకు మంచిది. మీరు చేస్తే పిల్లలకు ఫలితం దక్కుతుంది" అన్నారు. అది గుర్తుకు వచ్చి, నేను మావారు కూడా 'కమలాంజనేయ' అనే గురుమంత్రాన్ని జపిస్తూ ఆయన ముందు, మేమిద్దరం వెనుక వెళ్తూ మెట్లు ఎక్కి, శంకరాచార్య తపస్సు చేసిన స్థలాన్ని, శివమందిరాన్ని దర్శించుకున్నాము. అప్పుడు నాకు 'అమ్మవారిని దర్శింపజేసిన తర్వాత, అయ్యవారిని మాత్రం ఎందుకు దర్శింప చేయరు' అనిపించింది. తపస్థలిలో ముగ్గురం కలిసి 2 ని॥లు ధ్యానం చేసుకున్నాము. అక్కడ ఒక చిన్నగదిలో ఒక మంచం లాంటిది వేసి ఉంది. దానిపై ఏవో గ్రంథాలు గుడ్డతో కప్పి ఉన్నాయి. ధ్యానం చేస్తున్నప్పుడు నాకు ఆ మంచంపైన త్రిపురం పిన్ని కూర్చుని ఉన్నట్లు కనిపించింది. నేను కళ్ళు తెరిచాను. నవ్వుతూ చలాకీగా ఉంది. "అక్కడ అమ్మవారిని సేవించాను. ఇప్పుడు అయ్యవారిని సేవిస్తున్నాను" అని చెప్తున్నది. నన్ను రమ్మని బొట్టు పెట్టింది. నేను కాళ్ళకు నమస్కారం చేశాను. పిన్నిని అలాగ ఒక్కసారిగా చూసేసరికి చెప్పలేని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాను. ఆ విషయాన్ని మా వారికి చెప్పాను. ఆయన కూడా మంచానికి నమస్కారం చేశారు. బయటకు వచ్చేశాము. ఆవిధంగా అయ్యవారు, అమ్మవారితో పాటు త్రిపురం పిన్నిని కూడా దర్శించే అదృష్టాన్ని పరమగురువులైన శ్రీశ్యామలరావుగారు దగ్గరుండి కలుగజేశారు. చెప్పనలవికాని సంతృప్తి కలిగింది. అప్పటికి పిన్ని పరమపదించి సుమారు 42 రోజులు (మార్చి 3) అయి ఉంటుంది. ఇదొక అపురూప దర్శనం. పిన్ని అంత హుషారుగా, నవ్వుతూ నన్ను సాదరంగా పిలిచి, బొట్టు పెట్టి, ఏవో విషయాలు చెప్పడం చూసేసరికి మనసంతా తేలికగా అయిపోయింది. ఇప్పుడు ఆలోచిస్తే, తను కూడా త్రిపురసుందరీ రూపమే కదా! ఆ శ్యామలరావుగారు శంకర సమేతంగా ఉన్న త్రిపురసుందరిని, ప్రత్యక్షంగా దర్శింపచేశారనిపించింది. ఇక్కడ శంకరాచార్యుల కొండమీద, ఇలా గురువు దగ్గరుంటే తప్ప ప్రత్యక్ష దర్శనాలు ఎలా కలుగుతాయి జీవునికి అని మరొకసారి రుజువు చేయబడింది. శ్రీనగర్‌లో నేను ఇన్ని రోజులుండటం ఇందుకోసమే అనుకుంటాను. మేము హోటల్‌లో దిగినరోజునే, ఆయన (శ్యామ్‌గారు) మా రూమ్‌కు వచ్చి పరిచయం చేసుకున్నారు. అంటే నన్ను ఆహ్వానించారన్నమాట. (ఇప్పటి వరకూ చాలా మంది శిష్యులకు బాలాజీగారే దర్శనమివ్వడం అనుభవమైంది. నేను శ్యామలరావుగారిని గుర్తుపట్టడం ఇదే మొదలు. ఆయనెప్పుడూ కనబడలేదు. ఇక్కడకు వస్తేగానీ కనబడరన్నమాట.)

**18.04.2006**

17వ తారీకు రాత్రి మేమిద్దరం శ్యామ్‌గారి రూమ్‌కి వెళ్ళి కాసేపు కాలక్షేపం చేద్దామనుకున్నాము. మామూలుగా నేను ఆయనను ఏదైనా చెమ్మన్నాను. కానీ ఆయన ఈరోజు నన్ను ఏదైనా చెప్పమన్నారు. మాటల మధ్యలో మావారు పీఠం గురించి, నా గురించి కొంత చెప్పారు. శ్యామ్‌గారు విని చాలా ఆశ్చర్యంతో మరికొన్ని ప్రశ్నలు వేశారు. రోజూ మీ కార్యక్రమాలేమిటి అనడిగితే వాటి గురించి చెప్పాను. "ఇంత మంచి విషయాలు మీ దగ్గర పెట్టుకుని, రోజూ నన్ను చెప్పమంటున్నారా?" అంటూ నవ్వారు.

మర్నాడు ఉదయం గం॥10 లకు టిఫిన్ చేశాక, గార్డెన్‌లోకి వాకింగ్‌కు వెళ్ళి, ఏదో పుస్తకం చదువుతున్నాను. ఈలోపు శ్యామ్‌గారు కనబడి 'గుడ్‌మార్నింగ్ మేడమ్!" అంటూ నా దగ్గరకు వచ్చి కుర్చీలో కూర్చున్నారు. "ఈ టైమ్‌లో మీరు ఇక్కడున్నారేమిటి? ఈరోజు బ్యాంక్‌కు వెళ్ళలేదా?" అన్నాను. "లేదండీ! గం.2.00లకు కొత్త బ్రాంచ్ ఓపెన్ చేస్తాను. కారు డ్రైవర్ ఇంకా రాలేదు" అన్నారు. "అయితే 'కీర్‌భవానీ' బ్రాంచ్ ఓపెన్ చేస్తున్నారన్నమాట. అమ్మ దగ్గరకు వెళ్తున్నారా?" అన్నాను. "అవునండీ. ఆమె ఎప్పుడూ నా వెనుకే ఉంటుంది. ముందు నన్ను నిలబెడుతుంది. మనం కూడా ఎప్పుడూ మన పిల్లల్ని ముందు నడవండి అంటూ వెనుక నుండి మనం జాగ్రత్తగా వాళ్ళకు ఏమీ కాకుండా చూస్తుంటాము కదా! అలాగే అమ్మ కూడా! ఆమె ఎలా నడిపిస్తే అలా వెళ్ళడమేనండి. బాగున్నా, లేకపోయినా బాధ్యత వెనుక ఉన్న ఆమెదే కదా! ముందున్న మనం ఏది చూపిస్తే అది చూడడం, ఆనందించడం. అంతే నా పని" అన్నారు.

"ఎంత టైంపాస్ చేసినా ఒంటరిగా రోజంతా గడపడం బోర్ అనిపిస్తుంటుంది" అన్నాను. "అంతా మన మనస్సులో ఉన్నదండి. బోర్ అనుకుంటే బోర్. ఎంత మంచి అవకాశం ఇది. దీన్ని నూరుశాతం వినియోగించుకుంటే ఎంతో ఆనందం, తృప్తి కలుగుతాయి. పాజిటివ్‌గా ఆలోచిస్తే, దానికి మించినదేమీ లేదు. ఏది ఏమైనా మనం ఉన్నదానితో సర్దుకుపోతాము. తప్పని స్థితి కదా! అలా ఉంటే కొన్ని రోజుల తర్వాత అదే మనకిష్టమైపోతుంది. దీనికి సంబంధించి ఒక కథ మా బీహార్‌లో చెప్తుంటారు" అన్నారు. "అయితే నాకు ఈ రోజు నోట్ చేసుకోవడానికి మంచి విషయం ఉందన్నమాట" అన్నాను. ఆయన నవ్వుతూ చెప్పడం మొదలుపెట్టారు.

"ఒక పండితుడు ఉండేవాడు. ఆయనకు నలుగురు కొడుకులు. వాళ్ళు అసమర్థులు. ఈ పండితుడు భూత, భవిష్యత్, వర్తమాన కాలాల గురించి తెలుసుకోగలడు. ఆయనకు 70 సం॥లు పైబడిన తర్వాత ఒకరోజు ఆయన తన భవిష్యత్ గురించి తెలుసుకుని, జరగబోయే విషయాలను గూర్చి, కొన్ని విషయాలు పిల్లలకు చెప్పాల్సినవి, అందర్నీ పిలిచి చెప్పడం ప్రారంభించాడు. 'నేను ఫలానా రోజున పోతాను. మరొక జన్మ ఎత్తవలసి ఉంది. అది పంది జన్మ. అది ఫలానా ఊళ్ళో, ఫలానా సమయంలో, ఫలానా మనిషి ఇంట్లో 5, 6 పంది పిల్లలతో కలిసి పుడతాను. నేను పుట్టిన వెంటనే మీరు అక్కడికి వచ్చి, నన్ను బల్లెంతో పొడిచి చంపండి. తరువాత నాకు మోక్షం వస్తుంది. ఈ పంది జన్మే అఖరిది. అలా చేయండి' అంటూ అన్నీ కాగితంపై వ్రాసి, వారికిచ్చి ఆయన చనిపోయాడు. పిల్లలు శ్రాద్ధకర్మలు అన్నీ ముగించాక, 20 రోజుల తర్వాత ఎప్పటికో ఈ విషయం గుర్తుకు వచ్చి, ఆ ప్రదేశానికి వెళ్ళి చూశారు. అక్కడ పందులన్నీ బురదలో పడి దొర్లుతున్నాయి. వాళ్ళకు తండ్రి ఎవరో గుర్తించడం కష్టమైపోయింది. అక్కడివాళ్ళకు డబ్బులిచ్చి, పందులన్నీ కడిగించి, అందులో తండ్రి చెప్పిన గుర్తులున్న పందిని తండ్రిగా గుర్తించి, చంపడానికి బల్లెం ఎత్తారు. వెంటనే ఆ పంది అరిచింది. 'బాబూ!నన్ను చంపవద్దు. నాకు ఈ జీవితం బాగానే ఉంది. అలవాటు పడిపోయాను. నన్ను చంపవద్దు, వదిలేసి వెళ్ళిపోండి' అంది. ఎంత పండితుడైనా, తరువాత పంది జన్మ ఎత్తినా కూడా, 20

రోజులపాటు అలా బురదలో దొర్లుతున్నా, ఆ జీవితానికి అలవాటుపడిపోయాడు. ఎవరైనా అంతే. మనకు అలవాటైతే ఏదైనా చాలా బాగుంటుంది. అలా బాగుండాలి కూడా. అంతేకానీ బాగాలేదు, బోర్ అనే పదాలు వాడుతూ నెగెటివ్‌గా ఆలోచిస్తే అవకాశాలు కోల్పోతాము. భగవంతుడు ఏది ఇస్తే, దాన్ని ఆనందంగా అనుభవించడం నేర్చుకోవాలి" అన్నాడు.

ప్రొద్దున్నే ఈ గుణపాఠం ఎంతో బాగుందనిపించింది. తర్వాత వాళ్ళ అమ్మాయికున్న సమస్యను నాకు చెప్పారు. నేనేదో సలహా చెప్పాను. ఈలోపుగా కారు వస్తే ఆయన వెళ్ళిపోయారు. ఆ రాత్రి వాళ్ళమ్మాయి 'పరిణీత'తో ఫోన్‌లో మాట్లాడి మంత్రోపదేశం చేశాను.

**18.04.2006**

నేను త్రిపురం పిన్ని పరమపదించిన తరువాత, అంటే మార్చి 12న కాబోలు మీరట్ (ఉత్తరప్రదేశ్) వెళ్ళాను. 15 రోజులకుపైగా అక్కడ ఉన్నాము. మేము వెళ్ళిన మరుసటిరోజే మా పక్క రూమ్‌లోకి బెంగాలీ దంపతులు వచ్చారు. ఆయన పేరు మండల్. ఆమె పేరు రుణ. నేను రోజూ ఆమెతో హిందీ, ఇంగ్లీషులో కలిపి మాట్లాడుతుంటే; ఆమె బెంగాలీ, హిందీ కలిపి మాట్లాడేది. ఆమె ఎక్కువగా బయటకు తిరిగే మనిషి కాదు. వాళ్ళ ఊరు బుర్ద్వాన్ (పశ్చిమ బెంగాల్). ఆయన మూడు స్వీట్స్ లేనిదే భోజనం చేసేవారు కాదు. మంచి భోజనప్రియుడు. రోజూ డైనింగ్ టేబుల్ దగ్గర చాలా కబుర్లు చెప్తుండేవాడు. మాకు కూడా రోజూ స్వీట్స్ పంపుతుండేవాడు. మావారు, ఆయన బ్యాంక్‌కు వెళ్ళాక, ఆవిడ నేను హాల్లో చెరొక సోఫాలో కూర్చుని హిందీ సినిమా చూసేవాళ్ళం. తరువాత గెస్ట్‌హౌస్ చుట్టూ వాకింగ్, గం.1.30లకు బీహారీ కుర్రాళ్ళ వంటతో భోజనం, సాయంత్రం గం.5.30లకు 2 కి.మీల వరకు ఆవిడని నడిపించి తీసుకెళ్తుండేదాన్ని. ఇది మండల్‌గారికి కూడా నచ్చి, "మా అవిడకు మీరు బాగా నచ్చారు. ఆవిడకు ఏదైనా కావాలంటే మీరు కొనిపెట్టండి" అన్నారు. తరువాత బ్రాంచ్‌కు ఆయన మీరట్ నుండి రోజూ వెళ్ళి వస్తుండేవారు. వాళ్ళ ఊరి విశేషాలు, ఉమ్మడి కుటుంబ విశేషాలు, బెంగాల్‌లోని పద్ధతులు అన్నీ చెప్తుండేది. అలా 15 రోజులు గడిపేశాము. వాళ్ళు చాలా మంచివాళ్ళు. ఆ గెస్ట్‌హౌస్ (శాస్త్రినగర్, మీరట్) కూడా చాలా బాగుంటుంది. 1857 సం॥లో స్వాతంత్ర్య ఉద్యమం, సిపాయిల తిరుగుబాటు, ఈ మీరట్‌నుండే ప్రారంభం అయింది.

మా గెస్ట్‌హౌస్ యజమానురాలు పంజాబీ, పేరు రజని. ఆవిడకు నా వయసే ఉంటుంది. నన్ను దగ్గరుండి టైలర్ దగ్గరకు తీసుకెళ్ళి, కొలతలు ఇచ్చి, నాకు ఒక డ్రెస్ కుట్టించింది. ఆమెకు ఒక స్వంత గుడి ఉంది. రోజూ ఉదయం గం.8.00లకు ఆవుపాలు తీసుకుని నన్ను పిలిచి, "గుడికి వెళ్ళి శివ్‌జీకి పోసివద్దాం పదండి" అంటే రోజూ ఆమెతో వెళ్తుండేదాన్ని. కొంచెంసేపు అక్కడే గడిపేవాళ్ళం. ఆ ఇల్లు చాలా పెద్దది. క్రింద గెస్ట్‌హౌస్, మొదటి అంతస్తు మ్యారేజ్ హాల్, రెండవ అంతస్తులో వాళ్లు ఉంటారు. ఆవిడ చాలా లావుగా ఉన్నా, చాలా తేలికగా పైకి కిందికి ఎక్కి దిగుతుండేది. ఎప్పుడూ "రత్నా, రత్నా! ఛాయ్ తాగుదాం. పైకి

రండి” అని పిలుస్తుండేది. నాతోపాటే రుణను కూడా పిలిచేది. “మీరు కూడా రావ్ సాబ్ ఎక్కడికి వెళితే అక్కడికి వేయించుకోండి. ఆవిడలాంటి మంచి స్నేహితురాలు ఇప్పటివరకూ నాకు దొరకలేదు” అంటూ వాళ్ళ ఆయన్ని పోరుతుండేదిట. ఆయన చెప్తుండేవాడు.

తరువాత అక్కడే Meerut Cantt Branch ఇచ్చారు. ఆయన బ్యాంక్ ఓపెన్ చేసిన మొదటి రోజే మమ్మల్ని బ్రాంచ్ మేనేజర్‌గారు డిన్నర్‌కి పిలిచారు. ఆయన పేరు జగత్‌సింగ్. ఆమె పేరు సరిత. తెల్లగా, లావుగా ఉంటుంది. వాళ్ళది ఉమ్మడి కుటుంబం, బోలెడంత ఆస్తి ఉంది. వాళ్ళింట్లో లైసెన్స్ తుపాకులు కూడా ఉన్నాయి. వాళ్ళకు ముగ్గురు పిల్లలు. ఇంట్లోనే గోధుమలు, జొన్నలు ఆడించేందుకు ఒక బ్యారక్ ఉంది. స్వంత పాడి ఉంది. ఒక పెద్ద గంగాళంలో నెయ్యి పోసుకున్నారు. దాంతో ఎన్నో వెరైటీలు ఆవిడ వండిపెట్టింది. రోజూ ఆయనతోపాటు నేను కారులో వాళ్ళింటికి వెళ్తుండేదాన్ని. ఆలు, గోబి, మేతితో పరోఠాలు, కచోరీలు, కీర్‌లు, వెజ్.పలావ్, నేతితో చేసిన పెద్ద పెద్ద అప్పాలలాంటివి, కడీ, మజ్జిగ పులుసుతో పకోడీలు చేసి నానబెట్టినవి, ఆవడలు, చిన్న ఆలూతో చేసిన మసాల కూర (దం ఆలూ), ఒకటి కాదు అన్ని రకాలు పూటకు 4 రకాలు భోజనంలో వడ్డించేది. వద్దన్నా మీగడపాలు పెద్ద గ్లాసుతో ఇచ్చేది. అన్ని రకాలు, అంత ప్రేమతో వండిపెడితే ఒక వారంపాటు తినివచ్చాను. అంతలా నేనెప్పుడూ, ఎక్కడా తినలేదు. అంత ప్రేమగా మరెవరూ తినిపించలేదేమో కూడా. అక్కడ ఉన్నప్పుడు 5, 6 డ్రెస్‌లు కొన్నాను. టైలర్‌ని ఇంటికి పిలిపించి మరీ కుట్టించి పెట్టేది. తరువాత వాళ్ళ అత్తగారింటికి వెళ్ళాము. నేను కొంత వీడియో తీశాను. వాళ్ళత్తగారు ముసుగు వేసుకుని డ్రెస్‌లో ఉన్నది. ఆవిడ చాలా సరదాగా మాట్లాడేది. “మై కాశ్మీర్‌కి కలీ హూం” అంటే, నేను “మగర్ ఆప్ కాశ్మీర్‌కి బుడ్డీ కలీ హైం” అన్నాను. అప్పటినుంచి వాళ్ళందరూ ఆవిడని ‘బుడ్డీ కలీ’ అని పిలిచి, నవ్వుకునే వాళ్ళు. ఇద్దరం కలిసి మిలటరీ క్యాంటిన్‌కు వెళ్ళి చాలా కొనుక్కున్నాము. ఆవిడతో చాలా బాగా ఎంజాయ్ చేశాను.

ఒకరోజు ఇద్దరం కలిసి షాపింగ్‌కి వెళ్ళాము. “మీకు ఏదైనా గిఫ్ట్ ఇద్దామనుకుంటున్నాను. మీకు ఏదైనా ఇస్తే weight ఎక్కువ అవుతుందంటారు కదా! అందుకని ఏదైనా వెండి విగ్రహం కొనిస్తాను. ఎంత ఖరీదైనా సరే. మీకు ఏది కావాలంటే అది కొనుక్కోండి” అంది. వద్దన్నా వినలేదు. దుర్గాదేవి విగ్రహం ఒకటి తీసుకుని ప్యాక్ చేయించాము. ఇంటికి వచ్చేసరికి, ఆమె భర్తకూడా అలాంటి విగ్రహాన్నే (కొంచెం పెద్దది) తెచ్చి, నాకు బహుకరించారు. దాంతో ఆవిడ నాతో “ఇది మీరు ఎన్నుకున్నారు కాబట్టి దీన్ని మా ఇంట్లో ఉంచుకుంటాను. రేపటినుండి వసంత నవరాత్రులు మొదలవుతున్నాయి. ఈరోజే మా ఇంటికి దుర్గ వచ్చింది. నాకు చాలా సంతోషంగా ఉంది. మీరు, మావారు కూడా ఒకే విగ్రహాన్ని ఎన్నుకోవడం, దుర్గ మా ఇంటికి మీ చేతులమీదుగా ఇలా రావడం చాలా ఆశ్చర్యంగా, ఆనందంగా ఉంది. ఈరోజు తెల్లవారుఝామున మీరు నాకు కలలో కనబడ్డారు. మేడమ్ వచ్చారు, లేవండి అంటూ మా వారిని కూడా నిద్రలేపాను” అంది. నేను ఆశ్చర్యపోయాను.

ఆవిడ నాకోసం కొన్న దుర్గావిగ్రహాన్ని బైటకు తీసి, చిన్న బౌల్‌లో పెట్టి, పచ్చిపాలతో, తేనెతో, పంచదారతో, పండ్లరసంతో అభిషేకం చేస్తూ, లలితా సహస్రనామం చదివాను. ఆరోజు గురువారం. వాళ్ళ దేవుడి గూట్లో ఆ విగ్రహాన్ని అలా పెట్టేసరికి ఆవిడ ఆనందం పట్టలేకపోయింది. పైగా వాళ్ళు అలాంటి అభిషేకాలు ఎప్పుడూ చేయలేదట, చూడలేదట. వాళ్ళకు తీర్థం ఇచ్చి, ప్రదక్షిణలు చేయమన్నాను. తరువాత ఆవిడ నాతో "అనాదిగా మా ఇంట్లో సంవత్సరానికి రెండుసార్లు నవరాత్రులు దీక్షగా చేస్తాము. మేము దేవీభక్తులం. పగలంతా ఉపవాసం ఉండి, రాత్రిపూట భోజనం చేస్తాము. ఈసారి మీరు ఒకరోజు ముందే అమ్మవారిని ప్రతిష్ట చేశారు. ఇది ఎంతో ఆనందంగా ఉంది" అన్నది. "ప్రతి శుక్రవారం ఈ విగ్రహానికి ఇలాగే అభిషేకాలు చేయండి" అని మంత్రోపదేశం చేశాను. తర్వాత మన పీఠం గురించి చెప్పాను. ఆవిడ "హైదరాబాద్‌లో కూడా మీరు గుడికి వెళ్తుంటారు కదా! ఇక్కడ, మా ఇంట్లో కూడా దుర్గను ప్రతిష్టించారు కదా! సం॥నికి ఒకసారి అందరినీ తీసుకుని మీరట్ రండి. నేను చాలా సంతోషిస్తాను" అంది. ఆవిడ ఆలోచనకు నాకు మరింత ఆనందం కలిగింది. మర్నాడు ఉగాది పండుగ. పొద్దునే మా ప్రయాణం. చండీఘర్‌లో 4 రోజుల ట్రైనింగ్. ఉదయం గం.10లకు భార్యాభర్తలు ఇద్దరూ మాకు చక్కటి భోజనం, స్వీట్స్ ప్యాక్ చేసి, కార్లో మమ్మల్ని స్టేషన్‌కు తీసుకువచ్చి, రైలు ఎక్కించారు. నేను వెళ్ళిపోతున్నానని ఆమె కన్నీళ్ళు పెట్టుకుంది. తప్పకుండా ఏలూరు వస్తానని చెప్పింది. ఈ మారుమూల ఇంత మంచి మనుషులు ఉన్నారన్నమాట. ఇలాంటి వారందర్నీ కలవాలని నా ప్రోగ్రామ్‌లో ఉందన్నమాట. అందుకే అమ్మమ్మగారు నన్ను ఇన్ని ఊళ్లు తిప్పి, ఇంతమందిని కలిసేలా చేస్తున్నారనిపించింది. ఇవన్నీ ఎప్పటి ఋణాలో, ఎప్పటి ఆత్మసంబంధాలో అనిపించింది. ఈ 4 సం॥ల ఇన్‌స్పెక్షన్‌లో ఎన్నో రాష్ట్రాలు, ప్రదేశాలు తిరిగాను. వెళ్ళిన ప్రతిచోటా ఇలాంటి ఆత్మసంబంధీకుల్ని కలవడం జరిగింది. జన్మాంతర సంబంధాలంటే ఇవేనేమో.

**19.04.2006**

మీరట్‌లో ఇంకొకరి గురించి వ్రాయడం మరిచిపోయాను. మొదటి బ్రాంచ్‌లో, మీరట్ సిటీ బ్రాంచ్ పనిచేస్తున్న ఒక కాశ్మీరీ పండిట్‌ను ఒకరోజు సాయంత్రం మావారు గెస్ట్‌హౌస్‌కు తీసుకువచ్చి పరిచయం చేశారు. ఆయన field officer. ఆయనను చూడగానే 1988లో చూసిన కాశ్మీర్ గుర్తుకు వచ్చింది. అప్పుడు తాగిన టీ మళ్ళీ ఎక్కడా తాగలేదు. బ్లాక్ టీ అది. ఎంత రుచిగా ఉంటుందో. తేనే రంగులో ఉంటుంది. దాంట్లో పాలు కలపరు. ఎన్నో రకాల టీలు తాగినా, అలాంటిది మరెక్కడా తాగలేదు. అది గుర్తుకు వచ్చి, ఆ టీ గురించి అడిగితే, "దాన్ని kawa అంటారు. అది కాశ్మీరీ టీ. ఆ పొడి మా ఇంట్లో ఉంటుంది. మా ఇంటికి రండి. నా భార్య తయారుచేస్తుంది. తప్పకరండి" అని అన్నాడు. ఆయనకు 45 సం॥లు ఉంటాయి. ఒక ఆదివారం హస్తినాపురం వెళ్ళి, తిరిగి వచ్చేటప్పుడు ఆ పండిట్ ఇంటికి వెళ్ళాము. ఆయన భార్య బబ్లీ గేటు దగ్గరకు వచ్చి మమ్మల్ని ఆహ్వానించింది. ఆమెను చూస్తూ ఒక నిమిషం అక్కడే నిలబడిపోయాను. నల్లటి కాశ్మీరీ డ్రెస్, కాశ్మీరీ షాల్ వేసుకుని, పాలతెలుపు రంగు, పెద్ద జుట్టుతో ఎంత అందంగా

ఉందో ఆవిడ. నన్ను సాదరంగా కౌగిలించుకుని "మీరు చాలా బాగా మాట్లాడతారని మావారు చెప్పారు" అంటూ లోపలికి తీసుకువెళ్ళింది. సొంత ఇల్లు. కాశ్మీర్ గొడవల్లో ఆస్తులన్నీ వదిలేసుకుని, కట్టుబట్టలతో ఇక్కడ స్థిరపడిపోయారు. ఆమె జమ్ము & కాశ్మీర్ బ్యాంక్‌లో పనిచేస్తుంది. ఇంట్లో అత్తగారు, మామగారు, ఒక అమ్మాయి, అబ్బాయి ఉంటారు. ఆమె మాట్లాడే తీరు, ఆ విధేయత, ఎదుటివారిని ఆహ్వానించే విధానం - అలా చాలా తక్కువమందిలో చూస్తాము. ముందు మంచినీళ్ళు ఇచ్చి, రకరకాల స్వీట్స్, డ్రైఫ్రూట్స్ పెట్టింది. తరువాత 2 రకాల కాశ్మీర్ టీ ఇచ్చింది. ఒకరకంలో పాలుపోసి, ఉప్పువేసి ఇచ్చింది. ఇంకోరకంలో పాలులేకుండా, పంచదార, డ్రైఫ్రూట్స్‌వేసి ఇచ్చింది. రెండు టీలు రుచి చూశాము. ఆమె టీ తయారు చేస్తున్నప్పుడు వీడియో తీశాము. ఆ టీ పౌడర్ కొంచెం నాకు ప్యాక్ చేసి ఇచ్చింది. ఇంకోసారి డిన్నర్‌కు రమ్మని పిలిచారు. మేము రాలేమన్నాము. "కాదు, కాదు. మా కాశ్మీరీ వంటకాలు, ముఖ్యంగా దమ్ అలూ మీకు తినిపించాలి. మీరు తప్పక రావాలి" అంటూ పటుబట్టింది. తర్వాత మీరట్‌లోనే ఇంకో బ్రాంచ్ ఇవ్వడం వలన, మేము మరొకరోజు వాళ్ళింటికి డిన్నర్‌కు వెళ్ళాము. ఎన్ని వంటకాలు చేసిందో చెప్పలేను. చిన్న చిన్న ఆలూలతో దమ్ ఆలూ, తామరతూడులను చిన్న చిన్న ముక్కలుగా కోసి, gravyలాగా చేసింది. ఆ ముక్కలను ఎండబెట్టి వుంచుకుంటారట. వాటిని వడియాలుగా వేయించి, దానిమీద ఛాట్ మసాలా చల్లి మరొక డిష్ చేస్తారు. ఆ తామరతూడులను కమల్‌దండి అంటారట. కాశ్మీరీ పులవ్, ఇంకో ఏవో వెరైటీలు తయారుచేసి, టేబుల్‌ను ఎంత అందంగా అమర్చిందో. ఎంతో ఆప్యాయంగా ఒకటొకటి, అడిగి మరీ వడ్డించింది. "మా కాశ్మీర్‌లో అతిథులను సాక్షాత్తూ భగవంతునిగా సేవించమని మా పెద్దలు చెబుతారండి. మనుషులను గౌరవించడం అనేది కాశ్మీర్‌లో నేర్చుకోవలసిందే. ఇక్కడ మీరట్‌లో ఆ సాంప్రదాయం లేనే లేదు" అన్నది.

"మాకు కూడా అతిథిదేవోభవ అనే వాక్యముంది. మేము అలాగే పాటిస్తాము" అన్నాను. భోజనం తర్వాత 2, 3 రకాల సోంప్‌లాంటివి చిన్నచిన్న బౌల్స్‌లో పెట్టింది. వాళ్ల ఇల్లు, డెకరేషన్, ఆమె మాటలు నన్నెంతో ఆకర్షించాయి. "మా ఆఫీసుకి వారానికి ఒకసారి కాశ్మీర్ నుండి ఒకతను డ్రెస్‌లు తీసుకొస్తాడు. నిన్న అతను వస్తే, 4 డ్రెస్‌లు తీసుకున్నాను. వాటిలో మీకు నచ్చినదొకటి తీసుకోవాలి" అంటూ బలవంతపెట్టి "అది తొడుక్కున్నప్పుడల్లా నన్ను గుర్తుచేసుకోవాలి" అంది. ఒక లైట్‌పిస్తా ఆకుపచ్చ డ్రెస్ తీసుకుని, అక్కడే కుట్టించుకున్నాను. భోజనం తర్వాత అందరం హాల్లో కూర్చుని కబుర్లు చెప్పుకున్నాము.

వాళ్ళింట్లో ఒక మూలగా ఒక సాధువు ఫొటో కనబడింది. ఎవరని అడిగాను. "ఆయన మా గురూజీ. ఆయనకు ఇక్కడ ఒక ఆశ్రమం ఉంది. మేము ప్రతి ఆదివారం వెళ్తాము. సాయంత్రం మా ఇంట్లో సత్సంగ్ జరుగుతుంది. ఆయన అమృతవచనాలు చదువుతారు, భజనలు పాడతాము" అన్నారిద్దరూ. "చాలా బాగుంది, ఆయన ఉన్నారా!" అనడిగాను. "లేరు, ఆయన అనుచరుడు ఒకాయన ఉన్నారిప్పుడు. మేము ఆయన్ను అనుసరిస్తాము. అయినా గురువు ఎప్పుడూ మనతోనే ఉంటారు కదా! లేకపోవడం ఏమిటి?" అని ప్రశ్నించింది. "నిజమే" అన్నాను. తరువాత ఆయన

గురువుపైన ఒక భజన పాడారు. *గురుపాద కమల చరణములే నాకు శరణం* అని దానర్థం. మన గురువుగారు కూడా అక్కడకు వచ్చేశారు కదా! అందుకే ఆయన 'కమల చరణము' అనే భజన పాడారనిపించింది. 'కమల్‌దండి' తినిపించారు. అంతా కమలమయం. తరువాత మేము మన పీఠం గురించి, గురువు గురించి కొద్దిగా ప్రస్థావించాను. దానికి ఆయన మమ్మల్ని వెంటనే "మిమ్మల్ని చూడగానే, ఇంతకుముందే మిమ్మల్ని చూశాననిపించింది. కొత్తగా లేదు. పైగా మీరు మాపై ఆఫీసర్ అని కూడా చూడకుడా, మీరేమనుకుంటారో కూడా ఆలోచించకుండా మిమ్మల్ని పదేపదే ఇంటికి ఆహ్వానించాలి అనిపించింది. అందుకేనేమో, మనది అంతా గురుసంప్రదాయం కదా! మనమంతా ఒకే కుటుంబం" అంటూ ఆయన చెప్తూ, విపరీతమైన ఉద్వేగంతో కళ్ళవెంట నీళ్ళు కార్చాడు.

ఇంతకీ నేను వాళ్ళింటికి నేను టీ కోసం కాదన్నమాట వెళ్ళింది. అమ్మమ్మగారు చెప్పిన ఆత్మసంబంధాలు అక్కడున్నాయన్న మాట. అందుకే ఆ connection అక్కడకు లాగిందేమో అనిపించింది. అలా వాళ్ళింటికి రెండుసార్లు వెళ్ళాము. నేను కాశ్మీర్‌లో కొన్న త్రిపురసుందరి ఫొటో కాశ్మీర్ వనిత రూపంలో ఉంది కదా! ఆ ఫొటోలోని అమ్మవారి మొహం అచ్చం బబ్లీ మొహం లాగే ఉంది. తర్వాత నేను కాశ్మీర్ వెళ్ళాను. ఆ ఫొటో చూశాక నాకు మీరట్‌లోని బబ్లీ గుర్తుకువచ్చింది. ఈవిడ ముందే నాకు మీరట్‌లో కనిపించింది అనుకున్నాను. వాళ్ళు శివభక్తులు. తరువాత ఒక వారంపాటు మీరట్‌లో ఉన్నప్పుడు, వేరే Meerut Cantt. బ్రాంచ్ మేనేజర్‌గారి భార్య సరితను తీసుకుని, ఒక చిన్న శివుని వెండి విగ్రహం కొని, బబ్లీ పనిచేసే బ్యాంక్‌కు వెళ్ళి అది బహుకరించి వచ్చాను. తను నా అడ్రస్ తీసుకుంది. ఆ బ్యాంక్‌లో అందరికీ (అందరూ కాశ్మీర్ వాళ్ళే, జమ్ము & కాశ్మీర్ బ్యాంక్) నన్ను పరిచయం చేసింది. వాళ్ళందరూ నన్ను చూసి "మీ గురించి బబ్లీ మా అందరికీ ఎంతో చెప్పింది. మిమ్మల్ని చూస్తున్నందుకు చాలా సంతోషం" అన్నారు. ఇది నా మీరట్‌లోని వృత్తాంతం.

మీరట్ నుండి బయలుదేరి 4 రోజుల ట్రైనింగ్ కోసమని చండీఘర్ వెళ్ళాము. ఎక్కడెక్కడి నుండో ఆఫీసర్లు అక్కడకు వస్తారు. కొందరు తెలిసినవాళ్ళు హైదరాబాద్ నుంచి వచ్చారు. అందరం డైనింగ్‌హాల్లో కలుసుకునేవాళ్ళం. మా బెంగాలీ స్నేహితురాలు రుణ కూడా వచ్చారు. మా ప్రక్క రూమ్‌లోనే దిగారు. ఆ ప్రక్కరూమ్‌లో బొంబాయి నుంచి వచ్చిన కేరళ అయ్యర్, ఆయన భార్య వచ్చారు. పేరు గుర్తులేదు. ఆ ప్రక్కన మావారి ఫ్రెండ్ శ్రీనివాస్‌గారు, ఆయన భార్య వచ్చారు. నలుగురు ఆడవాళ్ళం కలిశాము. ఇంక పండగే పండగ. సాధారణంగా ఒక్కొక్కరమే ఉంటాం కదా! నలుగురం కలిసి భోజనం చేయడం, కబుర్లు చెప్పుకోవడం, క్యారమ్స్ ఆడుకోవడం, సాయంత్రంపూట వాకింగ్‌కు వెళ్ళడం, 4 రోజులు ఇట్టే గడిచిపోయాయి. Mrs. అయ్యర్, మేము కలిసి ఒకరోజు రోజ్ గార్డెన్స్, రాక్ గార్డెన్స్, లేక్ గార్డెన్, ఒక పెద్ద షాపింగ్‌మాల్ అన్నీ తిరిగివచ్చాము. బాగా ఎంజాయ్ చేశాము. అన్నిటినీ వీడియో తీశాము.

నేను Mrs. శ్రీనివాస్ తెలుగులో మాట్లాడుతుంటే, మిగిలినవాళ్ళు "తెలుగు నహీం, హిందీ మేం బాత్ కరోం" అంటూ గొడవ చేసేవాళ్ళు. అక్కడినుండి శ్రీనగర్ వెళ్ళాము. బ్యాంకుల స్ట్రైక్ కారణంగా మావారు ఆడిట్‌కి వెళ్ళలేదు. వారంపాటు శ్రీనగర్‌లోనే ఖాళీగా ఉండడం, రూమ్‌లో కూర్చోవడం, మా 33 ఏళ్ళ వైవాహిక జీవితంలో ఇదే మొదటిసారి. సాయంత్రంపూట దాల్‌లేక్‌కు వాకింగ్‌కు వెళ్ళేవాళ్ళం. తరువాత శ్యామ్‌గారి పరిచయం జరిగింది. ఆయనతో కలిసి 'అనంతనాగ్‌లోని' రఘునాథ్‌మందిర్‌కు వెళ్ళాము. అది చాలా పురాతనమైనది. 'కోకర్‌నాగ్' – కోడి కాలివేళ్ళవలే 5 వైపుల నుండి కొండలపైనుండి నీళ్ళు పడతాయి. అక్కడ ఈటివి–ఉర్దూ వాళ్ళు ఇంటర్వ్యూ చేస్తుంటే, మా ఇద్దరినీ కూడా ఇంటర్వ్యూ చేశారు. ఆ ప్రదేశానికి టూరిస్ట్‌లు ఎక్కువమంది వెళ్ళరు. మరుసటి వారం 'గుల్‌మార్గ్' వెళ్ళాము. కేబుల్‌కార్‌లో పైకి వెళ్ళి, మంచుపై నడిచాము. అకస్మాత్తుగా మంచువర్షం పడితే, అక్కడ బాగా ఎంజాయ్ చేశాము.

## గురువులైన శ్రీమాతా త్రిపురసుందరిగారి మహానిర్యాణం

హేలాపురిలో 'శ్రీ బాలాత్రిపురసుందరి' పీఠ ప్రతిష్టాపన చేసిన మా గురువులైన 'శ్రీమాతా శ్రీకమలాంబిక' గర్భవాసమున జన్మించిన త్రిపురసుందరిగారు, కమలమ్మగారి తర్వాత పీఠమునకు వంశపారంపర్య గురువుగా సేవలొనర్చి, ఎందరినో ఉద్ధరించి, ఆమెకు నిర్దేశించబడిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి, మార్చి 3, 2006 శుక్రవారం (చవితి), మధ్యాహ్నం గం.1.15నిలకు ఏలూరులోని శ్రీ కమలాంబికా ముక్తిధామ్‌నందు సిద్ధిపొందారు. శ్రీకమలాంబికకు మనుమరాలిగాను, శ్రీత్రిపురసుందరికి పుత్రికగాను (చెల్లెలి కూతురు) జన్మించడం నా పూర్వజన్మల పుణ్యఫలంగా భావిస్తున్నాను. ఇవన్నీ లౌకిక సంబంధాలు మాత్రమే. కానీ గురుశిష్యులది ఆత్మసంబంధమైనది, జన్మజన్మల సంబంధమైనదని మా గురువులు చెప్పారు. లౌకిక సంబంధాలకన్నా ఆత్మసంబంధాలతోనే గురువు వద్ద సాధన చేయడంలో కొంత ప్రయోజనం ఉంటుందని నా నమ్మకం.

మా గురువులైన త్రిపురసుందరిగారిని అందరూ (బంధువులు, శిష్యులు) ఎక్కువగా పిన్ని అని పిలుస్తుంటారు. మాకు కూడా అదే అలవాటు. అందుకనే నేను వ్రాయబోయే విషయాల్లో ఆమెను పిన్నీ అని సంబోధిస్తూ రాస్తాను. గమనించ ప్రార్థన.

'శ్రీకమలాంబికగారు' డిసెంబర్ 13, 1977, మంగళవారం (చవితి)నాడు ఈ ముక్తిధామ్‌లోనే సిద్ధిపొందారు. అప్పుడు నేను ఆమెను గురువుగా స్వీకరించలేదు. అందువలన ఆమె మహానిర్యాణ స్థితి పొందినపుడు నేను దగ్గరలేను, చూడలేదు. విషయాలను గ్రహించేటటువంటి జ్ఞానశక్తి నాకు ప్రసాదించబడలేదు. దానిని నేను ఎప్పుడూ దురదృష్టంగానే భావిస్తాను. ఆమె తదనంతరం, అంటే, 1986–87సం॥లో నేను ఆమెను గురువుగా గుర్తించాను, దీక్ష తీసుకున్నాను. బహుశః దాని ఫలితమనుకుంటాను, నాకు గురువులైన త్రిపురసుందరిగారి మహానిర్యాణస్థితి (సిద్ధి) పొందినప్పుడు నేను దగ్గరుండి, కొంత సేవచేసుకుని ఆ స్థితిని అర్థంచేసుకోగలిగే జ్ఞానం,

అదృష్టం నాకు ప్రసాదించబడినదిగా భావిస్తున్నాను. గురువుల అనుగ్రహం నామీద అపారంగా ఉన్నదని నేను ఎల్లప్పుడూ భావిస్తాను, విశ్వసిస్తాను.

నేను గ్రహించినంతవరకు, ఆ స్థితిని వివరంగా వ్రాస్తాను. పిన్నిగారి పేరు త్రిపురసుందరి. ఆమె పుట్టడమే 2 కోరలతోను, నల్లని శరీరంతోను పుట్టారు. 'కాళికాంశ' అని ఆమె తల్లి కమలమ్మగారు చెప్తుండేవారు. థియోసాఫికల్ ఎలిమెంటరీ స్కూల్లో ఉపాధ్యాయినిగా పనిచేసి, రిటైర్ అయ్యారు. కమలమ్మగారిని ఆమె శిష్యురాలు ఒకామె "మీ బిడ్డల భవిష్యత్ ఏమిటి?" అని అడిగితే, "ఒక పిల్లను తమ్ముడికిచ్చి వివాహం చేస్తాను, ఒక బిడ్డ లక్షాధికారి ఇంటి కోడలు అవుతుంది. మరొక ఆమె (పిన్ని) ఈ పీఠంయొక్క బాధ్యతను స్వీకరిస్తుంది" అని భవిష్యత్ గురించి వివరించారు. ఆవిధంగానే పిన్నిగారు వివాహం చేసుకోలేదు. ఆజన్మబ్రహ్మచారిణిగా ఉంటూ, పీఠం యొక్క బాధ్యతలను స్వీకరిస్తూ, తను సేవ చేసుకుంటూ, అక్కడికి వచ్చిన సేవలందిస్తూ, అందరితో 'పిన్నీ' అని ఆప్యాయంగా పిలిపించుకుంటూ, అందరినీ తల్లిలాగా దగ్గరకు తీసుకుని, చిన్నపిల్లలతో చిన్నపిల్లలాగా, పెద్దవాళ్ళతో పెద్దవాళ్ళలాగా మెలుగుతూ, ఒక సామాన్య స్త్రీగా కనిపిస్తూ, ఎందరికో జ్ఞానబోధలు చేస్తూ, నిరాడంబరంగా జీవించి సిద్ధిపొందారు. కమలమ్మగారికి కపాలమోక్షం జరగటం వలన ఆమె అవతార స్త్రీ అని, సాక్షాత్తు అమ్మవారేనని గ్రహించగలిగాము. వారి యొక్క మరణస్థితిని బట్టి మనం కొన్ని విషయాలను అవగాహన చేసుకొనవచ్చును. అలాగే పిన్నిగారి నిర్యాణంలో నేను తెలుసుకున్న, చూసిన, అనుభవించిన కొన్ని విశేషముల గూర్చి వ్రాస్తున్నాను. దీన్నిబట్టి ఆమె జీవిత ఉద్దేశ్యమేమిటో, ఆమె ఎవరో కొంతవరకు పాఠకులు అర్థంచేసుకునే అవకాశం ఉంటుంది.

నేను జైపూర్‌లో ఉండగానే పిన్నికి సీరియస్‌గా ఉందని, వెంటనే రమ్మని నాకు ఫోన్ వచ్చింది. నేను ఢిల్లీ వచ్చి నండూరి శాంతగారితోపాటు ఏలూరు వచ్చాను. ఆ ముందురోజే పిన్నిని హాస్పిటల్ నుండి ఇంటికి తీసుకు వచ్చేశారు. నన్ను గుర్తుపట్టి "నన్నెప్పుడు తీసుకెళ్ళిపోతావో చెప్పు? నేనింక ఉండలేను. బాధ భరించలేకపోతున్నాను'' అంటూ ఏడ్చింది. అలా రెండుమూడుసార్లు అడిగాక నేను "నిజంగా నీకు వెళ్ళిపోవాలని ఉందా?" అనడిగాను. నన్ను చూస్తూ తల తిప్పేసుకుంది, కానీ సమాధానం చెప్పలేదు. "మరెందుకు వెళ్ళిపోతానని గొడవ చేస్తావు" అనడిగాను. ఆహారం నోట్లోకి పోవడం లేదు. నేను మజ్జిగ అన్నం బాగా మెత్తగా చేసి, ఉప్పువేసి 2, 3 చెంచాలు నోట్లో పోసేదాన్ని. 4, 5 రోజులపాటు అలా జరిగింది. తరువాత అది కూడా తినలేదు. పగలంతా మగతగా ఉండేది. రాత్రిళ్ళు అంత శక్తి ఎక్కడనుండి వచ్చేదో తెలియదు. నొప్పులకు ఓర్చుకోలేక పెద్దపెద్దగా అరుస్తుండేది. అక్కడే పడుకుని ఉన్న మా అమ్మగారికి, పిన్నినే అంటిపెట్టుకుని ఉన్న కమలకు నిద్ర కూడా ఉండేది కాదు. నేను కొంతమందికి డ్యూటీలు వేస్తుండేదాన్ని. అలాగే అందరూ అవకాశం ఉన్నంతవరకూ వచ్చి సేవ చేసుకునేవారు. పిన్ని చనిపోయేవరకు మా చిన్న తమ్ముడు దత్తు, భార్య కళ్యాణి అంటిపెట్టుకుని (తల్లి లేక గురువుల) ఋణం తీర్చుకున్నారు.

నేను అక్కడికి వెళ్ళాక, రోజుమొత్తంలో ఏదో ఒక సమయంలో ఒక నిమిషం కూర్చోబెట్టమని గొడవచేసేది. అలాగే కూర్చోబెట్టేవాళ్ళం. నేను రోజూ ధ్యానమందిరంలో స్నానం, భోజనం అవ్వగానే పిన్ని దగ్గర రాత్రి గం.10ల వరకు కూర్చుని వచ్చేదాన్ని. తర్వాత ఉదయమే లేచి వెళ్ళి, రాత్రివరకూ అక్కడే ఉండేదాన్ని. అన్ని ఊళ్ళనుంచి పిన్నిని చూడటానికి వస్తుండేవారు. కొందరిని గుర్తుపట్టేది. ఇలా ఒక వారం గడిచాక, పిన్ని బాధకంటే అక్కడ సేవ చేసేవారి పరిస్థితిని చూస్తే నాకు చెప్పలేనంత దిగులు కలిగేది. రాత్రిళ్ళు నిద్రపట్టేది కాదు. సేవ చేసుకుని, వారికి ఋణం తీరితే తప్ప, గురువులు నిష్క్రమించరేమో అన్పించి, 4రోజులపాటు ఒక్కపూటే భోజనం, తర్వాత మరికొన్ని దీక్షలు లాంటివి తీసుకుని పాటించాను. ముఖ్యంగా కమల, దత్తుల కోసం. అదేరోజు (దీక్ష 2వ రోజే) పిన్నిని కమల లేపి కూర్చోబెట్టడంలో ఒక కాలు విరిగిపోయింది. దానికేమీ చికిత్స కూడా లేదు. అలాగే మత్తు ఇంజెక్షన్స్ ఇచ్చి పడుకోబెట్టేవాళ్ళం.

ఈ 4, 5 రోజుల్లోనే 'రామకోటి'లోని ఒక స్వామీజీ 1,116 మందితో కోటి కుంకుమార్చన చేయించారు. సరిగ్గా మన ముక్తిధామ్‌నకు ఎదురుగా కూర్చొని చేసేవారు. ఆయన పులిపాకలో ఒక అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కోసం 40 రోజులు దీక్షగా ఇవన్నీ చేయిస్తున్నారట. "కమలగర్భాయై నమః" అంటూ మంత్రాన్ని పెద్దగా మైక్‌లో చెప్పేవారు. చాలా ఆశ్చర్యం వేసింది. ఇప్పటివరకూ ఆ మంత్రం నేనెప్పుడూ వినలేదు. కమలమ్మగారి గర్భంలోనుండి పుట్టిన ఈమె కోసమేనా ఈ మంత్రం? ఎంత మంది చేశారో తెలియదు. ఎవరికైతే గురువుల ఋణం తీర్చుకునే అవకాశం వచ్చిందో వారందరూ బహుశః ఈ మంత్రం చేసి ఉంటారనిపించి, అది విన్న నేను కూడా పీఠంలోని వారందరినీ ఆ నామం జపించమని చెప్పాను. దానితో శిష్యులందరూ ఆ మంత్రాన్ని జపించడంతో వారి వంతు గురువుల ఋణం తీర్పించబడి ఉంటుందనిపించింది. శిష్యుల ఋణం తీరితే గాని, గురువులు వెళ్ళరేమోననే కదా నా ఉద్దేశ్యం! నేను దీక్ష మొదలుపెట్టాను.

కానీ ఎవరెవరో, ఎక్కడెక్కడి నుంచో విదేశాల్లో ఉన్నవాళ్ళచేత, పీఠానికి ఈ జన్మలోకాకపోయినా, ఎన్ని జన్మల క్రితం నుండి సంబంధాలు ఉన్నారో (గురుశిష్యుల సంబంధాలు జన్మాంతరములే కానీ, ఇప్పటివి కాదు కదా) వారందరిచేత ఈ నామం జపింపచేయబడింది. కమలమ్మగారు నా దీక్షకు (4 రోజుల్లో) ఇచ్చిన సమాధానం ఇది. ఇది జరిగిపోయి కూడా వారం రోజులైంది. ఫలితమేమీ కనబడలేదు. ఒకరోజు పిన్నిని ముందు గదిలో ఉన్న మరొక చెక్క మంచంపై పడుకోబెట్టాము. తరువాత రోజునుండి ఆమె పూర్తిగా మగతగా అంటే కోమాలోకి వెళ్ళిపోయింది. స్పృహలేదు, ధారకం లేదు. సేవ చేసుకునే వాళ్ళకు కొంత విశ్రాంతి దొరికిందని నా కోరిక. ఈలోపు చాలా రోజుల క్రితం నుండి మధ్యాహ్నంపూట అక్కడ ఒక 'యోగి ఆత్మకథ' పుస్తకాన్ని రోజూ పారాయణం చేసేవారు. కొన్నాళ్ళు పిన్నికూడా విన్నది. ఒకరోజు (బుధవారం) మధ్యాహ్నం గం.3.00లకు పీఠంలో నేను, కళ్యాణీ, బుజ్జి ఉన్నాము. నేను బుజ్జిని ఆ పుస్తకంలోని ఏదో ఒక పేజిని తీసి చదవమన్నాను. పరమగురువులైన బాబాజీ గారికి సంబంధించిన పేజీలు వస్తే కొన్ని చదివింది. అప్పుడు ఆ పుస్తకాన్ని చేత్తో పట్టుకుని నేను ఇలా అన్నాను– "బాబాజీగారు

ఇంకా హిమాలయాల్లోనే సజీవంగా ఉన్నారని అందులో వ్రాసి ఉంది కదా! ఇక్కడ ఒక యోగిని ఈ పరిస్థితుల్లో ఉంది కదా, వారే వచ్చి ఈమె సంగతేమిటో, ఇలా ఇంకెన్నాళ్ళు గడుస్తుందో నాకు చెప్పాలి. డాక్టర్లు కూడా చెప్పలేకపోతున్నారు. నా దీక్షలు ముందుకు వెళ్తున్నాయో, వెనక్కు వెళ్తున్నాయో కూడా తెలీని అయోమయంలో ఉన్నాను. ఈమె కూడా బ్రహ్మచారిణి, యోగిని, బాలా త్రిపురసుందరీ పీఠమును అంటిపెట్టుకుని, సేవ చేసుకున్న గురుస్థానంలో ఉన్న సిద్ధిణి. అలాంటి ఈమెను బాబాజీగారు ఎందుకు వచ్చి చూడరు? నాకెందుకు ఈ పరిస్థితి గురించి చెప్పరు? 24 గం॥ల్లో వారు వచ్చి తప్పక చెప్పి తీరాలి" అని పట్టుబట్టాను.

కళ్యాణి "వారొస్తే మాత్రం మనం ఎలా గుర్తుపడతాము?" అనడిగింది. "మనకు తెలిసేలాగా వచ్చి, మనకు కావలసిన సమాధానం ఇస్తారులే" అన్నాను. ఈలోపు బుజ్జిని కైకలూరు వెళ్ళమన్నాను. బస్టాండ్ నుండి నాకు ఫోన్ చేసి "అక్కయ్యగారూ, మరి 24 గం॥ల్లో బాబాజీ గారిని రమ్మని పిలిచారు కదా, నన్నేమో వెళ్ళిపొమ్మన్నారు. మరి ఎలాగ? ఈరోజు రాత్రి ఆయన రాకుండా చూసే బాధ్యత మీదే" అన్నది. "సరే" అన్నాను. మర్నాడు ఉదయం (గురువారం) ఎప్పటినుంచో పీఠంలో శిష్యులైన శకుంతలగారి కుమారుడు సూర్యం (ఢిల్లీ) తన కొడుకు ఒడుగు ఏలూర్లో (పిన్నికోసం) పెట్టుకున్నారు. పీఠంలో ముందురోజే పెళ్ళికొడుకుని చేసి, పిన్నిచేయి తలమీద పెట్టించాను. ఆశీర్వచనం అందింది. వాళ్ళింట్లో జరుపుకుంటున్న ఒడుగుకు వెళ్ళి, భోజనం చేసి ఇంటికి వచ్చాము. మధ్యాహ్నం 3 గంటలైంది.

కళ్యాణి పీఠంలోని వంటింట్లో టీ పెడుతోంది. నేను కళ్యాణితో "ఏమిటే? 24 గం॥లు అయిపోతోంది. బాబాజీగారు ఇంకా రాలేదు. నేను ఎదురుచూస్తున్నాను" అన్నాను. దానికి కళ్యాణి నవ్వి, "మీరు పంపించిన కబురు అందటానికి (హిమాలయాలకు) టైమ్ పడుతుంది కదండీ" అన్నది. అలా ఒకరోజు గడిచింది. "నా లక్కీ నెంబర్ 4 కదా, 4 రోజులు చూస్తాను" అంటూ హాల్లోకి వచ్చాను. ఈ ఉపనయనానికి వచ్చిన వాళ్ళల్లో చాలామంది పిన్నిని, పీఠాన్ని దర్శించటానికి వచ్చారు. ఈలోపు శకుంతల తమ్ముడు, ఆమె పెద్దకొడుకు ఇద్దరూ నా దగ్గరకు వచ్చి, "బాబాజీగారు ఏం చేశారు? సమాధిలోకి వెళ్ళి 3 రోజుల వరకు లేవలేదు" అన్నారు. "ఏమిటి?" అన్నాను. "అదే,బాబాగారు, మహాత్ములందరూ అంతేకదా! సమాధిలో ఉంటారు, మళ్ళీ సజీవంగా లేస్తారు" అన్నారు. బాబా పేరు వినబడగానే బుజ్జి, కళ్యాణి వంటింట్లోనుండి బయటకు వచ్చారు. ఆయన చెప్తున్నాడు. మేము వింటున్నాము. "ఆయన్ని బాబాజీగారుగా గుర్తుపట్టాము. ఆవిడకు ఇంకా శిష్యుల మీద మమకారం తగ్గలేదు. ఎలా వెళ్తుంది?" అన్నారు. అప్పుడు నేను "మరి నేను ఇలా ఎన్ని రోజులు వేచి ఉండాలి? ఆమె పరిస్థితి ఇలా ఉంది. నేను వెళ్తే రావడానికి చాలా సమయం పడుతుంది కదా? ఇంకా ఎన్ని రోజులు చూడాలి?" అని మొదటి ఆయన్ని ప్రశ్నించాను. ఆయన అమ్మవారి ఎదురుగా కూర్చుని "ఇంకొక 4 రోజులు చూడు" అన్నారు. "తెలుస్తుందా" అన్నాను. "ఆ౦... తెలుస్తుంది" అన్నారు. "అయితే సరే" అన్నాను. "అక్కయ్యా అని పిలిచాను. ఆ మగతలో కూడా నా చెయ్యి ఎంత గట్టిగా పట్టుకుందో,

చేతిలో ఎంత శక్తి ఉందో తెలుసా?" అన్నారు. "ఆహాఁ అలాగా" అన్నాను.

ఈలోపు శకుంతల చిన్నకొడుకు శ్రీనివాస్ నా ప్రక్కన కూర్చుని "అక్కా! నువ్వు నా కోరిక తీర్చాలి" అన్నాడు. "ఏమిటి?" అన్నాను. "మనం పిన్నికోసం ఏం చేసి ఋణం తీర్చుకోగలం? అందుకని 40 రోజుల్లో ఒక లక్షసార్లు లలిత చదివి అమ్మవారికి ధారపోయాలి. దాన్ని మాలాంటి వాళ్ళందరం కలిసి చేసినా, నువ్వు దాన్ని తీసుకుని పిన్నికి ధారపోయాలి. నువ్వుతప్ప ఎవరు చేస్తారు?" అన్నాడు. సరేనన్నాను. 13 రోజుల్లో లక్ష చేయవచ్చని మొత్తం శిష్యులందరినీ చెయ్యమని అక్కడే చెప్పాను, అమ్మవారి పక్కనే కూర్చుని. అప్పుడు దత్తు "ఇప్పుడు ఇవన్నీ దేనికోసం చేయడం?" అనడిగాడు. నేను "పిన్నికోసం, సంకల్పం చేసేది, చేయించేది, అందుకునేది ఆమే. ఇది ఆమె సంకల్పం. అందుకే వీడికి ఇలా చేయాలని బుద్ధి పుట్టింది. చేయడమే" అన్నాను. ఆ 'బాబాజీ' గారిలా వచ్చినాయన ప్రక్కనే పద్మాసనంలో కూర్చుని నావైపు తిరిగి నవ్వుతున్నారు. కాసేపటికి ఆయన నా దగ్గరకు వచ్చి "ఈ మహాసంకల్పమునకు నా వంతుగా మొదటగా ఈ డబ్బు ఇస్తున్నాను" అంటూ 2 వంద రూపాయల నోట్లు, ఒకటి ఐదు రూపాయలు, ఒకటి రెండు రూపాయల బిళ్ళలు ఇచ్చారు. కలిపితే 4 అయ్యాయి. "దీనికి ఖర్చుపెట్టు అని నా చేతిలో పెట్టి" నమస్కరించి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళాక పుస్తకం తీసి చూశాము. "బాబాజీగారు ఒక్కరే రారు, లాహిరి మహాశయుల వంటి శిష్యులతోనే వస్తారు" అని ఆరోజు చదివిన దానిలో ఉంది. పుస్తకంలో వారిద్దరి ఫొటోలు, వచ్చిన వాళ్ళిద్దరు ఒకే పోలికలో ఉన్నారు. బాబాజీగారి ఎత్తు, రంగు, కళ్ళు; లాహిరిగారి మీసాలు, పొడవైన విగ్రహం, కళ్ళు అవే పోలికలు. తర్వాత వచ్చినది వారే అని నూరుశాతం నిర్ధారించుకుని తృప్తితో, ధైర్యంతో ఉన్నాము.

మరుసటిరోజు (శుక్రవారం) నుండి అందరూ లలిత పారాయణలు ప్రారంభించారు (నేను కూడా ఈ విషయాన్ని శుక్రవారమే వ్రాస్తున్నాను). నేను ధ్యానమందిరంలో పడుకుని ఉదయమే లేచాను. వెంటనే అక్కడే కూర్చుని అమ్మమ్మగారి ఫొటో చూస్తూ మనసులోనే పారాయణ చేసేశాను. తర్వాత "ఈ 13 రోజులు ఎక్కడెక్కడ, ఎవరెవరు నియమాలు చేస్తున్నారో అవన్నీ నేను పిన్నికోసం తీసేసుకుంటున్నాను. ఈ 13 రోజులు వాళ్ళవి కావు. పిన్నికే చెందుతాయి అని రెండు చేతులతో అందుకుని వాటిని పిన్నికి ధారపోస్తున్నాను. ఈరోజుతో నియమం మొదలుపెట్టడమూ, పూర్తిచేయడమూ కూడా అయిపోయిందని ఎందుకో అనిపించింది. అందుకే ఇలా చేశాను" అని అక్కడ ఉన్నవారితో చెప్పాను. అంతా ఒక్కసారిగా ఆశ్చర్యపడ్డారు.

మాటలమధ్యలో భోజనం గురించి వచ్చి, "నేను బొబ్బట్లు బాగా చేసేదాన్ని. అమ్మవారికి నైవేద్యం కోసం స్టౌ మీద సెనగపప్పు పెడితేచాలు. మనిషి వచ్చి కూర్చుని, నేను వడ్డించే దాకా ఉండి తిని వెళ్తుంది. నైవేద్యం వరకూ అక్కర్లేదు" అని "ఈరోజు శుక్రవారం. బొబ్బట్లు చేసి నైవేద్యం పెడతాను. పైగా నియమం కూడా చేశాము కదా!" అన్నాను. మధ్యాహ్నం 12 గంటలైంది. నేను, నరసింహశాస్త్రి భార్య శైలజ కలిసి బొబ్బట్లు చేస్తున్నాము. సగం పూర్తికాగానే, కళ్యాణి వచ్చి, "వదినగారూ! అత్తయ్యగారు మిమ్మల్ని పిలుస్తున్నారు. పిన్నిగారి పరిస్థితి బాగోలేదు"

అంది. "సరే, పద. మా తమ్ముడికి ఫోన్ చేయి" అని చెప్పి పీఠానికి పరుగెత్తాను. చినుకులు పడుతున్నాయి. "ఇప్పుడేంటి ఇలాగ, అకాలవర్షంలాగా ఉంది. కారుచీకటిగా ఉంది" అనుకుంటూ పిన్నివద్దకు వెళ్ళాను. నేను దత్తుతో పిన్ని నోట్లో నీళ్ళు పోయించి, ఆ వండిన బొబ్బట్లు తెచ్చి పీఠంలో నైవేద్యం పెట్టించాను. శ్వాస చాలా నెమ్మదిగా ఉంది. ఆగి ఆగి తీసుకుంటోంది. వారం రోజులనుంచి కళ్ళు మూతలుపడే ఉన్నాయి. అందరినీ లలిత చేయమన్నాను. డాక్టర్ కోసం కబురుపెడితే, ఆమె వచ్చి ఇంక ఇంజక్షన్ అనవసరమన్నారు. పొట్టమీద చెయ్యిపెట్టి చూశాను. ఊపిరి తీస్తున్న దాఖలాలు లేవు. అనాహతచక్రం దగ్గర చేయిపెడితే, అక్కడా ఏమీ కదలిక లేదు. కాళ్ళు రెండూ సవరించాను. స్పృహ లేదు. నెమ్మదిగా తలమీద చెయ్యిపెట్టి లలిత చదువుతూ, ఒళ్ళంతా క్రింద నుండి పై వరకూ చేత్తో వ్రాస్తున్నాను. ప్రాణం ఒక చక్రం నుండి మరొక చక్రం ద్వారా ఎలా ప్రయాణిస్తోందో చూస్తున్నాను. ఒక్కొక్కచోటే కదలిక ఆగిపోతోంది..... అందరూ ప్రార్థనలు చేస్తున్నారు..... ఊపిరి ఆగిపోయింది..... ఎడతెరిపి లేకుండా కుంభవృష్టి మొదలైంది. అమ్మమ్మగారి నిర్యాణంలో ఉల్కలు విపరీతంగా రాలాయట. ఇంకా ప్రాణం ఉందేమోనని నా ఆలోచన. డాక్టర్ వచ్చేదాకా నిర్ధారణ చేయొద్దు అన్నాను. డాక్టర్ వచ్చి చెప్పారు. అందరికీ కబురుపెట్టాము. ఆరోజు మార్చి 3, 2006 శుక్రవారం మధ్యాహ్నం గం.1.30 ని॥లు, తిథి చవితి (అమ్మమ్మగారిది కూడా అదే తిథి).

కొంతమంది పెద్దలు బయటపడుకోబెట్టమన్నారు. సరేనని, షామియానా కోసం పరుగెత్తారు. ఆరోజు ఎక్కడా షామియానా దొరకలేదు. మార్చురీ బాక్స్ తెప్పించి, బయటపెట్టించాను. కానీ, ఈమెను బయట వర్షంలో ఎలా వదిలేస్తాము. మేమందరం నిలబడటానికి పైన కప్పు లేదు. వచ్చినవాడు "ఏదో ఒకటి చెప్పండి, వెళ్ళిపోవాలి. ముందు గది చిన్నది. అందులో బాక్స్ పట్టదు. ఆ పీఠమున్న గదిలో మాత్రమే పడుతుంది. అక్కడ పెట్టమంటారా?" అని తొందరపెడుతున్నాడు. సరేనన్నాను. దాన్ని ఎన్ని రకాలుగా తిప్పినా పట్టట్లేదు. త్రిపురం పిన్ని పడుకున్న మంచం ఏ స్థానంలో ఉందో, అక్కడే, అదే దిక్కులో సరిగ్గా సరిపోయింది. మొత్తంమీద ఆ పీఠమున్న గదిలో తను పడుకునే స్థానంలోనే (అమ్మమ్మగారు కూడా అదే స్థానంలో, అలాగే పడుకుని ముక్తిపొందారు) బాక్స్‌లో పడుకోబెట్టాము. (పిన్నిగారు "నన్ను బయటకు పంపకండి. ఇంట్లోనే ఉంచండి. నా స్థానం ఇదే" అని ఎప్పుడూ చెప్తుండేవారు) కానీ పెద్దలు చెప్పినమాటలు వినాలి కదా అని వేరేలాగా చేద్దామని అనుకున్నాను. కానీ, ఆమె సంకల్పం మాత్రమే నెరవేరుతుందని మరోసారి రుజువైంది.

చూడటానికి వచ్చిన వాళ్ళందరితో ఈ విషయాల గురించి మాట్లాడుకుంటున్నాము. ఆ రాత్రి, ఒక సంవత్సరం నుండి పీఠానికి వస్తున్న ఉదయకుమారి అనే అవిడ ఈ విషయాలన్నీ విన్నాక అందరి ఎదురుగా, "ఏమండీ! నిన్న మిమ్మల్ని నేనడిగిన ప్రశ్నకు సమాధానం దొరికింది కదా!" అన్నారు. "ఏమిటండీ?" అన్నాను. "మనుషులు పోయేముందు యోగులు శరీరం దాల్చి నిజంగా వస్తారా అనడిగాను. ఆఁ ఎందుకు రారు, రావచ్చని అన్నారు" అన్నారు. అప్పుడు

పని హడావిడిలో ఉండి సమాధానం ఇచ్చింది కూడా నాకు గుర్తులేదు. ఆవిడ “ఈ సంవత్సరం దసరా మొదటిరోజున పిన్నిగారు ముందు గదిలో మంచంపై పడుకున్నారు. నేను బొట్టు పెట్టించుకుందామని వెళ్ళాను. అప్పుడు పిన్నిగారు ‘నన్ను తీసుకెళ్ళడానికి హిమాలయాలనుండి యోగులు వస్తారు. తెలుసా? వాళ్ళు రానిదే నేను వెళ్ళలేను. వాళ్ళు వచ్చి నన్ను తీసుకెళ్ళాలి. అప్పుడే నాకు మరణం వస్తుంది” అని పిన్నిగారు నాతో స్వయంగా చెప్పారు” అన్నారు. ఆ విషయం మరెవరికీ తెలియదు. ఆ విధంగా యోగుల్ని పిలిస్తే, వారు సశరీరంగా వచ్చి తీసుకెళ్తారని నాకు తెలియదు. అలా వారు నాచేత పిలిపించబడ్డారు. వారే స్వయంగా వచ్చి (మరుసటిరోజు (శనివారం) కూడా వీరిద్దరూ ఏలూరులోనే ఉన్నారు) పిన్నిని తీసుకెళ్ళారు. పిన్ని భౌతికకాయం ఉన్న 24 గంటలూ లలిత, విష్ణుసహస్రనామ పారాయణలు, భగవద్గీత, నారాయణ కవచం, గురుమంత్ర జపాలు ఒకరి తర్వాత ఒకరు నిర్విరామంగా చేస్తూనే ఉన్నారు. కార్యక్రమాలన్నీ ఎంతో శ్రద్ధగా, భక్తిభావంతో శిష్యులందరూ కలిసి ఆచరించారు.

మరొక ముఖ్యవిషయం, పిన్ని చాలా ఏళ్ళు కార్తీకమాసం కాశీలో గడిపేది. పిన్నికి కాశీ అంటే ప్రాణం. అక్కడే మరణించాలని కోరిక. ఎందుకంటే, తన ప్రాణం విశ్వేశ్వరుడు ఉన్న స్థలం కదా అని ఇప్పుడనిపిస్తోంది. అందుకేనేమో, ఎప్పుడూ అక్కడకు వెళ్ళిపోతాను, అక్కడే పోతాను అనేది. ఈ వార్తవిని పీఠంలోని శిష్యులు కొందరు కాశీకి వెళ్ళి, శనివారం ఉదయం ఏలూరుకు వచ్చేశారు. కాశీ నుండి గంగను తెచ్చారు. కాశీలో ఉన్న హైమావతి అనే శిష్యురాలికి కలలో, నేను హడావిడిగా ఎక్కడికో వెళ్తున్నానట. పిన్ని గట్టిగా నన్ను గట్టిగా కేకలేస్తోందిట. “నా పని అయిపోయింది. నన్ను ఇంక తీసుకెళ్ళిపొమ్మంటే, అలా వినిపించు కోకుండా రత్నం అలా వెళ్ళిపోతోందే, దాన్ని పిలు” అని గట్టిగా అరుస్తోందిట. “నువ్వు కాశీ నుండి వచ్చేటప్పటికి నేనుండనే హైమాలు” అని తను కాశీకి వెళ్ళేముందే చెప్పిందిట. అలాగే జరిగింది.

మరొక శిష్యుడు, సీతాపతిగారికి శుక్రవారం ఉదయం (10–11 గంటల మధ్యలో) రైల్లో పడుకుని ఉండగా ఒక కల వచ్చిందట. అందులో, నేను “సీతాపతిగారూ, పిన్ని మానససరోవరంలో స్నానం చేయించమంటోంది, ఆ సంగతేదో చూడండి” అంటున్నానట. ఈలోపుగా నేనూ, మావారు, బుజ్జి, దత్తారావు, సీతాపతిగారు పిన్నిని మానససరోవరం (గంగ)లో అటు కొందరు, ఇటు కొందరు పట్టుకుని నీళ్ళలో ముంచి, ఉయ్యాల ఊపుతున్నట్లుగా స్నానం చేయిస్తున్నాము. తరువాత పిన్ని గట్టుమీద నిలబడి ఉంది పూర్తి ఆరోగ్యంతో ఉన్నట్లుగా. “సీతాపతీ, తినడానికి ఏదైనా పెట్టు” అనడిగింది. టిఫిన్ పెట్టగానే, తిని వెళ్ళిపోయింది. మెలకువ వచ్చి చూస్తే రైలు ఆగి ఉంది. ఆయన ఎయిర్‌పోర్ట్‌కు వెళ్ళేటప్పటికి, పిన్నిగారు సిద్ధిపొందారని ఫోన్ వచ్చింది. ఆయన వస్తూ, వస్తూ మానససరోవరంలోని గంగను ఒక బాటిల్‌లో తీసుకువచ్చారు. చివరికి ఆమె కోరిక ప్రకారమే, గంగతో ఆమెకు అభిషేకం చేయించాము.

3 రోజుల శుద్ధి తర్వాత 4వరోజు ఆరాధనోత్సవం జరిపాము. ఆరోజున నేను అందరి సమక్షంలో ఉపన్యసించాను. అదేరోజు హైదరాబాద్ నుండి నారాయణమూర్తిగారు వచ్చారు.

పిన్ని, అమ్మ, ఆయన చిన్నప్పటినుండి కలిసి పెరిగారు. ఆయన్ని అన్నయ్యా అని పిలుస్తుండేవారు. ఆయనని పిన్నిగురించి కొన్ని విషయాలు మాట్లాడమని అడిగాను. అప్పుడు ఆయన, "ఇప్పుడు రత్నం చెప్పిన విషయాలన్నీ శ్రద్ధగా విన్నాను. నాకు తెలిసినది చెప్తాను. పిన్ని చాలా చిన్నపిల్ల (5-10 సం॥లు)గా ఉన్నప్పుడే 'అన్నయ్యా, నాకు అమ్మవారు కలలో కన్పించి, హిమాలయాలకు తీసుకువెళ్ళింది. అక్కడే ఏవేవో గుళ్ళున్నాయి. అక్కడ అన్ని ప్రదేశాలకు నన్ను త్రిప్పి తీసుకువచ్చింది' అని చెప్పేది. సుమారు 45-50 సం॥లు వచ్చాక పిన్ని శిష్యులతో కేదార్‌నాథ్, బద్రీనాథ్ యాత్రలు చేసింది. అక్కడి గౌరీకుండ్ నుండి నాకు ఒక ఉత్తరం రాసింది. అందులో, 'అన్నయ్యా, ఈ హిమాలయాలు ఎంత బాగున్నాయో, నన్ను నేను మరిచిపోతున్నాను' అని రాసి ఉంది. అది చదివి నేను, ఇవన్నీ నువ్వు ఎప్పుడో చిన్నప్పుడే (కలలో) చూశావు కదా, ఇప్పుడు ఇలలో చూసి ఆనందపడుతున్నావా అని అనుకున్నాను. కాబట్టి ఆ హిమాలయాలే ఆమె స్వస్థలం. అందుకే ఆ యోగులందరూ వచ్చి ఆమెను అక్కడికే తీసుకెళ్ళారు" అని కన్నీళ్ళు కారుస్తూ చెప్పారు.

ఇదంతా వ్రాస్తుంటే నాకు ఇలా అనిపించింది – హిమాలయాల నుండి యోగులైతే శరీరంగా తనను తీసుకువెళ్ళడానికి వచ్చారు, తనని కూడా హిమాలయాలంటే ప్రాణం. కానీ ఎక్కడికి తీసుకెళ్ళారో మనకు తెలియదు. దీని గురించి అప్పుడు నేను ఆలోచించలేదు. కానీ ఇప్పుడు ఆలోచిస్తుంటే, మార్చి 3న పిన్నిగారు పరమపదించారు. 10న నేను ఏలూరు నుండి వచ్చేశాను. ఏప్రిల్ 4న కాశ్మీర్‌కు వచ్చాను. ఏప్రిల్ 16నాటికి సిద్ధి పొంది సుమారు 40-45 రోజులు కావచ్చును. ఇప్పుడు, కాశ్మీర్‌లో ఆదిశంకరులు తపస్సు చేసిన గుడిలో కూర్చుని ధ్యానం చేస్తుండగా, అక్కడ వేసి ఉన్న మంచంపై కూర్చుని దర్శనమిచ్చి, ఇక్కడున్నానని చెప్పింది. ఇది ఈశ్వరుని గుడి. ఆ త్రిపురసుందరి ఇక్కడకు వచ్చి చేరినదన్నమాట. తనకు కాశీ అంటే ఇష్టం కదా! అక్కడ విశ్వేశ్వరుని సన్నిధికి చేరవచ్చును కదా! కానీ అలా జరగలేదు. ఎందుకంటే, ఆమె హిమాలయాల్లోనే ఉన్నానని మనకు ఋజువు కావాలి కదా! "కాశ్మీర్‌లో ఉన్న మంచుపర్వతాలు కూడా హిమాలయాలేనా?" అని హోటల్ యజమానిని అడిగితే, ఆయన "అవును, వీటిని zaber wan ranges అని అంటార"ని చెప్పారు. హమ్మయ్య అనుకున్నాను. అందుకే నేను ఇక్కడికి వచ్చి, నెలరోజులు ఉండాల్సి వచ్చిందన్నమాట. ఈ హిమాలయాలను రోజూ చూస్తూ, ముఖ్యంగా పిన్నిఉన్న స్థలంలో ఉండటం ఎంత యోగం? అదీకాకుండా, మా రూమ్‌నుంచి చూస్తే ఎత్తైన కొండపై శంకరాచార్య మందిర శిఖరము కనిపిస్తూ ఉంటుంది. ఆమె దేవత కనుక దేవభూమిలో ఉంది. ఏలూరులో పిన్ని కాళ్ళకు, ఇక్కడ మందిర శిఖరానికి ప్రత్యక్షంగా నమస్కారం చేసుకునే అదృష్టం కలిగించిన ఆ శ్రీమాతకు నేనేమి సేవ చేసుకుని కృతజ్ఞత తెలుపుకోగలను? ఏదిఏమైనా పిన్ని నా పక్కనే ఉందన్న భావనతో తెలియని ఆత్మానందం కలుగుతోంది.

**17.06.2006**

**ఢిల్లీ, వసంత్‌కుంజ్ గెస్ట్‌హౌస్**

మా కాశ్మీర్, బద్రీనాథ్ యాత్రల గురించి శిష్యులందరూ డైరీలో రాసుకున్నారు. అక్కడి

అనుభవాలు, సుందరదృశ్యాల గురించి స్వయంగా వాళ్ళ మనసుతో రాసుకున్నారు. సీతాపతిగారి అబ్బాయి బాబీ నన్ను యాత్రావిశేషాలు రాయలేదని అడిగాడు. నేను బుజ్జిని విజయవాడ వెళ్ళినప్పుడు తను రాసినది వినిపించమని చెప్పాను. బుజ్జి చెప్పింది విన్నాక, చాలా సంతోషంతో నాకు ఫోన్ చేసి “ఆంటీ! గురువులు దగ్గరుండి చూపించే విషయాలు తప్ప, మామూలుగా మేము వెళ్ళి చూసే విషయాలు కావు అవి. మీరు శిష్యులను అనుగ్రహించి, అనుభవింప చేశారు. మీరు ఇదివరకు డైరీలో రాసిన కొన్ని విశేషాలను చదివాను. మీ శైలి మనసుకు హత్తుకున్నట్టుగా, మేమే స్వయంగా అనుభవిస్తున్నట్లుగా అనిపిస్తాయి. అందుకని ఈ యాత్రా విశేషాలను కూడా మీ దస్తూరితో, మీ శైలిలో రాస్తే చాలా బాగుంటుంది, అది చదవాలనిపిస్తోంది. సమయం దొరికినప్పుడు రాయండి” అంటూ సలహా ఇచ్చాడు.

వీళ్ళందరూ యాత్రకు రాకముందు నేను కొన్ని విశేషాలను రాశాను. కానీ, ఈ విషయాలు అందరూ అనుభవించారు కదా అని రాయలేదు. పైగా నెలరోజులు గడిచిపోయింది, సరిగ్గా గుర్తు కూడా లేదు. అయినా, రాయమన్నాడు కదా అని శాంత రాసిన డైరీ తెచ్చుకుని, వాటిని చదువుతూ, నేను గుర్తు తెచ్చుకుని రాస్తున్న ప్రయత్నమే ఇది.....

మావారికి కాశ్మీర్‌లో ఇన్‌స్పెక్షన్ కోసం 4 బ్రాంచ్‌లు వేశారు. మే 11, 2006 వరకూ అక్కడే ఉన్నాము. ఆయనకు శ్రీనగర్‌కి 80-90 కి.మీల దూరంలో ఉన్న అనంతనాగ్, వీర్‌నాగ్ అనే బ్రాంచ్‌లు వేశారు. మేము అక్కడి నుండి తిరిగి వచ్చేలోపు మన వాళ్ళను (ముఖ్యంగా మా అమ్మ, అత్తగారు, మామగారు), ఇంకా మరికొంత మంది శిష్యులను కూడా బదరీనాథ్, కేదార్‌నాథ్ యాత్రకు తీసుకెళ్ళాలని మేమిద్దరం అనుకున్నాము. ఎలాగో కాశ్మీర్‌లోనే ఉన్నాము కదా, ఇక్కడి ప్రదేశాలను కూడా వాళ్ళు చూస్తారని ముందుగా వాళ్ళను కాశ్మీర్‌కు రమ్మని, అక్కడినుండి 5వ రోజున బయల్దేరి, కాటా నుండి వైష్ణవి, హరిద్వార్, ఋషికేశ్‌లు చూసుకుని, తర్వాత కేదార్‌నాథ్, బదరీనాథ్‌లకు వెళ్ళి, అక్కడి నుండి మేమిద్దరం ఢిల్లీ నుండి హైదరాబాద్ వెళ్ళేలాగా, మిగిలిన వాళ్ళందరూ ఢిల్లీలోని మా స్నేహితురాలు శాంత వాళ్ళింట్లో 4, 5 రోజులుండి అక్కడ అన్నీ చూసుకుని తిరిగి హైదరాబాద్ వెళ్ళేలాగా ప్రణాళిక వేసుకున్నాము. అనుకున్నట్లుగానే, అన్నీ సక్రమంగా, ఆనందంగా జరిగాయి. ఈ యాత్రలోని కొన్ని ముఖ్యవిశేషాలు ఏమిటంటే....

మే 4న బుజ్జి, దత్తారావు, పద్మశ్రీ, భాస్కర్, హైమావతి, శాస్త్రి, శైలజలు విజయవాడ నుండి జమ్ముతావి ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరితే, వరంగల్ నుంచి అదే రైలులో మా అన్నయ్య, వదినగార్లు, ఉష అత్తయ్య, అన్నపూర్ణగారు, లక్ష్మి అక్క బయలుదేరతారు. మధ్యలో ఢిల్లీ నుంచి మే 5న శాంత వీళ్ళందరితో కలిసింది. అందరూ కలిసి (మొత్తం 13 మంది) 3 రోజులు ప్రయాణం చేసి మే 7న సాయంత్రం సుమారు గం.6.30ని॥లకు శ్రీనగర్ చేరుకున్నారు. మే 8న సీతాపతిగారు కాశీనుంచి జమ్ము వచ్చి, అక్కడినుండి శ్రీనగర్‌కు చేరుకున్నారు. మొత్తం 15 మందితో మేము ఈ యాత్ర పూర్తిచేశాము. వీళ్ళందరూ వస్తున్నారని మావారు ఆఖరి వారం

రోజులు శ్రీనగర్‌లోని బ్రాంచ్ వేయించుకున్నారు. అందువల్ల వీళ్ళకు ఉండటానికి వసతి, తిరగడానికి వాహనాలు అన్నీ చక్కగా కుదిరాయి.

మే 7 మధ్యాహ్నం భోజనం అయ్యాక మేమిద్దరం బయటకు వెళ్ళి, కొంత షాపింగ్ చేసుకుని, వచ్చేవాళ్ళకోసం దుర్గాదేవి ట్రస్ట్‌కు సంబంధించిన ఒక గెస్ట్‌హౌస్‌లో గదులు బుక్‌చేశాము. వీళ్ళందరూ గెస్ట్‌హౌస్‌కు వచ్చేసరికి సుమారు రాత్రి 7 గంటలైంది. చాలా రోజుల తర్వాత కలుసుకోవడం వలన అందరికీ పట్టరాని ఆనందం కలిగింది. వాళ్ళందరూ జమ్ము నుంచి శ్రీనగర్ చేరేలోపు (టన్నెల్‌లో ప్రయాణం) అంటే కాశ్మీర్ వ్యాలీని చూసేసరికి, మొత్తం శ్రీనగర్ అంతా చూసేసినంతగా అనందపడిపోయారు. తరువాత నేను ఒక్కదాన్నే ఇంతకాలం నుండి ఎలా ప్రయాణాలు చేస్తున్నాను, ఎలాంటి తిండి తినగలుగుతున్నాను అని అడిగారు. అదంతా విని, నన్ను చూసి మెచ్చుకున్నారో, బాధపడ్డారో తెలీదుగానీ, ఈ 3 రోజుల ప్రయాణంలో వాళ్ళకు కలిగిన అనుభవం అది. ఒక అరగంట మాట్లాడుకున్నాక, దగ్గరలో ఉన్న దాల్ లేక్ వరకు వెళ్దాం పదండి అని అందరం కలిసి అక్కడి వరకూ నడుస్తూ, అన్నీ వాళ్ళకు చూపిస్తూ, బాగా ఎంజాయ్ చేశాము. వీళ్ళ గెస్ట్‌హౌస్ పక్కనే కృష్ణా దాబా అని ఒక దాబా ఉంది. అక్కడ మంచి భోజనం దొరుకుతుంది. వీళ్ళందరికీ ఆ భోజనం బాగా నచ్చింది. వాళ్ళను గెస్ట్‌హౌస్ దగ్గర దించేసి, రాత్రి 9 గంటలు దాటాక, మేమిద్దరం మా గెస్ట్‌హౌస్ Green Acreకు వెళ్ళిపోయాం.

ఈ దుర్గానాగ్ ట్రస్ట్ వాళ్ళు యాత్రికులకు Ist come, Ist serve పద్ధతిలో 4 రోజులు మాత్రమే సౌకర్యం కల్పిస్తారు. కానీ మా ఆఫీసర్ థార్‌గారు దాంట్లో సభ్యుడు కావడంచేత, 5 రోజులకు 15మందికి సరిపడా గదులు బుక్ చేయించగలిగాము. ఆ ట్రస్ట్ వెనుకగా దుర్గాదేవి గుడి, పెద్ద శివలింగం ఉన్నాయి. అక్కడ 400 సం॥ల నాటి చినార్ వృక్షం ఒకటి ఉంది. ఆ చెట్టు పక్కనే చిన్న కోనేరు ఉంది. దాంట్లో నీరు ఎండిపోవడం అనేది ఉండదు. ఎప్పటికప్పుడు నీరు ఊరుతూనే ఉంటుంది. ఆ నీళ్ళు చాలా పవిత్రమైనవి. రూమ్‌లో ఉన్నవాళ్ళకు రోజూ పొద్దున్నే ఓకారం, లక్ష్మీ, దుర్గా అష్టోత్తరములు వినపడడంతోనే నిద్రలేవడం జరిగేది. ఈ గుడిలోనే ఒక గురువు యొక్క సమాధి ఉండటం చూశాము. ఆ గురువు పేరు రత్నానంద్ లేక రత్నేష్ అనుకుంటాను, ఆయన పేరు నా పేరుతోనే మొదలవడం మరొక విశేషం.

ఇక్కడ ఇంకొక విషయం ఏమిటంటే.... నేను ఈ మధ్య పీఠంలో అందరినీ 'ఒక యోగి ఆత్మకథ' అనే పుస్తకం చదవమన్నాను. దాన్ని చదివి, అన్ని కోణాల్లోనూ మన గురువుగారి సంభాషణలతో పోల్చి చూసుకుని, గురువులందరి మనోగతం, భాషణ ఒక్కలాగే ఉంటుందని తెలుసుకున్నారు. అంతేకాక, అందులో ఉన్న హిమాలయాల గురించి వారి మనోఫలకంపై ముద్రించుకోవడం వలన, నేను ఈ యాత్ర మొదలుపెట్టగానే మరింత ఆనందంతో ఉద్రూతలూగారు. అదీగాక, ఇదే సంవత్సరం మార్చి 3న పిన్నిగారు (బాలా త్రిపురసుందరి) సిద్ధిపొందడం, ఆమె "నన్ను తీసుకెళ్ళడానికి హిమాలయాల నుంచి యోగులు వస్తారు" అని చెప్పడం, చెప్పినట్లుగానే ఇద్దరు యోగులు వచ్చి ఆమెను తీసుకెళ్ళడం (దీని గురించి

త్రిపురసుందరిగారి మహానిర్యాణంలో విపులంగా వివరించాను) జరిగిన తర్వాత, ఆ పుస్తకాన్ని అందరూ చాలా శ్రద్ధగా చదివి, అర్థంచేసుకోవడం జరిగింది.

ఎవరో నాకు ఫోన్ చేసి (పేరు గుర్తులేదు) "ఈ ప్రయాణానికి ముందు మీరు లక్ష్మి అక్కతో "హిమాలయాలలోని యోగుల్ని, త్రిపురం పిన్నిగారిని చూపిస్తాన"ని చెప్పారట. మేము ఇంతకుముందు వెళ్ళినా, ఈసారి మీతో ప్రయాణం చేసి, అవన్నీ చూడాలని ఉంది" అన్నారు. నేను ఆశ్చర్యపోయి "నేను అలా అన్నానా? వాళ్ళందరినీ చూపిస్తానని చెప్పానా? అలా అన్నట్లు నాకు గుర్తే లేదు" అన్నాను. పైగా హిమాలయాలు చూడడం నాకూ ఇదే మొదటిసారి. నేను ఆ పుస్తకం సగం మాత్రమే చదివాను, పూర్తిగా చదవలేదు. ఆ యోగుల గురించి కూడా పూర్తిగా తెలియదు. మరి అలా ఎందుకన్నానో అర్థంకాలేదు. తరువాత ఆ సంగతి మర్చిపోయాను.

### 08.05.2006, గుల్‌మార్గ్ ప్రయాణం

ఉదయం 8.30 గంటలకు అందరం టిఫిన్లు చేసి, 2 కార్లలో గుల్‌మార్గ్ బయల్దేరి వెళ్ళాము. శ్రీనగర్‌కు నాలుగువైపులా నాలుగు ముఖ్యమైన ప్రదేశాలున్నాయి. అందులో ఒకటి గుల్‌మార్గ్. నేను వెళ్ళేటప్పుడు ఒక కార్లోనూ, వచ్చేటప్పుడు మరొక కార్లోను కూర్చుని కాశ్మీర్ విశేషాలను (ఇంతకుముందు 2సార్లు చూడడం వలన) ముచ్చటిస్తుండేదాన్ని. గుల్‌మార్గ్‌కు చేరుకునే కొద్దీ, చిన్నగా పడుతున్న నీరెండ తాలూకు కిరణాలు పడి సూర్యకాంతిలో మరింత అందంగా మెరుస్తున్న ఆ ఎత్తైన హిమాలయాలను వర్ణించడం కాళిదాసులాంటి కవులకు తప్ప, నాలాంటి సామాన్యురాలికి చేతకానిది, ఆ పర్వతాలను ఎంత వర్ణించినా తక్కువే అవుతుంది. పైగా అవి పర్వతశ్రేణుల వరుసలు. పేట్టని కోట కట్టినట్టుగా, మనుషులు పద్ధతి ప్రకారం ఒకదాని ప్రక్కన ఒకటి పేర్చినట్లుగా చుట్టూ నిలబడి ఉన్నాయి. వాటిపైన, క్రింద పొడుగ్గా, నిటారుగా, కొంచెం కూడా వంగకుండా ఉన్న ఎత్తైన ఆకుపచ్చని దేవదారు వృక్షములు. నేలపై నుండి పర్వత అంచుల వరకూ అలా నిలబడి ఎవరి కోసమో ఎదురుచూస్తున్నట్లుగా, కాశ్మీర్ యాత్రికులను ఆనందంతో స్వాగతిస్తున్నట్లుగా అనుభూతి కలిగింది.

మొదట, హిమాలయా పర్వతంపై ఉన్న snow-cap mountain పైకి దృష్టి సారించి, అలా క్రిందకు వస్తుంటే ఆకుపచ్చని దేవదారు వృక్షాల వరుసలు పర్వతం క్రిందివరకూ వరకూ విస్తరించి ఉంటాయి. అక్కడి నుంచి క్రిందికి దృష్టి సారిస్తే, ఆకుపచ్చని పూలతో గుబురుగా ఉన్న ఆవతోటలు, ఇంకా క్రిందికి వస్తే, మంచుకరిగి ఎక్కడి నుంచో పడుతున్న నీళ్ళు, రాళ్ళపైనుండి, రాళ్ళ మధ్యలో నుండి పారుతూ గలగలమని చేసే శబ్దాలు – మనం కాశ్మీర్‌ను వదిలినా, అవి మనం జీవించి ఉన్నంతవరకూ మన మనసులను వదలవనేది ముమ్మాటికీ నిజం. వాటిని చూసేందుకు పూర్వజన్మలో ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప, కళ్ళకు అంతటి యోగం కలుగదు. ఈ అందాలు కాశ్మీర్‌లో ఎక్కడికి వెళ్ళినా మనల్ని వెంటాడుతూనే ఉంటాయి. ఈ ప్రకృతి దృశ్యాల మధ్యలో ఉన్నదే కాశ్మీర్ లోయ. అందులోనే 'దాల్' సరస్సు. ఆ సరస్సు

మధ్యలో 'చార్‌చినార్' ఉంటుంది. కాశ్మీర్ మొత్తంలో మీరు ఏ మూల నుండి ఏ మూలకు వెళ్ళినా ఈ నీళ్ళ గలగలలు మన చెవులకు ఇంపైన సంగీతాన్ని వినిపిస్తూనే ఉంటాయి. తెలుపురంగు మంచు, ఆకుపచ్చని వృక్షాలు, పసుపురంగు ఆవపూలు – ఈ రంగుల కలయిక వలన ప్రకృతి యొక్క అందాన్ని వర్ణించడం చెప్పనలవి కానిది, వ్రాయ వీలులేనిది. మామూలు మనుషులమైన మనం ఇంక ఏం వ్రాయగలం? ఇది గుర్తొచ్చినప్పుడు, మనసు అక్కడికే వెళ్ళి ఆనందిస్తుంటే, ఇక పేపర్‌మీద పెన్ను ఎలా కదులుతుంది?

అలాగే సుమారు 5,000 కి.మీ.లకు పైగా ఎత్తుకి వెళ్ళాము. ఇంకా పైకి వెళ్తే అక్కడ **"గోండొలా"** అనే ప్రదేశం ఉంటుంది. అక్కడ పూర్తిగా మంచుకొండలే ఉంటాయి. అవి చూడాలంటే కేబుల్ కార్ ఎక్కాలి. ఈ కేబుల్ కార్ ప్రపంచంలోనే అతిఎత్తైన రోప్–వే. ఒక్కొక్కదానిలో నలుగురు చొప్పున ఎక్కి పైకి వెళ్ళాము. అక్కడి చలికి తట్టుకోవడం కష్టం. పైగా చాలామంది 50 సం॥లు పైబడిన వాళ్ళే. బయల్దేరేముందే కోట్లు, బూట్లు, షాల్స్, గ్లోవ్స్ అన్నీ తొడుక్కుని విచిత్ర వేషధారణలో అందరం వింతవింతగా కన్పిస్తున్నాము. ఆ చలిలో మంచుతో ఆడుకోవడం కోసం (చిన్నప్పుడు కృష్ణుడు చేసిన లీలలలాగా) మేమందరం చిన్నపిల్లలుగా మారిపోయి (ప్రకృతి ప్రభావం వలన) ఆనందంగా ఆటకు సంసిద్ధులమైనాము. కేబుల్ కార్‌లో వెళ్తుంటే శాంత, నన్ను "రత్నగారూ, ఒక్కసారి ఇక్కడ మంచువాన కురిపించండి. అది నేను అమృతవర్షం అనుకుని ఆనందపడతాను. ఎలాగైనా నా కోరిక తీర్చండి" అనడిగింది. అడగడం కాదు బలవంతం చేసింది. నేను దానికి "చాల్లేండి బాబూ! అసలే చలితో చస్తున్నాము, దానికి తోడు మంచువర్షం ఒకటా?! ఇంతకుముందు వచ్చినప్పుడు కూడా 10 ని॥లు మంచువాన కురిస్తే, కిందకు దిగడమే చాలా కష్టమైపోయింది. తట్టుకోవడం చాలా కష్టం, ఇప్పుడు కాదు" అన్నాను. "కాదమ్మా, ప్లీజ్..." అంటూ బలవంతం చేసింది. తప్పించుకోవడానికి సరే అన్నాను. కేబుల్‌కార్‌లోంచి కిందికి చూస్తుంటే ఆ ప్రకృతి అందాన్ని ఏమని వర్ణించాలి? కొండలపైన కురిసే మంచు అక్కడక్కడా కరిగి సెలయేరులాగా క్రిందకు పారుతుండడం, ఎత్తైన కొండలపైకి కారు వెళ్తున్నప్పుడు అందులోంచి దేవదారు వృక్షాల చివరి భాగాన్ని చాలా దగ్గరగా చూడడం.... తల్చుకుంటుంటే ఆ దేవదారు వృక్షాలన్నీ నాకు ఎలా కన్పించాయంటే... సింహాసనంలో కూర్చున్న మహారాజ్ఞి ముందు వశిన్యాది వాగ్దేవతలు అందరూ కలిసి లలితా సహస్రనామం చేస్తున్నప్పుడు, అమ్మవారు ఆనందపరవశంతో తన్మయత్వం చెందిందని ఎక్కడో చదివాను... అది గుర్తుకు వచ్చింది. అలా చదువుతున్న వాగ్దేవతలే ఈ దేవదారు వృక్షాలేమో అనిపించింది.

అలా వీటిని దాటుకుంటూ గొండోలా పైకి చేరుకున్నాము. కారు దిగి గేట్‌లోంచి బయటకు అడుగుపెట్టాము. అంతే. మంచువాన మొదలైంది. గుండ్రని, తెల్లని సగ్గుబియ్యం వలె మంచు వర్షంగా కురవడం మొదలైంది. ఇంక శాంత ఆనందానికి అవధులు లేవు. మొత్తానికి ఆమె కోరిక తీరింది. నిజంగానే ఆవిడ దాన్ని అమృతవర్షంగా భావించి, ఆనందాన్ని తనివితీరా అనుభవించారు. ఇంక మిగిలినవాళ్ళు కూడా అలాగే ఆనందించారంటే అతిశయోక్తి కాదు.

అందరం కలిసి కొంతదూరం కొండపైన నడిచిన తర్వాత గానీ మంచు దట్టంగా లేదు. నేను, మావారు 15 రోజుల క్రితం ఇక్కడకు వచ్చినప్పుడు, చాలా దట్టమైన మంచుతో కప్పబడి ఎక్కువ దూరం నడవలేకపోయాము. దేవదారు చెట్లు కూడా మంచులో కూరుకుపోయి ఉన్నాయి. అప్పుడు చెట్టుయొక్క పైభాగం మాత్రమే కనబడింది. ఈ కాస్త ఎండలకే చాలాభాగం కరిగిపోయి, ఇప్పుడు అంతగా మంచు లేదు. మన ఎండలకైతే ఈ మంచు కూడా బయటకు రావడానికి భయపడేదేమో! అందుకే ఆ మంచు హిమాలయాలనే ఎన్నుకుని, హాయిగా ఇక్కడే కురుస్తూ అందరికీ మనోరంజకమై ఉన్నది. "ఓ మంచూ! నువ్వెప్పుడూ ఈ హిమాలయాల మీదే కురుస్తూ, ఈ నేల నింగీ ఉన్నంతవరకూ ఆ పర్వత శిఖరాగ్రాలనే అంటిపెట్టుకుని, వాటి అందాల్ని మరింత పెంచుతూ, వచ్చిన వారందరి మనసుల్ని ఆహ్లాదపరుచు తల్లీ! ఓ హిమపుత్రీ! పార్వతీ! త్రిపురసుందరీ" అని ప్రార్థించాలనిపిస్తోంది.

ఆ మంచువానలో తడుస్తూ సుమారు ఒకటిన్నర కి.మీ.ల పైగా నడుస్తూ కొండపైకి చేరాము. అందరం చిన్నపిల్లలమైపోయి ఆనందంతో కేరింతలు కొడుతూ, అందాల్ని తనివితీరా చూస్తూ, చలికి వణుకుతూ, అటుఇటు తడబడుతూ, అందరం ఒకచోటే ఉండాలనే ఉద్దేశ్యంతో హడావిడి పడిపోయాము. నేను మరికొంత మందితో ఇంకొంచెం దూరం నడిచి పైవరకూ వెళ్ళాను. మా వదినగారు, బుజ్జి, దత్తారావు ఇంకొందరు స్లెడ్జ్ ఎక్కారు. స్లెడ్జ్ అంటే చెక్కతో చేసిన ఒక పీటలాగా ఉంటుంది. దాన్ని పెద్ద త్రాడుతో లాగుతారు. నడవలేని వాళ్ళు అవి ఎక్కుతారు. శాస్త్రి, క్రింద నుండి పైకి ఎక్కేటప్పుడు, మంచులో క్రిందికి జారిపోకుండా ఉండేలాగా ప్రయత్నం చేస్తున్నప్పుడు 'చిన్నికృష్ణుని' అవతారంలో (అంటే చిన్నప్పుడు కృష్ణుడు పాకుతున్నప్పటిలాగా) ఒక నిమిషం అలాగే ఉండిపోయాడు. అది చూసిన మేమందరం శాస్త్రిని బాలకృష్ణ అవతారం ఎత్తాడు అని నవ్వుకున్నాము. మా వదినగారు ఎర్రటి కోట్, బూట్లు, గ్లోవ్స్ అన్నీ ధరించి నిదానంగా నడుస్తుంటే, ఆవిడని గుర్తుపట్టడం కష్టమైంది. అది చూసి ఆవిడను సిండ్రెల్లాలాగా ఉన్నారని అనుకున్నాము. ఇలా అందరినీ ఆ ప్రకృతి చిన్నపిల్లల మాదిరిగా మార్చేసిందంటే నమ్మశక్యంగా లేదు.

ప్రకృతికి అంత శక్తి ఉందని అనుభవించాక తెలుసుకున్నాము. కాసేపు అలా ఆడుకుని అందరం క్రిందికి వచ్చి ఒక టీస్టాల్‌లో టీ తాగాము. ఆ హోటల్‌వాడు ఒక రేకుడబ్బాలో నిప్పులు పోసి ఉంచాడు. అందరం గ్లోవ్స్ తీసి చేతుల్ని వేడి చేసుకుని, వెనక్కి బయల్దేరాము. మళ్ళీ కేబుల్ కార్ ఎక్కి ప్రకృతిని ఆస్వాదిస్తూ, క్రిందికి దిగి, మేము వేసుకున్న డ్రెస్‌లను వాళ్ళకు అప్పగించేసి, రాత్రికి గెస్ట్‌హౌస్‌కు చేరి గుల్‌మార్గ్ ప్రయాణం పూర్తిచేసుకున్నాము. రూమ్‌లోకి చేరి, సేద తీరగానే జరిగినవన్నీ తలుచుకుని మళ్ళీ ఒకసారి ఆనందానుభూతుల్ని పొందాము. రోజూ రాత్రి 9 గంటలకు పక్కనే ఉన్న కృష్ణాదాబాలో భోజనం చేసి రూమ్‌కి వెళ్ళడం, మర్నాడు పొద్దున్నే 8 గంటలకు టిఫిన్ చేసి రోడ్డుమీద మాకోసం సిద్ధంగా ఉండడం, మేము వీళ్ళ దగ్గరకువచ్చి అందరం కలిసి ప్రయాణం చేయడం – శ్రీనగర్‌లో ఇదీ మా దినచర్య.

**09.05.2006, పెహల్‌గావ్ ప్రయాణం**

ఉదయాన్నే 9 గంటలకు అందరం కలిసి 2 వాహనాల్లో (ఒక సుమో, ఒక క్వాలిస్) పెహల్‌గావ్‌కు బయల్దేరాము. ఇది శ్రీనగర్‌కు మరొకవైపు ఉంటుంది. సీతాపతిగారు 8వ తేదీ రాత్రి ఇక్కడకు రావడం, ఉదయమే ఆయనకు కొంత ఆరోగ్యం సహకరించక పోవడం వలన రాలేనన్నారు. "ఫర్వాలేదు, ఏమీ కాదు. బయల్దేరండి" అని బలవంతంగా కారులో ఎక్కించాము. ఆరోజు మాతోపాటు మావారు కూడా వచ్చారు. కొంతసేపు ఒక కార్లో, మరికొంతసేపు మరో కార్లో గడుపుతూ ప్రయాణం చేశాము. ఈరోజు మావారు రావడం వలన మగవాళ్ళందరినీ ఒక కార్లో, ఆడవాళ్ళందరినీ ఒక కార్లో ఎక్కించడం వలన అందరికీ ఎంత సంతోషమో చెప్పలేను. ఎన్ని రకాల కబుర్లో – వంటల దగ్గర నుండి ఆధ్యాత్మిక విషయాల వరకూ ఒకే మాటల పరంపర. మధ్యమధ్యలో ప్రకృతిని చూస్తూ పరవశిస్తుండడం. పెహల్‌గావ్‌కు వెళ్ళే దారి పొడవునా సెలయేళ్ళు, చుట్టూ ఎత్తైన మంచుకొండలు. దారంతా గుండ్రటి పెద్దపెద్ద రాళ్ళ మధ్యలో నుండి పారుతున్న నీళ్ళ గలగలమనే శబ్దంతో చెవులు నిండిపోయాయి. సహజసుందరమైన ఆ ప్రకృతిని చూస్తుంటే మనకే మతిపోతుంటే, ఇక యోగులు, ఋషులు, దేవతల మాటేమిటి? అందుకే వారందరూ ఈ హిమాలయాలని ఎంచుకున్నారేమో! ఇక్కడ ఉంటే మనోనిశ్చలత చాలా తొందరగా వస్తుంది. ఇక్కడికి వస్తే మాలాంటి వాళ్ళకి ఇల్లు, సంసారం గుర్తుకురావు. యోగులకు ఇలాంటివి ఉండవు కదా! మనసుకు స్థిరత్వం చాలా సులువుగా దొరుకుతుంది ఇక్కడ. అందుకే మహానుభావులందరూ ఇక్కడకు వచ్చి తపస్సు చేసుకుని, దేవతలయ్యారు. అందుకే వీటిని **దేవభూములు** అన్నారేమోనని అనిపించింది.

పెహల్‌గావ్ చేరాము. అక్కడ ఒక పెద్ద తోటలాగా ఉంది. కొంచెం దూరం నడిచాక కొండల మధ్యలో పెద్దపెద్ద రాళ్ళగుండా పారుతున్న నీరు ఒక సరస్సులాగా గోచరించింది. ఈ సరస్సులో దేవతలు స్నానమాచరించడానికి వస్తే, చుట్టూ కాపలదారులవలె హిమాలయ పర్వతాలు ఎత్తుగా నిలబడినట్టు ఉంది. ఆ నీళ్ళలో కాళ్ళుపెడితే ఆ చలికి వేళ్ళు కొంకర్లు పోయాయి. ఒక్క సెకను కూడా నీళ్ళలో నిలబడడం కష్టం. ఆ రాళ్ళపైకి ఎక్కుతూ, నీళ్ళల్లో దిగుతూ చిన్నపిల్లల్లాగా ఆనందంతో అందరం కలిసి చాలా ఫొటోలు తీయించుకున్నాము. ఆ నీటిఒడ్డున కూర్చుని ప్రకృతిని చూస్తుంటే చాలాసేపటి వరకు మనల్ని మనమే మరచిపోతాము. ఈలోపుగా అక్కడకు కాశ్మీర్ చీరలు, షాల్స్, సూట్స్ అమ్మేవాళ్ళు, కాశ్మీర్ డ్రెస్‌లతో ఫొటోలు తీయించుకోమనేవాళ్ళు చాలామంది మాచుట్టూ గుమిగూడిపోయారు. గుర్రాలమీద ఎక్కించుకెళ్తామని గుర్రాలవాళ్ళు వెంటపడ్డారు.

విడివిడిగా అందరం కాశ్మీర్ డ్రెస్‌లు వేసుకుని, నగలు పెట్టుకుని రకరకాల ఫోజులతో ఫొటోలు తీయించుకున్నాము. ఈ నీళ్ళపైన ఒక వంతెన ఉంటే, అక్కడ నిలబడి కొన్ని ఫొటోలు తీసుకున్నాము. సాధారణంగా అన్ని సినిమాల్లోనూ ఆ ప్రదేశం, వంతెన కనబడుతుంటుంది. పెహల్‌గావ్ చాలా చాలా అందమైన ప్రదేశం. శాస్త్రికి ఈ స్థలం బాగా నచ్చి, "అక్కా! నాకు

ఇక్కడే ఈ గడ్డిమీద ఇలాగే పడుకుని, ఆనందించాలని ఉంది. ఇంకేమీ చూడక్కర్లేదు అనిపిస్తోంది" అంటూ చాలాసేపు ఆ గడ్డిమీద పడుకున్నాడు. మేమందరం తిరిగి కారు ఎక్కుదామని బయల్దేరుతుండగా, ఇద్దరు కాలేజి ఆడపిల్లలు, ఒకే రంగు బట్టలు ధరించి కన్పించారు. వాళ్ళు ఎంత అందంగా ఉన్నారో చెప్పలేను. ఆ పిల్లలతో కలిసి అందరం ఫొటోలు, వీడియోలు తీయించుకున్నాము.

మధ్యలో షాపింగ్ చేశాము. అందరం కాశ్మీర్ సిల్క్ చీరలు, బెడ్‌షీట్లు అన్నీ కొనుకున్నాము. మా షాపింగ్ ఖర్చు సుమారు రూ.30వేలు. అది చాలా మంచి షాపింగ్ అయింది మాకు. తిరిగి రాత్రికి ఇంటికి చేరుకున్నాము. రూమ్‌కు చేరగానే కొన్నవన్నీ విప్పి, ఫొటోలు చూసి తెగ ఆనందపడిపోయాము. మరునాడు ఉదయమే సీతాపతిగారు 8 గంటల విమానంలో హైదరాబాద్ వెళ్ళిపోయారు. తర్వాత ప్రయాణమంతా మేమందరం కలిసి చేశాము.

**10.05.2006, సోన్‌మార్గ్ ప్రయాణం**

ఇది శ్రీనగర్‌కు మరోదిక్కులో ఉంటుంది (లేహ్ వెళ్ళేదారి). అందరం ఉదయం 9 గంటలకు బయల్దేరాము. మంచుపైకి వెళ్ళి ఆడుకోవడానికి అందరూ చాలా హుషారుగా ఉన్నారు. దారంతా హిమాలయాల నుండి కరుగుతున్న మంచు ఎంతో వేగంగా క్రిందకు రాళ్ళ మధ్యలో నుండి ప్రవహించడం, ఆ శబ్దం హోరు కూడా అంత పెద్దదిగానూ ఉండడం, మంచు రోడ్డుమీద కూడా సగం కరిగి, సగం కరగక పోవడం చూశాము. ఎక్కడ చూసినా కొండలపైన చాలా మంచు ఉండడం గమనించాము. ఒకచోట దిగి, 2 కి.మీలు నడిచి, పైకి ఎక్కితే తప్ప మంచు కనపడదు. 15 రోజుల క్రితం మేము వెళ్ళినప్పుడు చాలా మంచు ఉంది. అప్పుడు మాకు ఎక్కడం కూడా కష్టమైపోయింది. ఈసారి మంచు చాలావరకు కరిగిపోయింది. అలాగే కబుర్లు చెప్పుకుంటూ, నడుస్తూ పైకి ఎక్కాము. సోన్‌మార్గ్ చాలా ఎత్తులో ఉంటుంది. అక్కడినుండి అమర్‌నాథ్ యాత్రకు ఒక మార్గం ఉంది. అక్కడినుండి 'లేహ్' వెళ్ళడానికి బస్సులు ఉంటాయి. ఆ మార్గంలో మంచు కరిగిన తర్వాతే బస్సులు వెళ్తాయి. దానికి ఒక సమయం ఉంటుంది. మళ్ళీ అందరం బూట్లు, కోట్లు ధరించి 2 కి.మీలు పైకి నడిచి మంచుమీద కాసేపు ఆడుకుని, ఫొటోలు తీయించుకున్నాము. భాస్కర్, పప్పి, బుజ్జి, దత్తారావులాంటి వాళ్ళు ఇంకా చాలావరకు పైకి ఎక్కివచ్చారు. దాంతో అందరూ 'పర్వతారోహకులు'గా తయారయ్యారు. అంత ఎత్తు మీద నుంచి చుట్టూ ఉన్న పర్వతాల వరుసలను చూస్తూ, కాళిదాసు హిమాలయాలను వర్ణించిన తీరును శాస్త్రి చెప్తుంటే వింటూ వేగంగా క్రిందికి దిగిపోయాము. మధ్యాహ్నం భోజనం చేసి తిరుగు ప్రయాణంలో కీర్‌భవానీ గుడికి చేరుకున్నాము.

సుందరమైన చీనార్ వక్షాలు, మరెన్నో తెలియని వృక్షాల మధ్య ఈ భవానీ గుడి ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. అందరం లలితా సహస్రనామ పారాయణ చేసుకుంటూ గుడిలోకి అడుగుపెట్టాము. చిన్నకొలను మధ్యలో అమ్మవారు ప్రతిష్ఠించబడి ఉంటుంది. నీళ్ళ మధ్యలో

ఉంటుంది ఆ చిన్నగుడి. అమ్మవారు, ప్రక్కనే శివలింగం, ముందు రెండు సింహాలు కాపలాకాస్తున్నట్లుగా ఉంటాయి. ఆ గుడిపూజారి గుడి తాలుకు స్థలపురాణాన్ని వివరించారు.

భక్తులు పూలు, పసుపు, కుంకుమ, పాలు అన్నీ ఆ నీళ్ళలోనే వేస్తూ అమ్మవారికి పూజ చేస్తారు. మేము కూడా అలాగే చేసి, కొంచెంసేపు అక్కడ కూర్చుని ధ్యానం చేసుకున్నాము. గుడిపూజారి "ఆమె రాజరాజేశ్వరి స్వరూపం. ఇక్కడ కీర్ నైవేద్యం ఆమెకు తప్పనిసరిగా పెడతారు. దేవతలు, సీతాదేవి కూడా ఆ గుడికి వచ్చి తల్లిని దర్శించేది. ఈ గుడి త్రేతాయుగం కంటే ముందునుంచి ఉన్నది. ఈమె శ్రీనగర్‌లోని పండితుల ఆరాధ్యదేవత. శ్రీనగర్‌లోని పరిస్థితులకు అనుగుణంగా ఈ కొలనులో నీళ్ళు రంగు మారతాయి. ఎరుపు రంగైతే గొడవలుంటాయని, నలుపురంగైతే ఒకటి, బూడిద రంగైతే మరొకటి జరుగుతుందని" చెప్పారు. నేను మొదటిసారి 15 రోజుల క్రితం వెళ్ళినప్పుడు నీరు బూడిదరంగులో ఉంది. రెండవసారి వెళ్ళినప్పుడు మరొకరంగులో (రంగు గుర్తులేదు) కనబడింది. ఆ నీటిపైన, భక్తులచేత పూజింపబడ్డ పూలన్నీ ఒక ప్రక్కకు చేరి ఓం ఆకారంగా తయారై, అమ్మవారు మాకు ఆ కొలనులో ఓంకారరూపంగా దర్శనమిచ్చింది. ఇక్కడ మరొక విశేషమేమిటంటే, మన ఏలూరు పీఠంలో కూడా అమ్మవారు 3వ తరంలో 'రాజరాజేశ్వరి' అవతారంలో ఉంటుందని, ఆమె కూడా నీళ్ళలోనే ఉంటుందని, పీఠం క్రింద నీళ్ళు ఉన్నాయని శ్రీ కమలమ్మగారు మనకు ఎప్పుడో చెప్పారు. ఆమె సిద్ధిపొందిన ఎన్నో ఏళ్ళ తర్వాత ఆ పీఠాన్ని పునర్నిర్మించినప్పుడు సరిగ్గా అదే పీఠం క్రింద పిల్లర్ వేస్తే ఒక అడుగు లోతులోనే పెద్ద ఫౌంటేన్‌లాగా నీళ్ళు పైకి ఉబికాయి. ఆ నీళ్ళను భద్రపరచడం కూడా జరిగింది. చాలా సం॥లు వాటిని తీర్థంలా కూడా ఇచ్చారు. ఆమె ఈ విషయాన్ని అప్పుడు, అలా తెలియజేశారు. సరిగ్గా ఈ కీర్‌భవానీ గుడి కూడా సరిగ్గా, అలాగే మన పీఠాన్ని పోలి ఉండడం, ఈ హిమాలయ పర్వతంపైన వెలసి ఉన్న ఈ పీఠాన్ని చూడగానే నాకు ఈమె ఇక్కడి నుడి కదిలి, మనకోసం మన హేలాపురికి వేంచేసిందేమో అన్న భావన కలిగింది. అమ్మమ్మగారు ప్రస్తుతం ఈ హిమాలయా ప్రాంతంలో ఉంటున్న దేవత కనుక, మనల్ని ఇక్కడకు పిలిచి "నేను ఇక్కడే ఉన్నాను సుమా! అదే ఇది. నేనే కొన్నాళ్ళు అక్కడ ఉండి మళ్ళీ ఇక్కడకు వచ్చాను. నేను ఉన్న చోటే మీరు పీఠస్థానాన్ని కూడా దర్శించాలి కనుక మిమ్మల్ని ఇక్కడకు పిలిచాను" అని చెప్పినట్లుగా అన్పించింది నాకు.

ఏలూరు పీఠంలో కూడా ఇలాగే నీళ్ళు క్రింద ఉండడం, పైన మందిరంలో పీఠప్రతిష్ట చేయడంతోపాటు, మాకు దర్శనమిచ్చిన ఓంకారమే (శివస్వరూపం) ఇక్కడ దేవి ప్రక్కన ఉండడం – మనకు ఏలూరులో అమ్మమ్మగారు ఉన్నప్పుడే 'ఓం నమశ్శివాయః' అనే బీజాక్షరమును రాయించబడిన ఒక రక్షరేకును పీఠంలో ప్రతిష్టించడం, అది ఈరోజువరకూ ఉండడం కూడా ఎంతో విశేషం. అంటే శివప్రతిష్టతో కూడిన ఈ పీఠములు రెండూ ఒకేలాగా ఉండడం, మాకు కన్పించిన ఓంకారం కూడా అమ్మవారి క్రింద నీళ్ళలో దర్శనం కావడం కూడా ఒక సారూప్యం. అంతేకాదు, ఆ గుడియొక్క స్థలపురాణంలో ఒక భక్తుడికి ఈమె కన్పించి,"ఒక సర్పము తిరుగుతూ

ఎక్కడ ఆగుతుందో, అక్కడ దానిక్రింద నేను ఉంటాను" అని రాజరాజేశ్వరి చెప్తుంది. అందుకే ఈ కొలను కూడా సర్పంలాగా వంపుతిరిగి ఉంటుంది.

ఇక్కడ, మన పీఠంలో కూడా అమ్మమ్మగారి గురువులైన బాలాజీగారు కూడా సర్పస్వరూపులు. మద్రాసులోని తిరువత్తియూరు (బాలాత్రిపురసుందరి మూలస్థానం)లో కూడా ఒక పెద్ద నాగుపాము గుడిచుట్టూ తిరుగుతూ, అందరికీ కనిపించేది. కానీ ఎవర్నీ ఏమీ చేసేది కాదు. ఈ విషయం అమ్మమ్మగారికి తెలుసు. అందుచేత పరమగురువులైన బాలాజీగారి చరిత్ర ఈ గుడి విశేషంతో కలవడం కూడా ఒక సారూప్యము.

అమ్మవారి దర్శనమయ్యాక అందరికీ అక్కడ కీర్ (అన్నంతో చేసిన పాయసం) ప్రసాదంగా ఇచ్చారు. గుడిలోనుండి వస్తుంటే ఆవరణలో ఒక చిన్నపిల్ల సుమారు 8, 9 సం॥లు ఉంటాయి, ఎంతో ముద్దుగా, ఆకర్షణీయంగా, తేజస్సుతో ఉంది. నావైపుకు వస్తుంటే "నీ పేరేమిటి?" అని అడిగాను. "నా పేరు ఐశ్వర్య" అన్నది. "ఏ ఊరినుంచి వచ్చావు?" అన్నాను. "ఉజ్జయిని" అన్నది. ''మహంకాళివన్నమాట'' అన్నాను. అందరం ఆ పిల్లతో ఫొటోలు, వీడియో తీయించుకున్నాము. దీన్నిబట్టి చూస్తే, మొన్నటి వరకు పీఠనిర్వహణ చేసిన మా గురువులైన శ్రీబాలాత్రిపురసుందరిగారు కూడా కాళీ అంశతో జన్మించారని మనకు తెలుసు కదా! ఐశ్వర్య అనే పేరంటే ఆమెకు చాలా ఇష్టం. ఆమె భక్తులకు చాలామందికి ఆ పేరు పెట్టడం జరిగింది. ఇవన్నీ ఒకేసారి తల్చుకుని రాస్తున్నప్పుడు నాకు ఇలా అర్థమౌతోంది... జరిగినది ఏమిటి? దాని విశేషమేమిటి? అని విశ్లేషణ చేసుకుంటే ఆ కథలోనూ, ఈ కథలోనూ విశేషములు ఒకేలాగ ఉన్నాయి, చరిత్రలు ఒకటే. దీన్నిబట్టి మనకు అర్థమైనది ఏమిటంటే.....

గురువులు, పరమగురువులు కూడా గురుస్థానములపైన పవిత్ర పీఠములలోను లేక ఆలయములలోను ఉండి, ఆయా పీఠాధిష్టాన దేవతాస్వరూపములను నిరంతరం ధ్యానిస్తూ, పూజిస్తూ అక్కడే ఉంటారు. సాధకులైనవారు లేక గురుఅనుగ్రహమునకు పాత్రులైన వారు మాత్రమే ఆ స్థానమునకు వెళ్ళడం, వారిని దర్శించడం జరుగుతుంది. అక్కడి విశేషములను తెలుసుకునే జ్ఞానం కలగడం ఆ అధిష్టానదేవత అనుగ్రహం తప్ప మరొకటి కాదు. లేకపోతే, పరమగురువులైన బాలాజీగారి స్వరూపం, మొన్నటివరకూ సజీవంగా ఉన్న త్రిపురసుందరిగారి స్వరూప దర్శనం, ఓం నమశ్శివాయ అనే రక్షరేకు అక్కడ, ఇక్కడ శివలింగ ప్రతిష్ట, నీళ్ళలో ఓంకార దర్శనం, అక్కడా ఇక్కడా కూడా రాజరాజేశ్వరియే అధిష్టానదేవత కావడం, ఇద్దరూ నీళ్ళపైనే వెలసి ఉండడం, అది హేలాపురి అయితే; ఇది శ్రీనగర్, హిమాలయాలు. ఇలా నూటికి నూరుశాతం సారూప్యత కలిగిఉంది. "అదే ఇది. అక్కడ, ఇక్కడా ఉన్నది ఒకటే. అది చూపించడానికి ప్రస్తుతం నేనున్న స్థానానికి పిలిపించి, ఇక్కడ కూడా దాన్నే చూపించి, మీకు ఈ విషయం అర్థమయ్యేలాగా అనుగ్రహించాను కాబట్టి ఈ విషయాల్ని మీరు గ్రహించగలిగారు" అని చెప్పినట్టుగా నాకు అర్థమైంది. మనం ఎప్పుడు ఏమిచూడాలో, ఆ స్థానానికి ఆమె వస్తేతప్ప విషయం అర్థం

కావింపబడవు కదా! అందుకే ఆమె స్మృత్యై నమః, మేధాయై నమః అనే నామములతో కొలవబడుతోంది. ఆ సమయంలో మనకు గుర్తురావాలంటే అదీ ఆమె అనుగ్రహమే. మేధస్సు సమయానికి పనిచేయాలంటే, అక్కడ ఆమె ఉంటే తప్ప మనకు తెలుసుకోగలిగే జ్ఞానం రాదు.

దీన్నిబట్టి చూస్తే, మనందరినీ ఆవిడ కాశ్మీర్‌కు పిలిపించి, రాజరాజేశ్వరి దర్శనభాగ్యాన్ని అనుగ్రహించారని అర్థమౌతోంది. ఇది మూడవతరంలోని అధిష్టానదేవతా దర్శనము. చుట్టూ సేవిస్తున్న పరివార దేవతాగణము (పరమగురువులు). అలాగే మేము కాశ్మీర్‌లో మూడు మందిరములను చూశాము. తర్వాత వెళ్ళిన సారికా గుడిలో (ఇది శ్రీనగర్‌కోటను ఆనుకుని ఉంటుంది) లలితాశ్రీచక్ర దర్శనం, అలాగే మా కోరికపై కొందరి యోగుల దర్శనం, శంకరాచార్య గుడిలో త్రిపురసుందరీ దర్శనం చేయించారు. ముగ్గురి దేవతాదర్శనాల అయ్యాయి. మాతో వచ్చిన వాళ్ళల్లో 3 తరాల గురువులను చూసినవాళ్ళున్నారు. అందువలన ముగ్గురి దర్శనాలను గురువులైన కమలమ్మగారు అనుగ్రహింప చేశారు. మా జీవితాలను ధన్యం చేసేందుకు ఆమె చేయూతనిస్తున్నారు. కానీ, మేమెంత వరకూ సాధన చేస్తున్నామో తెలియదు. కనీస జ్ఞానాన్ని సమయానుకూలగా ప్రసాదించి, విషయాన్ని అవగాహన గావించి, సాధనలో మమ్మల్ని కృతార్థులను చేయి తల్లీ ఇదే నా పాదాభివందనం.

**మార్చి 2, 2007, శుక్రవారం**

సాయంత్రం 6 గంటల సమయంలో బాల్కనీలో కూర్చుని, గోరువెచ్చని నీళ్ళు త్రాగుతూ కమలాంబికా భక్తిమంజరి పాటలు వింటున్నాను. ఆ భావంతో మనసు లయమవటం మొదలైంది. నాకు తెలియకుండానే కళ్ళవెంబడి నీళ్ళు. చెప్పలేని ఉద్వేగం, ఆనందం, దుఃఖం అన్నీకలిసి నీళ్ళరూపంలో బయటకు వస్తున్నాయి. ఉద్వేగంతో వెక్కిళ్ళు మొదలయ్యాయి. మనసులో "ఇంత ఆనందమైన, అద్భుతమైన జీవితాన్ని ప్రసాదించిన నీకు నేనేమి ఇవ్వగలను?" అనే భావన స్థిరంగా ఉండిపోయింది. నేనేమీ ఆమెకు ఇవ్వలేదనే బాధకంటే, నాకు ఆమె ఎంతో ఇచ్చిందనే ఒక భావన. దానిని కృతజ్ఞత అనాలో, భక్తి అనాలో నాకేమీ తెలియటం లేదు. త్రిపురం పిన్ని జీవితమంతా త్యాగం చేసింది. ఏ సుఖాన్ని ఆశించి చేసిందో తెలియదు కానీ అమ్మమ్మను (ఆర్థికంగా) పోషించింది. అలాంటి సేవచేసుకునే అదృష్టం ఆమెకు దక్కింది. మరి నేను? అని ఆలోచిస్తే దిక్కుతోచడం లేదు. మళ్ళీ తెలియని ఉద్వేగం.

కొత్తఇంట్లో పాలు పొంగించడానికి ఉదయం కారులో ఉమారాణిగారితో వెళ్తూ మనసులో "ఏమైనా నువ్వు ఈరోజు నీ పాతరూపంలో (కమలమ్మలాగా) ప్రత్యక్షంగా అదే ఆకారంలో ఎవరిలాగానైనా సరే కన్పించాలి" అని గట్టిగా అనుకున్నాను. ఇంటికి వెళ్ళాక బుజ్జివాళ్ళ అక్క, అత్తగారు వచ్చారు. వాళ్ళకు నా చీరలు ఇచ్చాను. ఆవిడ తనకు 10 రోజుల క్రితమే ఎవరో తెలీని వ్యక్తి వారిద్దరికీ చీరలు పెట్టినట్లు కలవచ్చిందని చెప్పి, నావద్దనుండి చీరలు తీసుకుంటూ చాలా సంతోషపడ్డారు. ఈమె కొంచెం అమ్మమ్మలాగా ఉందా అని అనిపించింది. కానీ సరిగ్గా

పోలికలు లేవు అని కూడా అనుకున్నాను. ఆవిడ ఆకుపచ్చ రంగు, ఎర్ర బోర్డర్‌గల కంచిపట్టుచీర కట్టుకుంది. వాళ్ళు వెళ్ళాక మళ్ళీ పాటలు వినడం ప్రారంభించాను. ఈరోజు రాత్రిలోపు నేను ఎలాగైనా అమ్మమ్మను చూస్తాననే ధైర్యం నాకు వచ్చింది. ఆ పాటలు వింటూ నేను పరవశిస్తూ (ధ్యానం అనాలో, తపనలో అనాలో తెలియదు) అలాగే ఆకాశంలోకి చూస్తూ ఉండిపోయాను. ఒక అరగంట తర్వాత ఆకాశం అంతా వెలుతురుగా, మబ్బులతో కూడి బూడిదరంగులో ఉంది. మిరుమిట్లు గొలుపుతూ ఒక నక్షత్రం నా కళ్ళముందు తిరుగుతున్నది. నా కనుచూపుమేరలో అది ఒక్కటే ఉన్నది. ఇంకేదీ కనిపించడం లేదు. అది ఎంతో వేగంగా నా ముందు కదులుతూ, తళుక్కుమని మెరుస్తోంది. దాన్ని చూడగానే నాకు అది నక్షత్రంలాగా అనిపించలేదు. ఏలూర్లో (1996-97లో) నేను ధ్యానంలో ఉండి విశ్వదర్శనం చేసినప్పుడు ఒక మెరుపును ఎలా చూశానో 'అదే ఇది' అని వెంటనే గ్రహించాను. ఆ స్థితిలో నాకేమీ బోధపడలేదు. అదిగో! అమ్మమ్మ కదిలి వెళ్ళిపోతోందని మనసులో ఎక్కడో ఒక భావం. క్షణంలోనే మాయమవుతుందనే భయం, ఆందోళన, తొందర. నిరాకార నిరామయమైన కమలమ్మగారు ఒక్క క్షణంలో నా కళ్ళముందు నుండి మాయమౌతారని, మళ్ళీ కనిపించరేమోననే భయం, ఆదుర్దా. ఏం చేయను? ఎవరూ లేరు. ఈ వింతను అందరికీ చూపించడం ఎలా? క్షణంలో ఎంతమందికి చెప్పను? అర్థంకావడం లేదు. వెంటనే హాల్లోకి పరుగెత్తి రాజ్యానికి ఫోన్ చేసి "వెంటనే మేడమీదకు వెళ్ళి ఆ నక్షత్రాన్ని చూసిరమ్మని" చెప్పాను. అది వెంటనే "ఒక నెలవంక కూడా చారలాగా ఉంది. దాని పక్కనే ఒక కాంతిపుంజంలాగా మెరుస్తోంది. అది ఒక్కటే ఆకాశం మొత్తం ఉన్నది" అని చెప్పింది. నాకింక ఏమీ విన్పించడం లేదు. వెంటనే వేరే నెంబర్‌కి ఫోన్ చేస్తే, రాంగ్‌నెంబర్ అని పెట్టేశారు. ఈలోపు నేను మళ్ళీ ఆకాశంలోకి చూస్తే, చాలా నక్షత్రాలు (సుమారు 10-15) మునుపటి మెరుపులాగా కదులుతూ, మెరుస్తూ నిశ్చలంగా కనిపించాయి. దాంతో నా ఉద్వేగం తగ్గింది. వెంటనే పెన్ను, పేపరు తీసుకున్నాను. ఇది కమలమ్మగారి నిరాకార ప్రత్యక్ష దర్శనం. సమాధిస్థితిలోని దర్శనమే ఇలా ప్రత్యక్షంగా చూడటం జరిగింది.